# *Mahaabhaarata kathaa sambandhi navalalu - savimarsaka pariselana*

***(Themes of Mahabharata in Telugu Novels: A critical Study)***


**Researcher**

**Jada Seethapathi Rao**

**Supervisor**

**Prof. Bethavolu Ramabrahmam**


**A dissertation submitted in partial fulfillment of the requirements for the award of The Degree of DOCTOR OF PHILOSOPHY.**


**Department of Telugu, School of Humanities.**
**University Of Hyderabad, 2010.**

# మహాభారత కథా సంబంధి నవలలు సవిమర్శక పరిశీలన

పరిశోధన
జాడ సీతాపతి రావు,

పర్యవేక్షకులు
ఆచార్య బేతవోలు రామబ్రహ్మం

తెలుగులో
పిహెచ్.డి., పట్టాకోసం
హైదరాబాదు విశ్వవిద్యాలయం తెలుగు శాఖ,
మానవీయశాస్త్రాలవిభాగానికి
సమర్పిస్తున్న సిద్ధాంత గ్రంథం. **2010**

**Department of Telugu**
**School of Humanities**

**UNIVERSITY OF HYDERABAD**

---

# DECLARATION

**I hereby declare that the work embodied in this thesis entitled *"Mahabharata kathaa sambanadi navalalu- savimarsaka pariselana"* *(Themes of Mahabharata in Telugu Novels: A critical Study)* has been carried out by me under the supervision of Prof. Bethavolu Ramabrahmam is original and that the thesis or a part of it has not been submitted for a Degree in any other University or Institute.**

**HYDERABAD** **(J. SEETHAPATHI RAO)**

**Roll. No. 07HTPH11.**

**Date:**

**Department of Telugu**
**School of Humanities**

**UNIVERSITY OF HYDERABAD**

---

# CERTIFICATE

This is to certify that the thesis entitled “Mahabharata kathaa sambhanadi navalalu-savimarsaka pariselana” (Themes of Mahabharata in Telugu Novels: A Critical Study) submitted by J. Seethapathi Rao, for the award of the Degree of Doctor of Philosophy is Original and the work has been carried out under my supervision. This work has not been submitted for any Degree or diploma to any other University or Institute.

HYDERABAD

Date:

Prof. BETHAVOLU RAMABRAHAM
**(Head & Research Supervisor**)
(Department of Telugu)

DEAN
(School of Humanities)

# కృతజ్ఞతలు

పరిశోధనకు అవకాశం ఇచ్చి, ఆదరణతో ప్రోత్సహించిన గురువులు ఆచార్య బేతవోలు రామబ్రహ్మంగారికి ప్రత్యేక నమస్సులు. పరిశోధన రుచిని చూపిన నా ఎం.ఫిల్., పర్యవేక్షకులు ఆచార్య ఎండ్లూరి సుధాకర రావుగారికి నమస్సులు. తెలుగుశాఖలో గురువులు ఆచార్య పరిమి రామ నరసింహంగారికి, పరిశోధనలో ప్రోత్సహించిన ఆచార్య యస్. శరత్ జ్యోత్స్నారాణి గారికి, పుస్తక సహకారంతో పాటు పరిశోధనలో కొన్ని సూచనలిస్తూ ప్రోత్సహించిన ఆచార్య గడ్ల అరుణ కుమారి గారికి,

డాక్టోరల్ కమిటీ సభ్యులు, నన్ను ఎల్లప్పుడూ ప్రోత్సహించే గురువులు ఆచార్య కోరాడ సుబ్రహ్మణ్యం గారికి, డా. రేమెళ్ళ వేంకటరామకృష్ణశాస్త్రిగారికి ప్రత్యేక నమస్సులు. తెలుగుశాఖలో అధ్యాపకులు ఆచార్య నడుపల్లి శ్రీరామరాజుగారికి, ఆచార్య తుమ్మల రామకృష్ణ గారికి,

సాంకేతికంగా సహకారాన్ని అందిస్తూ, సూచనలందిస్తూ, మిత్రులుగా ప్రోత్సహించిన డా. దార్ల వెంకటేశ్వర రావు గారికి, డా. పమ్మి పవన్ కుమార్ గారికి, డా. డి. విజయలక్ష్మి గారికి, డా. పి. రాములు గారికి, డా. బి. భుజంగ రెడ్డిగారికి, డా. అద్దంకి శ్రీనివాస్ గారికి,

కష్టసమయాల్లో ఆర్థికంగా ఆదుకున్న సహృదయులు, మాతృమూర్తి శ్రీమతి ఎ.బి. రాణి గారికి, (ఓరియటల్ కాలేజీ, పాలకొల్లు;) పుస్తక సహాయాన్ని అందించిన గురువులు విశ్రాంత ఆచార్యులు, శలాక రఘునాథ శర్మ గారికి, కోవెల సంపత్కుకుమార్ గారికి డా. కె. కనకదుర్గ గారికి(జానపదవిజ్ఞానశాఖ, హైదరాబాదు విశ్వవిద్యాలయం)నమస్సులు.

ఎన్నో ఇబ్బందులకోర్చి నన్ను ప్రోత్సహిస్తూ ఉన్న నాన్నగారికి, అమ్మగారికి, అన్నయ్య, వదిలనకు నమస్సులు. పిల్లలు కళ్యాణ చక్రవర్తికి, అపర్ణకి.

మహాభారతాన్ని యజ్ఞంగా భావించిన గౌరవస్థానీయులు, పుస్తక సహకారాన్ని అందించిన శ్రీ బొల్లేపల్లి సత్యనారాయణగారికి (గుంటూరు); శ్రీ బులుసు గోపాలకృష్ణ గారికి(బులుసు సాంబమూర్తిగారి కుమారులు)(డోయన్స్ టౌన్షిప్) నమస్సులు.

తెలుగులోపరిశోధనచేస్తున్నందుకు ఆదరణతో ఆర్థికసాయం అందించిన డాక్టర్ జె. శ్రీకాంత్ (ఆర్థోపెడిక్ సర్జన్) గారికి, (హీలింగ్ టచ్ హాస్పటల్, సికింద్రాబాద్) వారికి నమస్సులు.

పరిశోధన సమయానికి సెలవు మంజూరు చేసిన డా. జలీల్ సాహేబ్ గారికి, డి.ఇ.ఓ., (శ్రీకాకుళం), యస్. ధర్మరాజు గారికి, డి.ఇ.ఒ.,(శ్రీకాకుళం), సహకరించిన డా. సాయి బాబు గారికి ప్రత్యేకనమస్సులు. యం.వి. ప్రసాద్ గారికి, యం.ఈ.ఒ.,(జి.సిగడాం) నా వెన్నంటే ఉండి సహాయ సహకారాలు అందిస్తున్న మిత్రులు శ్రీ పి. తిరుమల రావుగారికి, విజయ్ కుమార్ గారికి, రంగన్నకు, రాము గార్లకు.

వెన్నంటి ప్రోత్సహించిన మిత్రులు డా. టి. కిరణ్ బాబు, శేషకళ, కుమార్, హరిష్, వారణాసి మాధవ శర్మ, పి. శ్రీలక్ష్మి, నవీన్, ఫల్గుణరావు, కిశోర్, కళ్యాణ్, ఆనంద్, భరత్, టి. రాధాకృష్ణ మూర్తి గార్లకు,

మిత్రులు డా. బద్దిపూడి జయరావు, డా. జాలాది విజయ కుమారి, టి. ఆంజనేయులు, విజయ్ కుమార్, వేణు, గురుస్వామి, సంతోష్, లక్ష్మీ నారాయణ, సాయికృష్ణ, ముకుందరావు, సుధాకుమార్, జి. సింహాచలం, రమాదేవి, అరుణగార్లకు,

సహవ్రతులు శ్రీ యస్. బి. చౌధరి గారికి, సత్యనారాయణ, మూర్తి, రామారావు, శేఖర రావు, మరోమిత్రులు పి. నగేష్ (మర్రివలస)గార్లకు.

పరిశోధనలో నెలనెలా ఆర్థిక సహాయం అందించిన యూనివర్శిటి వారికి, గ్రంథాలయ అధికారికి, వారికి సిబ్బందికి, తెలుగుశాఖలో బోధనేతర సిబ్బంది విష్ణువర్ధన రెడ్డి, శ్రీధరన్, కిషన్ గార్లకు, భోజనశాల సిబ్బందికి, జిరాక్సు విజయ్ మరియు సిబ్బందికి, పి. లోకేశ్ (రాజాం)గారికి వారి కుటుంబ సభ్యులకు...

ఇంకా సహకరించిన గురువులు, మిత్రులు, బంధుగణానికి పేరుపేరున...,

# తొలి పలుకులు

పిహెచ్.డి., చేద్దామని చాలాకాలంనుంచీ ప్రయత్నించాను. హైదరాబాదు విశ్వవిద్యాలయంలో చేయాలని నిర్ణయించుకున్నాను. ప్రవేశపరీక్షలో కృతార్థతపొందడం జరిగింది. చాలా శ్రమతో, హైదరాబాదు విశ్వవిద్యాలయంలో ప్రవేశం పొందాను. అప్పటికి నా పరిస్థితులు కొన్ని అస్తవ్యస్థంగా ఉన్నాయి. వాటిని అధిగమించేలా, నాకు నేనుగా నిలబడేలా శక్తినిచ్చే అంశాన్ని సూచించి, నా పఠనాసక్తిని పెంపొందింప జేసిన గురువులు ఆచార్య బేతవోలు రామబ్రహ్మంగారికి పాదాభివందనాలు. సంస్కృత మహాభారతం చదువుతుంటే చాలా ఆనందం పొందాను. ఆయా అంశాలను, మహాభారతానికి సంబంధించిన నవలలను చదువుతున్నప్పుడు ఒక్కో అంశం కొత్తగా అనిపించేది. మరింత శ్రద్ధపెట్టి, చదవాలని అనిపించేది. వెరసి పధ్నాలుగు నవలలను సేకరించడమైంది.

ఇందులో పర్వ నవల చదవడానికి చాలా సమయం పట్టింది. విస్తృతమైన కథాంశం కావడం, దాన్ని మూలంలో పోల్చడానికి సమయం వెచ్చించవలసి వచ్చింది. యయాతి నవల చదివేటప్పుడు చాలా ఆనందంగాను, చదివించే శైలితోను ఉండడంవల్ల పూర్తి చేయగలిగాను. ఇంకో విషయం చెప్పాలి. సంస్కృత భారతాన్ని అధ్యయనం చేస్తున్నప్పుడు నాకు ఒక శక్తి పొందినట్లు అనిపించేది. ఒక్కో రోజు ఒక్కో అనుభూతికి గురయ్యేవాణ్ణి. అది అనుభవైకవేద్యం.

ద్రౌపది పాత్ర గురించి ఎంత చదివినా ఇంకా మిగిలినట్లుగానే అనిపించేది. ఆమె శక్తిమంతురాలో కాదో తెలియదు కానీ, ఒక వ్యక్తిత్వం ఉన్న స్త్రీమూర్తిగా చూడగలిగాను. యజ్ఞసేని నవలలో ఉన్న వైవిధ్యం సారళ మహాభారతం(ఒరియా భారతం) గురించి కొంత సేకరించవలసిన అవసరాన్ని ఏర్పరచింది.

స్త్రీలకు ఉన్న కష్టాలను వివరిస్తూనే, ఆధునికంగా పురుషుడు ఎలా ఉండాలో సూచికగా మాధవి నవలను చదువుతున్నప్పుడు అనిపించింది. స్త్రీ స్వేచ్ఛ, పురుషుడి స్వేచ్ఛలు కొన్ని పరిమితులకు లోబడి ఉండాలనే నియమాన్ని సమర్థవంతంగా చిత్రించిన నవల యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ రాసిన నవల ద్రౌపది చదువుతున్నప్పుడు అనిపించింది. ద్రౌపదిని రామలక్ష్మి గారు చూసిన పార్శ్వం ఇలక్కణ(తమిళం) కావ్యం ద్వారా పరిశీలన చేసారు.

ఇంకో అంశం మనవి చేయాలి. యుగాంతం పుస్తకాన్ని చదివినప్పుడు చాలా అంశాలను పరిశీలించడానికి ఆ పుస్తకం సహకరించింది. పాత్రలను ఏ దృష్టికోణంతో చూడాలో మరింత అధ్యయనం చేయడానికి ఉపయోగపడింది. మహాభారతాన్ని అధ్యయనం చేసిన వివిధ పరిశోధకులు, విమర్శలు చదవడంవల్ల మహాభారతం మరింత కొత్తదనంతో నిండినట్లు అనిపించేది.

నా యం.ఫిల్., పరిశోధన శేషేంద్రశర్మగారి ఆధునిక మహాభారతంమీద చేయడంవల్ల ఆ నేపథ్యంతో కూడా భారతాన్ని అధ్యయనం చేయగలిగాను. భూమి, స్త్రీ, సంపదలు యుద్ధ కారణాలు. ఇది అనాదిగా మానవజీవనంతోనే వస్తోంది. ఏది ధర్మం? ఏది సంస్కృతి మొదలైన అంశాలమీద, మూలంలో, నవలలో చెప్పిన అంశాలు ఉన్నాయా? లేవా? ఇలా చాలా అనుమానాలు వచ్చేవి. గురువులు, పర్యవేక్షకులవల్ల తీర్చుకోగలిగాను. మహాభారతం చాలా కోణాల్లో మానవజీవితాన్ని అధ్యయనంచేసింది. మహాభారతానికి సంబంధించిన నవలలు ఒక్కోపార్శ్వంనుంచి మానవుల జీవితాన్ని, మనఃస్థితిని విశ్లేషించారు.

ఇలా నా పరిశోధన ప్రారంభమై, అధ్యాయాలవారిగా విభజన జరిగి, ప్రతీ పార్శ్వం నుంచీ మానవజీవితాన్ని, మనస్తత్త్వాన్ని అవగాహన మేరకు అందించడం జరిగింది. రచయితలు ఈ నవలను ఎందుకు రాయదలచుకున్నారో, ఆయా నవలను అధ్యయనం చేయడంవల్ల తెలిసిన అంశాలను రచయితల లక్ష్యాలు దృక్పథాలుగా విశ్లేషించడం జరిగింది.

పాత్రల సంభాషణలు, ఒక పాత్ర గురించి మరో పాత్ర చెప్పిన అంశాల ఆధారంగా, లేదా ఆ పాత్ర తనలో తాను అనుకొనే అంతర్మథనం ఆధారంగా ఆయా పాత్ర చిత్రణను పరిశీలించడం జరిగింది. సంస్కృతభారతంలోని అంశాలను, నవలలోని మార్పులను, చేర్పులను సంక్షిప్తంగా వివరించడమైంది. నవలలో వర్ణనలు ఏ విషయాన్ని పాఠకుడికి అందించాలని రచయితలు అనుకుని ఉంటారో, అవగాహన మేరకు వింగడించడమైంది. ఇలా మొత్తం మీద ఆరు అధ్యాయాలతో ఈ పరిశోధన పూర్తి అయ్యింది.

## విషయసూచిక

**కృతజ్ఞతలు i**
తొలి పలుకులు **iii**
1. 0. ఉపోద్ఘాతం - 1
1. 1. మహాభారత పరిణామ క్రమం -1
1. 2. నవలా రూపంలోకి భారతేతివృత్తం -1
1. 3. ప్రాథమిక ఆధారాలు -2
1. 4. ఇంతవరకు జరిగిన పరిశోధనలు -2
1. 5. పరిశోధన పరిధి - 2
1. 6. పరిశోధన లక్ష్యాలు - 2
1. 7. అధ్యాయ విభజన -2
1. 8. మహాభారతకథా సంబంధి నవలలు - వివిధాంశాలు -3
1. 8. 1. *ఇదా భారతం?* -3
1. 8. 1. 1. రచయిత్రి పరిచయం -3
1. 8. 1. 2. నేపథ్యం -3
1. 8. 1. 3. కథాసంవిధానం - 4
1. 8. 1. 4. సారాంశం - 4
1. 8. 2. *ఇంద్ర సింహాసనం*- *5*
1. 8. 2.1. నేపథ్యం -5
1. 8. 2. 2. సారాంశం -6
1. 8. 3. *చతురస్రం* -8
1. 8. 3. 1. రచయిత్రి పరిచయం -8
1. 8. 3. 2. నామసార్థక్యం - 8
1. 8. 3. 3. కథాసంవిధానం -9
1. 8. 3. 4. సారాంశం - 9
1. 8. 4. *ద్రౌపది* -13
1. 8. 4. 1. రచయిత పరిచయం - 13
1. 8. 4. 2. ఉద్దేశం - 14
1. 8. 4. 3. ఆవశ్యకత - 14
1. 8. 4. 4. సారాంశం - 14

1. 8. 4. 5. ప్రత్యేకాంశాలు - 17
1. 8. 5. *ద్రౌపది* -18
1. 8. 5. 1. రచయిత్రి పరిచయం - 18
1. 8. 5. 2. నేపథ్యం - 19
1. 8. 5. 3. కథా సంవిధానం - 19
1. 8. 5. 4. సారాంశం - 19
1. 8. 6. *ద్రౌపది* - 23
1. 8. 6. 1. రచయిత పరిచయం -23
1. 8. 6. 2. ఆవశ్యతః-23
1. 8. 6. 3. కథాసంవిధానం - 24
1. 8. 6. 4. సారాంశం - 24
1. 8. 7. పర్వ నవల - 28
1. 8. 7. 1. నేపథ్యం -28
1. 8. 7. 2. నామసార్థక్యం - 29
1. 8. 7. 3. రచయిత అనుభవం -30
1. 8. 7. 4. కథాసంవిధానం -30
1. 8. 7. 5. సారాంశం -31
1. 8. 8. *ప్రచ్ఛన్న పాండవము* -36
1. 8. 8. 1. రచయిత పరిచయం -36
1. 8. 8. 2. రచనా ఉద్దేశం -36
1. 8. 8. 3. సారాంశం -36
1. 8. 8. 4. విశిష్టత - 40
1. 8. 9. *మాధవి* -40
1. 8. 9. 1. రచయిత్రి పరిచయం -41
1. 8. 9. 2. కథా సంవిధానం -41
1. 8. 9. 3. సారాంశం -41
1. 8. 10. *యయాతి* నవల -44
1. 8. 10. 1. రచయిత పరిచయం -44
1. 8. 10. 2. కథా సంవిధానం -44
1. 8. 10. 3. సారాంశం -46
1. 8. 11. *యాజ్ఞసేని* -50
1. 8. 11. 2. ఉపోద్ఘాతం -50

1. 8. 11. 3. కథాసంవిధానం -50
1. 8. 11. 4. సారాంశం - 51
1. 8. 12. *రాజమాత* -53
1. 8. 12. 1. రచయిత పరిచయం -53
1. 8. 12. 2. నామసార్థక్యం - 53
1. 8. 12. 3. కథాసంవిధానం - 54
1. 8. 12. 4. సారాంశం - 54
1. 8. 13. *రాజసూయం* -57
1. 20. 1. నామసార్థక్యం - 58
1. 20. 2. కథాసంవిధానం - 58
1. 8. 13. 3. సారాంశం - 58
1. 8. 14. *సౌందర్యతిలక* -62
1. 8. 14. 1. రచనాసంవిధానం - 62
1. 8. 14. 2. సారాంశం - 62

2. స్త్రీ ప్రధాన నవలలు- పాత్రల పరిచయం- పాత్ర చిత్రణ - 67
2. 1. మాధవి నవలలో పాత్రల పరిచయం -67
2. 1. 2. కొత్తపాత్రల పరిచయం - 67
2. 2. మాధవి నవల- పాత్రల మనస్తత్వ పరిశీలన - 70
2. 3. *సౌందర్యతిలక* నవలలో పాత్రల పరిచయం -74
2. 3. 1. ఉపోద్ఘాతం -74
2. 3. 2. భారతంలోని పాత్రలు -74
2. 3. 3. కల్పిత పాత్రలు -75
2. 4. *సౌందర్యతిలక* నవలలో పాత్ర చిత్రణ -79
2. 5. రాజమాత నవలలో పాత్రల పరిచయం -81
2. 5. 1. ఉపోద్ఘాతం - 81
2. 5. 2. ప్రధానపాత్రలు -81
2. 5. 3. కల్పిత పాత్రలు -86
2. 6. రాజమాత నవలలో పాత్రచిత్రణ - 90
2. 7. ద్రౌపది నవలలో మనస్తత్వచిత్రణ -93
2. 8. యాజ్ఞసేని నవల పాత్రల పరిచయం -95
2. 8. 1. కల్పిత పాత్రలు - 96

2. 8. 2. మహాభారతంలోని పాత్రలు - 98
*2. 8. 3. యాజ్ఞసేని* నవలలో పాత్రచిత్రణ -100

3. పురుషపాత్ర ప్రధాన నవలలు -పాత్రల పరిచయం-పాత్రచిత్రణ 105
3. 1. *యయాతి* నవల పాత్రల పరిచయం -105
3. 1. 1. భారతంలోని పాత్రలు -105
3. 1. 2. ఈ రచయిత కల్పించిన పాత్రలు -109
3. 2. *యయాతి* నవలలో పాత్రచిత్రణ -111
3. 3. *ఇంద్ర సింహాసనం* పాత్రల పరిచయం 117
3. 3. 1. ప్రధాన పాత్రలు -117
3. 3. 2. చిన్నపాత్రలు 121
3. 4. *ఇంద్రసింహాసనం* నవలలో పాత్ర చిత్రణ 123

4. శీర్షిక ఆధారంగా కథాసూచ్య నవలలు- పాత్రలమనస్తత్త్వ చిత్రణ 130
4. 1. పర్వ నవల పాత్రల పరిచయం - 130
4. 1. 1. భారతం లోని పాత్రలు -130
4. 1. 1. 1. పురుష పాత్రలు 130
4. 1. 1. 2. స్త్రీపాత్రలు 140
4. 1. 2. కల్పిత స్త్రీ పాత్రలు 143
4. 1. 3. కల్పిత పురుష పాత్రలు 144
4. 2. పర్వ నవల - పాత్రచిత్రణ 148
4. 3. ఇదా *భారతం* పాత్రల పరిచయం 169
4. 4. ఇదా *భారతం* -పాత్రల మనస్తత్వం - 172

5. నవలల్లో వర్ణనలు- మార్పులు- చేర్పులు 184
5. 1. ఇదా *భారతం?* నవల వర్ణనలు - మార్పులు, చేర్పులు 184
5. 2. *ఇంద్ర సింహాసనం*- వర్ణనలు- మార్పులు 188
5. 3. *చతురస్రం* నవల వర్ణనలు- మార్పులు, చేర్పులు 195
5. 4. *ద్రౌపది* (కోడూరు వారి) నవల వర్ణనలు- మార్పులు, చేర్పులు 197
5. 5. *ద్రౌపది* (రామలక్ష్మి) నవలలో వర్ణనలు- మార్పులు, చేర్పులు 198
5. 6. *ద్రౌపది* (యార్లగడ్డవారి)నవల- వర్ణనలు -మార్పులు - చేర్పులు 199

5. 7. పర్వ నవల వర్ణనలు- మార్పులు, చేర్పులు 205
5. 8. *ప్రచ్ఛన్న పాండవము* నవల వర్ణనలు - మార్పులు, చేర్పులు 215
5. 9. *మాధవి* నవలలో వర్ణనలు-సూచ్యాంశాలు - 216
5. 9. 1. *మాధవి* నవలలో మార్పులు- చేర్పులు - 219
5. 10. *యయాతి* నవలలో వర్ణనలు- మార్పులు, చేర్పులు 224
5. 11. *యాజ్ఞసేని* నవలలో వర్ణనలు-మార్పులు, చేర్పులు 232
5. 12. *రాజమాత* నవలలో వర్ణనలు- మార్పులు, చేర్పులు -238
5. 13. *రాజసూయం* నవలలో వర్ణనలు-మార్పులు, చేర్పులు 242
5. 14. *సౌందర్యతిలక* నవలలో వర్ణనలు- మార్పులు, చేర్పులు - 247

6. నవలల దృక్పథాలు - సవిమర్శక పరిశీలన 251
6. 1. *ఇదా భారతం* నవలా లక్ష్యాలు -253
6. 2. *ఇంద్రసింహాసనం* నవలా లక్ష్యాలు 253
6. 2. 1. స్త్రీ విముక్తి 254
6. 2. 2. అధికారుల దౌర్జన్యాల్ని అరికట్టడం 254
6. 2. 3. పీడిత ప్రజలకు మనోధైర్యాన్ని కలిగించడం - 254
6. 2. 4. చాక చక్యంగా పనులు నిర్వర్తించడం 255
6. 2. 5. పెత్తందార్ల ఆట కట్టించడం 255
6. 3. చతురస్రం నవలా లక్ష్యాలు 255
6. 4. ద్రౌపది (కోడూరు వారి)నవలా లక్ష్యాలు 256
6. 5. ద్రౌపది నవల (రామలక్ష్మి) లక్ష్యాలు 256
6. 6. *ద్రౌపది* నవల యార్లగడ్డవారి లక్ష్యాలు దృక్పథాలు -సవిమర్శ 257
6. 7. పర్వ నవల- దృక్పథాల పరిశీలన -260
6. 8. *ప్రచ్ఛన్న పాండవము* నవలా లక్ష్యాలు 263
6. 9. *మాధవి* నవలా లక్ష్యాలు - 264
6. 9. 1. పీడిత స్త్రీకి చిహ్నంగా మాధవి -264
6. 9. 2. స్వార్థ పరుల వేషంలో పెద్దమనుషులు 264
6. 9. 3. స్త్రీస్వేచ్ఛ - 266
6. 10. *యయాతి* నవలా లక్ష్యాలు - దృక్పథాలు 267
6. 11. *యాజ్ఞసేని* నవల- లక్ష్యాలు - దృక్పథాలు 269
6. 12. *రాజమాత* నవలా లక్ష్యాలు 271
6. 13. *రాజసూయము* నవలా లక్ష్యాలు 273

**6. 14.** *సౌందర్యతిలక నవలా లక్ష్యాలు* **273**
**6. 10.** ఉపసంహారం **273**

అనుబంధం - 1. **276**
మాధవి గురించిన సమాచారం (వ్యాస భారతంలో)

అనుబంధం-2. **282**

కొన్ని చిత్రాలు
**Droupadi temple 283**

**Droupadis cover pages of novels 284**

**Droupadis and duryodhana pictures 285**

**Cover pages of various books Krishna , Kunti, and Surya 286**

**Mahabharata age map 287**

అనుబంధం - 3 **288**
మహాభారతకథాభాస నవలలు కొంత సమాచారం **288**
*దమయంతీ స్వయంవరము* ***288***
*ఈనాటి శకుంతల* ***288***
*గాంధారి* ***288***
*సావిత్రి* ***288***
*మంద్రజాలము-పురుషమేధము* ***289***
*పురాణపురుషుడు* ***289***
*క్రీడామయుడు* ***289***

ఆధార గ్రంథాలు **290**
తెలుగు వ్యాసాలు **291**
ఆంగ్ల వ్యాసాలు **291**

# అధ్యాయం-1


నారాయణం నమస్కృత్య నరం చైవ నరోత్తమమ్
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయముదీరయేత్.

## 1. 0. ఉపోద్ఘాతం :-

భారతీయ వాఙ్మయంలో స్మరణ, దర్శన, లేఖన, పఠన, పాఠనాదులవల్ల కోరిన కోర్కెలు తీర్చే గ్రంథాలుగా కొన్నింటిని పేర్కొంటున్నారు. వాటిల్లో ఒకటి మహాభారతం. ఇది ధర్మాధర్మాల పోరాటం అంతర్లయగాసాగే విశిష్టకావ్యం. కథమీద పరిశోధన చేసే పరిశోధకులు కథావాఙ్మయానికి భారతం ఒక భూమిక అని తేల్చారు.

మహాభారతం పాండవుల విజయగాథతో 'జయ' కావ్యంగా పుట్టింది. చాలా కాలం తర్వాత కొన్ని ఉపాఖ్యానాలు చేరి పరిధి పెంచుకొని మహాభారతంగా రూపాన్ని పొందింది. ఏ భాషలోనైనా అప్పటికి సరిపోయే ప్రక్రియలోకి ఇది మారడం, కొత్తధోరణులను చేర్చుకోవడం దీని విశిష్ట లక్షణాల్లో ఒకటి.

## 1. 1. మహాభారత పరిణామ క్రమం :-

మహాభారతం ఏ కాలానికైనా, రచయిత దృష్టికోణానికి తగిన విధంగా సమాజ పరిస్థితులు ఆధారంగా పరిణామం చెందుతూనే ఉంది. ఎప్పటికీ కొత్తగా అనిపించే లక్షణం దీనిలో ఉంది. మహాభారతంమీద ఎన్నో కోణాలలో ఎన్నో పరిశోధనలు జరిగాయి, జరుగుతూనే ఉన్నాయి.

పద్యరూపంలోను, ద్విపద రూపంలోను, కథారూపంలోను, నాటకరూపంలోను, గేయ రూపంలోను, హరికథలు, యక్షగానాలు, వ్యాసాల్లోను, ఉపన్యాసాలుగాను, విమర్శగాను కూడా పరిణామాన్ని పొందింది. అయితే నా ఈ పరిశోధన ఇది నవలగా ఎలా రూపాన్ని పొందిందో చూడడం, వాటి ఆవశ్యకతను వివిధాంశాలను వివరించడం.

## 1. 2. నవలా రూపంలోకి భారతేతివృత్తం :-

నవల ఆధునికకాలానికి ఒక సందేశాన్ని, విజ్ఞానాన్ని ఇచ్చే పాత్ర పోషిస్తోంది. ముఖ్యంగా పఠనానికి సులువైన విధంగా ఉంది. రచయితలకు చెప్పదలచుకున్న విషయాన్ని సవివరంగా చెప్పడానికి అనుకూలంగాను మారింది. మనదేశ సంప్రదాయాల్ని ఎలా అర్థం చేసుకోవాలో, భారతాన్ని ఎలా స్వీకరించవచ్చో, వివరణాత్మకంగా చెప్పడానికి ఈ ప్రక్రియను రచయితలు ఎంచుకున్నారు.

భారతాన్ని చారిత్రక కోణం నుంచి, తార్కిక కోణంనుంచి అధ్యయనం చేయవలసి ఉంది. మహాభారతం విస్తృతంగా ఆఖ్యానాలతో చాలా పెద్దదిగా కనబడేసరికి, పాఠకుడు దానిమీద శ్రద్ధపెట్టడం తక్కువైపోతోంది. పాఠకుడి మనసును ఆకర్షించి, భారతకథలోని మౌలిక విషయాల్ని ఆకళింపుచేయాలనే తపనతో ఈ రూపంలోకి భారతంవచ్చి ఉండవచ్చు. ఈ నవలలు చదివిన వాళ్ళు మూల భారతంలో ఎలా ఉందని తెలుసుకోవడానికైనా, లేదా పారాయణ గానో చదివే ఉద్దేశం పాఠకుడికి కలగవచ్చు. ఒక్కో రచయిత ఒక్కో అంశాన్ని, లేదా ఒక్కో కోణాన్ని తీసుకుని తమ ప్రతిభా వ్యుత్పత్తి, అభ్యాసాలతో నవలలు రాసారు.

### 1. 3. ప్రాథమిక ఆధారాలు :-

వ్యాసభారతానికి సంస్కృతంలోని నీలకంఠవ్యాఖ్యానాన్ని పరిశోధకులు ప్రమాణంగా తీసుకుంటున్నారు. కాబట్టి ఈ వ్యాఖ్యానాన్ని తెలుగులో వచ్చిన వ్యాసభారత అనువాదాలనూ (కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, శలాక రఘునాథశర్మ మొదలైనవి) ఆధారంగా తీసుకోవడ మయ్యింది. తెలుగులో వచ్చిన పధ్నాలుగు నవలల్నీ చారిత్రక, రాజకీయ, మతపరంగావచ్చిన వివిధ వ్యాసాలనూ తీసుకోవడమయ్యింది.

### 1. 4. ఇంతవరకు జరిగిన పరిశోధనలు :-

భారతం మీద చాలా పరిశోధనలు జరిగాయి. వాటిల్లో కొన్నిటిని నా పరిశోధనని దృష్టిలో పెట్టుకొని తెలియజేయడం జరుగుతోంది.

*మహాభారతం- తత్త్వ దర్శనం* (1976)
-కేతవరపు రామకోటి శాస్త్రి
*మహాభారతము- మానవస్వభావము* (1977)
-అప్పజోడు వేంకట సుబ్బయ్య
*ఆంధ్రమహాభారతములో వరాలు-శాపాలు- ఒక పరిశీలన*(1993)
-డి. జయరామరెడ్డి.
*ఆంధ్ర మహాభారతం- ధర్మ తత్త్వం*(1988)
-డి. విద్యేశ్వరి

### 1. 5. పరిశోధన పరిధి :-

మహాభారత కథ ఆధారంగా వచ్చిన నవలల్లోని మార్పులు చేర్పులు, పాత్రచిత్రణలో కనిపించే మనస్తత్త్వపరిశీలన, నవలల లక్ష్యాలు- దృక్పథాల్ని వివరించడం. ఈ పరిశోధన పరిధి. ఇది కేవలం తెలుగులో వచ్చిన పధ్నాలుగు నవలకు మాత్రమే పరిమితం.

### 1. 6. పరిశోధన లక్ష్యాలు :-

మహాభారతంలోని అన్ని అంశాల్ని జోడించి సమాజ అవసరాలకోసం ఈ నవలలో ఏ విధంగా రచయితలు మార్పులు, చేర్పులు చేసారో చెప్పడం. మహాభారతం దాని స్థితిని, ప్రస్తుతం దానిని విశ్వశ్రేయస్సుకోసం వారు మార్చడానికి కారణాల్ని అన్వేషించడం. పురుషార్థాల్ని సక్రమంగా పాటిస్తూ, జీవితాన్ని సుఖప్రదంగా మార్చుకొనేందుకు తగిన అవకాశాలను ఎలా చూడాలో తెలపడం. విశ్వశ్రేయస్సును కోరుకోవడం.

### 1. 7. అధ్యాయ విభజన :-

ఒకటో అధ్యాయం :- భారతకథాసంబంధి నవలలు -వివిధాంశాలు
రెండో అధ్యాయం :- స్త్రీ పాత్ర ప్రధాననవలలు - పాత్ర పరిచయం- మనస్తత్త్వ పరిశీలన
మూడో అధ్యాయం :- పురుషపాత్ర ప్రధాననవలలు-పాత్ర పరిచయం- మనస్తత్త్వ పరిశీలన

నాలుగో అధ్యాయం:- కథా ప్రధాన నవలలు-పాత్ర పరిచయం- మనస్తత్త్వ పరిశీలన
ఐదో అధ్యాయం :- నవలల్లోని వర్ణనలు-సూచ్యాంశాలు- మార్పులు- చేర్పులు
ఆరో అధ్యాయం :- నవలల లక్ష్యాలు-దృక్పథాల పరిశీలన

భారతకథాసంబంధి నవలలు అకారాది క్రమంలో పరిచయం చేయడం జరుగుతుంది. ఇందులో రచయితల సంక్షిప్త పరిచయం, కథా కథనం మొదలైన అంశాలు ఆయా నవలలో వివరించడం ఉంటుంది.

### 1. 8. మహాభారతకథా సంబంధి నవలలు - వివిధాంశాలు :-

మహాభారతకథ ఆధారంగా వచ్చిన నవలల రచయితల పరిచయం, కథానేపథ్యాలు, కొన్ని నవలల నామ సార్థక్యాలు, కథాసంవిధానం, ప్రత్యేక అంశాలు, రచయితల అనుభవాలు మొదలైన అంశాలు ఈ అధ్యాయంలో వివరించడం ప్రధానంగా కనబడుతుంది.

భారతకథ ప్రధానంగా నవలలో ఉంటేనే దాన్ని మహాభారతకథా నవలగా తీసుకోడం జరిగింది. భారతం, భాగవతం మొదలైన గ్రంథాలన్నిటిని, గాని కొన్నిటిని గాని కలగలపి రాసిన నవలలుకూడా ఉన్నాయి. వాటిని మహాభారతకథాభాసనవలలు, లేదా భారతాది కథాభాస నవలుగా చెప్పొచ్చు. వాటిని ప్రత్యేకంగా పరిశోధన చేయవచ్చు. వాటికి సంబంధించిన అంశాలను అనుబంధం-3 లో చూడొచ్చు.

### 1. 8. 1. *ఇదా భారతం?* :-

### 1. 8. 1. 1. రచయిత్రి పరిచయం :-

నవలా రచయిత్రులలో సుప్రసిద్ధురాలైన సి. ఆనందారామం ఈ నవలను రాసారు. ఈ నవలలో మానవతా కోణం వెల్లివిరుస్తోంది. *ఈనాటి శకుంతల, అందీఅందనిది, గుళ్ళోవెలసిన దేవతలు, అజ్ఞాత బంధాలు, విద్య(ఉత్తమ సాంఘిక నవల), ఆనంద నిలయం, చీకటి కడుపున కాంతి* (హిందీలోకి అనువాదం పొందింది),మొదలైన చాలా నవలలు రాసారు. హైదరాబాదు విశ్వవిద్యాలయంలో అధ్యాపక వృత్తి చేసారు. *ఇంద్రసింహాసనం, ఇదా భారతం* భారతకథకు సంబంధించిన నవలలు.

### 1. 8. 1. 2. నేపథ్యం :-

'ప్రళయం' పేరుతో విప్లవగీతాలు రాసేకవికి, ఆర్ష ధర్మం చెప్పే'వేదనాథ్' కి మధ్యనలిగిన కథాంశం ఈ నవల. అల్పబుద్ధితో మనుషులు చేసే చేష్టలు, అవమానాన్ని పొందే స్త్రీలు పాపభీతిలేని నాయకులమధ్య ప్రజలు ఎలా నలిగిపోతున్నారో రచయిత్రి వివరించారు.

'నేటి కళ్ళతో నాటి కథ' గా ఉదయం పత్రికలో డైలీ సీరియల్ గా ప్రచురించినదే '*ఇదా భారతం?*' గా అవతరించింది. భారతకథలోని అంశాల్ని తీసుకుని అవసరమని రచయిత్రి భావించిన చోట్ల మార్పులు చేసారు. అంతరంగ ప్రమాణం ఆధారంగా సామాజిక వ్యాఖ్య చేసారు. ఇందులో మల్లుడు క్రూరమైన పులులతో యుద్ధంచేయడం, సమాజంలో

స్త్రీకి తగిన రక్షణలేదని చెప్పడం, రాజులు పేరుకే గానీ, పెత్తనమంతా గూండాలదనడం, ప్రజలంతా చూసినా ఎదిరించలేని అరాచకత్వం మొదలైన విషయాల్ని విశ్లేషించారు. చైతన్యమెప్పుడూ ఒక వ్యక్తి తోనే మొదలౌతుందని, ఆవ్యక్తి ఆదర్శవంతుడై తిరుగుబాటుకు నాందీ పలుకుతాడని రచయిత్రి భావన.

### 1. 8. 1. 3. కథాసంవిధానం :-

కీచకుడు విరాటనగరంలో భేతాళుణ్ణి ఆవాహనచేసుకోడానికి దారుణహోమాన్ని చేయడంతో కథ ప్రారంభమౌతుంది. ఇక్కడ కీచకుణ్ని దుర్మార్గ స్వభావానికి గుర్తుగా రచయిత్రి సూచించారు. అయితే విరాటుడి కొలువులో పాండవులు అజ్ఞాతవాసం చేస్తున్న కీచకుడు పాండవుల్ని గుర్తించలేడు. వాళ్లని గుర్తించాలని భేతాళున్ని ఆవాహనం చేసుకోవాలని భావిస్తాడు. దగ్గరిలో మనకు కావల్సింది ఉన్నా అజ్ఞానంవల్ల మూర్ఖులు గుర్తించలేరని రచయిత్రి సూచన.

పురాణాల్లోని, భారతంలోని పాత్రల్ని ప్రస్తుతకాలానికి ఎలా అన్వయించాలో తెలుసుకునేలా పాత్రల్ని తీర్చిదిద్దడం, వాస్తవిక కోణాల్ని దగ్గరగా చూడడం కోసమే ఈ నవల్ని రాసారు. ఎన్నిసార్లు చూసినప్పటికీ భారతం కొత్తగానే కనిపిస్తుందని ఈ కథాసంవిధానం వల్ల తెలుస్తుంది. తిరగబడ్డవ్యక్తి చైతన్యానికి నాంది. అణగారిన వర్గం ఎప్పటికీ తిరగబడకుండా ఉండదు. ఎప్పుడో ఒకప్పుడైనా తిరగబడుతుంది. ఆ తిరగబడ్డ ప్రజలనుంచే నాయకుడు పుడతాడు. ఆ వ్యక్తిని నాయకుడిగా ప్రజలు ఆహ్వానిస్తారు.

### 1. 8. 1. 4. సారాంశం :-

కీచకుడు విరాటనగరంలో భేతాళుడికోసం 'దారుణహోమం' చేస్తున్నాడు. అతడి హోమానికి తృప్తిపడి, భేతాళుడు తన సేనాగణంతో ప్రత్యక్షమై 'ఏం కోరిక కావాలో చెప్పమన్నాడు'. 'నేను ఏం చెప్తే అది నువ్వు చెయ్యాలి' అని కీచకుడు అన్నాడు. నేను వ్యక్తిని కాదని సొంతంగా ఏ పనీ చేయలేనని, వ్యక్తిని ఆశ్రయించుకుని పని చేయడానికి ప్రయత్నిస్తానని భేతాళుడు వివరిస్తాడు. పాండవులు అజ్ఞాతవాసం ముగిసేలోపే వాళ్ళని కనుక్కోవాలని కీచకుడి భావన. అలాగే తెలుసుకుంటానని భేతాళుడు హామీ యిచ్చి, కీచకుణ్ణి ఆశ్రయించుకుని ఉంటాడు.

ఆ కీచకుడు మత్స్య దేశ సైన్యాధిపతి. ఆ దేశంలో దిష్టి బొమ్మలా విరాటరాజుని చేసి పెత్తనం అంతా సాగిస్తున్నవాడు. ఇతడికి నూర్గురు సోదరులున్నారు. వారంతా అరాచకాల్లో పాలుపంచుకుంటారు. కీచకుడి సైన్యం ఊర్లమీదపడి ధనాన్ని, యువతుల మానాన్ని దోచుకుంటారు. యువకుల్ని సైన్యంలో చేర్పిస్తారు. గతిలేక కూడా చాలామంది సైన్యంలోనే ఉండిపోయారు. కీచకుడు, వాడి సోదరులు చేయని అఘాయిత్యాలు లేవు.

ఒకరోజు సభామధ్యలో విశాలరంగస్థలంలో బోనులో ఆకలితో ఉన్న పెద్దపులుని వదిలారు. వలలుణ్ణి బోనులో పెట్టి, పులితో మల్లయుద్ధం చేస్తుంటే రాణీవాసమంతా మద్యం సేవిస్తూ వినోదంగా చూడడం ఓ సరదా. అయితే అలాంటి సమయాల్లో ఎవరూ

అనుమానించకుండా విరాటరాజు కూతురు, ఉత్తర, బోను ఊచల్ని తీసేసింది. పులితో వలలుడు(భీముడు) యుద్ధం చేస్తుండగా, అతడి ధాటికి పులి తట్టుకోలేక, బయటకు వచ్చి, రాణివాసం మీద పడింది. వెంటనే ఉత్తర మల్లుడిమీదకు ఈటెని విసిరింది. ఒడుపుగా పట్టుకుని వలలుడు పులిని చంపాక అంతా ఊపిరి పీల్చుకున్నారు.

విరాటరాజ కొలువులో పాండవులు మారుపేర్లతో చేరినప్పటికీ భీముడు పులితో యుద్ధం చేయడం ద్రౌపదికి ఇష్టంలేకపోయినా, ఏమీచేయలేక, గతాన్ని తల్చుకుని దుఃఖించేది. ధర్మరాజ్యాన్ని స్థాపించాలని పాండవుల ఆశయం. ఆ ఆశయం కోసమే వారంతా విడిపోకుండా ఉండాల్సిన బాధ్యత ద్రౌపదిమీద కుంతి పెట్టింది. వ్యాసుడు ద్రుపదుడికి అన్ని విషయాలు చెప్పిన తర్వాతే, ద్రౌపది ఐదుగురు పాండవుల్నీ వివాహంచేసుకుంది. కృష్ణుడు ధర్మరాజుచేత రాజసూయ యాగం చేయించాడు. ఆ యాగ సమయంలో మయుడు ఇచ్చిన మయసభ ధర్మరాజు ప్రతిష్ఠను పెంచింది. కానీ, ఆ సభవల్లే కాలుజారి దుర్యోధనుడు (మయసభలో) పడ్డప్పుడు ద్రౌపది నవ్వడం, దుర్యోధనుడికి మరింత ప్రతీకారం తీర్చుకోవాలని అనిపించేలా చేసింది.

పాండవుల ఐశ్వర్యాన్ని, ధీరాతిధీర, ఎవరికీ అందనంత వ్యక్తిత్వంతో ప్రకాశించే ద్రౌపదిని అద్భుతమైన స్త్రీశక్తిగా భావించి ఆమెను పాదాక్రాంత చేసుకోవాలనే ఆశతో మాయాజూదంతో పణంగా పెట్టించి దుర్యోధనుడు గెలుచుకున్నాడు.

### 1. 8. 2. *ఇంద్ర సింహాసనం* :-

ఈ నవల్ని సి. ఆనందారామం రాసారు. ఈ నవల పదవీలౌల్యానికి ప్రతీక. పదవికోసం ప్రాకులాడే పరిస్థితుల్ని పౌరాణికపాత్రలద్వారా నిరూపించి ఆధునిక కాలానికి కూడా అనువర్తించేలా ధ్వనించేస్థితి ఈ నవలలో ఉంది. స్వార్థ రాజకీయాలు, పెట్టుబడిదారుల పెత్తనాలు, పార్టీలపరంగా జెండాలు మార్చేవారు, తమకున్న సత్తాచూసి వీరగర్వం పొందేవ్యక్తులు పతనం పొందేటప్పుడు పడే అవస్థలు, భోగలాలసత్వం, ప్రేమతత్త్వం ఇలా చాలా కోణాల్ని ఈ నవలలో దర్శించవచ్చు. మొత్తం ముప్పైఒక్క భాగాలతో 244 పుటలున్న నవలిది.

### 1. 8. 2.1. నేపథ్యం :-

భారతంలోని నహుషుడు, యయాతికి సంబంధించిన విషయాల ఆధారంగా ఈ నవల రాసారు. అయితే పునఃకథనసృష్టి, రాజులు, గురువులస్థితి, స్త్రీల చాకచక్యం మొదలైన ధోరణుల్ని భారతకోణంనుంచి నేటి సమాజాన్ని రచయిత్రి దర్శించేలా చేసారు. పదవికోసం ప్రాకులాడేరాజు, విలాసాలకి లోనై, దేశ శ్రేయస్సుమీద దృష్టిపెట్టకపోతే, మేధావివర్గంచూస్తూ ఏమీ అనకుండా చూస్తూ ఉండడం. అది మేధావుల మౌనంగా కొద్దికాలం స్తబ్దత ఈ నవలలో కనిపిస్తుంది. ఆ స్తబ్దత తర్వాత జరగబోయే తీవ్రపరిణామాలకు నాందిగా భావించవచ్చు.

పురాణకాలం నుంచీ స్త్రీని ఏవిధంగా తక్కువతనంతో చూసారో ఈ నవలలో వివరణ ఉంది. ప్రతిపురుషుడి వెనుక స్త్రీ తప్పక ఉంటుందని ఈ నవలలో రుజువు చేసారు. *ఇంద్రసింహాసనం* పౌరాణిక పాత్రల నిర్మాణంలో ఉన్నా, సమకాలీన రాజకీయచరిత్ర ధ్వనించేలా అనిపిస్తుంది. (ఈ నవలరచనా కాలం నాటికి ఇందిరాగాంధి పాలన ఉంది. ఇందిరాగాంధిని ఇంద్రాణితో పోల్చినట్లు కనిపిస్తోంది. ఇందిరా గాంధిని రాజకీయ దక్షత ఉన్న వనితగా మాత్రమే ఇక్కడ చూడాలి) ఇంద్రాణి, యయాతి, దేవయాని, శర్మిష్ఠ, శుక్రాచార్యులు మొదలైన పాత్రల్ని మలచిన తీరు నేపథ్యాలు ఆధునిక సమాజంలో జరుగుతున్నట్లనిపిస్తుంది. ఈ నవలలో స్వర్గం, ఇంద్రపదవి, ఋషులతపస్సు, ఇంద్రాణి, శర్మిష్ఠ, దేవయాని, శుక్రాచార్యుల్లాంటి పాత్రల అంతరంగాన్ని పాఠకులు దర్శించేలా ఉన్నాయి.

### 1. 8. 2. 2. సారాంశం :-

ఇంద్రుడు వృత్రాసురుణ్ణిచంపి, బ్రహ్మహత్యా పాతకాన్ని పొందాడు. ఋషులతణ్ణి ఇంద్ర పదవినుంచీ తొలగించారు. ఆ తర్వాత ఇంద్రపదవికి తగినవాడిగా ఋషులు నహుషుణ్ణి నియమించారు. అయితే నహుషుడు అంతకుముందున్న ఇంద్రుడిభార్య ఇంద్రాణిని భార్యగా కోరతాడు. ఈ ఇంద్రాణిపాత్ర ఒక 'శక్తి స్వరూపిణి'. ఈమె స్త్రీమూర్తిలోని వాత్సల్య, ఔదార్య, గంభీర, కర్కశ, కార్యదీక్ష, లౌకిక ప్రజ్ఞ, అలౌకిక ప్రతిభలకు ఆదర్శమైన పాత్ర.

శచీదేవి నహుషుడికి గుణపాఠం చెప్పాలని సప్తర్షులు లాగే రథంలో తనదగ్గరికి రమ్మని అంటుంది. నహుషుడికి ఇంద్రపదవి తనదే అయినందువల్ల తనని ప్రశ్నించినవాడే లేడని భావిస్తాడు. కలహప్రియుడైన నారదుడు రథంలో నిద్రపోతున్న నహుషుణ్ణి లేపి పదిఘడియల్లో ఇంద్రాణి రమ్మని చెప్పిందని, లేకపోతే భూలోకానికి వెళ్ళిపోతుందని తొందర పెడతాడు. ధ్యాన నిమగ్నులై ఉన్న మునులు నిదానంగా రథంలాగుతుంటే వేగంగా లాగమని రెండుసార్లు హెచ్చరించినా వినలేదు. వెంటనే కోపంవచ్చిన నహుషుడు దగ్గరిలో ఉన్న అగస్త్యుణ్ణి కాలితో తన్నాడు. వెంటనే కోపంవచ్చిన అగస్త్యుడు భూలోకంలో అజగరమై పొమ్మని శపించాడు. ఆ మాటలు మిగతా మునులువిని, విషయం తెల్సుకుని, నహుషుణ్ణి ఇంద్రపదవినుంచి తొలగించారు.

నహుషుడి కొడుకు యయాతి. నహుషుడి తర్వాత భూలోకంలో ధైర్య, సాహసాలున్న రాజు. వృషపర్వుడి కూతురు, శర్మిష్ఠ. దేవయాని, శుక్రాచార్యుల కూతురు. అడవిలో ఉన్న నూతిలో వివస్త్రగా పడ్డ దేవయానిని యయాతి రక్షించి, తన వస్త్రాన్ని ఇచ్చి వెళ్లిపోయాడు. యయాతి అందానికి దేవయాని ఆకర్షితురాలైంది. అనుకోకుండా యయాతి కలసినప్పుడు తనను దక్షిణహస్తంతో నూతిలోంచి తీసావని, నీవే నా భర్తవని దేవయాని యయాతితో వాదిస్తుంది. దేవయాని అందాన్ని చూసి మనస్సులో యయాతి ఆకర్షణకు గురయ్యాడు. అయినా, బయటకు మాత్రం వేర్వేరు కులాలు మనవి పెళ్లి చేసుకోడం తగదని కొంతసేపు వాదించాడు. చివరకు శుక్రాచార్యుల్లాంటి నీతికోవిదులు చెప్తే ఒప్పుకుంటానంటాడు. శుక్రాచార్యులు వచ్చి దోషంలేదు, పెళ్లిచేసుకోవచ్చని అనేసరికి

యయాతి దేవయానిని వివాహం చేసుకుంటాడు.

శర్మిష్ఠ దేవయానిని నూతిలో తోసేసిందన్న కసితో, శర్మిష్ఠను దేవయాని దాసిగా చేసుకుని అవమానానికి గురిచేస్తుంది. వృషపర్వుడు చేసేదిలేక గురుపుత్రిక కోరికను తీర్చడానికే సిద్ధపడతాడు. రాజ్యంకోసం, గురువుకోసం, సంజీవని విద్యకోసం వృషపర్వుడు తన కూతురుని దేవయానికి దాసిగా మార్చినట్లు రచయిత్రి వివరిస్తారు. సమాజంలో స్త్రీ-రాజ్యానికి, పదవుల లబ్ధికి, యుద్ధాలకు తమను పావుల్లావాడిన పురుషులమధ్య నలిగి పోతున్నారని భావించిన రచయిత్రి స్త్రీల ఆవేదనను ఈ సన్నివేశంలో సూచించారు.

మరో స్త్రీకథ ఇంద్రాణి కూతురు జయంతి. శుక్రాచార్యుల తపోభంగానికి వాడిన స్త్రీ జయంతి. శుక్రుడి తపస్సు పూర్తయ్యాక బలైపోయిన స్త్రీ. వీరిద్దరికి దేవయాని పుడుతుంది. ఈమె కచుణ్ణి వరిస్తుంది. చివరకు సమాధి అవస్థలో దేవయాని, కచుణ్ణి దర్శించడం కొసమెరుపు. శుక్రాచార్యులు ఎప్పుడూ తనకూతురు ఏం చెబితే దాన్నే చేసే స్వభావం ఉన్న పాత్ర. దేవయాని అంటే అంత యిష్టం. అయితే జయంతి కూతురు పుట్టేక దేవలోకానికి వెళ్లిపోయింది. అలా తల్లి బాధ్యతలు కూడా శుక్రుడిమీద పడి దేవయానిని మరింత గారంగా పెంచాడు.

ఇంద్రుడి కుమారుడు 'జయంతుడు'. అప్సరస 'మేనక'ను ప్రేమిస్తాడు. పెళ్లి చేసుకోవాలని అనుకుంటాడు. వృషపర్వుడు యయాతిని వశపరుచుకోవాలని శర్మిష్ఠను స్వర్గానికి పంపిస్తాడు. రాజకార్యంకోసం అలాచేయడం తప్పుకాదని రచయిత్రి వ్యంగ్యంగా సూచిస్తారు. విషయం తెలుసుకున్న ఇంద్రాణి శర్మిష్ఠను కన్న కూతురులా భావించి యయాతితో కలిపేలా చేస్తుంది. విషయం తెలుసుకున్న దేవదూతలు యయాతిని బంధిస్తారు. శర్మిష్ఠ దొరక్కుండా ఉచ్చైశ్రవం మీద పారిపోయేలా ఇంద్రాణి ఏర్పాటు చేస్తుంది. నహుషుడు అన్యాయగా జయంతుణ్ణి శిక్షించాడు. కానీ, తనకొడుకు విషయంలో శిక్షకు గురికాకుండా చేయాలని ఇబ్బందిపడతాడు. శిక్షల్ని వేసేవాణ్ణి మార్చేస్తే మంచిదన్న నారదుడి సలహామేరకు యముణ్ణి పదవినుంచి తీసేసి వేరే వ్యక్తిని ఆ పదవిలో నియమిస్తాడు. ఇలా నహుషుడు తప్పిదం చేసినట్లు అంతటా తెలిసిపోతుంది. తన అప్రతిష్ఠని తొలగించేందుకు జయంతుణ్ణి విడుదల చేయాల్సి వస్తుంది. తప్పు బయట పడకుండా ఉండేందుకు జయంతుణ్ణి సన్మానిస్తాడు కూడా.

ఇంద్రలోకంలో ఉన్న అప్సరస 'హేమ' భూలోకానికి రాచకార్యంకోసం వెళ్లి అక్కడే మయుణ్ణి పెళ్లిచేసుకొని పిల్లల్నికని ఉండిపోతుంది. ఈ విషయంతెలుసుకున్న నహుషుడు అలా భూలోకంలో ఉండకూడదని పిల్లల్ని, భర్తను వదిలేసి రమ్మని శాసిస్తాడు. అలా అన్నీ వదులుకున్న, రాజాజ్ఞకు బలైన పాత్రగా హేమ కనిపిస్తోంది.

నహుషుణ్ణి ఇంద్రపదవినుంచి దింపేయడం కోసం జయంతుడు భూలోకంలో ప్రయత్నాలు చేస్తాడు. పదవీచ్యుతుడైనయముడు అతడికిసహాయంగా నిలుస్తాడు. జయంతుడు మలయమారుతవిమానాలు నిర్మించాలని ప్రయత్నాలు చేస్తాడు. దాన్ని

మధ్యలోనే నహుషుడు కలగజేసుకొని ఆపేలా చేస్తాడు. స్వర్గంలో ఇంద్రాణి అగ్ని, వరుణ, వాయుదేవులకు ఇంద్రపదవి ఇప్పిస్తానని, వాళ్లలోవాళ్లకి అంతఃకలహాలు రగిలించి చివరకు నహుషుణ్ణి ఇంద్రపదవినుంచి దింపడానికి అగ్ని, వరుణాదులు ఐక్యమత్యంగా ఉండేలా చేస్తుంది. ఈ నవలా రచనాకాలంనాటి రాజకీయ సంఘటనలు, సన్నివేశాలు ఈ సంఘటనలకు దగ్గరిగా అనిపిస్తాయి.

అగ్ని దేవుడు మాహిష్మతీపురంలోని స్త్రీలను యథేచ్ఛగా అనుభవిస్తూ ఉంటాడు. నిర్గృతి దండిస్తే భయపడి, పరస్త్రీలను పురుషుడు వాడుకోడం నేరంకాదని చట్టాన్ని తయారుచేసి అమలు జరుపుతాడు. ఈ వాతావరణం స్త్రీలమీద జరుగుతున్న అత్యాచారాలకు పరాకాష్ఠగా అనిపిస్తుంది. అంతఃకలహాలకారణంగా నహుషుడు పదివిలోంచి దిగిపోడం, ఇంద్రాణి పదవిలోకి రాడం, తర్వాత ఇంద్రుణ్ణి పూర్వపు సింహాసనం మీద తిరిగి కూర్చోబెట్టడం జరుగుతుంది.

సంకల్పబలంతో శుక్రుడిచ్చిన శాపాన్ని(ముసలివాడవడం) యయాతి జయించడం మరో ప్రత్యేకత. మనసుకి శరీరంపైఉన్న ప్రభావానికి ఉదాహరణగా రచయిత్రి ఈ సన్నివేశంలో కల్పనచేసారు. ఇంద్రాణి భూలోకానికి వచ్చి, 'బిడ్డల్లారా!, కల్పవృక్షాలూ, కుబేరులు, ఘంటాకర్ణులూ, అప్సరసలు, అమృతం మొదలైన (వ్యర్థభోగాలు మనిషిలోని మానవత్వాన్ని లేకుండాచేస్తాయని, శ్రమతత్త్వాన్ని కలిగి ఉండాలని రచయిత్రి భావన) హంగులన్నిటితోఉన్న స్వర్గాన్ని నాశనంచేయండి. ఇంద్రసింహాసనాన్ని ముక్కలుచేయండి. అప్పటిగానీ మనవాళికి విముక్తిలేదు' అంటూ వ్యవస్థలోని మార్పుల్ని సూచిస్తూ, మానవత్వపు శక్తికి మహోన్నత పీఠంవేస్తూ రచయిత్రి కథను ముగించారు.

### 1. 8. 3. *చతురస్రం* :-

### 1. 8. 3. 1. రచయిత్రి పరిచయం :-

ఈ నవలను ముక్తేవి భారతి రాసారు. ఈమె రాజాబహదూర్ వేంకట రామారెడ్డి మహిళా కళాశాల లో తెలుగు రీడర్ గా పనిచేసారు. '*చిలకమర్తి సాహిత్య సేవ*', '*భారతంలో ప్రేమకథలు*', '*ముక్తేవిభారతి కథలు*' గా 'వనిత', 'ఉదయం' మొదలైన పత్రికల్లోను, తరువాత పుస్తకాలుగాను ముద్రణ పొందాయి. '*తంజావూరు నాయక రాజుల కాలంలో రచయిత్రులు*' యం.లిట్., సిద్ధాంత వ్యాసం ఉస్మానియా విశ్వవిద్యాలయానికి సమర్పించారు. భారతంలోని యయాతికథ ఆధారంగా '*చతురస్రం*' నవలను రాసారు.

### 1. 8. 3. 2. నామసార్థక్యం :-

కచుణ్ణి దేవయాని ప్రేమించడం ఒక కోణం. శర్మిష్ఠ దేవయానుల తగువువల్ల దేవయాని శర్మిష్ఠను దాసిగా చేయడం రెండోకోణం. శుక్రాచార్యుడు శర్మిష్ఠ విషయంలో ఆంక్షలు పెట్టినా లక్ష్యపెట్టకుండా ముగ్గురు కొడుకుల్ని కనడం మూడో కోణం. యయాతి వృద్ధాప్య శాప సమయంలో ఆ వృద్ధాప్యాన్ని పూరుడు తీసుకోడం నాల్గవ కోణం. ఇలా రచయిత్రి భావించి ఈ పేరు పెట్టారు.

ఇంకో రకంగా కూడా ఈ పేరును సమర్థించవచ్చు. యయాతి, దేవయాని, శర్మిష్ఠ, శుక్రాచార్యులు నాల్గుకోణాలుగా వీటిని సమన్వపరుస్తూ కలిపిన వ్యక్తిగా పూరును చెప్పవచ్చు. అయితే చతురస్రం అన్న మాట సాధారణంగా లెక్కల్లో వాడతారు. ఆ పరిభాషను అన్వయించి చూస్తే, మొదటి ఆధార గీత శుక్రాచార్యుడు. ఎందుకంటే యయాతి వివాహానికి ప్రధాన ఆధారభూతుడు. రెండో (నిలువు)గీత దేవయాని. మూడో నిలువుగీత శర్మిష్ఠ. దాని పైన అడ్డగీత యయాతి. అప్పటికి చతురస్రపు గీతలు పూర్తవుతాయి. వీటిని కలిపి చతురస్రంగా తీర్చేవాడే పురు. అంటే కాబోయో చక్రవర్తిని సూచించినట్లు కనబడుతోంది.

### 1. 8. 3. 3. కథాసంవిధానం :-

వృషపర్వుడు రాక్షస రాజు. అతడి గురువు, మంత్రి శుక్రాచార్యులు. శుక్రుడి కూతురు దేవయాని. అల్లారుముద్దుగా పెంచుతాడు. కూతురిమీద మమకారంతో, అమితమైన వాత్సల్యం తోనూ చివరికి, ఎలా పరాకాష్టను పొందుతాడో ఈ నవలలో వివరించడం కనిపిస్తుంది. కేవలం అహంకారం ఉన్న వ్యక్తి చివరకు ఏం సాధించిందో ప్రశ్నార్థకంగా మిగిలిపోతుంది.

'అమ్మా!' అని పురు దేవయానిని పిలవడం, ఆ పిలుపులోని మాధుర్యం వ్యక్తిలో చేతనత్వాన్ని, నిజమైన మాతృహృదయాన్ని ఆవిష్కరించడంతో కథ ముగుస్తుంది.

### 1. 8. 3. 4. సారాంశం :-

యజ్ఞశాలలో రాక్షసరాజు వృషపర్వుడు సత్ఫలితాలకోసం యజ్ఞం చేస్తున్నాడు. రాక్షస గురువు, మంత్రి, అయిన శుక్రాచార్యులు యజ్ఞాన్ని నిర్విఘ్నంగా చేసాడు, గురువుగారి దగ్గర విద్యనేర్చుకోడం చాలాఅదృష్టమనిభావించిన శుక్రచార్యుల శిష్యులు "అజ్ఞాన తిమిరాంధస్య..." అంటూ గురుస్తుతి చేస్తున్నారు.

శుక్రుడి గారాలపట్టి అపురూపసౌందర్యవతైన దేవయాని. దేవరాక్షస యుద్ధంలో శుక్రాచార్యులు మృతసంజీవని విద్యప్రభావంవల్ల మరణించిన రాక్షసులు బతికిస్తాడు. దేవతలు ఎక్కువమంది మరణించడంవల్ల, వారు యుద్ధాన్ని తాత్కాలికంగా వాయిదా వేయించారు. అయితే ఇలాగే పోరాడితే దేవతల ఓటమి తథ్యం. అందుకే రాక్షసులబలానికి కారణమై శుక్రుడిదగ్గరున్న మృత సంజీవని తేవడానికి కచుడు బయలుదేరాడు.

బృహస్పతి కొడుకు కచుడు. ఓ రోజు దేవలోకంనుంచీ బయలుదేరి శుక్రాచార్యుల దగ్గరికి వచ్చి, అతని కాళ్ళకు మొక్కి, సవినయంగా కచుడు తనను పరిచయం చేసుకున్నాడు. 'మీ దగ్గర శిష్యరికంచేయడానికి వచ్చానని, విద్యనేర్పమని' అర్థించాడు. అతడి వినయానికి ముచ్చటపడిన శుక్రుడికి తనమిత్రుడైన బృహస్పతి కొడుకు తనదగ్గర శిష్యరికం చేయడానికి రావడం మరింత ఆనందాన్ని ఇచ్చింది. కచుణ్ణి ఆశీర్వదించి, శుక్రుడు తనదగ్గర కూర్చోబెట్టు కున్నాడు.

దేవయాని మనసుకు నచ్చేవిధంగా మెలగాలని కచుడు తెలుసుకుని అలా ఉంటున్నాడు. కచుడు అందమైన, తెలివైన శిష్యుడు. దేవయానికోసం రోజూ పండ్లు, పాలు మొదలైనవి తెచ్చి అభిమానంగా యిచ్చేవాడు. కచుడి అందానికి అభిమానంతోడైనప్పటికి దేవయాని అతణ్ణి ప్రేమించసాగింది. ఆశ్రమ ధర్మాలైన ఆవుల్ని మేపడం, అడవికి వెళ్ళి కట్టెలు కొట్టి, తేవడం మొదలైనపనులు కచుడు చేస్తున్నాడు. విద్యపట్ల ఆసక్తి చూపడంతో శుక్రచార్యులు అమితానంద పడసాగారు. ఆ అభిమానపడడం యిష్టపడని రాక్షసబాలురు అసూయపడి, కచుణ్ణి ఎలాగైనా అంతం చేయాలని పన్నాగం పన్నారు. చివరకు, కచుణ్ణి చంపి, కాల్చాక మిగిలి బూడిదను శుక్రుడు తాగే మద్యంలో కలిపి యిచ్చేసారు. ఆ విషయం తెలియక దాన్ని శుక్రుడు తాగేసాడు.

ఎంతసేపటికి కచుడు రాకపోడంతో దేవయాని తండ్రిని పదేపదే అడగసాగింది. చివరకు శుక్రుడు తన మృతసంజీవనివిద్య సాయంతో తనపొట్టలోనే ఉన్నట్లు తెలుసుకుని మృతసంజీవని విద్యద్వారా బతికించి, ఆ మంత్రాన్నినేర్పించి, తనపొట్టచీల్చుకుని, బయటకురమ్మని చెప్పాడు. తను సురాపానంచేయడంవల్లే ఇలా జరిగిందని భావించి 'సురాపానంచేస్తే పతితులౌతారని' శపించాడు. కచుడు బయటకి వచ్చి, గురువు నేర్పిన మంత్రంతో అతణ్ణి బతికించాడు. శుక్రుడు సంతోషించి, ఆశీర్వదించి సెలవు యిప్పించాడు.

తను వచ్చిన పని పూర్తవడంతో దేవలోకానికి బయలుదేరాలని నిశ్చయించుకున్నాడు. ఆ విషయం దేవయానికి చెప్పాడు. దేవయాని కచుణ్ణి ప్రేమిస్తున్నట్లు, తన మనసులోని మాటను చెప్పింది. మనమిద్దరం సోదరతుల్యులం. అందువల్లే సోదరుడిగా నీ ప్రేమను స్వీకరిస్తానని చెప్తాడు. ఎన్నో రకాలుగా నచ్చచెబుతాడు. అయినా దేవయాని తన మనసు మార్చుకోదు. పైగా కోపంతో తనమాటను నిరాకరించిన కచుణ్ణి, 'నీవు నేర్చుకున్న విద్యనీకు పనికిరాకుండా పోతుందని' శపిస్తుంది. కచుడికి కూడా కోపంవచ్చి, 'ఋషిపుత్రుడెవరూ నిన్ను పెళ్ళిచేసుకోడని' దేవయానికి ప్రతిశాపమిస్తాడు. దాంతో దేవయానికి ఆశలు, కలలు కుప్ప కూలినట్లు భ్రమ కలిగింది. లోకమంతా చీకటితో నిండినట్లు భావించింది. దేవలోకానికి కచుడు వెళ్ళిపోయాడు. దేవయానికి మనసు బాగోలేదు.

వృషపర్వుడి కూతురు శర్మిష్ఠ. జలక్రీడలకోసం దేవయానని రమ్మని కబురు పెట్టింది. మనసు బాగులేని సమయంలో జలక్రీడల్లో ఉపశమనం కావచ్చు అని భావించి, దేవయాని బయలుదేరింది. చెలికత్తెలతో శర్మిష్ఠ దేవయానిని తీసుకువెళ్ళింది. అడవిలో జలక్రీడల్లో ఉన్న సమయంలో అకస్మాత్తుగా గాలి దుమారం లేవడంతో వేగంగా ఒడ్డుకువచ్చి ఆ హడావుడిలో శర్మిష్ఠ దేవయాని చీరకట్టుకుంది. గాలివాన అప్పటికే ఎక్కువైంది. ఆ చీర కచుడు దేవలోకం నుంచి వచ్చినప్పుడు దేవయానికోసం తెచ్చాడు. శర్మిష్ఠ దాన్ని ధరించడంతో ఆ చీర తనదని, దేవయాని తనకు విప్పేసి ఇచ్చేయమని, మొండి పట్టుదల పట్టింది. అసలువిషయం తెలియని శర్మిష్ఠకు, చీర పొరపాటున కట్టుకున్నందుకు దేవయానికి అంత కోపం రావడమేమిటని, ఆలోచించకుండా నానామాటలు అనేసింది.

చీర యివ్వకపోగా తనను, తన తండ్రి, శుక్రాచార్యులను చాలామాటలు అన్నందుకు, దేవయానికి మరింత మొండితనం, పట్టుదల పెరిగింది. దేవయాని అలిగి పరిగెత్త సాగింది. వెంటబడి శర్మిష్ఠ బతిమాడాలని అనుకుని, ఆమె కూడా పరిగెత్తింది. చివరకు శర్మిష్ఠ ఒక్క నెట్టు నెట్టగా, పక్కనే ఉన్న పాడుపడిన నూతిలో దేవయాని పడిపోయింది. ఆమెను తీసే ప్రయత్నం చేయకుండా శర్మిష్ఠ నగరానికి వెళ్ళిపోయింది. దేవయాని చెలికత్తెలు ఆమెకోసం నగరంలో వెదుకుతున్నా కనబడలేదు. సాయంకాలం అయిపోడంతో వారికి కంగారు ఎక్కువైంది.

నూతిలో పడిన దేవయాని 'రక్షించండి రక్షించండి' అంటూ అరచి అరచి, గొంతు బొంగురు పోయింది. ఎలాగైన నూతిలోంచి బయటకు వచ్చి, శర్మిష్ఠ మీద పగసాధించాలని దేవయాని అనుకుంది. దేవయాని సన్నిహితరాలైన 'ఘూర్ణిక' ఎంతసేపటికీ జలక్రీడలనుంచి రాకపోవడంతో, ఏమయ్యిందో! అని అనుకొని, దేవయాని వెళ్లిన మార్గంగుండా బయలుదేరింది. 'దేవయాని, దేవయాని' అని గట్టిగా అరుస్తూ అడవిలో ప్రవేశించింది.

వర్ణాశ్రమ ధర్మ పరిరక్షకుడు, చంద్రవంశపుమహారాజు యయాతి. ఇతడు మృగయా వినోదంగా దేవయాని ఉన్న అడవిలోకి ప్రవేశించాడు. అప్పటికే మృగాల్ని వేటాడి, దారి తప్పిపోయి దాహంగాఉన్న సమయంలో నీటికోసం వెదుకుతున్నాడు. దూరంలో ఓ బావి కనబడింది. ఒక ఆడగొంతు ఆర్తనాదం వినిపిస్తోంది. అది వచ్చేవైపు బయలుదేరాడు. నూతిలో నుంచి ఆ గొంతు ధ్వనిస్తోందని తెలుసుకున్నాడు. నూతిలోకి చూస్తే, అక్కడ అపురూప సౌందర్యవంతంగా ఓ స్త్రీ నూతిలో పడినట్లు తెలిసింది. ఆమెను ఆరాతీసి, 'ఆర్తత్రాణ పరాయణుడిగా' తనను అనుకొని, ఆమెను రక్షించాడు. నగరానికి దిగబెట్టమని దేవయాని యయాతిని అడగలేదు. దేవయాని అందానికి యయాతి ఆకర్షితుడైనా, ఆ విషయాన్ని మనసులోనే ఉంచుకుని తన దారిని తాను వెళ్ళిపోయాడు.

ఘూర్ణిక అరుపువిన్నా నూతిగట్టునే దేవయాని కూర్చుంది. ఘూర్ణిక దేవయానిని గుర్తించి, విషయం తెలుసుకోవాలని దేవయానిని అడిగింది. నగరానికి పోదామని బతిమాలింది. కానీ దేవయాని ఆమె మాటల్ని వినకుండా తన తండ్రిని పిలవమని ఆజ్ఞాపించింది. పరుగు పరుగున ఘూర్ణిక నగరానికి వచ్చి విషయాన్ని శుక్రుడికి నివేదించింది. వెంటనే శుక్రుడు బయలుదేరి ఆ అడవికి చేరుకున్నాడు. శుక్రుడు దేవయానిని ఊరడించే ప్రయత్నం చేసాడు. దాంతో దేవయానికి మరింతకోపం వచ్చింది.

శుక్రుడు అడవికెళ్ళాడని విని, వృషపర్వుడు కూడా అడవికి బయలుదేరాడు. విషయం తెలుసుకున్నాడు. అడవిలో తనకూతురు తరుపున వృషపర్వుడు దేవయానికి క్షమాపణలు చెప్పాడు. అయినా దేవయాని శాంతించలేదు. చివరకు శర్మిష్ఠను తన దాసిగా చేయాలని కోరింది. మనసులో శుక్రుడు బాధ పడ్డాడు. దేవయాని శర్మిష్ఠను సహస్రదాసీజనాన్ని దాసిగా చేసుకుని రాజకన్యలా చెలామణీ అవుతోంది.

ఒకరోజు ఉద్యానవన విహారానికి దేవయాని దాసీజనంతో బయలుదేరింది. యయాతి అనుకోకుండా ఆ ఉద్యానవనంలోకి ప్రవేశించాడు. అతణ్ణి చూసి దేవయాని మనస్సులో ఆనందించి అతిథి సత్కారాలు జరిపించింది. అడవిలో యయాతి రావడం, వామహస్తం యిచ్చి తనను రక్షించడం...పాతకథ అంతా మనసులో గుర్తుకువచ్చింది. ఈలోగా యయాతి దూరంలో ఉన్న అపురూపసౌందర్యవతైన ఒకామెను ఆశ్చర్యపోయి చూసాడు. దేవయానిని ఆమె చెలికత్తెల్ని పరిచయం చేయమని కోరాడు. అందరు చెలికత్తెల్ని పరిచయం చేస్తూ, చివరికి శర్మిష్ఠను పరిచయం చేసింది. వృషపర్వుడి కూతురు శర్మిష్ఠ అని తెలుసుకుని యయాతి ఆమెపట్ల ఆకర్షితుడౌతున్నడని దేవయాని గ్రహించింది. తనని పాణిగ్రహణం చేసారని వెంటనే యయాతికి చెప్పింది.

ఒక్కసారి ఆశ్చర్యపడిన యయాతికి అడవిలో తనను కాపాడిన విధమంతా గుర్తుకు తెచ్చింది. వామహస్తం యిచ్చి, రక్షించారని అప్పుడే మనకు వివాహం అయిపోయిందని దేవయాని వివరంగా చెప్పింది. అవాక్కయిన యయాతి ధర్మబద్ధమైన వివాహంకాదని, నిరాకరించినట్లు మాట్లాడాడు. చివరికి శుక్రాచార్యులేవచ్చి, ధర్మబద్ధమనిచెప్తే, వివాహానికి ఒప్పుకుంటానని అంటాడు.

వెంటనే శుక్రాచార్యుల్ని దేవయాని రప్పించింది. తనకూతురు యయాతిని ఇష్టపడుతోందని శుక్రుడు తెలుసుకుని, ఈ వివాహంలో 'అక్రమదోషం' లేదని వరం యిస్తున్నట్లు చెబుతాడు. యయాతి దేవయాని అందాన్ని చూసి ఒప్పుకుంటాడు. విషయం తెలుసుకున్న వృషపర్వుడు ఆందోళన పడతాడు. తనకుమార్తె శర్మిష్ఠ పొందాల్సిన యయాతిని దేవయాని పొందడం బాధగా అనిపించింది. తన ఆలోచనా విధానం తప్పు అని, సామాన్య వ్యక్తిలా ఆలోచించి, తన గురువును తక్కువగా అనుకుంటున్నానని, అలాంటి ఆలోచన రాకుండా జాగ్రత్త పడతాడు. శుక్రుడి ఆజ్ఞమేరకు వృషపర్వుడు దగ్గరుండి దేవయానికి, యయాతికి వైభవంగా వివాహం జరిపిస్తాడు. దేవయానిని యయాతికి శుక్రుడు అప్పగిస్తాడు. ఎన్నో బుద్ధులు చెప్తాడు. శర్మిష్ఠను దాసిగా చూడొద్దని, శయన విషయంలో పరిహరించమని శుక్రుడు యయాతిని హెచ్చరిస్తూ చెప్తాడు.

దేవయాని గాఢపు కౌగింతల్లో యయాతి ఆనందం పొందుతున్నాడు. వారిద్దరికి యదువు తుర్వసుడు కొడుకులు పుట్టారు. దేవయానిమీద శర్మిష్ఠకుకోపం వచ్చింది. మోసంతో తనకు దక్కాల్సిన యయాతిని దేవయాని దక్కించుకుందని శర్మిష్ఠ భావించింది. మళ్ళీ అలాంటి మోసమే పరిష్కారమని అనుకొంది. దేవయాని పిల్లలు పుట్టగానే, యయాతిని పట్టించుకోడం మానేసింది. దేవయాని పిల్లలే లోకంగా గడుపుతోంది. అలాంటి సమయంలో శర్మిష్ఠ యయాతి ఒంటరిగా ఉన్నప్పుడు వెళ్లి తనతో గడపమని తనకోరిక చెప్పింది. పైగా సమర్థనీయంగా మాట్లాడేసరికి జవాబు చెప్పలేక శర్మిష్ఠతో యయాతి రహస్యంగా గడపసాగాడు.

సంతానవతి కావాలనుకోడం ఏ స్త్రీకైనా సహజమే. యయాతి, శర్మిష్ఠల సంగమానికి గుర్తుగా 'పురుడు' పుట్టాడు. కొంతకాలానికి దేవయాని కంట పడిపోయింది. ఆమె నిలదీసే టప్పటికి ముని వరంవల్ల పుట్టాడని శర్మిష్ఠ నమ్మించగలిగింది. శర్మిష్ఠమీద అప్పుడు మాత్రమే దేవయానికి సానుభూతి కలిగి, ఏమీ అనకుండా వెళ్ళిపోయింది.

శర్మిష్ఠ రెండోసారి గర్భవతి అయ్యింది. అప్పుడు సుస్తీగా ఉందని ప్రచారం చేయించి ఈ రహస్యాన్ని దాచగలిగింది. మూడోసారి గర్భవతి సమయంలో తీర్థయాత్రలకు వెళ్ళిందని చెప్పి మాతృత్వాన్ని పొందింది. సంపూర్ణ స్త్రీత్వానికి శర్మిష్ఠ మైమరిచిపోయి ఆనందించింది. దేవయాని, శర్మిష్ఠలతో గడిపినా యయాతికి కామవాంఛలు తీరలేదు. ఒకరోజు ప్రకృతిని చూడాలని బయలుదేరాడు. దేవయాని యయాతిని అనుసరించింది. దారిలో శర్మిష్ఠ పిల్లలు ఆడుకుంటూ యయాతిని చూసి, 'నాన్నా' అని పిలిచేసరికి, దేవయానికి విషయం అర్థమై తీవ్రకోపం వచ్చింది. తన తండ్రికి కబురు పెట్టింది. శుక్రుడు ఎలా శపిస్తాడో అని యయాతికి భయమేసింది.

శుక్రుడు రాగానే దేవయాని విషయం చెప్పింది. తన ఆజ్ఞను ధిక్కరించిన యయాతికి రూపం, యవ్వనం కారణాలని భావించి, అవి లేని ముసలివాడిగా జీవితాన్ని గడపమని శుక్రుడు శపించాడు. తన భర్త ముసలివాడైపోతాడని తెలిసి, దేవయాని కూడా బాధపడింది. యయాతి శుక్రుడికాళ్ళమీదపడి క్షమించమని ప్రార్థించాడు. నీపుత్రులెవరైన నీ వృద్ధాప్యం స్వీకరిస్తే వాళ్ల యవ్వనం నీవు పొందవచ్చని చెప్పి, శుక్రుడు వెళ్ళిపోతాడు.

యయాతి తన కొడుకులందర్నీ పిలిచి తన వృద్ధాప్యాన్ని స్వీకరించమని కోరతాడు. శర్మిష్ఠ కొడుకు 'పురుడు' తప్ప, ఎవరూ అంగీకరించకపోడంతో వారందర్నీ శపిస్తాడు. పురువల్ల యయాతికి తిరిగియవ్వనంవస్తుంది. యయాతి చాలాసంవత్సరాలు భోగలాలసుడై యవ్వనో త్సాహాన్ని పొంది, సంతృప్తి చెందుతాడు. తిరిగి తనకొడుకు పురుడికి యవ్వనాన్నిచ్చి తను ముసలితనాన్ని పొందుతాడు. కొడుకు 'పురు' కు రాజ్యపట్టాభిషేకంచేసి, దీవిస్తాడు. "ఇతడే నా కొడుకు" అని దేవయాని, శర్మిష్ఠలు అనుకుని పురుణ్ణి దీవిస్తారు. తండ్రి ఋణాన్ని తీర్చుకుని ఆదర్శవంతమైన పాత్రగా పురు కనిపిస్తాడు.

మానవుడు పదేపదే కామవాంఛలమీద పడిపోయి, లేదా దుష్ప్రభావాలకు లోనై పోతున్నాడు. వాటినుంచీ రక్షిచాల్సినవ్యవస్థ కుటుంబమే అని రచయిత్రి భావించింది. వయస్సులో జరిగిన తప్పులకు ఎలామనిషి బలౌతున్నాడో సోదాహరణంగా తెలిపింది. దానినుంచీ కొత్తపాఠం నేర్చుకోవాలని, మంచి తరాన్ని యివ్వాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని రచయిత్రి సూచించింది.

1. 8. 4. *ద్రౌపది* :-

1. 8. 4. 1. రచయిత పరిచయం :-

ద్రౌపది చిన్న నవల. నవలిక[1] గా గంగశెట్టి లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. దీన్ని కోడూరు ప్రభాకర రెడ్డి రాసారు. వీరు వృత్తి రీత్యా వైద్యులు. ప్రవృత్తి సాహిత్య సృజన. *రాగవిపంచి* (ఖండకావ్యం), *పల్నాటి భారతం*, చాలా రేడియో నాటికలు; *పిరదౌసి, కర్పూర వసంతరాయలు, శ్రీనాథ విజయం, మనస్విని, బలిదానం* మొదలైన పద్యకావ్యాలు రాసారు. ఎన్నో సత్కారాలు పొందారు. వ్యాసభారతంలోని ద్రౌపది, కవిత్రయ భారతంలోని ద్రౌపదికి ఉన్న లక్షణాంశాల్ని గుర్తించి ఈ నవలికలో రాసారు.

### 1. 8. 4. 2. ఉద్దేశం :-

భారతంలోని పాత్రల్లో జానపదులకీ, నాగరికులకీ నచ్చేపాత్ర ద్రౌపది. అయితే ఏ ఆడదీ పడనన్ని నష్టాలు, కష్టాలు ఈ పాత్ర అనుభవించింది. పంచకన్యల్లో ఒకరిగా ఐదుగురు భర్తల్ని పొందికూడా కీర్తిపొందింది. సత్యభామకి పతివ్రతా ధర్మాల్ని బోధించింది. అలాంటి పాత్రను తీసుకొని సామాన్య ప్రజలకోసం రాసినట్లు రచయిత మున్నుడిలో పేర్కొన్నాడు.

### 1. 8. 4. 3. ఆవశ్యకతః-

మహాభారతంలో ఉత్కృష్ట పాత్రల్లో ద్రౌపది ప్రధానమైనది. అహల్య తర్వాత పేర్కోదగిన మహోన్నత వ్యక్తిత్వం ఈమెకు సొంతం. విద్యార్థి దశలో భారత భాగవతాల్లో విశేషాల్ని ఆకళింపు చేసుకొని అభిమానంతో ద్రౌపది గురించి కోడూరు ప్రభాకర రెడ్డి రాసిన చిన్న పుస్తకమిది. వేదం ధర్మానికి, ఆర్షవిజ్ఞానానికి మూలం. పరమ ఋషులు సృష్టించిన తత్త్వం వేదం. వేద సారాన్నంతా నిక్షిప్తంచేసిన కథాసంపత్తి భారతం. కుటుంబంనుంచి ప్రపంచం వరకూ అన్ని విషయాలు భారతంలో దొరుకుతాయి. కుటుంబగాథ ద్వారా మానవ జీవితాల్ని, జీవితపరమార్థాన్ని తెలియజేయడానికే వ్యాసుడు భారతం రాశాడంటారు.

అలాంటి భారతంలో మచ్చలేని పాత్ర ద్రౌపది. అన్నింటామేటి. అయితే ఐదుగురు భర్తలతో ఆమె పత్నిగా ఎలా మెలిగింది? పతివ్రత ఎలాగయింది? అని సందేహాలు వస్తూ ఉంటాయి. ఈ సందేహాలు తీర్చి, సౌహార్ద్ర ద్రౌపది హృదయాన్ని ఆవిష్కరింపచేసి కుటుంబసౌఖ్యాన్ని ప్రజకందించాలని కోడూరువారు ఈ పుస్తకాన్ని రాసారు.

భారతం భారతీయ వీరగాథ. ఆ గాథకు ఆయువుపట్టు నాయికమణి ద్రౌపది. నిఖిల సద్గుణాల సౌకుమార్యం ఆమెసౌందర్యం. వ్యాసుడు అపూర్వంగా చిత్రించిన ద్రౌపదిని తిక్కన మరింత మెరుగులుదిద్ది ఆదర్శవంతంగా తీర్చారు. కోడూరువారు ఆయా విషయాల్ని ఒక వరుసలో నిక్షేపించి ద్రౌపదిని వీరనారిగా, పతివ్రతగా, అనురాగవతిగా, ఆత్మవిశ్వాసినిగా, అతిథి అభ్యాగతుల సేవికగా, సౌభాగ్య, సౌందర్యవతిగా విశ్లేషించారు. ఈ అంశాలే ఈ పుస్తకాన్ని రాయడానికి రచయితకు ప్రేరకాలు.

### 1. 8. 4. 4. సారాంశం :-

భారతకాలానికి కలిప్రవేశం ప్రారంభమయ్యింది. ఆ కలిపురుషుడివల్ల వినాశనం

[1] వాఙ్మయి 1998 త్రైమాసిక పత్రిక

దాపురుస్తుంది. అలాంటి స్థితినుంచి ప్రజల్ని ధర్మరక్షణ పరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత గురువులు, ఋషులుదీనూ. భారతకథా శ్రవణంవల్ల కలినాశం జరుగుతుంది. పురుషుల్లో భీష్మ, విదురుడు, పాండవులు ఉత్తమ స్థానాన్ని ఆక్రమిస్తారు. స్త్రీలలో సత్యవతి, కుంతి, సుభద్రాదులు ఉత్తములు.

పాంచాలదేశానికి రాజు ద్రుపదుడు. చిన్నతనంలో భరద్వాజులవారిదగ్గర అశ్రమంలో విద్యాభ్యాసం పూర్తిచేసాడు. అక్కడే ద్రోణుడు సహాధ్యాయుడు. వీరిద్దరూ ప్రాణమిత్రులుగా ఉండేవారు. విద్యపూర్తయ్యాక వెళ్లిపోయేటప్పుడు ద్రుపదుడు ద్రోణుడితో "అన్నా!, నీ సఖ్యం నా పూర్వ జన్మఫలం. భవిష్యత్తులో నేను పాంచాలదేశానికి రాజునౌతాను. అప్పుడు నీవు నాదగ్గరికి తప్పకుండా రావాలిసుమా!. నేననుభవించే రాజభోగాలను నాతో సమానంగా నీవుకూడా అనుభవించాలి. ఇది నా అభ్యర్థన. నన్ను మరచి పోతావా? నాకిక సెలవిప్పించు. వెళ్లివస్తాను" అని అభ్యర్థించాడు. ద్రోణుడు అలాగే కానిమ్మన్నాడు. (పుట. 2)

ద్రుపదుడు వివాహం చేసుకున్నాడు. అతనికి 'సౌత్యామణి' భార్య ద్వారా సుమిత్రుడు, ప్రియదర్శకుడు, వీరకేతుడు, శత్రుంజయుడు, సురథుడు, ధ్వజకేతుడు అనే పేర్లున్న ఆరుగురు కొడుకులున్నారు. ద్రోణుడు పేదరికంతో బాధపడతాడు. అప్పుడు మిత్రుడైన ద్రుపదుడు, గుర్తుకు రాడంతో పిల్లలకు పాలుకూడా లేని ఆర్థికస్థితిలో అతని దగ్గరకు వచ్చాడు. ద్రుపదుడు ద్రోణుడి స్థితిని అర్థంచేసుకోకుండా అతణ్ణి అవమానించాడు. ఆ అవమానానికి తగిన ప్రతీకారం తీర్చుకోవాలని ద్రోణుడు కోపంతో హస్తినాపురానికి వెళ్ళి, కురు కుమారులకు గురువుగా చేరాడు. కౌరవాదుల్లో అర్జునుణ్ణి మేటి విలుకానిగా చేసి, గురుదక్షిణగా ద్రుపదుణ్ణి కట్టి తెమ్మని కోరాడు. ద్రుపదుడి రాజ్యమదాంధకారం, అహంకారాలు దెబ్బతిన్నాయి, అవమానపడ్డాడు. అందుకే యాగం చేసి ద్రోణుణ్ణి చంపగలిగే కొడుకు, అర్జునుణ్ణి పెళ్ళాడే కూతుర్ని పొందాడు.

ద్రౌపదీ స్వయంవరంలో అర్జునుడు గెలిచాడు. ద్రౌపదిని పాండవులైదుగురు పెండ్లాడ తామని అంటారు. వ్యాసమహర్షి వచ్చి, ద్రౌపది పూర్వజన్మ వృత్తాంతాన్ని వివరిస్తాడు- పూర్వం 'మౌద్గల్యముని'కి నాలాయని అయిన 'ఇంద్రసేన' భార్యగా ఉండేది. భర్తకు కుష్టురోగం, ముసలితనం, శరీరం అంతా దుర్గంధం. పైగా కోపం ఎక్కువ. అయినా ఇంద్రసేన భర్తను పరమభక్తితో ఆరాధిస్తుండేది. ఒకరోజు భోజనం చేసే సందర్భంలో భర్త తినగా, మిగిలినదాన్ని తింటుండగా అన్నంలో భర్తయొక్క ఊడిపడిన బొటనవేలు కనబడింది. ఇంద్రసేన అసహ్యించు కోకుండా, ఉచ్ఛిష్టాన్ని తినడం చూసి, మౌద్గల్యుడు సంతోషించి, 'నీకు ఇష్టమైన వరాన్నికోరుకో' మన్నాడు. అప్పుడు ఇంద్రసేన 'మహాత్మా!, నాకు కామేచ్ఛ విశేషంగా ఉంది. మీ తపశ్శక్తితో కామరూపులై నాకు తృప్తి కలిగించమంది. అలా మౌద్గల్యుడు భార్యకోరికను తీర్చడానికి ఐదురూపాలు ధరించి కొన్ని వేలసంవత్సరాలు గడిపాడు. ఆ తర్వాతకూడా ఆమె కోరికలు తీరలేదు. చివరకు ఆమెను వదలిపెట్టి తపస్సుకోసం వెళ్లిపోయాడు.

మరోజన్మలో కాశిరాజు కూతురుగా పుట్టి, కన్యగానే ఉండిపోయి ఘోరతపస్సు చేసింది. ఆ తపస్సుకు మెచ్చి శివుడు వరంకోరుకోమన్నాడు. 'ఐదుమార్లు ''పతి''కావాలని' కోరుకుంది. అమ్మా నువ్వుకోరుకున్న ఈ వరం మరోజన్మలో తీరుతుందని, ఐదుగురు భర్తల్ని కలుస్తూ ఉన్నా, పూర్వం నీలోఉన్న కన్యాత్వం మళ్ళీ పొందుతావని అభయమిచ్చాడు. అయితే ఆమె 'నాకు ఐదుగురితోనూ ప్రత్యేక సంగమాన్ని, పతిశుశ్రూషాసిద్ధిని, కామభోగేచ్ఛను, సౌఖ్యాన్ని ప్రసాదించమని' వేడుకుంది. రుద్రుడు ఆమె కోరుకున్నట్లే వరం యిచ్చాడు.

రుద్రుడు గంగాతీరంలో ఉన్న ఇంద్రుణ్ణి తీసుకురమ్మని కాశీరాజపుత్రికకి చెప్పాడు. ఇంద్రుడు వచ్చాక అతణ్ణి చూసి 'పూర్వమొకసారి నన్ను హేళన చేసిన నేరంవల్ల నీవు అయిదు భాగాలుగా చీల్చబడ్డావు. ఓ ఇంద్రా! సమీపంలో ఉన్న పర్వత శిఖరాన్నెత్తి చూడు'(పుట.13) అని అన్నాడు. రాతినెత్తితే లోపల నలుగురు ఇంద్రులు దుఃఖిస్తూ ఉండగా, మనుష్యరూపంలో పుట్టండని రుద్రుడు శపించాడు. అలా శపించడానికి ఇంద్రుడు ఓ రోజు పురోహితుడైన విశ్వరూపుని, అతడి పుత్రుడైన వృత్రాసురుణ్ణి కూడా చంపాడు. అహల్యను భంగపరిచాడు. ఇవన్నీ ఈ శాపానికి కారణాలు. ధర్మ, బల, రూప, లావణ్య, శక్తులు అతనిలో ఉండకుండా- యమ, వాయు, అశ్వనీదేవతలతో చేరాయి. సూక్ష్మ దేహాలుగా, అవి కొండగుహల్లో దాగి ఉన్నాయి. ఈ నలుగురితో కలిసి ఐదవవానిగా మనుష్యగర్భాన జన్మించమని ఈ కన్యను పెండ్లాడమని శివుడు ఆజ్ఞాపించాడు. దీనికి మూలం మార్కండేయ పురాణంలో ఉంది. ధర్మరాజు పృథ్వి, భీముడు వాయు, అర్జునుడు జల, నకులుడు అగ్ని, సహదేవుడు ఆకాశ తత్త్వంగా వర్ణించారు.

వ్యాసుడు ఈ విషయాన్నంతా ద్రుపద మహారాజుకి చెప్పి దివ్యనేత్రాన్నిచ్చి దర్శించమన్నాడు. దాంతో ద్రుపదుడు పాండవుల్ని చూస్తున్నప్పుడు అదృశ్యమై, ధర్మరాజు దేవేంద్రుడిగా, మిగతా పాండుపుత్రులు ఒక్కో దేవేంద్రుల్లా, ద్రౌపది శచీదేవిలా సాక్షాత్కరించారు. ద్రుపదుడు ఆనందపడి వివాహం చేయించాడు.

వివాహం అయ్యాక ఒక సంవత్సరకాలం పాండవులు ద్రుపదుడింట్లోనే ఉన్నారు. ధృతరాష్ట్రుడు ఖాండవవనం యిచ్చాక ధర్మరాజు రాజసూయయాగం చేసాడు. అప్పుడే పాండవులమీద దుర్యోధనుడికి మత్సరం పుట్టింది. ద్యూతంలో పరాభవించాడు. భీమాదుల ప్రతిజ్ఞలతో భయపడిన ధృతరాష్ట్రుడు ద్రౌపదిని మూడు వరాలు కోరుకోమన్నాడు. పైగా అంతకు ముందు ద్యూతంలో కోల్పోయిన సర్వాన్నిచ్చేసాడు.

రెండోసారి ద్యూతంలో పాండవులు ఓడిపోగా అరణ్యవాసానికి వెళ్లారు. అక్కడ సైంధవుడు ఆమెను బలవతంగా ఎత్తుకుపోతుండగా, పాండవులు అడ్డగించి, అవమానపడేలా చేసి పంపారు. అజ్ఞాతవాసంలో కీచకుడు అవమానపరచడం భీముడు అతణ్ణి సంహరించడం, ద్రౌపదిని ఇబ్బంది పెట్టిన ఉపకీచకుల్ని చంపడంతో కీచకపీడ వదిలింది. ఉత్తరగోగ్రహణంలో అర్జునుడు కౌరవ సైన్యాన్ని పారద్రోలి గోరక్షణ చేసాడు. ఉత్తరుడే ఆ విజయం సాధించాడని విరాటరాజు భావించాడు. చివరకు బృహన్నల

విజయానికి కారకుడన్నందుకు ధర్మరాజును 'సారె' తో కొట్టాడు. రక్తం కారి కిందపడకుండా సైరంధ్రి వచ్చి ఒత్తింది. చివరకు పాండవుల నిజరూపాలు ధర్మరాజాదులు తెలిపాక విరాటరాజు సంతోషించి, క్షమించమని అర్థించాడు.

అజ్ఞాతవాసం పూర్తయ్యాక సంజయ, కృష్ణరాయబారాలు పూర్తయ్యాయి. కృష్ణ రాయబారంలో అందరి అభిప్రాయాలను కృష్ణుడు తీసుకున్నాడు. ద్రౌపదిని ఓదార్చాడు. తర్వాత భీకర కురుక్షేత్ర యుద్ధంలో అన్ని ప్రతీకారాలు పూర్తయ్యాయి. ఉపపాండవులు ద్రౌపదికి గర్భశోకాన్ని మిగిల్చారు. ధర్మరాజు అశ్వమేధయాగం చేసి ద్రౌపదికి అత్యంత పవిత్రతను కలిగించాడు. యుధిష్ఠిరుడు ధృతరాష్ట్రనిర్యాణాన్ని, శ్రీకృష్ణ నిర్యాణాన్ని విని, మహాప్రస్థానం చేయదలిచాడు. అభిమన్యుడికుమారుడైన పరీక్షిత్తుకు రాజ్యపట్టాభిషేకంచేసి, సుభద్రను అతడికి సాయంగా నియోగించారు. గృహాన్ని విడిచి పాండవులు ద్రౌపదితో సహా బయలుదేరారు. దారిలో ద్రౌపది పడిపోయింది. దానికి కారణం అర్జునుడిమీద పక్షపాతంగా ధర్మరాజు సమాధానం చెప్పి ముందుకు సాగాడు. చివరికి ధర్మరాజొక్కడే స్వశరీరంతో స్వర్గానికి చేరాడు. అక్కడ మహాలక్ష్మిగా ద్రౌపదిని తెలుసుకున్నాడు. భూలోకానికి వచ్చిన లక్ష్మీదేవి అని ద్రౌపదినిచెప్పి రచయిత నవలని ముగించాడు.

### 1. 8. 4. 5. ప్రత్యేకాంశాలు ః-

కోడూరు ప్రభాకర రెడ్డి సంస్కృత వ్యాస భారతం, తిక్కన భారతాన్ని కూలంకషంగా అధ్యయనంచేసి ద్రౌపది పంచభర్తృక ఎలా అయిందో నిరూపించారు. లోకవ్యవహారంలో 'ద్రౌపది ఆరో భర్తను కోరింది' అన్న విషయాన్ని ప్రజలు నమ్మడాన్ని శాస్త్రీయంగా, తత్త్వం ఆధారంగా తిరస్కరించారు.

ద్రౌపది తత్త్వం దేవతాస్త్రీత్వం. పుట్టింది పవిత్ర అగ్ని నుంచి. పెరిగింది రాజవంశంలో. పొందింది వీరపురుషుల్ని. సతీపతిధర్మం తెలుసుకుంది. సతి జీవుడు, పతి ప్రపంచ స్వరూపుడు. జీవుడు పొందుతున్న సుఖమంతా విశ్వంవల్ల వస్తోంది. సౌఖ్యానికి పతి హేతువు. ఆ పతిని దైవంగా పరమాత్మగా భావించిన వ్యక్తిత్వం ఉన్న స్త్రీగా ద్రౌపది ఈ నవలికలో కనిపిస్తోంది. ఈ విషయాన్ని అర్థంచేసుకోక ఆరో పతి కర్ణుడని విపరీత వ్యాఖ్య చేస్తున్నారని, ఇది తగదని, రచయిత వివరించారు.

'పురుషాణా మభావేన సర్వనార్యః పతివ్రతా' అన్న వాక్యాన్ని అనుసరించి పురుషులు, పంచభూతాలు లేని స్థితి తరవాత పంచకోణాలు దాటి వెళ్లగలిగినప్పుడు జీవులు పతివ్రత లౌతారు. అంటే సమాధిస్థితిలో భౌతికజ్ఞానం నశించి ఆ తర్వాత పతిసేవ చేయగలుగుతారు. అలాగే ద్రౌపది తాను పంచభూతాలతో కలసి ఉండి కూడా కలవనట్లు నటిస్తూ నాదబ్రహ్మతో అనురక్తిగా ఉంటూ కాలం గడుపుతూ తన పాతివ్రత్యాన్ని పొందిందని తెలుసుకోవాలని రచయిత విశ్లేషించారు.

పాండవుల్ని పంచభూతాత్మకంగా నిరూపించారు. ధర్మరాజు పృథివీ తత్త్వంగా, అంటే ఓర్పుకు చిహ్నంగా; భీముడు వాయుతత్త్వంగా, అంటే పాండవులకు

ఆధారతత్త్వంగా; అర్జునుడు జలతత్త్వంగా, అంటే స్వచ్ఛత్వానికి; నకులుడు అగ్ని తత్త్వంగా, అంటే పవిత్రకు; సహదేవుడు ఆకాశతత్త్వంగా, అంటే అనంత తత్త్వంగా ఈ నవలికలో ఉంది. దీనికి ఆధారం మార్కండేయపురాణంలో ఉంది.[2] ఈ ఆధారాన్నిచ్చి పాఠకుణ్ణి పురాణాలవైపుతిప్పే ప్రయత్నం చేసారు. ఇది రచయిత పురాణాల అధ్యాయాన్ని, విశ్లేషణని సూచిస్తుంది.

ఇంద్రుడయినా తప్పులు చేస్తాడని, దానికి ప్రతిఫలం అనుభవించక తప్పదని, హేళన చేయడంవల్ల ఇంద్రుడు మానవాంశతో పుట్టవలసివచ్చిందనీ మార్కండేయపురాణం ఆధారంగా వివరించారు.[3] అర్జునుడు తీర్థయాత్రలకి వెళ్లినపుడు సుభద్రను పెళ్ళిచేసుకొని వచ్చాక ఆమె మీద ద్రౌపది సపత్నీ మత్సరాన్ని చూపలేదు. పైగా సుభద్రను సహోదరిగా భావించింది.

'పంక జాక్షి నీ పతి ప్రతిపక్ష వీర,
విజయుడయ్యెడు నీవును వీరపుత్ర
జనని వగుమని దీవించె సంతసంబు,
తోడ వసుదేవ పుత్రి నా ద్రుపద పుత్రి'(భారతం. ఆది. 8ఆ.-212ప) అంటూ దీవించింది. తన జన్మాంతర తపఃఫలితంగా లభించిన భర్తలతో సుఖంగా జీవించింది. పదమూడు సంవత్సరాలు ఆనందంలో మునిగింది. తన అభీష్టానికి తగిన భర్తలు దొరికినందుకు వారిమీద ప్రేమరసాన్ని కురిపించింది. నిరంతరం శుశ్రూషతో అందర్నీ గెలుచుకుంది. అలాంటి భాగ్య వైశిష్ట్యాన్ని పొందిన మహా పతివ్రతగా ద్రౌపదిని రచయిత పరిచయం చేసాడు.

### 1. 8. 5. *ద్రౌపది* :-

### 1. 8. 5. 1. రచయిత్రి పరిచయం :-

నవలా రచయిత్రులలో ప్రసిద్ధులు, కె. రామలక్ష్మి ఈ నవల రాసారు. ఆరుద్ర భార్యగా వీరు సుపరిచితులు. చీకటి దారి, అందుకో ఈ ప్రేమ లేఖ, లవంగి, కరుణకథ, ఆశకు సంకెళ్ళు, మూడో మనిషి, ఆడది, శిలాపుష్పం, ప్రేమించు ప్రేమకై మొదలైన నవలలు, కథలుకూడా రాసారు.

---

[2] ధర్మః పృథ్వ్యానిలో భీమః జలం పార్థో।
నలం స్మృతః, నకులో రూప తశ్చాగ్నేః సహదేవో నభస్స్మృతః

[3] బ్రహ్మహత్యాభి భూతస్య పరా హాని రజాయత
తథాధర్మం వివేశాథ శాక్రం తేజో।పచారతః
బ్రహ్మహత్యాభి భూతస్య తదా బలమశీర్యత
తచ్ఛక్ర దేహ విభ్రష్టం బలవాయుమథవిశత్
గౌతమస్యా శ్రితమ్ రూపం అహల్యాంచ యదావృషా
ధర్షయామాస దేవేన్ద్రం తథారూప మహీయత
అంగప్రత్యంగ లావణ్యం తదతీవ మనోరమమ్
విహాయదుష్టందేవేన్ద్రం నాసత్యావగమత్తు తత్"

1. 8. 5. 2. నేపథ్యం :-

మహాభారతంలోని ద్రౌపది కథని సాధ్యమైనంత వరకూ పాఠకుడికి దగ్గరయ్యేవిధంగా చేయదలచిన నవల ఈ 'ద్రౌపది'. ఈ నవలని రాయడానికి కారణం తమిళంలోఉన్న 'ఇలక్కణ' కావ్యం. ద్రౌపదీ పరిణయం, పాంచాలి వస్త్రాపహరణం, కురుక్షేత్రం మొదలైన సంఘటనలు 'విల్లుపాట్టు'గా తమిళనాడులో ప్రచారంపొందింది. సాధారణంగా ముగ్గురో, నలుగురో బృందంగా కలిసి పాడేపాట. విల్లుని అడ్డంగా ఒక చుట్టకుదురుమీద ఉంచుతారు. విల్లుకి అక్కడక్కడ చిన్న గంటలు కడతారు, చేతిలో నట్టువాంగం చేసే కర్రలాంటి దాంతో విల్లును కథకుడు కొట్టి పాడుతూ ఉంటారు. పక్కనున్న బృందం ఆయా పాత్రలకి తగినట్లుగా పాడడమో, వ్యంగ్య ప్రశ్నలు వేయడమో, గొంతుకలిపి పాడడమో చేస్తూ ఉంటారు. ఒక్కమాటలో చెప్పాలంటే ఈ విల్లుపాట్టు ఆంధ్ర రాష్ట్రంలో 'బుర్రకథ' కు దగ్గరగా పోలికలుంటాయి.

రచయిత్రి విల్లుపాట్టుకథ విని, ఆకర్షితురాలై ఈ నవలరాయడం ప్రత్యేకత. శ్రీవిలుపుత్తూర్ భాగవతార్ కావ్యాల్లో శుద్ధ తమిళంలో ద్రౌపది గురించిన కొన్ని అంశాల్ని తీసుకొని రసదృష్టి చెడకుండా అనుసరించే ప్రయత్నం చేసారు.

1. 8. 5. 3. కథా సంవిధానం :-

ద్రౌపది పరిపూర్ణవ్యక్తిత్వం ఉన్న స్త్రీపాత్ర. కథ చెప్పడంలో రచయిత్రి 'ఫ్లాష్ బాక్ ' గా ప్రారంభించారు. ధర్మరాజు ఆకాశగంగలో స్నానం చేసాక, ప్రయాణం చేయడం దగ్గరనుంచి కథ వెనక్కి మొదలౌతుంది. ఇలా ప్రారంభించడంలో అప్పటికథ ఇప్పటి జీవితాలకి కూడా అనువర్తిస్తుందని రచయిత్రి సూచన. ద్రౌపదికున్న ప్రాముఖ్యం భారతంలోని ఏ పాత్రకు లేదు. అలాంటి విశిష్టత ఉన్న ద్రౌపది జన్మజన్మల వృత్తాంతం సందర్భోచితంగా సూచనచేయడం, పాతివ్రత్య తత్త్వాన్ని విశ్లేషించడం ఇందులో ప్రత్యేకంగా కనిపిస్తుంది.

పాండవులు మొదటసారి జూదంలో ఓడిపోయి ద్రౌపదివల్ల తిరిగి రాజ్యాన్ని పొందారు. అది అవమానంగా ధర్మరాజు భావించడమే కారణంగా రెండోసారి ఆటకి రావడమని రచయిత్రి భావించారు. అప్పటికే ద్రౌపదికి కోపం వస్తుంది. దుశ్శాసనుడు లాగిన కొప్పును ముడి పెట్టకపోడం లాంటి అంశాల్ని సూచనగా రచయిత్రి అందించారు. ఇలా చాలా అంశాలున్నాయి. చివరిగా ఒక్కమాటలో చెప్పాలంటే ద్రౌపదిని అంతర్వాహినిగా సూచించడం రచనా సంవిధానంగా కనబడుతోంది.

1. 8. 5. 4. సారాంశం :-

ఆకాశ గంగలో మునిగి, ధర్మరాజు ప్రయాణం సాగిస్తున్నాడు. ఎదురుగా దేవేంద్రుడు దేవలోకానికి రమ్మని ఆహ్వానిస్తున్నాడు. అంతవరకు ధర్మరాజుతో వచ్చిన ద్రౌపద్యాదులు దారిలోనే చనిపోతారు. కానీ, ఒక కుక్క మాత్రం ధర్మరాజుని అనుసరిస్తూనే వస్తుంది. దాని పట్ల దయతో దాన్ని కూడా స్వర్గలోకంలోకి ప్రవేశం కల్పించమని ధర్మరాజు

దేవేంద్రుణ్ణి కోరాడు. చివరకు కుక్క ధర్మదేవతగా కనిపిస్తుంది. వారు ఇంద్రలోకం పొందుతారు.

ఇంద్రలోకంలో ఎదురుగా వస్తున్న స్త్రీని చూసి, ధర్మరాజు ఈమె ఎవరని దేవేంద్రుణ్ణి అడుగుతాడు. స్వర్గలక్ష్మిగా, త్రేతాయుగంలో ఛాయా సీతగా, తర్వాత ఇంద్రసేనగా, ద్రౌపదిగా ఎలా అవతరించిందో ఇంద్రుడు వివరిస్తాడు. ధర్మరాజు గతాన్నంతా గుర్తుకు తెచ్చుకొంటాడు. ద్రుపదుడు యజ్ఞంచేయడం, ద్రోణుణ్ణి చంపగల కొడుకు, అర్జునుణ్ణి పెళ్ళిచేసుకునే కుమార్తె పొందాలనుకోవడం, ఆకాశవాణి 'కృష్ణ కృష్ణ' అనడం ఆ పేరే ద్రుపదుడు పెట్టినట్లు ఇలా చాలా సంఘటనలు ఒకదాని తర్వాత, కొన్ని ముందు వెనుక కూడా ధర్మరాజుకి గుర్తొస్తాయి. రచయిత్రి ఈ సంఘటనలన్నీ ఒక్కో అంశం ముందు చెప్తూ, మరోచోట గతంలోకెళ్ళి పాత్రకు గుర్తుకొచ్చేలా చేయడం కనిపిస్తోంది.

ద్రౌపదికి ఇష్ట సఖి పేరు 'ధాత్రేయిక'. ద్రౌపది కన్యగా పుట్టడం వల్ల బాల్యావస్థ గురించి ప్రస్థావనలేదు. ధాత్రేయిక సుందరరాజకుమారుల చిత్రాల్ని ద్రౌపదికి చూపిస్తుంది. అప్పుడు అందులో అర్జునుడి చిత్రపటం చూసినప్పుడు ద్రౌపదికి కళ్ళు వికసించాయి. ఆ విషయాన్ని ధాత్రేయిక గ్రహిస్తుంది. యజ్ఞసమయంలో తండ్రి కోరుకున్న విషయం ద్రౌపదికి గుర్తొస్తుంది. తండ్రి కోరిక తీర్చడం తనయులకేకాదు, "తనయకీ" ఉంది అని ధాత్రేయిక అన్నట్లు రచయిత్రి చెప్పడంలో స్త్రీభాగస్వామ్యాన్ని గుర్తుచేసారు.

పాండవులు లాక్షాగృహంలో మరణించారని తెలిసి ద్రుపదుడు బాధపడ్డాడు. యాగం నిష్ఫలమైపోయిందని అధైర్యపడ్డాడు. కానీ, కృష్ణుడు ఓదార్చడంతో పాండవులు మృతిచెందరని ధైర్యంతో, అతడి సూచనమేరకు మత్స్యయంత్రాన్ని ద్రుపదుడు నిర్మించాడు. లాక్షాగృహం నుంచీ తప్పించుకున్న పాండవులు ఏకచ్ఛత్రపురంలో బ్రాహ్మణవేషంలో ఉంటూ భిక్షాటనతో కాలం గడుపుతున్నారు.

ఓ రోజు ఒక బ్రాహ్మణుడు పాండవులింటికి వచ్చి భోజనంచేస్తూ, ద్రుపదుడు స్వయంవరం ప్రకటించాడని చెప్పాడు. ఆ వార్త తెలుసుకున్నాక పాండవులు కుంతితో సహ బయలుదేరారు. దారిలో చిత్రరథుడి సరస్సులో జలక్రీడలాడాడు. చిత్రరథుడు పాండవులని తెలీక, అవమానంగా మాట్లాడాడు. అర్జునుడు చిత్రరథుణ్ణి ఓడించి, జుత్తుపట్టుకొని ధర్మరాజు పాదాలముందు పడేసాడు. చిత్రరథుడి భార్య పాండవుల్ని క్షమించమని కోరింది. దయతో ధర్మరాజు చిత్రరథుణ్ణి విముక్తుణ్ణి చేసాడు. చిత్రరథుడు వాళ్ళని పాండవులుగా తెలుసుకొని క్షమించమని కోరి, మాయోపాయమైన విద్యను అర్జునుడికి నేర్పాడు. దానికి ప్రతిఫలంగా అర్జునుడు చిత్రరథుడికి ఆగ్నేయాస్త్రాన్ని ఉపదేశం చేసాడు. దగ్గరిలో ఉద్గశమనే తీర్థంలో దేవమునీంద్రుడి తమ్ముడు "ధౌమ్యుడు" ఉంటాడు. అతన్ని కలవమని, పురోహితుడుగా చేసుకోమని, సూచించి చిత్రరథుడు వెళ్ళిపోతాడు. అలాగే పాండవులు చేస్తారు.

కాంపిల్యపురంలో 'భార్గవుడు' (ఒక కుమ్మరిపేరు)ఇంట్లో బస చేస్తారు. చాలామంది మత్స్య యంత్రాన్ని ఛేదించాలని ప్రయత్నించి విఫలమయ్యారు. కర్ణుడి విషయంలో

ద్రౌపది కులగోత్రాలు ప్రకటించమని విల్లు సంధించేసరికి, కర్ణుడు సూతుడని చెప్పాడు. సూతులకు రాజవంశార్హతలేదని మత్స్యయంత్రాన్ని ఛేదించడం విరమించమని చెప్పింది. దుర్యోధనుడు హుంకరించాడు. ధృష్టద్యుమ్నుడు సోదరిపక్షాన ఉండి, 'క్షంతవ్యులం మాసోదరి కోరికని మన్నించడం స్వయంవరలక్ష్యం' అని విన్నవించాడు. చివరికి సభామందిరంలోని రాజకుమారులు ఎవరూ సఫలీకృతులు కాలేకపోయారు.

అప్పుడు బ్రాహ్మణ వేషంలో ఉన్న అర్జునుడు నిలబడ్డాడు. అతణ్ణి చూసిన వెంటనే ధృష్టద్యుమ్నుడు బ్రాహ్మణ వంశంలోని వారు ఛేదించినా కూడా నాతోబుట్టువు నివ్వగలనని ప్రకటించాడు. అర్జునుడు ధౌమ్యులవారికి నమస్కరించి, సభమధ్యకెళ్ళి అందురూ చూస్తుండగా మత్స్యయంత్రాన్ని ఛేదించాడు. ఆకాశంలో దుందుభులు మ్రోగాయి. ద్రౌపది పూలమాలతో అతణ్ణి వరించింది. ఇంతమంది రాజకుమారులుంటే బ్రాహ్మణుడు రాజకన్యని పొందడం జీర్ణించుకోలేని రాజపుత్రులు అర్జునుడిమీదకు ఎదురుదాడి చేసారు. భీమార్జునులు వారందర్నీ ఓడించారు. 'విరోధం పెంచుకోక వివాహంచూసి వెళ్లడం పిలిచినవారందరకీ మర్యాద ఆలోచించండి' అని కృష్ణుడు చెప్పడంతో యుద్ధాన్ని ఆపారు.

ద్రౌపదిని తీసుకెళ్ళాక పాండవులు 'అమ్మా భిక్ష తెచ్చాం' అని కుంతితో అన్నారు. 'కుమారులారా, తెచ్చిన ఆ దేవామృతాన్ని మీరు సమంగా పంచుకొని భుజించండి' అని కుంతి చెప్పి, బయటకివచ్చి నిర్ఘాంతపోయింది. (పుట. 42) చివరికి పాండవులందరూ ద్రౌపదిని పెళ్ళి చేసుకున్నారు. ఆ విషయం విన్న దుర్యోధనుడు, ఆవేశంతో యుద్ధానికి సిద్ధమయ్యాడు. ధృష్టద్యుమ్న, అర్జున, భీమాదులు రంగంలోకి దిగి దుర్యోధనాదుల్ని ఓడించారు.

ధృతరాష్ట్రుడు మంత్రుల సమావేశం ఏర్పాటుచేసి పాండవులకు అర్ధరాజ్యం ఇవ్వాలని నిర్ణయించి విదురుణ్ణి పంపాడు. ధృతరాష్ట్రుడి ఆహ్వానంమేరకు హస్తినాపురానికి పాండవులు వచ్చారు. ఇంద్రప్రస్థాన్ని పాండవులకిచ్చారు. పాండవులందరూ కలిసిగట్టుగా ఉండాలని ద్రౌపది విషయంలో నారదుడి సహాయంతో నియమాలు ఏర్పాటుచేసుకున్నారు. నియమోల్లంఘన చేసినవారు తీర్థయాత్రలుచేసి, రావాలని నిర్ణయించారు. అర్జునుడు ఒక సందర్భంలో నియమ ఉల్లంఘనగా భావించి, తీర్థయాత్రలకి బయలుదేరి, చివరికి సుభద్రతో వచ్చాడు. విషయం తెల్సిన ద్రౌపది నివ్వెరపోయింది. సుభద్ర వచ్చి, ద్రౌపదికి, కుంతికి నమస్కారాలు చేసింది. ఎంతమంది వచ్చినా నీకు గౌరవం తగ్గదని ద్రౌపదికి కుంతి సమాధానపరిచింది. హస్తినలో దుర్యోధనుడికి పాండవులమీద కోపం పెరిగినా ఏమీ చేయలేక మంత్రాలోచనలు చేస్తున్నాడు.

శ్రీకృష్ణుడి సలహాతో ధర్మరాజు రాజసూయయాగాన్ని తలపెట్టాడు. భీమార్జునుల సహాయంతో కృష్ణుడు జరాసంధుణ్ణి వధించేలా చేసాడు. కృష్ణుడు రాజసూయంలో శిశుపాలుణ్ణి వధించాడు. పాండవులమయసభ, యాగవైభవం దుర్యోధనుడికి మరింత కళ్ళుకుట్టేలా చేసింది. అంతేకాక, మయసభలో పాంచాలీబృందంతో పాంచాలీనవ్వు మరింత అవమానానికి గురిచేసింది. అందుకే మాయాజూదం ఏర్పాటుచేసి ప్రతీకారం

తీర్చుకున్నాడు దుర్యోధనుడు. సమస్తాన్ని ధర్మరాజు ఓడిపోయినతర్వాత, ద్రౌపదీ వస్త్రాపహరణ ఘట్టం పూర్తై, మళ్ళీ ద్రౌపది వరాల కారణంగా సమస్తాన్ని ధృతరాష్ట్రుడు పాండవులకి ఇచ్చేయడం జరిగింది.

రెండోసారి జూదంలో వనవాసాన్ని అజ్ఞాతవాసాన్ని ధర్మరాజు పొందాడు. కుంతిని మాత్రం విదురుడి అభ్యర్థనవల్ల అతడింట్లో ఉంచారు. పాండవుల సంతానాన్ని శ్రీకృష్ణుడు సాకాడు. విషయం తెలుసుకున్న ఇంద్రుడు దుర్యోధనాదుల్ని బంధించి బుద్ధి చెప్పాలని గంధర్వ ప్రముఖుల్ని పంపి బంధించాడు. భానుమతివచ్చి ధర్మరాజుని అర్థించింది. ద్రౌపది 'వెళ్ళమనండి' అని చెప్పినట్లు, ధర్మరాజు అర్జునాదుల్ని పంపించినట్లు రచయిత్రి వివరించారు. ద్రౌపది పెట్టిన ప్రాణభిక్షగా దుర్యోధనాదులకు భీమార్జునులు చెప్పారు.

దుర్యోధనుడు పాండవుల్ని అవమానపరిచి భంగపడ్డాక, సత్యాకృష్ణులు పాండవుల్ని చూడడానికి వచ్చారు. సత్యభామకు ద్రౌపది పతివ్రతా లక్షణాలు చెబుతుంది. కామ్యకవనంలో ఉన్నప్పుడు సౌగంధికాపుష్పాలను తెచ్చి, భీముడు ద్రౌపదికి సంతృప్తి కలిగిస్తాడు. మరోసారి పాండవుల్ని అవమానపరచాలని దుర్యోధనుడు దూర్వాసుల్ని పాండవులదగ్గరికి శిష్యమేతగా పంపిస్తాడు. కృష్ణుడి సహాయంతో పాండవులు దూర్వాసుడి శాపం పొందకుండా ఉండగలుగుతారు.

అరణ్యవాసం పూర్తయ్యాక, విరాటనగరంలో అజ్ఞాతవాసం ప్రారంభిస్తారు. కీచకుణ్ణి భీముడు సంహరిస్తాడు. గూఢచారులుద్వారా కీచకుడి మరణాన్ని దుర్యోధనుడు తెలుసు కున్నాడు. అక్కడే పాండవులున్నారని అనుమానిస్తాడు. అందుకే గోగ్రహణానికి సిద్ధపడతాడు. అప్పటికే అజ్ఞాతవాస సమయం పూర్తవుతుంది. అర్జునాదుల సహాయంతో విరాటుడు విజయం సాధిస్తాడు. పాండవులు తమ స్వవేషాల్ని బయటపెడతారు. విరాటరాజు తన కూతురు ఉత్తరని అర్జునుడికొడుకు అభిమన్యుడికిచ్చి వివాహం చేస్తాడు.

దుర్యోధనుడు రాజ్యభాగం ఇవ్వడని ప్రజలంతా భావించారు. అయినప్పటికీ ద్రుపదుడు తన పురోహితుణ్ణి పాండవుల రాయబారిగా పంపారు. సంజయరాబారం పూర్తయ్యింది. కృష్ణ రాయబారంతో యుద్ధవేదిక సిద్ధమైంది. కృష్ణుడిసైన్యం కౌరవపక్షం, కృష్ణుడు పాండవపక్షం వహించారు. శల్యుణ్ణి దుర్యోధనుడుతనవైపుతిప్పుకున్నాడు. యుద్ధ సన్నాహాలు పూర్తయ్యాయి. కురుక్షేత్రయుద్ధం ప్రారంభమైంది. అభిమన్యుడు బలైపోయాడు. భీష్ముడు బలైపోయాడు. ద్రోణుడు అస్త్ర సన్యాసం చేసాడు. భీముడు దుశ్శాసనుణ్ణి చంపి, దుర్యోధనుడి తొడలు విరగ్గొట్టాడు. అశ్వత్థామ ఉపపాండవుల్ని శయ్యామందిరంలో చంపేసాడు. ఉత్తర గర్భస్థ శిశువుని చంపే ప్రయత్నం జరిగింది. తర్వాత కృష్ణుడు ఉత్తరకొడుకుని బతికిస్తాడు. అతడే పరిక్షిత్తు. అశ్వత్థామ తన శిరోభూషణాన్ని తీసి భీముడికిచ్చి తపోవనాలకు వెళ్ళిపోతాడు. యుద్ధం పూర్తయ్యింది.

పాండవులు కృష్ణుడితో సహా హస్తినకు చేరారు. ధృతరాష్ట్రుణ్ణి కలిసారు. ఉక్కు విగ్రహ భీముణ్ణి ధృతరాష్ట్రుడు తుత్తునియలు చేసాడు. గాంధారి కురుక్షేత్ర యుద్ధానికి

కృష్ణుడే కారణమని, మీకులం మీవల్లే నాశనమౌతుందని శపించింది. భీముణ్ణి గాంధారి తిట్టింది. గాంధారిని ద్రౌపది సమీపించి యుద్ధానికి తనే కారణమని అందరూ నిందిస్తున్నట్లు చెప్పింది. లోకంలో స్త్రీల బాధలకి నేనా కారణం? అని ద్రౌపది గాంధారిని అడిగింది. ఊరుకో తల్లీ ఏడవకు. నీకు పరాభవం చేసినప్పుడు ఆపలేని వీళ్ళు నిన్ను అనడానికి హక్కు లేదు. నువ్వే బాధ్యురాలవని అనుకోడం వాళ్ళ ఆత్మసంతృప్తికి కారణమని గాంధారి ద్రౌపదిని ఓదారుస్తుంది.

ఉత్తరగర్భాన పరీక్షిత్తు పుట్టి పెద్దయ్యాక, వాడికి ధర్మరాజు పట్టాభిషేకం చేసి మహాప్రస్థానానికి బయలుదేరినప్పటి విషయాల్ని ధర్మరాజు గుర్తుకుతెచ్చుకుంటాడు. ద్రౌపది జీవితంలో జరిగిన ఒడిదుడుకుల్ని తట్టుకొని జీవన యానాన్ని సాగించిన తీరుని రచయిత్రి ఈ నవల్లో వివరించారు.

### 1. 8. 6. *ద్రౌపది* :-

### 1. 8. 6. 1. రచయిత పరిచయం :-

హిందీ, తెలుగు భాషల్లో డాక్టరేటు పొందిన యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ ఈ నవలని రాసారు. ఇరవైకి పైగా రచనలుచేసాడు. అతిచిన్న వయస్సులో కేంద్రసాహిత్య అకాడమీ అవార్డులు అందుకున్నారు. ఆంధ్రవిశ్వవిద్యాలయంలో రెండుదశాబ్దాలుగా హిందీ విభాగంలో అధ్యాపకులుగా పనిచేసారు. రాజ్యసభకు సభ్యులుగా కొన్నాళ్ళున్నారు. విద్యా, సాహిత్య రంగాలలో సేవకుగాను భారతప్రభుత్వం 'పద్మశ్రీ' తో సత్కరించింది. అనేక దేశాలు పర్యటించి ఉపన్యాసలిచ్చారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ హిందీ అకాడమీ అధ్యక్షులుగా ఉన్నారు. ఈ నవలకు 2009 సం.లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందింది.

కేంద్ర సాహిత్య అకాడమీ వారు 1991 లో విష్ణూ సఖారాం ఖాండేకర్ మరాఠీలో రాసిన యయాతి నవలని హిందీ నుంచి తెలుగులోకి అనువదించే పనిని యార్లగడ్డవారికి అప్పగించారు. ఆ నవలలోని పాత్రల స్వీయ అనుభూతుల వ్యక్తీకరణ యార్లగడ్డను అబ్బురపరిచింది. ఆ ప్రేరణతో ద్రౌపది పాత్రని నవలారూపంలో వస్తే బాగుంటుందని ఆ ప్రయత్నంలోని భాగంగా ఈ నవలని రాసారు.

పరిశోధనాత్మకంగా ప్రయత్నించి మానవీయకోణంలో ద్రౌపది పాత్రని చూస్తూ, సేకరించిన అంశాల్ని దృష్టిలో పెట్టుకొని, అధ్యయనం చేసి అన్ని అంశాలను పరిశీలించి, పాత్రలస్వభావాల్ని తీర్చిదిద్దారు. ఇది 270 పుటలున్ననవల. ఇది ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధంలో ధారావాహికగా ప్రచురణ పొందింది. ఈ నవలమీద చాలా చర్చలు జరిగాయి. పురస్కారాలూ, తిరస్కారాలూ వచ్చాయని రచయితే ముందుమాటలో చెప్పాడు.

### 1. 8. 6. 2. ఆవశ్యతః-

మహాభారతంలోని ద్రౌపదిగతజన్మలచరిత్రచూస్తే,ఆదిపర్వం పంచేంద్రోపాఖ్యానంలో నాలాయినిగా, మౌద్గల్యముని భార్యగా, తనసేవలతో భర్తని మెప్పించింది. ఆ సేవలకుగాను

మౌద్గల్యముని వరాన్ని కోరుకోమన్నాడు. చాలా అసహ్యంగా ఉండే ఆ మునిని మనోహరంగా కామసుఖాన్ని తీర్చమని కోరింది. మౌద్గల్యముని ఐదు రూపాల్లో ఆమె కామ వాంఛను తీర్చే ప్రయత్నం చేసాడు. అయినప్పటికి, పూర్తిగా ఆమెతృప్తి చెందలేదు. కాశీరాజ కుమార్తెగా పుట్టి తపస్సుచేసి మరో జన్మలో ఐదుగురు పతులుండేలా వరాన్ని పొందింది. తర్వాత జన్మలో ద్రుపదుడి కూతురుగా పుట్టింది.

గతజన్మల్లోని కామవాంఛ, సంసార సుఖం ఎంతవరకూ తీరాయి? దాని ఫలితాలు ఎలా ఉన్నాయి? ఆమె ఆత్మవిశ్వాసం, సౌశీల్యం మొదలైన గుణాలన్నిటిని రచయిత దృష్టిలో ఉంచుకున్నారు. ద్రౌపది మానసిక వేదన, ఆనందం, ఆసక్తి, ఉద్వేగం, ప్రేమ, ఇష్టత మొదలైన అంశాల్ని ఈ నవలలో ఆవిష్కరించే ప్రయత్నం చేసారు. ఎవరికోసం ఈ మహాసంగ్రామం అంటూ ప్రారంభించారు. ఎవరిని నేను, ఏది జీవన ధర్మం, ఏది ధర్మనిర్ణయం, ద్యూతక్రీడాసక్తివల్ల ప్రయోజనం ఎంత, భార్యా రక్షకుడెవరు? ఎంతవరకు రక్షించగలడు, కృష్ణతత్త్వం, స్త్రీమానసిక స్థితిలాంటి వాటిని ఈ నవలలో సమగ్రంగా చర్చించారు. ఈ అంశాలమీద ఒక స్పష్టమైన అభిప్రాయం పాఠకుడికి కలిగించే ప్రయత్నం చేసారు.

### 1. 8. 6. 3. కథాసంవిధానం :-

ఎవరికోసం ఈ మహాసంగ్రామం అంటూ కురుక్షేత్ర యుద్ధాన్ని ప్రశ్నిస్తూ ప్రారంభించారు. ఈ యుద్ధం వెనక ఉన్న అసలు కారణాలు ఏంటో ఆలోచించేందుకు ఈ విధానం అవసరంలా కనిపిస్తోంది. నిజమైన అంశం శ్రీకృష్ణుడి వేణుగానంలో లీనంకావడం ఇది ముగింపు. రచయిత నవలలో సాధించదలచుకున్న లక్ష్యం భగవదైక్యంగా కనబడుతోంది. కురుక్షేత్ర యుద్ధం పూర్తయిన మర్నాడు విరాటసామ్రాజ్యం, మత్స్యనగరి, ఉపప్లావ్యం ఎక్కడ చూసినా తెల్లచీరలు కట్టుకున్న విషాదంలో ఉన్న ముఖాలే కనిపిస్తాయి. ఇది యుద్ధపు పరాకాష్ఠ ఫలితం. మిగిలిన ఆ స్త్రీలు ఈ సామ్రాజ్యాన్ని ఏలవలసిన అవసరం ఏంటి? అని ఉద్విగ్నతతో ద్రౌపది ఎవరికోసం ఈ సంగ్రామం అని దుఃఖించడం, పాఠకుణ్ణి కలచివేసే స్థితికి తెస్తోంది. ఇక్కడ నుంచీ ప్రారంభించిన మానవీయ కోణం సమస్త స్త్రీ జాతికి అన్వయించేలా వివరిస్తూనే, ప్రశ్నించడం అంతర్భాగంగా సాగుతోంది. మానసిక వేదన, వివాహం పేరిట పడ్డ మానసిక దౌర్బల్యం, ద్రౌపది పౌరాణిక పాత్ర అనే స్పృహను కోల్పోయేలా చేస్తోంది. ఇలా ద్రౌపదిని ఆమె వ్యక్తిత్వాన్ని సామాన్యస్త్రీ కోణంలో రచయిత విశ్లేషించారు.

### 1. 8. 6. 4. సారాంశం :-

ఈ సంగ్రామం ఎందుకంటూనే, జరిగిన విషయాలమీద బాధపడడం ఈ నవలో ద్రౌపది తత్త్వం. ఉపపాండవుల మరణంతో కుంగిపోయిన ద్రౌపదికి గతమంతా ఓ కలలా కనిపించడం అవమానాల దొంతరలు, బాధని పంచుకోలేని భర్తల స్థితి ఈ నవలలో ద్రౌపది అవస్థలుగా చెప్పవచ్చు.

సింధురాజు, జయద్రధుడు, ద్రౌపదిని ఎత్తుకెళ్ళిన తర్వాత అతణ్ణి అవమానించాక, మరింత పగ పెరిగింది. జయద్రధుణ్ణి చంపాక దుస్సల వచ్చి, "నీ ఆడపడుచు ఉసురుగొని సంపాదించిన రాజ్యం దేనికి?" అని అర్జునుణ్ణి తూలనాడింది.(పుట. 37) ధృతరాష్ట్రుడు భీమ విగ్రహాన్ని (భీముడిమీద పట్టరానంతకోపంతో కృష్ణుడు ఏర్పాటుచేసిన విగ్రహం) తునాతునకలు చేసి పగ తీర్చుకున్నట్లు భావించాడు.

యుద్ధంలో చనిపోయిన వీరులందరికీ ధర్మరాజాదులు అగ్ని సంస్కారాలు చేసారు. కర్ణుడికి కూడా తిలోదకాలు ఇమ్మని, అతడు తన కుమారుడే అని కుంతి భోరున ఏడ్చింది. కర్ణుడు తన సోదరుడని తెలిసి, ఈ విషయం ముందుగా తెలిస్తే ఈ మహా సంగ్రామమే జరిగేదికాదని, ధర్మరాజు బాధ పడ్డాడు. ఇలా రచయిత బాధ, ఉపశమనాలను వివరిస్తాడు.

స్వయంవరంలో అర్జునుడు ద్రౌపదిని గెలుస్తాడు. కర్ణుణ్ణి సూత పుత్రుడు అని ద్రౌపది అనడంవల్ల అతడు మథనపడతాడు. ఈ విషయాన్ని మనసులో ఉంచుకొని కొంతవరకు దుర్యోధనుణ్ణి తన మీదకు పురిగొల్పినట్లు ద్రౌపది భావిస్తుంది. పాండవులు ద్రౌపదిని పెళ్ళాడాక ఒక్కోరాత్రికి ఒక్కొకరితో గడిపడం కొత్తకొత్తగా భావిస్తుంది. రాజసూయం తరవాత మరింతగా కౌరవులకు కళ్ళు కుట్టినట్లవుతుంది. అందగత్తె అయిన ద్రౌపదిని చూసాక, దుర్యోధనుడు ఆమెని పొందాలి లేదా అవమానపరచాలి అని తన పథకం తాను వేసుకుంటాడు. దానికి సహాయకులూ ఉన్నారు.

మాయాజూదంలో సమస్తం ధర్మరాజు కోల్పోతాడు. 'తనను ఓడిపోయి, ధర్ముడు ద్రౌపదిని ఓడాడా?' అన్న ప్రశ్నకి సభలోనివాళ్ళు సమాధానం చెప్పరు. దుర్యోధనుడు ద్రౌపదిని అవమానపరుస్తాడు. దుశ్శానుడు సహకరించి వస్త్రభంగానికి సిద్ధపడతాడు. విదురుడి మాటలకి ద్రౌపది చేతులెత్తి నమస్కరిస్తుంది. విదురుడికోపం వ్యాసుడి కోపంగా భావించిన ధృతరాష్ట్రుడు ద్రౌపదిని ఓదార్చి, వరాలు కోరుకోమంటాడు. పైగా రెండోసారి ధర్మరాజు జూదంలో ఓడిపోయి, అతడే పాండవులు అడవులపాలవ్వడానికి కారకుడౌతాడు.

కృష్ణుడు వచ్చి కామ్యకవనంలో పాండవుల్ని కలుస్తాడు. దాంతో కొంత ఉపశమనం కలుగుతుంది. పాండవులకు ధృష్టద్యుమ్నుడు తనతోపాటు ధాత్రేయిక అనే పరిచారికని తెచ్చి ద్రౌపదికి సహాయంగా ఉంచి వెళ్లిపోతాడు. పాండవులు ద్రౌపది విషయంలో పెట్టుకున్న నిబంధనవల్ల అర్జునుడు ఆయుధాగారానికి వచ్చినప్పుడు ధర్మరాజు ద్రౌపది ఏకాంత సమయానికి భంగం కలుగుతుంది. దాంతో ఏడాది పాటు తీర్థయాత్రలు చేయడానికి వెళ్ళి, దారిలో ఉలూచి, చిత్రంగదలను పెళ్ళాడి, పిల్లలు పుట్టేక అక్కడే వాళ్లను ఉంచేస్తాడు. కానీ, సుభద్రని పెళ్ళి చేసుకుని తీసుకువస్తాడు. ద్రౌపది మానసికంగా కొంత బాధపడిన కృష్ణుడి మాటలవల్ల ఉపశమనం పొంది, ఆనందాన్ని అనుభవిస్తుంది.

పాండవులు వనవాస సమయంలో అర్జునుడు తపస్సుచేసి, శివుణ్ణి మెప్పించి పాశుపతాస్త్రాన్ని సంపాదిస్తాడు. అర్జునుడు ఇంద్రుడితో పాటు సింహాసనం మీద కనిపించాడని, ఊర్వశి ప్రేమని తిరస్కరించాడని 'రొమహర్షి' ద్వారా పాండవులు విని

ఆనందిస్తారు. భీముడి రక్షణలో ద్రౌపది సుఖంగానే ఉంటుంది. సహస్ర దళాలతో కూడిన ఎర్రకలువలు, సౌగంధిక పుష్పాలు భీముడివల్ల పొంది ఆనందిస్తుంది. ఈ అంశాలు సామాన్యస్త్రీ ద్రౌపది అనే విషయాన్ని సూచిస్తున్నాయి.

సత్యభామతో కృష్ణుడు పాండవుల్ని చూడడానికి వచ్చాడు. ఐదుగురు భర్తలు ద్రౌపదిని ప్రేమగా చూసుకోడం ఎలాసాధ్యమైందని, సత్య అడుగుతుంది. పరస్పర ప్రేమానురాగా లుండాలి, మరో పురుషుడిమీద స్త్రీకి మనస్సుండకూడదు. ఆకర్షణ నిలుకుంటూ బాధ్యతల్ని గుర్తిస్తూ, మృదువుగా ఉండాలని తనకు తెలిసిన రహస్యాల్ని ద్రౌపది చెబుతుంది.

తృణబిందు ఆశ్రమంలో కోటికాస్యుడితో సైంధవుడు వచ్చి. ద్రౌపదిని రథాన్నెక్కించి తీసుకెళ్ళడం, వాడికి తగిన విధంగా అవమానపరిచి, పాండవదాసుడిగాచేసిన విషయాన్ని ద్రౌపది తలచుకుంటుంది. అజ్ఞాతవాసంలో చివరినెలలో సుధేష్ణ కీచకుడింటికి మధిర తేవడానికి ద్రౌపదిని పంపిస్తుంది. సైరంధ్రి కీచకుడికి చిక్కేసమయంలో అతణ్ణి తోసేసి విరాటరాజకొలువుకి చేరి, రక్షించమంటుంది. విరాటరాజకొలువులో కీచకుడు సైరంధ్రిని కాలితో తంతాడు. విరాటరాజు సభామర్యాదల్ని పాటించమని కీచకుణ్ణి అభ్యర్థిస్తాడు. భీముడికోపం ధర్మరాజు శాంత వచనాలకి ఆవిరైపోతుంది. పథకంవేసి కీచకుణ్ణి భీముడు అంతంచేస్తాడు. ఉపకీచకుల్ని చంపేస్తాడు.

సైరంధ్రికి గంధర్వభర్తలు కీచకున్ని చంపారని సుధేష్ణ భయపడిపోతుంది. ఇంకా అంతఃపురంలో ఉంటే ఏ రకమైన కీడు వస్తుందో అని వాపోతుంది. పదమూడురోజులు ఇక్కడే ఉండడానికి అనుమతి కోరి, విరాటరాజ్యానికి ఏ రకంగానూ కీడురాదని సైరంధ్రి సుధేష్ణను అభ్యర్థిస్తుంది. కీచకుడి మరణవార్త కౌరవులకి తెలుస్తుంది. అక్కడే పాండవు లున్నారని అనుమానిస్తారు. ఒకవేళ వాళ్ళున్నట్లయితే, వాళ్ళ విషయం తెలిసి మళ్ళీ అరణ్య, అజ్ఞాత వాసాలు చేయించవచ్చని, లేనిపక్షంలో కీచకుడు లేకపోడంవల్ల విరాటరాజ్యం బలహీనపడి నందువల్ల వశపరుచుకోవాలని దుర్యోధనుడు భావించాడు. అందుకే గోగ్రహణానికి తగిన పథకం వేస్తాడు.

పథక రచన అమలులోకి వచ్చేసరికి పాండవుల అజ్ఞాతవాస కాలం పూర్తైపోయింది. యుద్ధంలో పాండవ సహాయంవల్ల విరాటుడు విజయం పొందాడు. ఈ యుద్ధం పాండవుల దివ్యాస్త్రాల ప్రదర్శనకి ఉపయోగపడింది. పాండవులే తన కొలువులో ఉన్నారని తెలిసిన విరాటరాజు ఆనందపడ్డాడు. చివరకి ఉత్తరనిచ్చి అభిమన్యుడితో వివాహం ఘనంగా చేసాడు. ఈ వివాహం పాండవులకి బలపరీక్షావేదిక అయింది. వివాహానంతరం ఉపప్లావ్యం చర్చావేదికగా మారింది. ద్రుపదుడు తన పురోహితుణ్ణి కౌరవులదగ్గరికి రాయబారానికి పంపాడు. ప్రతిగా సంజయుణ్ణి ధృతరాష్ట్రుడు పంపాడు. చివరికి కృష్ణ రాయబారంతో యుద్ధం నిశ్చమైంది.

ఇరువైపులా సైన్యసమీకరణ జరిగింది. మహాభీకర సంగ్రామం పద్ధెనిమిది రోజులు జరిగింది. ప్రతిజ్ఞలు నెరవేరాయి. ప్రాణనష్టం అపారం. శ్మశానంలో అగ్నికీలలు చల్లారేక, హస్తినకి పాండవులువచ్చి, హోమాగ్నులు ప్రజ్వలింపచేసారు. రాజసూయంలో రాజులందరూ పాండవులకు దాసులవుతారు. రాజ్యవిస్తరణకోసం అశ్వమేధయాగం పూర్తయ్యింది. అర్జునుడు జైత్రయాత్ర చేస్తాడు. ఉలూచి, చిత్రాంగదలతో పెళ్ళి వారికి కుమారులు పుట్టారు. తిరిగి వచ్చేటప్పుడు సుభద్రని తీసుకువచ్చాడు.

ద్రౌపది మనస్సుకు నచ్చిన అర్జునుడు, నావాడు కాదని ద్రౌపది భావిస్తుంది. ఈ విషయాన్నే అర్జునుడితో చెబుతుంది. అప్పుడు అర్జునుడు నీకు సాటి ఎవరూ రారని ద్రౌపది అందాన్ని పొగుడుతాడు. పరీక్షిత్తు ముద్దుముద్దు అడుగులతో, ఆటపాటలతో అంతఃపురం అలరించిపోతుంది. పదిహేను వసంతాలు పూర్తయ్యాక గాంధారి, ధృతరాష్ట్రులతో పాటు కుంతి, విదురులు వానప్రస్థానానికి వెళ్ళిపోతారు. హస్తినలో ఏదో వెలితి చోటుచేసుకున్నట్లువుతుంది. ఒకరోజు అరణ్యంలో కార్చిచ్చు వ్యాపించి వృద్ధులంతా అగ్నికి ఆహుతులయ్యారని పాండవులకి తెలిసి హతాశులౌతారు. మరో రెండు దశాబ్దాలు గడుస్తాయి.

కృష్ణుడి సాన్నిధ్యంలో చరమజీవితాన్ని గడుపుదామని ద్రౌపది అనుకుంటుంది. ఆమె కృష్ణుడి ధ్యానంలో నిమగ్నమౌతుంది. కృష్ణనిర్యాణ విషయం పాండవాదులకి తెలుస్తుంది. యాదవులు ఒకరినొకరు సంహరించుకున్నారు. రుక్మిణి, హైమవతి, జాంబవతి అగ్ని ప్రవేశం చేసారు. సత్యభామ వానప్రస్థానం స్వీకరించి కృష్ణుడి ధ్యానంలో మునిగిపోయింది. కృష్ణుడి సతీమణులు, ద్వారకలోని స్త్రీజనాన్ని తీసుకువచ్చేద్దామని వెళ్ళిన అర్జునుడు, దారిలో చోరుల్ని ఎదిరించలేకపోయాడు.

కృష్ణుడే 'అర్జునుడికి శక్తి' అని ద్రౌపదికి అర్థమైంది. కృష్ణుడి రూపంతో పాటు అర్జునుడి శక్తికూడా హరించుకు పోయింది. చరిత్రతోపాటు ద్వారక జలసమాధి అయింది. ధర్మరాజు హస్తినపుర, ఇంద్రప్రస్థాలకు పరిక్షిత్తును, యాదవవంశంలో మిగిలిన వజ్రుణ్ణి రాజులుగా చేసాడు. తరువాత వానప్రస్థానానికి తమ్ములు, ద్రౌపదితో సహా ధర్మరాజు బయలుదేరాడు.

ఆహారం, నిద్ర, భయం, మైధునం ఈ నాలుగు అన్ని జీవరాశులకీ సమానం. వీటికంటే అతీతమైన జీవితం నేను అనుభవించేనా? అని ద్రౌపది ఆత్మపరిశీలన చేసుకుంటుంది. ధర్మరాజుకి రాజకార్యాల్లో సాయం చేసింది. అర్జునుడి పట్ల ప్రేమ ప్రదర్శిస్తే ధర్మరాజు బాధపడ తాడని, ఆ ప్రేమని కనబడకుండా ధర్మరాజుని శృంగార రసప్రవాహంలో ఓలలాడించింది.

శృంగారంలో విజృంభించగలిగే శక్తి ఉండికూడా ద్రౌపది ఎక్కడ కందిపోతుందో అని మృదువుగా స్పృశించే భీముడు ద్రౌపది కోసం ఏమైనా చేస్తాడు. ద్రౌపది సంతోషమే తన సంతోషంగా భావించిన వ్యక్తిగా 'భీముణ్ణి' ద్రౌపది భావించింది. అందుకే అతడి కౌగిలిలో

మైనపు ముద్దలా కరిగిపోయేది. ఇలా అర్జునుడి విషయాన్ని, నకుల సహదేవుల విషయాల్ని పునఃసమీక్ష చేసుకుంటుంది. పాండవులు హిమాలయపర్వతాలకు చేరుకుంటారు. అక్కడే పాండవులు పుట్టారు. ద్రుపదరాజకన్యకు ముందు తనుకూడా అక్కడే కొంతకాలం ఉన్నట్లు కృష్ణద్వైపాయనుడు చెప్పిన విషయాన్ని ద్రౌపది గుర్తుకు తెచ్చుకుంటుంది.

ద్రౌపదికి కాళ్ళు తడబడి కిందకి పడిపోతుంది. పాండవులు ఆమెకి కనుమరుగౌతున్నారు. జారింది. మళ్ళీ మోకాళ్ళమీద కూర్చొని లేచి నిలబడింది. పర్వతాగ్రాన మేఘాలు చేయూత నిస్తాయోమోనని ద్రౌపది చేతులుచాచింది. అడుగులు పడలేదు. లీలగా ద్రౌపది కిందపడి మరణిస్తోందని భీముడన్న మాటలు వినబడ్డాయి. మరణించనీ, ఆమెకు అర్జునుడిమీద ప్రేమ ఎక్కువ. అందుకే ముందుగా మరణిస్తోంది అని ధర్మరాజు మాటలు ప్రతిధ్వనించాయో, లేక అంతరంగ ఘోషో ద్రౌపదికి అర్థంకాలేదు. భీమసేనుడు ద్రౌపదిని ఒడిలోకి తీసుకొని నోట్లో నీరుపోసి, ప్రేమగా హత్తుకొని చల్లగా మారుతున్న పెదాల్ని స్పృశించడం వరకే ద్రౌపదికి గుర్తుంది. అ తర్వాత అనంతవాయువుల్లో లీనమవుతున్న వేణుగానంలో ద్రౌపది ప్రాణాలు లీనమయ్యాయి. చివరిగా ఆమె గుండె ధ్వనిలో 'కృష్ణా' అన్న పదమే ధ్వనించింది.

ఇలా ద్రౌపది వ్యక్తిత్వం, ఆమె భర్తలమీద చూపించిన సేవాపరాయణత, కృష్ణ సఖిగా, కుంతికి తగిన కోడలిగా బహుపార్శ్వాల్లో కనిపిస్తోంది. ద్రౌపది అనుభూతుల్ని పాఠకులకు పంచినట్లు రచయిత వర్ణించాడు. భార్యగా, భర్తకు ఎన్నో విధాలుగా సహకరించింది. ఆమెను ప్రేమకు పరాకాష్టగా ఈ నవలలో చూడొచ్చు. ఒక భర్తనే సరిగ్గా చూసుకోలేని భార్య; ఒక భార్యనే సరిగా చూసుకోనే భర్తలకి ఈ నవల ఓ సందేశాన్ని ఇస్తుంది. కుటుంబజీవనంలో కట్టుబాటు, సర్దుకుపోయో స్వభావంలేనివాళ్లు చాలామంది ఉన్నారు. ప్రేమని పంచుతూ, పెంచుతూ ఒక ఉదాత్త స్థానాన్ని చేరుకోడంతో పాటు లైంగిక అవసరాన్ని విశ్లేషిస్తూ, భార్యాభర్తలు దగ్గరిగా ఉండే అవసరాన్ని సూచిస్తోంది. ఈ నవల మానవకోణాలను దర్శించేలా చేస్తూందనడంలో సందేహంలేదు.

### 1. 8. 7. పర్వ నవల

భారతీయ నవలా రచయితల్లో ప్రముఖుడు యస్.యల్. బైరప్ప. ఇతడు రాసిన నవల 'పర్వ'. వ్యాస భారతాన్ని అధ్యయనం చేసి, కురుక్షేత్ర యుద్ధం జరిగిన ప్రదేశాలు, అక్కడున్న ప్రజల జీవన విధానాలు తెలుసుకుని 1971సం. నుంచి పరిశోధనకు శ్రీకారం చుట్టారు. తే 02-10-1975ది నుంచి 17-12-1976 వరకు , ఒక సంవత్సరం రెండు నెలల కాలంలో ఈ నవలను పూర్తిచేసారు.

### 1. 8. 7. 1. నేపథ్యం ః-

రచయిత మహాభారతం అధ్యనంచేస్తున్నప్పుడు భారత కథావాస్తవాలపట్ల ఉన్న సొంత ఊహలు, ఆలోచనలు 1966సం. చిక్కమంగలూరులో డా. నారాయణప్పతో చర్చించినప్పుడు ఒక స్పష్టమైన రూపం దాల్చింది. దాన్ని ఒక నవలగా రాయమని నారాయణప్ప సూచించారు. ఆ తర్వాత సంవత్సరం ఆశ్వయుజ, కార్తీక మాసాల్లో

హిమాలయాల్లో 'గవాల్' భాగంలో సంచరించినప్పుడు "బహుపతీపద్ధతి" ఉన్న చిన్నపల్లెలో రచయిత నిద్రించారు. ఈ పద్ధతి ద్రౌపది కాలంనుంచీ వస్తోందని, రెండు తాలూకాల్లోని పల్లెల్లో ఈ పద్ధతి ఇంకా ఉందని రచయిత తెలుసుకున్నాడు.

బదరి, జోతిర్మఠాల మధ్య లోయలో ఉన్న పాండుకేశ్వరాలయానికి వెళ్ళి, స్థలచరిత్ర విన్నాక, మహాభారతంలోని కొన్ని పాత్రలపట్ల అంతకుముందున్న ఊహలు చెదిరాయి. అప్పటి నుంచి వ్యాస భారతాన్ని, వేదసంస్కృతిని, ఆర్థిక, రాజకీయ, ధార్మిక, సామాజికాది అంశాలను కలుపుకుని రచయిత అధ్యయనం చేసారు. చాలామంది వ్యక్తుల్ని కలసి వారి సలహాలు, సూచనలు తీసుకుని మైసూరు 'రామకృష్ణ ఆశ్రమం'లో వేదాంత కళాశాలలోని ఒక గదిలో ఈ నవలను రాయడం ప్రారంభించారు.

### 1. 8. 7. 2. నామసార్థక్యం ః-

'పర్వ' పేరును 'శ్రీనాయక' గారు సూచించినట్లు రచయిత 'యస్.యల్. బైరప్ప' ముందుమాటలో చెప్పారు. 'పర్వ' పదానికి చాలాపర్యాయపదాలున్నాయి. వాటిలో కొన్ని ఈ నవలకు సరిపోతాయి. 'పరవస్తు శ్రీనివాసాచార్య' రాసిన "సర్వ శబ్ద సమ్బోధిన్యాఖ్యోయం సంస్కృత నిఘంటుః" అనే నిఘంటువులో "అవసరము, కళ్యాణం, కొప్పుముడి"(పుట.531) అని అర్థాలున్నాయి. జి.యన్. రెడ్డి రాసిన "తెలుగు పర్యాయ పద నిఘంటువు"లో 'గంటు' అని పర్వ పదానికి మరో అర్థముంది.(పుట.28) ఈ అర్థాలు ఈ నవలకు ఎలా అన్వయిస్తాయో చూద్దాం-

"అవసరము"అనే అర్థం పర్వపదానికి చెప్పుకుంటే సామాజిక అంశాలతో మహాభారతాన్ని చూసినవారికి ఈ నవలను చదవడం, మహాభారతంలోని చాలా విషయాల్ని అవగతం చేసుకునే అవసరాన్ని తెలుపుతోంది. ఇది చదవకపోతే మనసంస్కృతిని చారిత్రక ఆధారాలతో తెలుసుకోని వారిగా ఉంటాం. కాబట్టి మహాభారతం అంతా చదవక పోయినా ఈ నవల చదివితే చాలునని ఈ పదం సూచిస్తోంది.

"కళ్యాణం" అనే అర్థం చెప్పుకున్నప్పుడు కుంతి, ద్రౌపది, సుభద్ర, ఉత్తరల కళ్యాణ ఘట్టాలు ప్రధాన భూమికను పోషించాయి. ద్రౌపది కళ్యాణం పాండవుల ఐక్యతకు, సుభద్రకళ్యాణం కృష్ణుడి సహాయానికి ప్రతీకలు. 'ఉత్తర' కళ్యాణం పాండవుల ఉనికిని చాటి లోకకళ్యాణానికి, దుష్ట వినాశనానికి దారి తీసిందని ఈ పదం ద్వారా చెప్పవచ్చు.

"కొప్పుముడి" అనే పదం ద్రౌపది జుత్తును దుశ్శాసనుడు పట్టి లాగడం, ఆ తర్వాత ఆమె జుత్తును(యుద్ధం పూర్తయ్యేవరకు) కొప్పును ముడి వేయకపోవడంద్వారా రాబోయే యుద్ధ వాతావరణాన్ని బీజప్రాయంగా సూచిస్తోంది.

"గంటు" అని అర్థం మహాభారతాన్ని మథించి, లేదా శోధించి తార్కిక, హేతుబద్ధ, చారిత్రక అంశాల్ని వాస్తవికదృష్టిలో క్రోడీకరించిన ఒక మధురపానీయాన్ని రచయిత గంటుపెట్టి మనకు పోస్తున్నట్లు లేదా అందిస్తున్నట్లు ఈ పదం సూచిస్తోంది. భారతంలోని

ప్రతిపాత్ర మనస్సు లోనూ అసంతృప్తి అనే గంటు కనిపిస్తుంది.

మూల మహాభారత భాగాల్ని 'పర్వాలు' గా విభాగం చేసాడు. ఈ నవలలో భారతంలోని పర్వాల్ని ఏక పర్వంలో లేదా పర్వాలసారం ఒక పర్వరూపంలో అందించినట్లు చెప్పవచ్చు. ఇలా 'పర్వ' పేరు సార్థకమైంది.

### 1. 8. 7. 3. రచయిత అనుభవం :-

"నేను రాస్తున్నది భారతం కాదు. మానవ అనుభూతికి చెందిన వివిధ ఆముఖాలు. రూపాలు, మానవ సంబంధ స్వరూప, వివేచనలనే స్పృహ నాకు చివరిదాకా ఉంది. ఒక్కో కొత్తపాత్రలో, సన్నివేశాల్లో రాస్తున్నప్పుడు వాటి కొత్త కొత్త వివరాలు, రూపురేఖలు దృగ్గోచర మవుతుండేవి. విషయసమీకరణ, సంసిద్ధతలప్పుడు కొన్నిమజిలీలలో నాఊహకు సాక్షాత్క రించిన దానికంటే, అభివ్యక్తి నవలగా ఇది పొందిన స్వరూపం, అంతర్లీనమైన అర్థాలు పూర్తి భిన్నంగా వచ్చాయి" అని ముందుమాటలో వివరించారు.

భిన్నమైన అంశాలు మార్పు చేర్పుల్లో రచయిత కొత్తభావాల్ని మన దేశ విశ్వాసాలకు తగినట్లు వివరించే ప్రయత్నం చేసారు. భారతదేశ విశ్వాసాలకు మూలం సంప్రదాయం. అయితే వీటన్నిటిని వదిలి జీవితపుచివరి దశను 'చావు' దృష్టితో చూస్తే కొత్త అవగాహన కలుగు తుందిని రచయిత ఉద్దేశం. కురుక్షేత్ర ప్రదేశాన్ని రచయిత సందర్శిచాడు. దానిస్థితిని చూసాక, ఆర్య ప్రజలు వారి సంపర్కంలో వచ్చినవారు, వారి కాలంలోని ఆర్యేతర ప్రజల జీవితాల మధ్య ఘర్షణే ఈ కురుక్షేత్రం యుద్ధంగా పరిణమించి ఉంటుందని వెల్లడించారు.

### 1. 8. 7. 4. కథాసంవిధానం :-

మద్రదేశపు రాజు శల్యుడు. అతని మనవరాలు హిరణ్యవతి. వీరిద్దరి సంభాషణతో నవలలోని కథ మొదలయింది. 'ఆచారాలు' వారిద్దరిమధ్య సంభాషణాంశం. ఇదే కథకు అంతస్సూత్రంగా చివరికి యుద్ధంగా పరిణమిస్తోంది. పాతకాలంనాటి ఆచారాలు మరచి, కొత్త ఆచారాలు ఏర్పాటు చేసుకొని పాతవాటిని ప్రశ్నించే స్థితిని రచయిత ఈ సంభాషణ ద్వారా సూచించాడు.

శల్యుడితో కథ సంభాషణను ప్రారంభించడంలో మరో ఔచిత్యముంది. శల్యుడు నకుల, సహదేవుల మేనమామ. మొదట ధర్మరాజు కబురు పంపితే పాండవులవైపే యుద్ధం చేస్తానని మాట యిస్తాడు. కానీ, దుర్యోధనుడి సైన్యం శల్యసైన్యానికి, శల్యుడికి సపర్యలు చేయడంతో దుర్యోధనుడి పక్షం చేరడం ఒక బలహీనతగా కనిపిస్తుంది. భీష్ముడి మీద ప్రత్యేక గౌరవం శల్యుడికి ఉంది. అందుకే నిరాహారిగా భీష్ముడు మారాక, శల్యుడు ఆత్మావలోకం చేసుకుని కర్ణుణ్ణి దూషించి నందుకు బాధపడతాడు. ఈ విషయాన్ని సూచనగా చూపడమే ఈ పాత్రను మొదటిగా పాఠకుడికి పరిచయం చేయడంలో ఉద్దేశం.

శల్యుడి కొడుకు రుక్మరథుడు. ఇతడు జూదానికి వెళ్తాడు. ద్యూతక్రీడ రాజులకు ఒక ఇష్టమైన అంశం. జూదానికి వెళ్ళకపోతే అది వారి గౌరవానికి భంగంగా భావించేవారు. ఈ విషయాన్ని రుక్మరథుడి ద్వారా తెలిపి, అది మాయాద్యూతంగా పరిణమించి ధర్మరాజు సర్వాన్ని కోల్పోవడం స్ఫురించేలా రచయిత సూచించాడు.

మద్రదేశపు రాజకుమార్తె 'మాద్రి'. ఈమె శల్యుడి చెల్లెలు. కన్యాశుల్కం ఆ దేశ ఆచారం. అది తెలిసి భీష్ముడు ఇరవై బళ్ళతో వస్తువులు, రాగిపాత్రలు, నూలు, పట్టు, ఉన్ని వస్త్రాలు, ఒక తట్టనిండా స్వచ్ఛమైన బంగారం మొదలైనవి ఇచ్చి, శల్యుడి మనస్సుని వశపరుచుకున్నాడు. ఇంత శుల్కం తీసుకున్నాక మాద్రి చివరి స్థితి సహగమనం. ఈ శుల్కం ఆచారం పేరిట జరిగిన బలహీనతగా రచయిత ఆలోచించేలా చేసాడు.

కురుక్షేత్రయుద్ధం పూర్తయ్యాక, చాలామంది ఆడవాళ్ళు (యుద్ధసమయంలో సైనికులు వాడుకోవడంవల్ల) గర్భిణులుగా మారతారు. ధర్మరాజ సభలోనికి వాళ్ళంతా వచ్చేసి, "ఈ పుట్టబోయే బిడ్డకుతండ్రి ఎవరు?" అని ప్రశ్నించి రచయిత కథను ముగిస్తాడు. కాలానుగుణంగా ఆచారాలు ఎలా ప్రశ్నార్థకాలై మిగులుతాయో దానికి కారణాలు ఏవో రచయిత పాఠకుడి ఆలోచనకే వదిలేయడం కొసమెరుపు.

### 1. 8. 7. 5. సారాంశం :-

శల్యుడు పాండవుల మేనమామ. పాండవులంటే శల్యుడికి ప్రత్యేకమైన అభిమానం. ధృతరాష్ట్రుడు పుట్టుగుడ్డివాడవడంతో పాండురాజు రాజ్యాన్ని పాలిస్తూ విస్తరిస్తాడు. పాండురాజుకు కుంతితో పెళ్ళయ్యాక మూడు సంవత్సరాలవరకు పిల్లలు పుట్టరు. పాండురాజు తనలోనే లోపం ఉందని తెలుసుకుంటాడు. కానీ, భీష్ముడు కుంతిలో లోపం ఉందని భావించి, మద్రదేశపు రాకుమార్తె మాద్రిని కన్యాశుల్కం ఇచ్చి తీసుకువచ్చి, పాండురాజుకు మళ్ళీ పెళ్ళి చేస్తాడు. కొద్దికాలం పాండురాజు మాద్రితో గడిపి, హిమాలయాల్లో ఔషధాలద్వారా వీర్యవృద్ధి వస్తుందని తలచి అక్కడికి భార్యల్ని తీసుకుని వెళ్ళిపోతాడు. హిమాలయాల్లో నియోగ పద్ధతిద్వారా పుత్రుల్ని పొందుతాడు. పాండవులు అక్కడే విలు విద్యలు నేర్చుకోడం ప్రారంభిస్తారు. కొన్నాళ్ళకు పాండురాజు మాద్రి సంగమంతో ఆయాసం వచ్చి అక్కడే మరణిస్తాడు. మాద్రి అతడితో సహగమనం చేస్తుంది.

పాండురాజు మరణంతో అక్కడున్న మునులు హస్తినాపురానికి వెళ్ళమని కుంతికి హితవు చెప్పారు. కుంతి వారి సహాయంతో పిల్లల్ని తీసుకుని హస్తినకు వస్తుంది. అక్కడ ఖాండవప్రస్థాన్ని ధృతరాష్ట్రుడు పాండవులకు ఇస్తాడు. దండయాత్రలుచేసి పాండవులు రాజ్యాన్ని విస్తరిస్తారు. తర్వాత 'రాజసూయయాగం' చేస్తారు. ఆ సిరిసంపదలు చూసి దుర్యోధనుడికి కళ్ళుకుట్టి పాచికలాటకు రమ్మని, సర్వాన్ని మాయాజూదంతో హరిస్తాడు. ద్రౌపది అందం కూడా దుర్యోధనుడికి అసూయ కలగడానికి మరో కారణం. శకుని, కర్ణులు దుర్యోధనుడికి వంతు పాడతారు. ద్రౌపదిని ఓడిపోయాక దుశ్శాసనుడు ఆమెను సభలోకి తీసుకు వచ్చి వలువలు ఊడదీసే ప్రయత్నం చేస్తాడు. అలా చేయడంవల్ల కురువంశం నశిస్తుందని భావించిన ధృతరాష్ట్రుడు ద్రౌపదికి వరాలుగా అంతకుముందు పాండవులు

ఓడిపోయినదంతా ఇస్తాడు.

మళ్లీ జూదానికి రమ్మని దుర్యోధనుడు ఆహ్వానించి ఈసారి ధనరూపంగా ఒడ్డకుండా షరతులరూపంలో ఆడతాడు. ఆ మాయాజూదంలో ఓడిన ధర్మరాజు సోదరాదులతో అరణ్య, అజ్ఞాత వాసాలు పూర్తిచేయాల్సివచ్చింది. అజ్ఞాతవాసంలో విరాటరాజకొలువులో ఎవరూ గుర్తు పట్టకుండా ఉండి, పూర్తిచేస్తారు.

అజ్ఞాతవాసం పూర్తయ్యాక విరాటరాజ కుమార్తె 'ఉత్తర'ను అర్జునుడి కొడుకు అభిమన్యుడికిచ్చిపెళ్ళిచేస్తారు. దీనివల్లపాండవులబలం పెరుగుతుంది. కౌరవ, పాండవులకు రాయబారాలు జరుగుతాయి. దుర్యోధనుడు పాండవులకు రాజ్యభాగాన్నిచ్చేది లేదని తేల్చి చెప్తాడు. అప్పుడు 'ఉప్లావ్యంలో' ఉంటూ పాండవులు యుద్ధ ప్రయత్నాలు ప్రారంభిచారు. దుర్యోధనుడు కుంతీపుత్రులుగా ధర్మరాజాదుల్నిభావించి, వారు పాండురాజుకి పుట్టలేనందుకు రాజ్యభాగం ఇవ్వాల్సిన అవసరంలేదని ప్రచారం చేసాడు. పైగా, ఖాండవ వనం ఇచ్చినా అది జ్యూదంలో ఓడిపోయినా అన్యాయంగానే తిరిగి యిచ్చామని, ప్రస్తుతం రాజ్యభాగం ఇవ్వాల్సినఆగత్యంలేదని వాదిస్తాడు. మాకు యుద్ధం వద్దుఅనుకున్నా పాండవులే తమమీదకు(కౌరవులమీదకు) దాడిచేయడానికి వస్తున్నారనీ అందరికీ తెలియ జేస్తాడు. భీష్ముడు సేనాని అయ్యాక పురాతనమైన కురువంశాన్ని బయటవాళ్ళనుంచీ సంరక్షించడం ధర్మమని ప్రకటిస్తాడు. దీంతో కురుక్షేత్ర యుద్ధం తప్పలేదు.

నియోగ పద్ధతి భారతకాలంనాటి ఒక ఆచారం. అది చిత్రాంగదుడు, విచిత్రవీర్యుడు పుట్టుకనుంచే ఉంది. శంతనుడి మొదటిభార్య గంగ, రెండవభార్య మత్స్యగంధి. శంతనుడికి మొదటి భార్య గంగకు పుట్టి శంతనుడి దగ్గర ఉన్నవాడు భీష్ముడొక్కడే. ఆ తర్వాత గంగ ఎటో వెళ్లిపోయింది. కొన్నాళ్లకు శంతనుడు మత్స్యగంధిమీద మోజుపడి భీష్ముడిద్వారా పెళ్లి చేసుకున్నాడు. శంతన, మత్స్యగంధికి పుట్టినవారు చిత్రాంగదుడు, విచిత్రవీర్యుడు. వీరికి అంబిక, అంబాలికల్ని తెచ్చి భీష్ముడు పెళ్లిచేసాడు. పెళ్ళయ్యాక చిత్రాంగదుడు గంధర్వుడి చేతిలో మరణించాడు. విచిత్రవీర్యుడు అనారోగ్యంతో చనిపోయాడు. అప్పుడు కురువంశాన్ని నిలబెట్టే వారే లేరు. మత్స్యగంధికి దిగులు పుడుతుంది.

మత్స్యగంధికి పెళ్ళిరోజున పెట్టిన పేరు "సత్యవతి". ఆమె పెళ్ళికి ముందు 'పరాశరుడి'తో కలవడంవల్ల "కృష్ణద్వైపాయనుడు" పుడతాడు. సత్యవతి అభ్యర్ధన మేరకు కృష్ణద్వైపాయనుడు వచ్చి, అంబాలిక, అంబికలకు నియోగ పద్ధతి ద్వారా గర్భిణుల్ని చేసాడు. విదురుడు దాసితో కలసినప్పుడు పుడతాడు. అలాంటప్పుడు కౌరవులు కూడా కురువంశం నుండి పుట్టినవారు కాదని కుంతి భావిస్తుంది. వంశక్షేమం లేదా వంశోద్ధరణకు చేసిన ఈ నియోగపద్ధతి అప్పటికిసరైనదే. కానీ, కుంతివిషయానికి వచ్చినప్పుడు అది అధర్మమవుతుంది.

ఏకలవ్యుడు వచ్చి ద్రోణుడు దగ్గర పాండవుల పుట్టుక విషయం విని, ఇందులో అధర్మం ఏమీ లేదని తన రాజ్యంలో ఒక స్త్రీని చాలామంది పురుషులు (అన్నదమ్ములు

మొదలైనవారు) పెళ్ళి చేసుకోడం తప్పుకాదని ద్రోణుడితో చెప్పడం గమనించదగ్గ విషయం. కురువంశం విచిత్రవీర్యుడి కాలం, అంటే ధృతరాష్ట్రుడి తరానికి ముందే సంకరం జరిగింది. కుంతికాలానికి నియోగాన్ని ప్రత్యేకంగా ఎత్తి చూపడం, తద్వారా యుద్ధానికి సిద్ధంకావడం కనిపిస్తోంది. ఇది యుద్ధానికి ఒక కారణం.

రెండోకారణం-మత్స్యగంధి తండ్రికిచ్చినమాటప్రకారం భీష్ముడుపెళ్ళి మానుకుంటాడు. రాజుగా ఉండక బ్రహ్మచర్యం స్వీకరించి వేదాధ్యయనం చేస్తూ, ఊరికి దూరంగా నదికి ఆవల ఉంటాడు. కానీ, సత్యవతి, పరాశరుడు చనిపోయాక, దిక్కులేక భీష్ముడి దగ్గరికి వచ్చి, రాజ్యాన్ని సుస్థిరం చేయమని కోరుతుంది. భీష్ముడు అ కోరికను తీరుస్తాడు. 'బ్రహ్మచారివి కమ్మని అంటే నా కూతురు ప్రవేశించే ఇంట్లో నువ్వు ఏ పెత్తనమూ చేయవద్దు. అలాగే నదికి ఆవల పర్ణకుటీరం కట్టుకుని, తర్వాత మళ్ళీ ఆమె వచ్చి పిలిచాక అంతఃపురంలో ప్రవేశించావు. నా పని అయిపోయిందని తెలిసిన రోజే ఎందుకురాలేదు? నా పని ముగిసిపోయిందనే జ్ఞానం సరైన కాలంలో ఎందుకు పుట్టలేదు.' అన్న సత్యవతి తండ్రి మాటలు శుకమహర్షి చనిపోయి నప్పుడు గుర్తుకు తెచ్చుకుని భీష్ముడు మథన పడతాడు. ఈ రెండు సంఘటనలు కథాంశాన్ని మలుపు తిప్పేలా ఉన్నాయి. అయితే యుద్ధదిశగా మారిపోయినట్లు భీష్ముడు బాధపడడం ప్రత్యేకత.

పాండవులు అరణ్య, అజ్ఞాత వాసాలకు వెళ్ళిన సమయంలో కుంతి విదురుడి ఇంట్లో ఉంది. కుంతి తన పాతజ్ఞాపకాలతోనే కథను రచయిత కొంతవరకు నడిపిస్తాడు. వీరుడు, మంచి రంగు, ఎత్తున్న పాండురాజుని స్వయంవరంలో కుంతి వరిస్తుంది. కానీ, అతడివల్ల సంతానం కలగదు. హిమాలయ ప్రాంతంలో పాండురాజు పిల్లలకోసం బాధపడినప్పుడు కుంతి తనకు పెళ్ళికిముందు కొడుకు(కర్ణుడు)ను తెచ్చుకుందామని అంటుంది. కానీ, ఆ కానీనుడి స్వీకారం పెళ్ళిలోనే జరగాలని పాండురాజు కుంతితో చెప్పాడు. లేకపోతే ప్రజలు ఒప్పుకోరని వివరిస్తాడు.

ఒకరోజు దేవలోకం అని పిలిచే కొండప్రాంతం నుంచీ సనాతనధర్మాల్ని తెలిసిన న్యాయాధికారి పాండురాజు దగ్గరికివస్తాడు. అతణ్ణి చూసిన కుంతికి పెళ్ళికాక ముందు చూసిన దుర్వాసుడు గుర్తుకు వస్తాడు. ఈ దూర్వాసుడివల్లే కర్ణుణ్ణి కుంతి కంటుంది. ఇలా గుర్తుకు వచ్చినట్లు చెప్పడం పుట్టబోయేబిడ్డను చూచించినట్లు అనిపిస్తోంది. పాండురాజు అతణ్ణి అర్థించి కుంతితో నియోగం జరిపిస్తాడు. నియోగానికి పంపేముందు కుంతితో "ఈ పురుషుడిమీద నేను మోహం పొందను. అతను సమీపస్థుడౌతున్నప్పుడు నా మనస్సు అంతా పతి(పాండురాజు)తో లీనమవుతుంది. సంతానాపేక్షే తప్ప నాలో వేరే కోర్కె ఉండబోదు. గర్భం నిలవడం నిశ్చయమైన తక్షణం నేను ఇతన్ని పితృసమానంగాభావించి దూరం అవుతాను" అని ప్రమాణం చేయిస్తాడు (పుట.68). ఇలా చేయించడంలో పాండువు తన బిడ్డలగా భావిస్తాడని సూచన కనిపిస్తోంది.

కుంతికి గర్భంనిలిచాక, ధర్మాధికారికి భారీగా విందు ఏర్పాటుచేసి పాండురాజు కృతజ్ఞతలు చెప్పి వీడ్కోలు తీసుకుంటాడు. అప్పుడు పుట్టినవాడే 'ధర్మ'. దేవధర్మాధికారి

దయవల్ల పుట్టినవాడు, సనాతన ధర్మానికి అనుగుణంగా పుట్టినవాడని ధర్ముడన్న పేరును ఋషులు ఆమోదించారు. అల్పంగా పుట్టిన వాడు రాజ్యాన్ని ఎలా రక్షించగలడని పాండురాజు బాధపడ్తాడు. అందుకే పాండురాజు వీర్యవంతుడైన కొడుకుని కనమని కుంతిని అభ్యర్థిస్తాడు. కాబట్టే దేవగణముఖ్యుడైన బలవంతుణ్ణి పాండురాజు ఆహ్వానిస్తాడు.

దేవగణసేనానివల్ల పుట్టినవాడు భీముడు. ధర్మాధికారి, సేనానులవల్ల విషయం తెలుసుకున్న ఇంద్రుడు 'పృథ' తో కలవాలని పాండురాజుని కోరతాడు. అనుమతి పొంది, వారి కలయికవల్ల అర్జునుడు పుడతాడు. మాత్సర్యం పొందిన మాద్రికి కూడా నియోగానికి అనుమతి ఇవ్వమని పాండురాజు కుంతిని కోరుతాడు. మాద్రికి దేవవైద్యులిద్దరివల్ల నకుల, సహదేవులు పుడతారు. అక్కడితో నియోగం పూర్తవుతుంది. పాండురాజు కొద్దికాలానికే చనిపోతాడు. మాద్రి అతనితో సహగమనం చేస్తుంది. అక్కణ్ణుంచి కుంతికి కష్టాలు మొదలవుతాయి. భీష్ముడు ధర్మరాజుని యువరాజుగా పట్టాభిషేకం చేయిస్తాడు. ధర్మరాజు పాలన ప్రజలకు నచ్చుతుంది. ప్రజలంతా ధర్మరాజే రాజుగా కావాలంటే దుర్యోధనుడికి రాజ్యభాగం రాదని ధృతరాష్ట్రుడు పాండవుల్ని లక్క ఇంటికి పంపించి రూపుమాపాలని పథకం వేసాడు. రాజకార్యం నిమిత్తం అనే మిషతో వేరే ప్రాంతానికి పంపాడు.

విదురుడిచ్చిన సమాచారంవల్ల పాండవులు లాక్షాగృహంనుంచి బయటపడతారు. వ్యాసుడి దర్శనం అవుతుంది. అతడి సలహావల్ల ఏకచక్రపురం వెళ్తారు. అక్కడ బకుణ్ణి భీముడు చంపుతాడు. ద్రుపదరాజ్యంలో ద్రౌపదీ స్వయంవరం జరగబోతుందని తెలుసుకుని బ్రాహ్మణ వేషంలో కుంతితోసహ పాండవులు బయలుదేరతారు. ద్రుపదరాజ్యంలో మత్స్యయంత్రాన్ని ఛేదించి అర్జునుడు ద్రౌపదిని పొందుతాడు. ద్రౌపదివల్ల పాండవులు తగువులాడుకోనే పరిస్థితి వస్తుంది. అందర్నీ వివాహమాడమని కుంతి ద్రౌపదికి చెబుతుంది. వ్యాసుడు ద్రౌపది గురించి ద్రుపదుడికి చెప్పి, ఆమెను పాండవులకు ఇచ్చి వివాహం చేయమని వివరిస్తాడు. పాంచాలుర బలం పాండవులకు రాడంవల్ల వాళ్ళు తమకు కుమారులే అని తలచి ధృతరాష్ట్రుడు ఎందుకూ పనికిరాని ఖాండవ వనాన్ని ఏలుకోమని పాండవులకు ఇచ్చేస్తాడు.

పాండవులు ఖాండవవనాన్ని దహనం చేసి ఇంద్రప్రస్థపురంగా మారుస్తారు. అప్పుడే రాజసూయయాగం చేయమని నారదుడు ధర్మరాజుకి చెప్తాడు. అందువల్ల పితృదేవతలు తరిస్తారని వివరిస్తాడు. కృష్ణుడి అనుమతి తీసుకుని మొదటగా జరాసంధుణ్ణి వధిస్తారు. అతడి కొడుకు సహదేవుణ్ణి రాజుగా చేసి, చాలాదేశాల రాజుల్ని ఓడించి కానుకలు పొంది ధర్మరాజు రాజసూయ యాగం చేస్తాడు. అగ్రతాంబూలం కృష్ణుడికి యివ్వమని భీష్ముడు చెప్తాడు. ధర్మరాజు అంగీకరిస్తాడు. ఆ విషయాన్ని శిశుపాలుడు వ్యతిరేకిస్తాడు. చివరకు కృష్ణుడు శిశుపాలుణ్ణి అంతమొందిస్తాడు. దాంతో యాగం పూర్తవుతుంది.

దుర్యోధనుడు పాండవుల ధనాన్ని చూసి అసూయపడి, వాళ్లని బికారులుగా చేయదలచి ధృతరాష్ట్రుడి దగ్గరికి వెళ్ళి, జూదానికి రమ్మని పాండవుల్ని పిలిపించమని కోరతాడు. ధృతరాష్ట్రుడు విదురుడిచే ధర్మరాజుకి జూదానికి రమ్మని పిలిపిస్తాడు.

విదురుడు 'రాను' అని ధర్మరాజు ను చెప్పమన్నా, ధర్మరాజు వినకుండా జూదానికి వచ్చి రాజ్యాన్ని, ద్రౌపదితో సహా సర్వాన్ని కోల్పోతాడు. చివరకు అరణ్యాలపాలవుతారు. అక్కడ జయద్రథుడు వచ్చి ద్రౌపదిని ఎవరూలేని సమయంలో చెరబడతాడు భీమార్జునులు అతణ్ణి బంధించి అవమానిస్తారు. చంపడం తగదని, అతడు మన చెల్లెలు భర్త అని, ధర్మరాజు వదిలేస్తాడు. అతడే యుద్ధసమయంలో అభిమన్యుడి మరణానికి కారకుడౌతాడు. తర్వాత జయద్రథుణ్ణి అర్జునుడు చంపుతాడు.

ద్రౌపది అంతరంగం చాలావరకు 'ఫ్లాష్ బాక్' లో కనబడుతుంది. యుద్ధ సమయం రాబోతుందని నిశ్చయించుకుని, సైన్యసమీకరణకోసం భీముడు 'సాలకటంకటి' రాజ్యానికి వెళ్తాడు. అక్కడ సాలకటంకటి తగిన విధంగా అతడికి ఆతిథ్యమిచ్చి, సైన్యాన్ని, ఘటోత్కచుణ్ణి ఇచ్చి పంపిస్తుంది. భీముడితోపాటు వచ్చిన అంతరంగ సైనికుడు 'నీలుడు'. నీలుడికి భీముడితో ఉండడం అంటే ఇష్టం. హిడింబ, బకులవధ ఎలా చేసాడో తెలుసుకోవాలని నీలుడు భీముణ్ణి అడుగుతాడు.

ఏకచక్రపురంలోని ప్రజల కష్టాలు, రాజు బకుడికి రాజ్యాన్ని అప్పజెప్పడం, ఊర్లో ఇంటికో రోజు మనిషి, బండి భోజనం పంపించే విధంగా బకుడు రాజుతో ఒప్పందం కుదుర్చు కున్నాడు. పాండవులు ఒక బ్రాహ్మణుడింట్లో బసచేసారు. ఆ బ్రాహ్మణ ఇంటివాళ్ళు ఏడుస్తున్నప్పుడు కుంతి ఏంటి విషయమో తెలుసుకుంది. తనకు ఐదుగురు పిల్లలున్నారని, భీముణ్ణి పంపుతానని వాళ్ళని ఓదార్చుతుంది. సుష్టుగా భోంచేసి, భీముడు బకుడి దగ్గరకు బండెడన్నం తీసుకుని బయలుదేరతాడు. అప్పటికే చాలా ఆలస్యమైంది. బకుడు కోపంతో రెచ్చిపోయి అడవి జంతువులా భీముడిమీదకు దూకుతాడు. భీముడు తప్పించుకుని, చివరకు బకుణ్ణి చంపేసాడు. వాడి అనుచరుల్ని తరిమేస్తాడు. బండిని తోలుకుని తిరిగి వచ్చేసాడు. భీముడికి సహాయంగా మిగతా పాండవులు బకుడిదగ్గరికి వెళ్లాడు. వారంతా చీకటి పడేసరికి ఇంటికి వచ్చేసారు. మర్నాడు భీముడు బకుడి గుహకు వెళ్లి చూస్తే అక్కడ ఎముకులగూళ్లు, మాంసపుముద్దలు తప్ప ఏమీలేవు. అలా అందరూ పరారయ్యారని భీముడు నీలుడికి చెప్పాడు.

భీముడికి చిన్ననాటి జ్ఞాపకం వస్తుంది.. 'నడుమూ, చంకా నిండి పోయేంత లావుపాటి బిడ్డతాను. ఎత్తుకుని పర్వత శిఖరాలు ఎక్కుతుంటే అమ్మకు ఆయాసం కలిగేదట. అయినా ఎత్తుకోనిదే తాను వదలడంలేదట. తండ్రి పోయేటప్పటికి ఏడు సంవత్సరాలు కాబోలు తనకు' (పుట. 133). ఇలాంటి జ్ఞాపకాలు, అంతర్మథనాలు- ద్రౌపది, కుంతి, యుయుధానుడు, కర్ణుడు, భీముడు, భీష్ముడు వంటి పాత్రలలో కనిపిస్తున్నాయి.

యుద్ధం అయిపోయాక మిగిలిన సమస్యల్ని రచయిత సూచించాడు. కానీ, సమాధానం పాఠకులకు వదిలేస్తాడు. చివరకు కథను సశేషంగా ముగించాడు. గతకాలంలోని వాస్తవాన్ని చూస్తూ, పాత్రల నడవడిక ఒకవిధంగా పాఠకుణ్ణి తికమక పెడుతుంది. కానీ, అది ఆసక్తిని కలిగిస్తోంది కూడా.

### 1. 8. 8. *ప్రచ్ఛన్న పాండవము* :-

### 1. 8. 8. 1. రచయిత పరిచయం :-

సుప్రసిద్ధ పండితుడు, కళాప్రపూర్ణ, ఆంధ్రాస్కాట్ బిరుదులు పొందిన చిలకమర్తి లక్ష్మీనరసింహం *ప్రచ్ఛన్న పాండవము* రాసారు. ఇతడు 1867-1946కాలం నాటివారు. *అహల్యాభాయి, సౌందర్య తిలక, రామచంద్రవిజయము, హేమలత, కర్పూర మంజరి, గణపతి* మొదలైననవలలు, *ప్రసన్నయాదవ, ప్రచండయాదవ, గయోపాఖ్యానము, పారిజాతాప హరణము* వంటి నాటకాలు స్వతంత్రమై ప్రజాదరణ పొందాయి. చాలా వ్యాసాలు, కథలు, ప్రహసనాలు రాసారు. ఇతడు రాసిన *ప్రచ్ఛన్న పాండవము* గ్రాంధిక శైలిలో ఉంది. భారతంలో ఉన్న పాండవుల అజ్ఞాతవాస ఘట్టాన్ని తీసుకుని గ్రాంధిక శైలిలో పాఠకులకు పరిచయం చేసారు.

### 1. 8. 8. 2. రచనా ఉద్దేశం :-

ఈ నవలలో నాలుగు ప్రకరణాలున్నాయి. ఇవి చతుర్విధ పురుషార్థాలకు ప్రతీకలు. ద్రౌపది పాండవులతో ఏ విధంగా కర్తవ్యాన్ని నిర్వర్తించిందో వివరించారు. మానవులు పురుషార్థాలను భార్యతో నిర్వర్తించే విధం ఈ నవలలో సూచించి, ఆచరించడం ఈ నవలలో కనిపిస్తోంది.

అజ్ఞాతవాస సమయంలో పాండవుల జీవనం, దిశానిర్దేశం, మొదలైనవి ఉన్నాయి. చివరకు పాండవులు అజ్ఞాతవాసం పూర్తిచేయడంతో కథ ముగుస్తోంది.

### 1. 8. 8. 3. సారాంశం :-

ఆర్యావర్త దేశంలో సూర్య, చంద్ర వంశాలు ప్రసిద్ధ రాజవంశాలు. సూర్యవంశ పాలకులు ఆయోధ్యా నగరాన్ని, చంద్రవంశ పాలకులు హస్తినను రాజధానులుగా చేసి పరిపాలన చేస్తున్నారు. చంద్రవంశంలో ప్రసిద్ధులైన కురు, భరతాది మహనీయులు పుట్టారు. కురు వంశజుల్ని కౌరవులని, లేదా సూర్యవంశజులని; భరతుడి వంశంనుంచి వచ్చిన వారికి భరత వంశం వారని లేదా చంద్ర వంశంవారని పేర్లు వచ్చాయి. అందులో కురువంశకథను రచయిత పరిచయం చేయడంతో కథ ప్రారంభమయింది. కురువంశంలో చాలా తేజోరాశియైన శంతనుడు పుట్టాడు. శంతనుడి మొదటి భార్య గంగాదేవి. ఈమెవల్ల భీష్ముడుపుట్టాడు.

భీష్ముడు పితృప్రియచరణలాలసుడై, మత్స్యగంధిని తనతండ్రితో పెళ్ళి చేయడానికి రాజ్యాన్ని, తనకు రావల్సిన అధికారాన్ని, చివరకు వివాహాన్ని మానుకున్నాడు. శంతనుడి రెండవ భార్య సత్యవతి వల్ల చిత్రాంగద, విచిత్రవీర్యులు పుట్టారు. చిత్రాంగద, విచిత్రవీర్యులకి కాశీరాజు కూతుర్లు అంబిక, అంబాలికల్ని ఎత్తుకొచ్చి వివాహం జరిపించాడు. అంబిక వల్ల ధృతరాష్ట్రుడు, అంబాలిక వల్ల పాండురాజు పుట్టారు.

ధృతరాష్ట్రుడు గాంధార రాజైన 'సుబలుడి' కుమార్తె గాంధారిని; పాండురాజు కుంతిభోజాత్మక కుంతిని, మద్ర రాజకన్య మాద్రిని వివాహంచేసుకున్నారు. ధృతరాష్ట్రుడు

హస్తినలో ఉండేవాడు. ప్రకృతి సౌందర్య ఆరాధికుడైన పాండురాజు చాలా ప్రదేశాలు తిరుగుతూ ఆనందించేవాడు. పాండురాజుకి దండధరుడి ప్రభావంవల్ల యుధిష్ఠిరుడు, వాయుదేవుడివల్ల భీమసేనుడు, మహేంద్రుడివల్ల అర్జునుడు కుంతికి పుట్టారు. పాండురాజు రెండవ భార్య మాద్రికి అశ్వీనీదేవతలవల్ల నకుల సహదేవులు కలిగారు. ధృతరాష్ట్రుడికి గాంధారివల్ల దుర్యోధనాది నూర్గురు కొడుకులు, "దుస్సల" కుమార్తె జన్మించారు. యుధిష్ఠిరుడు పెద్దవాడు అవకుండానే పాండురాజు మరణించాడు. మాద్రి అతనితో సహగమనం చేసింది.

పాండురాజు మరణించాక, ధృతరాష్ట్రుడే తన తమ్ముడి కొడుకుల్ని కూడా సాకాడు. కృపాచార్యులదగ్గర విద్యాబుద్ధులు నేర్పించాడు. అర్జునుడువిలువిద్యలోనూ; భీమ, దుర్యోధనులు గదాయుద్ధంలోనూ పేరు సంపాదించుకున్నారు. సూతపుత్రుడైన కర్ణుడు పరశురాముడిదగ్గర ధనుర్విద్య నేర్చుకున్నాడు. అర్జునుడికి ఇంచుమించు సమానుడిగా పేరు పొంది, దుర్యోధనుడికి మిత్రుడుగా కర్ణుడు మారాడు.

దుర్యోధనుడికి పాండవులంటే అందులో భీముడంటే మరీ కోపం. భీముడు లేకపోతే పాండవులు ఏమీచేయలేరని భావించేవాడు. అందుకే భీముణ్ణి అంతం చేయాలని, ఒకసారి యమునా నదిలో ఈతకొట్టడానికి వెళ్ళినప్పుడు ఆహారంలో విషం పెట్టి, కాళ్ళు, చేతులు కట్టి యమునలో పడేశారు. అయినా భీముడు మరణించలేదు. యుధిష్ఠిరుణ్ణి యువరాజుగా చేసారు. లక్క ఇల్లు ఏర్పాటుచేసి పాండవుల్ని నాశనం చేయలని భావించి ధృతరాష్ట్రుడు విఫల మయ్యాడు. అప్పుడు పాండవుల్ని విదురుడు ఆదుకున్నాడు.

భీముడు లక్క ఇంటినుండి బయటికి అందర్ని తీసుకువచ్చాక, ఏకచక్రపురం చేరుకున్నారు. అక్కడ యాచక వృత్తితో కొన్నాళ్ళు జీవనం సాగించారు. అప్పుడే ద్రుపదుడి కూతురు ద్రౌపదికి స్వయంవరమని తెలుసుకుని పాంచాల పురానికి బయలుదేరారు. అంతకు ముందే, పాంచాలరాజు ద్రోణుడిచేత అవమానం పొందాక, యజ్ఞంచేసి ద్రోణుణ్ణి చంపేకొడుకుని, అర్జునుణ్ణి పెళ్ళాడే కూతుర్నీ పొందాడు.

ద్రుపదుడు పాండవులు లక్కఇంట్లో మృతి చెందారని బాధపడతాడు. అయినా అర్జునుడు మాత్రమే ఛేదించగల మత్స్యయంత్రాన్ని ప్రతిష్ఠించి, దాన్ని ఛేదించినవాడికే కృష్ణను ఇచ్చి వివాహం చేస్తానని స్వయంవరంలో ప్రకటిస్తాడు. శల్యుడు, కర్ణుడు, కౌరవులు, శిశుపాలుడు మొదలైన వారంతా మత్స్యయంత్రాన్ని ఛేదించలేకపోయారు. అర్జునుడు బ్రాహ్మణవేషంలో మత్స్యయంత్రాన్ని ఛేదించటంతో రాజులంతా తిరగబడ్డారు. బ్రాహ్మణ వేషంలోని అర్జునుడు వారందర్నీ ఓడిస్తాడు. భీముడు సహకరిస్తాడు. పాండవాదులు కృష్ణను తాము ఉంటున్న కుమ్మరి ఇంటికి తీసుకువెళ్తారు. అక్కడ కుంతికి భిక్షను తెచ్చామని చెప్పగా, "మీ అయిదుగురు అనుభవించండి" అని శాసిస్తుంది. అలా కృష్ణ పాండవులకు భార్య అయింది. ధృతరాష్ట్రుడు విషయం తెలుసుకుని పాంచాలురబలం ఉండడంతో లోలోపల భయపడి పాండవుల్ని రప్పించి, ఖాండవ వనాన్ని ఇచ్చాడు.

పాండవులు కృష్ణుడి సహాయంతో ఖాండవవనాన్ని ఇంద్రప్రస్థంగా మారుస్తారు. జరాసంధవధతో రాజసూయయాగంప్రారంభమై శిశుపాలవధతో పూర్తవుతుంది. ఆ యాగంలోని ధనరాశులను చూసిన కారణంగా దుర్యోధనుడికి మాత్సర్యం పెరిగిపోతుంది. ఆ తర్వాత ద్యూతక్రీడకు ఆహ్వానించడం, ద్రౌపదిని అవమానిస్తారు. భీముడి మాటలకు ధృతరాష్ట్రుడు భయపడి రాజ్యాన్ని తిరిగి ఇస్తాడు. మళ్లీ జూదం ఆడడం, ధర్మరాజును ఓడించడం, చివరకు పాండవులు అరణ్యవాసం పొందుతారు. కుంతి విదురిడింట్లో ఉంటుంది. సుభద్ర, అభిమన్యులు ద్వారకకు, ప్రతివింద్యాదులు పాంచాలపురానికి పంపిస్తారు.

అరణ్యవాస సమయంలో పాండవులను దుర్యోధనుడు అవమానించాలని అనుకుటాడు. కానీ, ఘోషయాత్రలో దుర్యోధనుడే అవమానం పొందుతాడు. అతణ్ణి పాండవులే రక్షిస్తారు. అర్జునుడు శివుడికోసంతపస్సుచేసి పాశుపతాస్త్రంసంపాదిస్తాడు. విరాటకొలువులో అజ్ఞాతవాసం పూర్తిచేస్తారు. అక్కడ భీముడు కీచకుణ్ణి చంపుతాడు. పాండవుల్ని కనిపెట్టాలని దుర్యోధనుడు వేగులద్వారా ప్రయత్నిస్తాడు. ఒకరోజు భీష్మ, బాహ్లిక, సోమదత్తాదులతో సభ ఏర్పాటుచేస్తాడు. ఆ సమయంలో ఒకమునివచ్చి అందరి సమక్షంలో ఒక రహస్యాన్ని చెప్తాడు-(వాడే కురంగుడనే వేగుడు) మునివేషంలో విరాటకొలువులోకి వెళ్ళినట్లు అక్కడ పాండవులు మారువేషంలో ఉన్నట్లు అనుమానం వ్యక్తంచేస్తాడు. వెంటనే గోగ్రహణం చేయాలని దుర్యోధనుడు పథకం వేస్తాడు.

సభా మధ్యలో కూర్చున్న త్రిగర్త దేశాధిపతి సుశర్మ లేచి, విరాటుడికి తనకున్న వైరాన్ని, కీచకుడితో ఓడిపోయిన విషయాన్ని వివరిస్తాడు. తనకు ఆ పగను తీర్చుకునే అవకాశం ఇవ్వమని విన్నవించుకుంటాడు. దక్షిణప్రాంతంలో సుశర్మను దాడిచేయమని, దుర్యోధనాదులు ఉత్తరంవైపు దాడి చేస్తామని వివరిస్తాడు. సుశర్మ దక్షిణదిక్కులో ఆవుల్ని తన ఆధీనంలోకి తీసుకువస్తాడు. విషయాన్ని విని మత్స్యరాజు వెంటనే చతురంగ బలాల్ని సిద్ధంచేసి యుద్ధానికి సన్నద్ధమౌతాడు. కంకుభట్టు మనవి మేరకు తంత్రీపాలుడు, వలలుడు, దామగంధి సహాయకులుగా యుద్ధభూమికి చేరతారు.

సుశర్మ సైన్యాన్ని చెల్లాచెదరుచేసి గోవుల్ని విడిపిస్తారు. ఈలోగా దూరంగా ఉన్న సుశర్మ దగ్గరకి విరాటుడు రథాన్ని పోనిచ్చి సుశర్మతో తలబడతాడు. సుశర్మ విరాటుణ్ణి ఓడించి, తన రథాన్ని ఎక్కించి తీసుకుపోతాడు. విషయం గ్రహించిన కంకుభట్టు తమ్ముళ్ళ సహాయంతో విరాటుణ్ణి విడిపించి, సుశర్మని తాళ్ళతో బంధించి, వలలుడు విరాటుడిదగ్గరకి తీసుకు వస్తాడు. వారంతా విరాటుడి మన్ననలు పొందుతారు. సుశర్మని వదిలేయమని ధర్మరాజు విరాటుణ్ణి కోరుతాడు. విరాటుడురాజ్యంలో విజయోత్సవ ఆహ్వానానికి ఏర్పాట్లు చేయమని వేగులద్వారా విషయాన్ని పంపి, ఆ రోజు కంకుభట్టాదులతో యుద్ధభూమిలోనే విశ్రాంతి తీసుకుంటారు.

ఉత్తరదిక్కునుంచి కౌరవులు గోగ్రహణం చేసారు. ఈ వార్త విరాటనగరంలో ఉన్న ఉత్తర కుమారుడికి చేరుతుంది. తనకి సరైన సారథిలేకపోడంవల్ల యుద్ధానికి వెళ్ళలేక పోతున్నానని, లేకపోతే కౌరవులెంత? అంటూ బీరాలు పలుకుతాడు. బృహన్నల మంచి

సారథి, అతడు అర్జునుడికి ఖాండవ వనదహన సమయంలో రథసారథి అని సైరంధ్రి ఉత్తర ద్వారా ఉత్తర కుమారుడికి తెలియజేస్తుంది. ఉత్తరుడు మొదట అవహేళనగా భావించి, చివరకు తప్పదని వెళ్ళమని ఉత్సాహపరుస్తుంది. నిన్నటితో గడువు పూర్తయిందనే విషయాన్ని అర్జునుడు తెలుసుకొని యుద్ధసారథిగా బయలుదేరతాడు. బీరాలు మాట్లాడుతున్న ఉత్తరకుమారుడి దగ్గర తనకేమీ చాతకానట్టు అర్జునుడు కాసేపు నటిస్తాడు.

బృహన్నలని యుద్ధరంగానికి తీసుకుపోమని ఉత్తరకుమారుడు ఆజ్ఞాపిస్తాడు. ఉత్తరుడికి కౌరవసైన్యం చూసి భయమేసింది. భీష్మ, ద్రోణాది వీరుల్ని గెలవగలనా? అని తలచి ఉత్తరుడు రథం ఆపమని బృహన్నలకి చెప్పాడు. బృహన్నల నవ్వుతూ, అంతఃపురంలోని మాట్లాడిన బడాయి ఏమైందని ఎత్తిపొడుపుగా మాట్లాడతాడు. దేశత్యాగం కంటే దేహత్యాగం మేలని, చాలా రకాలుగా ఉత్తరకుమారుణ్ణి చైతన్య పరుస్తాడు. అయినా రెండుసార్లు రథం పైనుంచి దూకేసి, వెనక్కి పరిగెత్తి, పారిపోయే ప్రయత్నం చేసాడు. చివరకు అర్జునుడు తనే యుద్ధంచేస్తానని, తన నిజ రూపాన్ని వివరించాడు. శమీవృక్షం మీద ఉన్న ధనుస్సు, శంఖం మొదలైనవి ఉత్తరుడిచేత తీయించి అర్జునుడు యుద్ధ సన్నద్ధుడై రణభూమికి చేరాడు. వచ్చినవాడు అర్జునుడే అని తలచిన ద్రోణుడు మర్మంగా భీష్ముణ్ణి అజ్ఞాతవాస కాలం పూర్తయిందా అని అడుగుతాడు. పూర్తయినట్లు మర్మంగానే భీష్ముడు చెప్తాడు.

వస్తున్నవాడు 'అర్జునుడే' అని, ద్రోణుడు భటుల్ని ఉద్దేశిస్తూ, అర్జునుణ్ణి పొగుడు తున్నాడు. దుర్యోధనుడికి, కర్ణుడికి ఆ మాటలు నచ్చలేదు. పైగా అర్జునుడే అయితే ఆ విషయాన్ని బయట పెట్టి, మళ్ళీ అరణ్య, అజ్ఞాతవాసాలు చేయించవచ్చని దుర్యోధనుడు భావిస్తాడు. భీష్ముడు గడువుకాలం పూర్తయిందని నిర్ణయించి చెప్పేస్తాడు. యుద్ధం తప్పదని ముందుగా పావువంతు సైన్యంతో గోవుల్ని, ఆపై పావువంతు దుర్యోధనుడి వెనక పంపించి, మిగతా అరవంతు సైన్యం పార్థుణ్ణి ఎదుర్కోడానికి సిద్ధంగా ఉంచారు.

అర్జునుడు భీష్మ, ద్రోణాదులకు నమస్కార బాణాలతో నమస్కరించాడు. యుద్ధంలో చెలరేగిన అర్జునుడు గోవుల్ని విడిపించి, వెనక్కి మళ్ళించాడు. కౌరవసేన ఓడిపోవడాన్ని చూసిన ఉత్తరుడు ఆశ్చర్య పోసాగాడు. పైగా రథాన్ని చిత్రగతిలో నడిపించాడు. అర్జునుడు సమ్మోహన అస్త్రాన్ని ప్రయోగించాడు. అందరిని మూర్ఛపోయినట్లుచేసాడు. ఉత్తర అడిగిన కుచ్చుల్ని కోయమని ఉత్తరుడికి అర్జునుడు చెప్పాడు. కానీ, భీష్ముడి దగ్గరకి వెళ్ళొద్దని సూచించాడు. విజయం విజయుణ్ణి వరించింది. వెంటనే అర్జునుడు శమీవృక్షం దగ్గరకి రథాన్ని పోనిమ్మని తన మళ్ళీ బృహన్నలలా వేషం మార్చుకున్నాడు. గోపాలురని పిలిపించి, విరటుడికి ఉత్తరుడి విజయవార్త చెప్పమని కబురుపెట్టాడు. బృహన్నల తనపేరు బయటపెట్టవద్దని, సమయం వచ్చినంత వరకూ ఎవరికీ చెప్పొద్దని ఉత్తరుడికి చెప్పాడు.

తనకొడుక్కి విజయం వరించిందని విరాటుడు మహదానందం పొందాడు. ఈ విజయం బృహన్నలదనీ కంకుభట్టు చెప్తే, కోపం వచ్చి విరటుడు చేతిలో ఉన్న 'సారె'తో అతణ్ణి కొట్టాడు. అది కంకుభట్టు నుదుటమీద తగిలి గంటుపడింది. వెంటనే సమీపంలో ఉన్న

సైరంధ్రి వేషంలో ఉన్న ద్రౌపది వచ్చి, తన చీరకొంగుతో రక్తాన్ని కిందపడకుండా చేసింది. విరాటుడికి కోపంవచ్చి, ఎందుకు కట్టుకట్టావని కోపంతో అన్నాడు. ఇతడు పరమపూజ్యుడు, ఇతడిరక్తం కిందపడితే ఈ రాజ్యానికి అరిష్టమనీ వివరిస్తే విరాటరాజు సిగ్గుపడతాడు.

తర్వాత పాండవులందరూ సమావేశమై, నిజరూపాల్ని ప్రకటించుకున్నారు. యుధిష్ఠి రాదులు మంగళస్నానాదులుచేసి విరాటరాజ సింహాసనం, మంత్రులు మొదలైన ఆసనాల్లో కూర్చొన్నారు. విరాటుడు వచ్చి చూసి కోపంతో ఉన్నాడు. అప్పుడు ధర్మరాజు భీమ, నకుల, సహదేవుల్ని పరిచయం చేసాడు. భీముడు అర్జునుణ్ణి పరిచయంచేసి, సైరంధ్రి వేషంలో ఉన్నది ద్రౌపదిగా వివరించాడు. వెంటనే విరాటుడు ఆనందపడి తనకుమార్తె ఉత్తరని అర్జునుడికిచ్చి పెళ్ళిచేస్తానని అంటాడు. అప్పుడు అభిమన్యుడు తగినవాడని అతడికివ్వమని కోరతాడు.

ధర్మరాజుసలహామేరకు అర్జునుడికొడుకు అభిమన్యుడికిచ్చి ఘనంగా వివాహం చేస్తాడు. బలరామాదులు చాలా కానుకలు తెస్తారు. వివాహం వైభవంగా జరుగుతుంది. చంద్రవంశంలోని పాండవులు అరణ్యవాసంపూర్తి చేసుకుని, అజ్ఞాతవాసాన్ని సమాప్తిచేసి, ఉత్తరతో అభిమన్యుడికి వివాహం చేయడంతో కథ ముగిసింది.

### 1. 8. 8. 4. విశిష్టత :-

ప్రచ్ఛన్నపాండవంలో నాలుగు ప్రకరణాలున్నాయి. నూట ఆరు పుటల రచన. నాలుగు ప్రకరణాలు చతుర్విధ పురుషార్థాలకి సూచికలు. ధర్మరాజు మాయాజూదం ఆడినా ధర్మంకోసం నిలబడ్డాడు. మిగిలిన పాండవులు అతణ్ణి అనుసరించారు. ద్రౌపది వస్త్రాపహరణ జరిగినా వారు ధర్మంనుంచివిడివడలేదు. ఇది పాండవధర్మనిష్ఠని సూచిస్తోంది. 'ఉత్తరగోగ్రహణం' సమయంలో వచ్చిన గోసంపదమీద పాండవులకు ఆశ పుట్టలేదు. విరాతుడు ధర్మరాజుని నిందించినా సంపదమీద ఆశలు వదులుకున్నారు. ఇది రెండో పురుషార్థ విశేషం.

బృహన్నలవేషంలో అర్జునుడు శరీరంమీద వ్యామోహాన్నివిడిచి, కామాన్ని జయించాడు అందుకే శిష్యసమానురాలైన ఉత్తరని అభిమన్యుడికిచ్చి పెళ్ళిచేయమన్నాడు. కీచకుణ్ణి భీముడు సంహరించడం కామం మీద విజయంగా కనిపిస్తోంది. చివరి పురుషార్థం మోక్షం. అజ్ఞాతవాసం నుంచి విముక్తిపొంది, విరటుడి కొలువులో రాజాస్థానంలో కూర్చోడంతో విముక్తి పొందినట్లు, దానికి శుభసూచకంగా వివాహంతో కథ సుఖాంతమౌతుంది.

### 1. 8. 9. మాధవి :-

### 1. 8. 9. 1. రచయిత్రి పరిచయం :-

'స్నేహ పల్లవి' రచయిత్రి నిరుపమ రంజన కన్నడంలో రాసిన నవల మాధవి. ఇతిహాస పాత్ర అయిన మాధవి పాత్రను తీసుకుని సామాన్య మానవ కోణంలో చిత్రించారు. ఈ నవలను కళ్యాణి తెలుగులోకి అనువాదం చేసారు.

### 1. 8. 9. 2. కథా సంవిధానం :-

యయాతికాలం నాటికి పెళ్ళీడు వచ్చిన కన్యను దానంగా యివ్వడం ఉంది. యయాతికి భాండాగారంలోని ధనం ఖర్చయిపోయింది. ఆ సమయంలో విశ్వామిత్రుడి శిష్యుడు గాలవుడు గురువుకోరిన దక్షిణ నిమిత్తం వస్తాడు. ఏమీ సాయంచేయలేని స్థితిలో యయాతి తన కూతురు మాధవిని గురుదక్షిణ తీర్చుకోవడానికి గాలవుడికిచ్చాడు.

యుక్తవయస్సులో ఉన్న మాధవి చాలా మందిచేతుల్లో బలైపోయింది. ఆడదిగా పుట్టడమే మాధవి చేసిన దోషమని, ఆడవారికి కష్టాలు తేడానికి సంప్రదాయంగాను, దానాల పేరిట ఆడవాళ్ళు బలైపోడాన్ని నిశితంగా విమర్శించారు. సమస్యలనుంచి స్త్రీ స్వేచ్ఛను, ఆమె మనస్సుకు ప్రాధాన్యాన్ని ఇవ్వాల్సిన స్థితిని ఈ నవలలో సూచించారు.

ఆర్థిక పరంగా గౌరవస్థానంలో ఉన్నవ్యక్తే సంతానం పట్ల నిర్లక్ష్యం, వ్యర్థ గురుదక్షిణకు బలైపోయిన వైనాన్ని అంతర్లయగా ప్రశ్నించడం కనబడుతోంది. కొన్ని సందర్భాల్లో రచయిత్రి పాత్రలద్వారా నిలదీస్తుంది కూడా. మానవులకు సహజమైన దౌర్బల్యాలకు, క్లిష్టసమస్యలకు లోనైన పాత్రలు ఈ నవల్లో ఉన్నాయి. మహాభారతకాలం నాటి వర్ణవ్యవస్థ, అప్పటి సమాజానికి తగినట్లు ఈ నవలలో పాత్రల్ని మలిచారు. పాత నమ్మకాలకు ప్రభావితంకాకుండా మాధవి పాత్రను చూడాల్సిన ఆవశ్యకతను ఈ నవలలో విశదీకరించారు.

### 1. 8. 9. 3. సారాంశం :-

గంగా, యమునా సంగమస్థలంలో ప్రతిష్ఠానపురం ఉంది. అది చాలా అందమైనది. ఆ నగరానికి రాజు యయాతి. అతని మొదటి భార్య కూతురు మాధవి. మొదటసారిగా ఆడపిల్లని కన్నందుకు భార్యను చూడడానికి కూడా యయాతి ఇష్టపడడు. యయాతి భార్యకు పేరుకూడా రచయిత్రి పెట్టకపోడం యయాతి నిర్లక్ష్యాన్ని సూచిస్తోంది. ఆడపిల్లని కన్నాక యయాతి భార్య యయాతిని చూడాలని ఆశిస్తుంది. కానీ యయాతి రాడు. దురదృష్ట వశాత్తు మర్నాడే చివరిసారిగా యయాతిని చూడకుండానే యయాతి భార్య చనిపోతుంది. అప్పుడు యయాతి వస్తాడు. తల్లిని బలితీసుకున్న ఆడపిల్లగా భావించి మాధవిని 'అపశకునపు పక్షి' గా ఈసడిస్తాడు. దగ్గరిలో ఉన్న దాసి పసిపిల్ల ఏం చేసిందని గొణుగుతుంది. ఆ మాట విన్న యయాతి కోపంతో, ఈ పిల్లను నువ్వే చూసుకో అనేసి వెళ్ళిపోతాడు. అప్పటి నుంచీ ఆ దాసే అమ్మా, నాన్న అయి మాధవిని సాకుతుంది.

మాధవికి యుక్తవయస్సు వచ్చేసరికి స్వయంవరం చేయాలని యయాతి అనుకునే సమయంలో గాలవుడు వచ్చి, తనను పరిచయంచేసుకొని, తనకు సాయం చేయమని, యయాతి దగ్గరినుంచీ మాధవిని గురుదక్షిణ తీరేవరకూ దానంగా పొందుతాడు. తండ్రికి తనమీద మమకారం లేకపోయినా, మాధవికి పెద్దల పట్ల గౌరవం ఉండడంతో గాలవుడి వెంట అరణ్యమార్గాన బయలుదేరింది.

గాలవుడు విశ్వామిత్రుడి శిష్యుడు. యజుర్వేదంలో పరిపూర్ణ పాండిత్యం సంపాదించాడు. గురువు వెళ్లడానికి అనుమతి ఇచ్చాడు. గురుదక్షిణ ఇవ్వాలని మొండిపట్టుదల పట్టాడు. గురువుకి కోపంవచ్చి గాలవుడు ఇవ్వలేనిదాన్ని కోరుకోవాలనుకున్నాడు. 'శరీరమంతా తెల్లగాను ఒక చెవిదగ్గర మాత్రమే నల్లగాను ఉండే ఎనిమిది వందల గుర్రాల్ని తెచ్చి అప్పగించమని కోరుకున్నాడు'. గాలవుడు దిగ్భ్రాంతి చెందినా, 'సరే' అని గురువుకు నమస్కరించి బయలు దేరాడు.

గాలవుడు తపస్సుచేస్తుండగా, అప్పుడు అక్కడకు గరుడుడు వచ్చాడు. గరుత్మంతుడు యయాతి దగ్గరికి వెళ్లమని సలహా ఇచ్చాడు. ప్రతిష్ఠానపురానికి చేరి యయాతిని దర్శించి, తన గురుదక్షిణ విషయాన్ని చెప్పాడు. అప్పటికే యయాతి దగ్గర ధనంలేదు. అయినా గాలవుడికి సాయంచేయాలని తన కూతుర్ని ఇచ్చి, ఆమెద్వారా గురుదక్షిణ చెల్లించమని చెప్పాడు. తండ్రిమాటకు కట్టుబడి మాధవి గాలవుడితో బయలుదేరింది.

అడవిమార్గంలో మాధవిని తీసుకుని గాలవుడు బయలుదేరాడు. సుకుమారైన మాధవి చాలా దూరం నడవడానికి కష్టపడింది. కాళ్లు బొబ్బలెక్కాయి. దూరంలో పొడుపడిన ముని ఆశ్రమంలో ఒకరాత్రి గడిపారు. అప్పుడే మాధవి అందానికి గాలవుడు ఆకర్షితుడై, తనలో తనే ఘర్షణచెంది, మనసులో వచ్చింది 'పాడుఆలోచన' గా భావించి, మనస్సును అదుపులోకి తెచ్చు కున్నాడు. మర్నాడు మళ్లీ ప్రయాణం సాగించారు.

దూరంలో హర్యశ్వుడు, అయోధ్యాపతి, రాజ్యం ఉందని గాలవుడు తెలుసుకుని అక్కడకి వెళ్లారు. ఆ రాజుకి యయాతి వయస్సుంటుంది. మాధవితో గాలవుడు అతని దర్శనం చేసుకున్నాడు. మాధవిని చూసిన మరుక్షణమే ఆమెను పొందాలనుకున్నాడు. గాలవుడు తన గురుదక్షిణ గురించి చెప్పాడు. హర్యశ్వుడు తనదగ్గర రెండువందల గుర్రాలే ఉన్నాయని మాధవితో ఒక పుత్రసంతానం పొందాక ఇచ్చేస్తానని ఒప్పిస్తాడు. గాలవుడు సంవత్సరం తర్వాత వస్తానని గడువుపెట్టి వెళ్లిపోతాడు.

మాధవికి హర్యశ్వుడిద్వారా 'వసుమనసుడు/వసుమంతుడు' పుట్టాడు. కొద్దిరోజులకే గాలవుడు మాధవిని తీసుకెళ్లడానికి వచ్చాడు. రాజుకి కటువుగా మాధవి 'రాజా! మీలక్ష్యమైన కొడుకు పుట్టాడు. ఇప్పటితో మీ అధికారం పోయింది' అని చెప్పింది. ఆ మాటతో రాజుకి కోపం వచ్చి కొట్టబోయినా, తనకు మగ పిల్లాడిని ఇచ్చినందుకు కొట్టలేక పోయాడు. అలా మాధవి తప్పనిసరిగా కన్న కొడుకుని వదలవలసి వచ్చింది.

గాలవుడు బాలింతగాఉన్న మాధవిని తీసుకుని అరణ్యమార్గాన తీసుకెళ్లాడు. పంతానికి మాధవి నడచినా నడిచే ఓపిక లేక పైగా చలికి ఒణికి పోయింది. దగ్గరిలో 'ధారుణి ఋషి' ఆశ్రమంలో ఉండి, కోలుకున్నాక 'దివోదాస మహారాజు' దగ్గరికి తీసుకెళ్ళాడు. అతడి దగ్గర ఉన్న రెండు వందలగుర్రాలకుగాను మాధవిని తాకట్టు పెట్టాడు. దివోదాసుడు వెంటనే గాలవుడి ఆధ్వర్యాన మాధవిని తాత్కాలిక వివాహం చేసుకున్నాడు.

దివోదాసుడు అశ్వమేధ యాగం చేసి పాయస పాత్రను రాణి 'సత్యవతి' కి ఇచ్చాడు. అందరి రాణులకు అందాక చివరికి మాధవికి పాయసం మిగలని ఒట్టి పాత్రవస్తుంది. అయినా మాధవి బాధపడదు. ఆ తర్వాత దివోదాసుడు మాధవి మందిరానికి వస్తాడు. మాధవి గర్భందాల్చి 'శిబి' ని కంటుంది. ఈ లోగా గాలవుడు చాలా ప్రదేశాలు తిరిగి ఇంకా తన గురువు చెప్పిన గుర్రాలు లేవని తెలుసుకుని బాధపడతాడు. ఉశీనరుడు విశ్వామిత్రుడికే మాధవిని ఇచ్చేయమని గాలవుడికి సలహా ఇస్తాడు. వెనుకటి రాజులదగ్గరికి మనుషుల్ని పంపి ఆ గుర్రాల్ని తెప్పించమని గాలవుడు రాజును కోరతాడు. గాలవుడు మాధవితో దివోదాసు డిచ్చిన గుర్రాలతోను విశ్వామిత్రుడి ఆశ్రమానికి బయలు దేరతాడు.

విశ్వామిత్రుల ఆశ్రమం చేరి అతడికి నమస్కరించి, తనకు లభించిన గుర్రాలను అప్పగించి, మిగిలిన గుర్రాలకు బదులుగా మాధవిని గ్రహించమని ప్రార్థిస్తాడు. మాధవి అందానికి విశ్వామిత్రుడు ఆనందించి 'గాలవా!, మొదటనే ఈమెను తెచ్చి గురుదక్షిణగా ఇస్తే, నలుగురు పుత్రులని నేనే పొందుదును కదా' అని అంటాడు. ఆ మాటలు విన్న మాధవికి కోపం వచ్చి, ఈ ముని వల్లే తనకి ఈ గతి పట్టిందని భావిస్తుంది. గాలవుడిమీద పెంచుకున్న కోపమంతా కళ్ళలోకి తెచ్చుకుని నిప్పులు రాలుతుండగా పెదవులు ముడుచుకుని తన అనిష్టతను వ్యక్తంచేస్తూనే చేతులు జోడించి విశ్వామిత్రుడికి నమస్కరించింది. మహాపొగరుబోతు పిల్లలా ఉంది. దీన్ని లొంగదీయటం చాలా బాగుంటుంద' ని మనసులోనే విశ్వామిత్రుడు అనుకున్నాడు.

మాధవి ఒంటరిగా ఉన్న రాత్రి సమయంలో విశ్వామిత్రుడు వచ్చి ఆమె కుడిచేయి పట్టుకుని 'వెన్నెల సాక్షిగా నువ్వివాల్టినుంచీ నా భార్యవు' అని అన్నాడు. ఆమె 'వద్దు' అన్నా విశ్వామిత్రుడు బలవంతం చేసాడు. "కామాన్ని స్వేచ్ఛగా అనుభవించిన దానివి నువ్వు, అందుకే నీకు కోరిక లేదు. కానీ, నాకున్న ఆకలి ఎన్నో సంవత్సరాలది. దాన్ని తృప్తిపరచకపోతే, నాకు పిచ్చెక్కుతుంద" ని విశ్వామిత్రుడు మాధవితో అన్నాడు. (పుట. 160) అలా తనకు యిష్టం లేకపోయినా మాధవి బలైపోయింది. ఋష్యాశ్రమంలో పనులన్ని పర్యవేక్షించడం మాధవి పనిగా పెట్టుకుంది.

ఒకరోజు గాలవుడు విశ్వామిత్రుడికిచ్చిన గుర్రాలు అడవిలో తిరుగుతుండగా చూసి, ఆ విషయాన్నివిశ్వామిత్రుణ్ణి అడిగింది. వాటిని స్వేచ్ఛగా వదిలేసినట్లు విశ్వామిత్రుడు చెప్పేసరికి మాధవికి కోపం వచ్చింది. అప్రయోజనమైన కోరిక కోరడమెందుకని విశ్వామిత్రుణ్ని నిలదీసింది. గాలవుడు సంపాదించలేడని తనుకోరినట్లు విశ్వామిత్రుడు చెప్పాడు. ఈ గుర్రాల్ని సంపాదించడంకోసం తాను పడిన కష్టాల్ని చెప్పింది.

ఓ రోజు మాధవి విశ్వామిత్రుణ్ని 'ముని ఎలా ఉండాలని' అడిగింది. నిర్ద్వంద్వుడై, అంటే శీతోష్ణాలు, సుఖదుఃఖాలు, మానావమానాలు, జయాపజయాలు, నిందాస్తుతులను సమానంగా స్వీకరించేలా ఉండాలని అతను చెప్పాడు. అతడి ద్వారా తపస్సుకు ఆడా, మగా లాంటి భేదాలు లేవని తెలుసుకుంది. మాధవి, విశ్వామిత్రులకు 'అష్టకుడు' పుట్టాడు. ఆ బిడ్డను మహామునిగా చేస్తానని, విశ్వామిత్రుడు మాధవితో అన్నాడు. గడువు,

గురుదక్షిణలు పూర్తి అయ్యాక, గాలవుడు వచ్చి, యయాతికి మాధవిని అప్పగించాడు. మాధవికి ఇంకా పాతజ్ఞాపకాలు చెరిగిపోలేదు. తిరిగి వచ్చిన మాధవికి పెళ్లి చేయాలని అనుకుని యయాతి స్వయవరం ప్రకటించాడు. చాలమంది రాజులు వచ్చారు. నీకు నచ్చిన వ్యక్తిని వరమాలతో వరించమని, యయాతి మాధవికి చెప్పాడు. తానొక విషయం చెప్పాలని మాధవి తండ్రి దగ్గర అనుమతి తీసుకుంది. సభాముఖంగా తిరిగి మాధవి, 'తను ముగ్గురు రాజులతోను, ఒక ఋషితోను ఉండి వచ్చానని, తనను పెళ్లి చేసుకోడం మీకు ఇష్టమేనా?' అని రాజకుమారుల్ని ప్రశ్నించింది.

మాధవి మాటలు విన్న రాజకుమారులు మూడు రాజ్యాల్ని తిరిగి, ఒక ఋషి దర్శనం చేసుకుని తన తెలివిని పెంచుకుందని భావించారు. అందుకే ఏ రాజకుమారుడు మాధవిని వివాహం చేసుకోడానికి అభ్యంతరం చెప్పలేదు. దాంతో మాధవికి మగజాతి మీద జుగుప్స కలిగింది. చివరకు ఎవరినీ వరించలేదు. చేతిలో ఉన్న వరమాలను విసిరేసింది. అక్కడున్న రాజ కుమారుల్ని తిరస్కరించి, ఈ ప్రపంచాన్నే ధిక్కరించేత పెద్ద పెద్ద అంగలేస్తూ వేగంగా నడిచింది. ఆమెనుఆపేశక్తి ఎవరికీలేకపోయింది. స్వయంవరం మంటపంలోని వారు అవాక్కయి ప్రతిమల్లా ఉండిపోయారు. ఇలా మాధవి స్వేచ్ఛ కోసం అరణ్యాల వైపు అడుగులు వేసిందని రచయిత్రి ముగించారు.

### 1. 8. 10. యయాతి నవల :-

#### 1. 8. 10. 1. రచయిత పరిచయం ః-

పద్మభూషణ్ (1968), జ్ఞానపీఠ్ (1974), వంటి విశిష్ట పురస్కారాలు అందుకున్న మరాఠీ రచయిత విష్ణూ సఖారాం ఖాండేకర్. ఇతడు రాసిన నవలే 'యయాతి'. ఈ నవలకే జ్ఞానపీఠ్ వచ్చింది. 1960 లోమహారాష్ట్ర స్టేట్ అవార్డ్, అదే సంవత్సరంలో సాహిత్య అకాడమీ అవార్డులు వచ్చాయి. 1970 లో శివాజీ విశ్వవిద్యాలయం, కొల్హాపూర్, డి. లిట్., తో గౌరవించింది. 1998 సం. లో భారత ప్రభుత్వం ఇతని గౌరవార్థం పోస్టల్ స్టాంపు విడుదల చేసింది. జనవరి 19, 1898 సం. లో 'సంగ్లీ 'గ్రామంలో (మహారాష్ట్ర) పుట్టారు. పాఠశాల ఉపాధ్యాయుడిగా 1920 లో ఉద్యోగం లో చేరారు. పదహారు నవలలు, ఆరుకు పైగా నాటకాలు, రెండు వందల ఏభై కథలు, వందకు పైగా వ్యాసాలు, రెండువందలకు మించి విమర్శా వ్యాసాలు రాసారు. సెప్టెంబరు 2, 1976 లో తనువు చాలించారు.

యయాతి నవలను హిందీ- తెలుగు రెండు భాషల్లో డాక్టరేట్లు పొందిన పరిశోధకుడు, కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు పొందిన రచయిత యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ ఈ నవలను తెలుగులోకి అనువాదం చేసారు.

#### 1. 8. 10. 2. కథా సంవిధానం ః-

'నేను ఒక రాజును కనక నా కథ వినిపిస్తున్నానా? ఏమో నాకే సరిగా తెలియడంలేదు. అసలు వాస్తవానికి నేను ఒక రాజునా? కాదు, నేను ఒకప్పుడు మాత్రమే రాజును. అసలు ప్రేమకథో కాదో కూడా తెలియదు. రాజవంశంలో పుట్టి ఉంటే ఎలా ఉండేదో , అయినప్పటీ ఈ రోజు నా జీవితకథ ఎందుకు చెబుతున్నాను? ఏ విషయం నాకు

ప్రేరణ కలిగిస్తున్నది? గాయాలను ఇతరులకుచూపిస్తే బాధకొంత తగ్గుతుంది. ఎవరైనా దగ్గరకూర్చొని యోగక్షేమాలు విచారిస్తే, రోగి పరిస్థితి కొంచెం మెరుగైనట్లనిపిస్తుంది. ఏది ఏమైనా శ్రావణమేఘాలమాదిరిగా ఈ కథలో నామనస్సు నిండిపోయిందన్నది నిజం' అని యయాతి అనుకోవడంతో ఈ నవల ప్రారంభమౌతుంది. ఎంతటి వారికైనా కష్టాలు వస్తాయి. వాటిని విచారించేవారు లేకపోతే ఆ స్థితి దుర్భరమౌతుంది అని అంటూనే తను చెబుతున్న జీవితకథ ఎలాంటిదో పాఠకులే నిర్ణయించుకో వచ్చు అని కవి సూచన చేస్తున్నాడు.

ఈ ప్రపంచం తప్పులు చేస్తుంది. తప్పులగురించి తెలుసుకుంటుంది. అయితే తప్పులనుంచీ గుణపాఠం నేర్చుకోదు. ప్రతిమనిషి జీవితచరమాంకానికి వచ్చేటప్పటికి ఎంతో కొంత నేర్చుకుంటాడు. అది అతడి అనుభవాలనుంచి నేర్చుకున్నదే కాని ఎదురు దెబ్బల నుంచి కాదు. జీవితమంటే- 'అజ్ఞాతపు చీకటిలో మిణుకు మిణుకుమనే నక్షత్రాల వెలుగున్న కాలిబాటల వెంటసాగే మానవ ప్రయాణం'. ఆ ప్రయాణంలో అవస్థలుంటాయి. వాటిని కొంచమైనా ఇతరులకు వినిపించాలన్నది కథానాయకుడి ఉద్దేశంగా రచయిత వివరించారు.

మనిషికి కొన్ని కట్టుబాట్లు ఉన్నాయి. అవి వ్యక్తులమీద, దేశ కాలాల మీద ఆధారపడి ఉంటాయి. స్త్రీలోలత్వాన్ని భారతీయ సమాజం సహించదు. పర భార్యల్ని తల్లిలా చూడాలని శాస్త్రాలు ఘోషిస్తున్నాయి. ఒకవేళ పరస్త్రీ వ్యామోహం ఉన్న వ్యక్తి స్థాయి, ప్రేమను పొందలేని వ్యక్తియొక్క అచేతనత్వం ఎలా ఉంటుందో దృష్టిలో పెట్టుకుని రచయిత ఈ రచన సాగించాడు.

పురూరవుడు ఒక గొప్పరాజు. అతడి స్త్రీలోలత్వపు చిహ్నం బలవంతంగా ఊర్వశిని పొందడం. ఆ గుణాల్ని పుణికి పుచ్చుకున్న వారి కొడుకే నహుషుడు. అయితే లోకంలో నూరు యాగాలుచేసిన గొప్పవాడు నహుషుడు. ఇతడు దేవలోకంలో ఇంద్రుణ్ణి జయించి అతని భార్య శచీదేవిని పొందాలని భావించాడు. అతడి నుంచీ తప్పించుకొడానికి నారదుడి సలహా మేరకు శచీదేవి సప్త ఋషుల్ని బోయీలుగా పల్లకినెక్కి, తన దగ్గరికి వచ్చినట్లయితే నహుషుడి కోరిక తీరుస్తానని అంటుంది. యుక్తాయుక్త విచక్షణ హీనుడైఉన్న నహుషుడు శచీదేవి చెప్పినట్లే వస్తున్నాడు.

దారిలో ఆలస్యం అయిపోతుందని వేగంగా వెళ్లమని నహుషుడు ఆజ్ఞాపించాడు. అయితే పొట్టివాడైన అగస్త్యుడు ఉండడంవల్ల కుదుపులు వచ్చాయి. దాంతో విచక్షణ కోల్పోయి నహుషుడు అగస్త్యుణ్ణి కాలితో తన్నాడు. కోపించిన అగస్త్యుడు 'అజగరం (కొండచెలువ)'గా జన్మించమని శపించాడు. తర్వాత శాంతించి శాపావసానాన్ని చెప్పాడు. ఒక రాజు ఎలా ఉండాలి?, అతడు తన ఉనికిని కోల్పోయిన స్థితి ఎలావుంటుంది? అని ప్రారంభించి సామాన్యమానవ జీవన తత్త్వాన్ని ఆధారంగా చేసిచెప్పడం ఈ నవలకు ప్రాతిపదికలు.

'యయాతి నవల' లోని వస్తువు యయాతి ప్రేమ. అయితే ఆ ప్రేమ కేవలం అందానికి సంబంధించినదేకాదు, హృదయానికి సంబంధించిందికూడా. భారతదేశ సంస్కృతిలో వివాహం ఒక సాంఘికమైన కట్టుబాటు. అయితే దాన్ని ఆయుధంగా వాడుకుని భర్తను నిర్లక్ష్యంచేసిన, చేస్తున్న భార్యలకు ప్రతీక దేవయాని.

ప్రేమించడం ఒకరిని(కచుణ్ణి), పెళ్ళి చేసుకోడం మరొకర్ని(యయాతి). ప్రేమించిన వాడు తిరస్కరించి, శపించడాన్ని తట్టుకోలేనిస్థితిలో శాపాన్నిచ్చింది. తనుపొందలేని సంపద, కీర్తి శర్మిష్ఠ పొందుతుందని, అది తనే పొందాలని యయాతిమీదకు మనసును మరల్చడానికి సిద్ధపడింది. ఆ సంఘర్షణలో సమాజపు అడ్డంకిగా ఉన్న కులాంతర వివాహాన్ని కూడా తప్పులేనట్లు తండ్రిచేత తీర్మానం చేయించింది. తండ్రికి ప్రేమతో దేవయాని తప్పుదారి పట్టించింది. కూతురు ఇష్టాన్ని కాదనలేని తండ్రిహృదయం విశ్వామిత్రుడిది. పైగా తనకు ఆశ్రయమిచ్చిన వృషపర్వుడి కూతురును యయాతికివ్వాలని భావించినట్లుకూడా విశ్వామిత్రుడికి తెలుసు. అయినా కూతురు మనసును మరల్చలేని స్థితి అతడిది.

యయాతి రాజుగా ఉన్నా సమాజంలోని కట్టుబాట్లు ఒకవైపు, మరోవైపు మనసు. ఈ రెండింటి సంఘర్షణలో జీవితంలోని ప్రేమను పంచిన శర్మిష్ఠను వదలుకుని మద్యానికి బానిసై, వ్యక్తిత్వాన్ని కోల్పోయిన వైనంలో దురలవాట్ల ప్రభావాన్ని రచయిత వివరించాడు. ప్రేమించిన వ్యక్తి (యయాతి) దూరమైనా సమాజంలో ధైర్యంగా, ఆశావహ జీవితానికి బాటలు వేసిన వ్యక్తికి ప్రతినిధిగా శర్మిష్ఠను తీర్చాడు.

పెద్దలపట్ల పిల్లల బాధ్యత ఎలా ఉండాలో 'పురు' పాత్ర ద్వారాను, ఎలా ఉండ కూడదో 'యయు' పాత్రద్వారా సూచించాడు. పైగా 'పురు' మనుషులమనసుల్ని ఆకట్టుకున్న విశిష్టవ్యక్తిత్వంఉన్న వాడిగా కనిపిస్తాడు. 'పురు' ఎప్పటికీ ఆదర్శవంతమైన పాత్రే. ఇలా విలక్షణత ఉన్న పాత్రల వైవిధ్యాన్ని అనుసంధానం చేయడం ఈ నవలలో కనిపిస్తోంది.

### 1. 8. 10. 3. సారాంశం :-

నహుషుడి కుమారుడు 'యయాతి'. యయాతి తల్లి 'ప్రియంవద'. యయతి అన్నయ్య 'యతి'. యతి చిన్నప్పుడే ఎవరో మునివల్ల పురువంశజులకు సుఖంలేదని, శాపం ఉందని తెలుసుకున్నాడు. పురువంశం సుఖంగాఉండేలా చేయాలని తలచి, తల్లికి చెప్పకుండా అడవులకు తపస్సుచేసి సాధించాలని వెళ్లిపోయాడు. అందువల్ల యతి తమ్ముడు యయాతి రాజ్య పాలకుడు అయ్యాడు.

యయాతి యుక్త వయస్సులో ఉన్నప్పుడు దేవదానవ యుద్ధం జరిగింది. ఆ యుద్ధం ఆపడం కోసం ఆంగీరసమహర్షి శాంతి యాగాన్ని సంకల్పించాడు. ఆ యాగానికి ఆంగీరసుడే ప్రధాన ఋత్విక్కు. అంగీరసుడి శిష్యులలో ప్రధానుడు కచుడు. ఆంగీరస ఆశ్రమంలో యయాతి కొన్నాళ్లున్నాడు. అప్పుడే దేవతలగురువు, బృహస్పతి కొడుకు

కచుడితో యయాతికి పరిచయం స్నేహంగా మారింది. యాగం పూర్తయ్యాక యయాతి తన రాజ్యానికి వెళ్లాడు.

యయాతి తన అన్న 'యతి' ని వెదకడానికి వెళ్ళాడు. ఒకచోట యతికి సంబంధించిన విషయాలు తెలుసుకుంటాడు. అక్కడనుంచీ కొంచెం దూరం వెళ్లేసరికి, ఒక యువతి ప్రవాహంలో దూకడం కనిపిస్తుంది. వెంటనే వెళ్ళి, ఆమెను రక్షిస్తాడు. ఆమె పేరు 'అలక'. యయాతికి సన్నిహితమైన దాసి, అందగత్తెకూడా. యయాతి ఆమెమీద మోజు పడ్డాడని తెలిసి రాజమాత రాజ్యంనుంచీ ఆమెను పంపించింది. ఆ తరువాత అలకను ఒక జూదరికిచ్చి పెళ్లిచేసారు. వాడు జూదంలో ఈమెను ఒడ్డి ఓడిపోయాడు. గెలిచినవాడు బలవంతం చేయబోగా తప్పించుకుని వచ్చి, ఏంచేయాలో తోచక ఆత్మహత్య చేసుకోవాలని అనుకుని ప్రవాహంలో దూకింది. ఈ విషయాన్నే యయాతికి చెప్పింది. అతడు అలకను తన సోదరిగా భావించి, తగిన మర్యాదలు చేయసాగాడు. విషయం తప్పుగా గ్రహించిన 'యయాతితల్లి' 'అలక'ను చీకటిగృహంలో బంధించి విషంపెట్టి, చంపించేస్తుంది. యయాతి చాలాబాధపడి, ప్రశాంతత కోసం అడవికి బయలు దేరాడు.

రాక్షస రాజ్యానికి రాజు వృషపర్వుడు. అతడి గురువు శుక్రాచార్యులు. మృతసంజీవని విద్య వచ్చినవాడితడే. ఆ విద్య ప్రభావంతో యుద్ధంలో మరణించిన రాక్షసుల్ని బతికించేస్తున్నాడు. దేవదానవ యుద్ధంలో దేవతల ఓటమికి ఇదే ప్రధానకారణంఅని భావించి, తాత్కాలికంగా యుద్ధాన్ని ఆపేస్తారు. శుక్రాచార్యుల దగ్గర మృతసంజివని విద్యను నేర్చుకుంటే యుద్ధం జరగదని కచుడు భావిస్తాడు. దేవతలు హితవులు చెబుతారు. అంగీరసుడు ఆశీర్వదిస్తాడు. అయినప్పటికీ, రాక్షసరాజ్యానికి భయంతో బయలుదేరతాడు.

శుక్రాచార్యులదగ్గరికి చేరి వినయపూర్వకంగా నమస్కరించి, అతడి మనసులో స్థానం సంపాదిస్తాడు. అది నచ్చని రాక్షసవిద్యార్థులు కచుణ్ణి ముక్కలుగా తరిగి తోడేళ్లకు వేయడం.., చివరకు అతణ్ణి చంపి, శుక్రుడు తాగే మదిరలో కలిపేస్తారు. శుక్రుడి గారాల కూతురు, దేవయాని అందోళనపడడంతో కచుణ్ణి మృతసంజీవని విద్యద్వారా తనపొట్టలోనే కచుడున్నాడని తెలుసు కుంటాడు. కచుడికి మృతసంజీవని విద్య నేర్పి, పొట్టను చీల్చుకుని బయటకు రమ్మంటాడు. కచుడు బయటకి వచ్చాక, శుక్రుణ్ణి బతికిస్తాడు.

దేవయాని కచుణ్ణి ప్రేమిస్తుంది. కానీ, కచుడు తనకు సహోదరి అవుతావని ఆమె ప్రేమను తృణీకరిస్తాడు. దాంతో కోపం వచ్చి దేవయాని 'నీవు నేర్చుకున్న విద్య నీకు పనికిరాదు' అని శాపాన్నిచ్చింది. కచుడు కూడా 'నిన్ను ఏ బ్రాహ్మణుడు వివాహమాడడని' ప్రతి శాపమిచ్చాడు. మృతసంజీవని విద్య నేర్చుకుని కచుడు దేవలోకానికి వెళ్లిపోతాడు. కచుడిమీద కోపం ఉన్న దేవయాని బాధపడుతుంది. ఆ సందర్భంలోనే శర్మిష్ఠ జలక్రీడకు రమ్మని కబురుపెడుతుంది. జలక్రీడలో జరిగిన గొడవవల్ల దేవయాని నూతిలో పడిపోతుంది. అక్కడే వదలి శర్మిష్ఠ నగరానికి వెళ్లిపోతుంది.

యయాతి తన అన్నను వెదకడానికి అరణ్యాలు తిరుగుతూ, దేవయాని నూతిలో పడిన వైపు వస్తాడు. వామహస్తంతో దేవయానిని రక్షించి, తన కులగోత్రాలు చెప్పి వెళ్లిపోతాడు. దేవయాని పంతం పట్టి శర్మిష్ఠను దాసిగా ఉండేలా కోరుకుంటుంది. శర్మిష్ఠ చేసేదిలేక ఆమెకు తన వెయ్యిమంది దాసీ జనంతో దేవయానికి దాసిగా ఉంటుంది. ఒక రోజు యయాతి వేటకై వచ్చి దేవయాని విచ్చేసిన వనంలోకి వస్తాడు. అతణ్ణి చూసి దేయయాని తన భర్తగా చేసుకోవాలని అనుకుంటుంది. నూతిలో పడినప్పుడు వామహస్తం పట్టుకున్నప్పుడే వివాహం అయిందని దబాయిస్తుంది.

ఆ వివాహం చెల్లదని, యయాతికి పెద్దలు ఒప్పు అని చెప్తే, చేసుకుంటానని అంటాడు. విశ్వామిత్రుడితో వివాహం చేసుకోవడం తప్పుకాదని చెప్పించి, దేవయాని యయాతితో వివాహం జరిపించుకుంటుంది. నిజానికి వృషపర్వుడు తన కూతురు శర్మిష్ఠను యయాతికిచ్చి పెళ్లి చేయాలని అనుకుంటాడు. దేవయాని యయాతిని వంచించి, పెళ్లిచేసుందని శర్మిష్ఠ అర్థం చేసుకుంటుంది. ఆ మాయను మాయతోనే జయించాలని అనుకుంటుంది. దేవయానికి 'యదు' కొడుకు పుడతాడు. అక్కడనుంచీ ఆమె యయాతిని అసలు పట్టించుకోడం మానేస్తుంది.

ఒకరోజు యయాతి ఒంటరిగా ఉన్నప్పుడు శర్మిష్ఠ అతని దగ్గరికి వెళ్లి, తన మనసులో మాటను చెప్పాలని అనుకుంటుంది. ఋతుమతి పూర్తయిన నన్ను స్వీకరించమని యయాతిని కోరి, అది తప్పుకాదని నిరూపించి ఒప్పిస్తుంది. వారికి 'పురు' పుడతాడు. ఒకరోజు దేవయానికి ఆ పిల్లవాడు శర్మిష్ఠ కొడుకని తెలిసి నిలదీస్తుంది. ఒకయోగి వరంవల్ల పుట్టాడని నమ్మిస్తుంది.

మరో రోజు అంతఃపురానికి ఒక జ్యోతిషవేత్త వస్తాడు. అతడికి యదు, పురుల జాతకాలు చూడమని దేవయాని అడుగుతుంది. పురు జాతకం చూసి చక్రవర్తి అవుతాడని చెబుతాడు. దాంతో కోపంవచ్చిన దేవయాని శర్మిష్ఠను రాజమాత అలకను బంధించిన చీకటిగృహంలో బంధిస్తుంది.

వసంతోత్సవంలో నాట్యం కారణంగా దేవయాని సభకు వెళ్లింది. శర్మిష్ఠ కనబడదు. దాంతో అనుమానంవచ్చి, యయాతి వృద్ధదాసిని నిలదీస్తాడు. ఆమె యిచ్చిన వార్తను అనుసరించి విషయం తెలుసుకుని, అక్కడ శర్మిష్ఠను ఉంచడం మంచిదికాదని భావిస్తాడు. శర్మిష్ఠను చీకటిగృహంలో చూసి బాధపడి తన స్నేహితుడు మాధవుడి సహాయంతో ఆమెను అక్కడనుంచీ తప్పిస్తాడు.

జోరుగాపడుతున్నవర్షంలో రథం తీసుకుని శర్మిష్ఠను, పురును ఎక్కించుకుని మాధవుడు దూరంగా వారిని వదలి వెనక్కి వచ్చేస్తాడు. అక్కడనుంచీ శర్మిష్ఠకు కష్టాలు ప్రారంభమౌతాయి. శర్మిష్ఠ తప్పించుకున్నదని దేవయాని తెలుసుకుంది. ఎవరయినా అంతఃపురదాసి (శర్మిష్ఠను)ని ఆమెకొడుకును పట్టుకొని తెచ్చినవారికి, తగిన బహుమానం యిస్తామని దండోరా వేయించింది. శర్మిష్ఠ చాలా ప్రాంతాలు తిరిగి, చివరికి ఓ

కొండప్రాంతం చేరింది. దూరంగా ఒక వ్యక్తి 'ఆగు ఆగు' అంటూ పరుగెత్తుకుంటూ శర్మిష్ఠవైపే వస్తున్నాడు. అతణ్ణి పరిశీలనగా చూసింది. అతడు యయాతి అన్నయ్య 'యతి'.

ఒకరోజు యయాతి సభలో ఉన్నప్పుడు యతి సభలోకి వచ్చాడు. అతణ్ణి కచుడు తీసుకు వచ్చాడు. అప్పటికి యతి పిచ్చివాడు. ఆ రోజు శర్మిష్ఠను చూసి కావాలని అన్నాడు. కానీ, అది కుదరలేదు. అక్కడనుంచీ మాయమైపోయాడు. మళ్లీ ఇప్పుడు కనిపించేసరికి శర్మిష్ఠకు భయమేసింది. యతి శర్మిష్ఠను గుర్తుపట్టి, తను మామూలు వాడిగా ఎలా మారాడో వివరించాడు. శర్మిష్ఠకు ధైర్యం చెప్పి, ఆమెను హిమాలయ ప్రాంతానికి చేర్చాడు.

శర్మిష్ఠను వర్షంలో వదలి వచ్చిన మాధవుడు ఇంటికి వచ్చాడు. జ్వరంవచ్చి కొద్దిరోజులకే చనిపోయాడు. శర్మిష్ఠ లేనిలోటు ఒకవైపు, ప్రియమిత్రుడు మాధవుడి మరణం మరోవైపు బాధించి యయాతి త్రాగుడుకు బానిసైపోయాడు. దేవయాని అతణ్ణి పట్టించుకోలేదు. శర్మిష్ఠకొడుకు పెద్దవాడవుతూ యుద్ధవిద్యలన్నీ నేర్చుకున్నాడు. హస్తినాపురానికి ఈశాన్యంవైపు శత్రురాజులు దండెత్తున్నట్లు యయాతి విన్నా, పట్టించుకోలేదు. రాజ్యం దేవయాని అజమాయిషీలో నడుస్తోంది. దేవయాని కొడుకు 'యయు/ యదు' పెద్దసైన్యంతో వెళ్లి అక్కడ తిరుగుబాటును అణచదలచాడు.

ఈశాన్యప్రాతంలో తిరుగుబాటు జరుగుతోందని తెలుసుకున్న 'పురు' తన సైన్యంతో యయుకి సహాయంగా వెళ్లాడు. అప్పటికే శత్రువులు యయుని బంధించారు. వెంటనే 'పురు' తన సైన్యంతో శత్రువులతో వీరోచితంగా పోరాడి, జయించాడు. యయుని విడిపించాడు. దిగ్విజయంగా వస్తున్న యువరాజుకోసం ఏర్పాట్లు చేయమని దేవయాని భటుల్ని ఆజ్ఞాపించింది.

యయాతివల్ల శర్మిష్ఠకు కొడుకు పుట్టాడని తెలుసుకున్న దేవయాని అలిగి తన తండ్రి శుక్రుడికి చెప్పింది. వెంటనే కోపించిన శుక్రుడు యయాతిని 'ముసలివాడి'గా అవ్వమని శపించాడు. యయాతి అభ్యర్థనమేరకు శాంతించి, నీ యువకులైన రక్తసంబంధికులు నీ ముసలితనాన్ని తీసుకుంటే, వారి యవ్వనంతో తిరిగి యవ్వనం నీకు వస్తుందని, శాపావసానాన్ని శుక్రుడు వివరిస్తాడు.

తన కామవాంఛలు తీరని యయాతి మళ్ళీ యుక్తవయస్సు పొందాలని, కొడుకుల్ని పిలచి తన ముసలితనాన్ని తీసుకోమని కొరతాడు. దేవయాని పిల్లలు నిరాకరిస్తారు. వారిని యయాతి శపిస్తాడు. 'పురు' వచ్చి తను ముసలితనాన్ని స్వీకరిస్తానని, తర్వాత శర్మిష్ఠ కొడుకుగా పరిచయం చేసుకొంటాడు. శర్మిష్ఠకు అన్యాయం చేసానని బాధపడి పొందిన యవ్వనాన్ని పురుకు ఇచ్చేయాలని 'తన ముసలి తనం పోయి అతడి యవ్వనం రావాలి' అని రెండుసార్లు అనేసరికి (మూడుమార్లు అంటే పొందిన యవ్వనం పోతుంది) మూడవమాటు అనేసరికి కచుడు కనిపిస్తాడు. యయాతి అకస్మాత్తుగా కుప్పకూలి పోతాడు.

కచుడు మృతసంజీవని నేర్చుకున్న తర్వాత, శుక్రుడు మళ్ళీ తపస్సు చేసి ఎవరినైన ముసలివాడిగా చేయగలిగే శక్తిని సంపాదిస్తాడు. దానికి విరుగుడుగా కచుడు ఆ ముసలితనం పోగొట్టగలిగే శక్తిని సంపాదిస్తాడు. ఆ శక్తితోనే యయాతిని యువకుడిగా మారుస్తాడు.'పురు' దేవయానిని "అమ్మా" అని పిలుస్తాడు. ఆ పిలుపుతో దేవయాని అనురాగవతిగా, మాతృ మూర్తిగా మారిపోతుంది. 'పురు'కే పట్టాభిషేకం చేయమని దేవయాని చెబుతుంది.

'పురు' పట్టాభిషేకంతో కథ ముగుస్తుంది. భోగలాలసుడైన యయాతి నైతిక విలువలకు తిలోదకాలిచ్చి పతనమయ్యాడు. మానవులంతా భోగలాలసులై పతనం కావద్దని రచయిత సూచించారు. పిల్లలు పెద్దల్ని అనురాగవంతులుగా మార్చేకోణం నూతనంగా కనిపిస్తోంది.

1. 8. 11. యాజ్ఞసేని :-

1. 8. 11. 1. రచయిత్రి పరిచయం :-

ఈ నవల ఒరియాలో వచ్చింది. దీన్ని ప్రతిభారాయ్ రాసారు. తెలుగు అనువాదం జయశ్రీ మోహన్ రాజ్ చేసారు.

1. 8. 11. 2. ఉపోద్ఘాతం :-

కామాంధులైన పురుషులచేత సుందరీమణులు యుగయుగాలనుంచీ బాధలు పడుతుతూనే ఉన్నారు. అవమానాలకూ గురౌతునే ఉన్నారు. ఆ అవమానతీవ్రత పతాకస్థాయికి చేర్చిన పౌరాణిక పాత్ర ద్రౌపది. ప్రతీ సన్నివేశంలో భర్తలు, అత్తగార్ల మాటలకి విలువిచ్చి కొన్ని కష్టాలకి బలై పోయింది. ఆ కష్టాల్ని ఇష్టుడు, సఖుడైన కృష్ణుడికి సమర్పించిన 'కృష్ణ' జీవితమే ఈ యాజ్ఞసేని.

ఐదుగుర్ని వరించడంలో సమాజానికి మేలు జరుగుతుందన్న అత్తగారి మాటలకి గౌరవాన్ని ఇచ్చింది, ఆమె మాటల్ని నమ్మింది. అయితే ఇదే విషయం లోకులతో కులటగా, అసతిగా ద్రౌపదికి అపకీర్తిని తెచ్చిపెట్టింది. అయినప్పటికి తన మనోబలాన్ని పోగొట్టుకోని వ్యక్తిత్వం ఉన్న మానసిక, శారీరక సౌందర్యవతి, సబలగా పండితురాలిగా, కుటుంబంలోని బాధ్యతల్ని, బంధాల్ని, బాధల్ని మోసిన అపర సౌశీల్యవతి ద్రౌపది.

కృష్ణుడి సహాయంతో జీవితాన్నంతా ఇష్టంగా మలుచుకొని, సఖుడిగా ఆయనకే అంకితం చేసిన అలౌక తత్త్వం; తల్లిలా లాలించే తనం, ప్రకృతికి తన్మయం అయ్యే స్వభావం, పాండవుల్నే కాక పురుషులందర్నీ ఆకట్టుకొనే అందంతో, విలక్షణంగా భాసించే మూర్తిమత్వం యాజ్ఞసేనికే సొంతం.

1. 8. 11. 3. కథాసంవిధానం :-

ఈ నవల 'సమాప్తం' తో మొదలై, ఆరంభంతో ముగుస్తోంది. ఎప్పుడో జరిగిపోయిన

కథ కానీ, ఇప్పటికీ దీని ఆరంభం సమాజంలో ఉందని సూచించడానికి ఈ విధంగా రచయిత్రి ఎత్తుగడ చేసినట్లనిపిస్తోంది. కృష్ణుడికిరాసినలేఖే ఈ నవల. మృత్యువువైపు సాగిపోతున్నప్పుడు తన సర్వస్వాన్ని సఖుడుగాఉన్న కృష్ణుడితో చెబుతున్నట్లు కథాభాగం నడుస్తుంది. కష్టకాలంలో చాలామందికి భగవంతుడు కనబడతాడని సూచించనట్లుగా ఈ అంశం ఉంది.

సాధారణ మానవచరిత్రగా 'కృష్ణ' జీవిత చరిత్ర చెప్పడం ఈ నవల రచయిత్రి ఉద్దేశం. అయితే సఖుడిగా కృష్ణుడు, సఖిగా కృష్ణకు ఉన్న సామ్యాలు ఈ నవలో విశేషమైన భావనతో కనబడుతోంది. అది ఈ నవలకు ఓ అంతర్లయ. కృష్ణతత్త్వాన్ని అర్జునుడిలోనూ, ద్రౌపదిలోనూ, కుంతిలోనూ, కర్ణుడిలోనూ కనిపించేలా చూపడం విలక్షణత. అహంకారంతో సహా భగవంతుడికే అర్పిస్తే సమస్యలే ఉండవన్న దిశలో ఈ నవల సాగుతోంది. స్త్రీల అభిప్రాయాలు స్వీకరించే కాలం నుంచీ వారి ఉనికికి, బాధ్యతలకు దూరంచేస్తూ అవమానపరచడంలో ఏర్పడిన నష్టాల ఫలితాలన్నీ ఈ నవల సూచిస్తోంది.

### 1. 8. 11. 4. సారాంశం :-

ద్వాపర యుగంలో యజ్ఞంనుంచి పుట్టిన విదుషీమణి సౌందర్యవతి, కృష్ణుడి ఇష్టసఖి ద్రౌపది. భారతంలో విలక్షణమైన పాత్ర పోషించి అద్వితీయమైన వ్యక్తిత్వంతో అలరారింది. ధర్మరక్షణ కోసమే జన్మించి, వీరులైన పాండవుల పత్నిగా, కుంతికి ప్రియమైన కోడలిగా, ధర్మయజ్ఞంలో శరీరాన్ని ఆహుతిచేసిన వీరనారీ రత్నమే ద్రౌపది. అగ్ని, జలం, ధరిత్రి, వాయు, ఆకాశం అనే పంచభూతాలతో కూడిన శరీరాన్ని వాటికి చిహ్నాలుగా భావించి పంచపతులకు అర్పించడం ద్వారా సతీత్వం నిరూపించిన 'సతి', విలక్షణమైన ఆలోచనాపరురాలు కృష్ణ. 'సతి' అన్న పదానికి, పతి అంటే విశ్వాసంగాఉండడమే సతీత్వంగా భావించినపాత్ర ఈమె(పుట. 59).

హిమాలయాలగుండా ప్రారంభమైన పాంచాలీ సహిత పాండవ మహాప్రస్థానంలో ద్రౌపది కాలుజారి పడిపోతుంది. ఎవరూ ఆమెని రక్షించరు. ఆర్తత్రాణుడైన, సఖుడైన శ్రీకృష్ణుడే రక్షకుడని తలచి, ద్రౌపది తనలో ఉన్న అహాన్ని కృష్ణుడికే వదిలి, తన జీవితకథని చెప్పడం ఒక ప్రత్యేకాంశం. బాల్యమంటే ఏమిటో ఆమెకు తెలీదు. పుట్టినప్పుడు 'కృష్ణ' అని పేరు ఎందుకు పెట్టారో తెలీదు. కానీ, కృష్ణుడికి కృష్ణకి ఉన్న సంబంధాన్ని మొదట్లో ప్రేమబంధంగాను, తర్వాత మిత్రత్వం సంబంధంగాను, రచయిత్రి వివరణ ఇచ్చారు.

యాజ్ఞసేని గణితశాస్త్రం, గృహవిజ్ఞానం, చిత్రలేఖనం, పాకశాస్త్రం, పుష్పాలంకరణ మొదలైనశాస్త్రాల్లో ప్రజ్ఞసంపాదించింది. ఒకసారి శాస్త్రచర్చలో నిమగ్నమైపోయి "మహాశయా, సృష్టిలోని శాస్త్రాలను, గ్రంథాలను, జ్ఞానాన్ని పొందడానికి ఒక జీవితకాలం చాలదంటే నేనేం చేయాలి?" అని వ్యాసుణ్ణి ప్రశ్నిస్తుంది.(పుట.20) దానికి సమాధానంగా వ్యాసుడు నవ్వి, 'నీ పేరు కృష్ణ కాకుండా 'తృష్ణ' అని ఉండాల్సింది. అమ్మా, తృష్ణ దుఃఖదాయకం; కానీ, జ్ఞాన తృష్ణ మాత్రమే ఆనందాన్నిస్తుంది... అనంతమైన కాల తీరాల్లోంచి జ్ఞానమనే రంగురంగుల గవ్వల్ని ఏరుకుంటూ జీవితకాలం గడిచి పోతే ఆ జన్మ

సార్థకమవుతుంది.'(పుట. 21) అనడంలో ద్రౌపది అపార జ్ఞానతృష్ణ వ్యక్తమౌతోంది.

కృష్ణుడి సలహాతో ద్రుపదుడు మత్స్యయంత్రాన్ని ఛేదించిన వీరుడికి తనకూతురు ద్రౌపదినిస్తానని ప్రకటనచేసాడు. చాలామంది రాజకుమారులు పరీక్షలో నెగ్గలేకపోయారు. కర్ణుడు వచ్చి, విల్లుని ఎత్తి నారి బిగించగానే ధృష్టద్యుమ్నుడు 'సూతపుత్రుడు రాధేయుడికి కృష్ణనిపొందె అధికారంలేదని' చెప్పడంతో కర్ణుడవమానంతో వెనుదిరిగాడు. బ్రాహ్మణ వేషంలో ఉన్న వ్యక్తి పృథకుమారుడు పృథ్వీమాతకి, ధర్మదేవతకి నమస్కరించి, మంద్ర స్వరంతో "కృష్ణ, కృష్ణులకు నమస్కారం" అన్నాడు (పుట.45). కృష్ణకు నమస్కరించడంలో శక్తిగా భావించినట్లు కృష్ణుడు వ్యాఖ్యానిస్తాడు. ఆ బ్రాహ్మణరూపంలోని వ్యక్తి మత్స్యయంత్రాన్ని ఛేదించడం, కృష్ణ వరమాల వేయడం జరిగిపోతాయి.

బీదబ్రాహ్మణుడు కృష్ణను జయించడంవల్ల రాజపుత్రులు అవమానంగా భావించి అతణ్ణి ఎదిరించాలని ప్రయత్నించి విఫలురయ్యారు. ఆ వరకన్యని పాండవులు ఏకచక్రపురానికి తీసుకు వచ్చారు. ముందుగా వెళ్ళిన ధర్మరాజు "అమ్మా, ఈ రోజు మేము ఒక అపూర్వ వస్తువుని తెచ్చాము. తలుపుతీసి చూడు, నీ పుత్రులు ఉత్తచేతులతో రాలేదు" అని కుంతితో చెప్పాడు. (పుట. 53) ఆమె ఐదుగురు అన్నదమ్ములూ సమంగా పంచుకోమని చెప్పిన తర్వాత, కృష్ణని చూసిఆశ్చర్యాన్ని పొందింది. అనృతదోషానికి గురౌతానని బాధపడుతుంది. ఆ అనృత దోషం పొందకుండా, తర్వాత పాండవులు పాంచాలిని పెళ్ళిచేసుకుంటారు.

పెళ్ళి విషయం తెలుసుకున్న ధృతరాష్ట్రుడు చేసేదిలేక, పాండవుల్ని ఆహ్వానించి ఖాండవ వనాన్ని ఇచ్చాడు. అక్కడితో కురుక్షేత్ర యుద్ధానికి అంకురార్పణ జరుగుతుంది. కృష్ణుడి సహాయంతో ఖాండవ వనాన్ని ఇంద్రప్రస్థంగా మార్చారు. ధర్మరాజు స్వప్నం[4], నారదుడి సలహామేరకు రాజసూయయాగాన్ని చేసాడు. జరాసంధ వధతో ప్రారంభమై శిశుపాలవధతో రాజసూయం ముగిసింది. పాండవులగౌరవం, ధనరాశుల్ని చూసి దుర్యోధనుడు ఈర్ష్యపడి, జూదంలో ధర్మరాజు సమస్తాన్ని శకుని సహాయంతో కొల్లగొట్టాడు. తర్వాత ద్రౌపది వస్త్రాపహరణానికి కారకుడయ్యాడు.

ధృతరాష్ట్రుడి వరాలతో సమస్తాన్ని పాండవులు పొందినా, మళ్ళీ జూదంలో ఓడి అరణ్యాలకి బయలుదేరాడు. కుంతి నిస్సహాయురాలై చివరికి విదురుడింట్లో ఉంది. చాలా కష్టాలు అనుభవించి ద్రౌపది, పాండవులు అరణ్య అజ్ఞాతవాసాలు పూర్తిచేసారు. అజ్ఞాతవాసంలో కీచక వధ జరిగింది. పాండవులు అజ్ఞాతవాసం పూర్తయ్యాక రాయబారాలు జరిగాయి. కృష్ణుడు ఎన్ని రకాలుగా చెప్పినా ధృతరాష్ట్ర, దుర్యోధనులు యుద్ధం మాని, పాండవులకి ఐదు ఊర్లు కూడా ఇవ్వడానికి అంగీకరించలేదు. యుద్ధంలో కృష్ణుడు పాండవులకి సహాయంగా ఉన్నా, చివరకి అభిమన్యుడు, ఉపపాండవులు మరణం పొందుతారు. గాంధారి నూర్గురు కొడుకుల్ని కోల్పోతుంది.

[4] దీనికి సంబంధించిన విషయం యాజ్ఞసేని నవల మార్పులు చేర్పులు లో చూడొచ్చు.

కృష్ణుడి సహాయంతో అభిమన్యుడి సంతానం ఉత్తర గర్భంలో క్షేమంగా ఉండి, పరీక్షిత్తు పుడతాడు. గాంధారి శాపకారణంగా యాదవకులం అంతరిస్తుంది. పాండవులు శక్తిహీనులై పోతాడు. హస్తినాపురానికి పరీక్షిత్తు; ఇంద్రప్రస్థానికి కృష్ణుడి మనుమడు వజ్రుడు సింహాసనాలు అధిష్ఠించారు. 'మాయ' అనే పేరున్న చెలికత్తె కృష్ణని వెంటాడుతునే ఉంటుంది. ఆమెతో సహా పాండవులు, ద్రౌపది స్వదేహాలతో స్వర్గారోహణ చేయడానికి హిమాలయాలకు చేరతారు. కృష్ణ తనలో ఉన్న అహంకారాన్ని వదిలి, కృష్ణుణ్ణి ఐదుకోరికలు5 కోరి చివరకు పునర్జన్మ ప్రసాదించమని వేడుకుంటుంది. పునర్జన్మలో తప్పులు దిద్దుకొని కృష్ణతత్త్వాన్ని ఆరాధించాలని, పవిత్ర భరత భూమిమీద పుట్టాలని కోరుకుంటూ మోహన వంశీధ్వనిరాగం వింటూ శాంతి మంత్రంతో నవల ముగుస్తోంది.

### 1. 8. 12. రాజమాత :-

#### 1. 8. 12. 1. రచయిత పరిచయం :-

ఈ నవల ఉత్పల సత్యనారాయణాచార్య రాసారు. వీరు అరవై ఏళ్ళకుపైగా అవిశ్రాంతంగా రచనావ్యాసంగాలు చేసారు. *జోత్స్న* (అనువాదం), *ఉత్పలిని* (వచన కవితా సంపుటి), *గాంధారి* (రవీంద్రుడి గాంధారి ఆవేదనకు అనువాదం), *విషబిందు*(నవల), *తపతి* (స్వతంత్రకావ్యం), *బాలగేయసాహిత్యం*, *ఈజంటనగరాలు* *హేమంతశిశిరాలు*(ఈ రచనకి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు), స్వప్నాలదుప్పటి మొదలైనవెన్నో రచనలు, వ్యాసాలు, వ్యాఖ్యలు, పాటలు వెలువరించారు. *శతరూప* కావ్యానికి 'మహకవి' బిరుదు పొందారు.

#### 1. 8. 12. 2. నామసార్థక్యం :-

'మానవసేవే మాధవసేవ' అన్న కృష్ణతత్త్వాన్ని, భగవద్గీతలో చెప్పిన నిష్కామకర్మల్ని ఈ నవలలో చూపించారు. కర్మలు చేయడమే కర్తవ్యం. ఫలితాలు ఆశించడం తగదు. ఈ విషయాన్నిఆచరణలోచూపినపాత్రే కుంతి. ఈమె చిన్నప్పటినుంచీ రాజకుమార్తె అయినప్పటికి, సేవాభావంతో పెరిగిన వ్యక్తిత్వంఉన్న పాత్ర. పాండురాజుని వరించి, అతడి కోరికతో పుత్రుల్ని పొందింది. రాజకన్య రాజమాత అయ్యింది.

రాజ్యభాగాన్ని పాండవులు పొందాక కుంతి రాజమాతగా గౌరవం పొందింది. కొద్దిరోజులకే రాజ్యాన్ని కోల్పోయి, అడవులపాలైన పాండవుల్ని కర్మ వైపు సుముఖులుగా చేసి మళ్ళీ వాళ్ళని రాజ్యం ఏలేలా మార్గనిర్దేశనంచేసిన ఘనత కుంతికే దక్కుతుంది. సంయమనశీలం, శ్రీకృష్ణుడిమీద భక్తి ప్రపత్తులు ఈ పాత్రకి ప్రత్యేకంగా కనిపిస్తాయి.

సజ్జన సాంగత్యంతో పొందిన వాక్శుద్ధి, ఆధ్యాత్మికత కుంతిలో వివేకానికి చిహ్నాలు. అందుకే ఈ నవలలో అన్ని అంశాల్ని పరిశీలించి ఆంధ్రభూమి సచిత్రవార పత్రిక సంపాదకులు శ్రీ కనకాంబర రాజు పెట్టిన పేరే 'రాజమాత'. కథా సమగ్రత మొత్తాన్ని కుంతి కార్యదీక్షను కూడా ఈ పేరు సూచించడానికి వీలుగా కనిపిస్తోంది. ఇంకో విషయం రాజమాత పదం చారిత్రక అంశాన్ని, గౌరవాన్ని కూడా తెలుపుతోంది.

### 1. 8. 12. 3. కథాసంవిధానం :-

మహాభారతం విశిష్టమైంది. అందులో ప్రతీకథ జీవితాన్ని ఆలోచించేలా చేసి మనసుని ఆకర్షించేదే. కావ్యకన్యలా హితబోధచేస్తూనే సన్మార్గాన్ని చూపుతుంది. అలాంటి భారతంలో ప్రత్యేకతల్ని సంతరించుకున్న పాత్ర కుంతి. శూరసేనమహారాజుకి ప్రథమ సంతానంగా పుట్టి, కుంతిభోజుడికి దత్తగా వెళ్ళి, కురువంశంలో కోడలిగా ప్రవేశించి, పాండవులకి మాతృదేవతగా, భారతంలో ప్రముఖపాత్ర వహించిన, కుంతిపాత్రకుండే విశిష్టమైన ఔన్నత్యాన్ని ఈ నవలలో వివరించారు.

అది యుగాంతకాలం, ఇరవై ఎనిమిదవ మన్వంతరం తర్వాత ద్వాపర, కలియుగాల సంధికాలం. చతుర్దశ భువనాల్లో సంచలనం రేగింది. గ్రహ, తారా మండలాల్లో విచిత్ర చంక్రమణం జరుగసాగింది అంటూ రచయిత ఈ నవలని ప్రారంభించారు. ఇలా ప్రారంభించడంలో కథనంతా సూచించడం జరిగింది. కురుక్షేత్రయుద్ధాన్ని మదిలో ఊహించు కుంటే కలిగే ఉత్కంఠ ఈ ప్రారంభంలోనే సూచనగా కనిపిస్తోంది. ఆ ప్రారంభానికి బీజప్రాయం కుంతే.

దేవతలందరూ కర్మాధీనులే. అందరూ భూలోకంలో పుట్టాల్సి వస్తుందని, వారు స్వర్గం పొందాలంటే యజ్ఞయాగాది కర్మలు చెయ్యాలని, రచయిత మూందుగానే సూచించారు. పాండురాజు హృదయ ఆవేదనలోనూ, మాద్రి సహగమనంలోనూ రచయిత తనదైన శైలిలో ఒక్కొక్క సూచన చేస్తుండడం ఈ నవలలో కనబడుతూ ఉంటుంది. చివరలో అంతా భగవంతుడి లీలలో ఐక్యం చెందడం అంతర్వాహినిగా ఈ నవలలో కనబడడం ప్రత్యేకత. భారతం జగద్ధితాన్ని కోరితే భాగవతం మోక్షాన్ని కోరింది. ఈ రెండిటినీ ఈ నవలలో రచయిత చేర్చడం, తద్వారా మోక్షాన్ని పొందాలని సూచన చేయడం ప్రత్యేకత.

### 1. 8. 12. 4. సారాంశం :-

విశిష్టమైన, ధన సంపన్నమైన రాజభవనంలో పుట్టి, పెరిగి కుంతి భోజుడింట్లో అతిథి సేవలలో బాల్యాన్ని వినియోగించిన పాత్రే కుంతి. అతిథి సేవలన్నీ పృథుమండపంలో, పృథు చక్రవర్తి జయంతి సందర్భంలో నామకరణం చేసారు. కాబట్టే 'పృథ' అని పేరు పెట్టినట్లు రచయిత తెలిపారు. పృథని దత్తత చేసుకున్న కుంతిభోజుడి భార్య 'సువృత్త'. ఈమెకు సంతానంలేకపోవడంతో కుంతిభోజుడు రెండోపెళ్ళిచేసుకోడం ఇష్టంలేకపోడంవల్ల శూరసేనుడి ప్రథమ సంతానం ఇవ్వడం జరిగింది. అలా పృథ కుంతి భోజుడింట్లో దత్తపుత్రికగా వచ్చింది.

కుంతిభోజుడు అతిథి, అభ్యాగతుల్ని ఆదరించి శుశ్రూష చేసేవాడు. పృథ తండ్రి దగ్గర ఉండి ఆ తర్వాత ఆమె ఒక్కతే మునుల్ని, అతిథుల్ని సేవించసాగింది. ఒకరోజు కోపిష్టి మహర్షి కుంతి భోజుడి ఆస్థానానికి వచ్చి, ఒక సంవత్సరం ఉంటానని తగిన ఏర్పాట్లు చేయమని అడిగాడు. కుంతిభోజుడు సమ్మతించి, అతడిసేవకోసం పృథను నియమించాడు. పృథ అణకువ, ఓర్పు, చురుకుదనం, వివేకం ఉన్న సుగుణాల ప్రోవు, సౌందర్యవతికూడా. ఆమె అనుష్ఠానానికి కావల్సిన వన్నీ చక్కగా క్షణాల్లో అమర్చి, శుశ్రూషచేయడంవల్ల ముని

ఒక వరాన్నిచ్చాడు. అతడు బీజమంత్రాన్ని చెవిలో చెప్పి, ఆ మంత్రాన్ని అనుష్ఠిస్తే కోరిన వాళ్ళద్వారా సంతానం పొందవచ్చని, తన పేరు దుర్వాసుడని చెప్పి వెళ్ళిపోతాడు.

దుర్వాసుడు గురించి అంతకముందు విన్న కథలన్నీ పృథకి గుర్తొచ్చి, చాలా భయపడి కొన్ని రోజులు శయన మందిరంలో ఉండిపోయింది. పృథను సంరక్షించే దాది 'విభావసి' ఆమె కూతురు 'మరీచి'. పృథకు సన్నిహితంగా ఉండే దాసీలు వీరిద్దరూనూ. దుర్వాసమహర్షి ఇచ్చిన మంత్రాన్ని పృథ అనుష్ఠానంచేసింది. కేవలం మంత్రశక్తి పరీక్షించడానికి చేసిన ఆగడమే అది. అయితే మంత్రప్రభావం వల్ల సూర్యుణ్ణి ప్రత్యక్షమై పుత్రుణ్ణిచ్చాడు. పైగా కన్యత్వాన్ని పొందేలా వరం ఇచ్చాడు. పృథకు చాలా భయపడింది. అలాంటి సమయంలో శూరసేన మహారాజు, విభావసి కూతురుకోసం తగిన ఏర్పాట్లు చేసినందువల్ల పృథ తన కన్నవారింటికెళ్ళి, అక్కడ పల్లె వాతావరణంలో చాలా ఆనందించింది. తిరిగి కుంతి భోజుడి ఇంటికి వచ్చేసరికి విభావసి విషయమంతా గమనించి పృథకు నవమాసాలు నిండేలా ప్రత్యేక శ్రద్ధతో సంరక్షించింది.

కార్తీకమాసంలో నదీస్నానం కోసంవెళ్ళి, అక్కడ వేపపెట్టిలో పుట్టిన బిడ్డనుంచి రహస్యంగా నదిలో వదిలేసి విభావసి, పృథలు ఇంటికి వచ్చేసారు. అంతవరకు లావుగా ఉన్న పృథ వేరే ప్రాంతాలకి వెళ్ళి అనారోగ్యం చేసి అలా అయిందని, ప్రస్తుతం సన్నబడేసరికి ఆరోగ్యంగా మారిందని పృథ పెంపుడుతల్లి అనుకుంది. అలాగే అని విభావసి నమ్మించింది కూడా. పృథకు స్వయంవరం ఏర్పాటు చేసారు. దేశదేశాలనుంచీ రాజకుమారులందరూ వచ్చారు. సూర్యుడిలా కనిపించిన పాండురాజుకు తనకు తెలీకుండానే పృథ వరమాలని వేసింది. వివాహం వైభవంగా జరిగింది. ధృతరాష్ట్రుడి అంతఃపుర ప్రవేశం తర్వాత పృథను "కుంతి" గా పిలవడం అలవాటై పోయింది. పిల్లలు వెంటనే పుట్టనందుకు, భీష్ముడు మాద్రిని శుల్కంతో కొని, పాండురాజుతో పెళ్ళి చేసారు. భార్యలతో పాండురాజు క్రీడించడానికి పర్వతప్రాంతాలకి తీసుకెళ్ళాడు. అక్కడున్న సమయంలోనే వసుదేవుణ్ణి కంసుడు బంధించాడు. కంసుడు రాక్షస పనులు చేస్తున్నట్లు కుంతి తెలుసుకుంటుంది.

పాండురాజు వేటాడుతున్న సమయంలో 'కిందముడు' (ముని) లేడిరూపంలో శృంగారాన్ని అనుభవిస్తున్నాడని తెలియక, ఆ లేడిని బాణంలో దూరంనుంచి కొట్టాడు. మునికి కోపం వచ్చి నీవు నీభార్యతో కలిసినప్పుడు ప్రాణాలుపోతాయని శపించాడు. దాంతో పాండురాజు తిరిగి హస్తినకు వెళ్ళలేదు. వానప్రస్థం స్వీకరించాడు. మునుల్ని సేవిస్తూ అక్కడే ఉండి పోయాడు. అందులో ఒక వృద్ధముని దీవెనలవల్ల సంతానం కలుగుతుందని పాండురాజు భావించాడు. ఆ దీవెనలు కుంతికి చెప్పాడు. కుంతి తనకు దుర్వాసుడిచ్చిన వరాన్ని పాండురాజుకి చెప్పింది. పాండురాజు స్నానాదికాలు పూర్తిచేసి ధ్యానంలో ఉండి ధర్మదేవత కోసం అనుష్ఠానం చేసాడు. ఆ ధర్మదేవత పాండురాజులో ప్రవేశించి తద్వారా యుధిష్ఠిరుడు పుట్టాడు. తర్వాత భీమాదులు పుట్టారు. వసుదేవ, దేవభాగులు (కుంతికి సోదరులు) వస్తువులు, ఆభరణాలు కుంతికి, మాద్రికి పంపడం వల్ల ఇద్దరూ ఆనందించారు.

మధురనుంచి వచ్చిన పురోహితుడు కృష్ణుడి గురించి వివరించాడు. కుంతికి స్వప్నంలో కృష్ణుడు కనిపించాడు. పాండవులకు వానప్రస్థానంలో ఉన్న 'శర్యాతి'మహారాజు విలువిద్య నేర్పాడు. పాండురాజు మాద్రితో కలవడంవల్ల మరణం సంభవిస్తుంది. భర్త మరణానంతరం మాద్రి సహగమనం చేసింది. మునులు పాండురాజు శవానికి దహనం చేసారు. కొంతమంది మునుల సహాయంతో కుంతి పాండవుల్ని తీసుకొని హస్తినాపురానికి వెళ్తుంది. ధృతరాష్ట్ర, భీష్మాదులు పాండురాజు మరణించాడని తెలిసి బాధపడతారు. అస్థికలకు వైకుంఠయాత్ర వైభవంగా చేసారు. కౌరవ పాండవులకు ద్రోణుడు విలువిద్య నేర్పాక, ప్రదర్శనను ఏర్పాటుచేసాడు. అప్పుడే కర్ణుడి ప్రవేశం. అతణ్ణి చూసి కుంతి తన కుమారుడిగా భావించి, మూర్ఛపోతుంది. కర్ణుడు దుర్యోధనుడితో స్నేహం చేస్తాడు. ద్రౌపదీ స్వయంవరం, ద్రౌపదితో పాండవులతో వివాహాలు జరుగుతాయి.

వసుదేవుడు పంపించిన బ్రాహ్మణుడైన 'అక్రూరుడు' హస్తినాపురానికి వస్తాడు. తద్వారా ధృతరాష్ట్రుడు యుధిష్ఠిరుడికి యువరాజ పట్టాభిషేకం జరిపిస్తాడు. తర్వాత యుధిష్ఠిరుడు ధర్మరాజుగా పేరు పొందుతాడు. ఖాండవవనాన్ని ధృతరాష్ట్రుడు పాండవుల కిస్తాడు. రాజ్య విస్తరణచేసి, ధర్మరాజు విశేషమైన సంపదపొంది, రాజసూయయాగంచేసి కీర్తి ప్రతిష్టలు సంపాదిస్తాడు. ఆ సంపదలు, కీర్తి ప్రతిష్ఠలు చూసి దుర్యోధనుడు అసూయపడి, చివరకు దుష్టచతుష్టయంతో పన్నాగం పన్ని మాయాజూదం ఏర్పాటుచేసి, యుధిష్ఠిరుడు సర్వామూ కోల్పోయోలా చేస్తాడు. ద్రౌపదీ వస్త్రాపహరణం చేసే సందర్భంలో కృష్ణుడి సాయంతో ద్రౌపది రక్షణ పొందుతుంది. భీమార్జునులు ప్రతిజ్ఞలు చేస్తారు. విదురుడిమాట ప్రకారం గాంధారి ధృతరాష్ట్రుడికి ద్రౌపది అవమాన విషయాన్ని నివేదించి వరాల్ని ఇవ్వడానికి కారణమౌతుంది. ధృతరాష్ట్రుడు వరాలిస్తాడు. తర్వాత మళ్లీ ఓడిపోయి పాండవులు అరణ్యవాసానికి బయలుదేరతారు. కుంతి విషయం తెలుసుకొని విచారిస్తుంది.

పాండవుల అరణ్యవాస సమయంలో కుంతి విదురుడింట్లో ఉంటుంది. పాండవుల్ని ఇరకాటంలో పెట్టడానికి దుర్యోధనుడు దుర్వాసుల్ని పంపిస్తాడు. కృష్ణుడిసాయంతో పాండవులు రక్షణ పొందుతారు. విరాటరాజ కొలువులో అజ్ఞాతవాసం పూర్తిచేస్తారు. విరాటరాజ కుమార్తె ఉత్తరతో అభిమన్యుడికి వివాహం అవుతుంది. రాయబారాలు నడుస్తాయి. కృష్ణరాయబారం విఫలమై, యుద్ధానికి దారితీస్తుంది. యుద్ధంలో భీముడి ప్రతిజ్ఞ నెరవేరుతుంది. ఉపపాండవులు, భీష్ముడు మొదలైన వారంతా మరణిస్తారు. జరుగుతున్న యుద్ధాన్ని సంజయుడు వేదవ్యాసు డిచ్చిన దివ్యదృష్టి కారణంగా ధృతరాష్ట్రుడికి వివరిస్తాడు. చివరకు అశ్వత్థామ ఉత్తర గర్భాన ఉన్న శిశువుమీదకు అస్త్ర ప్రయోగంచేయడంతో కృష్ణుడికి కోపం వచ్చి, అశ్వత్థామని పిశాచివై పొమ్మని శపిస్తాడు.

హస్తినకు పాండవులు రావడం, గాంధారి కృష్ణుణ్ణి శపించడం, యుద్ధంలో మరణించిన వాళ్ళకి కర్మకాండలు జరిగాయి. శ్రీకృష్ణుడి సహాయంతో ఉత్తరకు జన్మించిన శిశువు పుడతాడు. అతడే పరిక్షిత్తు. ఆ తర్వాత ధర్మరాజు అశ్వమేధయాగంచేసి, ప్రజలు

సంతోషంగా ఉండే విధంగా పాలన చేస్తాడు. ధృతరాష్ట్రుడు, గాంధారి, కుంతి వానప్రస్థానానికి బయలు దేరారు. ఒకరోజు కుంతి వ్యాసమహర్షి దగ్గరికి వెళ్ళి, తన అపరాధాన్ని క్షమించమని, పుత్రుడు కర్ణుడి గురించిన సమాచారం ఎవరికీ చెప్పకపోడం అపరాధం అని వివరిస్తుంది. విధిలేక కర్ణుణ్ణి కన్నానని, ఆ విషయాలన్నీ తన మనస్సునంతా నిరంతరం బాధపెడుతోందని చెబుతుంది.

నీ అపరాధం ఏమీలేదని, అప్పటికి నీవు కౌమారంలో ఉన్నబాలికవు, దేవతలు అనుగ్రహం సంపాదించావేతప్ప, దూషితంకాదని, కుంతిని పుణ్యశీలగా వ్యాసుడు చెప్తాడు. ఇప్పటినుంచి నీకు దుఃఖం ఉండదని పరమానంద భావరసవార్ధిలో తేలుతావని చెప్పి వ్యాసుడు అంతర్ధానం అవుతాడు. అంతలోనే ఆశ్రమం చుట్టూ అగ్నిజ్వాలలు లేస్తాయి. గాంధారీ ధృతరాష్ట్రులు కనిపించలేదు. ఏమయిందో అర్థకాలేదు కానీ, కుంతికి తను అలా పరిగెడుతున్నట్లే అనిపించింది.

అది చల్లని గాలితో ఉన్న బృందావనం. దాన్ని కుంతి పరిగెత్తుతూ చేరింది. అగ్ని శుద్ధమైన నీలివర్ణంతో ఉన్న దివ్యవస్త్రాన్ని కుంతి ధరించింది. ముప్పైమూడు మందితో కలిసి కుంతి వంశీనాదాన్ని వింటోంది. 'బృందావనం పరిత్యజ్య, పాదమేకం నగచ్ఛతి' అంటూ భగవంతుడి లీలలో వారంతా కలిసిపోయారు. ఇలా దత్తపుత్రిక నుంచీ సేవాపరాయణతతో భోగాల్ని వదిలి, సామ్రాజ్యాధికారం వచ్చేవరకూ శ్రమించింది. తర్వాత దాన్నికూడా వదిలి, దైవంలో లీనమైన ఉదాత్త పాత్రలా ఈ నవలో కుంతి వ్యక్తిత్వం ప్రకాశిస్తోంది.

1. 8. 13. *రాజసూయం* :-

దీన్ని ఎక్కిరాల కృష్ణమాచార్య రాసిన '*మంద్ర గానం*' చదివి, ఆనందించి తనుకూడా ఒక నవలని రాయాలని చివుకుల రవిశర్మకి అనిపించింది. ఆ ప్రేరణ తో రాసిన నవలే రాజసూయం. ఈ నవలా రచనకు దాదాపు సంవత్సర కాలం పట్టింది. ఇది భారతానికి ఒక రసవద్వ్యాఖ్య. దిగ్విజయ యాత్రలు చేసిన సందర్భాల్లో భీమార్జునుల పాత్రల్లోవీరరసాన్ని; జరాసంధుడి పాత్రలో భయానక రసాన్ని; కర్ణ, జరాసంధుల యుద్ధంలో వీరస్నేహ రసాల్ని; ధర్మరాజు రాజసూయయాగ భోజన సదుపాయాల్ని చేసినపుడు దానశూరాన్ని రచయిత సూచించారు.

వేదంలో చెప్పిన యజ్ఞాలు చాలా ఉన్నాయి. వాటిలో ఒక్కోయాగానికి ఒక్కో ప్రత్యేకత అంశాలున్నాయి. అన్నిటికంటే విలక్షణమైన యాగమే రాజసూయం. మహాభారతంలో కీలక సన్నివేశంకూడా. రాజసూయానికి ముందు, వెనుక జరిగిన సనాతన ధర్మ విధ్వంసాన్ని పురాణాల్లో వ్యాసుడే ప్రధానంగా తీసుకొని సూచించారు. ఈ రాజసూయం నేపథ్యంలో నేతృత్వం వహించిన వారు జ్వాలాకూలుడు, మరువు, దేవాపి, మైత్రేయులు.

1. 20. 1. నామసార్థక్యం :-

రాజును ప్రసవించేది, లేదా రాజులందరికి ఒకే ఒక్కడు సార్వభౌముడిగా ఉంచేది రాజసూయం. అయితే సార్వభౌమత్వాన్ని పశుధర్మంతో జరాసంధుడు సాధించాడు. ధర్మరాజు వీర విక్రమాలతో, ప్రజల మెప్పుపొంది యజ్ఞంద్వారా సాధించడం ఈ రాజసూయయాగ ప్రత్యేకత.

రాజు అంటే ప్రకాశించువాడు, చంద్రుడు అని అర్థాలు. ఒక సౌరకుటుంబలో చంద్రజననం, బ్రహ్మాండంలో చంద్రప్రజ్ఞతో సోముడు పుట్టడాన్నికూడా రాజసూయ మంటారు. రజస్సులంటే అణువులు; బ్రహ్మాండ సృష్టిలో అణువుల పుట్టుక, పెరుగుదలను కూడా చెబుతుంది. రజస్సుకి వెలుగు అని కూడా అర్థముంది. మూల ప్రకృతి స్వరూపమైన అవ్యక్తంనుంచి తొలి వెలుగురేఖ పుట్టి ప్రకాశించుట కూడా రాజసూయమే.

ఈ నవలలో ప్రకాశించే రాజుగా ధర్మరాజు కనిపిస్తాడు. భీమకృష్ణార్జునుల్లాంటి యోధులు శక్తితో ఇమిడిన బ్రహ్మాండమైన యాగంగా రచయిత రాజసూయం పేరు ధ్వనించేలా సూచించారు. బలవతంగా రాజ్యాన్ని రాజు అనుభవించడం తగదు. దానికి తగిన శక్తి సామర్థ్యాలుడాల్సిన అవశ్యకతను ఈ పేరుతో రచయిత చెప్పినట్లుగా ఉండడం మరో ప్రత్యేకత.

### 1. 20. 2. కథాసంవిధానం :-

మహాభారతంలో రాజసూయం బ్రహ్మాండ, పిండాండ విజ్ఞాన సమన్వయానికి ప్రతీకగా కనిపిస్తుంది. ఈ యాగంవల్ల కృష్ణుడి అన్ని స్థాయిల్లోని ప్రజ్ఞని ధర్మరాజు ప్రచోదనం చేసాడు. ప్రారంభంలో సాయంకాల వర్ణన, కృష్ణార్జునులు మాట్లాడుకోడం ఈ నవలలో ఉంది. సాయంకాల వర్ణనలో రాబోయే ఉదయాన్ని సూచించడం కనిపిస్తోంది. నారదుడు వచ్చి దుర్యోధనుడు కలి అంశతో ఉన్నాడని విపత్తు సూచన చేసాడు. మొన్నటివరకూ కంసుడు (అనగా అంతకుముందు) కాలనేమి, అతడి మరణంతో కలికి మరో ఉపాధి కావల్సి వచ్చిందని, దేవతలులాగే కలికి కూడా శరీరాశ్రయం ఒక పదవిలాంటిది. కలిపురుషుడు వ్యక్తి కాదని రచయిత తెలియజేసాడు. ఈ రోజు జరాసంధుడు రేపు ఇంకొకడు ఇలా కలికి ఆధారమవుతారని రచయిత వివరించాడు.

కలిపురుషుడు జరాసంధుణ్ణి ఆశ్రయించడం, కృష్ణుడు అంతర్వాహినిగా కథను నడిపించడం, భీమార్జునులు సహాయకులుగా ఉండడం లాంటి అంశాలు ఈ నవలలో ముందుగానే రచయిత సూచించాడు. పురుషసూక్తం ఆధారంగా జరాసంధుడు యాగం చేయడం, తద్వారా వచ్చే విపత్తు ముందుగానే ధ్వనించేలా చేయడం, కథచెప్పేవిధానం ప్రత్యేకంగా కనిపిస్తోంది. ఈ కథకు అంతర్లయ దుష్టసంహారం. తద్వారా ధర్మరక్షణ ఉద్దేశం. ఇలా చాలా అంశాల్ని చూడొచ్చు.

### 1. 8. 13. 3. సారాంశం :-

వ్యాసుడు వేదసమన్వయాన్ని, గురు శిష్య సంప్రదాయాన్నిశిష్యులకి ఉపదేశిస్తాడు. పురాణ ఇతిహాసాలను సరళభాషలో గ్రంథస్థంచేసి, అధ్యయనం చేయించాలని

అనుకుంటాడు. కృష్ణుడి  జీవిత సన్నివేశాల్ని అవతరలీలగామలచి  అందించాడు.

ధృతరాష్ట్రుడు ఏర్పాటుచేసిన లక్క ఇంటినుంచీ బయటపడిన పాండవులు, ద్రౌపదిని వివాహం చేసుకున్నారు. వారికి ధృతరాష్ట్రుడు, పనికిరాని ఖాండవ వనాన్ని ఇచ్చాడు. ఆ వనాన్ని కృష్ణుడి సహాయంతో పాండవులు బాగుచేసుకుని ఇంద్రప్రస్థంగా మార్చారు.

జరాసంధుడు పురుషసూక్తాన్ని ఆధారంగా రాజుల్ని యాగాల్లో వ్రేల్చుతున్నాడు. ఉత్తములైన రాజుల్ని పట్టి, బంధించి, భైరవీ ఆలయ ప్రాంగణంలో "తం యజ్ఞం బర్హిషి ప్రౌక్షన్ పురుషం జాత మగ్రతః" అని పూజారులు అనగానే, జరాసంధుడు దర్భలతో వేదికనలంకరించి, సమిధల్ని పేర్చాడు. 'వసతో అస్యాసీ దాజ్యం' అని అనగానే స్రుక్సువాలతో రాజులమీద నెయ్యిని పోస్తున్నాడు. 'గ్రీష్మ ఇధ్మః' అనగానే నిప్పు పుట్టించి, బంధించి ఉంచిన రాజులకు భగ్గున మండేలా అంటిస్తున్నాడు. ఇలా ఒక్కోమంత్రాన్ని చెప్పి రాజపుత్రుల్ని అగ్ని ఆహుతి చేస్తున్నాడు. చనిపోయిన రాజపుత్రులయొక్క సూక్ష్మదేహాన్ని వశీకరించుకొని, సైన్యంగా తయారు చేస్తున్నాడు. జరాసంధుడి విషయాన్ని హంసడిభకులు తెలుసుకుంటారు.

హంసడిభకులు బ్రహ్మదత్తుడి కొడుకులు. సాళ్వ సామ్రాజ్యానికి యువరాజులు. ఉగ్ర తపస్సుచేసి, భూతనాథుణ్ణి మెప్పించి, వరాలుపొందారు. శ్రీకృష్ణుడు దేశ దేశాంతరాలు వెళ్లి చాలామందికి మతులు పోగొట్టి, పామరుల్ని వ్యామోహంతో పడేస్తున్నాడు. సామవేదాన్ని వేణువులో నింపి రుద్రమంత్రాల్ని, పంచాక్షరిని అనకుండా చేస్తున్నాడు. అతణ్ణి జయించడానికి జరాసంధుడితో చేయికలపాలని హంసడిభకులు భావిస్తారు. ఈ నవలలో భిన్నమైన వ్యక్తి జనకుడు. అతని రాజ్యంలోని విషయాల్ని పరిశీలించాలని బలరాముడు కర్తవ్యంగా పెట్టుకుంటాడు.

మిథిలానగరానికి బలరాముడు వస్తాడు. జనకుణ్ణి సందర్శిస్తాడు. అక్కడి విశేషాలు కళ్ళారా చూసి ఆనందిస్తాడు. మద్యం ప్రవేశించని మిథిలానగరంలో బలరాముడికోసం కాశ్మీరునుంచీ మద్యం తెప్పించదలచుకుంటాడు. ఇదంతా కలిప్రభావంతో జరుగుతున్నట్లు రచయిత గుర్తు చేస్తుంటాడు. దుర్యోధనుడు అప్పటికే మిథిలలో ఉండడం, కలి ఉండడంగా రచయిత సూచిస్తాడు. దుర్యోధనుడు చాకచక్యంగా బలరాముణ్ణి వశపరుచుకుంటాడు. బలరాముడు మద్యం తాగాక, దుర్యోధనుడు గదా యుద్ధాన్ని, దాని మెలుకువులు రాబట్టించి, నేర్చుకుంటాడు.

పాంచాలిని పాండవులు పెళ్ళాడారు. ఆ తరువాత నారదుడు వచ్చి ద్రౌపదితో ఒక్కొక్కరు ఒక్కో సంవత్సరం కలిసి ఉండాలని నిర్ణయించుకునేలా చేసాడు. ఆ నిర్ణయాన్ని తప్పిన వాళ్ళు తీర్థయాత్రలు చేయడం కట్టుబాటుగా పాండవులు విధించుకుంటారు. ఆ నిర్ణయం తప్పడంవల్ల అర్జునుడు తీర్థయాత్రలకు కొంతమంది విప్రులతో బయలుదేరతాడు. ఒక్కో బ్రాహ్మణుడు ఒక్కో తీర్థంలో ఉండిపోడంవల్ల అర్జునుడు ఒంటరివాడై, చివరకు

ద్వారకకు చేరుకుంటాడు. యతివేషంలో ఉన్న అర్జునుణ్ణి కృష్ణుడు గుర్తించాడు. సుభద్రమీద అతడికుండే ప్రేమ, సుభద్రకు కూడా అర్జునుడంటే ఇష్టం ఉండడాన్ని గుర్తించి సుభద్రను తీసుకెళ్ళడానికి తను బయటకు తెలీకుండా తగిన ఏర్పాట్లు చేస్తాడు.

జరాసంధుడు దుర్యోధనుడితో మిత్రత్వంకోసం లేఖరాసి పంపాడు. దాన్ని శ్రీకృష్ణుడి అనుచరుడు ఉద్ధవుడు దుర్యోధనుడికి లేఖ చేరకుండా చేస్తారు. ఉద్ధవుడి చిన్నప్పటిపేరు విభీషణుడు. ఆ పేరుతోనే జరాసంధుడి రాజ్యంలో ఉంటాడు. జరసంధుడి విషయాలన్నీ ఇతడి ద్వారానే కృష్ణుడు తెలుసుకుంటాడు. హంస డిభకులు జరాసంధుడితోను, శిశుపాలుడితోనూ మైత్రి సాధించి కృష్ణుణ్ణి జయించాలని ద్వారక మీద యుద్ధం ప్రకటిస్తారు.

హంస డిభకుల్ని వేర్వేరు ప్రాంతాల్లో ఎదుర్కొనేలా కృష్ణుడు వ్యూహం పన్నుతాడు. హంసుడిపై సమ్మోహనాస్త్రం ప్రయోగించి నిశ్చేష్టుడిగా రథంలో పడిపోయినట్లు చేస్తాడు. ఆకాశంలో కళ్లు మిరుమిట్లు అయ్యేంత తేజస్సుతో 'గాయాల బాధ భరించలేక దుర్మార్గుడైన హంసుడు పుష్కర సరస్సులో దూకి మరణించాడు' (పుట.118) అని ధ్వనించేలా చేసాడు. దశ దిశల్నుంచి 'సత్యం, సత్యం' అని వినిపించేలా కూడా చేసాడు. డిభకుడి హృదయం శూన్యంగా అయ్యేలా కృష్ణుడు ప్రణాళికా బద్ధంగా అమలు చేసాడు.

తన అన్న హంసుడు చనిపోయాడన్న వార్తవిని, డిభకుడు పుష్కర సరస్సుకెళ్లాడు. అక్కడ తేలి కనిపిస్తున్న ఒక పెద్ద ఆకారాన్ని(బండరాయి) చూసి, తన అన్నయ్యే అని అనుకొని, ఆ సరస్సులో దూకి ఆత్మహత్య చేసుకుంటాడు. సమ్మోహనాస్త్రంనుంచి మెలకువ వచ్చిన హంసుడు తమ్ముడు డిభకుడు మరణించాడని, తేలిన పుష్కర సరస్సులోని శవాన్ని చూసి, అక్కడే తనువు చాలించాడు. ఇలా కృష్ణుడు వ్యూహరచన పన్ని, హంసడిభకులు స్వచ్ఛంద మరణం పొందడానికి కారకుడయ్యాడు.

ద్రౌపది వస్త్రాపహరణ చేయడానికి దుశ్శాసనుడు ప్రయత్నించి, విఫలుడైన తర్వాత ధృతరాష్ట్రుడు ద్రౌపదిని వరాలు కోరుకోమన్నాడు. పాండవులు ఓడినవన్నీ ఇచ్చేస్తాడు. పైగా పాండవులకు పంచిన భాగం చాలా కాలంనుంచి కప్పం కట్టడాన్ని తిరస్కరించిన చెంచు, కోయలు ఉండే ప్రాంతమది. వాళ్ళను లొంగదీయడం చేతకాక, ఆ ప్రాంతాన్ని పాండవులకి ధృతరాష్ట్రుడిచ్చినట్లు దుర్యోధనుడు భావిస్తాడు. అంతేకానీ నిజంగా ధృతరాష్ట్రుడికి పాండవులమీద ఏమాత్రమూ అభిమానం లేదని రచయిత ఈ సన్నివేశంలో సూచించారు.

కృష్ణుణ్ణి దేవుడిగా భావించిన వ్యాసుడు పురాతన సంహితల్ని కృష్ణుడికి అనుకూలంగ మార్చే ప్రయత్నం చేస్తున్నట్లు చార్వాకుడిద్వారా దుర్యోధనుడు వింటాడు. కృష్ణుడు ధర్మతత్పరుడుగా దుర్యోధనుడు అంగీకరించినా, దేవుడిగా మాత్రం (కృష్ణుణ్ణి)అంగీకరించడు. పాండవులు ద్రౌపదిని పెళ్ళాడాక కొత్తగా ఖాండవవనాన్ని పాలించడంవల్ల సైనికబలం ఎక్కువగా లేదు. అందుకే శకుని దుర్యోధనుడితో ఇప్పుడే

దిగ్విజయాలు చేసి రాజ్యవిస్తరణ చేయాలని సూచించాడు. అందుకు జరాసంధుడితో మిత్రత్వం సాధనంగా, అది కర్ణుడివల్లే అవుతుందని పథకం వేసాడు. జరాసంధుడితో మల్లయుద్ధం చేయాలని వివరిస్తాడు.

కర్ణ, జరాసంధుల మల్లయుద్ధం భయంకరంగాసాగింది. కర్ణుణ్ణిజయించలేక జరాసంధుడు సంధి చేసుకున్నాడు. కృష్ణార్జునులు ఇంద్రప్రస్థానానికి పది ఆమడల దూరంలో దట్టమైన అడవిలో ఒక కొండచరియమీద విహరిస్తున్నప్పుడు ఆగ్నేయంనుంచి ఒక వృద్ధ బ్రాహ్మణుడు మెల్లగా వీరిద్దరి దగ్గరికి వచ్చాడు. 'నరనారాయణావతారులకు శివములగు గాక' అని దీవించి, ఆ బ్రాహ్మణుడు వీరిద్దరి సహాయాన్ని అర్థిస్తాడు.

శ్వేతకి అనే రాజర్షి పన్నెండు సంవత్సరాలు దీర్ఘసత్రయాగం చేసినందువల్ల ఆ యాగంలో వేసిన నెయ్యి తాగాడు. దానివల్ల అగ్ని మాంద్యం పట్టుకొని, అది వ్యాధిస్థాయికి చేరుకున్నట్లు, దాని నివారణ కోసం ఖాండవవనాన్ని దహించాలని వృద్ధబ్రాహ్మణ రూపంలో వచ్చిన అగ్ని వివరించాడు. ఖాండవవనాన్ని దహిస్తున్న సమయంలో రక్షణకోసమని ఇంద్రచాపంలాంటి గాండీవ ధనస్సు, తూణీర ద్వయాన్ని అర్జునుడికి; సుదర్శనచక్రాన్ని, ఐదుగుర్రాలున్న రథాన్ని కృష్ణుడికి ఇచ్చి, వెళ్ళిపోతాడు.

ఖాండవవనం అన్నివైపులా దగ్ధమై పోసాగింది. అకస్మాత్తుగా ఆకాశంకమ్మి బద్దలై పోతున్నట్లు పిడుగులు, మెరుపులతో తీవ్రమమైన వర్షం, గాలి వచ్చాయి. అగ్ని మరింత ఉజ్జ్వలంగా దహింస్తున్నాడు. ఖాండవ వనవాసి అయిన 'తక్షకుడు' రాచకార్యంవల్ల ఖాండవ వనానికి బయటే ఉన్నందువల్ల అగ్నినుంచి తప్పించుకున్నాడు. అతడి కొడుకు 'అశ్వసేనుడు' ప్రాణభయంతో తల్లిని తన తోకని నోటితో పట్టుకోమని ఆదేశించి, జవసత్త్వాలు కూడగట్టుకొని ఆకాశానికెగిరాడు. అది చూసిన అర్జునుడు అశ్వసేనుడి తోకని, దాన్ని కరిచి పట్టిన అతడి తల్లిని ఖండించి అగ్నికి ఆహుతిచేసాడు. అశ్వసేనుణ్ణి మరోబాణంతో చంపబోగా, ఇంద్రుడి మోహినీ మాయా ప్రభావంవల్ల వాడు చావలేదు.

ఖాండవవనంలో ఒక మునీంద్రుడు కోరిన కోరికవల్ల పక్షిపిల్లల్ని అగ్నిదేవుడు దహించలేదు. అశ్వసేనుడి ఇంట్లో అతిథిగా ఉన్న దానవశిల్పాచార్యుడు 'మయుడు'. అర్జునుణ్ణి శరణువేడి, ప్రాణాలు కాపాడుకున్నాడు. దాని ప్రతిఫలంగా కృష్ణుడి సూచనమేరకు అపూర్వమైన మండపాన్ని నిర్మించడానికి సిద్ధపడ్డాడు. అతడు నిర్మించినదే మయసభ. భవన నిర్మాణం పూర్తయ్యాక మయుడు పాండవులందరికీ చూపించాడు. నారదుడు అప్పుడే వచ్చి, కృష్ణుడి సహాయంతో రాజసూయంచేయాలని సూచించాడు. ముందుగా జరాసంధ వధ జరగాలని కృష్ణుడు ధర్మారాజుకి సూచించాడు.

జరాసంధుణ్ణి సంహరించడంకోసం కృష్ణుడు పథకం వేసాడు. అతడు భీమార్జునుల సాయంతో జరాసంధుడి రాజ్యంలోకి ప్రవేశించి, ఢక్కల్ని పగులగొట్టి స్నాతకుల వేషంలో జరాసంధుడి దగ్గరికి వెళ్ళారు. యుద్ధభిక్షకోసం వచ్చినట్లు చెప్పి, జరాసంధుణ్ణి భీముడితో

మల్లయుద్ధానికి పురిగొల్పుతాడు. భీమ, జరాసంధులు సింహగర్జనలతో తీవ్రంగా యుద్ధం చేస్తుండగా, చివరకు కృష్ణుడి సంజ్ఞతో భీముడు జరాసంధుణ్ణి చీల్చి, ఆ శరీరాన్ని ఎడమవైపుకు కుడిభాగాన్ని, కుడివైపుకు ఎడమ భాగాన్నివేసి అతణ్ణి చంపేసాడు.

రాజసూయం ప్రారంభమైంది. ఆరు రోజులు ఘనంగా ముగిసాయి. ఆరోరోజు మేఘాలు వర్షించాయి. ఏడోరోజు పరిసమాప్తికోసం వయోవృద్ధ సదస్సు ఏర్పాటు చేసారు. భీష్ముడి సలహాతో కృష్ణుణ్ణి యజ్ఞపురుషుడిగా చేసి, ధర్మరాజు పూజచేస్తున్నాడు. శిశుపాలుడు అతడి అనుచరులు ఆ పూజని వ్యతిరేకించారు. పరుషమైన మాటలన్న శిశుపాలుణ్ణి, చివరికి కృష్ణుడు సంహరించాడు. అతడి దేహం నుంచి కాంతి ఊర్ధ్వలోకం చేరింది. దేవ దుందుభులు మ్రోగాయి. పుష్పవృష్టి కురిసింది. కృష్ణుడు వైజయంతీ విభూషితుడై మందస్మితం చేసాడు. శాంతి మంత్రంతో యాగం, నవలకూడా ముగిసాయి.

### 1. 8. 14. *సౌందర్యతిలక* :-

#### 1. 8. 14. 1. రచనాసంవిధానం :-

భారతంలోని రాజసూయయాగ ఘట్టాన్ని తీసుకుని జరాసంధవధని ప్రధానంగా, కళానందుడి ప్రేమ వృత్తాంతం భూమికగా ఒక ప్రేమ రసమయ సృష్టి ఈ నవల. దీన్ని చిలకమర్తి లక్ష్మీనరసింహం రాసారు. (ప్రచ్ఛన్నపాండవంలో ఈ రచయిత పరిచయం ఉంది. పునరుక్తి అవుతుందని ఇక్కడ చెప్పడంలేదు.) ఇది రెండు భాగాల నవల.

మొదటి భాగంలో కేతకీ పత్ర మథనలేఖతో జరిగిన కథను చెప్పాడు. రెండోభాగంలో కళానందుడి ప్రేమ, వివాహం, జరాసంధ వధ ప్రధాన ఘట్టాలు. ఈ నవల సౌందర్య కళాన్వితమై ప్రేమతత్త్వాన్ని సూచిస్తూ, దేశభక్తిని పెంపొందించే దిశలో రచయిత నడిపించారు. ఇందులో సామాజిక అంశాల్ని జోడించడం, వర్ణనాశాల్ని విశదీకరించడం ప్రత్యేకతలు.

#### 1. 8. 14. 2. సారాంశం :-

ఒక ముసలివాడు ఆకలితో అలమటిస్తూ, దారిలో పోయేవాళ్ళతో చీవాట్లుతింటూ అడుక్కు తింటుంటాడు. ఈ సన్నివేశంనుంచి కథ ప్రారంభమైంది. సౌందర్యతిలక అందాలరాశి, రాజకుమార్తె కూడా. ఈమె చెలికత్తే నాగవల్లి. ఒకరోజు అందాలరాకుమారుడు కళానందుడు పంజరంలోంచి ఎగిరిన చిలుకని పట్టి తెచ్చి, సౌందర్యతిలకకి యివ్వడంతో వీళ్ళిద్దరి ప్రేమ వ్యవహారం ప్రారంభం అయ్యింది. నాగవల్లి మరింత సౌందర్యతిలక దగ్గర కళానందుణ్ణి వర్ణించడంతో మరింతగా సౌందర్యతిలక పరవశించిపోతుంది.

కళానందుడు జరాసంధుడి రాజ్యంలో ఉన్న రాజకుమారుడు. సౌందర్యతిలకని జరాసంధుడి ఉంపుడుగత్తెకొడుకు రణార్ణవుడకిచ్చి, పెళ్ళి చేయాలని భావిస్తాడు. ఆ విషయం తెలుసుకున్న కళానందుడు యాదవ సామ్రాజంలోని మాధవుణ్ణి సాయమర్థించడానికి వెళ్తూ, సౌందర్యతిలకకోసం కేతకీపత్రం మీద ప్రేమలేఖ రాస్తాడు. దాన్ని పూలవ్యాపారి 'రోహణకుడి' ద్వారా నాగవల్లికు చేర్పించమంటాడు. ఆ లేఖని

నాగవల్లి గమనించకపోడం వల్ల దారిలో ఓ ముసలివాణ్ణి రక్షించాలని రోహణకుడిచ్చిన పూలమాలని మరొకరికి అమ్మేస్తుంది. అందులోనే ప్రేమలేఖ ఉంటుంది. ఆ పూలదండ జయసేనుడింటికి చేరి అతడిభార్యతో గొడవకి కారణ మౌతుంది. దాన్నిరణార్ణవుడు దొంగిలించి, జరాసంధుడి ఎదుట ఉంచి ఇదంతా కళానందుడే చేయిస్తున్నాడని, కుట్రలాగ తను ఊహించి, అతణ్ణి నమ్మిస్తాడు.

కళానందుడు మాధవుణ్ణిచేరి తన విషయాన్ని వివరించాడు. జరాసంధుడు చాలామంది రాజుల్ని బంధించి, వారిని బలిస్తూ పూజలు చేస్తున్నాడని, అతడి శౌర్యాన్ని, క్రౌర్యాన్ని విశదీకరించి, సంహరించవలసిన ఆవశ్యకతని కళానందుడు కృష్ణుడికి వివరించాడు. కళానందుడి పరిస్థితిని అర్థంచేసుకుని, ఒకలేఖనిచ్చి దాన్ని ఇంద్రప్రస్థంలోని ధర్మరాజుకి చేర్చమని కోరతాడు. కళానందుడికి సహాయంగా, 'శ్రవణుడు'(చిన్నప్పటినుంచి కళానందుణ్ణి పెంచినసేవకుడు) వస్తాడు. వీళ్ళిద్దరూ అరణ్యంగుండా ప్రయాణం సాగిస్తారు. రాత్రి సమయంలో అరణ్యంలోనే నిద్రపోతారు. ఆ రాత్రే కళానందుడు అదృశ్యమైపోతాడు. చిమ్మ చీకటిలో 'జ్వాలాముఖుడు' అనే ఒక రాక్షసుడు శ్రవణుణ్ణి బంధించి తీసుకుపోతాడు.

శిశుపాల, జరాసంధుల మిత్రుడు 'జ్వాలముఖుడు'. ఇతడు శిశుపాలుడికిచ్చి పెళ్ళి చేయాలని ఒక అందమైన అమ్మాయి, ఇందుమతిని పెంచుతున్నాడు. ఆమెను ఆ రాక్షసుడి చెఱనుంచి రక్షించాలని శ్రవణుడు భావించి, ఆమెని తప్పించి తీసుకువచ్చి, 'కరంభముని' ఆశ్రమంలో ఉంచుతాడు. అక్కడ కొన్నాళ్ళు ఇందుమతి క్షేమంగానే ఉంటుంది. ఓ రోజు శ్రవణుణ్ణి జ్వాలాముఖుడి సేవకుడు, 'జ్వాలాజిహ్వుడు' గుర్తించి, తీసుకుపోయి చంపేస్తాడు. శిశుపాలుడు వేటకోసం వెళ్తూ, దారిలో కరభుడి ఆశ్రమంలో ప్రవేశిస్తాడు. కరభుడు ఆ సమయంలో అక్కడ ఉండడు. జాబాలి ఆశ్రమంలో యాగార్థం అక్కడికి వెళ్ళేడు. శిశుపాలుడు అందగత్తెన ఇందుమతిని మోహించి, బలవంతంగా ఆమెను రథం మీదకెక్కించి, తీసుకుపోయాడు.

కరభుడు ఆశ్రమానికి వచ్చాక విషయం తెలుసుకున్నాడు. అలా బలవంతంగా, తన అనుమతికూడా లేకుండా ఇందుమతిని తీసుకుపోడం తగదని, వెంటనే పంపమని, అతడు శిశుపాలుడికి కబురు పెట్టాడు. కానీ, శిశుపాలుడు ఏమీ పట్టించుకోకుండా, రాజుకి ఇలాంటి అధికారం ఉందని, బ్రహ్మచారి అయిన కరభుడికి ఈ విషయం తెలుసుకోమని సమాధానమిచ్చాడు. దాంతో కరభుడు కృష్ణుడి దగ్గరకి వచ్చి, విషయం చెప్పి, ఆమెను కాపాడమని కోరతాడు.

రోహణకుడు ఇచ్చిన పుష్పగుచ్ఛాన్ని వెదకాలని సౌందర్యతిలక అనుమతితో నాగవల్లి వెళ్ళిపోతుంది. ఎక్కడికి వెళ్ళిందో చివరివరకూ ఉత్కంఠగా ఉంటుంది. జరాసంధుడు సౌందర్యతిలక తండ్రి, 'చంద్రపాలుణ్ణి' పిలిపించి, రణార్ణవుడికి సౌందర్యతిలక నిమ్మని కోరాడు. చేసేదిలేక మూడురోజులు గడువు ఇవ్వమని చంద్రపాలుడు అడుగుతాడు. మూడురోజుల గడువు తీరాక, అతడు సౌందర్యతిలకను ఇవ్వకపోడంతో జరాసంధుడు చంద్రపాలుణ్ణి చెఱసాలలో బంధిస్తాడు.

జరాసంధుడి రాజ్యం లోకి ఒక యోగిని వస్తుంది. ఆమె భూత, భవిష్యత్తు అంశాలను బాగా చెబుతోందనే పేరు వస్తుంది. రణార్ణవుడు తను దొంగలించిన కేతకీ పత్ర లేఖను యోగిని దగ్గరికి తీసుకువెళ్తాడు. ఇది కేవలం ప్రేమికుల లేఖ అని దీని గురించి మరిన్ని విషయాలు చెప్పాలంటే జరాసంధుడి ఉంగరాన్ని తెస్తే మగధ సామ్రాజ్యానికి మేలు జరుగుతుందని యోగిని నమ్మిస్తుంది.

ఇందుమతిని లోబరచుకునే పరిస్థితితెలియక శిశుపాలుడుంటాడు. ఈలోగా జరాసంధుడి రాజ్యంనుంచీ వచ్చిన దూతగా 'జాతవేదుడు' పరిచయం చేసుకుంటాడు. బంధించిన కళానందుణ్ణి అప్పగించమని జరాసంధుడి రాజముద్రికను చూపిస్తాడు. ఇందుమతిని లొంగదీయడానికి 'హేమామతి' అనే తన సోదరి ఉందని, ఆమె ఇలాంటి విషయాల్లో దిట్టని, జాతవేదుడు శిశుపాలుణ్ణి నమ్మిస్తాడు. మర్నాడు హేమామతి వచ్చి, ఇందుమతి దగ్గర కూర్చుని ప్రేమలేఖ రాయించి శిశుపాలుడికిప్పించి వెళ్లిపోతుంది. కొన్నాళ్ల తర్వాత హేమామతిని చూసి మూడురోజుల్లో వచ్చేస్తానని శిశుపాలుడి అనుమతితో ఇందుమతి బయలుదేరుతుంది. మూడురోజులు గడచిన ఇందుమతి రాదు. నాల్గవరోజు వాకబుచేస్తే, మోసమని తెల్సి శిశుపాలుడు బాధ పడతాడు. తర్వాత కళానందుడు కృష్ణుడి దర్శనం చేసుకుంటాడు. కృష్ణుడు కళానందుణ్ణి గిరివ్రజంలో రహస్యంగా ఉండమని సూచిస్తాడు. అతడికి సహాయంగా ఇద్దరు సేవకుల్ని కృష్ణుడు ఏర్పాటు చేసాడు.

కృష్ణుడు ఇంద్రప్రస్థంవచ్చి, రాజసూయయాగపథకాన్ని తయారుచేసాడు. కళానందుడి సాయంతో జరాసంధుడి రాజ్యంలో చాల విషయాలు కృష్ణుడు తెలుసుకుంటాడు. భీమార్జునుల సహాయంతో జరాసంధుడి నగరలోకి ప్రవేశించి, ఢక్కల్ని పగులగొట్టి, అక్కడున్న సేవకుల్ని తరిమేసి బ్రాహ్మణరూపంలోఉన్న భీమ, కృష్ణార్జునులు ప్రవేశిస్తారు. ఆ ముగ్గురు రోహణకుడింటికి వస్తారు. రోహణకుడు వారికి ఆతిథ్యమిచ్చి పుష్పమాలల్ని ధరించమని కోరతాడు.

చీకటిపడేసమయంలో ముగ్గురు బ్రాహ్మణ వేషధారులు బయలుదేరతారు. పుష్ప లావికలు చందన పుష్పమాలల్ని తయారుచేసి, అంతఃపురంలో జరగబోయే సౌందర్యతిలక వివాహం కోసం తీసుకు వెళ్తుంటారు. వాటిని బలవంతంగా లాక్కుని కృష్ణాదులు ధరిస్తారు. వేగులద్వారా వర్తమానం అందుకున్న జరాసంధుడు ఆ బ్రాహ్మణ వేషధారుల్ని తనదగ్గరికి తీసుకు రమ్మని భటుల్ని పంపిస్తాడు.

రణార్ణవుడు అలంకరించుకుని నగరవీధుల్లో ఏనుగుమీద ఊరేగుతాడు. కళానందుడు ముసలి ఏనుగుమీద రక్తవర్ణ పుష్పాలతో అలంకరించి, బలివ్వడానికి ముందు ఊరేగుతాడు. సౌందర్యతిలక, కళానందుడి విషయంతెలిసి, చాలా బాధపడుతుంది. తన వివాహానికి యోగినిని తప్పక రమ్మని రణార్ణవుడు కోరాడు. తనకు రహస్యంగా గదిని ఏర్పాటుచేయమని యోగిని అడుగుతుంది. రణార్ణవుడు అలాగే చేస్తాడు. వివాహానికి కొన్ని

ఘడియల ముందు మంటలు లేచి అంతఃపురం కొంతవరకు దగ్ధమౌతుంది. అందులోనే సౌందర్యతిలక చనిపోయిందని పుకారు పుడుతుంది. అది నిజమని నమ్మి, రణార్ణవుడు మంటల్లోకెళ్లి వీపుకాల్చుకుంటాడు. ఆరోజు జరగాల్సిన వివాహాన్ని మర్నాడికి జరాసంధుడు వాయిదా వేస్తాడు.

భటులు తీసుకువచ్చిన ముగ్గురు బ్రాహ్మణులకు జరాసంధుడు మధుపర్కాలిచ్చి స్వీకరించమని కోరతాడు. వారు తాము భీమ, కృష్ణార్జులమని శ్రీకృష్ణుడు వివరిస్తాడు. యుద్ధకోసమే వచ్చినట్లు, మాలో నచ్చినవారితో యుద్ధంచేయమని కృష్ణుడు చెప్పాడు. కృష్ణుడు జరాసంధుడితో చాలాసార్లు ఓడిపోయాడు. అర్జునుడు పేలవంగా ఉండడంవల్ల వాళ్లిద్దర్నీ జరాసంధుడు తిరస్కరించి భీముడితో యుద్ధంచేస్తానని అంటాడు. మర్నాడు జరగవలసిన రణార్ణవుడి వివాహం వాయిదావేస్తాడు. జరాసంధుడు విశాల ప్రాంగణంలో మల్లయుద్ధానికి ఏర్పాటు చేసాడు.

జరాసంధుడి కొడుకు సహదేవుడు. అతణ్ణి రాజ్యానికి రాజుగా పట్టంగట్టి, బుద్ధులు చెప్పి జరాసంధుడు యుద్ధానికి సిద్ధమౌతాడు. యుద్ధం ప్రారంభించిన రోజునుంచీ పధ్నాలుగు రోజులు జరుగుతుంది. రోజురోజుకి జరాసంధుడి బలంతగ్గి, భీముడి బలం పెరుగుతుంది. చివరిరోజున జరాసంధుణ్ణి పట్టుకొని కాళ్లమీద పెట్టి, 'కట్టె' విరిచినట్లు భీముడు విరిచేసాడు. ఆ దృశ్యాన్ని చూసిన సహదేవుడు  చాలా బాధ పడ్డాడు. తండ్రీ, రాజుల్ని బంధించకు, సౌందర్యతిలకను చంద్రపాలుడి ఇష్టంమేరకు ఇచ్చి పెళ్లిచేయమని సహదేవుడు జరాసంధుడికి చాలా సార్లు చెప్పిన మాటలు తలచుకుని ఏడుస్తూ కృష్ణుడితో అంటాడు. కృష్ణుడు బాధ పడి సహదేవుణ్ణే రాజుగా చేస్తాడు.

జరాసంధుడు మరణించాక, సహదేవుడు కళానందుడికి, సౌందర్యతిలకతో వివాహం చంద్రపాలుడి ఇష్టప్రకారంగానే జరిపిస్తాడు. రణార్ణవుడికి పెళ్లి ఆగిపోడం, జరసంధుడిమరణం తీరనిబాధగా పరిణమించింది. సహదేవుణ్ణి కలసి తనను మంత్రిగా ఉంచుకోమని, తండ్రి జరాసంధుడే ఉంటే సగం రాజ్యమే ఇచ్చేవాడని, చెప్పేసరికి సహదేవుడికి కోపం వస్తుంది. పొమ్మని కసిరి వెళ్ళగొడతాడు. సౌందర్య వివాహసమయంలో ఒకదూత వచ్చి, కృష్ణుడితో "ఇందుమతి" విషయాలు చెబుతూ, ఆమె ప్రద్యుమ్నుడి స్నేహితుడైన 'యశోధురుణ్ణి' ప్రేమిస్తోందని వివరిస్తాడు.

నాగవల్లి ఎక్కడుందో, ఎలా ఉందో అని పెళ్ళికి రాలేదని సౌందర్యతిలక బాధపడుతూ మేడమీద ఉంటుంది. ఆ సమయంలో కిందనుంచి ఎవరో నాగవల్లి వచ్చిందని కేకపెడతారు. ఆమెను సౌందర్యతిలక కౌగలించుకుని ఇంతవరకూ ఎక్కడ ఉన్నావని ప్రశ్నిస్తుంది. జాతవేదుడుగా, యోగినిగా ఎలా అవతారాలు ఎత్తిందో నాగవల్లి వివరిస్తుంది. అయినా నమ్మకం కుదరలేదని నాగవల్లి గ్రహించి జరాసంధుడి చేతికి ఉండే రాజముద్రికను చూపి యథార్థమని నిరూపిస్తుంది. అందరూ ఆనందంగా మాట్లాడుకుంటారు.

కళానందుడు, సౌందర్యతిలకల పెళ్ళిజరిపించి, శ్రీకృష్ణాదులు ఇంద్రప్రస్థానికి

వెళ్తారు.  అక్కడ రాజసూయయాగం చేయిస్తూ, చివర్లో శిశుపాలుణ్ణి వధించి లోకకంటక నిర్మూలన చేస్తాడు. ప్రేమించుకున్న ఇందుమతి, యశోధరులవివాహం జరుగుతుంది. అందరూ ఆనందిస్తారు. కళానందుడి తెలివితేటల్ని గుర్తించి సహదేవుడు అతడికి మంత్రిపదవిచ్చి గౌరవిస్తాడు. ఇలా కథ సుఖాంతమౌతుంది.

పైన పేర్కొన్న నవలలలో *ప్రచ్ఛన్నపాండవం* చాలా మంది నాటకంగా పేర్కొన్నారు. అయితే దీన్ని రచయిత గ్రంథం అని పేర్కొన్నాడే కానీ నాటకంగాను, నవలగానూ పేర్కొనలేదు. ప్రాథమికంగా ఇందులో వర్ణనలు, పాత్రచిత్రణ కూడ నవలకు దగ్గరగా ఉన్నాయనే ఉద్దేశంతో దీన్ని నవలగా పేర్కోవడం జరిగింది. నవలల్లోని పాత్రలు అయా పాత్రల చిత్రణ ఎలా ఉందో తరువాత అధ్యాయంలో గమనించవచ్చు.

# అధ్యాయం- 2

# 2

# 2. స్త్రీ ప్రధాన నవలలు- పాత్రల పరిచయం- పాత్ర చిత్రణ

## 2. 1. మాధవి నవలలో పాత్రల పరిచయం :-

### 2. 1.1. ఉపోద్ఘాతం :-

సమాజ శాస్త్రజ్ఞులు, శ్రీమతి ఇరావతి కర్వే '*యుగాంతం*'; శ్రీపాద అమృత డాంగే రాసిన '*Indian from primitive communism to slavery*' అనుపమ నిరంజన చదివారు. ఇరావతి కర్వే పుస్తకంలో పురాణాల్లోని వ్యక్తుల్ని, అప్పటి సమాజాన్ని వైజ్ఞానికంగా సమీక్ష చేయాల్సిన అవసరాన్ని అనుపమ నిరంజన గుర్తించారు. అమృత డాంగే పుస్తకంలో 'మార్క్స్ వాద' దృక్పథంలో ప్రాచీన భారతదేశ సమాజాన్ని వాస్తవ చిత్రణ చేయడానికి ఆసరాగా నిరంజన తీసుకున్నారు. ఇవన్నీ 'మాధవి' నవలా రచనకి ప్రేరణలు.

వెట్టిచాకిరీ అమలులో ఉన్న సమాజంలో ఆడదాన్ని కొనుక్కోడం, అమ్మడం, దానం చేయడం మొదలైనవి సామాన్యాంశాలు. భారతకథలో యయాతి తన కూతుర్ని దానం చేయడం, లేదా తాకట్టు పెట్టడం ఈ నవలకి మూలాధారం. ఇది శ్రీమన్ మహాభారతం ఉద్యోగ పర్వంలో 114వ అధ్యాయం నుంచి 119 వ అధ్యాయం వరకూ మాధవికి సంబంధించిన కథ ఉంది.

సంస్కృత భారతంలో ఉన్న మాధవి కథని తీసుకొని వైజ్ఞానిక సత్యాల్ని అర్థం చేసుకొని, నాటి సమాజపు తీరుతెన్నులు ప్రతిఫలించేలా అతీంద్రియులైన వ్యక్తులుకూడా మానవ సహజమైన దౌర్బల్యాలకి ఎలా లొంగిపోయారో, ప్రవచనాలకి, ప్రవర్తనలకి తేడా ఎలా చూపిస్తారో వివరించే ప్రయత్నమే ఈ నవల.

ఈ నవలని అధ్యయనం చేసేటప్పుడు మూలంలో ఉన్న మాధవికి, నవలలో ఉన్న మాధవి కథకి కొన్ని తేడాలున్నాయి. ఈ తేడాలు ప్రధానంగా కొత్తపాత్రల ప్రవేశం, కల్పనలు, వర్ణనలు, మానసిక స్థితి-భావనలు, సంభాషణలలో చూడొచ్చు. మూలంలో ఉన్న విషయాలు కొన్ని యథాతథంగా కూడా ఉన్నాయి. మూలంలోని విషయాన్ని అనుబంధం-1 లో చూడవచ్చు.

'మాధవి' ఈ నవలలో 'పీడిత జాతికి ప్రతినిధి'గా, 'పురుషుడి కామ తృప్తిని తీర్చే వస్తువు'గా, విక్రయించే లేదా దానంచేసే వస్తువుగా, పిల్లల్నికనే యంత్రానికి ప్రతీకలా కనిపించడం ప్రత్యేకత. దీనికి సంబంధించిన మరిన్ని అంశాలను ఆరో అధ్యాయంలో చర్చించడం జరిగింది.

### 2. 1. 2. కొత్తపాత్రల పరిచయం :-

#### 2. 1. 2. 1. అవ్వ :-

మాధవి పుట్టినకొద్ది రోజులకే తల్లి చనిపోయింది. ఆ బాధ్యతల్ని మోసిన పాత్ర అవ్వ. ఈమె యయాతి అంతఃపురంలోని దాసి. ఈమె మాధవికి తల్లీ, తండ్రీ అయి పెంచుతుంది. మాధవికి ఈమంటే చాలా ఇష్టం కూడా.

**2. 1. 2. 2. సుపర్ణుడు, మనుస్వతుడు :-**

గాలవుడి చదువు పూర్తయిన సమయంలో చదువుకునే విద్యార్థులు. వీరు గాలవుడితో కాసేపు మాట్లాడతారు. (పుటలు.12-13)

**2. 1. 2. 3. ఋషిపత్ని :-**

గాలవుడు, మాధవి అరణ్యమార్గంనుంచీ వెళ్తుండగా, దారిలో ఒక ముని ఆశ్రమం కనిపిస్తుంది. అక్కడ కొంతసేపు విశ్రాంతి తీసుకొని ఉంటారు. ఋషి, ఋషిపత్ని వీరిని ఆదరించి, వసతులుచేకూరుస్తారు. ఋషిపత్ని మాధవి విషయంవిని, 'చెల్లీ' అని సంబోధిస్తుంది. ఈమె మాధవిని ఓదారుస్తుంది. (పుటలు. 37-43)

**2. 1. 2. 4. చారునేత్ర :-**

మాధవి యయాతి దగ్గర ఉన్నప్పుడు ఉండే చెలికత్తె. మాధవి అంటే ఇష్టంగా ఉండే సఖి ఈమె.

**2. 1. 2. 5. కనకాంబరి :-**

హర్యశ్వుడి దగ్గర అంతఃపురంలో మాధవితో మాట్లాడే సఖి. మాధవి ఈమెతో చాల విషయాలు మాట్లాడేది. కొత్త కొత్త విషయాలు ఈమెవల్ల మాధవికి తెలిసేవి.

**2. 1. 2. 6. మనమోహిని :-**

హర్యశ్వుడి రాజమందిరంలో నాట్యంచేసే నర్తకి. రాజుకి ఇష్టమైన నాట్యగత్తె. మాధవి ఈమెతో మాట్లాడుతుంది. రాజు ఈమె చేసిన నాట్యానికి మెచ్చి, అతడి కంఠహారాన్ని కానుకగా ఇచ్చి సత్కరిస్తాడు. (పుట. 53-55)

**2. 1. 2. 7. వేదవతి, ధారుణి ఋషి :-**

హర్యశ్వుడునుంచీ బయలుదేరి వస్తుండగా, బాలింతరాలైన మాధవి దూరం ప్రయాణం చేయలేక, దారిలో స్పృహ తప్పి పడిపోతుంది. అక్కడకు దగ్గరిలో ధారుణి ఋషి ఆశ్రమం ఉంటుంది. అక్కడకు గాలవుడే వెళ్ళి, విషయం చెప్పి, వీరి సహాయం కోరతాడు. ధారుణి ఋషి భార్య వేదవతి. ఈమె మాధవికి ఆరోగ్యం కుదుటపడేవరకూ సేవచేస్తుంది. ఇంతదూరం నడిపించినందుకు మాధవి మరణిస్తే, స్త్రీ హత్యా పాతకం చుట్టుకుంటుందని గాలవుడికి ఈమె చెబుతుంది.

**2. 1. 2. 8. శిల్పి :-**

దివోదాసుడు అశ్వమేధయాగం, పుత్రకామేష్టి చేస్తున్నపుడు ఆ యాగమండపాలు

ఇతడే తయారుచేసేవాడు.

2. 1. 2. 9. భారద్వాజుడు :-

నైమిశారణ్యంలో ఉండే దివోదాసుడికి కులపురోహితుడు. ఇతడి ఆధ్వర్యంలోనే దివోదాసుడు యాగాలు చేసాడు.

2. 1. 2. 10. సత్యవతి :-

దివోదాసుడి భార్య. మాధవిని పాణిగ్రహణం చేసుకున్నాక, ఆ విషయం విని దివోదాసుడిమీద కోపగించుకొనే పాత్ర. తర్వాత ఈమెను దివోదాసుడు బుజ్జగిస్తాడు. మాధవికి పుట్టిన కొడుకుని తనకొడుకుగా చూసుకుంటుంది. మాధవితో చనువుగా ఉండే ప్రయత్నం చేస్తుంది.

2. 1. 2. 11. మందారమాల :-

దివోదాసుడి సభలో నాట్యంచేసేపాత్ర. దివోదాసుడికి ఇష్టమైన నాట్యగత్తె. మాధవితో ప్రత్యేకంగా మాట్లాడుతుంది.

2. 1. 2. 12. మేఖలః-

దివోదాసుడి మందిరంలో మాధవిదగ్గరుండే చెలికత్తె. సత్యవతికి మాధవిని పరిచయం
చేసి, వాళ్ళ స్నేహానికి కారకురాలైంది.

2. 1. 2. 13. మాహేయరాజు మాహిష్మతి :-

దివోదాసుడిమీదకి దండెత్తడానికి వచ్చినరాజు. నాలుగు రోజులు యుద్ధంచేసి చివరకు అతడితో సంధి చేసుకొని, తనకూతురు 'మహిమ' నిచ్చి వివాహం చేస్తాడు.

2. 1. 2. 14. మహిమ :-

మాహిష్మతి రాజకుమార్తె. నలుపుగా శరీరచ్ఛాయ ఉన్నా, అహంకారానికి ఏమీ తక్కువలేని పాత్ర. మాధవి అంటే ఇష్టంలేని పాత్రకూడా.

ఈ పాత్రలన్నీ ఆయా సన్నివేశాల్లో కథని నడిపించడంలో సహకరిస్తూ, ఒక్కోసారి ప్రధాన పాత్రలతో ఉన్న సంబంధాన్ని తెలియజేయడానికి ఉపకరించాయి. ఈ పాత్రలు కొన్ని పాత్రల మానసికస్థితిని తెలిపేందుకు సహకరించాయికూడా. యయాతి, మాధవి, దివోదాసుడు, హర్యశ్వుడు మొదలైన పాత్రలున్నాయి. వాటిని ప్రత్యేకంగా పరిచయం చేయడంలేదు. ఆ పాత్రలకు సంబంధించిన చాలా విషయాలు తరువాత అధ్యాయాల్లో చర్చించడం జరిగింది. అందుకే కేవలం కల్పిత పాత్రలనే పేర్కోవడం జరిగింది. ఈ నవలలో పాత్రల మనస్తత్త్వాన్ని పరిశీలిద్దాం.

### 2. 2. మాధవి నవల- పాత్రల మనస్తత్త్వ పరిశీలన

యయాతి మాధవి పుట్టినప్పుడే 'అపశకునపు పక్షి' అని చెప్పి అవ్వకి బాధ్యతలు చిరగ్గావదిలేసి వెళ్ళిపోయాడు. ఎనిమిది సంవత్సరాలకి మళ్ళీ వచ్చి, దిగ్విజయయాత్రలో సంపాదించిన ఇంద్రనీలమణిని మాధవికిద్దామని వచ్చాడు. మాధవిని పిలిచినా, ఆమె యయాతి దగ్గరకి రాలేదు. అవ్వ వెళ్ళమని చెప్పినాకూడా వెళ్ళలేదు. 'వెళ్ళు తండ్రికి నమస్కరించు' అని అవ్వ ఎంత బలవంతపెట్టినా భయం, కొత్తదనం వల్ల వెళ్ళలేదు. యయాతి కోపంతో ఆ హారాన్ని అవ్వవైపుకి విసిరేసి వెళ్ళిపోయాడు. ఈ విషయాన్ని మాధవి పెద్దయ్యాక, మేనాలో కూర్చొని దేవాలయానికి వెళ్తూ, దూరంలో తళతళలాడుతున్న ఇంద్రనీలశిలల్ని చూసి గుర్తుకుతెచ్చుకుంది.(పుట.7) ఈ అంశంలో ఇంద్రనీలమణి కేవలం శిలలాగే భావించింది. అందుకే హారాలమీద వ్యామోహంలేదు అనే మాధవి మనస్తత్త్వాన్ని సూచించడం కనబడుతోంది.

యయాతి, మాధవిని కూతురన్న ప్రేమతో ఎప్పుడూ చూడలేదు. కానీ, మాధవి యయాతిని 'నాన్న' అని పిలవాలనే కోరిక మాత్రం ఎంతో ఉండేది. అలాగే యయాతి ఒక్కమారైనా 'మాధవీ' అని ప్రేమగా పిలవాలని, మాధవి ఆశగా ఎదురుచూసింది. తండ్రి ప్రేమ దొరకలేదని బాధపడింది. (పుటలు. 6-7)ఈ అంశంలో తండ్రిపట్ల ఆడపిల్లకు ఉండే సహజమైన మానసిక స్థితిని వివరించేలా కనబడుతోంది.

హర్యశ్వుడి తర్వాత, మాధవిని చాలా దూరం గాలవుడు నడిపించాడు. హర్యశ్వుడిదగ్గర మాధవి కొడుకుని కన్నాక, అక్కడే ఉండిపోవాలని అనుకుంది. గాలవుడు ఈమె మానసిక స్థితిని పట్టించుకోలేదు. అప్పుడు లోలోపల బాధపడుతుంది. హర్యశ్వుడు మాధవిని ఉంచమని అనలేదు. అవసరంతీరిని అవకాశవాదులుగా ఇక్కడ హర్యశ్వుడు కనబడతాడు.

మాధవిని తీసుకొని గాలవుడు  అరణ్యాలగుండా బయలుదేరాడు. మాధవి ఏమీ మాట్లాడలేదు. గాలవుడికి నడిచి నడిచి విసుగెత్తింది. మాట్లాడితే మార్గాయాసం తగ్గుతుందని భావించాడు. మనమిప్పుడు దివోదాసుడి దగ్గరకి వెళ్తున్నామని, దగ్గరలో గంగానది ఉందని దానిలో స్నానంచేస్తే, పాపాలు పోతాయని గాలవుడు అంటాడు. అప్పుడు మాధవి "నువ్వా నదిలో మొదట స్నానంచేయాలి నన్ను ఏడిపించిన పాపం నిన్ను చుట్టుకుంటుంది. దాన్నుండి విముక్తిపొందాలంటే నూరుమార్లయిన నువ్వానదిలో మునగాలి" అని అనుకుంది. కన్నకొడుకుని వదిలేసి రావడం మానవసంబంధమైన తల్లి కడుపుతీపిని సూచిస్తోంది. పైగా, 'ఇహలోకపు మోహాన్ని త్యజించి, పరలోక సాధన వైపు దృష్టిని తిప్పుకో'మని గాలవుడు మాధవికి సలహా ఇచ్చాడు. 'ధూర్తముని స్వార్థసాధనకోసం నాకుపరలోకం ఎరచూపి మోసగిద్దామని చూస్తున్నాడు. ఇప్పుడే ఇహలోకపు గురుదక్షిణ ఆశవదిలిపెట్టి, పరలోక మార్గమైన తపస్సు చేసుకోకూడదూ?" (పుట.64) అని మాధవి మనస్సులో అనుకుంటుంది. చెప్పేవి తమకు వర్తించవని, ఇతరులకే చూపి స్వార్థానికి వాడుకోడం మానవులందరికి సాధారణంగా అలవాటైపోయిందనే ఆవేదన కనబడుతోంది.

మాధవి, గాలవుడు దివోదాసుడి దర్శనం చేసుకున్నారు. విషయం విన్న, దివోదాసుడు తనదగ్గర రెండువందల అలాంటి గుర్రాలు ఉన్నాయన్నాడు. మాధవికి కొడుకు పుట్టేవరకూ ఉంచుకోమని గాలవుడు అన్నాడు. అప్పుడు మాధవి తనని కనీసం అడగకుండానే ఒప్పందాలు అయిపోతున్నాయని బాధపడింది. ఆ విషయాన్ని సూచించడానికి 'అవనతముఖియై నిల్చున్న మాధవి తనను గుర్రం, ఆవుల లాగానే వ్యాపారం చేస్తున్నారే వీళ్లు' అనినిట్టూర్చింది అని రచయిత్రి వివరిస్తుంది. తానూ ఒక వ్యక్తి అని వీరిలో ఎవరికీ అనిపించదా? తాను పుట్టకపోతే ఎంతబాగుండేది. ఇలాంటి బ్రతుకు ఏ ఆడదానికివద్దు అని బాధపడింది.(పుట.77) ఇక్కడమాధవి యొక్క అంతరంగ చిత్రణ, దయనీయ స్థితిని వ్యక్తం చేస్తోంది.

గాలవుడు చెప్పిన మాటలకి దివోదాసుడు సరే అని, 'రాజునైన నేను పరనారీ సహోదరుడ్ని. అగ్నిసాక్షిగా పెళ్ళాడితేనే అదిభార్య. వంశానికి పవిత్రతరావాలంటే అది శాస్త్రోక్తమైన సంబంధంకావాలి' అని దివోదాసుడు అన్నాడు(పుట.77). ఆ మాటలు విన్న మాధవి 'ఆహా, ఎంత గొప్ప మాటలివి. అగ్ని సాక్షిగా పెళ్ళాడిన భార్యలు ఎంతమందున్నారో ఈ రాజుకు. పవిత్రతలాంటి మాటలకర్థం ఉందా? వందలాది స్త్రీలతో సంభోగించిన రాజు పవిత్రుడా? లేక హర్యశ్వుడితో పడుకుని, ఇప్పుడు ఇతనితో జీవించవచ్చిన తాను పవిత్రురాలా?' అని తనలో అనుకుంది. సమాజంలో ఎవరు పవిత్రులు అని రచయిత్రి పరోక్షంగా విమర్శిస్తున్నట్లు అనిపిస్తోంది. సమాజంలో మాటలకి, చేతలకీ పొంతన లేని వ్యక్తులు చాలామంది ఉన్నారు. ఈ రాజు కొంత విలక్షణంగా కనిపిస్తున్నాడు. అందుకే ఈమె మనోభావాన్ని రచయిత్రి వెలిబుచ్చారు. ఇందులో జరగబోయో కథలో విశ్వామిత్రుడు లాంటి వ్యక్తుల్ని విమర్శిస్తున్నట్లనిపిస్తుంది.

దివోదాసుడు మాధవిని కలవడానికి వస్తాడని, దాసీలు మాధవిని అలంకరించారు. అలాంటి సమయంలో దూరంలో ఒక దాసీబిడ్డ ఏడుపుని విని, మాధవికి హర్యశ్వుడివల్ల పుట్టిన వసుమంతుడు గుర్తుకొచ్చాడు. బాధపడింది. 'దివోదాసుడు వచ్చే వేళ అయింది' అని చెలికత్తె చెప్పి, వెళ్ళిపోయింది. 'దివోదాసుడు వస్తున్నాడనే మాటలకి తాను పులకించి పోవాలి. ఒళ్ళంతా సిగ్గుతో వణకాలి. మొఖం ఎర్రబడాలి. కానీ, తనకేం అవడంలేదే! ఎందుకు? తనలోని ప్రేమభావం కాలి బూడిదైపోయిందా? ఇక అలా చూడబోతే దివోదాసుడు నడి వయస్సులో వున్నాడు. మంచిరూపం ఉంది. తానుకోరుకున్న కలల్లోని రాజకుమారుడు కాకపోయినా, కాశీరాజ్యంలో ప్రతిస్త్రీ కోరుకునే సంపదా, అధికారం ఉన్నవాడు. అయినా ఈ మహారాజుపట్ల తాను కట్టెలాగానే ఉంది. వీటిల్లో వేటిలోనూ ఎవరూ తన ఇష్టాయిష్టాల్ని అడగలేదు. కర్తవ్యానికి బద్ధురాలై, ఇంకా ఉపిరి తీస్తున్నదంతే. ప్రపంచం దృష్టిలో తనకీపాటికప్పుడే రెండుమార్లు పెళ్ళయింది. అది ఓ సంవత్సరంబాటు మాత్రమే ఉండేబంధం. ఆ తర్వాతేముక్తి. మళ్ళీకారాగృహం మరోచోట' (పుటలు.88-89)అనుకోడంలో మాధవివేదనతో పాటుగా, స్త్రీవేదన నంతా చిత్రించినట్లుగా ఉంటుంది. పెళ్ళి అనేది మానసిక ఇష్టంతో జరగాలి. స్త్రీ మనసును పురుషుడు అర్థం చేసుకోవాలని రచయిత్రి సూచించారు. కేవలం పెళ్ళి అనేది కట్టుబాటుగా ఉండాలనడం ఎంతవరకు? కేవలం శరీరవ్యామోహాన్ని ఏమనాలి? ఇలాంటి ప్రశ్నలకు సమాధానం పాఠకుడికే రచయిత్రి

వదిలేసారు.

విశ్వామిత్రుడివల్ల మాధవికి 'అష్టకుడు' పుట్టాడు. బిడ్డకి రెండెల్లయ్యేసరికి గాలవుడు వచ్చాడు. విశ్వామితుడి ఆశ్రమంలో ఆడబిడ్డలెవరూలేరు. అందుకే అష్టకుణ్ణి తీసుకుపోయి, పెంచుకుంటానని మాధవి విశ్వామిత్రుణ్ణి అడిగింది. తనవద్దే ఉంచమని, అతణ్ణి మహామునిగా చేస్తానని విశ్వామిత్రుడు అన్నాడు. పైగా, బిడ్డమీద తల్లికి అధికారంలేదని తేల్చి చెప్పాడు. మాధవికి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. 'పిల్లలమీద వ్యామోహం వద్దు. ముగ్గుర్ని ఇప్పటికే వదులుకుని వచ్చాను. ఈ బిడ్డను ఇమ్మని అడగటమే తప్పు. ఈ వ్యామోహాన్ని వదులుకోవాలి' అని మాధవి తన మనస్సును గట్టి చేసుకుంది (పుటలు.176-177). ఇక్కడ మాధవి పడిన మానసికవేదన, పిల్లల పట్ల తల్లి పడే అరాటం వ్యక్తమౌతున్నాయి. నిజంగా తల్లికి బిడ్డమీద అధికారం ఉండదా? లేక అనాదిగా మగాడు పెడుతున్న షరతులా? అని ప్రశ్నాత్మకంగా సూచిస్తున్నాయి.

విశ్వామిత్రుడి ఆశ్రమం నుంచి గాలవుడితో మాధవి తిరుగుప్రయాణమయ్యింది. గురుదక్షిణ చెల్లించాననే ఆనందంతో ఒక పక్క, ఈ మాధవికి ఇంత దుఃఖాన్ని కలిగించానన్న బాధ మరోపక్క ఉన్న ఆ గాలవుడు మాధవితోరెండు మంచి మాటలాడాలనుకున్నాడు. 'మాధవీ, నువ్వు ముగ్గురు రాజర్షుల వల్లా ఓ బ్రహ్మర్షివల్లా సంసార సుఖాన్ని అనుభవించి, నలుగురు పుత్రుల్ని పొందికూడా కన్యలాగానే ఉన్నావు. నన్ను కూడా గురుదక్షిణ భారంనుంచి విముక్తుణ్ణి చేశావు. నీకు అఖండమైన కీర్తి కలగాలి'(పుట.178)అన్నాడు. మాధవి రెచ్చిపోయి, 'తనజీవితం ముక్కలుగా చేయడానికి కారణంగా, గురుదక్షిణ చెల్లించకపోతే నష్టమేమొచ్చింది? గుర్రాలకేగతి పట్టింది? మీ తపస్సు, యజ్ఞం యాగాదులవల్ల ప్రపంచం ఉద్ధరించబడుతుందా?, ఉద్ధరించలేనప్పుడు నా ఉసురెందుకు పోసుకున్నారు?' అంటూ గట్టిగా కేకలు పెట్టింది(పుటలు- 178,179) ఇక్కడ వాస్తవ అంశాల్ని అర్థం చేసుకోకుండా, కేవలం గాలవుడి గురుదక్షిణకోసం మాధవిజీవితం అన్యాయంపాలుచేసి మాట్లాడినందుకు, ఆమెలోని ఆవేదన ఒక్కసారి పొంగి రావడం గమనించాలి. స్త్రీకి అంత్యంత విలువైన మానాన్ని ప్రయోజన హీనమైందీ, పైగా ఆమె అనుమతి లేని హేయమైన అంశాలకు బలిచేయడం ఎంతవరకు సమంజసం? స్త్రీని చూసే కోణం ఇదేనా? అనే ప్రశ్నార్థకాలను ఈ సందర్భంలో సూచిస్తున్నట్లు అనిపిస్తోంది.

తిరుగు ప్రయాణంలో నది దాటుతున్న సమయంలో మాధవి, సఖి చారునేత్ర, అవ్వల్ని చూస్తాననితల్చుకొనిపొంగిపోయింది.ఇలాంటిస్థితిలోఉన్ననన్నువాళ్ళుచూస్తే ఏమనుకుంటారో? అవ్వ మాటలు, చారునేత్ర మాటలు గుర్తుకు వచ్చాయి. 'తనకొడుకు వసుమంతుడు ఎలాగున్నాడో. వాడికిప్పుడు నాలుగేళ్ళు కదా? తోటలో ఆడుతూ ఉండొచ్చు. లేదా మహారాణి ఒడిలో కూర్చుని ఉండొచ్చు అమ్మా అని ఎవర్ని పిలుస్తున్నాడో?' (పుట.180) అని చాల రకాలుగా తల్చుకొని మథనపడిన మాధవిస్థితిని చదివిన పాఠకుడికి కన్నీరు పెట్టిస్తోంది. ఒకవైపు తనఉనికికి వాటిల్లుతున్న అవమానం, మరోవైపు తనకొడుకులైకూడా తన దగ్గరలేని స్థితి మాధవిని మరింత బాధలోకి నెట్టేస్తున్నాయి.

మాధవి గొంతు పూడుకుపోయింది. దివోదాసుడిభార్య సత్యవతి జ్ఞాపకం వచ్చింది. యజ్ఞంలోంచి వచ్చిన పాయసం మొత్తం సత్యవతే తాగింది. అయినా ఆమెకు సంతానం కలగలేదు. కానీ, మాధవికి కొడుకు పుట్టాడు. అలాంటి కొడుక్కి తల్లయికూడా తానిప్పుడు ఎవరూ లేని అనాథ. 'అందాలరాణీ' అని మాధవిని ఉశీనరుడు పిలిచేవాడు. నా పిల్లలకు విషం పెట్టవా? నీచేతులు పాడిపోనూ' అని మాధవికి పుట్టిన బిడ్డకి విషం పెట్టానని మహరాణి మాధవిమీద నేరమాపాదించింది. 'నారాణి!, కామాన్ని పూర్తిగా అనుభవించిన దానివి నువ్వు. అందుకే నీకు కోరికలేదు. కానీ నాకున్న ఆకలి ఎన్నో సంవత్సరాలిది' అన్న విశ్వామిత్రుడు.... ఇలా ప్రతి విషయం గుర్తుకురాసాగాయి. ఈ వాక్యాల్లో గతస్మృతుల్ని నెమరవేసుకుంటూ, వర్తమానంలోకి మాధవిని తేడం రచయిత్రి ఉద్దేశం. జరిగిపోయిన గతాన్ని తలచుకుని ఎక్కువ బాధపడేకన్నా వర్తమానాన్ని, భవిష్యత్తుని ఆలోచించమని రచయిత్రి సూచన.

తిరిగి వచ్చిన మాధవి దగ్గరికి యయాతి వచ్చి, 'మాధవీ కులాసాగా ఉన్నావా బిడ్డా? అని వాత్సల్యంతో అడిగాడు. దానికి సమాధానంగా "ఇక జీవించే వున్నాను తండ్రీ" అని మాధవి చెప్పింది. 'నిన్ను దానంచేశాక, ఈ అయిదేళ్ళూ నేనెంత బాధపడ్డానో, బెంగ పెట్టుకున్నానో ఆ దేవుడికే తెలుసు" (పుట.181) అని యయాతి అన్నాడు. ఆ మాటల్లో నిజమెంత అన్నట్లు మాధవి చూసింది. ఆ చూపుల్ని యయాతి తట్టుకోలేకపోయాడు. అంతఃపురానికి వెళ్ళి విశ్రాంతి తీసుకోమని మాత్రమే యయాతి చెప్పగలిగాడు. ఇక్కడ యయాతి అంతర్మథనం కనబడుతోంది.

గాలవుడు యయాతితో ఏకాంతగా మాట్లాడుతూ, అయిదేళ్ళ మాధవి జీవితాన్ని వివరిస్తాడు. 'గాలవుడు ఋషి కాకపోతే, అతని కెలాంటి శిక్ష వేయడానికైనా వెనుదీసేవాడు కాదు. గాలవుడు విషయం ముగించే సరికి యయాతి గట్టిగా కేకలు వేసి, 'మీరు ఋషికాదు. కసాయి వాళ్ళు. ఏమీ తెలీని అమాయకురాల్ని తీసుకుని వెళ్ళి ఇంతమందికి అమ్మి, దాని బతుకు నాశనం చేసారు. మీకెలాంటి శిక్షవేసిన తప్పులేదు' (పుట.182). ఇక్కడ యయాతి అంతర్మథనాన్ని వ్యక్తీకరించినా, గాలవుడు 'ఈ అపరాధంలో నీకూ భాగం వుంది మహారాజా!' అనేసరికి ఏమీచేయలేని స్థితికి యయాతి చేరుకుంటాడు. అందుకే కూతుర్ని పుట్టింట్లో ఉంచుకోలేక, మాధవి క్షమించాలంటే ఆమె జీవితానికి మార్గం కల్పించాలి. అది ఆమె స్వయంవరంతో సిద్ధిస్తుందని భావిస్తాడు. ఒకవేళ మాధవి 'స్వయంవరం వద్దు' అంటే తనకి ముక్తి లభించదని యయాతి అనుకుంటాడు.(పుట.186) స్త్రీ జీవితాన్ని పునరుద్ధరించడం జరగాలి. అయితే అందుకు ఆమె మానసిక స్థితికూడా తగిన విధంగా ఉండాలని రచయిత్రి సూచించినట్లు అనిపిస్తోంది.

స్వయంవరంలో మాధవి 'నేను ముగ్గురు రాజులతోనూ, ఓ ఋషితోనూ ఉండి వచ్చాను. నన్ను వివాహం చేసుకోడం మీకు అభ్యంతరంలేదా? అని రాజకుమారుల్ని ప్రశ్నించింది. (పుట.188) అభ్యంతరంలేదని సమాధానం వచ్చేసరికి, మాధవికి మగజాతిమీద అసహ్యమేసింది. ఏ రాజకుమారుడికి మెడలో దండ వేయకుండా తండ్రి

దగ్గరికి వచ్చి, 'తండ్రీ!, ఇంతకుముందు ఎప్పుడూ నాకు నా భవిష్యత్తు నిర్ణయించుకునే అవకాశంలేదు. ఇప్పుడు నాకు ఆ హక్కును ఇచ్చారు. నా ఇష్టం వచ్చినట్లు నేను చేయవచ్చు కదా?' అని అడిగింది. 'చేయచ్చు' అన్న తండ్రి జవాబుతో, చేతిలో ఉన్న వరమాలని విసిరేసి, 'వనమే నా వరుడు' అనిగట్టిగా అంది. ప్రపంచాన్నే ధిక్కరించేంత పెద్దపెద్ద అంగల్తో అడవిలోకి మాధవి నడిచింది. ఒక స్త్రీమూర్తిగా మాధవికి ప్రత్యేకతని సంతరించిన మాటలివి.

ఏ ప్రమేయం లేకుండా, కేవలం దానం ఇచ్చాడనే వంకతో గాలవుడు ప్రదర్శించిన తీరు, తిరిగి వచ్చిన కూతుర్ని వదిలించుకోనే స్థితిలో తండ్రి, అందంగా ఉంటే చాలనుకునే రాజకుమారులు, వీరందర్నీ ఒక్కసారిగా అసహ్యించుకొనే మాధవి స్థితి అనన్య సామాన్యం. అంతవరకు ఓపికపట్టి తన అభిప్రాయానికి విలువ ఇచ్చినట్లు తెలుసుకొని తండ్రి అయిన ఇంక ఏ మగాడైన ఇంతే, అనుకొని అడవిని ఎంచుకొని, స్త్రీ స్వేచ్ఛను కోరుకోడం పతాకస్థాయిని సూచిస్తోంది. ఆడజాతిని అర్థంచేసుకోలేని మగజాతి ఉన్నంతవరకూ, స్త్రీకి స్వేచ్ఛ ఉండదని సూచిస్తోంది. మగవాళ్ళు ఆడవారిని అర్థంచేసుకోలేకపోతే, సమాజం పతనం చెందుతుందని రచయిత్రి స్ఫురించేలా చేస్తూ ముగించారు.

### 2. 3. *సౌందర్యతిలక* నవలలో పాత్రల పరిచయం :-

#### 2. 3. 1. ఉపోద్ఘాతం :-

'కళాప్రపూర్ణ', చిలకమర్తి లక్ష్మీనరసింహం ఈ నవలలో పాత్రలన్నిటినీ చక్కగా పోషించారు. భారతంలోని కొన్ని పాత్రల్ని మాత్రమే తీసుకున్నారు. శ్రీకృష్ణుడు, జరాసంధుడు. పాండవులు, శిశుపాలుడు, గదుడు, రుక్మిణి, మొదలైనపాత్రలు ఈ నవలలో కనిపిస్తాయి. వీళ్ళేకాకుండా సందర్భానుసారంగా కొన్ని కల్పితపాత్రలుకూడా ఉన్నాయి. ఈ పాత్రల్లో ప్రత్యేకత ఉన్న పాత్రల్ని మాత్రమే పరిచయం చేయడం జరుగుతుంది.

#### 2. 3. 2. భారతంలోని పాత్రలు

#### 2. 3. 2. 1. శ్రీకృష్ణుడు :-

శ్రీకృష్ణుడు ప్రధానంగాకనిపించినా, మొదటిభాగంలో ఈ పాత్రకి ప్రత్యేకత లేదు. రెండవభాగంలో రాజసూయయాగ రచన, జరాసంధ, శిశుపాలవధ మొదలైనఘట్టాల్లో ప్రాముఖ్యత కనిపిస్తోంది. పాండవులకి సలహాదారుగా, కళానందుడికి సహాయకుడిగా; జరాసంధుడికి, శిశుపాలుడికి వైరిగా కనిపించి, విభిన్నతని చాటుకున్న పాత్ర ఇది. ధర్మరాజు రాజసూయ యాగాన్ని నిర్వహించే పథక రచనంతటినీ శ్రీకృష్ణుడిమీద వేస్తాడు. రాజసూయ యాగానికి, కళానందుడి సహాయంచేయడానికి ముందుంటాడు.

#### 2. 3. 2. 2. జరాసంధుడు ;-

జరాసంధుడు కాలభైరవపూజచేసి, సమస్తరాజుల్ని జయించాలని సంకల్పించు కుంటాడు. ఇతడి కొడుకే సహదేవుడు. ఇతడి ఉంపుడుగత్తె కొడుకు రణార్ణవుడు. రణార్ణవుడి సాయంతో ప్రజల్ని పీడించడమే జరాసంధుడు ప్రధానంగా భావిస్తాడు. శ్రీకృష్ణుడు, భీమార్జునులు వచ్చిన సమయంలో వారిలో భీముణ్ణి ఎంచుకొని మల్ల యుద్ధానికి సిద్ధపడే

పౌరుషవంతుడు.

## 2. 3. 2. 3. ధౌమ్యుడు :-

ఇతడు పాండవుల పురోహితుడు. శ్రీకృష్ణుడు రాజసూయ యాగనిమిత్తం అనుమతి, సూచనలు కోరే సందర్భంలో ఈ పాత్రకు ప్రత్యేకత స్థానం ఉంది. రాజసూయాన్ని పూర్వం శ్రీరాముడు మొదలైనవారు ఎలా నిర్వహించారో ఇతడే సూచిస్తాడు. శ్రీకృష్ణుడే నాటి శ్రీరాముడిగా విన్నవిస్తాడుకూడా.

## 2. 3. 2. 4. శిశుపాలుడు :-

ఛేదివంశానికి చెందినవాడు. జరాసంధుడికి విధేయుడు. 'ఇందుమతి'ని పెళ్ళి చేసుకోవాలనే తహతహలాడతాడు. హేమమతి, జాతవేదుడి వేషాలు వేసిన 'నాగవల్లి', శిశుపాలుణ్ణి నమ్మించి మోసగించి కళానందుణ్ణి, ఇందుమతిని శిశుపాలుడి చెఱనుంచీ తప్పిస్తుంది. కేవలం మోహం కారణంగా ఇందుమతి మీద నమ్మకాన్ని పెంచుకొని వాస్తవాన్ని గుర్తించలేని పాత్రగా శిశుపాలుడుకనిపిస్తాడు.

పై పాత్రలన్నీ భారతలోనివే. వీటిని చాలా సంఘటనలో మార్పులు చేసి రచయిత వాడుకున్నాడు. ఈ నవలలో ఎక్కువ కల్పిత పాత్రలున్నాయి. ఆ పాత్రలన్నీ సౌందర్యతిలక, కళానందుడి వివాహానికి పరోక్షగానో, ప్రత్యక్షంగానో కారణాలుగా ఉంటాయి. ఈ కల్పిత పాత్రల్లో మేటి నాగవల్లి.

## 2. 3. 3. కల్పిత పాత్రలు

## 2. 4. 3. 1. నాగవల్లి :-

సౌందర్యతిలకకు దగ్గరి చెలికత్తె ఈమె. కళానందుడు, సౌందర్యతిలకల్ని ప్రేమ దగ్గరినుంచి పెళ్ళివరకూ అంతఃసూత్రం అనదగ్గ పాత్ర ఈమె. 'రోహణకుడు' అనే పూల వ్యాపారి దగ్గర పూల దండని తీసుకొని దారిలో ఓ వృద్ధున్ని రక్షించడానికి దాన్ని అమ్మేస్తుంది. అందులో కేతకీపత్ర మన్మథలేఖ ఉంటుంది. దాన్ని సంపాదించాలని చేసిన ప్రయత్నంలో భాగంగా జ్ఞాననిధిగా (యోగినిగా ఉన్నప్పుడు), జాతవేదుడిగా, హేమామతిగా వేషాలు వేసి దేశ రక్షణకి, చెలికత్తెకోసం తీవ్రంగా కష్టపడిన కార్య సాధకురాలుగా కనబడుతోంది.

## 2. 3. 3. 2. కళానందుడు :-

నవలలో కథానాయకుడు. ధారుణీదేవి, మహాసేనాధిపతి విక్రమవర్మల పుత్రుడు. సున్నిత మనస్తత్త్వం ఉన్నవాడు. సౌందర్యతిలకని ప్రేమిస్తాడు. జరాసంధుడి ఆగడాల్ని ఎదుర్కోడం కోసం శ్రీకృష్ణుడి దగ్గరికి వెళ్తాడు. శిశుపాలుడికి దొరికిపోయి, జైలు జీవితం కొన్నాళ్ళు అనుభవిస్తాడు. చివరకు జాతవేదుడు, హేమావతులు వేషాలువేసిన నాగవల్లిద్వారా, ఆ తర్వాత శ్రీకృష్ణుడిద్వారా రక్షణ పొందుతాడు. చివరకు సహదేవుడు(జరాసంధుడి కొడుకు)ద్వారా ఇతడు మంత్రి పదవి పొంది, సౌందర్యతిలకతో ఆనందంగా ఉంటాడు.

### 2. 3. 3. 3. సౌందర్యతిలక :-

నవలలో నాయిక. చంద్రపాలుడికూతురు. రాజకన్య. 'గుణోత్తమ' అని ఈమెకు మరో పేరు ఉంది. కళానందుణ్ణి ప్రేమిస్తుంది. జరాసంధుడు అడ్డు పడడం, చివరకు నాగవల్లి ద్వారా కళానందుడు రాసిన కేతకీపత్ర లేఖని సంపాదించి ఆనందించడం, కళానందుణ్ణి వివాహం చేసుకోడం ఈ పాత్ర ప్రత్యేకత.

### 2. 3. 3. 4. రోహణకుడు :-

ఇతడు పూలవ్యాపారి. కేతకీపత్రంలో ఉన్న లేఖని నాగవల్లిద్వారా సౌందర్యతిలకకి చేర్చే ప్రయత్నం చేసే కళానందుడి మిత్రుడు. నాగవల్లి ఆలేఖని వృద్ధుడి కోసం అమ్మేయడం, అది 'రాజలేఖ' ద్వారా 'జయసేనుడి' భార్య 'తారామతి' అంతఃపురానికి చేరుతుంది. అనుమానం జయసేనుడు తారామతిని చూడడం, చివరకు సౌందర్యతిలకకి చేరుతుంది. శ్రీకృష్ణుడు జరాసంధుణ్ణి వధించడానికి వచ్చినప్పుడు, ఇతడింట్లోనే అతిథి సత్కారాలు పొందుతారు.

### 2. 3. 3. 5. జయసేనుడు :-

ఇతడు విజయసేనుడి కొడుకు. విజయసేనుడు జరాసంధుడి సేనలో కొంతభాగానికి అధికారి. జయసేనుడు చిన్నప్పుడే ద్రోణాచార్యుల దగ్గర విలువిద్య నేర్చుకున్నాడు. వేదాలు, వేదాంగాలు కాశికానగరంలో 'భ్రమరేశ్వరుడు' అనేపేరున్న సన్యాసి దగ్గర నేర్చుకున్నాడు. తండ్రి అనుమతితో 'తారామతి'ని వివాహంచేసుకున్నాడు. జయసేనుడికి తారామతికి 'రాజసేనుడు' పుట్టాడు. రాజలేఖ(దాసి)తెచ్చిన కేతకీపత్ర మన్మథలేఖతో భార్యని అనుమానిస్తాడు. చివరకి జైలుపాలై, కృష్ణుడివల్ల విడుదలై, భార్యవల్ల తప్పులేదని తెలిసి ఆనందిస్తాడు.

### 2. 3. 3. 6. రణార్ణవుడు :-

జరాసంధుడి ఉంపుడుగత్తె కొడుకు. రాజు జరాసంధుడికి తప్పుడు సమాచారాలు అందిస్తూ ఉంటాడు. సౌందర్యతిలక తనకు భార్యగా ఉండాలని తపన పడతాడు. జయసేనుణ్ణి, కళానందుణ్ణి, చంద్రపాలుణ్ణి చెఱసాలలో బంధించడానికి కారకుడౌతాడు. సహదేవుడు ఇతణ్ణి తరిమేస్తాడు.

### 2. 3. 3. 7. జంబుకుడు :-

ఇతడు చంద్రపాలుడు తండ్రి శశిపాలుడు కాలంనుంచీ సేవకావృత్తిలో ఉన్న వృద్ధుడు. నాగవల్లి సిద్ధుడిచ్చిన పుష్పగుచ్ఛం పోగొడుతుంది. దాన్ని సాధించాలని శపథం చేసింది. ఈ విషయాన్ని సౌందర్యతిలకకి చెప్పడానికి ఉపయోగపడిన పాత్ర. నాగవల్లి ఊరు విడిచి వెళ్ళిన మర్నాడు ఉదయాన్నే ఆమె విషయాన్ని సౌందర్యతిలకకి అందిస్తాడు.(పుట.57)

### 2. 3. 3. 8. మందప్రజ్ఞుడు :-

శిశుపాలుడి గూఢచారి. తలమీద జడలు వేలాడుతుండగా, ముఖాన విభూతి రేఖలున్న వేషంలో శిశుపాలుడి ఎదురుగా నిల్చుంటాడు. శిశుపాలుడితణ్ణి మునిగా భావించి గౌరవిస్తాడు. తర్వాత తను మందప్రజ్ఞుణ్ణి అని తెలుపుతాడు. శిశుపాలుడి ఆజ్ఞల్ని పాటిస్తూ, చాలా అరణ్యాలు తిరిగాడు. ఒక అడవిలో ఎండతాకిడికి మూర్ఛపోయిన, అందగాడైన కళాధరుణ్ణి, బంధించి శిశుపాలుడి దగ్గరికి తీసుకువచ్చినపాత్ర. (పుట. 102)

### 2. 3. 3. 9. ధారుణీదేవి :-

విక్రమవర్మ మహాసేనాని భార్య. కళానందుడికి తల్లి. యాదవులతో యుద్ధం చేస్తున్న సమయంలో కృష్ణుడిచేతిలో విక్రమవర్మ మరణిస్తాడు. సౌందర్యతిలకని కోడలిగా చేసుకోవాలని అనుకుంటుంది. రణార్ణవుడికిచ్చి సౌందర్యతిలక పెళ్ళి జరిగిపోతుందేమో అని భయపడుతుంది.

### 2. 3. 3. 10. చంద్రపాలుడు :-

సౌందర్యతిలక తండ్రి. జరాసంధుడి మిత్రుడు. అయినప్పటికీ రణార్ణవుడికి సౌందర్యతిలకతో వివాహంచేయాడానికి వ్యతిరేకించి చెఱసాల పాలయ్యాడు. ఇతడి కూతురుపెళ్ళి రణార్ణవుడితో నిశ్చయంచేసి, జరాసంధుడు సౌందర్యతిలకని తండ్రి పాదాలకి నమస్కరించమని చెప్పినప్పుడు 'కళానందుడే నీకు వరుడుగా ఉండమని' ఆశీర్వదిస్తాడు.

### 2. 3. 3. 11. రాగలతిక :-

సౌందర్యతిలక చెలికత్తె. నాగవల్లి పుష్పగుచ్ఛాన్ని జారవిడిచిందని ఆమెకు చీవాట్లు పెడుతుంది. కళానందుడు దేశాంతరంవెళ్ళాడని సౌందర్యతిలకని తెలిసి బాధపడుతున్నప్పుడు ఊరడిస్తుంది. ఎక్కువరోజులు సౌందర్యతిలకతో గడిపిన దాసిగా ఈమెను చెప్పొచ్చు.(పుట.184)

### 2. 3. 3. 12. శ్రావణుడు :-

కళానందుణ్ణి పెంచిన వృద్ధ సేవకుడు. కళానందుడితో ద్వారకకు వెళ్తాడు. తిరిగి వస్తూ, దారిలో వడదెబ్బ తిన్న కళానందుడికి నీరుతేవాలని కొలను దగ్గరికి వెళ్ళి, వచ్చేలోపు కళానందుడు కనబడడు. 'కపాలమాలి' అనేవాడికి దొరికిపోయి, జ్వాలాజిహ్వుడి దగ్గరికి వెళ్తాడు. అక్కడున్న ఇందుమతిని తప్పించి, కరభముని ఆశ్రమంలో ఉంచుతాడు. అరణ్యంలో తిరుగుతున్నపుడు జ్వాలాజిహ్వుడి సేవకుడు ఇతణ్ణి బంధించి, చివరికి చంపి, తినేస్తారు. ఇతని మరణవార్త విని, కళానందుడు బాధపడతాడు.

### 2. 3. 3. 13. కోరకుడు, కారణభూతి :-

వీరిద్దరూ కళానందుడికి సాయంగా కృష్ణుడు పంపించిన సేవక గూఢచారులు. మూగవాడిగా అద్భుతంగా నటించి, నమ్మించగలవాడే 'కోరకుడు'. గుడ్డివాడిలా చాలా

పనులు చేయగల నేర్పరి 'కారణభూతి' (పుట.176). వీరిద్దరూ కళానందుణ్ణి బండిమీద పడుకోబెట్టి, సౌందర్యతిలక ఇంటికి క్షేమంగా చేరుస్తారు. గిరివ్రజంలోనివార్తల్ని ఎప్పటికప్పుడు కళానందుడికి నివేదిస్తుంటారు. కృష్ణుడి దయవల్ల మూగ, అంధత్వాలు పోయాయని జనాన్ని నమ్మిస్తారు.

## 2. 3. 3. 14. తారకుడు :-

రణార్ణవుడికి ప్రాణ మిత్రుడు, తాగుబోతు, జూదరి కూడా. వీణ్ణి రణార్ణవుడు చేరదీసి రాజుతో చెప్పి, కొత్తవాళ్ళు ఎవరైనానగరంలోప్రవేశిస్తే, చెప్పడమనే ఉద్యోగాన్ని ఇప్పించాడు. (పుట.210) వీడు కోరక, కారణభూతుల్ని అనుమానంగా చూస్తాడు. కోరక, కారణభూతులు పథకం వేసి, ఊరి చివర ఉన్న బావిలో పడిపోయేలా చేసి మహారాక్షసిగా వర్ణించి, వీళ్లు తారకుణ్ణి చంపేస్తారు.

## 2. 3. 3. 15. మండూకుడు :-

తారకుడిఅనుచరుల్లో ఒకడితడు.(పుట.214) దొంగతనం చేసి జీవనం కొనసాగించేవాడు. ఒకరోజు కళానందుడింట్లో దొంగతనానికి వెళ్తాడు. అప్పటికే కళానందుడికి దేశద్రోహిగా జరాసంధుడు వేస్తాడు. అక్కడ కళానందుణ్ణి గుర్తించి జరాసంధుడికి విషయం చెప్పడం వల్ల కళానందుడు దొరికిపోతాడు.

## 2. 3. 3. 16. జ్వాలాజిహ్వుడు :-

రాక్షసరాజు. ఇతడి అనుచరుడు 'కపాలమాలి'. శ్రావణుణ్ణి బంధించి తీసుకువస్తాడు. ఇందుమతిని పెంచి పెద్దచేసి, తన ప్రభువు శిశుపాలుడికి భార్యగా ఇవ్వాలని అనుకుంటాడు. శ్రావణుడు ఆ ప్రయత్నాన్ని భంగపరచడంతో అతణ్ణి తినేయమని సేవకులకి ఆజ్ఞాపిస్తాడు.

## 2. 3. 3. 17. సర్వవక్రుడు :-

రణార్ణవుడి సేవకుడు. నాగవల్లినిబంధించి రణార్ణవుడి ఎదుటపెడతాడు. రణార్ణవుడికంటే భయంకరంగా, నల్లగానూఉంటాడు. రణార్ణవుడిచ్చిన బట్టల్ని కట్టుకొని, చందనాన్ని ఒంటికి పులుముకొని, తాంబూలం వేసుకొని, కిష్కింధాపురవాసులైన రామ సైనికుల్లా పురజనుల్ని నవ్వించే పాత్ర ఇది.(పుట. 239)

## 2. 3. 3. 18. ఇందుమతి :-

చిన్నప్పుడే తప్పిపోయి, జ్వాలాజిహ్వుడి చేత బంధిగా కొన్నాళ్ళు ఉంటుంది. అయితే జ్వాలాజిహ్వుడు ఈమెని తన కూతురులా సాకుతాడు. శిశుపాలుడికిచ్చి, పెళ్ళి చేయాలని అనుకుంటాడు. ఈ విషయాన్ని శ్రావణుడితోచెప్పి, తప్పించుకుంటుంది. కరభముని ఆశ్రమంలో శిశుపాలుడికి దొరికిపోతుంది. నాగవల్లి ఈమెని రక్షిస్తుంది. ప్రద్యుమ్నుడి బాల్యస్నేహితుడు యశోధరుణ్ణి వివాహం చేసుకుంటుంది.

## 2. 4. *సౌందర్యతిలక నవలలో పాత్ర చిత్రణ* :-

*సౌందర్యతిలక* లోని పాత్రచిత్రణ సహజంగాను, సందర్భోచితంగాను ఉంది. కొన్ని సందర్భాలలో కథాసూచనకూడా కనబడుతోంది. నవలప్రారంభం ఒకబిచ్చగాడితో జరుగుతుంది. నగరంలో కుబేరుల్లాంటి వ్యాపారులు ఉన్నా, ఆ కళ్ళులేని బిచ్చగాడికి తిండి దొరక్కపోడం ఆ నగర దాతృత్వాన్ని సూచించడంకోసం వర్ణించాడు. అందులో కూడా నాగవల్లి లాంటి వాళ్ళు ఉండొచ్చు అనే సూచనకూడా కనబడుతోంది.

బిచ్చగాడు మద్యం తాగుతున్న వారి దగ్గరికి వెళ్ళి, "మద్యపానమునకు, గాంతా ప్రసన్నతకును, బ్రణయ ద్యూతమునకు వాడునొకనాడు వ్యయము జేయు ధనమునాకు రెండేండ్లు జాలు నర్థముగదా"(పుట.6)అని చెడ్డఅలవాట్లకు వాడిన ధనాన్ని మంచి పనులకోసం వాడమని సూచిస్తూ, తద్వారా సమాజం బాగుపడుతుందని తెలుపుతున్నాడు.

దారిలో కనబడిన బిచ్చగాడికి సాయంచేయకపోగా, మంత్రి పుష్పదంతుడి కొడుకు వజ్రదంతుడు తన ప్రియురాలితో రథాన్ని ఎక్కి వెళ్తూ, మధ్యలో ముసలివాడి ఎడమకాలు తొక్కించి పోతాడు. అలా ముసలివాడు నిరాదరణకు, శారీరక బాధకు లోనౌతాడు. వాడికి నాగవల్లి తన దగ్గరున్న పూలదండ అమ్మి, వైద్యుడిదగ్గరికి తీసుకువెళ్ళి, కట్టుకట్టిస్తుంది. దయగల నాగవల్లి తన కష్టాల్ని లెక్కచేయకుండా ఇతరులకి సాయపడే తనాన్ని వ్యక్తం అవుతోంది.

జయసేనుడింటికి కళానందుడు రాసిన లేఖ 'రాజలేఖ' అనే చెలికత్తెద్వారా చేరుతుంది. దానిలోని విషయాన్ని రాణి తారామతి చదువుతున్న సమయంలో జయసేనుడు వచ్చేస్తాడు. ఆ తొందరిలో లేఖని అక్కడే తారామతి పడేస్తుంది. దానిలోని విషయమైన ప్రేమను గ్రహించి, తన భార్య ప్రవర్తననే జయసేనుడు అనుమానిస్తాడు. ఆమెను అడగలేక, బాధపడలేక యిబ్బంది పడతాడు. మథనపడిపోతాడు. "హా తారమతీ!, ఎంతపని చేసితివి? కలంకమెన్నఁ డెఱుగని నీ పుట్టిన యింటి గౌరవమును, నీకన్న తండ్రి పరువునయినఁ దలపోయవయితివి. ఈవల నామాటకేమిగాని పావనులలోఁ బావనుఁడగు మాతండ్రిని మావంగడమునఁ దలంపవయితివి. అచ్చపుఁ గొలములకు రెంటికి మచ్చఁ దెచ్చిన నీవు నా మనస్సనియెపు దూదిబుంగకు రవులుచున్న కొఱవివి సుమీ? నాఁటి నీముఖస్తోత్రముఁ దలఁచి నేటి యీ కేతకీదళమునందలి వాక్యములఁ దలఁప నీకడ నింత సాహసము కలదేయని సందేహ మొదవును. రాచపుట్టుక పుట్టి యిట్టి చెట్టచేసిన పడఁతికి మగఁడనయి యుసుఱులు నిలుపుకొనుటకన్న యీ వాడిఁ వాలున నన్నుఁ నేఁ బొడుచుకొన్న నొప్పదే. గుణసౌందర్యముల నాకన్న నిన్ను వలపించిన యవ్వీరుఁడెవ్వడొ ఎఱుఁగనైతి"(పుట.24) అంటూ జయసేనుడి మానసిక స్థితిని రచయిత వివరిస్తాడు. అనుమానం పెనుభూతం అన్న విషయాన్ని సూచిస్తూ, చివరికి జయసేనుడి భార్యకోసం వచ్చినలేఖ కాదని తెల్సాక ఆనందిస్తాడు.

జయసేనుడు ఎందుకు మథన పడుతున్నాడో తెలియక తారమతి దిగులు పడడం భార్యా భర్తలమధ్య అవగాహనారాహిత్యాన్ని, అనుమానపడేస్థితిని అది ఎంతటి

విపరీతార్థాలకి దారితీస్తుందో సూచిస్తున్నాడు.(పుట.25) రాజలేఖ తెచ్చిన పూలగుత్తుని జయసేనుడి కొడుకు రాజసేనుడు ఆటవస్తువుగా ఆడుతూ, ఆ పూలను చెల్ల చెదురుగా చేస్తాడు. ఇక్కడ చిన్నపిల్లాడి చేష్ట చెబుతూనే జరగబోయో అలజడిని సూచిస్తున్నట్లనిపిస్తోంది. చివరకు జయసేనుడు సరైన పద్ధతిలో ఆలోచించలేక, మతిస్థిమితం తప్పిన పాత్రగా వర్ణించి, ఆ పాత్ర మానసిక స్థితి పాఠకుణ్ణి ఆలోచించేలా చేస్తోంది.

రణార్ణవుడు తగువులుపెట్టి, నమ్మించే స్వభావం ఉండే పాత్ర. అయితే స్వలాభం కోసం ఎంతటి సాహసాన్నయినా తనకు అనుకూలంగా మార్చేయడం ఇతడి పద్ధతిగా కనిపిస్తోంది. జయసేనుడింటికి వెళ్ళి అతడికి తెలీకుండా కేతకీ పత్రం దొంగిలించి, ఆ లేఖలోని "మన రాజ్యలక్ష్మికి వైధవ్యము, మనకు గళ్యాణమును నేక ముహూర్తమునందె యయ్యెడునని నాకుఁ బొడగట్టు చున్నది"(పుట.45) అనే విషయాన్ని మగధ రాజ్యవైభవమని, దూరప్రాంతంలోని వారు తమతో వైరాన్ని తెచ్చిపెడుతున్నారని, దానికి కారణం జయసేనుడునీ జరాసంధుణ్ణి నమ్మించి, జయసేనుణ్ణి బంధించడానికి కారకుడయ్యాడు. కానీ, నాగవల్లి దగ్గర ఆమె వాక్చమత్కృతికి లొంగిపోతాడు. సౌందర్యతిలకను ప్రేమిస్తున్నట్లు ఆమెతో చెప్పి, ఆమె మాటల్ని నమ్ముతాడు. 'యోగిని' చెప్పింది నిజమేనని, జరాసంధుణ్ణికూడా నమ్మించేలా చేయడం ఈ పాత్ర ప్రత్యేకత.

జరాసంధుడు రణార్ణవుడికి సౌందర్యతిలకతో పెళ్ళిచేయాలనుకుంటాడు. సౌందర్యతిలక తండ్రి, చంద్రపాలుణ్ణి పిలిపించి అడగాలనుకుంటాడు. చిన్నప్పటినుంచి ఇతడు రణార్ణవుణ్ణి పెంచి పెద్ద చేసాడు. వాడి కోరిక సౌందర్యతిలకతో పెళ్ళి. కానీ, సౌందర్యతిలక కళానందుణ్ణి ప్రేమించిందని తెలిసినా, రణార్ణవుడికే ఇప్పించాలని భావిస్తాడు. రాజరిక నిరంకుశత్వాన్ని నిలిపేందుకు సహకరిస్తూ, తనకు చెడ్డవిషయాల్లో మద్దతు ఇచ్చిన రణార్ణవుడికి అనుకూలంగా సాయపడాలని జరాసంధుడు అనుకున్నాడు. ఇదంతా జరాసంధుడి మానసిక దౌర్బల్యాల్ని సూచిస్తోంది. ఇలా చేస్తే చంద్రపాలుడి కుటుంబం, కళానందుడి కుటుంబం శత్రుపక్షంలో చేరుతుందేమో ఈ విషయాన్ని నందనందుడికి తెలియనీకుండా జాగ్రత్త పడాలనుకుంటాడు. ఇది కృష్ణుడి పట్ల ఉండే శత్రుతాన్ని సూచిస్తూ, రాజరిక డాంబికాన్ని వ్యక్తం చేస్తోంది.(పుట123)

చంద్రపాలుడు కొన్ని రోజులు గడువు తీసుకొని జరాసంధుడి దగ్గరకి వస్తాడు. "ఆయుష్మంతియైన సౌందర్యతిలక వివాహము మాట యేమి చేసితివి? మా రణార్ణవునకిచ్చి నాతోడ వియ్యమొంది నా ముద్దు చెల్లించి రాజబంధువుఁడవయి గౌరవమొందుదువుగాక యని నా తలంపు" (పుట.168) అని తన అభిప్రాయం చెప్పి, చంద్రపాలుడి అభిప్రాయం చెప్పమని అడుగుతాడు. చంద్రపాలుడు కళానందుడికే ఇస్తానని తెగేసి చెప్పేసరికి కోపం తీవ్రస్థాయిలో జరాసంధుడికి వస్తుంది. దాంతో చంద్రపాలుణ్ణి బంధిస్తాడు. తనమాటకు ఎదురు చెప్పినవాళ్ళు మిత్రుడైనా మన్నించలేని వ్యక్తిత్వం జరాసంధుడి పాత్రలో కనిపిస్తోంది.

జరాసంధుడు కృష్ణ, భీమార్జునులు బ్రాహ్మణుల వేషంలో వస్తే, వారికి మధుపర్కాలిచ్చి గౌరవించాలనుకుంటాడు. కానీ, వాళ్ళు తిరస్కరిస్తారు. యుద్ధాన్ని కోరుకుంటారు. ఎవరితో యుద్ధం చేస్తావో నిర్ణయించుకోమని కృష్ణుడు అంటాడు. "నాచేఁ బలుమాఱులు పరాజితుఁడవై యాఁడు దానికన్న నధముఁడవై పలాయనము నొందిన నీతోఁ గయ్యమొనర్పంజాల. ఈ యర్జునుండు కొండికవాడు. వీనితో రణమొనర్చుటకు సాంగ్రామిక శాస్త్రి ధర్మము లొప్పవు" (పుటలు. 249-250) అని భీముడితో మల్ల యుద్ధాని కోరుకోడంలో జరాసంధుడి ధీరత్వాన్ని సూచిస్తోంది.

జరాసంధుడు కొడుకు సహదేవుణ్ణి పిలిచి, రాజ్యభారాన్ని అప్పగించి, యుద్ధంలో గెలిస్తే తపోవనానికి వెళ్తానని, ఓడిపోతే వాసుదేవుడితో వైరం పెట్టుకోవద్దని చెప్పడం పుత్ర వాత్సల్యానికి, రాజకీయ చతురత్వానికి నిదర్శనం. తండ్రికి చాలసార్లు కళానందుణ్ణి, చంద్రపాలుణ్ణి విడిచి పెట్టమని హితవుచెప్పినా వినలేదని అదే తండ్రి మరణానికి దారితీసిందని సహదేవుడు బాధపడి పోతాడు. తండ్రి మరణం స్వయంకృతాపరాధంగా భావించి ఏడుస్తాడు. ఈ సందర్భంలో సహదేవుడి వ్యక్తిత్వం బయటపడుతోంది.

జరాసంధుడు మరణించిన తర్వాత, సహదేవుడితో, "అయ్యా!, మనమిరుగురము నన్నదమ్ములము. నీ తండ్రిగారు నాకర్థరాజ్యమొసఁగుదమని వాక్రుచ్చినారు. నాసాయము నీకుండుట నీరాజ్యమునకు శ్రేయస్కరము. నాకు మంత్రి పదము దయసేయుము... నీవు సౌందర్యతిలకను నాకిప్పించి పెండ్లిసేయవలయునని ప్రార్థించెద" నని రణార్ణవుడంటాడు (పుట. 259). సహదేవుణ్ణి తిడుతూ, కసిరినప్పుడు మాట్లాడక, కళ్ళనుంచి నీళ్ళు వస్తుండగా వెళ్ళిపోతాడు. ఇక్కడ సహదేవుడులాంటి తెలివైనవాణ్ణి నమ్మించలేక, రణార్ణవుడు దీనావస్థకి గురి అవడం ఈ పాత్రలో కనిపిస్తుంది. ఇలా ఆయా పాత్రచిత్రణల్లో ప్రత్యేకతలు కనబడతాయి.

## 2. 5. రాజమాత నవలలో పాత్రల పరిచయం :-

### 2. 5. 1. ఉపోద్ఘాతం :-

ఈ నవల ఆంధ్రభూమి సచిత్ర వార పత్రికలో ప్రచురితమయ్యాక, పుస్తక రూపంలోకి వచ్చింది. మహిళల ఆదర్శనీయంగా నిలిచిన పాత్ర కుంతి. పాండవులతల్లిగా మాత్రమే కాక, ఒక ప్రణాళికా బద్ధంగా రాజ్యాన్ని పొందాలన్న ఆశతో చివరివరకూ నిలిచినపాత్ర. గృహిణిగా, తల్లిగా, ఆదర్శవంతమైన, ధైర్యవంతమైన స్త్రీగాకనడుతోంది. ఆటుపోటులకు లొంగని వీరనారిగా, ఆశావహ దృక్పథంతో కాలాన్ని జయించిన మేధావిగా, ధార్మికురాలిగా, రాజమాతగా చాలా కోణాల్లోకుంతి పాత్రని ఉత్పలవారు చిత్రించారు. ఈ నవలో ప్రధాన పాత్రలు, కల్పితపాత్రలు అని రెండురకాలుగా విభజించవచ్చు.

### 2. 5. 2. ప్రధానపాత్రలు :-

#### 2. 5. 2. 1. కుంతి :-

శూరసేనుడి భార్య మారిష. వీరి పెళ్ళికి కుంతిభోజుడు వెళ్ళాడు. ఏదో విచారంలో

ఉన్నాడు. దానికి కారణం కుంతిభోజుడికి సంతానం లేకపోవడమే. ఈ విషయాన్ని గ్రహించిన అతని బావ శూరుడు తనకుపుట్టిన మొదటి సంతానం నీకు దత్తతగా ఇస్తానని మాట ఇస్తాడు. ఆ మాటప్రకారం తనకు పుట్టిన మొదట సంతానం ఆడపిల్ల. ఆమెనే కుంతి భోజుడికి దత్తతగా ఇచ్చాడు. పృథమహారాజు జయంత్యుత్సవం రోజు రావడం, అప్పుడు పృథుమండపంలో నామకరణం చేయడం వల్ల ఆ పిల్లకి 'పృథ' అని పేరు పెట్టారు.

యౌవన వయస్సువరకు పృథను అతిథిసేవలో నియోగించాడు. కుంతి వినయం, విధేయతలు అప్పుడే నేర్చుకుంది. దూర్వాసుడి అనుగ్రహంతో కోరుకున్న దేవత వశమయ్యే మంత్రాన్ని పొందింది. బాల్యపుచేష్టవల్ల మంత్రప్రభావాన్ని పరీక్షించి, చివరకు కర్ణుణ్ణి కని, 'అశ్వనది'లో విడిచి పెట్టింది. తర్వాత జరిగిన స్వయంవరంలో పాండురాజుని వరించి హస్తినకు చేరిన తర్వాత 'కుంతి'గా పేరు స్థిరపడింది. పాండురాజు, మాద్రిచనిపోయాక ఐదుగురు కుమారుల్ని ధైర్యంగా సాకింది. చివరకు రాజ్యాధికారం వచ్చేవరకు తనవంతు పాత్రని చక్కగా పోషించింది.

### 2. 5. 2. 2. శ్రీకృష్ణుడు :-

బాలవిష్ణువుగా మురళీగానంచేస్తూ, కుంతి ఆలోచనల్లో కనిపిస్తాడు. కృష్ణుడిమీద భారంవేసి కుంతి అన్ని పనులు చక్కదిద్దింది. తనపుత్రులకు, కొడలికి అతడే ఆపద్బాంధవుడు అని వివరించేది. రాయబారం వహించడంలో, ద్రౌపదికి సాయంచేయడంలో ఇతడి ప్రత్యేకత కనబడుతోంది. యుద్ధాన్ని నడిపించి, పాండవులకి రాజ్యాధికారం వచ్చేవరకూ తన వంతు ప్రయత్నం చేస్తూ, వాళ్ల ఆరాధ్య దైవంగా ఉన్నాడు.

### 2. 5. 2. 3. పాండురాజు :-

ధృతరాష్ట్రుడి తమ్ముడు. చాలా దండయాత్రలుచేసి రాజ్య విస్తరణకు కారకుడయ్యాడు. కుంతిని, మాద్రినిపెళ్ళిచేసుకున్నాడు. కుంతిపట్ల గౌరవాభి మానాలున్నవాడు. 'కిందమ మహర్షి' శాపంచేత సంతాన హీనుడయ్యాడు. అయినప్పటికీ, కుంతి వరప్రభావంతో దేవతలవల్ల తండ్రి అయ్యాడు. కామవశాన మాద్రీ సంగమం చేస్తూ మరణాన్ని తెచ్చుకున్నాడు.

### 2. 5. 2. 4. ధృతరాష్ట్రుడు :-

మొదటనుంచీ పాండవులంటే ద్వేషం ఉన్నవాడు. కొన్ని సందర్భాలలో 'కణికుడు' చెప్పిన కుటిలనీతిని సమర్థిస్తాడు. అలాగని పూర్తిగా కుటిలనీతిని పాటించడు. చివరకు యుద్ధాన్ని ఆపక, కొడుకుల్ని కోల్పోతాడు. భీముణ్ణి తన బిగికౌగిలిలో బంధించి చంపేయాలనుకుంటాడు. కృష్ణుడి నేర్పరితనంవల్ల విషయం తెలుసుకొని, బాధపడి పశ్చాత్తాప పడినా అప్పటికే జరగాల్సినదంతా జరిగిపోతుంది.

### 2. 5. 2. 5. భీష్ముడు :-

కౌరవ, పాండవులకి తాత. పెద్దదిక్కుకూడా. ఇతని అసలుపేరు 'దేవవ్రతుడు'. బ్రహ్మచర్యదీక్షతోఉన్న ధార్మికుడు. కానీ, కొంతవరకు మాత్రమే పెద్దరికాన్ని ఉపయోగించాడు. అతడి ఎదురుగా ద్రౌపది వస్త్రాపహరణ జరుగుతున్న ఆపడానికి ప్రయత్నించడు. ఇది అతని పెద్దరికానికి మచ్చ. తండ్రివల్లపొందినవరం 'ఇచ్ఛా మరణం'. దానివల్ల కురుక్షేత్ర సంగ్రామంలో రక్తమంతా బాణాల ధాటికి కారిపోగా అప్పుడు ధర్మరాజుకు ధర్మోపదేశం చేసినవాడు. కృష్ణుణ్ణి దైవంగా తలచేవాడు.

### 2. 5. 2. 6. ద్రోణుడు :-

పేదరికంలోపెరిగి, మిత్రుడు కేవలం తనను తూలనాడాడని అతనిపైక్రోధం పెంచుకొని, అతనితో సమానమైన వాడిగా నిరూపించుకోవాలని ప్రయత్నం చేసినవాడు. చివరకు 'మిత్రత్వానికి స్థాయి అనవసరం' అని నిరూపించినవాడు. పాండవులంటే అభిమానం ఉన్నవాడు. కానీ, కౌరవులే పోషణభారం వహించినవారని వారివైపే యుద్ధంచేసినవాడు. ధృష్టద్యుమ్నుడు తనను చంపడానికే పుట్టాడని తెలిసినా, అతనికి విద్యనేర్పిన  వ్యక్తిత్వం ఉన్న గురువు.

### 2. 5. 2. 7. విదురుడు :-

ఇతణ్ణి భీష్ముడే ధర్మశాస్త్రాల్ని అధ్యయనం చేయించడానికి ప్రత్యేకంగా తీసుకెళ్ళి, కుంతిభోజుడి దగ్గర ఉన్న ఆశ్రమంలో చేర్పించాడు. దాసీకి పుట్టినా గౌరవం పొందినవాడు. ధర్మతత్త్వం, గౌరవం, విలువలు తెలిసిన ధార్మికుడు. వినయం, విధేయతలు ఇతడి భూషణాలు. అందుకే ధర్మరాజుకి వేర్వేరు భాషల్ని నేర్పి తద్వారా వాటిని ఉపయోగపడేలా చేసేవాడు. ధృతరాష్ట్రుడికి నీతులు చెప్పాడు. చివరకు యుద్ధంలో పాల్గోనవ్యక్తిగా ఇతణ్ణి చెప్పవచ్చు.

### 2. 5. 2. 8. గాంధారి :-

కౌరవులతల్లి. దుర్యోధనుడంటే అమితమైన ప్రేమ.  చివరకు యుద్ధానికి వెళ్తున్న దుర్యోధునుడితో "యతో ధర్మః తతో జయః " అని మాత్రమే చెప్పగలుగుతుంది. పుత్రులందరూ యుద్ధంలో చనిపోయాక, దీనికంతటికి కారణం శ్రీకృష్ణుడని భావించి అతణ్ణి శపించింది. ధర్మరాజుని కూడా శపించబోతుండగా, వ్యాసుడు వచ్చి, అడ్డు చెప్పడంతో ఆగింది. పుత్రుల శోకంతో విలవిలలాడింది.

### 2. 5. 2. 9. ధర్మరాజు :-

కుంతికి ధర్మదేవతవరప్రసాదంగా పుట్టినకొడుకు. ధార్మికుడైన రాజుకు యుద్ధ సామర్థ్యమూ ఉండాలి. కాబట్టి తనకుమారుడికి 'యుధిష్ఠిరుడు' అనిపేరు పెట్టాడు. ధర్మానికి ప్రతీకగా, తల్లి ఆజ్ఞని పాలించే కుమారుడిగా కనిపిస్తాడు.

### 2. 5. 2. 10. భీముడు :-

కుంతి పాండురాజుకోరికమేరకు వాయుదేవుణ్ణి ప్రార్థించి, అతడిద్వారా భీముణ్ణి పొందింది. భీముడు పుట్టినప్పుడు దివ్యవాణి 'భీమసేనుడు' అని నలుదిక్కులు వినబడేలా పలికిందట. అందుకే ఆ పేరు భీముడికి పెట్టారు. తల్లిమాటని, అన్న ధర్మరాజు మాటల్ని ఎదిరించేతత్త్వం లేనివాడు. కోపంవస్తే అణుచుకోడానికి చాల ఇబ్బందిపడతాడు. భోజనప్రియుడు. బలశాలి.

### 2. 5. 2. 11. అర్జునుడు :-

జగదేక వీరుడైన పుత్రుడికి తండ్రికావాలంటే, అందుకు ఐదవ ఇంద్రుడు, శక్రుడు తగినవాడు. అందుకే అతణ్ణి ధ్యానిస్తే, అలాంటి వాడు పుడతాడని వృద్ధముని సలహామేరకు పాండురాజు కుంతిద్వారా పుట్టినవాడే ఇతడు. అందగాడు. విలువిద్యా నిపుణుడు. ధర్మంపట్ల విశేష గౌరవమున్నవాడు.

### 2. 5. 2. 12. నకుల, సహదేవులు :-

శతశృంగ పర్వత శిఖరాలమీద జ్యోతిర్మయమైన రెండుగుర్రాలు ఆ శిఖరాలు దూకి రావడం, ఇద్దరు దివ్య పురుషులు తనముందు నిలవడం స్పష్టంగా మాద్రి చూసింది. వారి అనుగ్రహంవల్ల మాద్రికి పుట్టినవారే నకుల సహదేవులు. మాద్రి చనిపోయేముందు వీరిద్దర్నీ కుంతినే సాకమని ప్రాధేయపడుతూ చెప్పింది. ధర్మరాజాది సోదరులంటే వీరికి అమితమైన భక్తి.

### 2. 5. 2. 13. ద్రౌపది :-

ద్రోణుడు ద్రుపదుణ్ణి పరాభవించాక, ద్రుపదుడు యాగంచేసి ద్రోణుణ్ణి చంపగల కొడుకుని, అర్జునుణ్ణి వరించగలిగే కన్యని పొందాడు. ఈమె యాజ్ఞసేనిగా పిలబడినా ఈమెకు పెట్టినపేరు కృష్ణ. పాండవుల పత్ని. కష్టాల్లో ఆత్మస్థైర్యాన్ని పొందుతూ ఆదర్శంగా నిలబడిన పాత్ర.

### 2. 5. 2. 14. దుర్యోధనుడు :-

ధృతరాష్ట్రుడికి గాంధారికి పుట్టిన ప్రథమ సంతానం. కర్ణ, శల్య, దుశ్శాసన, దుర్యోధనాదుల్ని దుష్టచతుష్టయంగా పేర్కొన్నారు. ధర్మరాజు తన మొదటి కొడుక్కి యుధిష్ఠిరుడు అని పేరు పెట్టుకుంటే, ధృతరాష్ట్రుడు తనకొడుక్కి సుయోధనుడు అని దానికి తగినట్టి పేరు పెట్టినట్లు సంతృప్తి చెందుతాడు. ఇతడికి భీముడిమీద కోపం, భయం కూడా ఉంది. భీముణ్ణి లేకుండాచేస్తే, పాండవులు అందరూ వశమైపోతారనుకొనేవాడు. చివరకు 'అశ్వత్థామ'ను సైన్యాధికారిగాచేసి, ఉపపాండవుల్ని, ధృష్టద్యుమ్నుణ్ణి చంపించినక్రూర స్వభావం ఉన్నవాడు.

### 2. 5. 2. 15. కర్ణుడు :-

పృథకు, సూర్యుణ్ణి మంత్రపూర్వకంగా ధ్యానించింది. తద్వారా కవచకుండలాలతో

పుట్టినవాడు ఇతడే. పాండవ, కౌరవ అస్త్రవిద్యాప్రదర్శనసమయంలో ప్రవేశిస్తాడు. పృథ గుర్తుపట్టి ఆనందించి, కాసేపట్లో స్పృహతప్పి పడి పోతుంది. ద్రౌపదీ స్వయంవరంలో అవమానం పొందుతాడు. దుష్టచతుష్టయలో ఒకడిగా ఉంటాడు. కుంతికి అర్జునుణ్ణి మాత్రమే చంపుతానని, మిగతావారిని చంపనని మాట ఇచ్చి నిలబెట్టుకున్న వాడు. కృప, ద్రోణ, భీష్మాదుల మాటల్ని లెక్కచేయని తత్త్వం ఉన్నవాడు. దుర్యోధనుడికి ఆప్తమిత్రుడు. మిత్రత్వంకోసం ప్రాణాలైనా ఇచ్చే స్వభావి. చివరకు ఇతడు అర్జునుడిచేతిలో వీరమరణం పొందుతాడు.

### 2. 5. 2. 16. శల్యుడు :-

మద్ర దేశ రాజు. పాండురాజు దిగ్విజయయాత్రలు చేస్తున్న సందర్భంలో మద్రదేశాధిపతి శల్యుడితో పోరాడి ఓడించాడు. శల్యుడు పాండురాజు ముందు మోకరిల్లుతాడు. రాజ మందిరలో మాద్రిని చూసి పాండురాజు మనసు వశంతప్పి, హస్తినకు వస్తాడు. శల్యుడు కన్యాశుల్కం తీసుకొని, తన చెల్లెలు మాద్రిని, పాండురాజుతో పెళ్ళికి ఒప్పుకుంటాడు. ఇతడి మేనల్లుళ్ళు నకుల, సహదేవులు.

### 2. 5. 2. 17. దుర్వాసుడు :-

అత్రి, అనసూయలకు శివానుగ్రహంవల్ల పుట్టినవాడు. కుంతి భోజుడి ఆస్థానంలో ఒక సంవత్సరకాలం భిక్షాన్నభోజనవ్రతం చేయుదలచి వచ్చాడు. దుర్వాసుడు చెప్పిన పనులు తు.చ. తప్పకుండా చేయసమర్థుడైన పరిచారకుణ్ణి అప్పగించమని కోరుతాడు. పృథని ఆ సేవకు కుంతిభోజుడు నియమిస్తాడు. పృథ సేవలకు సంతృప్తిచెంది, చెవిలో మంత్రాన్ని ఉపదేశించి వెళ్ళిపోతాడు. వెళ్ళిపోయేముందు తన పేరు 'దుర్వాసుడ'ని చెప్తాడు. మంత్రాన్ని తనకు అత్యవసరమైతేనే వెల్లడించమని హెచ్చరించి వెళ్లాడు.(పుట.94)

దుర్యోధనుడి సేవలకి సంతృప్తి చెంది, వరంగా పాండవుల దగ్గరికి వెళ్ళమన్న కోరిక తీరుస్తాడు. అక్కడ కృష్ణుడిసహాయంవల్ల పాండవులు శాపంపొందకుండా ఉంటారు. (పుట.292)

### 2. 5. 2. 18. అక్రూరుడు :-

శ్వఫల్కుని కుమారుడు. ఇతని తల్లి గాందిని6. కంసుడి నగరంలో ఉండేవాడు. కంస సంహారం తర్వాత కృష్ణుడి దగ్గరే ఉంటూ, ఆనందమయ జీవనం చేస్తున్నాడు. ధృతరాష్ట్రుణ్ణి, పాండవాదుల్ని కలవడానికి హస్తినకు వెళ్తాడు. ఇతడి రాకతో కరువుగా, వర్షాలులేని హస్తినలో వర్షాలు పడతాయి. కుంతితో చాలాసేపు మాట్లాడి, కృష్ణుణ్ణి భగవతత్త్వంగా కీర్తిస్తాడు. ధర్మరాజుని యువరాజుగా పట్టాభిషేకం చేయడంలో ప్రధానపాత్ర వహిస్తాడు. శ్రీకృష్ణ బలరామాదుల విశేషాలు వివరిస్తాడు.

### 2. 5. 2. 19. పురోచనుడు :-

దుర్యోధనుడికి నమ్మినబంటు. వారణావతానికి పాండవులు వెళ్ళినపుడు వారికి తెలియకుండా అనుసరించి వెళ్లినవాడు. లక్క ఇంట్లో పాండవుల్ని దహింప జేసేందుకు

దుర్యోధనుడు ఇతణ్ణి నియమించాడు. చివరకి విదురుడివల్ల పాండవుల్ని రక్షణ పొందుతారు.

### 2. 5. 2. 20. కణికుడు :-

కూటనీతి, దమననీతిని బోధించేవాడు. సుయోధనుడికి నమ్మినబంటు. దుష్ట చతుష్టయానికి మార్గదర్శకుడు. 'ఎలాగైనా శత్రువుని హతమార్చడమే ముఖ్యం' అని చెప్పేతత్త్వం ఉన్నవాడు. లాక్షాగృహంలో పాండవుల్ని హతమార్చడానికి వేసిన పథక రచన ఇతనిదే.

### 2. 5. 2. 21. దేవిక :-

శైబ్య రాజకుమార్తె. ఈమె స్వయంవరానికి ముందుగానే ద్రౌపది, ధర్మరాజు వెళ్ళారు. వాళ్లకు దేవిక నమస్కరించింది. స్వయంవరమందిరంలో ఉన్న రాజకుమారులెవరకూ వరమాల వేయదు. బంధువర్గంలో ఉన్న ధర్మరాజుకు వరమాలవేసి, ద్రౌపది పాదాలముందు మోకరిల్లి, పాదదాసిగా నైనా స్వీకరించమని, లేదంటే ఆజన్మ బ్రహ్మచారిణిగా ఉండిపోతానని చెప్పింది. ఆ తర్వాత ఈమెను ధర్మరాజు ఆమెను వివాహమాడతాడు.

### 2. 5. 2. 22. ధౌమ్యుడు :-

పాండవ పురోహితుడు. గంధర్వరాజు సలహామేరకు ధౌమ్యులవారిని పురోహితులుగా ఉండమని ధర్మరాజు కోరుతాడు. ధౌమ్యుడు అంగీకరిస్తాడు. పాంచాలదేశం వెళ్ళమని శుభమవుతుందని దీవిస్తాడు. యుధిష్ఠిరుడికి చక్రవర్తి కాగల శుభలక్షణాలున్నాయని చెప్తాడు. ఏవైనా శుభకర్మలు జరిపేటప్పుడు నిష్కపటివై ఉన్నావో లేవో ఆత్మపరిశీలన చేసుకోడం, ఎవరితో మాట్లాడినా నిస్వార్థ భావంతో ఉండడం, దానధర్మాలు, ఉపకారాలు చేస్తున్నప్పుడు ప్రత్యాశలేకుండడం, ధర్మసంచయం చేసేటప్పుడు లోభగుణం విసర్జించావా లేదా నిర్ణయించుకోవాలని సూచించాడు. (పుట.238)

### 2. 5. 3. కల్పిత పాత్రలు :-

### 2. 5. 3. 1. ద్రుమిళుడు :-

ఇతడు ఒక రాక్షస జాతివాడు. ధారానగరానికి సమీపంలో కొండచరియల్లో సువ్రత తనభర్త కుంతిభోజుడితో విహరించడానికి వెళ్ళింది. ద్రుమిళాసురుడు సువ్రతని పొందాలని ప్రయత్నాలు చేసాడు. కానీ, సువ్రత తన భర్తని వదలక పోయేసరికి చేసేదేమీలేక తన సౌభకవిమానంతో కుంతిభోజుడి రథాన్ని లోయలోకి పడగొట్టి అదృశ్యమైయ్యాడు. ఇది ద్రుమిళాసురుడు సువ్రత దక్కలేదని చేసిన క్రూరచర్య. అలాగే సువ్రత చెల్లెలు సువృత్తకూడా కొండ చరియల ప్రాంతంలో ద్రుమిళాసుడుడి చేతిలో మోసపోయింది. సువృత్త భర్త ఉగ్రసేనుడి రూపంలో ద్రుమిళుడు వచ్చి, సువృత్తను మోసంచేసి తద్వారా కంసుడి జననానికి కారకుడయ్యాడు.

### 2. 5. 3. 2. విభావసి :-

ఈమె భర్త మహాయోధుడు. మాగధులతో పోరాడి వీరమరణం పొందాడు. పృథ సూర్యుణ్ణి ఆరాధించి మంత్రప్రభావంతో గర్భవతి అయినసమయలో అండగా ఉన్న అంతఃపుర దాసి. శూరసేనరాజ్యంలో కొంతకాలం పృథ ఉండి వచ్చింది. ఆమెకి గర్భంవచ్చిందని తెలుసుకుని ఎవరికి తెలీకుండా కాపాడి, ప్రసూతి సమయంలో ఆయా క్రియలుచేసి, చివరకి రథంమీద పెట్టెలో పెట్టి, పిల్లాడిని అశ్వనదిలో వదలివచ్చేందుకు తగిన ఏర్పాట్లన్నీ దగ్గరుండి చేసింది. పృథ పుట్టినరోజునాడు పృథను తీసుకుని అశ్వనదీతీరాన తినుబండారాలు పంచిపెట్టడానికి వెళ్ళిందని నమ్మిచింది. కానీ, అక్కడ 'సాకి గోపాలుడు'[1] కనబడక నిరాశతో తిరిగి వచ్చారు. ఈమె కూతురు మరీచి. పృథకు తోడుగా శూరసేనుడు కుంతిభోజుడి ఇంటిదగ్గర ఈమెను ఉంచి వెళ్ళిపోతాడు.

### 2. 5. 3. 3. పారాశవీ దేవి :-

శాకల్యుడు, ఒకశూద్రస్త్రీ కలియికవల్ల పుట్టినది. అసలుపేరు 'సుజాతాదేవి'. ఉగ్రసేనుడి అంతఃపురంలోని సువృత్తకు చెలికత్తె. ఆమె సువ్రత దగ్గరికెళ్ళి సువృత్త రాక్షసుడి బారినపడిన విషయాన్ని వివరిస్తుంది. సువృత్త పెళ్ళయినతర్వాత భర్తతో గిరి విహారానికి వెళ్లింది. అక్కడికి వెళ్ళినరోజే ఋతుమతి అయింది. ఉగ్రసేనుడు ఏదో పనిమీద మూడురోజులు తర్వాత వస్తానని వెళ్లారు. సెలయేళ్లను చూడడంకోసం నాల్గవరోజు బయటికి వచ్చింది. కొప్పుకొసలు ముడి వేయకుండా యథేచ్ఛగా విహరిస్తోంది. అప్పుడు ఒక గుహదగ్గర హఠాత్తుగా ఉగ్రసేనుడు కనిపించి సువృత్త చేయి పట్టుకొని ఒక గుహలోకి వేగంగా తీసుకువెళ్ళాడు. అతడే నీలికళ్ళ రాక్షసుడు. ఈమెను చెరపట్టాడు. కానీ, ఆ విషయాన్ని పాము కాటుగా మార్చినట్లు ఈ పాత్ర చెబుతుంది. శాకల్యులవారిని దూరంగా ఉండి చూసిపోదామని కుంతిభోజరాజ్యానికి వస్తుంది. కానీ అప్పటికే వారు వెళ్లిపోతారు.

### 2. 5. 3. 4. పునీత :-

శాకల్యుడు వేదవేదాంగవేత్త అయిన బ్రాహ్మణుడి ఆశ్రమం దగ్గర మధు, కుందులనే శూద్ర దంపతులుండేవారు. వారి కుమార్తే పునీత. మధుకుందుడి భార్య శాకల్యుని ఆశ్రమాన్ని శుభ్రంచేసి, గిన్నెడు పాలు ఇచ్చేది. పునీత శాకల్యుడి ఆశ్రమం చక్కగా కళకళలాడేలా అలంకరించేది. పునీత తల్లి దండ్రులు మరణించాక, ప్రతీష్ఠాపురాధీశ్వరులు కొలువులో వేదాంత సభ జరుగుతున్నట్లు శాకల్యుడికి ఈమె చెబుతుంది. చివరకు పునీతని శాకల్యుడు పెళ్ళిచేసుకుంటాడు. వీరి కలయికవల్ల పుట్టిందే పారాశవీదేవి.

### 2. 5. 3. 5. మరీచి :-

విభావసి కూతురు. పృథకంటే నాలుగేళ్ళు పెద్దది. రాజభవనంలోని ఆడపిల్లందరిలో పెద్దది. బొమ్మల పెళ్ళిళ్ల ఆట ఆడుతున్నప్పుడు మరీచి గుడ్డ బొమ్మలు కుట్టి ఇస్తుంది.

---

[1] పృథకు సూర్యుడికి పుట్టిన పిల్లాణ్ణి నదిలో వదులుతున్నపుడు ఓ మంద్రనాదం వినబడుతుంది. అతణ్ణే కృష్ణుడుగా తర్వాత పృథ భావిస్తుంది. అతడెవరో తెలీక "సాకి గోపాలుడ'ని పేరు పెట్టుకుంది.

అందులో వధువు బొమ్మకు బుగ్గన చుక్క ఉంది. పృథ చూసి పెండ్లు కూతురా? అని ప్రశ్నించింది. ఈమె పృథకు చనువుగా ఉండే చెలికత్తె. మరీచికి పెళ్ళి శూరసేన దేశంలో జరుగుతుంది. అక్కడకి పృథకూడా వెళ్తుంది.

**2. 5. 3. 6.** పర్జన్యుడు :-

శూరసేనుడి సోదరుడు. శూరసేనుడి తండ్రి దేవమీఢుడు అతనికి ఇద్దరు భార్యలు. క్షత్రియ భార్యనుంచి శూరుడు, వైశ్యస్త్రీనుంచి పర్జన్యుడు పుట్టారు. శూరుడు తన గోరక్షణ, వ్యవసాయం ఇతడికే అప్పగించాడు. పర్జన్యుడు అంటే వర్షాధిదేవత ఇంద్రుడని అర్థం. వీరి సంతానం ఉపనంద, అభినంద, నందకుమారులు; నందిని, సునంద కుమార్తెలున్నారు.

**2. 5. 3. 7.** వరీయసి :-

పర్జన్యల ధర్మపత్ని. పృథ శూరసేనరాజ్యానికి వెళ్లినపుడు పర్జున్యలవారింటికి వెళ్లింది. అక్కడ ఈమెకు పృథ నమస్కరించింది. పృథ ఈమెను పిన్నీ అని సంబోధిస్తుంది. యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటుంది. ఆదరాభిమానాలుగల పాత్ర. ప్రేమతో పృథకి ముతక చీరలిచ్చింది.

**2. 5. 3. 8.** నందుడు :-

పర్జన్యల కుమారుడు. పృథకు, వసుదేవుడికి తమ్ముడు. ఆవుల్ని మేపుతుండేవాడు. పృథ మరీచి పెళ్ళినిమిత్తం వచ్చిప్పుడు ఆమె పాదాలకి నమస్కరించాడు. ఆజానుబాహుడు, విశాలనేత్రుడు, తుమ్మెదరెక్కల్లాంటి మీసాలున్నవాడు.

**2. 5. 3. 9.** పాటలి :-

ధృతరాష్ట్రుడు మొదటగా పాణిగ్రహణంచేసిన భార్య ఈమె. మగధ దేశంనుంచి వచ్చింది. వైశ్య స్త్రీ అవడంవల్ల పట్టమహిషికాలేకపోయింది.

**2. 5. 3. 10.** సునీతి :-

పారశవీ, దేవకుల కూతురు. విదురుడి భార్య.

**2. 5. 3. 11.** బహుశ్రుత మహాముని, మంగళాదేవి :-

మారిషా శూరసేనులు వెళ్ళిన ముని ఆశ్రమం బహుశ్రుత మునిది. ఆయన భార్య మంగళాదేవి. వీరిద్దరూ యశస్వి అయిన మగపిల్లణ్ణి కనమని దీవించారు. నమ్రత, పవిత్రత, వాత్సల్యత ఉన్న స్త్రీ మంగళాదేవి.(పుటలు 34-35)

**2. 5. 3. 12.** దీర్ఘభూపతి :-

జరాసంధుడి తండ్రి. కృపాచార్యుడితో పోరాడుతున్నప్పుడు పాండురాజు దీర్ఘభూపతి చేతులు ఖండించాడు. జరాసంధుడు కోటలోపలే యుద్ధం ఏర్పాటు చేయడంవల్ల ఇలాంటి దుస్థితి వచ్చిందని, పాండురాజుకు లొంగిపోమని, హస్తినాపురాధీశ్వరుల బలాన్ని

ఎదిరించడం మృత్యువుని ఎదుర్కోడమేనని ఇతడు వివరించాడు. ఆ తర్వాత రాజవైద్యులు చికిత్స చేయడానికి ఇతణ్ణి తీసుకెళ్ళారు. (పుట. 65)

## 2. 5. 3. 13. భూరిశ్రవుడు :-

కాంపిల్య పురంనుంచి హస్తినకు సుయోధనాదులు వెళ్తున్నారు. మార్గమధ్యంలో మత్స్యయంత్రం ఛేదించినవాడు అర్జునుడని, శల్యరాజును ఎత్తి పడవేసిచిత్తు చేసినవాడు భీముడని చెప్పినవాడితడు. పాండవులందరూ బ్రాహ్మణ బృందంలో ఉన్నారని భూరిశ్రవుడు కౌరవాదులకు వివరించాడు. కృష్ణ, బలరాములు ద్రుపద రాజ్యంలోనే ఉన్నారని, ఇప్పుడు వెళ్ళి కాంపిల్య పురాన్ని దండెత్తి వచ్చన్న కర్ణుడి మాటల్ని ఖండించి ఇప్పటికి ఈ అవమానం చాలని ఇతడు వెళ్ళిపోయాడు. (పుటలు. 251-252).

## 2. 5. 3. 14. వృద్ధముని :-

పాండురాజు కిందముని శాపం పొందాక, దాన్ని విధి విలాసంగా చెప్పి, సాంత్వన పరిచిన పాత్ర. అంతేకాదు పాండురాజు సంతానం పొందుతావని నమ్మకం కలిగేలా, మంచిమాటలు చెప్పిన వాడితడు. కొన్నాళ్లు పాండురాజు బతకడానికి కారకుడిగా ఈ పాత్రని చెప్పొచ్చు.

## 2. 5. 3. 15. ఛద్మకుడు :-

ఇతడి అసలుపేరు సుధీరుడు. విదురుడి ఆంతరంగిన సేవకుడు. పగటిపూట యుధిష్ఠిరుడు ఏకాంతంలో ఉన్నప్పుడు తాను వేసే వేషాలు, గూఢచారి ప్రవర్తన గూర్చి వినోదాత్మక ప్రదర్శనలిస్తుంటాడు. పగటిపూట కూర్పాసం ధరించి తిరుగుతాడు. రహస్యంగా సొరంగ మార్గం తవ్వించడానికి తగిన సూచనలిస్తాడు. ఐదునెలల్లో కందకం నిర్మాణమైంది. హస్తినకు వెళ్లి, వారంలో తిరిగి వచ్చాడు. నర్మదానదిలో యంత్రఛాలితమైన ఒక నౌకను సొరంగ ముఖంలో భద్రపరిచి, నది అవతలికి వెళ్లడానికి వీలుగా ఉంటుందని చెప్పాడు. ఆ తర్వాత, ఆ నౌకను నీటిలో ముంచేయమని, విదురుడి ఆజ్ఞని ధర్మరాజుకి తెలియజేసిన వాడితడు.

## 2. 5. 3. 16. సౌజన్య, పురుచిత్తుడు :-

కుంతిభోజుడి వంశీయులు. కుంతిభోజుడు తపోవనానికి వెళ్తూ పురుజిత్తుణ్ణి ప్రభువుగా చేసాడు. పాండురాజు మరణవార్తవిని, పురుజిత్తుడు కుంతిని వెంటబెట్టుకొని హస్తినకు వచ్చాడు. ఇతడి భార్య సౌజన్య. దారిలోమధురానగర విశేషాలు కుంతికి చెప్పారు. శ్రీకృష్ణ, బలరాములు సాందీపుని ఆశ్రమానికి వెళ్ళినట్లు, శ్రీకృష్ణుడి మహిమలు వివరించారు.(పుట. 168)

## 2. 5. 3. 17. శాకల్యుడు :-

ఇతడు ముని. సన్నగా సగం చెరిసిన పీచు గడ్డం, లోతైన కళ్లతో ఉంటాడు. పరమ శాంతుడు. ముఖంమీద చల్లని కాంతితో, ఉత్తరీయాన చిన్న మూటతో శాలిధాన్యం తెచ్చి, స్వామికి నైవేద్యంపెట్టి తాను తినేవాడు. ఇతడికి సేవ చేయడానికి పృథ ఉండేది.

శాంతివచనాలు, వ్యాకరణాంశాలు, శాస్త్రపరిజ్ఞానం పృథకి నేర్పినముని.(పుట. 42)

ఇలా రాజమాతలో పాత్రలు ఆయా సన్నివేశాల్లో తగినవిధంగా కథాంశానికి తోర్పడతాయి. వాటి చిత్రణ ఏవిధంగా ఉందో పరిశీలిద్దాం.

## 2. 6. రాజమాత నవలలో పాత్రచిత్రణ :-

ఈ నవలలో పాత్రచిత్రణ సహజంగా, మనోహరంగా వైవిధ్యభరితంగా ఉంది. ఒక్కో పాత్ర, దాని నిర్మాణతత్త్వం ఆలోచనాత్మకంగా ఉంటుంది. సాంఘిక పరిస్థితులకు అనుగుణంగా పాత్రచిత్రణ కనబడుతోంది. ఇందులో భారతంనుంచి తీసుకున్న ప్రధాన పాత్రలు పృథ, ధర్మరాజు, దుర్వాసుడు, కుంతిభోజుడు, కృష్ణుడు. కల్పిత పాత్రల్లో కథాగమనాన్ని మార్చిన లేదా మార్చేందుకు సహకరించిన పాత్రలు విభావసి, అక్రూరుడు. ద్రుమిళాసురుడు మొదలైనవారు చెప్పుకోదగినవారు. ఆయా పాత్రల మనస్తత్త్వాన్ని తెలుసుకుంటే రచయిత పాత్రచిత్రణ తెలుస్తుంది.

ద్రుమిళాసురుడు సౌభకవిమానంతో 'సుయామున' పర్వత శిఖరం మీద ఉన్నాడు. అది తెలియక కుంతిభోజుడు, అతని భార్య సువ్రత ఆ పర్వతానికి విహారార్థం వెళ్లారు. సువ్రతను చేపట్టాలని ద్రుమిళుడు ప్రయత్నించాడు. సువ్రత భర్తని వదలి ఉండకపోవడంచేత ద్రుమిళుడికి అవకాశం దొరకలేదు. ఆ కోపంతో ద్రుమిళాసురుడు సువ్రత ఉన్న రథాన్ని, ఆమె చెలికత్తెల్ని లోయలోకి తోసి వాయువేగంతో వెళ్ళిపోయాడు. అప్పుడు ఇద్దరు చెలికత్తెలు మరణించారు. సువ్రతకు నడుంవిరిగిపోయింది. రాజవైద్యులవసతికి తీసుకెళ్ళాక సువ్రత బతికింది. ఈవిషయం తెలియక సువృత్త(సువ్రత సోదరి) ఆ పర్వతానికి విహారానికి వెళ్ళి, అక్కడ ద్రుమిళుడిచేత మోసపోయింది.

ద్రుమిళుడు ఉగ్రసేనుడివేషంలో సువృత్తను కొండగుహలోకి తీసుకెళ్ళి పాడుచేసాడు. 'కస్త్వం, కస్త్వం' అని సువృత్త బెదిరిపోయింది. చివరికి గర్భవతి అయి పిల్లాడు. అయినా కస్త్వం కస్త్వం అంటూ ఉండడంవల్ల వాడు 'కంసుడు'గా పేరు పొందాడు. ఇక్కడ ఒక రాక్షసుడిచేత పీడించబడిన స్త్రీ మతిభ్రమణను వివరించాడు. మానసిక పరివేదనకూడా ఉంది.

దుర్వాసుడు కుంతిభోజుడి ఆశ్రమంలో భిక్షాన్నభోజనవ్రతం సంవత్సరకాలంలో పూర్తి చేయదలచి వచ్చాడు. అతనిపేరు ఎవరికీ తెలపలేదు. అన్ని ఆజ్ఞల్ని క్రోధంగానే వేసేవాడు. తనుకూర్చున్న చోటున కూర్చోకూడదని శాసించేవాడు. పృథ ఆమాటల్ని గుర్తుంచుకొని నిర్వహించేది. అలాంటి ఆజ్ఞల్ని పాటిస్తున్నందువల్ల తనలో తానే మహర్షి తలుకుకొని నవ్వుకున్నాడు. 'నవ్వినా నవ్వినట్లు తోచని ముఖం ఆ మహర్షిది. ఆయన ముక్కు ఎప్పుడూ కోపభారాన్నే మోస్తూంటుంది. కళ్ళెపుడూ జేవురించి ఉంటాయి. ఇక చెంపలు సరేసరి, బవిరి గడ్డం. కోపం తప్ప ఇంకేది ఆయన ముఖం మీద కనబడదు'(పుట. 85) అలాగే భిక్షాన్నం అదృష్టంగా పృథ తినడం ఆశ్చర్యాన్ని కలిగించింది. ఇదంతా రాబోయే కుంతి కష్టాల్ని సూచిస్తున్నట్లు, దూర్వాసుడు కుంతికి మంచి చేయలని వచ్చినట్లు తెలుస్తోంది.

పృథ సేవకులకు మెచ్చి, తను తపస్సు చేసి తపస్సును దుర్వాసుడు అక్కడే ధారపోసి కుంతికి దేవతా మంత్రోపదేశం చేసి, వచ్చేస్తూ అశ్వనదీ తీరాన హఠాత్తుగా ఆగిపోయాడు. ఈ మంత్రంవల్ల అమ్మాయికి మేలుజరుగుతుందా? కీడుజరుగుతుందా అనుకుంటూ అంతా దైవ నిర్ణయం. నేనేమీకాను. మేలు జరుగుతుందనే ఆ మంత్రం ఆ కన్యకు ఉపదేశించాను. తథాస్తు (పుట.95) అని తనమనోభావన్ని మరోసారి విశ్లేషించుకున్నాడు. తద్వారా భవిష్యత్తులో జరగబోయేది ప్రశ్నార్థకంగా మారవచ్చన్న సూచనగా కనిపిస్తోంది. ఈ సన్నివేశం పాఠకుడికి ఉత్కంఠని కలగజేసేలా, ఊహించుకునేలా ఉంది.

విభావసి పాత్ర చిత్రణలో విభావసి వైధవ్యం పొందిన స్త్రీ. పృథకు గర్భధారణ చిహ్నాలు పసికట్టి, ఆమెపట్ల ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకున్న వ్యక్తిత్వం ఉన్న పాత్ర. నైపుణ్యంగా ప్రసవ సంస్కారం చేయడం, పథకాన్ని రూపొందించి అశ్వనదిలో పిల్లాడిని వేపపెట్టెలో పెట్టి వదలించుకోడం వరకు నిద్రపోదు. ఆ తర్వాత ప్రశాంతంగా నిద్రపోడం ఈ పాత్ర ప్రత్యేకత. పృథ పెంపుడుతల్లి సువ్రతకు గర్భధారణ చిహ్నాలు తెలియక పోవడంవల్ల అది శరీరపు పుష్టిగా సమర్థించడం, పృథ గర్భాన్ని బయటపెట్టకపోడం ఈ పాత్ర ప్రత్యేకత. పెళ్ళికి ముందు గర్భం దాల్చడంలో ఉండే అవస్థల్ని, సమాజం ఎలా అనుకుంటుందో అని, రహస్యంగా ఉంచినతీరు సార్వకాలికంగా అనిపిస్తోంది.

కుంతి పాత్రచిత్రణలో ఒక అద్భుతమైంది. స్త్రీ పాత్రల విషయంలో ఆణిముత్యం లాంటిది. మంత్రశక్తిని పరీక్షించదలిచి మంత్రోపాసన చేసాక సూర్యుణ్ణి ఆహ్వానించింది. సూర్యుడు వచ్చాక, నీవు సూర్యుడివే అని ఎలా తెలుసుకోవాలని ప్రశ్నిస్తుంది. అతడు సూర్యుడే అని నిరూపించాక వెళ్ళిపోమంటుంది. ఆయన కోపగించుకొని నీకు మంత్రోపదేశం చేసిన మహర్షిని, నీకుటుంబాన్ని నాశనం చేస్తానని అనేసరికి, పృథకి కళ్ళనిండా క్రోధం నిండింది. ముఖం దుఃఖభరితమైంది. నిట్టూర్పు విడిచింది, నిస్సహాయురాలైంది. అయినప్పటికి, తననిస్సహాయతతో బాల్యచాపల్యంతో తమను ఆహ్వానించాను. మీ దివ్యరూపం చూసి ముగ్ధురాలయ్యాను. నేను చేసిన అపరాధాన్ని క్షమించమని చేతులెత్తి నమస్కరించింది. ఇది ఆమె దీనత్వంతో పాటు, అనుగ్రహాన్ని పొందబోయో స్థితిని సూచిస్తున్నాయి.

పాండురాజు తనకు సంతానం కలగదని నిశ్చయించుకొని, 'నాగృహస్థజీవితం శూన్యమై పోయింది. సంతానం పొందే అర్హత కోల్పోయాను. వానప్రస్థంమాత్రం అబ్బుతుందా? నాకా నమ్మకం లేదు' అని పాండురాజుఅంటాడు.(పుట.128) 'ఈ సంసారాన్ని మీ మనసులోంచి ఇక తొలగించండి. ఇహ పరాలకు చెందిన సమస్త సౌఖ్యాలపట్ల వైముఖ్యం అవలంబించి పరమాత్మ ప్రాప్తికి ప్రయత్నించడమే వైరాగ్యమౌతుంది. కానీ, మమ్మల్ని ఏదో విధంగా వదిలించుకోడం తగదు. భార్య మూర్ఖురాలైనా, వృద్ధురాలైనా, గుడ్డిదైనా, కుంటిదైనా అనాదరించడం, తిరస్కరించడం ధర్మకాదు' (పుట. 128) అని కుంతి పాండురాజుని ఓదారుస్తూనే బాధ్యతల్ని గుర్తుచేసింది.

ఒక భార్యగా, సలహాలు ఇచ్చే మంత్రిగా, చక్కటి పాండిత్యంఉన్న స్త్రీమూర్తిగా ఇక్కడ కనబడుతోంది. అంతేకాదు పాండురాజు 'నీవు సామాన్య మానవ స్త్రీవికాదు, నన్ను వరించి వచ్చిన దేవతవు' అంటూ కుంతిని పొగడడం భర్తమనసు తెలుసుకున్న భార్యస్థితిని వివరిస్తున్నట్లుంది.

పాండురాజు శాపం వల్ల సంతానం పొందలేదు. విచారంగా ఉన్న ఒక సమయంలో కుంతి అతని దగ్గరికి వచ్చి, అతడి బాధకు కారణం తెలుసుకుంది. తన దగ్గర ఉన్న మంత్ర మహిమ గురించి చెప్పి, సాంత్వన పరిచింది. ముగ్గురు పిల్లలు పుట్టేక, నాల్గవ వాడికోసం మళ్ళీ పాండురాజు ఆమెని కనమని అడిగాడు. 'ఏ స్త్రీ అయిన ఇద్దరు లేదా ముగ్గురు పిల్లలకు మాత్రమే తల్లి కావడం ధర్మశాస్త్ర సమ్మతం, ఏమీ నీకు తెలియదా ఈ విషయం' అని భర్తవైపు చురచురా చూసింది. (పుట.146) పాండురాజు శాస్త్రజ్ఞానం ఉన్నవారితో ఇబ్బంది అని మనసులో అనుకున్నాడు. కుంతి చెప్పదలచుకున్న విషయాన్ని శాస్త్రబద్ధంగా చెప్పడం, ఆమె శాస్త్ర పరిజ్ఞానానికి నిదర్శనం. భర్తని ప్రశ్నించకుండా, అడ్డుచెప్పినట్లుకాకుండా చేయడం ఈమె మాటకారి తనాన్ని తెలుపుతోంది.

పాండురాజు చనిపోయాక, మాద్రి సహగమనం చేస్తుంది. అప్పుడు భర్తగుండెమీద పడి భోరున ఏడుస్తూ కుంతి, 'వరపుత్రుల భవితవ్యం చూడకుండానే వెళ్ళిపోయావా? నన్నింతటి భాగ్యవిహీనురాలిగా పుట్టించాడేమిటి భగవంతుడు' అని హృదయవిదారకంగా విలపిస్తుంది. ఇందులో భర్తమీద ప్రేమ, తనదైన స్థితి, తనకొడుకులు భాగ్యవంతులుగా అవుతారనే సూచన వ్యక్తమౌతున్నాయి. ఆ తర్వాత, మునుల మాటలువిని ధైర్యం తెచ్చుకొని హస్తిన వచ్చి, పిల్లల్ని సాకుతుంది. చివరిదశలో పాండవులు రాజ్యాన్ని సంపాదించే వరకూ ఉండడం బాధ్యతల్ని నిర్వర్తించడం, తర్వాత వానప్రస్థానానికి బయలుదేరడం జరిగింది. ఈమె భోగ భాగ్యాలమీద మమకారం లేకపోవడాన్ని ఈమె బాల్యావస్థనుంచి చివరివరకు చూడొచ్చు. ఇది భవబంధాల నుంచి విముక్తి చెందిన ముక్తి మార్గంగా సూచించినట్లు కనబడుతోంది.

పాండురాజు పాత్ర విలక్షణంగా కనబడుతోంది. దండయాత్రలు చేసిన యువకుడిగా కనిపించిన పాండురాజు జరాసంధుడి తండ్రి బాహువుల్ని ఖండించి విజయం సాధిస్తాడు. అయినా కుంతి ముఖం చూసినప్పుడు వెలవెల బోయాడు. 'అప్పట్లో కుంతి ముఖం గాంభీర్యం, సంయమశీలం చూడగానే కామాసక్తి నాకే అసహ్యంగా తోచేది. నీపట్ల అది నింద్యంగా భావించేవాణ్ణి. కాళికాదేవి పాదాలముందు వినయంగా శిరమొగ్గిన సింహం చందంగా సౌందర్య పరిపూర్ణమైన నీముందు నీరసపడిపోయేవాణ్ణి' (పుట. 134) అని తన మనోభావాల్ని చెప్పడం కుంతి పట్ల ఉండే దైవికతత్త్వాన్ని, తన శౌర్యస్థితిని తెలియజేస్తున్నాయి.

పాండురాజు పుత్ర సంతానం పొందడంవల్ల ఆనందిస్తాడు. కుంతి దగ్గరికి కామాసక్తుడై వచ్చినప్పుడు, శాపవిషయం మరిచారా?! అని కటువుగా మందలిస్తుంది. పాండురాజు విచార పడడాన్ని, మనస్తత్త్వాన్ని, బాధతో నిండిన హృదయాన్ని చూడొచ్చు.

పాండురాజు దైవాన్ని నమ్మే వ్యక్తిత్వం ఉన్న పాత్ర. అందుకే భీముడు ఎత్తునుంచీ రాళ్లమీద పడ్డా ఏమీ కాలేదంటే దేవుడి అనుగ్రహమే అని సమర్థిస్తాడు (పుట.140).

దుర్యోధనుణ్ణి ఈ నవలలో 'సుయోధనుడు'గా రచయిత పేర్కొన్నారు. ఇతడికి బాల్యంనుంచి భీముడంటే ఇష్టంలేకుండా ప్రవర్తించేవాడు. దుర్యోధనుడు భీముణ్ణి పరుగు పందెం ఆటలో పిల్లలతో పరుగెత్తించి అలసి పోయేలా చేసి, చివరికి తనతో ఓడిపోయేలా చేద్దామని అనుకునేవాడు. కానీ, భీముడు ఓడిపోయేవాడుకాడు. దీనికి కారణం సుయోధనుడికి అర్థం కాలేదు. (పుట.173) ఇది అతడి బాల్య చేష్టని దుర్యోధనుడి దుష్టతత్త్వాన్ని, భీముడి శారీరక దృఢత్వాన్ని విశదీకరిస్తాయి. దుర్యోధనుడు ఆచార్యుల అనుమతి లేకుండా అస్త్రవిద్యా ప్రదర్శన సమయంలో రంగస్థలం మీదకు వచ్చి, 'ఇప్పుడొక మహాశూరుడు తన శస్త్రాస్త్ర నైపుణ్యాన్ని ప్రదర్శిస్తాడు చూడండి' అని ప్రకటించాడు. (పుట.183)ఇక్కడ పెద్దలమీద అతడికుండే నిర్లక్ష్యాన్ని, స్వతంత్రనిర్ణయాలు తీసుకొనే తనాన్ని సూచిస్తున్నాయి.

భీముడిపాత్ర వైవిధ్యంగా కనబడుతోంది. బలమైనవాడు చిన్నప్పుడు ఎత్తునుంచి తల్లి చేతులనుంచి కిందకు పడ్డాడు. అప్పుడు రాళ్లు పిండిగా మారాయే తప్ప, భీముడికి దెబ్బలు తగలలేదు. సుయోధనుడితో పరుగుపందెంలో చాల బహుమతులు గెలిచానని నకుల సహదేవులకు చెప్తే, వారు ఎగిరి గంతులేసేవారు. వారి ఆనందానికి భీముడి మరింత ఆనందపడి వాళ్లని గిరగిరా తిప్పేవాడు. తనని పొగడేవాడంటే ఇతడు చాలా ఇష్టపడతాడని తెలుస్తోంది. జరాసంధుడితో మల్ల యుద్ధసమయంలో జరాసంధుణ్ణి గిరగిరా తిప్పి జనంలోకి విసరికొట్టాడు. ఇతనికి కోపంవస్తే దానిస్థాయి తీవ్రంగా ఉంటుందని తెలియజేసాడు.

ఇలా ఆయా పాత్రల స్వభావాన్ని, సందర్భానికి తగినవిధంగా చిత్రించినట్లు కనబడుతోంది. ఒక్కోసందర్భంలో కథాంశ సూచన, పాత్ర ప్రత్యేకతలు మొదలైన విషయాల్ని పాఠకుడికి రచయిత తెలియజేసాడు.

## 2. 7. ద్రౌపది నవలలో మనస్తత్త్వచిత్రణ :-

యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ రాసిన 'ద్రౌపది' నవలలో ఎక్కువగా ద్రౌపదీ అంతరంగ మథనాన్ని చిత్రించారు. అందువల్ల రచయిత 'ఫ్లాష్ బాక్' గా కథని ముందు వెనుకలుగా చెప్పాడు. ద్రౌపది ఐదుగురు కొడుకుల్ని యుద్ధంలో కోల్పోయింది. చాలా బాధపడింది. తను ఐదుగురి కొడుకుల్నే కోల్పోతే, గాంధారి నూర్గురు కొడుకుల్ని కోల్పోయింది. అమెకెంత పుత్రశోకం? ఈ యుద్ధానికి ఏవరు కారణం? నేనే ఈ యుద్ధానికి కారణమా లేక ఈ పుత్రశోకం నన్నిలా ఆవేదనకు గురిచేస్తోందా? ఎందుకు పశ్చాత్తాపపడాలి.... అంటూ ద్రౌపది ఆవేదనకు ఎన్నికారణాలు కావచ్చో రచయిత సూచించాడు. పాఠకుడికే జవాబు వదిలేయడం కనిపిస్తోంది. నిజానికి ద్రౌపది తన కొడుకులు చనిపోయినందుకు కొంత బాధ పడితే, వంద మంది పోయిన గాంధారి తలుచుకోడం ద్రౌపది ఉపశమనం పొందడానికి, పగ చల్లారిందని, మరో రకంగా మాతృ ప్రేమని వ్యక్తం చేస్తున్నాయి.

భీష్ముణ్ణి, ద్రోణుణ్ణి, కర్ణుణ్ణి, భూరిశ్రవుణ్ణి, తనని పాండవాదులు యుద్ధంలో జయించలేరని  దుర్యోధనుడు కృష్ణుడితో అంటాడు. అయితే నిజంగా జయించలేక పోవచ్చు. మాయాజూదంలో సంపదలన్నీ హరించినప్పుడు, కామంతో ద్రౌపది వక్షోజాలమీద దృష్టి పడ్డప్పుడు ఏమైంది ఈ వివేకం అని దుర్యోధనుణ్ణి ఉద్దేశించి 'కృష్ణుడు ప్రశ్నల్ని బాగా అడిగాడు' అని ద్రౌపది భావిస్తుంది. కానీ ఈ ప్రశ్నలు తనభర్తలలో ఎవరైన అడిగి ఉంటే ఇంకా బాగుండేది అని(పుట. 20) బాధ పడుతుంది. ఈ అంశంలో  భర్త భార్య పట్ల ఎలా ఉండాలని కోరుకుంటుందో విశ్లేషించినట్లుంది. భర్త ఎదురుగా వేరొకరు భార్యకి అవమానం చేస్తున్నప్పుడు చూస్తూ ఊరుకోకుండా ఉండాలని అనుకోడం స్త్రీ సహజస్థితి. కానీ, అవమానం పొందినప్పటికి ద్రౌపది మానసికవేదన కురుక్షేత్ర యుద్ధానికి కారణం కావచ్చు అని పాఠకుడికి రచయిత సూచనచేస్తున్నట్లనిపిస్తోంది. అదే ఒక వ్యక్తికి మాత్రమే ద్రౌపది భార్య అయితే స్థితి ఎలాగుందేది? దీనికి జవాబు పాఠకుడికే వదిలేయడం రచయిత పాత్రచిత్రణలో ప్రత్యేకత.

యుద్ధంలో కౌరవులందరూ మరణించారు. పాండవులకు విజయం వరించింది. ద్రౌపది యుద్ధం అయిపోయిందనుకొంది. కానీ, అశ్వత్థామవచ్చి ఉపపాండవుల్ని మట్టు బెట్టాడు. యుద్ధపు చివరిదశ ఇంత భయంకరమైనదా. పిల్లలేని సామ్రాజ్యం ఒక సామ్రాజ్యమా అంటూ హృదయ విదారకరంగా ఏడుస్తుంది. తన పిల్లలపట్ల ఆమెకుంటే మమకారం ఈ సన్నివేశంలో ఉదాత్తమైన తల్లిలా కనిపిస్తుంది. కొద్దిసేపటికి అశ్వత్థామను ఎలావధించగలమన్న ధర్మరాజు మాటలకి కోపంవచ్చి ద్రౌపది 'అతణ్ణి వధించకపోతే నాబిడ్డల ఆత్మకు శాంతిలేదు' అని, భీముడి వైపు తిరిగి 'ఆ పాపాత్ముడిశరీరంలో పుట్టుకతోనేఉన్న శిరోమణినితెచ్చి చూపించేంతవరకు నేను అన్నపానాలు ముట్టను' అని ఆగ్రహించడంలో కసి, పిల్లలందరిమీద తనకు అపారమైన ప్రేమ ఉన్నట్లు, మాతృ ప్రేమలో ఔన్నత్యాన్ని కూడా సూచిస్తోంది.

అయితే భీమాదులు అశ్వత్థామని చంపడానికి వెళ్లారు. సహదేవుడు ద్రౌపది దగ్గరున్నాడు. అతడితో 'నా ప్రతీకారేచ్ఛవల్లనే ఈ యుద్ధం జరిగింది సహదేవా... నే నెవర్నీ క్షమించలేను. స్త్రీకి సహజమైన క్షమాగుణం నాకు లేదు... లేకపోతే నా పుత్రులును వధించిన ఆ పాపాత్ముడిని హతమార్చమని ఎందుకు చెబుతాను? అతడిని చంపితే నా పుత్రశోకం చల్లారుతుందా? అశ్వత్థామ చనిపోతే గురుపత్ని 'హరిత'కు దిక్కెవరు?' (పుట.31) అంటూ బాధపడడం స్త్రీగా తాను అనుభవించిన కష్టాలు, భర్తలేని స్త్రీ పడబోతుంది అని ద్రౌపది భయపడడం ఆమె సాధారణ స్త్రీగా కనబడుతోంది. చివరకు 'అశ్వత్థామను వదిలేసాం' అన్నప్పుడు ద్రౌపది ఆనందించడం కొసమెరుపు.

ద్రౌపది అర్జునుల సంభాషణలో 'కృష్ణార్జునులు ఒక్కటే అతడి ప్రేమ, స్నేహానికి వశమయ్యానని' అర్జునుడు చెప్పాడు. దాంతో ద్రౌపది ఒక పురుషుడు మరో పురుషుడిని వశపరచుకోవడమేమిటి. ప్రేమించడమేమిటి ఆరాధిస్తాడా.... శ్రీకృష్ణుడి ఆరాధన విషయంలో

తనకూ అర్జునుడికీ ఏమంత వ్యత్యాసం లేదన్న అభిప్రాయం ద్రౌపదికి కలిగింది(పుట. 73). అలాగే ద్రౌపది కృష్ణుణ్ణి చూస్తూ, మైమరిచి మాట్లాడితున్నట్లు కనబడుతుంది. నీ విశాలమైన నేత్రాల వెలుగురేఖలు నా చుట్టూ ఒకరక్షణవలయాన్నిపరచినట్లు అనిపిస్తుంది. అసహనం కమ్ముకున్నప్పు డల్లా నీ చిరునవ్వును తలచుకుంటే అపారమైన ప్రశాంతత మనస్సునిండా పరచుకుంటుంది. (పుట. 167)ఈ విషయాన్ని పరిశీలిస్తే కృష్ణ, కృష్ణుల సామ్యాన్ని, సహకారాన్ని, స్నేహ, బాంధవ్యాల్ని అర్థం చేసుకోవచ్చు. అందుకే ఎప్పుడూ కృష్ణుణ్ణి ధ్యానించడం ద్రౌపది ఒక నిత్యకృత్యంగా భావిస్తోంది.

కృష్ణుడు సత్యభామను తీసుకొచ్చినపుడు ద్రౌపది సత్యభామ మాటల్లో పాండవుల్ని ఎలా సేవిస్తూ ఉంటుందో ద్రౌపది సత్యకు చెబుతుంది. భార్యాభర్తలు పరస్పర గౌరవభావం తోను, ప్రేమానురాగాలతోను, శారీరక ఆకర్షణలతో కూడిన మనసుతోను ఆహ్లాదంగా ఉంటానని ఇదే మొదటి రహస్యమని చెబుతుంది.

పరపురుషులపట్ల ఆకర్షణ పొందలేనట్లుగా భర్తకు భార్య కనిపించాలి. ఇది ఆత్మవంచన అనుకున్నా, ఒకరికోసం మరోకరు నిరంతరసుఖంకోసం ఇలా చేసుకోడం తప్పుకాదు ఇది రెండో రహస్యం.

కోపం, అసహనం, దురభిమానం, మొరటుదనం లేకుండా ఉన్నట్లు వ్యవహరించాలి. సౌందర్యానికి తగ్గ అలంకరణ, మృదుత్వం, కోమలత్వం కలిగి ఉండాలి. ఇవి సహజంగా అనిపించేలా, ఉంటే భర్త మరింతగా ఆనందపడతాడని గ్రహించాలని సత్యభామకు తను పాండవులపట్ల ఎలా ప్రవర్తిస్తుందో వివరించడం ఆమె మనస్తత్వాన్ని తెలుపుతోంది. (పుటలు. 321-231)

కీచకుడిచేత అవమానం పొందిన ద్రౌపదిని ఆమెభర్తలు రక్షించలేదు. జూదరులు, వ్యసనపరులై ఉన్నారని ఆవేదనతో విరాటుడి సభలో బాధపడుతుంది. 'సమర్థులైన భర్తలున్న స్త్రీకి అడుగడుగునా అవమానం తప్పదా.... భార్యలను రక్షించలేని పురుషులు కనీసం తమ భార్యలను ఆత్మహత్య చేసుకోడానికి అనుమతివ్వాలి' అనడం(పుట. 248) అప్పటికీ భర్త అనుమతివ్వాలనడం కోపంలో కూడా భర్తల్ని గౌరవించడం కనిపిస్తుంది. మనసులోని అవేదన వ్యక్తమౌతుంది. వ్యసనపరులైనారని ఆక్రోశంకూడా కనబడుతోంది. ఆ కోపమే కీచకుడి మరణానికి దారి తీస్తుందని రచయిత సూచిస్తున్నట్లు తెలుస్తోంది. ఇలా రచయిత ఎక్కువగా ద్రౌపది పాత్రమీద దృష్టిపెట్టి రచన చేయడం ఆ పాత్ర ప్రత్యేకత ఆవిష్కృతమౌతుంది.

## 2. 8. యాజ్ఞసేని నవల పాత్రల పరిచయం ః-

యాజ్ఞసేని నవలలో ప్రత్యక్షంగా పాఠకుడికి కథను వివరించేది 'కృష్ణ' మాత్రమే. ఆమె కృష్ణుడికి రాసిన లేఖే ఈ నవల. అయితే కొంతమందిని అక్కడక్కడా గుర్తుచేసుకుంటూ ఉంటుంది. అలా కొన్ని పాత్రలు కనబడతాయి. ఇవి రెండురకాలుగా గుర్తించడం జరిగింది. అవి 1. ఈ రచయిత్రి కల్పించిన పాత్రలు/ కల్పిత పాత్రలు 2.

శ్రీమన్మహాభారతంలోని పాత్రలు. కల్పితపాత్రల ప్రయోజనం ప్రధానకథని సంధానంచేస్తూ కొత్తదనాన్ని కలిగించే ప్రయత్నం చేస్తాయి. పాతకథలా అనిపించేలా తోర్పడేవి శ్రీమన్మహాభారత పాత్రలు.

### 2. 8. 1. కల్పిత పాత్రలు :-

నితంబిని :-

కృష్ణకు ప్రియసఖి. ద్రుపదుడి దగ్గరనుంచి ఇంద్రప్రస్థంవరకు ద్రౌపదితోనే ఉంటుంది. ద్రౌపది మనసులో 'కృష్ణుడి' గురించిన విషయాలు తెలియజేసేదీమే. కృష్ణ ప్రేమతత్వాన్ని సూచనగా ఈ పాత్రద్వారా రచయిత్రి వివరించారు. ద్రౌపదికి అలంకారాలు అలంకరించే పాత్ర. సైరంధ్రి వంటిది.

నీలాంజన :-

యాజ్ఞసేని ఓసారి 'కృష్ణుడి' తలపులతో అస్వస్థతకి గురైంది. ఆ విషయాన్ని ద్రుపదుడికి చేరవేసిన పాత్ర. నీలాంజన పేరు పెట్టడంలో రచయిత్రి 'కృష్ణ' వర్ణాన్ని తెలపడానికే అని అనిపిస్తుంది. కృష్ణుడి దర్శనానికి వెంటనే ద్రౌపదిని రమ్మని చెప్పడానికి ఈమె వస్తుంది.

నీలమణి :-

ద్రౌపది పెంచుకున్న గోరువంక. దీనికి కృష్ణ పెట్టిన పేరిది. నితంబినికి, ద్రౌపదికి మధ్య జరిగిన సంభాషణ విని ఈ గోరువంక 'కృష్ణా,కృష్ణా' అని పిలుస్తుంది. ఈ పేరు కృష్ణుడికి వర్తిస్తుందని, నితంబిని వివరించి కృష్ణుడిపై కృష్ణకి ప్రేమ కలిగేలా మాట్లాడుతుంది. ఈ గోరువంక శ్రీకృష్ణుడి దగ్గరికి వెళ్లి నెమలిపింఛం తీసుకువచ్చి కృష్ణ దగ్గర వదిలేస్తుంది.

మాయ :-

అత్యంత లావణ్యం ఉన్న పరిచారిక. శ్రీకృష్ణుడిదగ్గర చిన్నప్పటినుంచి ఉండే పాత్ర. ఈమెని ద్రౌపదికి కానుకగా కృష్ణుడిస్తాడు. చాలా విషయాల్లో ద్రౌపదికి చేదోడువాదోడుగా ఉంటుంది. పాండవులకు ద్రౌపది విషయంలో ఒకసంవత్సరం గడువు విధించడంలో ప్రత్యేక పాత్ర పోషిస్తుంది. ద్రౌపది హిమాలయాలకు వెళ్ళేప్పటి వరకు ఈ పాత్ర ఉంటుంది. ఈ పాత్ర భగవల్లీలగా కనిపిస్తూ రాబోయే కష్టసమయానికి ముందే సూచనలు ఇచ్చేలా ఉంటుంది. మధ్యలో మాయం అయిపోతుందని సూచించడానికి ఈ పేరు రచయిత్రి పెట్టారు.

సులలన :-

నకులుడు నృత్యశాలలో నృత్య గీతాలతో నిమగ్నమై ఉంటాడు. నర్తకి సులలన నృత్యం అతణ్ణి ఆకట్టుకుందని కృష్ణ అనుకుంటుంది. ఈమె నాట్యం అంత ఆకర్షించేలా ఉంటుంది.

ఆర్య :-

కళింగ రాజకన్య. అర్జునుడు పన్నెండు సంవత్సరాలు దేశసంచారం చేస్తూ కళింగదేశంలో ప్రవేశించాడు. అక్కడ సూర్య పూజ పూర్తిచేసి దేవాలయంనుండి వస్తూ ప్రసాదం పంచి పెడుతుంది. ఆ సమయంలో కొన్నాళ్లుండాలని అంటాడు. అతడి మధుర కంఠధ్వనికి రాజకన్య ముగ్ధమైపోతుంది. ఆ తర్వాత అర్జునుడు ఈమెను చేపడతాడు.

పయస్విని :-

ఈమె ద్రౌపది సహచారిణి. యమునానదిలో జలక్రీడకోసం యాజ్ఞసేని, నితంబిని, మాయ, పయస్వినులు వెళ్తారు. అక్కడ ఒక పూల రెమ్మను తెంచి, పారుతున్న నదిలో వేసి, దాన్ని ఎవరు తీసుకువస్తారో వారు గెలిచినట్లు అని పందెం వేసినపాత్ర.

అస్మిత :-

కర్ణుడి సహచారిణి. ద్రౌపది యమునలో పడి కొట్టుకుపోయినప్పుడు కర్ణుడీమెను ద్రౌపదికి సహాయంగా ఇచ్చి ఇంద్రప్రస్థం చేర్పిస్తాడు.

అసూయా, జటిలులు :-

దుశ్శాసనుడి సహచరులు. వీళ్ళు కర్ణుడి ఆజ్ఞమేరకు ద్రౌపదిని రథం మీద ఇంద్రప్రస్థానికి తీసుకెళ్లడానికి సహాయకులుగా వస్తారు.

రుతుమతి :-

కాంచనదేశ రాజకన్య, కర్ణుడి భార్య. యమునా నదిలో నుంచి ద్రౌపదిని కర్ణుడు రక్షిస్తాడు. రుతుమతిని సహాయంగా పంపుతాడు. కర్ణుడి గురించి ద్రౌపదికి చెబుతుంది. కర్ణుడికి ద్రౌపదే ప్రేరణ అని వివరించే పాత్ర ఈమే.

హరిత :-

ద్రోణుడి రెండోభార్య. ఇంద్రప్రస్థంలో ద్రౌపది ఉన్నప్పటికీ ఈమెతో మంచి సంబంధాలు పెంచుకొంది. అశ్వత్థామ ద్రౌపది కొడుకుల్ని చంపినప్పుడు ఈమె ఒంటరిదైపోతుందని ద్రౌపది బాధపడుతుంది. జీవితంలోని ఒక అలౌకిక భావజాలానికి నిదర్శనగా రచయిత్రి ఈ పాత్రని సృష్టించారు. అశ్వత్థామను చిన్నప్పటినుంచీ ఈమె సాకింది.

జరుడు :-

కిరాతవంశపు యువకుడు. పూర్తిపేరు 'జరా ఏకలవ్యుడు'. కామ్యకవనంనుంచి వచ్చి ద్రోణాచార్యులదగ్గర అస్త్రవిద్యనేర్చుకోవాలని భావిస్తాడు. కౌరవుల భయంతో జరాఏకలవ్యుడికి విద్య నేర్పకుండా ద్రోణుడు పంపేస్తాడు. కుతూహలంతో విద్యనేర్చుకుంటాడు. ఆ తర్వాత అస్త్ర ప్రావీణ్యం పొందుతాడు. గురుదక్షిణ మిషతో ఇతడి

కుడిచేతి బొటనవ్రేలు ద్రోణుడు తీసుకుంటాడు. అప్పటినుంచి కిరాత వంశం వాళ్లు కురువంశం వాళ్ళని, రాజుల్ని అడవిలోకి రానివ్వకుండా చంపేవారు. ఈ సమాచారం సహదేవుడు ధర్మరాజుకి వివరిస్తాడు.(పుట. 214)

విరాత శబరుడు-కంబు, జంబులు :-

కామ్యకవనంలో నివసించే కిరాతుడు విరాతుడు. ఇతడికి ఇద్దరు కొడుకులు. వారే కంబు, జంబులు. వారికి రెండు నెలలు వయస్సులో ఉన్నప్పుడు వారి తల్లిని పులి ఎత్తుకెళ్ళిపోయింది. పాలులేక బలహీనంగా ఉండేవారు.

శ్రీయ :-

ఈమె విరాతశబరుడి రెండో భార్య. కంబు, జంబుల్ని చిన్నప్పటినుంచి సాకింది. కానీ, వాళ్లకి పాలు ఇవ్వలేదు. ద్రౌపది కంబు, జబులకు పాలు ఇస్తానంటే, తన ఇంట్లో భోంచేయాలని, అప్పుడే పాలు ఇవ్వడానికి అర్హురాలవు అవుతావని తమకుల కట్టుబాటును చెబుతుంది. ద్రౌపది శబరుల ఇంట్లో భోజనం చేస్తుంది. తర్వాట కంబు, జంబులకి స్తన్యాన్నిచ్చింది, తద్వారా వాళ్ళు ఆరోగ్యవంతులు అవుతారు.

విప్రపాదుడు :-

కర్ణుడు ఒకరోజు అడవిలో విషసర్పం కాటుకి బలై పడిపోతడు. శబర యువకుడు వచ్చి, ద్రౌపదికి విషయం చెబుతున్నసమయంలో విప్రపాదుడు ప్రవేశం ఉంది. పక్షులు, పశువులు, సమస్త జీవకోటిని వశీకరించే శక్తి ద్రౌపదికి ఉందని అంటాడు. వెంటనే వెళ్లి విషసర్పాన్ని ఆదేశించమని, ఆ యువకుణ్ణి బతికించమని ద్రౌపదికి చెప్తాడు.

మాలతి :-

దాసి. మత్స్యదేశంలో కీచకుడి దగ్గరనుంచి కానుకలు తీసుకువచ్చి ద్రౌపదికిచ్చేది. ఒకరోజు కీచకుడు ప్రేమలేఖను ఈమె ద్వారా పంపిస్తే ద్రౌపది చదివి దాన్ని అగ్గిలో పడేస్తుంది.

### 2. 8. 2. మహాభారతంలోని పాత్రలు :-

కృష్ణ :-

యజ్ఞంనుంచి ద్రుపదుడికి వచ్చిన సంతానం ఈమె. 'యజ్ఞదేవే' తల్లిగా, 'యజ్ఞసేనుడే' తండ్రిగా రచయిత్రి వర్ణించారు. నీలోత్పల దళాల్లాంటి శరీర కాంతితో నీలపద్మాల్లా మెరిసే మనోహరమైన కళ్లతో, తీర్చిదిద్దినట్లుండే అవయవసౌష్ఠవం ఉన్న సౌందర్యవతి కృష్ణ. లోకంలో ధర్మరక్షణార్థం, దుష్టశిక్షణార్థం సృష్టించిన అస్త్రంగా కనబడుతుంది. కృష్ణగా పాండవుల్ని వరించి మానవ మాత్రురాలిగా జీవనం సాగించింది. చివరికి కృష్ణుడి విశ్వమోహన గీతిలో లీనమైపోతుంది.

కృష్ణుడు :-

ఆపద్బాంధవుడు. ద్రౌపదికి ఇష్టమైనవాడు. ద్రౌపదిని సఖిగా తీసుకొని ఆమెకు సహాయకుడిగా ఉంటూ పాండవుల్ని కష్టాలనుంచీ రక్షిస్తాడు. నల్లటి పాదాలు ఉండి, మోహింపజేసే వాగ్ధాటి ఉన్నమోహనరూపుడు. అర్జునుడికి చెలికాడు. నవలంతా ఇతడి ప్రమేయం ఉంటుంది. కృష్ణ- కృష్ణుడు ఇద్దరూ ఒకటే అనిపించేలా ఈ నవలలో కృష్ణుడు కనిపిస్తాడు.

కర్ణుడు :-

రాధ, అతిరథుడికి పెంపుడుకొడుకు. కుంతికి ధర్మపుత్రుడు. ద్రౌపదీ స్వయంవరంలో కులంతక్కువవాడవడంచేత అవమానం పొందుతాడు. అక్కడనుంచి ద్రౌపదిమీద లోలోపల కోపం పెంచుకుంటాడు. అర్జునుడు ఇతడికి సరిజోడి అవడంచేత, అతణ్ణి సంహరించాలని భావించి చివరకు మరణాన్ని కోరుకుంటాడు. కుంతికొడుకని తెలుసుకున్నా, రాధకొడుకుగానే ఉండాలని అనుకుంటాడు. దుర్యోధనుడికి మిత్రుడిగా ఉంటాడు.

కుంతి :-

పాండవుల తల్లి. ధర్మరాజు చెప్పినమాటలకు ద్రౌపదిని సమంగా పంచుకోమని చెబుతుంది. కష్టాలలో కూడా కోడుకులకు ఆసరా ఉంటుంది. కోడలికి మంచిమాటలు చెప్పి పాండవుల సఖ్యత దెబ్బతినకుండా చూస్తుంది. పాండవులు అరణ్యవాసం చేస్తున్నప్పుడు విదురుడింట్లో ఉండి, చిక్కిపోయి బతుకుతుంది. కొడుకులకు న్యాయం జరిగేవరకు తనవంతు పాత్రని పోషిస్తుంది.

ద్రుపదుడు :-

ద్రోణుడికి మిత్రుడు. పాంచాల దేశరాజు. ద్రోణుడివల్ల అవమానం పొందుతాడు. యాగంచేసి యాగంద్వారా దృష్టద్యుమ్నుణ్ణి, కృష్ణని పొందుతాడు[2]. కృష్ణుడి సలహామేరకు మత్స్యయంత్రాన్ని ఏర్పాటుచేస్తాడు. బ్రాహ్మణవేషంలో ఉన్న అర్జునుడివల్ల మత్స్యయంత్ర ఛేదన జరుగుతుంది. వ్యాసుడి సలహావల్ల, ద్రౌపది అభీష్టంవల్ల ద్రౌపదిని పాండవులకిచ్చి ద్రుపదుడు పెళ్లి చేస్తాడు.

దృష్టద్యుమ్నుడు :-

ద్రుపదుడి పుత్రుడు. కృష్ణకు సోదరుడు. ద్రోణుడిదగ్గరు విద్యలన్నీ నేర్చులుంటాడు. తండ్రికి జరిగిన అవమానానికి ప్రతీకారంగా ద్రోణుణ్ని యుద్ధంలో సంహరిస్తాడు. పాండవులకి సహాయంగా ఉంటాడు. యుద్ధంలో సేనానిగా ఉండి ధైర్య సాహసాలు ప్రదర్శిస్తాడు. అశ్వత్థామ చేతిలో నిద్రలో పాణాలు కోల్పోతాడు.

[2] పాండవులచేతిలో ఓడిపోతాడు. పాండవులు ఓడించడానికి కారణం ద్రోణుడు. బాల్య స్నేహితుడైన ద్రోణుడికి తగిన గౌరవం ఇవ్వలేదని ప్రతీకారంగా పాండవుల్ని ద్రుపదుడిమీదకు యుద్ధానికి పంపిస్తాడు. పరాజయం పొందిన ద్రుపదుడు ద్రోణుడిమీద ప్రతీకారంగా పాండవుల్ని ద్రుపదుడిమీదకు యుద్ధానికిపంపిస్తాడు. పరాజయం పొందిన ద్రుపదుడు ద్రోణూడిమీద ప్రతీకారం తీర్చుకోవాలని, అర్జునుణ్ణి అల్లుడిగా పొందాలనే కోరికతో యాగం చేస్తాడు.

ఇలా పాత్రలున్నాయి. ఈ పాత్రల్ని నడిపించడంలో రచయిత్రి నేర్పు ప్రదర్శించారు. ముఖ్యంగా ద్రౌపది విషయంలో మరింత పాత్ర చిత్రణ ఉంది. ఇంకా కృష్ణుడి పాత్రలో ప్రత్యేకత ఉంది. దీని పాత్రచిత్రణలో చూడొచ్చు.

### *2. 8. 3.* యాజ్ఞసేని నవలలో పాత్రచిత్రణ :-

యాజ్ఞసేని నవలలో 'యాజ్ఞసేని' పుట్టడంలో ప్రత్యేకత ఉన్నప్పటికీ, మానవ మాత్రురాలైన స్త్రీగా రచయిత్రి చిత్రించారు. చాలా విషయాల్లో మౌనంగానే ఉండి, మనస్సులోని భావనలుగా పాఠకుడికి చెబుతున్నట్లనిపిస్తుంది. అయితే ఎప్పటికప్పుడు మానసిక పరిపక్వత కనిపించడం ఈ పాత్ర ప్రత్యేకత.

అర్జునుణ్ణి ప్రేమించి, మనసంతా అతడికే కృష్ణ అంకితం చేసింది. అలాంటి సమయంలో కృష్ణుడి సలహామేరకు ద్రుపదుడు మత్స్యయంత్రాన్ని ఛేదించినవారికే తనకుమార్తెనిస్తాననే షరతుతో పరీక్ష పెడతాడు. అది అర్జునుడుతప్ప మరొకరు ఛేదించలేరు. తన పరిస్థితిని అర్జునుణ్ణి ప్రేమిస్తున్నట్లు సోదరుడు దృష్టద్యుమ్నుడితో కృష్ణ చెప్పుకుంది. అతడి ద్వారా స్వయంవరం ఆపేస్తేవచ్చే కష్టాల్నితెలుసుకుంది. ఎవరూమత్స్యయంత్రాన్ని ఛేదించలేకపోతే ద్రౌపది ఏమౌతుందోచూడండి-"నేను(ద్రౌపది)మౌనంగాఉన్నాను. స్వయంవరంగురించి నా మనస్సులో ఆవేగం, స్వప్నం, కల్పన, ఆశ, ఉత్కంఠ, అన్ని హరించిపోయాయి. ఇక బ్రహ్మచర్యానికి తగిన కఠోరనియమాలతో నిండినజీవితానికి సిద్ధంకావాలి. సుఖ దుఃఖాలపట్ల నిర్వికారంగా ఉండాలి. ఏది జరిగిందో, ఏది జరగాల్సి ఉందో విచలితనవ్వాలి పుట.36) అని రచయిత్రి వివరించింది. ఇందులో ద్రౌపది ఆవేదన, అర్జునుడి పట్ల ప్రేమ, బ్రహ్మచర్యానికి సిద్ధపడాలి అనిచెప్పడం భవిష్యత్తులో కోరుకున్నవాణ్ణి పొందకపోడంవల్ల బ్రహ్మచర్యం పాటించాల్సి రావచ్చని సూచన కనబడుతుంది.[3]

మత్స్యయంత్ర పరీక్ష జరగబోయే ముందు రోజుకే పాండవులుతప్ప, అందరు రాజులు వచ్చేసారు. కృష్ణ చాలా ఉదాసీనంగా ఉంది. సీతను ఆదర్శంగా భావించింది. ఆమె జీవిత చరిత్ర చదివి, సీతమీద భక్తిభావం ఏర్పరచుకుంది. సీతలా అన్యాయ ఆరోపణలకు తలవంచి సహించ లేనని భావించింది. ద్రౌపదికి ఇంకా వివాహం కాకపోయినా, భర్త ఉన్నడోలేదో అనుకుంటూ సీతలా తన జీవితం ఎందుకవుతుందని తలచింది. పాండవులకోసం నిర్మించిన భవనం శూన్యంగా ఉండడంతో ఏమీ చేయలేని

---

[3] అర్జునుడు మత్స్యయత్రాన్ని ఛేదించినా, కుంతివల్ల పాండవులందరూ పంచుకోవలసి వస్తుంది. అయితే కుంతి ముందుగానే ద్రౌపదిని అడుగుతుంది. అమ్మా ఈధర్మ యాగంలో నీవు అందరితో పంచుకోడం ఇష్టమేనా అని అంటుంది. ఇష్టమే అని కృష్ణ చెప్తుంది. దాంతో అర్జునుడికి కోపం ప్రారంభమౌతుంది. పెళ్ళిళ్ళు అయిపోయిన కొద్దిరోజుల తర్వాత ఒకసంవత్సర గడువు పెట్టడంతో రెండు సంవత్సరాలు అర్జునుడు ఆగాల్సి రావడం, మధ్యలో తనదగ్గరికి రమ్మంటే ద్రౌపది ఒక్కసారే వచ్చి మళ్ళి కలవడానికి అంగీకరించపోడం జరిగింది. దాంతో దూరం అవ్వాలని అర్జునుడు అనుకొని నియమాన్ని ఉల్లంఘించాడు. అలా అర్జునుడిపట్ల ద్రౌపది తనకు తానుగా బ్రహ్మచర్య నియమాల్ని పాటించింది.

అసహాయ స్థితిలో ద్రౌపది ఉన్నట్లు రచయిత్రి వివరించారు. సీతతో పోల్చుకోడం పవిత్రతకు, కష్టాలు పొందుతుందని సూచన చేస్తూ దాన్ని సందిగ్ధ స్థితిలో ఉంచడం పాఠకులకు ఉత్కంఠగా కనబడుతోంది.

ఊహాలోకాన్ని సృష్టించుకొవడం, దాన్ని పొందలేకపోతాననే అనుకోడం ఈరెండిటికి మధ్య ఉన్న తేడాలను ద్రౌపది పాత్రలో చూడొచ్చు. స్వయంవరానికి వచ్చిన రాజులందరూ మత్స్య యంత్రాన్ని ఛేదించలేకపోయారు. కర్ణుడు కులవివక్షకు గురైపోయాడు. కృష్ణుడు సభా మందిరంలోఉన్నా పోటీచేయడంలేదు. ఆ సమయంలో అందమైన వస్తువులను ప్రతిమనిషి చూసి వాటిని ఆశిస్తాడు. దాని స్వంతం చేసుకోవాలని కలలు కంటాడు. ఉచితమైన మార్గంలో కాకపోతే, అనుచిత మార్గంలో అయినా దాన్ని పొందడానికి ప్రయత్నిస్తాడు. ప్రలోభంలో ఉన్న మనిషికి ఆ సుందరమైన వస్తువుని పొందే శక్తి సామర్థ్యాలు తనలో ఉన్నాయాలేవా అని ఆలోచించడు. ప్రయత్నాలన్నీ విఫలమయితే దుఃఖిస్తాడు. అందుకే ఈ రోజు లక్షలమంది రాజుల దుఃఖకారణ మయ్యాను నేను"(పుట. 43). అని కృష్ణ దుఃఖిస్తుంది. అక్కడకు వచ్చిన రాజుల ఆశల్లో తప్పు లేదనే మానవగుణాల్ని, ఆశల్ని సామాన్య జీవితానికి సరిపోయేలా భావించడం ప్రత్యేకత. ఎలాగైనా పొందాలనుకునే తనం జరగబోయే ద్రౌపది వస్త్రాపహరణ సన్నివేశాన్ని సూచించడం మరో ప్రత్యేకత.

పుట్టడంతోనే కన్యగా, రాజకుమార్తెగా యజ్ఞనుంచి వచ్చిన యాజ్ఞసేని స్వయంవరం పేరుతో బీదబ్రాహ్మణుణ్ని వరుడిగా వరించాల్సి వచ్చింది. అప్పటివరకూ కన్నకలలు ఒక్కసారిగా ఎలా మారాయో, ఆ విచిత్రస్థితిలోఉన్న ద్రౌపదిని వివరించే రచయిత్రి ప్రయత్నం చేసారు- "నిజానికి కన్య మనస్సులోని కల్పనకూ, వాస్తవానికి మధ్య ఎంత తేడా! ఎక్కడ హస్తినాపుర రాజప్రాసాదం, ఎక్కడ ఏకచక్రీనగరంలోని ఈ పాతకుటీరం! నేను ఇక్కడే జీవితం గడపాలి.

మరునిమిషమే నా మనస్సుని అదుపులో పెట్టాను. ఓ మూర్ఖ మనసా, వాస్తవాన్ని చూడు. రాజకుమారి కృష్ణా, వధువు కృష్ణ గురించి చింతించడం మూర్ఖత. వధువు కృష్ణ ఈ కుటీరంలోనే జీవితం గడుపుతుంది." (పుట. 52) ఇక్కడ మనసుని అదుపుచేయడం, వాస్తవాన్ని గుర్తించడం ప్రధాన విషయాలు. ప్రజ్ఞావంతులు పరిస్థితుల్ని సర్దుబాటు చేసుకుంటారు అన్న మనోవిజ్ఞాన శాస్త్రవేత్తల భావన ఈమె విషయంలో రచయిత్రి చూపదలుచుకున్నట్లు అనిపిస్తోంది. విలువిద్యలో అంత నిష్ణాతుడైనవాడు ఈ కుటీరంలో గడుపుతున్నాడంటే ఏదో బలీయమైన కారణమే ఉండి ఉంటుంది. అందుకే ఇక్కడే జీవితం గడుపుతుంది అని నిశ్చయానికి వచ్చినట్లు మనసుని కట్టడి చేసుకుంది. అంటే మనసును అదుపు చేసుకోవడం అనే శక్తి ద్రౌపదికి ఉందని రచయిత్రి సూచించినట్లు కనబడుతోంది.

ఒక భర్తకు ఎంతమంది భార్యలున్నా పర్వాలేదు. అలాంటప్పుడు భార్యకు ఒకరికన్నా ఎక్కువమంది భర్తలుంటే సమాజం ఎందుకు గర్హిస్తుంది. పైగా అసతి, కుటిల లాంటి పదాలతో వళ్ళని ఎందుకు సూచిస్తుంది. అలాంటి విషయాలలో సఖులతో సంభాషణ

వచ్చినప్పుడు కృష్ణ 'సతీస్త్రీ', 'అసతీ నారి' లా, 'సత్య పురుషుడు', 'అసత్యపురుషుడు' వంటి శబ్దాలు పురాణాల్లో ఎందుకులేవు? పురుషులహృదయం బంగారంతోతయరుచేశారా? వారిహృదయాలు పాపంవల్ల మలినంకావా? శాస్త్రజ్ఞులు కేవలం స్త్రీలకోసమే పాపంఅనేశబ్దాన్ని తయారుచేశారా? పుట. 82) అంటూ సమాజం పట్ల స్త్రీలంటే ఉండే అసహనాన్ని నిలదీస్తుంది. ఇది "ఆధునిక స్త్రీకిఉండే పరిణామదశ"లా ద్రౌపది కనిపిస్తుంది.

కౌరవ, పాండవులకు ఏకపంక్తిలో కృష్ణభోజనం వడ్డించాల్సి వస్తుంది. ఆ సందర్భంలో చాలాసార్లు వడ్డనచేసిన కృష్ణ అలసిపోయింది. దుశ్శాసనుడు, 'ఇంకొంచం కావాలి' అంటూ ఎంగిలి చేత్తో ఒకటి రెండుమార్లు కృష్ణని ముట్టుకున్నాడు. చిన్న మరిది అని తలచి అతడి అమర్యాదను క్షమించింది. జయద్రదుడికి క్షీరాన్నం వడ్డిస్తున్నపుడు చిరునవ్వుతో 'మీచేతి వంట ఇంత మధురంగా ఉంది, ఇక మీరు ఎంత మధురమైన వారో కదా!' అంటాడు. దుశ్శాసనుడు జయద్రధుడికి వంత కపులుతూ' ఇక్కడినుండి తిరిగి వెళ్లినతర్వాత దహించుకుపోవల్సిందే. స్వయంవరంలో రూపం మాత్రమే చూసి ఇప్పటికీ దహించుకుపోతున్నాము. ఈ రోజు గుణం, గృహిణీ దక్షతలు చూసి ఆ జ్వాల ఇంకొంత ఎక్కువైంది' అని అంటాడు. ఈ మాటల్లో ఆయా వ్యక్తుల మనస్తత్త్వం సూచిస్తూనే, జ్వాలతో పోల్చడవల్ల కౌరవలు దహించుకుపోతారని సూచించడం ప్రత్యేకత. అతిథి భోజనాది మర్యాదల్ని పాటించడం, కోపాన్ని అణచుకోడం ఈమె క్షమాగుణానికి నిదర్శనాలు.

అర్జునుడు స్వయంవరంలో కృష్ణను గెలుచుకున్నాడు. తల్లి కుంతీ అభీష్టప్రకారం, ద్రౌపది అంగీకారంతో పాండవులు ఆమెను పరిణయమాడాడు. అయితే, పాండవులు పెట్టుకున్న నిబంధనలు అతిక్రమించినందుకు అర్జునుడు దేశ సంచారానికి బయలుదేతాడు. ఆ సందర్భంలో కృష్ణ అతడితో బయలుదేరడం భార్యగా తన ధర్మమని అంటుంది. సీతాదేవితో కృష్ణ, తనను పోల్చుకుంటుంది. దానికి సమాధానంగా అర్జునుడు ఒకే భర్తను కలిగి ఉంటే అనుసరించవచ్చు. కానీ, నీకు అయిదుగురు భర్తలని అంటాడు. దాంతో కృష్ణ బాధ పడుతుంది. తన ఇష్టప్రకారం చేయలేదని, బలహీనతగా ఏడ్వడం లక్షణంకాదని భావించింది.(పుట.138) అర్జునుడే తనభర్తగా భావించడం ఈ సందర్భంలో ప్రత్యేకత. ఏడ్వడం స్త్రీకి బలహీనతగా చెప్పడం, దాన్ని అధిగమించాలన్న సూచన కనబడుతోంది. భర్తే తనని తప్పుగా భావించడం బాధకలిగించే అంశం. ఈ అంశాలు కృష్ణ మనస్తత్త్వాన్ని, అర్జునుడి పట్ల ఉండే ప్రేమని సూచిస్తున్నాయి.

అర్జునుడు పన్నెండేళ్ళ తర్వాత తిరిగి వచ్చినప్పుడు రాజప్రసాదాన్ని అలంకరిస్తారు. ద్రౌపది మనస్సులో ఏదో యవ్వనపు అనుభూతి కలుగుతుంది. విరహం తర్వాత కలుస్తున్నానని ఆనందం పొందుతుంది. ఆ సమయంలో "నన్ను నేను నవవధువులా అలంకరించుకున్నాను. పన్నెండెళ్ళు గడిచిపోయాయనీ, నా మనస్సు అంతే ఎక్కువైందనీ ఫల్గుణుడికి అనిపించ కూడదు" (పుట.163)అని కృష్ణ అనుకోడం, ఆమె మానసికస్థితి, అలంకరణలో నూతనత్వం, మనసుకు ఎప్పటికీ యవ్వనత్వం ఉంటుందని పాఠకుడికి రచయిత్రి సూచించింది.

కృష్ణ తన పాతివ్రత్యాన్ని, సంయమనాన్ని, కృష్ణుడిపట్ల స్నేహతత్త్వాన్ని గొప్పగా భావించింది. "కృష్ణుణ్ణి ప్రేమించడం వలన నా సతీత్వానికి, పతివ్రత్యానికి భంగం కలుగదు. కృష్ణప్రేమ పవిత్రమైనది, అతుల్యమైనది, ఆశ, ప్రత్యాశలకు దూరమైనది. అందువలన నా సతీత్వంపై ప్రపంచంలోని స్త్రీలు అధికశాతం శరీరపరంగా అసతులు కాకపోయినా మానసికంగా అసతులు, ఒకే భర్తకు భార్యగా ఉన్నా ఇతర పురుషులు వారి మనస్సులో అలజడి రేపుతారు. శరీరాలు వేరైనా మానసికంగా వారు పరపురుషుల్తో శయనిస్తారు. కానీ, నా విషయంలో అది జరగదు. యుధిష్ఠిరునితో ఏకాంతంగా ఉన్నప్పుడు నేను అర్జునుడిని కోరుకోను. సంయమనం, కట్టుబాటుతో ఉండేందుకు సాధన చేశాను. మనస్సుని అదుపులో పెట్టడం ప్రపంచంలో అన్నిటికన్నా కష్టతరం" గా భావించినట్లు వివరించడంలో కృష్ణతత్త్వం వ్యక్తమౌతుంది. సాధన చేస్తే, సాధించలేనిది లేదు అని నిరూపించిన ఆదర్శ పాత్రగా కృష్ణని చూడొచ్చు.

వనవసానికి కృష్ణ వెళ్ళాల్సిన సందర్భంలో ఆభరణాలతో బయలుదేరుతుంది. దుశ్శాసనుడు దారిలో తీయించేస్తాడు. ఆ తర్వాత కర్ణుడి భార్య 'రుతుమతి' ఆభరణాలతో దారిలో ఉంచి, వాటిని అలంకరించుకోమని కర్ణుడి మాటగా కృష్ణకు చెబుతుంది. ఈ ఆభరణాలంతా కర్ణుడి కష్టార్జితమని వివరిస్తుంది. కానీ, ద్రౌపది వాటిని స్వీకరించక కర్ణుడి రాజకిరీటం పాపాత్ముడు దుర్యోధనుడి దానంవల్ల స్వీకరించడంలేదని, సమయం వచ్చినప్పుడు కర్ణుడిదానగుణంతప్పక పరీక్షించాలని అనుకుంటుంది. ఈ విషయాన్ని జ్ఞాపకముంచుకుంటానని, అతడికి కృతజ్ఞతలు చెబుతుంది. ఇది కర్ణుడిమీద ఎలాంటి ద్వేషం ఉంచుకోనని కుంతికిచ్చిన మాటవల్ల[4] ఇలా ప్రవర్తించింది. పై అంశాలవల్ల మాట తప్పని స్థితి, పెద్దలపట్ల ఉండే గౌరవం, కర్ణుడి చేసే సహాయానికి కృతజ్ఞతలు చెప్పడం ఆమె సంస్కారాన్ని సూచిస్తున్నాయి.

చివరిదశలో సఖుడిగా భావించిన కృష్ణుడికి తనకోసం ఏమీ అడగను. ఈ సందర్భంలోసుందర భూమికోసం అడుగుతున్నానని అయిదు కోర్కెలు[5] కోరడం ఈమెలోని ప్రేమకు పరాకాష్ట.

కృష్ణుడి పాత్ర విషయంలో రచయిత్రి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు కనిపిస్తోంది. పైగా మోహన మంత్రం తెలిసినట్లు సమ్మోహితుల్ని చేయడం కృష్ణుడి మనస్తత్వంగా కనిపిస్తుంది. ద్రౌపది స్వయంవరానికిముందు కృష్ణుడు ద్రౌపది దగ్గరికివచ్చాడు. పాండవులు మరణించారన్న వార్త అప్పటికే ప్రచారంలో ఉంది. ద్రౌపది అర్జునుణ్ణి వరించాలనుకున్నంత మాత్రమే వారికి ఉపద్రవం కలిగిందని ద్రౌపది బాధపడుతుంది. కృష్ణుడికి ప్రణామం

[4] కుంతీమాత నాచేత ప్రమాణం చేయించింది, తన ధర్మపుత్రుడిపై ఎటువంటి విద్వేషమూ ఉంచుకోనని. నేను మాత మాటను ఎన్నడూ జవదాటను. ఆమె మాటమీదనే నేను అయిదుగురు భర్తలను స్వీకరించాను. అందుకే కురు సభలో కర్ణుడు నన్ను నిందించినా నేను సిగ్గు పడలేదని ద్రౌపది కర్ణుడి భార్య రుతుమతికి వివరిస్తుంది(పుట. 211)

[5] ద్రౌపది అయిదు కోర్కెలు యాజ్ఞసేనినవలలో మార్పులు- చేర్పులు అధ్యాయంలో వివరిస్తాను. దీనికి సంబంధించిన సమాచారం యాజ్ఞసేనినవలలో (పుట.317-318 లలో) ఉంది.

చేసింది. కృష్ణుడు నవ్వుతూ, 'నీ భక్తి భావంకన్నా నీమోహంలోని అభిమానభావం నాకు ఎక్కువ ప్రీతికరం. కృష్ణా! నిర్మలమైన అభిమానం నీ మోహానికి కొత్త అందాలిస్తుందని నీకు తెలియదు. పాండవులకు సంభవించిన దుర్ఘటన నిజమైనా, కాకపోయినా ఈ దారుణ మైన వార్తను నేను వినిపించి ఉండకపోతే నీమోహంలోని అనుపమ సుందరమైన ఈ భావంనుండి నేను వంచితుడునై ఉండేవాణ్ణి. నీముఖశోభ చూసినతర్వాత పాండవులను కోల్పోయినదుఃఖాన్ని నేను మరిచి పోయాను'(పుట. 37) అని అన్నాడు. ఈ మాటల్లో పాండవులకు తగిన వధువునువ్వే తప్పక వాళ్ళు నిన్ను చేపట్టడానికి వస్తారని ద్రౌపది మనసును హత్తుకొనేలా మాట్లాడడం కృష్ణుడి వ్యక్తిత్వం.

కృష్ణుడు తను ఎంత సఖ్యతతో కృష్ణను రక్షించాడో వివరించడానికి కామ్యకవనలోని సన్నివేశం చాలు. అర్జునుడు దివ్యాస్త్రాలు సంపాదించడానికి తపస్సుకు వెళ్లిపోయాడు. కామ్యక వనంలో చాలాసార్లు కృష్ణకు కనిపించాడు. అతణ్ణి అర్జునుడిగానే కృష్ణ భావించింది. అది నిజానికి కృష్ణుడు. భీముడికి అర్జునుడు వచ్చినట్లు కూడా చెప్పింది. అదంతా భ్రమగా రచయిత్రి తెల్పింది. చివరకు కృష్ణుడు వచ్చి, తనే కృష్ణకు దగ్గరగా ఉన్నట్లు ఆమె భావనలు చెప్పడం ప్రత్యేకతగా కనిపిస్తాయి (పుట. 249-250).

కృష్ణ తత్త్వాన్ని అద్భుతంగా రచయిత్రి వివరించారు- "నా దౌర్బల్యం స్వర్గ, మర్త్య, పాతాళాలలో పరివ్యాప్తం. ఈ అనంత విశ్వబ్రహ్మాండంతో ఆడుకోనడమే నా దౌర్బల్యం. నన్ను ఎక్కువగా ప్రేమించిన వారినే ఎక్కువగా అనుతప్తులుగా చేస్తాను. ఎవరినీ నేనెక్కువగా ప్రేమిస్తానో వారినే అధికంగా అపాయం వైపు నెట్టివేస్తాను. 'కృష్ణుడు నావాడు' అని అనుకున్నవారివద్దనుండి నేను మాయం అవుతాను. 'నేను కృష్ణుడికి చెందినట్లు' అని అనుకున్నవారి వద్ద బంధీనవుతాను... నేను సృష్టించినవారినే విచ్ఛిన్నం చేస్తాను- అదే నాకు ఆనందం"(పుట. 298) ఇదంతా విశ్వ తత్త్వాన్ని, విశ్వకారకత్వాన్ని తెలుపుతోంది. భగవంతుడు ఎక్కువ ఇష్టపడడంవల్లే ద్రౌపది కష్టాలు పడిందని రచయిత్రి సూచించింది. ఇది భవంతుని లీలల సూక్ష్మ వివరణ.

పైన వివరించిన నవలలోని కల్పితపాత్రలు ఆయాసందర్భాలలో కథను నడిపించడానికి దోహదం చేసాయి. మహాభారతంలోని ఉన్న పాత్రల్ని రచయితలు కొద్ది మార్పులు చేసారు. అయితే కొన్నిపేర్లు మహాభారతంలోవే తీసుకున్నారు అని గమనించాలి. ఈ నవలల్లోని ప్రత్యేకత కేవలం స్త్రీ పాత్రల పేర్లు శీర్షికగా పెట్టినందువల్ల వాటిని రచయిత తీసుకొనే వైశిష్ట్యాన్ని ఆధారంగా ఈ అధ్యాయంలో పేర్కొనడం జరిగింది. స్త్రీ పాత్రలు లాగే పురుషపాత్రలు ప్రధానంగా శీర్షికగా పెట్టిన నవల ఉన్నాయి. వాటిని తరువాత అధ్యాయంలో వివరించడం జరుగుతోంది.

# అధ్యాయం- 3

# 3

## 3. పురుషపాత్ర ప్రధాన నవలలు -పాత్రల పరిచయం-పాత్రచిత్రణ

### 3. 0. ఉపోద్ఘాతం :-

భారతకథ ఆధారంగా వచ్చిన నవలలో పురుష పాత్ర ప్రధానంగా ఉన్న నవలల్లోని పాత్రలు, వాటి చిత్రణ ఈ అధ్యాయంలో వివరించడం జరుగుతుంది. అంటే పురుషపాత్రలలోని మానవీయకోణం ప్రధానంగా ఈ నవలల్లో కనిపిస్తుంది. '*యయాతి*', '*చతురస్రం*', '*ప్రచ్ఛన్నపాండవం*', '*ఇంద్ర సింహాసనం*', '*రాజసూయము*' నవలలు ఈ విభాగంలోకి వస్తాయి.

ముఖ్యంగా యయాతి, చతురస్రం నవలలో ఉన్న కథ యయాతికి సంబంధించింది. అయితే యయాతినవలలో ప్రత్యేకంగా ఉన్న అంశాలు చతురస్రంలో లేవు. అలాగే కల్పిత పాత్రలు వాటి ప్రాధాన్యత విశ్లేషించదగినంతగా లేవు. అందుకే చతురస్రం నవలకు సంబంధించిన అంశాలు ఈ విభాగంలో చర్చించడంలేదు. ప్రచ్ఛన్న పాండవము నవలలో పాండవుల అజ్ఞాతవాసం కథ ఉంది. అందులో మూలానుసరణ మాత్రమే చాలా వరకు ఉంది. ప్రత్యేకంగా వివరించవలసిన అంశాలు మొదటి అధ్యాయంలో వివరించడం జరిగింది. అయినప్పటికి భారతకథని నవలగా రావడానికి ముందటిస్థితిగా దీన్ని చెప్పవచ్చు. అక్కడక్కడ చిన్న చిన్న వర్ణనలున్నప్పటికి వాటిలో విశేషమైన కథాసూచనాంశాలులేవు. కాబట్టి ఈ నవలని ఈ విభాగంలో విశ్లేషించడంలేదు.

'*ఇంద్ర సింహసనం*' లో ప్రధానపాత్ర ఇంద్రుడిదే. అయితే అది అంతర్గతంగా ఉంటుంది. ఇంద్రాణి పాత్రకు ప్రాధాన్యం ఉన్నప్పటికీ శీర్షిక దృష్ట్యా, కథా సంవిధానం దృష్ట్యా పురుషపాత్ర ప్రధాన నవలలో పేర్కొవడం జరిగింది. 'రాజసూయము' నవలలో ప్రధానాంశం 'రాజు యాగం చేయడం'. ఈ సందర్భంలో ధర్మరాజు యాగం చేసాడు, కాబట్టి దీన్ని ఈ విభాగంలో చేర్చడమైంది.

### 3. 1. *యయాతి* నవల పాత్రల పరిచయం :-

### 3. 1. 1. భారతంలోని పాత్రలు :-

### 3. 1. 1. 1. యయాతి :-

కథానాయకుడు. నహుషుడి కుమారుడు. హస్తినాపురానికి యువరాజు. తండ్రి మరణానంతరం రాజు అవుతాడు. ఇతని అన్న 'యాతి/యతి'. యాతిని వెదుకుతూ ఉన్నప్పుడు దేవయాని పరిచయమవుతుంది. ఆమెను వివాహం చేసుకుంటాడు. ఇతడికి దేవయానివల్ల 'యయు' పుట్టాడు. శర్మిష్ఠ దేవయానికి దాసిగా వచ్చి, యయాతిని లోబరుకుంటుంది. తర్వాత ఆమెకు 'పురు' పుడతాడు. యయాతి శర్మిష్ఠతో సంగమించిన సంగతి దేవయాని తెలిసిపోతుంది. తర్వాత యయాతి శరిష్ఠని తప్పించాలని ప్రయత్నం చేయడంవల్ల పద్దెమిదేళ్ళు శర్మిష్ఠతో ఎడబాటు కలుగుతోంది.

అప్పుడే అయాసంతో వచ్చిన శుక్రుడికి, దేవయాని యయాతి విషయంచెప్పేసరికి విపరీతమైన కోపంవచ్చి, యయాతి అలా ప్రవర్తించడానికి కారణం యవ్వనం అని భావిస్తాడు. అందుకే యయాతిని శుక్రాచార్యులు ముసలివాడిగా పొమ్మని శపిస్తాడు. కచుడు వచ్చి శాపవిమోచనం చేస్తాడు. చివరికి 'పురు' కి రాజ్యం పట్టంగట్టి యయాతి వానప్రస్థానికి వెళ్లిపోతాడు.

### 3. 1. 1. 2. దేవయాని :-

శుక్రాచార్యుల కూతురు. అందగత్తె కూడా. కచుణ్ణి ప్రేమిస్తుంది. కచుణ్ణి రాక్షసులు చంపినప్పుడు దేయాని అతణ్ణి బతికించమని శుక్రాచార్యుణ్ణి పదేపదే అడుగుతుంది. చివరకు రాక్షసులు కచుణ్ణి చంపి, కాల్చి, సురలో ఆ బూడిదని కలిపి శుక్రాచార్యులకిచ్చేస్తారు. అతడు ఆ సురను తాగేస్తాడు. మృత సంజీవని విద్యద్వారా పొట్టలో ఉన్న కచుణ్ణి బతికించి అతడికి పొట్టలో ఉన్నప్పుడే మృతసంజీవని విద్యను నేర్పుతాడు. దేవయాని తన ప్రేమని కచుడికి చెబుతుంది. కచుడు ఇద్దరం ఏకోదరులమని దేవయాని ప్రేమను తిరస్కరిస్తాడు. 'నీవు నేర్చుకున్న విద్య నీకు ఉపయోగపడకుండుగాక' అని దేవయాని శపిస్తుంది. 'నీకు మునికుమారుడు వరుడుగా రాకుండుగాక' అని కచుడు ప్రతిశాపమిస్తాడు.

దేవయాని శర్మిష్ఠతో జలక్రీడకోసం అడవికి వెళ్తుంది. మార్గమధ్యంలో తగువులాట వల్ల నూతిలో పడిపోతుంది. యయాతి రక్షిస్తాడు. దేవయానిని యయాతి పెళ్ళి చేసుకుంటాడు. చివరకు దేవయాని యయాతి మీద అతడు ఆశించిన ప్రేమ చూపక పోడంతో బాధపడతాడు. యయుడికి సాయంచేసిన  శర్మిష్ఠ కొడుకు 'పురు' వచ్చాక ఈమెలో మార్పు వస్తుంది.

### 3. 1. 1. 3. శర్మిష్ఠ :-

వృషపర్వుడి కూతురు. వృషపర్వుడు రాక్షసరాజు. దేవయాని కోపానికి బలై, ఆమెకు దాసిగా, శర్మిష్ఠ జీవనం కొన్నాళ్లు చేస్తుంది.  యయాతిని పొంది తద్వారా పురుని కొడుకుగా పొందుతుంది. చాలా కష్టాలు పడి చివరకు పద్దెనిమిదేళ్ళ విరామం తర్వాత, యయాతి దగ్గరకు వచ్చి 'పురు' ని రాజుగా చూస్తుంది. త్యాగశీలి. ప్రేమామృతమైన పాత్ర. కష్టాల్ని ఓర్చుకునే పాత్రగా కనిపిస్తోంది.

### 3. 1. 1. 4. వృషపర్వుడు :-

రాక్షసరాజ్యానికి రాజు. దేవయానిని శర్మిష్ఠ నూతిలో తోసేసిందని, దానికి ప్రతిగా దాసిగా జీవితాంతం ఉండాలనే దేవయాని కోరికనుతీర్చడానికి ఏంచేయాలో తేలుకోలేకపోతాడు. చివరకు ఆ విషయాన్ని ఉత్తరం ద్వారా శర్మిష్ఠకు తెలియజేస్తాడు. శర్మిష్ఠను త్యాగశీలిగా పొగడుతాడు. ప్రేమతో పెంచిన కుమార్తెమీద దిగులు పెట్టుకుంటాడు. శర్మిష్ఠ, వృషపర్వుడి బాధని అర్థంచేసుకొని, 'విజయానికి వెళ్ళిన కుమారుడి'గా తనను వర్ణించుకొని తండ్రికి కలిగిన బాధని తొలగిస్తుంది.

### 3. 1. 1. 5. శుక్రాచార్యులు :-

రాక్షసుల గురువు. మృతసంజీవనివిద్య ద్వారా రాక్షసుల్ని బతికించి యుద్ధంలో దేవతల్ని ఓడించడానికి సహాయపడిన గురువు. ఈయన దగ్గర మృతసంజీవని విద్య నేర్చుకోడానికి కచుడు వస్తాడు. కచుడు ఆ విద్య నేర్చుకున్న తర్వాత దేవతలు రాక్షసులతో సమానబలం కలిగిన వారవుతారు. చివరకు శుక్రుడు అంతకన్న గొప్పవిద్యనేర్చుకోవాలని ప్రయత్నించి, వృద్ధాప్యాన్ని శపించగల వరాన్ని సంపాదిస్తాడు. దీంతోనే యయాతిని శపిస్తాడు. ఇతడి కూతురు దేవయాని ఈ శాపాన్నే విని భయపడి, శాపాన్ని ఉపసంహరించుకోమని కోరుతుంది. దాంతో కోపంవచ్చిన శుక్రాచార్యులు నీవల్లే నా దివ్యమైన మృతసంజీవని దివ్యవిద్యను పోగొట్టుకున్నానని ఆక్రోశంతో వెళ్లిపోతాడు.

### 3. 1. 1. 6. కచుడు :-

అంగీరసమహాముని ఆశ్రమంలో విద్యని నేర్చుకున్నాడు. ఇక్కడే యయాతితో పరిచయమై, మంచి మిత్రుడయ్యాడు. తర్వాత దేవతలకోసం శుక్రుడి దగ్గర మృతసంజీవని విద్యను నేర్చుకుంటాడు. దేవయాని తన్ను ప్రేమించిందని తెల్సుకొని అది తప్పు అని తేల్చి, దేవలోకానికి వెళ్లిపోయాడు. శుక్రచార్యుడు మళ్ళీ దివ్యమైన వరాన్ని పొందాలని మళ్ళీ తపస్సు చేస్తాడు. వృద్ధాప్యాన్ని పోగొట్టే వరాన్ని సంపాదిస్తాడు. దీనివల్ల యయాతి కొడుకు 'పురు'ని యువకుడిగా మారుస్తాడు. పిచ్చివాడిగా ఉన్న 'యతి' ని మంచివాడిగా అంతకు ముందే కచుడు మారుస్తాడు.

### 3. 1. 1. 7. నహుషుడు :-

యయాతి తండ్రి. దేవలోకంమీదకు యుద్ధానికి వెళ్లి ఇంద్రుణ్ణి జయించినవాడు. దేవలోకంలో ఇంద్రాణిమీద కోరికతో ఆమెను చేపట్టదలచాడు. మునులవాహనంగా ఆమె అంతఃపురానికి బయలుదేరాడు. మునులు బిగబెట్టుకొని కొంతసేపు నడిచారు. రత్నపల్లకిలో మునులు నెమ్మదిగా తీసుకెళ్లడం కోపం తెప్పించి, తలపై గట్టిగా తన్ని 'సర్ప' అంటూ త్వరగా పదమని అన్నాడు(పుట. 109).

ఆ తాపు తిన్నవాడే అగస్త్యముని. అతడే నహుషుడి కొడుకులు ఎప్పుడూ సుఖంగా ఉండరని శాపమిచ్చాడు. దారిలో అగస్త్యుడు వేసిన ప్రశ్నకు సరియైన సమాధానం చెప్పలేక చివరకు శాపానికి గురౌతాడు అని మూలంలో ఉంది.[1]

---

[1] నహుషుణ్ణి మోస్తూ, అలసటతో ఉన్న మునులు నహుషుణ్ణి ఒక సంశయాన్ని అడిగారు. 'బ్రహ్మ ఉపదేశించినవైన, గోవులతో ప్రోక్షించేవి అయిన ఈ మంత్రాలు నీకు ప్రమాణమా? కావా?' అని అడిగితే అజ్ఞానంవల్ల నహుషుడు బుద్ధికోల్పోయి, ప్రమాణాలు కావని అన్నాడు. దాంతో అగస్త్యుడు అధర్మంలో నడుస్తున్నావు. ధర్మాన్ని తెలుసుకోకున్నావు. పూర్వం మహర్షులు చెప్పిన ఈ విషయం మాకు ప్రమాణం. అని మునులు వాదులాడుతుండగా, అధర్మం హింసించడం వల్ల నహుషుడు, అగస్త్యుణ్ని కాలితో తన్నాడు. దానివల్ల తేజస్సు నశించింది. చివరకు పుణ్యం పోయి భూలోకంలో పదివేల సంవత్సరాలు పాముగా ఉండమని చెప్పినట్లు ఉంది. దీన్ని అగస్త్యుడు ఇంద్రుడికి చెప్పాడు.

### 3. 1. 1. 8. యతి/యాతి :-

యయాతి అన్న. చిన్నప్పుడు ఋష్యాశ్రమంలో ఉండగా నహుషుడి వంశంలో ఉన్న రాజులకు సుఖం ఉండదు అన్న అని విషయాన్ని విని తల్లికి చెప్పకుండా పారిపోయి, సన్యసించాడు. చాలా సంవత్సరాల తర్వాత యయాతికి కనిపించాడు. తండ్రి మరణించిన సమయంలో యయాతి, 'యతి' ని చూసానని తల్లికి చెప్పాడు. చివరకు యాతికి పిచ్చి పడుతుంది. కచుడిసాయంతో మళ్లీ మామూలు వాడిగా మారిపోతాడు. శర్మిష్ఠని కాపాడుతాడు.

### 3. 1. 1. 9. యయుడు :-

దేవయానికి యయాతికి పుట్టిన కొడుకు. ఇతడు పుట్టేక దేవయాని యయాతిని నిర్లక్ష్యం చేసింది. యయుడు పెద్దయ్యాక యుద్ధంలో శత్రువులకి బంధీ అవుతాడు. పురువచ్చి యయుణ్ణి విడిపించి, హస్తినాపురానికి విజేతగా తీసుకువస్తాడు. శాపవశాన తండ్రికి వచ్చిన వృద్ధాప్యాన్ని స్వీకరించడానికి సిద్ధపడడు.

### 3. 1. 1. 10. పురుడు :-

శర్మిష్ఠ యయాతికి పుట్టినవాడు. శర్మిష్ఠకు యయాతికి పుట్టడంవల్ల చాలా కాలం లోకానికి తెలియడు. కానీ, దేవయాని తన దాసి వల్ల శర్మిష్ఠ సంతానం గురించి తెలుసుకొని ఆమెను భూగృహంలో బంధిస్తుంది. యయాతి విషయం తెలుసుకొని ఆమెను మాధవుడి సాయంతో నగర సరిహద్దులు దాటించమని పంపిస్తాడు. పద్దెనిమిది సంవత్సరాలు నానా కష్టాలుపడి శర్మిష్ఠ పురుణ్ణి పెంచుతుంది. ఉత్తరప్రాంత సరిహద్దుల్లో జరిగిన తిరుగుబాట్లను అణచడానికి వచ్చిన యయాతికి తను ఆయన కుమారుడిగా వివరించి, యయాతికి శుక్రుడి శాపంవల్ల వచ్చినవృద్ధాప్యాన్ని స్వీకరిస్తాడు. చివరకి తనప్రేమతో పెద్దతల్లి(సవతి తల్లి) దేవయాని మనసుని మార్చుతాడు. తండ్రి ఆశీర్వాదాన్ని, ప్రేమని పొందుతాడు.

### 3. 1. 1. 11. రాజమాత :-

నహుషుడి భార్య. యతి, యయాతులకి తల్లి. యతి చిన్నప్పుడు అరణ్యలోకి వెళ్లిపోయాడు. అప్పటినుంచి అతడిగురించి బాధపడుతుండేది. అదే విధంగా యయాతి కూడా వెళ్లిపోతాడని భయపడేది. అందుకే యయాతి దగ్గర సన్యసించనని మాటతీసుకుంది. తన భర్త నహుషుడు కామవాంఛవల్లే శాపం పొందాడని, అది మితిమీరి ఉండకూడదని భావిస్తుంది.

దాసి కూతురు 'అలక' యయాతికి దగ్గరకావడాన్ని భరించలేక, ఆమెకు విషంఇచ్చి, ప్రాణాలు తీయడానికైన రాజమాత వెనుకాడలేదు. యయాతి దేవయాని పెళ్ళి చేసుకొంటాడు. శర్మిష్ఠని దేవయాని దాసిగా తీసుకువస్తుంది. శర్మిష్ఠ రాజకూతురు అవడం వల్ల రాజమాతకు ఇష్టం. దేవయాని బ్రాహ్మణ కన్య అవడంవల్ల ఈమె ఇష్టపడేదికాదు. చివరకు ఈమె కచుడి మాటలకు ఆనందించి అతడితోనే వానప్రస్థానానికి వెళ్ళిపోయింది.

### 3. 1. 2. ఈ రచయిత కల్పించిన పాత్రలు :-

#### 3. 1. 2. 1. అలక :-

ఈమె కలికి కూతురు. కలిక అంతఃపుర దాసి. యయాతికి చిన్నప్పుడు పాలిచ్చి పెంచిన దాసి. అలకకి యుక్తవయస్సు రాగానే అంతఃపురానికి ఒక్కోసారి వస్తుండేది. ఓసారి యయాతికి సేవలు చేస్తూ ఉన్నప్పుడు యయాతి ఈమెని చూసి ఆకర్షితుడౌతాడు. .

యయాతి సురని త్రాగించిన గుర్రాన్ని అదుపు చేస్తున్న సమయంలో దానిపైనుండి పడి అస్వస్థతకు గురౌతాడు. ఆ సమయంలో అలక యయాతికి సేవచేస్తుంది. ఆమె కొప్పులో పెట్టుకున్న మల్లెలు యయాతికి కామవాంఛకు లోనుచేస్తాయి. ఆమెతో ఆనందాన్ని అనుభవిస్తాడు. ఆ విషయం తెలుసుకున్న రాజమాత అలక పెద్దమ్మ ఇంటికి పంపించేసి, అక్కడనే ఉండేలా చర్యలు తీసుకుంటుంది. కొద్దిరోజులకే ఆమెను హిమాలయప్రాంతానికి కలికి తీసుకెళ్ళిపోతుంది.

అలక ఆత్మహత్య చేసుకోవాలని ప్రవాహంలో దూకింది. ఆ సమయంలో యయాతి అరణ్య ప్రాంతంలో ఉన్నాడు. ఆమెను రక్షిస్తాడు. అప్పుడు ఆమె అత్మహత్యకు కారణాల్ని చెబుతుంది. ఆమెను సోదరిగా గ్రహించి అంతఃపురానికి తీసుకెళ్తాడు. యయాతి దాసికి దగ్గరవడంగా భావించి రాజమాత అలకని బంధించి, విషం పెట్టిస్తుంది. చివరి క్షణాల్లో ఆమె దగ్గరికి యయాతి వెళ్ళి తన పెదాలతో ఆమెను స్పృశించాడు. యయాతి కౌగలిలో ఈమె తనువు చాలిస్తుంది.

హిమలయప్రాంతంలో ఇంకో అలక ఉంటుంది. శర్మిష్ఠ హిమలయప్రాంతంలో ఉన్నప్పుడు ఈ అలకను చేరదీస్తుంది. పురుడు, అలక ఒకరినొకరు ప్రేమించుకుంటారు. ఈమెకు కూడా బంగారు రంగున్న తల వెంట్రుకలు ఉటాయి. పురు విజయోత్సాహ సమయంలో హస్తినకు శర్మిష్ఠతో వస్తుంది. శర్మిష్ఠ అలకలు జనకోలాహలంవల్ల విడిపోతారు. ఈ అలక గురుమహరాజ్‌కు దొరికి పోతుంది. గురుమహరాజ్ (మందారుడు) ఈమెకి మత్తుమందు ఇచ్చి, యయాతి దగ్గరికి పంపుతాడు. ఈమెకి మత్తు దిగేలోపే పురు రావడం తండ్రి యయాతి వృద్ధాప్యాన్ని స్వీకరించడం జరుగుతుంది. చివరకు పురు ఈమెని స్వీకరిస్తాడు.

#### 3. 1. 2. 2. మందారుడు :-

యయాతికి ఆంతరంగిక సైనికుడు. యతిని వెదుకుతున్నప్పుడు దారిలో అలకని యయాతి రక్షిస్తాడు. వాళ్లిద్దరికి జరిగిన దగ్గరితనాన్ని వక్రంగా చిత్రించి రాజమాతకు వివరిస్తాడు. తద్వారా అలక మరణానికి పూర్వరంగమౌతాడు. రాజమాత వానప్రస్థానానికి వెళ్ళిన తరువాత ఇతడు గురుమహరాజుగా పేరు మార్చుకొని, స్వామిగా చెలామణి అవుతాడు. అందమైన అమ్మాయిల్ని తారుస్తాడు. మద్యం, మదిరాక్షి ఆనందమైన అంశాలుగా గుర్తిస్తాడు. దీనిలోనే 'భోగం' ఉందని బోధిస్తాడు. ఇలా మకుళిక, తారక, మాధవి మొదలైన వారిని వ్యభిచరింపచేసి, వారి మరణానికి కూడా కారకుడౌతాడు.

### 3. 1. 2. 3. మాధవుడు :-

యయాతికి మిత్రుడు. శర్మిష్ఠను నగరం దాటించడానికి సహకరిస్తాడు. వర్షంలో బాగా తడిసి అనారోగ్యంతో బాధపడుతూ మరణిస్తాడు. మంచిమాటకారి. ఇతడు శర్మిష్ఠ, పురులని వదలి వచ్చిన తర్వాత అవే కలవరింతలతోమంచం పట్టి మరణిస్తాడు. ఇతడి మేనకోడలు తారక. ఇతడు మాధవిని పెళ్ళి చేసుకోవాలని అనుకుంటాడు. కాని జ్వరంతో మాధవుడు మరణిచడంవల్ల, రాజాదరణ పొందకపోడంవల్ల ఇతడి కుటుంబం వీధినపడుతుంది.

### 3. 1. 11. 4. తారక :-

మాధవుడి ముద్దుల మేనకోడలు. చిన్నప్పుడు యయాతితో ఆడుకోడంవల్ల యయాతికి ఆనందాన్నిచ్చింది. తారక బొమ్మల పెళ్లికొడుకుగా యయాతిని ఉండమని బతిమాలుతుంది. మాధవుడు మరణించాక, గురుమహరాజ్ చేతిలో పడి మానాన్నికోల్పోయి, పిచ్చిదై చివరకు ప్రాణాల్ని కోల్పోతుంది.

### 3. 1. 2. 5. ముకులిక :-

అంతఃపుర దాసి. ఈమె అందానికి యయాతి దాసుడౌతాడు తర్వాత అనుభవిస్తాడు. పాతిక సంవత్సరాలవయస్సు ఉంటుంది. రాజమాతకి వీరిద్దరి విషయం తెలిసి ఈమెని వెళ్ళగొడుతుంది. చివరకు గురుమహరాజ్‌కు సహకరిస్తూ ఉంటుంది. మాధవుడు అనారోగ్యంతో ఉన్నప్పుడు అతడికి సేవలు చేస్తుంది.

### 3. 1. 2. 6. అంగీరసుడు :-

ఇతడు ఒక ఋషి. శాంతి యజ్ఞాన్ని సంకల్పించాడు. అది దేదానవుల యుద్ధం చేస్తున్న సమయం. కచుడు ఆ యజ్ఞానికి ప్రధాన ఋత్విక్కుడు. కచుడు దేవతలు గురువైన బృహస్పతి కొడుకు. అందువల్ల రాక్షసులు ఈ యాగాన్ని భగ్నంచేయవచ్చని అంగీరసుడు నహుషుడి దగ్గరికి వచ్చి, యాగ రక్షణకు యయాతిని పంపమని అడుగుతాడు. యయాతి వెళ్తాడు. అక్కడే కచుడితో మొదటిసారి పరిచయం, తర్వాత అతడితో స్నేహంగా మారుతుంది.(పుట. 65)

### 3. 1. 2. 7. మాధవి :-

మాధవుడికి కాబోయే భార్య. మాధవుడి ప్రేయసికూడా. మాధవికి ఆడపిల్ల పుడితే మాధవుడే పేరు నిర్ణయించాలి. పిల్లాడు పుడితే మాధవే పేరు నిర్ణయించాలని అనుకుంటారు. పదిహేనుడు/పద్దెనిమిది సంవత్సరాలున్న అందగత్తె. మాధవుడు చనిపోయాక, యయాతి మద్యానికి బానిసైపోతాడు. ముకుళికద్వారా మందు పెట్టి, గురుమహరాజ్ యయాతి దగ్గరికి ఈమెను పంపిస్తారు. యయాతిమత్తుగా తాగి, మాధవి మత్తుమందు మత్తులో ఉన్నప్పుడే చెరబట్టి ఒకరాత్రి గడుపుతాడు. ఈమె మత్తులోకూడా మాధవుడి పేరు తలచుకొంటూనే ఉండేది. మత్తువీడేసరికి, పక్కలో యయాతి కనిపించేసరికి, రాజుని గుర్తుపట్టి, మహారాజా అని కేక పెట్టి పారిపోయింది. మర్నాడు

యమునానదిలో శవమై తేలింది.(పుట.415)

## 3. 2. యయాతి నవలలో పాత్రచిత్రణ :-

యయాతి నవలలో ప్రధానపాత్రలు యయాతి, దేవయాని, శర్మిష్ఠలు. వీరి మనస్సులకు సంబంధించిన విషయాల్ని రచయిత చక్కగా వివరించారు. యయాతి తన కథని చెబుతున్నట్లు ఈ నవలని ప్రారంభించారు. రాజును కథ చెబుతున్నాను కనక వినక్కర్లేదు. రాజవంశంలో పుట్టడం వల్లే రాజునయ్యానని, ఇందులో వింత ఏమీలేదని వివరిస్తాడు. నిజానికి రాజు అవ్వాల్సినవాడు యయాతి అన్న 'యతి'. కానీ అతడు లేకపోడం వల్ల యయాతి రాజయ్యాడు అనే విషయాన్ని ధ్వనింపజేసాడు. చెప్పేకథ ప్రేమకథో కాదో... అంటూ మృత్యువు వరకు ఉన్న అన్ని స్థాయిల్లోని మానవజీవితాన్ని చిత్రించారు. యయాతిలో ఒక ప్రేమికుడు, ఒక కాముకుడు, యుద్ధవీరుడు, స్త్రీలోలుడు, విరక్తుడు, మదిరాలోలుడు. స్నేహితుడుగా కనిపిస్తాడు. వైవిధ్యభరితంగా యయాతి పాత్ర కనిపిస్తోంది.

చిన్నప్పుడు యయాతి దాసి కలిక పాలు తాగాడు. ఆ విషయం తెలుసుకుని అమ్మ (రాజమాత) పాలు ఎందుకు తాగనివ్వలేదని ప్రశ్నిస్తాడు. దానికి సమధానంగా 'పిల్లలకు పాలిస్తే స్త్రీల అందం వదిలి పోతుందంటారు' అని కలిక చెప్తుంది.(పుట.13) దాంతో రాజమాతతో రోజంతా యయాతి మాట్లాడలేదు. దారి తప్పిన మసస్సుతో ఉన్న యయాతి- 'ఋషులు, మునులలాగా శపించే శక్తి నాకుంటే అమ్మను రాయిగా మార్చి వేస్తాను' అని ఆలోచించాడు. (పుట.14) ఎప్పుడైతే ఋషి, మునిలాంటి పదాలు వాడాడో రాజమాతకి భయమేసింది. ఇతడు కూడా పెద్దవాడు యతిలా సన్యాసి అయిపోతాడేమో అని బెంగపెట్టుకొంది. దాంతో యయాతి మనసులోని విషయం తెలియక మథనపడిపోయింది. ఎం చేయాలో తెలియని స్థితి. ఒకపక్క మాతృప్రేమ, మరో వైపు దేశరాజరికపు బాధ్యతలు. అక్కడ రాజమాత పడిన వేదనకు ప్రతిగా ఆమె ఏడ్చేసింది. అయితే ఎందుకు ఏడిచిందో యయాతికి అర్థంకాలేదు. 'నామీద ఎందుకు నాయనా నీకు కోపం? యయా! తల్లిదండ్రుల బాధ పిల్లలెప్పుడూ అర్థంచేసుకోలేరు. నాయనా! నిన్ను అర్థిస్తున్నాను. నువ్వు వాడిలాగా చెయ్యవద్దు'(పుట.15) అంటూ యతిని గురించి, అతడు చిన్నప్పుడే వెళ్ళిపోయిన సంగతులన్నీ చెప్పింది. చిన్నపిల్లల మనస్సును, పెద్దవాళ్ళు పడే ఆవేదనను ఇక్కడ చక్కగా చిత్రించారు.

ద్వంద్వ వైఖరితో ఉన్న మానవుల స్థితి రాజమాత పాత్రలో కనిపిస్తోంది- యయాతి విలువిద్య నేర్చుకొని మూగప్రాణాలమీద బాణాలు వేసి వాటిని చంపి రాజభవనానికి తీసుకువచ్చేవాడు. వాటిని రాజమాతే స్వయంగా యయాతి, నహుషులకు వండి, వడ్డించి తాను కూడా తినేది. అప్పుడు నహుషుడు యయాతిని ప్రశంసించేవాడు. 'ఎప్పుడో, ఎన్నో సంవత్సరాలకిందట మాయమైన కొడుకు(యాతి) గుర్తుకు వస్తేనే తల్లిగా తల్లడిల్లి పోతూ ఉంటుంది. అయితే అదే అమ్మ, ఆ పక్షితల్లి చావును ఎంతో ఆనందంగా చూడగలుగుతుంది. ఆ అమాయకపు పక్షితల్లి శరీరాన్ని ఛేదించిన తన కుమారుణ్ణి విపరీతంగా ప్రశంసిస్తున్నది' (పుట.30) అని వైవిధ్యమైన హృదయావిష్కరణని రచయిత సూచిస్తున్నారు. తనలాంటిదే ఆ

జీవి అని తెలుసుకోవాలని జీవహింసపట్ల ఉండే విధానాన్ని విమర్శిస్తున్నారు.

బాల్యంలో కనే కలలు చాలా వింతగా ఉంటాయి. వాటిని నెరవేర్చుకొనే ప్రయత్నం కొద్దిమందే చేస్తారు. కలలు కనడం, వాటిని నెరవేర్చేందుకు ప్రతినపూనిన వారే గొప్పవాళ్లు అవుతారు. యయాతి బాల్యంలో పూలతో నిండిన పారిజాత వృక్షాన్ని బలంగా ఊపి, ఆ పూలు జలజలా నేలరాలుతూ ఉంటే అంతులేని ఆనందాన్ని పొందేవాడు. ఈ విషయాన్ని యవ్వనంలో అశ్వమేథయాగ సమయంలో వదిలిన ఆ గుర్రాన్ని ఆపి, కట్టిన రాజులతో యుద్ధంచేసి, వారందర్నీ జయించినప్పుడు యయాతి బాల్యంలో చెట్టును ఊపితే వచ్చేంత ఆనందాన్ని అనుభవించినట్లు ముందుగానే రచయిత యయాతికి కలద్వారా సూచించాడు. (పుట.50)

యయాతి యాగాశ్వాన్ని అనుసరిస్తూ, చాలా ప్రదేశాలు తిరిగాడు. ఆ సందర్భంలో ఓసారి గుహలో రతీదేవి బొమ్మను చూసాడు. వచ్చిన సైనికులు బయట ఉండిపోయారు. ఆ బొమ్మవైపు ఎంతోసేపు రెప్పవాల్చకుండా చూస్తూ నిల్చుండిపోయాడు. ఆమె చీరచెంగు జారిపోయింది. ముడివడిన శిరోజాలు వీపున పరుచుకున్నాయి. చూస్తూ చూస్తూ అది ఒక నిర్జీవమైన శిల్పమని మరిచిపోయి, ఆవేశంతో దానిముఖం మీద ముద్దులు కురిపించాడు. చల్లని రాతిస్పర్శతో యయాతిలో ఆవేశం చల్లారిపోయింది. అయినప్పటికీ, ఆ శిల్పసుందరిని ఎన్ని లక్షల సార్లు ముద్దుడినా అతడికి తనివితీరలేదు.(పుట. 53) ఇదంతా యయాతి కామవాంఛను తెలియజేస్తోంది. అందమైన అమ్మాయి మనసుకి నచ్చితే యయాతి ఆవేశాన్ని ఆపుకోలేడు. అందుకే అలకను చేరదీసి ముద్దులు పెట్టుకున్నాడు. ముకుళికతో సంభోగం చేసాడు. శర్మిష్ఠని గర్భవతిగా చేసాడు. మాధవిని తాగిన మత్తులో స్నేహితుడికి భార్య అవ్వాల్సిన ఆమెను కూడా అనుభవించాడు. ఈ భావజాలమంతా అతడి మనస్థితిని ముందుగానే పాఠకుడికి రచయిత సూచిస్తున్నాడు. అయితే దేవయాని విషయంలోతద్భిన్నంగా ఉండడం ఈ పాత్ర విలక్షణత. దానికి కారణం దేవయాని యయాతికంటే ముందు కచుణ్ణి ప్రేమించడం అని పాఠకుడి ఆలోచనకు రచయిత వదిలేసారు. భార్య అయిన దేవయాని ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ ఉండడం, అన్య మనస్కంగా, యయాతిని పట్టించుకోకుండా ఉండడం కారణాలుగా అనిపిస్తాయి.

యయాతి యాగాశ్వం వెంట వెళ్తూ ఉన్నాడు. చిన్న చిన్న అటవిక రాజ్యాల దగ్గర అశ్వం ఆగింది. ఏనుగులు ఎక్కువగా ఉండే ప్రాంతమది. ఏనుగుల్ని ఒంటరిగా వేటాడదామని యయాతి అడవిలోకి వెళ్లాడు. చెట్టెక్కి గమనిస్తూ ఉన్నాడు. జలాశయందగ్గర బుడబుడమని శబ్దం వస్తోంది. అది ఏనుగు నీరు తాగే శబ్దమని యయాతి భావించాడు. శబ్దవేది విద్య తెలిసిన యయాతి బాణం వదిలాడు. 'ఈబాణం వేసిన పాపి ఎవరు? నా ఎదుటకురా, లేదా...?'అని కంఠధ్వని వినిపించింది(పుట.54). వెంటనే యయాతి చెట్టుపైనుంచే క్షమించండి, మునీంద్రా! నావలన గొప్ప తప్పు జరిగిపోయిందని వణుకుతున్న కంఠంతో అరిచాడు. ముని కాళ్ళమీద పడి క్షమించమన్నాడు. పాపాత్ముడి స్పర్శ నాకు వద్దు అంటూ నీవు పవిత్రుడవైతే నాపాదాలు స్పర్శించమని ముని చెప్పాడు. నేను రాజపుత్రుణ్ణి, వేటాడడం నాధర్మం. సంసార సుఖాల్ని త్యజించి, సన్యాసిని కానని నా

తల్లికి మాట ఇచ్చాను. తన సోదరుడు యతి హస్తినాపుర రాజకుమారుడు అని యయాతి మునికి చెప్పాడు. అప్పుడు యోగి యయాతి భుజాన్ని పట్టుకొని కొంతదూరం తీసుకెళ్ళి 'యయాతి, నీ అన్నగా ఆజ్ఞాపిస్తున్నాను. నా వెనుకరా' (పుట. 57) అని మృదువుగా ఆదేశించాడు. అంతవరకూ కర్కశంగా ఉన్నయోగి భుజాన్ని పట్టుకొని రమ్మనడం సోదర ప్రేమను ముందుగానే సూచిస్తున్నట్లనిపిస్తుంది. లోపలికెళ్ళి తను ఎందుకు సన్యాసిగా మారాడో వివరిస్తాడు. ఈ ఇద్దరి సోదరుల మధ్య ఉన్న వైవిధ్యాన్ని ఈ సందర్భంలో గమనించవచ్చు.

ముకుళిక యయాతి కౌగలిలో ఆ రాత్రి బంధీ అయింది. ఆమెను యయాతి తన చేతుల్లోకి తీసుకున్నాక, బాహ్య ప్రపంచంతో సంబంధంలేకుండా పోయింది. అప్పుడు అతడు యువరాజు కాదు, ఆమె దాసీకాదు. ఇద్దరూ ప్రేమైక జీవులు, ప్రేమపక్షుల్లా ఏకమైపోయారు. ఆ అందమైన లోకంలో మధురక్షణాలు గడిపారు. ఆ అనుభవం మత్తులో యయాతి తనను తాను మరిచి పోయాడు. తెల్లవారింది. యథావిధిగా ముకుళిక తలుపులు తెరచి లోపలికి వచ్చి రాత్రి బాగా నిద్ర పట్టిందా? అని అడిగింది. ఇక్కడ కామవాంఛ స్థితిని సూచిస్తూనే ఏమీ జరగనట్లు మాట్లాడడం గోప్యతకు సంకేతం. సంభోగక్రీడను అనుభవించడంవల్ల నిద్రపడుతుంది అని సూచిస్తూనే కామం యొక్క ఆవశ్యకతని వివరిస్తున్నాడు.

ముకుళిక తనఎదుట సిగ్గు పడుతుందని, కళ్ళలో కళ్ళు కలిపినప్పుడు కొద్ది క్షణాలైనా తడబడుతుందని యయాతి అనుకున్నాడు. కానీ, ఏమీ రాత్రి జరగనట్లు తనపనులు ప్రశాంతంగా ముకుళిక చేసుకొంటోంది. పైగా తనవలన ఏమైనా తప్పు జరిగిందా అని వినయంగా ముకుళిక చేతులు జోడించడం ఆమె మహానటిగా యయాతికి కనిపించింది. దాసీ జనజీవితం, వారి పాత్ర తత్త్వాన్ని తెలుసుకొని మసలడం ఈ పాత్ర ప్రత్యేకతను సంతరించుకొంది.(పుట. 88)

రాజమాత విషయంలో ఒక ప్రత్యేకత ఉంది. యయాతి తల్లి, రాజమాత ఆమె భర్త వీరుడు ఇంద్రుణ్ణి ఓడించి పేరు పొందినవాడు. ఈ విషయాన్ని యయాతితో 'బాబూ నీవు పురుషడవు. స్త్రీ బాధ నీవు ఎప్పటికీ అర్థం చేసుకోలేవు. ఒకే వ్యక్తి పట్ల ఎంత ఇష్టంగా ఉన్నా, అతడికి బానిసగా ఉండటం ... ఆమె కొద్ది క్షణాలు ఆగి, ఏడుస్తూ నేను మహారాణిని కాదు యయూ!, మహాదాసిని. ఆయన కనుసైగల్లో జీవితమంతా గడిపాను. కానీ, ఇప్పుడు నేను ఆవిధంగా ఇంక జీవించాను. భర్తపై కంటే కొడుకుమీద తల్లికి అధికారం ఉంటుంది. కొడుకు ఆమె హృదయపు తునక' (పుట 131) అంటూ తనమనసులోని బాధలు చెప్పడం జరిగింది. నహుషుడు ఇంద్రాణిని కోరుకోవడం అసలు భరించలేక పోయింది. స్త్రీ లోలత్వమే అతణ్ణి అథఃపాతాళానికి తీసుకెళ్ళింది. కొడుకుమీద అధికారం చెల్లుతుందని, యయాతి తల్లి అనడంలో దీనత్వం, ప్రేమతత్త్వం మిళితమై పెద్దరికాన్ని గుర్తు చేస్తున్నాయి.

కలిక కూతురు 'అలక'. అంతఃపురదాసి కలిక. హిమాలయపర్వతప్రాంతంలో ఉన్నా అందమైన, దృఢమైన, ధనవంతుడైన రైతుకు అలకనిచ్చి పెళ్ళి చేసారు. కానీ, అతడు జూదరి. జూదంలో సర్వస్వం పోగొట్టుకున్నాడు. అతడి స్నేహితుడు గారడివాడు ఒకడు ఉన్నాడు. ఆ మిత్రుడు సహాయంతో కర్ణపిశాచిని వశం చేసుకొని జూదంలో చాలాసొమ్ము గడించాలని గాలిమేడలు కడుతుండేవాడు. అలక తన భర్తకు బుద్ధులు చెప్తే, అతడి స్నేహితుడు ఆమెను కుక్కలా, మేకలా మార్చేస్తానని ఏవేవో మంత్రాలతో ఈమెను భయపెట్టేవాడు. చివరకు ఈమెను జూదంలో ఒకడికి పణంగా కలికను ఒడ్డి ఓడిపోయాడు. ఈమెను కోరికతో గెలిచినవాడు చూడసాగాడు.

అక్కడినుండి తప్పించుకొని, కలిక ఆత్మహత్య చేసుకోవాలని నదిలో దూకింది. యయాతి ఆమెను రక్షించి సోదరిగా గౌరవిస్తాడు. కానీ, నిద్రాసమయంలో మంత్రతంత్రాలతో కుక్కకా, మేకగా మారిపోయినట్లు కలలు కంటూ భయపడుతూ ఉండేది. 'భూతంముఖం మందారుడిలా ఉంది. ఆమె పడుకున్నప్పుడు అది ఆమెను ముద్దుపెట్టుకోవడానికి ప్రయత్నించింది. ఆమె అల్లరి చేయగా భూతం పారిపోయింది'. (పుట. 143) అలక రాత్రిపూట నాలుగైదుసార్లు అరుస్తూ మేల్కొంటూనే ఉండేది. చివరకు చనిపోయే ముందు యయాతి ఆమెకు ఇచ్చిన కానుక 'ముద్దు' మాత్రమే. అలక విషం తాగిందని, దానికి కారణం మందారుడు, రాజమాత అని తెలుసుకొని యయాతి మథన పడిపోతాడు. ఇక్కడ అలక దుస్థితి, రాజు ఆమెను రక్షించికోలేని పరిస్థితి ఒకవైపు, రాజమాతకు గౌరవం, ప్రతిష్ఠలు మధ్య యయాతి ప్రియమైన అలకను కోల్పోతాడు.

దేవయాని పాత్రలో ప్రతీకార వాంఛ కనిపిస్తోంది. దానికి కారణం ఏది కావాలంటే అది చేసే తత్త్వం, అతిప్రేమఉన్న శుక్రాచార్యులుండటమే. ఈమె కచుణ్ణి ప్రేమించింది. ఆ విషయం అతడితో చెప్పింది. కచుడు తిరస్కరించి, వెళ్ళిపోయాడు. చాలారోజులు దేవయాని కన్నీరుకారుస్తూ, ఆహారం మానేసి, ఉండిపోయింది. తండ్రితో 'సంజీవని విద్య పోతే పోయింది. మరల తపస్సు చేయండి. దేవదేవుడైన శంకరుని ప్రసన్నం చేసుకుని కొత్తవరం పొందండి. నిర్దయుడూ. కపటీ, కృతఘ్నుడైన ఆ కచుణ్ణి నా ముందు నిలపండి ... అతనికి గుణపాఠం నేర్పాలనుంది, నాకు ప్రతీకారం తీర్చుకోవాలని ఉంది' అంటూ కలలో అంటుంది. (పుట.151-152). ఈ మనస్తత్త్వాన్ని కలలో ప్రతిబింబించి దాన్నే ఆలోచిస్తూ ఉంటుంది. అలాగే శర్మిష్ఠమీద కోపంతో శాశ్వతంగా ఆమెను దాసిగా చేసింది.

'కచుడి తల నరకండి. అతని తలనునరికి పళ్ళెంలో ఉంచి, రాజసభకు తీసుకురమ్మనండి. దేవయాని నాట్యంలో ఎంత ప్రవీణురాలో నేను నేడందరికి తెలియజేస్తాను (పుట 153). ఇదంతా ప్రేమ, ద్వేషమా! అంటూ ఆమె వ్యక్తిత్వంలోని అవస్థల్ని రచయిత తెలుపుతున్నాడు.

వృషపర్వుడు రాక్షసరాజ్యానికి రాజు, శర్మిష్ఠకు తండ్రి. శర్మిష్ఠ దేవయానులకు జలక్రీడ సందర్భంలో జరిగిన వివాదంలో, దేవయాని శర్మిష్ఠను దాసిగా ఉండాలని కోరింది. శర్మిష్ఠకు దాసిగా ఉండమని అడగలేకపోయాడు వృషపర్వుడు. అందుకు ఉత్తరం రాసాడు.

'అమ్మా, తండ్రిగా నిన్ను అడుగుతున్నాను, నేను నిన్ను దాసిగా ఉండమని ఎప్పుడూ కోరలేదు' అంటూ ప్రారంభించాడు. (పుట. 178) కచుడు సంజీవని విద్యను నేర్చుకొని పోవడంతో గొప్ప పరాభవం జరిగింది. దానవుడు తిరిగి తలెత్తుకొని నిలబడటానికి, శుక్రాచార్యుల్ని తమ గురువుగా ఉంచుకోవడం తప్పనిసరి అయ్యింది. ఇలా వృషపర్వుడు పడిన వేదనను చిత్రించాడు.

శుక్రుడికి దేవయాని అంటే ఇష్టం. దేవయాని పెట్టిన షరతు- శర్మిష్ఠను దాసిగా చేయడం. ఉల్లంఘించడంవల్ల దేవయానికి కోపం వస్తుంది. ఆ షరతు ఒప్పుకోకపోతే శుక్రాచార్యుడు, దేవయానులు నగరంలో అడుగు పెట్టరు. దానవులు నీచమైన జంతువుల్లాగే భూమి మీద పోరాడవలసిందే. నిన్ను దాసిగా పంపించడం కంటే కళ్లు పొడుసుకోవడమే మంచిది. నీ తండ్రి సమస్యల్లో చిక్కుకొన్నాడు. ఏ దారి కనిపించక ఈ ఉత్తరం రాస్తున్నాడు. నీతో చెప్పలేకే రాసాడు. కర్తవ్యం ప్రేమ చేతిలో ఓడిపోతుంది. 'శమా!, నా ప్రియమైన తల్లి!, నీవు సుఖంగా ఉండే విధంగా నిర్ణయం తీసుకునే బుద్ధి ఆ భగవంతుడైన శంకరుడు నీకు ప్రసాదించుగాక.' (పుట.179) అంటూ ఆవేదనతో వృషపర్వుడు ఉత్తరం వ్రాయడం అతని మనస్తత్వాన్ని కర్తవ్యాన్ని ప్రేమను తెలియజేస్తున్నాయి. నిర్ణయాధికారాన్ని శర్మిష్ఠకే వదిలేయడం, అతడి విజ్ఞతకు మరో ఉదాహరణ. ఇలా తండ్రి కూతురు పట్ల వ్యవహరించవలసిన ఉదాత్తీకరణను సూచిస్తూ, కొన్ని విషయాలలో నిర్ణయాధికారాన్ని పిల్లలకే వదిలేయడం మంచిదనే విషయాన్ని రచయిత సూచించాడు.

అలకను చాలా ఇష్టపడేవాడు యయాతి. కాని శాంతియజ్ఞంలో యయాతి ఉన్నపుడు అలకకు పెళ్ళి చేయడం జరిగింది. అడవిలో మృత్యముఖాన్ని చూసిన అలకను యయాతి రక్షించి తీసుకువచ్చాడు. సోదరిగా గౌరవించాడు. రాజమాత పట్ల అంతకుముందటి యయాతి అలకల ప్రవర్తన కారణంగా రాజమాత ఆమెకు మృత్యుపాశాన్ని విధించింది. దాంతో యయాతికి రాజమాత అంటే విపరీతమైన కోపం వచ్చేది. అలకమరణానికి బదులు తీర్చుకోవాలని అప్పుడే యయాతి నిర్ణయించుకున్నాడు. ఆ సమయంలోనే హిమాలయ ప్రాంతానికి వేటకోసం వెళ్ళాడు.

అక్కడే నూతిలో పడిని దేవయానిని 'సాగర మథనంనుండి పైకి వచ్చిన లక్ష్మిలా' కనిపించడంతో ఆమెను బయటకు తీసాడు. "నేను ఆమె సౌందర్యం చూసే మోహించానా?కాదు!, అమ్మ ఒక క్షత్రియ రాజకన్యను కోడలిగా తెచ్చుకోవాలని ప్రయత్నం చేస్తోంది. ఒక బ్రాహ్మణ ఋషికన్యను కోడలిగా తీసుకెళితే, ఆమె జీవితాంతం వేదనపడుతూనే ఉంటుందని నేను భావించాను. అమాయకురాలైన ఒక ఆడ పిల్లను హత్య చేసినందుకు భగవంతుడు ఎటువంటి శిక్ష విధిస్తాడో ఆమెకు తెలిసి రావాలి అందుకే నేను దేవయానిని స్వీకరించాను." (పుట. 202) అని యయాతి తన మనస్సులో రాజమాత పట్ల కోపాన్ని దేవయానిని స్వీకరించడానికి గల కారణాన్ని తెలిపాడు. ఇది అలకమీద ఉండే అభిమానంతో పాటు, రాజమాత పట్ల ఉండే అధికారాన్ని ప్రశ్నిస్తూ తీసుకున్న నిర్ణయంగా చెప్పవచ్చు. ఇది ఒక పార్శ్వం.

రెండో అంశం యయాతి వంశానికి అగస్త్యుడు పెట్టిన శాపం. దానినుంచి బయటకు రావడానికి మరో మహర్షి ఆశీస్సులు కావాలి. దానికి తగినవాడు శుక్రాచార్యుడు అని భావించి యయాతి దేవయానిని ధర్మపత్నిగా స్వీకరించాడు అని భావించవచ్చు.

దేవయానికి యయాతితో వివాహం వైభవంగా జరిగింది. యాగం చేయాలని అందరు ఋషులకు లేఖలు పంపారు. శుక్రాచార్యుల అభీష్టసిద్ధియాగం చేయాలని దేవయాని పట్టుబట్టింది. కచుడికి కూడా ఆహ్వానం పంపాలని ప్రత్యేకంగా చెప్పడం, దేవయాని నిద్రల్లో కచుడు గురించిన సంభాషణలుగా కలవరిస్తూ ఉండడం, యయాతికి విపరీతంగా తోచాయి. ఆ రోజుల్లో వీరిద్దరి మధ్యా ఏదో సంబంధం ఉండి ఉంటుంది. అది ప్రణయభావన లేక ఎలాంటి సంబంధం అని యయాతికి కచ, దేవయానుల గురించి ఒక అనుమానం ప్రారంభమయ్యింది. అందుకే కచుణ్ణి యజ్ఞానికి పిలవవలసిన పని లేదనుకున్నాడు. కానీ, శర్మిష్ఠను చూసి ఈ అభాగ్యురాలికి కాస్తైనా ఆనందం కచుణ్ణి చూడ్డం ద్వారా దొరుకుతుందని భావించాడు. ఈ మానసిక సంఘర్షణలే యయాతి శర్మిష్ఠ ఆనందం కోసం కచుణ్ణి పిలవడమే మంచిది అనుకోవడం, దేవయానికి కచుడుకి ఉన్నా సంబంధం మీద అనుమానం రావడంకూడా కనిపిస్తోంది. అయితే శర్మిష్ఠ పట్ల అభిమానానికి ఆమెతో కలవడానికి సూచికగా శర్మిష్ఠవైపే యయాతి మొగ్గు చూపాడని రచయిత వ్యక్తం చేస్తున్నాడు.

కచుడు యాగపరిసమాప్తి రోజున వచ్చి అశోకవనంలో ఉంటాడు. కాని, దేవయానిని కలవడు. దేవయాని కచుడుగురించి చాలా అనుకుంటుంది. "కచుడు తప్పకుండా రావాలి. అతనితో మనస్సు విప్పి మాట్లాడాలని ..... నా యోగక్షేమాలు అడగాలని, తీయగా గతస్మృతులైన సంఘటనలను ఒకరికొకరం గుర్తు చేసుకోవాలి. వాటిని విని నేను వికలమై పోవాలి, నా కళ్ళు చెమర్చాలి. ఆ కన్నీటిలో మహారాణి అయిన దేవయాని ప్రవహించి పోవాలి" (పుట.258) అని భావిస్తుంది. అతడికోసం రకరకాల వస్తువుల్ని తెప్పిస్తుంది. ప్రత్యేకంగా పూలను అమరుస్తుంది. ఈ భావన దేనికి సంబంధించిందో రచయిత చెప్పడు. అయినప్పటికీ, కచుడుమీద ఉండే ప్రత్యేకమైన బంధానికి అది ఒక సూచిక. అది ప్రేమ కావచ్చు, అభిమానమూ కావచ్చు. ఈ అంశం కాసేపు పాఠకుడికి ఉత్కంఠను కలిగిస్తోంది. ఒక రోజు కచుడు దేవయాని మందిరానికి వస్తాడు.

ఆమె ఆతిథ్యం కొంత వరకే స్వీకరిస్తాడు. 'నేను నిన్ను శపించి వెళ్ళిపోయినా, ఇంకా నీవు నన్ను మరచిపోలేదు. అంతేకాక, యజ్ఞానికి కూడా ఆహ్వానం పంపించావు. ఎంతటి భాగ్యం నాది!, ఇంతటి ఉదార స్వభావురాలు నాకు చెల్లెలు కావడం నిజంగా ..... కోపంతో నిన్ను శపించాను, ఘోరమైన అపరాధం జరిగిపోయింది' (పుట. 262) అంటూ హృదయపూర్వకంగా క్షమించమని అడుగుతాడు. దానికి దేవయాని ఆశ్రమంలో ఇలా అంటే వెంటనే పరుగెత్తి వెళ్ళి, అతడి రెండు చేతులూ వేరుచేసి ఉండేది. కాని, ఇప్పుడు యయాతి భార్య. దేవయాని కచుడు పట్ల ఉండే ప్రేమ తత్త్వాన్ని, కచుడికి దేవయాని పట్ల ఉండే సోదరి ప్రేమను తెలియజేస్తున్నాయి. అయినప్పటికీ దేవయానితో కచుడు

శర్మిష్ఠదాస్యాన్ని విముక్తిచేయమని అడిగేసరికి కఠినంగా దేవయాని మారి పోతుంది. ఇది శర్మిష్ఠపట్ల ఆమెకుండే ద్వేషాన్ని, గర్వాన్ని సూచిస్తున్నాయి.

గతంలో జరిగిన మంచి చెడుల్ని మనస్సులో పెట్టుకొని, ప్రేమను, ద్వేషాన్ని చూపించడంలో ఒక ప్రత్యేకత ఈ పాత్రలో కనిపిస్తోంది. ఇలా దేవయాని, రాజమాతలు విభిన్నమైన వ్యక్తిత్వాన్ని కలిగి ఉంటారు. శర్మిష్ఠ ప్రేమమయిగా ఉండటం వల్ల ఆమెకు పుట్టిన పురుకు కూడా ఆ ప్రేమ తత్త్వమే వచ్చినట్లు రచయిత సూచించాడు. దేవయాని గర్వం ఆమె కొడుకుకు వచ్చినట్లు తెలుస్తుంది. శుక్రాచార్యుడు విషయంలో దేవయాని పట్ల ఉండే అమితమైన అవసరంలేని ప్రేమవల్ల ఆమె కుటుంబాన్ని వీధిని పడినట్లు చేయాలి. కానీ, పురు లాంటి వ్యక్తివల్ల జీవితం అద్భుతంగా మారిపోతుందని, పురుని ఆదర్శమైన వ్యక్తిత్వం ఉన్నవాడిగా తెలియజేస్తాడు. ఇలా ఆయా పాత్రల స్వభావాన్ని రచయిత చిత్రించాడు.

## 3. 3. *ఇంద్ర సింహాసనం* పాత్రల పరిచయం :-

ఈ నవలలో పౌరాణికాంశాల్ని ఆధునికాంశాలుగా కనబడేలా పాత్ర చిత్రణ ఒక్కోచోట కనిపిస్తోంది. ప్రధాన పాత్రలు నహుషుడు, యయాతి, ఇంద్రాణి, శర్మిష్ఠలు. ఇంకా వృషపర్వుడు, శుక్రాచార్యులు, జయంతుడు, మేనక, రంభ, నలకూబరుడు మొదలైన చిన్న పాత్రలు ఉన్నాయి.

### 3. 3. 1. ప్రధాన పాత్రలు :-

#### 3. 3. 1. 1. నహుషుడు :-

నూరు యాగాలు చేసినందుకు ఇంద్రపదవిని అలంకరిస్తాడు. వృత్రాసురుణ్ణి సంహరించి నందుకు, అహల్యతో జారత్వం వల్ల ఇంద్రుడు తేజోవిహీనుడౌతాడు. సప్తర్షులు ఇంద్రుణ్ణి ఆ పదవికి అనర్హుడుగా తీర్మానించారు. సింహాసనం నుంచి దింపేసారు. అవమాన భారంతో ఇంద్రుడు స్వర్గంవదిలి పారిపోయాడు. నహుషుడు భూలోకంలో మంచి కీర్తి ప్రతిష్ఠలు సంపాదించుకున్నాడు. సప్త ఋషుల తీర్మానం వల్ల నహుషుడు ఇంద్రుడిగా పదవీస్వీకారం చేసాడు. నహుషుడు ఇంద్ర సింహాసనం అధిష్టించగానే, శచీదేవి మానసికంగా బాధపడింది. కానీ, భూలోకంలో అతడి కీర్తి ప్రతిష్ఠలున్నంతవరకూ, లోకంలో నైతిక విలువలకు ప్రతినిధులు అయిన సప్తర్షుల ఆమోదం ఉన్నంతవరకు నహుషుడు నిరాటకంగా పదవిలో ఉంటాడని ఆలోచించి ఊరుకుంది.

నహుశుడు పదవీస్వీకారంకాగనే అన్ని సంపదలు, అధికారాలు అతడికి సొంతమయ్యాయి. అందుకే ఇంద్రుడి భార్యకూడా తన సొంతమే, అని అనేసుకున్నాడు. ఆమె ఉద్యానవనానికి వెళ్లాడు. నహుషుణ్ణి ఎదురించే శక్తి ఇంద్రాణికి కూడా లేదు. అందుకే ఏమీ మాట్లాడకుండా పెదవులు బిగించి, వయ్యారంగా వెనక్కి చూడకుండా వెళ్ళిపోయింది. నహుషుడు తబ్బిబ్బియిపోయాడు. శచీదేవి ఇంత తేలిగ్గా తనపట్ల సుముఖత చూపుతుందని అనుకోలేదు. మీ దేవిగార్ని జాగ్రత్తగా చూసుకోండని పరచారికలకు చెప్పి, నహుషుడు వెళ్లిపోయాడు.

ఏంచేయాలో పాలుపోక, ఇంద్రాణి నారదుణ్ణి పిలిపించింది. మేనకతో జయంతుడు తిరుగుతున్నాడని ఇంద్రాణి గూఢచారిణులవల్ల తెలుసుకుంది. శుక్రుడి తపోభంగానికి మేనకను బృహస్పతి సూచించగా, నహుషుడు ఆమెనే వెళ్ళమని ఆజ్ఞాపించాడు. కచుడు సభలో 'తను మేనకును ప్రేమిస్తున్నట్లు చెప్పి, పంపడానికి వీల్లేద'ని ప్రశ్నిస్తాడు. ఇంద్రుడిగా ఉన్న నహుషుణ్ణి, జయంతుడు ఎదిరించడాన్ని సహించలేకపోయాడు. కచుణ్ణి యముడి దగ్గరకి విచారణ నిమిత్తం పంపించాడు. శుక్రాచార్యుడి దృష్టిని భరించలేక మేనక వచ్చేసి, అదే విషయాన్ని నహుషుడికి చెప్తుంది. కావాలనే వచ్చేసావని, అప్సరసగా ఉండడానికి పనికి రావని, ఘంటాకర్ణుడనే రాక్షసుడికి అమ్మేస్తాను అని నహుషుడు చెప్తాడు. ఇంద్రాణి సాయంతో మేనక జయంతుణ్ణి వివాహం చేసుకుంటుంది. జయంతుణ్ణి భూలోకానికి పొమ్మని నహుషుడు శిక్ష విధిస్తాడు.

శర్మిష్ఠతో యయాతి తిరుగుతున్నాడని, అతడికి శిక్ష విధించాల్సిన పరిస్థితిలో నహుషుడు బాధపడతాడు. నారదుడి సలహామేరకు యముడితో చెప్పి శిక్షలేకుండా తీర్మానం చేయమని అడుగుతాడు. చేయలేనని యముడు అనేసరికి, అతణ్ణి పదవినుంచి తీసేసి, మరొకర్ని నియమిస్తాడు. ఈ సన్నివేశంలో స్వార్థం కోసం అధికారాన్ని వాడుకోడం కనబడుతుంది. దానికోసం ఎంతటికైనా తెగిస్తారని, స్వప్రయోజనం నెరవేర్చుకోడంకోసం శిక్షల్ని, పరిపాలనా యంత్రాంగాన్ని మార్చుకోవడాన్ని రచయిత్రి విమర్శిస్తున్నారు. ఈ రోజుల్లో రాజకీయనాయకుల్ని వ్యంగ్యంగా సూచిస్తూ విమర్శించడం కనిపిస్తోంది.

నహుషుడు ఇంద్రపదవికి రాగానే సురాపానం చేయడం అలవాటుగా చేసుకుంటాడు. ఎప్పుడూ విలాసాలు, భోగాలతో ఉగ్రూతలూగుతాడు. ఇంద్రాణిని వశపరుచుకోడానికి చాలాసార్లు ప్రయత్నిస్తాడు. ఒకసారి యయాతే స్వయంగా చూస్తాడు. తండ్రిని అసహ్యించు కుంటాడు. మొత్తంమీద నహుషుడు ఇంగితజ్ఞానంలేనట్లు, పరస్త్రీవ్యామోహం ఉన్నట్లు, తద్వారా ఇంద్ర పదవినే కోల్పోవలసిరాడం ఈ పాత్రలో కనిపిస్తోంది.

### 3. 3. 1. 2. యయాతి :-

నహుషుడి కొడుకు. శర్మిష్ఠ ఒకరోజు రాక్షసరాజ్యం దాటి మానవరాజ్యం, యయాతి రాజ్యంలోకి ప్రవేశిస్తుంది. దట్టమైన కీకారణ్యంలోకెళ్ళిపోతుంది. అప్పుడే ఒక ముల్లు ఆమెకు గుచ్చుకుంటుంది. అప్పుడు యయాతి వేటకోసం ఆ ప్రాంతంలో ఉండడం, శర్మిష్ఠకు సహకరించడంజరుగుతుంది. అలా పరిచయంపెరిగి, ప్రేమికులుగామారిపోతారు. వృషపర్వుడికి ఈ విషయం తెలుస్తుంది. నహుషుడు ఇంద్రుడు అయిన తర్వాత, వృషపర్వుడు శర్మిష్ఠని స్వర్గానికి పంపి, యయాతితో చెప్పి దేవదానవులకు యుద్ధం జరగకుండా ఆపమని కోరుకోమని చెప్తాడు. శర్మిష్ఠ, యయాతి కలిసి ఉన్నప్పుడే దేవదూతలకి దొరిపోతారు. వారు వీరిద్దరిని బంధించాలని చూస్తారు. కానీ, శర్మిష్ఠ ఇంద్రాణి సహాయంతో తప్పించుకొంటుంది. శర్మిష్ఠకోసం పరితపించే వ్యక్తిగా యయాతి కనిపిస్తాడు.

నహుషుడు ఇంద్రాణిని వాంఛించడం కళ్ళారాచూసిన యయాతికి, తండ్రిమీద అసహ్యం మేస్తుంది. అందుకే దేవలోకపు స్వర్గాన్ని అసహ్యించుకుంటాడు. యయాతి స్నేహితుడు 'సత్యేంద్రుడు' నిజాన్ని ప్రకటించినందుకు, అతణ్ణి నరకంలో శిక్షలకి గురిచేయడంతో దేవలోకం మీద యయాతికి మంచి అభిప్రాయం ఉండదు.

దేవదానవుల యుద్ధంలో దేవతలకు సహాయంగా వెళ్ళి తీవ్రంగా యుద్ధంచేస్తాడు. శుక్రుడిచ్చినశాపాన్ని నిగ్రహంతో, ఏకాగ్రతతో ఎదుర్కోడం9 కొసమెరుపు. శర్మిష్ఠని ప్రేమించాక, దేవయానితో వివాహం అవుతుంది. పిల్లలు పుట్టినతర్వాత దేవయానిపట్ల విముఖత ఏర్పడుతుంది. కచుణ్ణి చూడాలని దేవయాని యయాతికి చెప్పకుండా ఇంద్రలోకానికి వెళ్ళిపోతుంది. ఆ తర్వాత శర్మిష్ఠ యయాతికి దగ్గరౌతుంది. ఆమెని పెళ్ళిచేసుకొని యయాతి రాణిగా ప్రకటిస్తాడు. వారి కలయికవల్ల 'పురు' పుడతాడు. చివరకు దేవయానికోపం వల్ల శుక్రుడు శాపం పెడతాడు. పురు తండ్రి వృద్ధాప్యాన్ని స్వీకరించడానికి సిద్ధపడతాడు. రాజ్యాన్ని రక్షించడానికి ఆ యవ్వనాన్ని యయాతి ఉపయోగించుకొంటాడు. ప్రజలకు అన్ని విధాలా సాయపడిన పాత్ర యయాతిని తీర్చిదిద్దారు. అలాగే నైఋతి దిక్కున ఉన్న రాజపురుషులు పంపిన కన్యల్ని 'స్వీకరించని' రాజుగా యయాతి కనబడడం మరో విశేషం.

### 3. 3. 1. 3. శర్మిష్ఠ :-

వృషపర్వుడి కూతురు. ధైర్యంగా రాక్షరాజ్యానికి అవతలవైపు ఏముందో తెలుసుకోవాలని ఒక్కతే వెళ్లిన స్త్రీ ఈమె. యయాతితో పరిచయం, ప్రేమించేస్థాయికి చేరుకుంది. అయితే ఈమె ద్వారా వృషపర్వుడు రాజకార్యాలనిమిత్తం యయాతిదగ్గరకి పంపిస్తాడు. ఇంద్రలోకంలో యయాతితో ఉన్నప్పుడు దేవభటులకు దొరకకుండా ఉచ్చైఃశ్రవం ద్వారా భూలోకానికి చేరుకుంది.

దేవయాని శర్మిష్ఠని చాలా అవమానాలకి గురిచేస్తుంది. అయినా ఈమె ఎదురు తిరగలేదు. చివరకు ఈమెని చీకటిగృహంలో బంధించేస్తుంది. దేవకన్యల సహాయంతో బయటికి వచ్చి యయాతిని పెళ్ళిచేసుకుంటుంది. ఆయనతో ఆనందంగా కొద్దిరోజులే గడుపుతుంది. యయాతి యుద్ధానికి వెళ్ళినప్పుడు వీరగంధం పూసి కత్తిని అందిస్తుంది. విజయం సాధించాక, యయాతి ముసలివాడైనా హృదయం ముసలిదికాదని అతడితో అన్యోన్యంగా గడుపుతుంది. ఇది ఆమె పవిత్ర ప్రేమకు పరాకాష్ఠ. పురు తండ్రి ముసలితనం తీసుకున్నాక అక్కడ రాజ్యంలో శత్రురాజులు ప్రవేశించినప్పుడు పురుని పంపించిన దేశభక్తురాలుగా కనిపిస్తోంది.

### 3. 3. 1. 4. దేవయాని :-

శుక్రాచార్యుడి కూతురు. శుక్రాచార్యుల తపోభంగానికి దేవేంద్రుడు తనకూతురు, జయంతిని పంపిస్తాడు. తపస్సు పూర్తయ్యాక శుక్రుడు జయంతితో గడపడంవల్ల దేవయాని పుడుతుంది. ఆమెను అల్లారుముద్దుగా శుక్రుడు పెంచుతాడు. ఆమె మొండిగా, అహంకారిగా తయారౌతుంది. కావాలని తగువు పెట్టుకొని శర్మిష్ఠను దాసిగా ఉండాలని

కోరి సాధించుకుంటుంది. శర్మిష్ఠ యయాతిని ప్రేమిస్తున్నదని తెలిసి, దేవయాని అతణ్ణే పెళ్ళిచేసుకోవాలని మొండిగా అనుకుంటుంది. పిల్లల్ని కంటుంది. కానీ, మానసికంగా ఎప్పుడు సంతృప్తిని పొందలేదు.

దేవయాని మనసులో కచుడంటే ప్రేమ. ఏకాంతంలో కచుడి గురించిన ఆలోచనలతో ఉంటుంది. కచుణ్ణి చూడాలని యయాతికి చెప్పకుండా ఇంద్రలోకం వెళ్ళినపాత్ర ఈమె. చివరకు శుక్రాచార్యుడితో తపస్సుకు వెళ్ళిపోవాలని నిశ్చయించుకుంటుంది.

### 3. 3. 1. 5. ఇంద్రాణి :-

ఈమె తండ్రి 'పులోమ మహర్షి.' ఇతడు సకలశాస్త్రవేత్త. ఈతడి నుంచి వారసత్వంగా శాస్త్రపరిజ్ఞానాన్ని, వ్యవహారదక్షతను ఈమె సంపాదించింది. తద్వారా ముల్లోకాల్లోకీర్తిప్రతిష్ఠలు సంపాదించింది. ఇంద్రుడిభార్య అయినందువల్ల ఇంద్రాణిగా పేరు పొందింది. ఈ నవలలో ఈమె గురించిన ప్రస్థావనే ఎక్కువగా ఉంది. వృత్రాసురుణ్ణి వధించినందుకు, అహల్యని వాంఛించి నందుకు ఋషులు ఇంద్రపదవినుంచీ ఇంద్రుణ్ని దించేసారు. సిగ్గుతో ఇంద్రుడు స్వర్గంవదిలి వెళ్ళి పోయాడు. అప్పుడు నహుషుణ్ణి ఇంద్రుడుగా సప్తర్షులు నియమించారు. నహుషుడు ఇంద్రాణిని కోరుకుంటాడు. చాలా సున్నితంగా అతడి బారినుంచి తప్పించుకుంటూ జాగ్రత్తగా మసలే పాత్ర ఈమె. మేనక, జయంతుడి విషయంలో ఆచితూచి అడుగులువేసి మేనక జయంతుల వివాహం చేసింది. మేనకని ఘంటాకర్ణ, నహుషులబారినుంచితప్పించి, అప్సరసవృత్తినుంచి విముక్తురాలుగా చేయడంలో ఇంద్రాణి ప్రధాన పాత్ర పోషించింది.

శర్మిష్ఠ, యయాతుల్ని కలపడంలోను, శర్మిష్ఠని రహస్యమందిరంలో (చీకటి ఇల్లు)నుంచి తప్పించడంలోను చాకచక్యంగా వ్యవహరించింది. నహుషుణ్ణి ఇంద్రపదవినుంచి దించడానికి భూలోకంలో ప్రచారంచేయడం, ప్రజల్ని చైతన్యవంతులుగా చేయడంలో, ఈమె పరిశ్రమించింది. అగ్ని, వరుణ, వాయుదేవుల్నిబాగా ఉపయోగించుకొని, కార్యసాధురాలుగా తయారై విజయాన్ని సాధించింది. ఇంద్రాణి పదవి అధిష్ఠించినప్పుడు, 'చిత్రకేతుడు' లాంటి పార్టీలు మార్చే స్వభావం ఉన్నవారికి ఉన్నత పదవులు ఇచ్చినట్లే ఇచ్చి, రాజధానికి, రాజరికపు కార్యక్రమాలకి దూరంగా పంపడం ఈమె రాజనీతిజ్ఞతకు నిదర్శనం.

నహుషుడికోరిక తెలుసుకొని బాధపడినా, అతడిని వెంటనే ప్రత్యక్షంగా ఎదిరించకుండా సప్తర్షుల రథం మీద రమ్మని కోరుతుంది. అప్పటికైనా మేధావులైన ఋషులు వాస్తవాన్ని, జరుగుతున్న అన్యాయాన్ని గుర్తిస్తారని భావించింది. చివరకు నారదుడి సలహావల్ల, అగస్త్యుడి శాపంవల్ల, నహుషుణ్ణి ఇంద్ర పదవినుంచి దింపేందుకు ఈమె చేసిన ప్రయత్నం ఫలించినందని చెప్పవచ్చు.

యయాతి విషయంలో ఏకాగ్రతతో యుద్ధంచేస్తున్న సమయంలో శుక్రుడిచ్చిన శాపంవల్ల వృద్ధాప్యం వస్తుందని, అతడి ఏకాగ్రతకి భంగం కలగకుండా, విజయం

వరించేంతవరకు జాగ్రత్తలు ఈమే తీసుకుంది. యయాతి హృదయంలో శర్మిష్ఠ ఉండడాన్ని గమనించి వారిద్దర్నీ ఏకం చేయడానికి, తన మనుమరాలైన దేవయానినికూడా, దూరంచేసి వారిని కలిపిన ప్రేమమూర్తిగా కనిపిస్తోంది. అలాగే మేనక, జయంతుడి విషయంలోకూడా ఔదార్యం ప్రదర్శిస్తుంది. ప్రజలకు కావల్సిన పనులు ప్రత్యక్షంగా చేయాలని, వారితో సంబంధాలు పెట్టుకొని, ఓదార్పునిచ్చే పాత్రగా దర్శనమిస్తోంది. ఏ రాజూ సరిగ్గా పాలించలేడని, ప్రజలే తగినసమయంలో బుద్ధిచెప్పాలని, భోగభూమిని నాశనంచేయాలని, కుబేరుల్ని సామన్యులుగా చేసి మోక్షం పొందాలని ఈమె చివరకు సూచిస్తోంది.

### 3. 3. 2. చిన్నపాత్రలు :-

### 3. 3. 2. 1. నారదుడు :-

కలహభోజుడిగా కీర్తిపొందిన వాడితడు. ఇంద్రసింహాసనం నవలలో ఇతడు వైవిధ్యమైన పాత్ర పోషించాడు. కేవలం నవ్వుతోనే అన్నింటిని చక్కదిద్దొచ్చని సూచిస్తాడు. అగ్ని, వరుణ, వాయువుల దగ్గరకు వెళ్ళి, మీరెందుకు ఇంద్రులు కాకూడదు అని ఎవరికి వారే ఆలోచించేలా ప్రేరేపిస్తాడు. నహుషుడి దగ్గరకి వెళ్ళి 'ఈ కల్పాంతం ఇంద్రుడిలా వర్థిల్లు' అని దీవించి ప్రజలకు శుభాలు చేయమని చెబుతూనే, పక్కదారి పట్టిస్తాడు.

యయాతి దగ్గరికి నారదుడు వెళ్ళినప్పుడు, 'ఉత్తమ పురుషుడివై వర్థిల్లు' అని దీవించి నైరుతి దిక్కున కల్లోలాలని సూచిస్తూ కర్తవ్యాన్ని బోధిస్తూ, నీలాంటి యువకులు కూడా, దేశంలో ఏం జరుగుతుందో తెలుసుకోకుండా, ప్రేమ, ప్రేమ' అంటూ ఇలా నిర్వీర్యులయి పోవటం బాగుంటుందా?, ముందుదేశ క్షేమం గురించి ఆలోచించుకోవాలి, జాతి గౌరవం కాపాడుకోవాలి. ఆ తర్వాతే ప్రేమలూ, ప్రణయాలూ (పుట.116) అంటూ యయాతి మనసును దేశ రక్షణవైపు మళ్ళించేందుకు ప్రయత్నంగా చెప్పవచ్చు. ఇక్కడ యువతకు కర్తవ్యనిర్దేశనం, దేశాభిమానాన్ని పెంచే స్థితిలోకి తీసుకువచ్చే ప్రయత్నం చేసినట్లు కనబడుతోంది.

యయాతిని యమలోకంలో విచారణ చేస్తున్నప్పుడు నహుషుడు బాధపడతాడు. అప్పుడు నారదుడు నహుషుడి దగ్గరికి వెళ్ళి, యముడితో చెప్పి శిక్షలు లేకుండా చేయించుకో, మాటవినక పోతే యముణ్ణే మార్చే అధికారం నీదగ్గర ఉండి ఇలా అయిపోడం బాగులేదని నహుషుడికి చెప్పి, యయాతిని విడుదల చేయిస్తాడు. అదే విషయంలో నహుషుడు తప్పుదారి పట్టించి, జయంతుణ్ణి విడుదల చేయిస్తాడు.

నహుషుడు మనులు లాగుతున్న రథం మీద వస్తుండగా, మునులు ధ్యానావస్థలో మెల్లగా రథాన్ని లాగుతున్నారు. లోపల నహుషుడు నిద్రపోతున్నాడు. రథాన్ని గట్టిగా కుదిపి నహుషుణ్ణి మేలుకొల్పి, పది ఘడియల్లో ఇంద్రాణి అంతఃపురానికి చేరకపోతే ఆమె భూలోకం వెళ్ళిపోతుందని నారదుడు తొందర పెట్టిస్తాడు. అలా నహుషుడు మునులచేత శాపానికి, పదవినుండి దిగిపోవడానికి ప్రేరకుడుగా నారదుడు కనిపిస్తాడు.

### 3. 3. 2. 2. వృషపర్వుడు

యయాతిని శర్మిష్ఠ కలవడం తెలుసుకున్నవాడు. యయాతిని లోబరుచుకోడానికి రాక్షసులపై దండయాత్ర చేయకుండా ఆపడానికి శర్మిష్ఠకూడా నియోగించడానికి వెనుకాడనివాడు. ఎందుకు యుద్ధం ఆపాలని శర్మిష్ఠ అడిగింది. 'బిడ్డా ప్రస్తుతానికి ఈ ఆపద రాకుండా చూడు. శుక్రాచార్యుల తపస్సు సిద్ధిస్తే దేవతలను నుగ్గు నుగ్గు చేసేస్తాం. ఇంద్రపదవిలో నేనే వుంటాను. నువ్వే ఇంద్రకుమారివి అవుతావని' వివరిస్తాడు(పుట.26) అలాగే శుక్రాచార్యుడి కూతురు దేవయానికి వృషపర్వుడి కూతురు శర్మిష్ఠనుదాసిగా ఉండడానికి ఒప్పుకున్నాడు. కేవలం, అధికారం, రాజ్యశ్రేయస్సు పేరున శర్మిష్ఠకు చాలా కష్టాలు తెచ్చిన తండ్రిగా ఇతడు కనిపిస్తాడు.

### 3. 3. 2. 3. శర్మిష్ఠ తల్లి :-

శర్మిష్ఠని దేవలోకంలో యయాతిని కలవడానికి వృషపర్వుడు నియమించాడు. తల్లి దగ్గరకి వెళ్ళిన శర్మిష్ఠను మాతృహృదయంతో ఆమె ఓదార్చినతీరు, ఆవేదన పాఠకుడి మనసును ఆకట్టుకుంటుంది. 'బిడ్డా!' అని దగ్గరకు తీసుకొని 'ఈ రాజకుటుంబంలో ఎందుకు పుట్టావు?, ఏ సామాన్యుడి ఇంటనో పుడితే భోగభాగ్యాలు లేకపోయినా సుఖసంతోషాలతో ఉండేదానివి కదా' (పుట. 27) అని కుమిలిపోతుంది. శర్మిష్ఠ తల్లిని ఓదార్చింది. నేనెక్కడున్నా సంతోషంగానే ఉంటానని చెప్పింది. ఇంత సౌమ్యం ఎక్కడినుండి వచ్చిందని, దేవయాని వల్లయితే కాదని, ఆమె ముని పుత్రికే, కానీ రాక్షసస్త్రీలకంటే భయంకరమైన వ్యక్తిగా మనసులోనే అనుకునే పాత్ర ఈమె. అందుకే శర్మిష్ఠక్షేమంకోసం కాశికమ్మ(గ్రామదేవత)కు పూజలు చేయిస్తానని సముదాయించుకొనే స్వభావం ఈమెది. తల్లి హృదయ ఆవేదన, అమాయికత్వం ఈ పాత్రలో కనిపిస్తోంది.

### 3. 3. 2. 4. మేనకా జయంతులు :-

మేనక అప్సరస. జయంతుడు ఇంద్రుడి కొడుకు. వీరిద్దరూ పరస్పరం ప్రేమించు కున్నారు. ఆనందంగా పెళ్ళిచేసుకోవాలనుకున్నారు. అప్సరసతో పెళ్ళిచేసుకున్న వాడు హిమవంతుడు ఒక్కడే. మేనక అనేది ఒకఅప్సరస పేరుకాదు. అది ఒక హోదా. ఒకరి తరువాత మరొకరు మేనకగా ఇంద్రుడు నియమిస్తాడు. శుక్రాచార్యుల తపస్సు భంగ్నం చేయడానికి నహుషుడు మేనకను వెళ్ళమని ఆజ్ఞాపించాడు. జయంతుడు దానికి అడ్డు చెప్తాడు. జయంతుడు నహుషుడికి ఎదురుచెప్పినందుకు విచారణ జరిపిస్తాడు. మేనక, శుక్రాచార్యుల చూపును తట్టుకోలేక, కొన్ని రోజులకే తిరిగి వచ్చేసి, విషయం నహుషుడికి చెబుతుంది. కేవలం జయంతుడి కోసమే త్వరగా వచ్చేసావని నహుషుడు కోపగించుకొని, ఘంటాకర్ణుడనే పిశాచికి అమ్మేస్తానని అంటాడు. మేనకను అప్సర పదవినుంచి తీసేసాడు. ఆమె ఇంద్రాణిని శరణువేడుతుంది. ఇంద్రాణి ఈమెను చేరదీసి, ప్రేమించిన జయంతుడితో వివాహం చేయిస్తుంది. జయంతుణ్ణి నహుషుడు శిక్షిస్తాడు.

చివరకు యయాతి వల్ల విడుదల చేస్తాడు. పైగా జయంతుణ్ణి అకస్మాత్తుగా మహాకవిగా గుర్తించి, నిండుడు సభలో ఘనసన్మానం చేస్తాడు. ఆ తర్వాత ఒకరితో ఒకరు పోటీపడి జయంతుడికి చాలా సన్మానాలు చేసారు. దాన్ని జయంతుడు బాగా ఉపయోగించి

భూలోకంలో మలయమారుత విమానాల తయారీ సంస్థని పెట్టాడు. కానీ, నహుషుడు దాన్ని సాగనివ్వలేదు. అయితే జయంతుడు ఇంద్రకుమారుడుగా భూలోకంలో గౌరవాన్ని పొందాడు.

## 3. 4. *ఇంద్రసింహాసనం* నవలలో పాత్ర చిత్రణ :-

*ఇంద్ర సింహాసనం* పౌరాణిక పాత్రలతో చిత్రించిన రాజకీయాంశాలతో కూడిన నవల. రాజ్యాధికారంకోసం ఎన్నో ప్రయత్నాలు చేసి చేజిక్కించుకున్నా, భోగభాగ్యాలుమీద తప్ప ప్రజోపయోగకార్యక్రమాలమీద రాజులు శ్రద్ధ పెట్టరని విమర్శిస్తూ, ప్రజలకోసం మంచి పనులు చేయాలని సూచించే నవల ఇది.

నహుషుడు ఇంద్రసింహాసనాన్ని అధిరోహిస్తాడు. కానీ, అతడు వ్యసనపరుడుగా మారిపోతాడు. భోగలాలసత, స్వర్గంలో అంతకుముందున్న ఇంద్రుడి భార్య ఇంద్రాణిని భార్యగా పొందాలనుకోడం ఇతని బలహీనతలు. యజ్ఞ, యాగాదులుచేయడం, ఆలయాల్ని నిర్మించడం వంటి మంచిపనులద్వారా ప్రజల మనస్సుల్ని పొందాలనుకునే తపన ఉన్నవాడు. బలహీనతల్ని అధిగమించలేక, పైపెచ్చు వివేకాన్నికోల్పోయి, అధికారాన్ని చెలాయించుకొనినే మనస్తత్త్వాన్ని పొందాడు. తద్వారా ఆలోచనా రహిత నిర్ణయాల ద్వారా ఛీత్కారానికి గురౌతుండడం నహుషుడి పాత్రలో కనిపిస్తోంది.

ఇంద్రాణి పాత్ర 'ఇందిరా గాంధి' ని ధ్వనించేలా తీసుకున్నారు. ఈ నవల రచనా కాలం నాటి రాజకీయ చిత్రణ కొంతవరకు, పురాణాల్లో ఉండే వివిధ అంశాలు కొంతవరకు కలగలిపినట్లు నవలగా అనిపిస్తోంది. ధనవంతుడైన కుబేరుడు అధికారంలోకి వచ్చినట్లయితే, అందర్నీ డబ్బుతో కొనే ప్రయత్నం చేస్తాడు. తన అధికారానికి ఎవరూ అడ్డు లేకుండా చూసుకుంటాడు. ఒకవేళ ఎవరైనా ఎదురుతిరిగే ఉద్దేశం ఉంటే, వారికి ఘంటాకర్ణుడనే పిశాచిని పంపించి తగినవిధంగా బుద్ధిచెప్పించడం నహుషుడి పాత్రలో కనిపిస్తోంది.

నహుషుడు ఇంద్రపదవిపొందినతర్వాత చాలాదేవాలయాలు నిర్మించి, యజ్ఞ, యాగాదులు చేసి ధనాన్ని ఖర్చుచేసాడు. తద్వారా కీర్తి పొందాలని ఆశ పడతాడు. నిజానికి కీర్తి పొందాలంటే నిరుపేదకి సైతం కనీస అవసరాలు తీర్చాలని, మానవులందరికి సాధ్యమైనంతవరకూ తృప్తి కలిగేలా చేయాలని ఇంద్రాణి పాత్రద్వారా సూచించినట్లు కనిపిస్తోంది. జయంతుడు మేనకని ప్రేమిస్తాడు. పెళ్ళిచేసుకోవాలని అనుకుంటాడు. కానీ, నహుషుడు శుక్రుడి తపోభంగానికి మేనకని వెళ్ళమని ఆజ్ఞాపిస్తాడు. కచుడు వీల్లేదు అని నహుషుడి అధికారాన్నే ప్రశ్నిస్తాడు. అందుకే యమలోకానికి పంపించి విచారణ చేయిస్తాడు. అతణ్ణి శిక్షకు కూడా గురిచేయిస్తాడు నహుషుడు. అదే అతడి కొడుకు యయాతి విషయంలో యముణ్ణి వదిలేయమని అంటాడు. యముడు ఒప్పుకోడు వెంటనే అతణ్ణి పదవినుంచి తీసేసి, వేరొకర్ని నియమిస్తాడు. ఇక్కడ తమ స్వార్థంకోసం, అవసరాలకోసం ఆర్డినెన్సుల్ని మార్చే అధికార్ల మనస్తత్త్వాన్ని చక్కగా చిత్రించారు.

అగ్ని, వరుణ, వాయుదేవులు ఇంద్రపదవి పొందాలని ఎవరికి వారే తహతహ

లాడిపోతుంటారు. ప్రస్తుతం ఉన్న నహుషుణ్ణి ఇంద్రపదవినుంచీ దించేయడానికి అంతా ఏకమై పోతారు. దించాక వారంతా కీచులాడుకుంటారు. అలాగే 'చిత్రకేతుడు' లాంటి పాత్రల్లో పాలకులకు తగినట్లుగా పార్టీలు మార్చే వ్యక్తులు, వారిస్థితిని చూడొచ్చు.

శర్మిష్ఠ, వృషపర్వుడి కూతురు. ఒకరోజు ఉద్యానవనంలో విహరిస్తూ ఉద్యానవనానికి అవతల ఏముందో తెలుసుకోవాలని అనుకుంది. అవతలవైపు మానవరాజ్యం, చాలా వైభవంగా ఉందని చెలికత్తెద్వారా కొంత తెలుసుకుంది. అయినా స్వయంగా శర్మిష్ఠ తెలుసుకోవాలని చెలికత్తెల కన్నుగప్పి కాలిబాటలో బయలుదేరింది. దారిలో బల్లెంలాంటి ఓ ముల్లు కాలికి గుచ్చుకుంది. 'అబ్బా' అని అరిచింది. అలాంటి సమయంలో బలిష్ఠమైన రెండుచేతులు ఆమెను పొదివిపట్టుకున్నాయని, రచయిత్రి యయాతిని ప్రవేశపెడుతుంది. ఆమెకు గుచ్చిన ముల్లును యయాతి తీసేసాడు. రక్తంవస్తుంటే తన పెదవులతో ఆ ప్రవాహాన్ని ఆపాడు. సేదతీర్చాడు. ఎవరు ఎందుకీకారణ్యంలోకి ప్రవేశించారు? ప్రత్యేక పాదరక్షలు ధరించాలని, మోకాలివరకు ఉన్న మందమైన తన పాదరక్షలు యయాతి ఆమెకిచ్చాడు. వీరి మాటల్లో స్నేహం ఉట్టి పడుతోంది. రాజకుమారి శర్మిష్ఠకి ఆమె రాజ్యాన్ని చేర్చించేలా ఒక ప్రత్యేకమైన గుర్రాన్ని యయాతి ఇస్తాడు.

చాలా రోజుల తర్వాత యయాతిని మళ్ళీ చూడాలని శర్మిష్ఠ వస్తుండేది. ఒకరోజు మాత్రం యయాతిని చూసింది. గుర్రాన్ని ఇద్దామని, అందుకే వద్దామని పైకి చెప్పింది. దానికింత శ్రమ అక్కర్లేదు. దాన్ని బంధించకుండా స్వేచ్ఛగా వదిలేస్తే, తన దగ్గరికి వచ్చేస్తుందని యయాతి చెప్తాడు. చాలా సేపు గడిపి వెళ్ళిపోతారు. ఈలోగా దేవదానవులు యుద్ధంప్రారంభమవుతుంది. దేవతలు సహాయంకోసం ఏ క్షణమైనా రావచ్చు. అందుకోసం వారికి ఎప్పుడు వచ్చినా ఇచ్చేందుకు కొన్ని ఆహార పానీయాలు, ఫలాలు ఉంటాయని యయాతి చెప్పాడు. శర్మిష్ఠ తనకు మిత్రురాలని వివరిస్తాడు.

'మీరు రాక్షసులతో కూడా  చెలిమి చేస్తారా' అని అమాయకంగా శర్మిష్ఠ ప్రశ్నిస్తుంది. 'జన్మను బట్టి వర్గాన్ని నిర్ణయించకూడదు. జన్మతః రాక్షసవర్గంలో జన్మించినా దేవతలను తలదన్నే ఆత్మశక్తి సంపన్నులున్నారు. నువ్వు జన్మించింది ఏ వంశంలో అయినా రాక్షస కన్యగా తోచలేదు.... మనమంతా ఇంతే! అనేక భావాలు ఒక్కసారిగా ఊపిరి పోసుకుంటాయి. ఏది తప్పో, ఏది ఒప్పో గుర్తించలేం!'(పుట.17) అని యయాతి అంటాడు. ఇందులో 'మనం' అని శర్మిష్ఠని కలిపి అనడం ఆమెకు ఆనందాన్నిచ్చింది. ఇక్కడ జన్మతః వర్గం నిర్ణయం కాదని, వారి ప్రవర్తన, మానసిక స్థితి, వివేకం, మనిషిని రాక్షసుడిగా తయారుచేస్తాయని రచయిత్రి వివరించారు.

శుక్రాచార్యులు తన అహం నిలుపుకోడానికి రాక్షసుల్ని ఆశ్రయించాడు. బృహస్పతి, శుక్రాచార్యులు ఇద్దరూ, బృహస్పతి తండ్రి[2] దగ్గరే చదువుకున్నారు. కానీ, బృహస్పతికి

[2] బృహస్పతితండ్రి అంగిరసుడు. ఉతథ్యుడు, సంవర్తనుడు బృహస్పతి సోదరులు.(పూర్వగాథాలహరి.పుట.279 ః 2005).

నేర్పినట్లు అంగీరసుడు శుక్రాచార్యుడికి విద్యనేర్పలేదు. శుక్రుడు ఆ విషయం అర్థం చేసుకొని అంగీరసుడి శిష్యరికంవదిలి స్వయంసాధనచేసి, పరమేశ్వరుణ్ణిమెచ్చించి విద్యల్ని నేర్చు కున్నాడు. తద్వారా, మృతసంజీవని విద్యపొంది దేవతల్ని జయించగలిగాడు. ఈ విషయాన్ని యయాతి శర్మిష్ఠకి వివరించాడు.

శర్మిష్ఠ యయాతితో కలవడం వృషపర్వుడికి తెలుస్తుంది. దేవతలతో దానవులకు యుద్ధం తథ్యం. అలాంటి సమయంలో యయాతిని కలుసుకొని వృషపర్వుడి నగరంపై దేవతలు దండయాత్ర ఆపించాలని శర్మిష్ఠకు వృషపర్వుడు వివరిస్తాడు. ప్రస్తుతానికి ఆ ఆపద రాకుండా చూస్తే, శుక్రాచార్యుల తపస్సు సిద్ధిస్తే దేవతల్ని నుగ్గు నుగ్గు చేసి, ఇంద్రపదవిలో వృషపర్వుడే ఉండాలని, శర్మిష్ఠే ఇంద్రకుమారి అవుతుందని చెప్తాడు. విషయమంతా విన్నాక, తల్లి మందిరానికి శర్మిష్ఠ చేరుకుంటుంది. యయాతిని ఇలాంటి సమయాల్లో కలుసుకోడం చాలా ప్రమాదకరం అని, శర్మిష్ఠ తల్లి చాలా భయపడింది. 'ఈ రాజకుటుంబంలో ఎందుకు పుట్టావు బిడ్డా! ఏ సామాన్యుడి ఇంటనో పుడితే భోగభాగ్యాలు లేకపోయినా, సుఖ సంతోషాలతో వుండేదానివిగదా!' (పుట. 27)అని కుమిలిపోతుంది. ఇక్కడ సాధారణమైన స్త్రీమానసికచిత్రణ, పిల్లలపట్లఉండేప్రేమ వ్యక్తమౌతాయి. తండ్రి రాజకార్యాలకోసం ఆలోచిస్తే, తల్లి కూతురు మనసు, జీవితం, సుఖ సంతోషాల గురించి ఆలోచిస్తుంటుంది.

యయాతి, శర్మిష్ఠలు పరస్పరం ప్రేమించుకుంటారు. కానీ, యయాతిపెళ్లి దేవయానితో జరుగుతుంది. దేవయాని కచుణ్ణి ప్రేమించి, అతడు నిరాకరించాక, పంతం కొద్దీ యయాతిని పెళ్లి చేసుకుంది. యయాతి దేవయాని మనసుని గెలవలేకపోయాడు. పిల్లల్ని కంటుంది. కానీ, కచుడిమీద మనసు పెట్టుకొని ఎప్పుడూ పరధ్యానం గానే ఉంటుంది. ఇది దేవయాని ప్రేమతత్త్వానికి, ఆంతరంగిక ఇబ్బందిగా చెప్పవచ్చు. అంతవరకు అన్నీ తానై చేసిన శుక్రాచార్యుణ్ణి ఆమె కచుడు కావాలని అడగలేక పోవడం, తనని కచుడు అంగీకరిస్తాడనే నమ్మకం ఉండడమే. కచుడు కాదనే సరికి ఏం చేయాలో పాలుపోలేదు. పైగా దేవయాని, శర్మిష్ఠ యయాతిని ఇష్టపడుతోందని తెలిసి తను వివాహంచేసుకొని ఏం సాధించిందంటే కేవలం పంతం. ఈ పంతం కోసమే జీవితాన్ని వ్యర్థంచేసుకొన్న పాత్రగా ఈమె కనబడుతోంది. దేవయాని అహంకారానికి, తండ్రి తపోశక్తి చూసి ఏం సాధించింది?. యయాతి మనోనిగ్రహందగ్గర శుక్రాచార్యుల తపోశక్తి నిలువరించలేకపోయింది. పురు తన తండ్రి వృద్ధాప్యం తీసుకోడం, శత్రువుల్ని తరిమి కొట్టడం లాంటి మార్పులు ప్రత్యేకంగా కనిపిస్తున్నాయి.

దేవయాని సమాధి అవస్థలో కచుణ్ణిదర్శించడం ఒకప్రత్యేక ఆకర్షణ. అందుకే దేవయాని చివరికి తన తండ్రితో తపస్సుకే బయలుదేరుతుంది. లోకంలో ప్రేమించడం ఒకర్ని, పెళ్లి చేసుకోడం వేరొకర్ని ఉన్నట్లయితే, ఆ జంట స్థితి ఏ విధంగా ఉంటుందో దేవయానిని ఉదాహరణంగా రచయిత్రి చూపించారు. ప్రేమించుకున్న జంట మేనక, జయంతులు. వీళ్ళు ఎన్ని కష్టాలు పడాల్సి వచ్చిందో, పెళ్లి చేసుకొని ఎలా జీవితాన్ని గడిపారో చిత్రించారు. ఇందులో ప్రేమికుల కష్టాల్ని సూచించారు.

ఇంద్రాణి కబురుపెట్టగా, నారదుడువచ్చాడు. నవ్వుతూ ఎందుకు రమ్మన్నారని ప్రశ్నిస్తాడు. ఇంద్రాణి 'నవ్వవలసిన సందర్భమేనా' అని ప్రశ్నిస్తుంది. అప్పుడు నారదుడు 'అమ్మా! లోకాన్ని చూసి నవ్వగలిగిన వాడే, ఏనాటికైనా, లోకాన్ని తన అదుపులోకి తెచ్చుకోగలడు. లోకాన్ని చూసి భయపడేవాడు కాదు. మీకైనా ఇది నవ్వ వలసిన సందర్భమే కదా!' అని అంటాడు. ఇంద్రాణి అంతా మీ చేతుల్లో ఉందని, ఇంద్రాణి అంటుంది. నిరాశ పడకూడదని, ఈ నహుషుడు ఇంద్రుడి కంటే ఏ విధంగానూ ఉదాత్తుడు కాడు. అగ్ని, వాయు, వరుణ, నిరృతుల్ని పరస్పరం అధికారదాహం కలిగిస్తానని నారదుడు ఇంద్రాణికి వివరిస్తాడు. ఇక్కడ నారదుడి పాత్ర ఇంద్రాణి విషయంలో చక్కటి ఓదార్పునిచ్చే పాత్రగా కనిపిస్తాడు. అంతేకాదు నహుషుడి దగ్గరికి నారదుడు వెళ్లి 'ఈ యుగాంతంవరకు ఇంద్రపదవిలో ఉండు' అని ఆశీర్వదించి, తనవైపు తిప్పుకుంటాడు. లోకంలో పొగడ్తలకు లొంగనివాడు ఉండడు. ఈ అంశాన్ని చక్కగా వినియోగించుకొన్న వాడు నారదుడు. కేవలం నారదుడు దయకాదు, నహుషుణ్ణి ఇంద్రపదవికి తెచ్చింది. ప్రజలదయ అని చెప్తూనే, భారీగా దానధర్మాలు, సత్కార్యాలు చేయాలని నారదుడు నహుషుడికి సూచించడం ప్రత్యేకత. ఇందులో సత్కార్యాలు చివరలో చెప్పడం, దాన్ని నహుషుడు పట్టించుకోడు అని సూచనగా, తద్వారా నహుషుడి పతనానికి నాందిగా చెప్పవచ్చు.

అగ్ని దగ్గరికి వెళ్ళి నారదుడు, ఇంద్రపదవి నీకే వస్తుందని, భూలోకంనుంచి రావల్సిన పనిలేదని ఇదంతా ఋషులు పన్నిన కుట్రగా వివరిస్తాడు. వాయువు దగ్గరికి వెళ్లి అలాగే ఆలోచించేలా నారదుడు చేస్తాడు. నిరృతి దగ్గరికి వెళ్లి, 'నువ్వొక్కడివే కిరాతుడైన వాడివి దిక్పాలకులలోకి వచ్చావు. కానీ, నీజాతి వారెవరైనా ఉన్నత పదవులోకి వచ్చారా? అని ఇంద్రపదవి నీకే వస్తే తగినన్ని పదవులు మీకులానికి ఇవ్వొచ్చని అతడికి చెప్తాడు.'(పుట.40) ఇక్కడ అధికారంకోసం కులం, జాతి , అహంకారం మొదలైన అంశాలు రాజకీయంగా కీలకపాత్రని పోషిస్తున్నాయని, విశ్లేషిచారు. అవి నేటికి ఎలా సమాజంలో పాతుకుపోయి ఉన్నాయో రచయిత్రి విమర్శిస్తోంది.

నహుషుడు ఖర్చు పెట్టిన డబ్బంతా దేవుళ్ళకూ, పూజారుల దక్షిణకే చాలకపోడంతో, నిరుపేదల దగ్గరికి వచ్చేసరికి శూన్య హస్తాలే మిగిలాయి. ఒక సామాన్య కుటుంబం శోకభారంలో మునిగిపోయి ఉంది. వరదలు వచ్చి స్థిరాస్థులు కొట్టుకుపోయాయి. కుబేరుల బాకీ కింద అతడి గూండాలు ఇంట్లో సంపదంతా పట్టుకుపోయారు. కట్టుబట్టలతో ఆ కుటుంబం మిగిలింది. ఆ సమయంలో ఆ కుటుంబీకుల మధ్య ఇంద్రాణి ప్రత్యక్షమైంది. వాళ్లామెను స్తోత్రం చేసారు. ఇంద్రాణి ఆ కుటుంబాన్ని ఆప్యాయంగా పలకరించింది. దీనంతటికి కారణం నహుషుడని మీరంతా అజ్ఞానం ఉండి, తెలుసుకోలేకపోయారని అంటుంది. నహుషుడు కేవలం డబ్బున్నవారికి, ఉన్నత వర్గాలవారికి, రాజపుత్రులకి మీ సంపదనంతా దోచి ఇవ్వడం వల్ల మీరంతా మరింత పేదలుగా మారుతున్నారని వివరిస్తుంది.(పుటలు. 53-54) అధికారంతో ఉన్న వాళ్ళు సాధారణ ప్రజలను పట్టించుకోవాలనే సూచన కనబడుతోంది.

ఇంద్రాణి పేదవారంతా పేదలు కావడానికి కారణం నహుషుడే అని చెప్తుంటే,

ప్రజలు వింతగా వింటున్నాడు. కానీ, వారు ఆ కోణంలోంచి ఆలోచించకపోడాన్ని విమర్శిస్తున్నట్లు ఉంటుంది. ఇంద్రపదవి వంశ పారంపర్యంకాదు. మీరంతా కీర్తించేవరకు ఎవరైనా ఇంద్రపదవిలో ఉండగలడు, లేకపోతే మీరంతా ఏకమై వారిని దింపేయవచ్చని సూచిస్తుంది. అప్పటికే నహుషుడిమీద ఆవేశపడుతున్న వారిని ఆపి, బుద్ధిబలం కూడా జోడించాలని తెలియజేస్తుంది. ఒక రాజ్యాధికారి ప్రజల్లో ఖ్యాతిని సంపాదించాలని, లేకపోతే మనుగడే ఉండదని నిరూపించిన పాత్ర ఇంద్రాణి. ఏ కారణానికైనా మూలం ఉంటుంది. పాడైన దాన్ని ప్రక్షాళన చేస్తే, ఆ వ్యవస్థ అవస్థలకు గురికాదని తెలియజేయడం ఈ పాత్ర ముఖ్య ఉద్దేశం.

శుక్రాచార్యుడి తపస్సు భగ్నం చేయడానికి మేనకని నహుషుడు వెళ్లమంటాడు. అక్కడికి వెళ్లి, శుక్రాచార్యుడి చూపులకి భయపడి, కొద్దికాలానికే మేనక తిరిగి వచ్చేస్తుంది. విషయం నహుషుడికి చెప్తుంది. కావాలనే వచ్చావని కోపగించుకొని, జయంతుడు, నువ్వూ కలిసి ఆడుతున్న నాటకమని నిందిస్తాడు. చివరకు ఇంద్రాణిని మేనక ఆశ్రయిస్తుంది. జయంతుడితో మేనకకు వివాహంచేయిస్తుంది ఇంద్రాణి. 'నువ్విప్పుడు అప్సరసవి కాదు. జయంతుడి భార్యవు. ఈనాటినుంచీ నహుషుడికి నీపైన ఏ అధికారం లేదు' అని మేనకతో ఇంద్రాణి అంటుంది. అప్సరస వృత్తి నైరాశ్యం నుండి ఆమెను కొడలిగా తీసుకోడం ఇంద్రాణి ఔన్నత్యాన్ని సూచిస్తోంది.

భార్యాభర్తల్ని ఒకచోట ఉంచకుండా వారిని నాన ఇబ్బందుల్ని రాజరిక శాసనాలు గురిచేస్తున్నాయి. ఆ విషయాన్ని 'హేమ, మయుడు' పాత్రలద్వారా రచయిత్రి సూచించారు. హేమ దేవకన్య. మయుడు రాక్షసుల శిల్పి. దేవకార్యంకోసం వచ్చిన హేమ, మయుణ్ణి చూసి నచ్చాక, పెళ్ళి చేసుకుంది. భూలోకంలోనే స్థిరపడింది. శుక్రాచార్యుల విషయంలో మయుడు కల్పించుకున్నాడని గూఢచారులవల్ల నహుషుడు విషయం తెల్సుకొన్నాడు. వెంటనే హేమను దేవలోకం రమ్మని ఉత్తరువులు పంపుతాడు. భర్తనూ పిల్లల్నీ వదలి దేవలోకం వస్తుంది. చాలా బాధపడుతుంది. భార్యాభర్తల్ని విడదీసే న్యాయ సూత్రాల్ని ఎదిరించలేకపోయింది. చివరికి మయుడు కూతురు 'మండోదరి'కి పెళ్లిచేసి, తపోవనానికి వెళ్లి పోవాలని నిశ్చయించుకుంటాడు. కుటుంబ వ్యవస్థమీద ప్రభుత్వపు అధికారం ప్రశ్నార్థకమైంది. ఆ కుటుంబం విచ్ఛిన్నమయింది. ఇలాంటి విషాదమైన అంశాల్ని ఈ పాత్రలతో రచయిత్రి సూచించి, వాటిని పట్టించుకోవాలని ప్రభుత్వ బాధ్యతగా గుర్తుచేసారు.

శర్మిష్ఠని వెదుకుతూ యయాతి నరకానికి వచ్చాడు. అక్కడ సత్యేంద్రుడు కనబడ్డాడు. యయాతి బాల్యస్నేహితుడు 'సత్యేంద్రుడు'. రెండు చేతులూ విరిచి వెనక్కి కట్టి, కొరడా దెబ్బలు కొడుతున్నా, ముఖంలో నవ్వుతో సత్యేంద్రుడున్నాడు. ఎందుకిలా జరిగిందని యయాతి ప్రశ్నించాడు. 'స్వర్గంలో జరుగుతున్న వన్నీ అన్యాయాలే. కొందరు పెద్దల స్వార్థానికి చాలా మంది బలైపోతున్నారని ప్రకటించాడు. ఇంద్రుడిలో ఔన్నత్యమే లేదు. అతడి ప్రతి చర్యలోనూ స్వార్థమే ఉంది. ముల్లోకాలలోని అందరికీ మేలు జరిగేలా చూడటం అటుంచి, తనపదవిని కాపాడుకోడంకోసం నిరంకుశంగాఅధికారం చెలాయించడం

కోసమే తన అధికారాన్ని వాడుకొటున్నాడని' అన్నందుకే మునుపటి ఇంద్రుడు శిక్షించాడు. ప్రస్తుత ఇంద్రుడు దాన్ని కొనసాగిస్తున్నాడని  వివరించాడు. (పుట.108) ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడిన వాడికి ఎలాంటి శిక్షలకుగురిచేస్తారో వివరించే పాత్రగా సత్యేంద్రుడు కనిపిస్తాడు. ఇది ఆధునిక కాలానికి ప్రతిరూపంగా నిలబడుతోంది. నేరమయమైన రాజకీయం, దాన్ని ప్రశ్నించిన వారికి శిక్షలు ఇప్పటికీ ఉన్నాయి. ప్రశ్నించేస్థితే లేకుండా, అధికారం చెలాయిస్తే అది ఎంతో కాలం ఉండదని సూచిస్తున్నారు.

ఇంద్రుడి సభల్లో నాట్యాలు చేస్తూ, ఇంద్రుడు ఎవరి దగ్గరికి వెళ్లమంటే వాళ్ల దగ్గరికి వెళ్తూ, వారిని ఆనందపరుస్తూ.... ఇలాంటి స్థితి తనకు వస్తే తలచుకొని వణికిపోయింది శర్మిష్ఠ. పసిపిల్లలా ఇంద్రాణిని సమీపించింది. ఆమెచుట్టూ చెయ్యివేసి, తన హృదయానికి హత్తు కుంటుంది. ఇంద్రాణికి తన కూతురు జయింతిని హత్తుకొన్నట్లే అనిపించింది. శర్మిష్ఠ ఆ ప్రేమలో కరిగిపోయింది. శర్మిష్ఠ కథ విన్నాక, అయ్యో, అభం, శుభం తెలియని ఆడపిల్లలు సహితం ఈ రాజకీయాలకు బలి అయిపోతున్నారని బాధపడుతుంది. అందుకే యయాతిని రప్పించి, శర్మిష్ఠతో కలుపుతుంది. శర్మిష్ఠ, యయాతుల పాత్రలు ఈ సందర్భంలో ప్రేమకు పరాకాష్టగా కనబడతాయి.

శర్మిష్ఠ, మేనక ఇద్దరూ ఇంద్రాణినే ఆశ్రయించారు. వారిని రక్షించే భారమంతా కత్తిమీద సాములా ఉంది. శత్రువుల పంజాలోంచి అతి మెలకువతో తప్పించాలి. ఈ పురుషుల సంకుచిత స్వార్థ రాజకీయాలకు స్త్రీలు బలి అయిపోతున్నారు. ఎవరిదాకో ఎందుకు సంపన్న వంశంలో ఉన్న ఇంద్రుడి కూతురు జయంతి స్థితి కూడా ఇందుకు భిన్నంగాలేదు. బృహస్పతి, శుక్రుడు కలిసి ఉన్నప్పుడే శుక్రుడు జయంతిని ప్రేమించాడు. కానీ, ఇంద్రుడు జయంతిని శుక్రుడికిచ్చి వివాహం చేయడానికి ఇష్టపడలేదు.

శుక్రుడు తన స్వశక్తితో విద్యలన్ని సాధించి రాక్షసులకు గురువైన తర్వాత, మరిన్ని విద్యల్ని సాధించాడు. అప్పుడు ఇంకా తపస్సు చేస్తున్నప్పుడు, ఆ తపస్సు భగ్నం చేయాలని జయంతిని ఇంద్రుడు పంపిస్తాడు. అయినా మృతసంజీవని సాధించేవరకూ జయంతి అతడి ఏకగ్రతను భగ్నం చేయలేకపోయింది. ఆ తర్వాత జయంతితో కొంతకాలం గడిపాడు. అప్పుడే దేవయాని పుట్టింది. రాక్షస గురువుగా ఉన్న శుక్రుడు ఇంద్రపుత్రిని తన భార్యగా స్వీకరించలేక, దేవయానిని మాత్రం తన వెంట తీసుకెళ్ళాడు. జయంతి గుర్తులు దేవయానిలో ఉన్నందుకే, ఆమె అంటే అతడికి పంచప్రాణాలు. ఈ విషయాలన్నీ ఇంద్రాణి మనసులో పెట్టుకొని దారుణమైన దుఃఖాన్ని అనుభవించింది. స్వార్థంతో స్త్రీశక్తిని కలుషితం చేస్తున్నారని ఎంతటి పరిణామాలు వచ్చినా మేనక, జయంతుల వివాహం, శర్మిష్ఠ, యయాతులు సమాగమం చేసిన ప్రేమమయిగా, స్త్రీ శక్తిగా ఇంద్రాణి కనిపిస్తోంది.

దేవయానికి ఇంద్రాణి కబురు పెట్టింది. యయాతికి కూడా చెప్పకుండా స్వర్గానికి దేవయాని బయలుదేరుతుంది. కచుణ్ణి చూసి చాలా సంవత్సరాలు అయింది. ఒక్కసారి అతణ్ణి చూడాలని ఎంతో ఆరాటపడింది. ఆమెకు 'స్వర్గం తలచుకోగానే ఏనాడూ చూడని తనతల్లియొక్క విచిత్రకథ గుర్తుకు వచ్చింది. పెద్దలరాజకీయాలకు పావుల్లా బలి

అయిపోయిన అబలజీవితం. తనకు తల్లి పోలికే వచ్చినట్లుంది. తన జీవితమూ, ఇంచుమించు తల్లి జీవితం లాగే ఉంది. ఇంకా తన తల్లే అదృష్టవంతురాలు కొంతకాలమైనా ప్రేమించిన వాడితో సంతృప్తిగా జీవితం గడిపింది'(పుట.181) అని దేవయాని తను ఏదైతే కోల్పోయిందో అది ప్రతిఫలిచేలా ఆమె మనస్తత్త్వాన్ని రచయిత్రి విశదీకరించే ప్రయత్నం చేసారు.

ఇంద్రాణి పూరుడి పట్టాభిషేకానికి వస్తుంది. వైభవంగా ఉత్సవం ముగుస్తుంది. దేవయానితో ఇంద్రాణికూడా దేవయాని భవనానికి వచ్చింది. "అమ్మా!, కావలసిన దానివని నిన్ను నమ్మాను. నువ్వే నాకు అపకారం తలపెడతావా?, అని దేవయానిఇంద్రాణిని ప్రశ్నిస్తుంది. దీనికి ఇంద్రాణి సమాధానం చెప్పింది- "శర్మిష్ఠను నేనొకనాడు నా రాజకీయ ప్రయోజనం కోసం వాడుకున్నాను. ఆ అమాయకురాలు వేదనలన్నీ మౌనంగా భరించింది. ఆమె ఏనాటికైనా యయాతిని చేరుకోగలదని నేను ఆనాడే వాగ్దానం చేశాను. తాత్కాలికంగా కష్టాలెదురయినా, ఆమె ప్రణయం ఫలిస్తుందని కూడా వరమిచ్చాను. ఏదీ ఆశించకుండా, దేనికీ ఎదురుతిరగకుండా తన ప్రేమనే ఆధారంగా చేసుకొని బ్రతికింది. ఆ ప్రణయిని నీకు అన్యాయం చేయలేదు. శర్మిష్ఠకు న్యాయం జరిగింది. ఇక పూరుడు మహారాజు కావడానికి కూడా నువ్వే బాధ్యురాలివి. నువ్వు యయాతికి తెప్పించిన ముసలితనం కారణంగానే పూరుడు రాజు కాగలిగాడు"(పుట. 237). అహంకారిగా ఉన్న దేవయానిని మార్చడానికే కాకుండా, శర్మిష్ఠ ప్రేమతత్త్వాన్ని ఇంద్రాణి చెప్పడం ప్రత్యేకత.

భవిష్యత్తులో యాదవ వంశలో ఒకమహానుభావుడు పుడతాడు. వ్యక్తిపూజను మాన్పిస్తాడు. సమసమాజాన్ని స్థాపిస్తాడు. జీవన రణరంగంలో ప్రాణికర్తవ్యం ఏదో నిరూపిస్తాడు. రాజాధిరాజై లోకాలకంతకూ పూజ్యుడౌతాడు. ఇలా ఇంద్రాణి యదు వంశాన్ని గురించి, భవిష్యత్తను సూచిస్తోంది. యదువు అలా అవడానికి కారణం తల్లిదండ్రుల ప్రేమలో పెరగకపోడమని దేవయాని ఒప్పుకుంది. ఇక్కడ అహంకారం లేని తప్పును తెలుసుకున్న తల్లిగా, భార్యగా దేవయాని కనబడడం ఈ నవలలో ప్రత్యేకత. ఇలా ఆయా సందర్భాల్లో రచయిత్రి పాత్రల్ని నూతనంగాను, సామాజిక పరిస్థితులకు అనుకూలంగాను తీర్చి దిద్దారు.

పైన వివరించిన నవలల్లో మహాభారతంలోని పాత్రలతో పాటు, కల్పిత పాత్రలు కూడాఉన్నాయి. యయాతి చక్రవర్తిగా ఉన్నప్పటికీ అతడి మానసిక స్థితిని సామాన్యుడిగానే విశ్లేషించడం కనబడుతోంది. ఇంద్రుడు చేసిన అకృత్యాలకు ఇంద్రపదవి పోవడం, అంతకంటే దుష్టుడు ఆ పదవిని అధిరోహించడం మొదలైన అంశాలు రాజకీయంగా భారతాన్ని చూడవచ్చు అని స్ఫురిస్తున్నాయి. పురుష పాత్రలు శీర్షికగా పెట్టినట్లుగానే కథాంశాలు ప్రధానంగా వచ్చిన నవలలు ఉన్నాయి. వాటిని తరువాత అధ్యాయలో పేర్కోవడం జరిగింది.

# అధ్యాయం- 4

# 4

## 4. శీర్షిక ఆధారంగా కథాసూచ్య నవలలు- పాత్రలమనస్తత్త్వ చిత్రణ

### 4. 1. పర్వ నవల పాత్రల పరిచయం :-

పర్వ నవల వ్యాసభారతానికి ఆధునిక నవలారూపంగా కనిపిస్తోంది. ఇందులో పదిహేను భాగాలు, 730 పుటలు ఉన్నాయి. రచయిత తన ప్రతిభా సంపత్తిచేత చాలా పాత్రలు కల్పించి, కొన్ని పాత్రలను భారతంనుంచి తీసుకున్నారు. వ్యాసభారతంలోని పేర్లకు మార్పులు చేసారు. అన్ని పాత్రలు ఆయా సందర్భాలలో నవలాంశాలకు సహకారులుగా ఉన్నాయి. ఈ పాత్రల్ని ప్రధానంగా రెండురకాలుగా విభజించడంజరిగింది. ఒకటి భారతం లోని పాత్రలు, రెండు రచయిత కల్పించిన కల్పిత పాత్రలు.

### 4. 1. 1. భారతం లోని పాత్రలు :-

ఈ విభాగంలో మళ్లీ రెండు రకాలుగా విభజన ఉంటుంది. అవి పురుష, స్త్రీ పాత్రలు.

#### 4. 1. 1. 1. పురుష పాత్రలు :-

#### 4. 1. 1. 1. 1. శల్యుడు :-

మద్రదేశపురాజు. మాద్రికి సోదరుడు. ఇతడి కొడుకులు రుక్మరథుడు, వజ్ర, అజయులు. నకుల సహదేవులకు మేనమామ. ఇతడి మనుమరాలు హిరణ్యవతి. పాండవు లంటే ఇష్టం. పాండవుల పక్షాన మొదట యుద్ధానికి సహాయంచేస్తానని, పాండవుల పురోహితుడికి చెబుతాడు. కానీ, సైన్యాన్ని తీసుకొస్తున్నప్పుడు దుర్యోధనుడు నియమించిన సేవకులు తగిన విధంగా వస్తు సామగ్రి, ఆతిధ్యం ఇవ్వడం వల్ల ఆనందిస్తాడు. కావల్సిన వరం ఇస్తానని మాట ఇస్తాడు. దుర్యోధనుడు తన పక్షాన పోరాడమని అభ్యర్థిస్తాడు. అతడి ఆతిథ్యసేవలకు ప్రతిఫలంగా దుర్యోధనుడి మాయలో ఇతడు పడిపోతాడు.

పాండవులదగ్గరికి వెళ్ళి విషయం చెప్పాక, మామా! నువ్వు వాళ్లపక్షం ఉన్నా, కర్ణుడికి సారథివైనప్పుడు మాకు సాయం చేయమని ధర్మరాజు కోరుకుంటాడు. దానికి సరే అని మాట ఇస్తాడు. చివరకు శల్యుణ్ణి ధర్మరాజే చంపేస్తాడు.(పుట.673).

#### 4. 1. 1. 1. 2. రుక్మరథుడు :-

శల్యుడి కొడుకు. ఇతడికి రాజ్య పాలన అప్పగించి, శల్యుడు ఇంద్ర ప్రస్థానానికి బయలుదేరతాడు. ఇతడి కూతురు హిరణ్యవతి. త్రిగర్తలదేశపురాజు సుశర్మ ఇతడికి మిత్రుడు. దుర్యోధనుడి పక్షం ఉండడం మంచిదని సూచించి, తగిన కారణాలు వివరిస్తాడు. గూఢచారి వ్యవస్థ కలిగి ఉన్నవాడు. రాజ్య రక్షణ చర్యలు చేపడుతూ ఉంటాడు. అయినప్పటికీ నాగులనుంచి తన కూతుర్ని కాపాడలేక పోవడం కొసమెరుపు.

#### 4. 1. 1. 1. 3. భీష్ముడు :-

శంతన మహారాజుకి, 'గంగ' అనే పేరుగల కొండకులం స్త్రీకి పుట్టినవాడు. ఇతడు

పుట్టినప్పుడు పెట్టినపేరు 'దేవవ్రతుడు'. గంగకు ఎనిమిదో కాన్పుగా ఇతడు పుట్టాడు. చిన్నప్పుడే ఇతణ్ణి తల్లి వదిలి వెళ్లిపోయింది. తండ్రి దగ్గరే పెరిగాడు. అంతకుముందటి కాన్పులన్నీ గంగ ఆమెపుట్టింటిదగ్గరే వదిలివచ్చేసింది. చివరకు శంతనుడు ఎనిమిదో కాన్పుకు పురిటినొప్పులు వచ్చినా, పంపించకపోడంవల్లే భీష్ముడు శంతనుడికి దక్కాడు. చిన్నవయస్సు లోనే విలువిద్య, అడవులలో వేట, మల్లయుద్ధం నేర్చుకున్నాడు. ముసలి వయస్సులో తండ్రి మరో స్త్రీమీద మనసు పడ్డాడని తెలుసుకొన్నాడు. ఆమెను తేవడానికి బ్రహ్మచర్యవ్రతాన్ని స్వీకరించి, తండ్రి ఆంతరంగిక కోరికను నెరవేరుస్తాడు. తద్వారా 'ఇచ్ఛా మరణం' వరంగా పొందుతాడు.

శంతనుడు మరణించాక, రాజ్యాన్ని రక్షించమని సత్యవతి కోరింది. తర్వాత వచ్చి హస్తినలోనే ఉండి యుద్ధపూర్తి అయ్యేవరకు పోరాటం చేసాడు. గంధర్వుల్ని మొదట్లో ఓడించాడు. అంబ, అంబిక, అంబాలికలస్వయంవరంలో రాజుల్ని ఓడించాడు. అంబిక, అబంలికలను తెచ్చి, చిత్రాంగద, విచిత్రవీర్యులతో వివాహంచేసాడు.

అంబ మాత్రం సాళ్వ రాజుని ప్రేమించానని చెప్తే, ఆమెను అతడి దగ్గరకే పంపాడు. శాల్యుడు ఆమెని నిరాకరించాక, తిరిగి వచ్చి, భీష్ముణ్ణి వివాహమాడమని కోరింది. దానికి భీష్ముడు అంగీకరించలేదు. భార్గవుడి సహాయం అర్థించింది. భీష్ముడితో, భార్గవుడు యుద్ధానికి వచ్చాడు. ఆ యుద్ధాన్ని మునులు మధ్యలోనే ఆపించేసారు. దాంతో ఏమీ తోచని అంబాలిక, అపజయాన్ని తట్టుకోలేక, మంటల్లో దూకేసింది. దూకే ముందే, భీష్ముణ్ణి చంపడానికి మళ్ళీ పుడతానని చెప్పి, మరణించింది. శిఖండిగా పుట్టింది. భీష్ముడి అస్త్ర సన్యాసానికి కారణమై, అతడి మరణానికి మూలమైంది.

కృష్ణద్వైపాయణుడికి సోదరుడితడే. అంబిక, అంబాలికకు నియోగపద్ధతిలో ధృతరాష్ట్రుడు, పాండురాజు, విదురుల్ని పుట్టించాడు. దుర్యోధనుడికి బుద్ధులు చెప్పాడు. పాండవులంటే ఇతడికి ప్రేమ. కౌరవ పాండవుల్ని కలపాలని, చివరి వరకూ ప్రయత్నించి, శరశయ్యమీద నిరాహారిగా తనువు చాలించాడు.

### 4. 1. 1. 1. 4. కృష్ణద్వైపాయనుడు :-

పరాశరుడికి, కాళి(మత్స్యగంధి)కి పుట్టినవాడు. సత్యవతిగా పేరు తర్వాత శంతనుడు మారుస్తాడు. పన్నెండేళ్లకు హస్తినాపురానికి పరాశరుడు తీసుకువస్తాడు. పుట్టిన తర్వాత ఎనిమిది సంవత్సరాలకు కాళి దగ్గరునుంచి బలవంతంగా పరాశరుడు కృష్ణద్వైపాయనుణ్ణి తీసుకొని వెళ్లి పోతాడు. అతడికి వేదాన్ని నేర్పిస్తాడు. ఇతడికి భీష్ముడు తమ్ముడౌతాడు. శుకుడితడి కొడుకు. ఇతడు సమస్త వేదాలు విభాలుగా చేసి శిష్యలకి నేర్పిస్తాడు. నల్లటి రంగు ఉన్న శరీరం ఇతడిది. అందుకే 'కృష్ణ' అని పేరు పెట్టి ఉంటారని రచయిత భావిస్తారు. (పుట. 439) అరణ్యంలో ఆశ్రమం ఏర్పాటు చేసుకొని, విద్యార్థుల్ని తయారుచేస్తూ, కాలం గడుపుతాడు. పాండవులకు అప్పుడప్పుడు సహాయపడతాడు.

### 4. 1. 1. 1. 5. కర్ణుడు :-

కుంతికి పుట్టిన మొదటి సంతానం. దుర్వాసుడు రాజాంతఃపురంలో ఉన్నప్పుడు

కుంతి ఇతడికి సేవలు చేసేది. పిల్లలు ఎలా పుడతారని ఒకసారి ఇతణ్ణి ప్రశ్నించింది. దానికి ప్రతిగా దుర్వాసుడు ఆమెతో కలిసాడు. వారి కలయిక వల్ల పుట్టినవాడే కర్ణుడు. రాధ అనే అంతఃపుర స్త్రీకి కర్ణుణ్ణి ఇచ్చేసారు. చెవులకు కుండలాలు ఉండడంచేత కర్ణుడు అని పిలిచేవారు.

రాధ భర్త సూతుడు. చిన్నప్పటినుంచి తండ్రి పోత్సాహం వల్ల ధనుర్విద్యల్ని నేర్చుకున్నాడు. రాధ చివరకు కర్ణుణ్ణి, తనకొడుకులాగే సాకింది. రాధ చనిపోయేముందు కుంతి దగ్గరికి వచ్చి, నీ కొడుకు బాగానే ఉన్నాడు. ప్రస్తుతం ధనుర్విద్యని నేర్చుకోడానికి వేరే ప్రాంతానికి వెళ్ళాడని, తనకొడుకుగానే ఉంచమని ప్రాధేయపడుతుంది. అది ఆమె కోరికని గుర్తుకు తెచ్చుకొని కుంతి ఆమె బతికుండగా ఆ విషయాన్ని ఎవరికి చెప్పలేదు.

కుంతి తన తల్లి అని తెలుసుకున్న తర్వాత, కర్ణుడు ఏమీ చేయలేని స్థితిలో కొట్టిమిట్టాడి చివరకు స్నేహంవైపే మొగ్గుచూపుతాడు. అర్జునుడితో పోరాడి మరణించిన అమరవీరుడు. కళ్లు, ముఖం, పలువరస కుంతి ఆకారాన్ని పోలి ఉంటాయి. అవమానాల్ని భరిస్తాడు. దుర్యోధనుడికి స్నేహితుడు. ద్రౌపదిని అవమానించడంలో దుర్యోధనుడికి సహాయపడతాడు.

### 4. 1. 1. 1. 6. పాండురాజు :-

విచిత్రవీర్యుడి క్షేత్రజ కుమారుడు. అంబాలికు వేదవ్యాసుడికి పుట్టాడు. ధృతరాష్ట్రుడి తమ్ముడు, విదురుడికి అన్న. అందమైన మైకట్టు, చక్కటి నిర్మాణం ఉన్నవాడు. వీర్యశక్తి లేక హిమాలయ పర్వతానికి వెళ్లి ఔషధాల ద్వారా వీర్యవంతుణ్ణి అవ్వాలని భార్యలతో వెళ్తాడు. ఇరవైనాలుగు సంవత్సరాల వయసుకే వీర్యవంతుడుగా లేకపోవడం చాలా బాధాకరంగా భావించాడు. కానీనపుత్రుడు పెళ్ళిలోనే తేవాలని, ఇప్పుడు సాధ్యంకాదని, దేవధర్మాధికారి ద్వారా మరుత్తు, సైన్యాధికారి, ఇంద్రుడు, వైద్యులద్వారా నియోగ పద్ధతిలో పిల్లల్ని కంటాడు. చివరకు హిమాలయాల్లోనే మరణిస్తాడు.

### 4. 1. 1. 1. 7. ధృతరాష్ట్రుడు :-

చిత్రాంగదుడి క్షేత్రజ కుమారుడు. అంబికకు, కృష్ణద్వైపాయనుడికి నియోగ పద్ధతిలో పుడతాడు. పుట్టి గుడ్డివాడు. కొడుకు దుర్యోధనుడంటే అమితమైన ప్రేమ ఉన్నవాడు. కండపుష్టి ఉన్నవాడు. కపటపరుడు. పాండవపత్ని ద్రౌపదిని సభలో అవమానపరిచాక, ఆమెను వరాలు కోరుకోమంటాడు. పనికి మాలిన ప్రాంతం ఖాండవవనం పాండవులికిచ్చే స్వభావం కలవాడు.

గాంధారి కళ్ళు తెరిచిన తర్వాత తననుంచి దూరం చేసేస్తున్నాడని, కృష్ణుణ్ణి నిందించాడు. కర్ణుడి ప్రతాపం విని ఆనందించాడు. చివరికి భీముణ్ణి చంపాలని ప్రయత్నం చేస్తాడు. ఎక్కడా తప్పు చేస్తున్నానని అనుకోడు.

#### 4. 1. 1. 1. 8. విదురుడు :-

దాసికి కృష్ణద్వైపాయనుడికి పుట్టినవాడు. ధృతరాష్ట్రుడుకి హితాన్ని చెబుతుంటాడు. పాండవులకు సహాయం చేస్తాడు. సూతుల్లో గొప్పవాడుగా పేరు పొందుతాడు. కుంతిని పాండురాజు పోయాక, పాండవులు అరణ్యవాసం వెళ్లినప్పుడు తన ఇంట్లోనే ఆశ్రయమిస్తాడు.

పాండవుల్ని లాక్షాగృహంనుంచి రక్షించడానికి సాయంచేస్తాడు. జూదానికి పాండవుల్ని పిలవమని ధృతరాష్ట్రుడు పంపిస్తే 'రాను' అని చెప్పమని ధర్మరాజుని కోరుతాడు. యుద్ధంలో ఎవరి పక్షం వహించకుండా స్వతంత్రంగా ఉండిపోతాడు.

#### 4. 1. 1. 1. 9. కృపాచార్యుడు :-

శరద్వన్ అనే బ్రాహ్మణుడికి, బాణం కట్టెలు కోసేజాతికి చెందిన అడవికన్యకి పుట్టినవాడు. ఇతడి చెల్లెలు కృపి. తల్లి జబ్బుపడి చనిపోయేముందు ముసలిరాజు శంతనుడికి అప్పగించి "నీ ప్రజలు, తండ్రిలా సాకవల్సింది నువ్వే"(పుట. 473) అని చెప్పి ప్రాణాలు వలిందట. సూతులకు, సైనికులకు అస్త్ర ప్రయోగం నేర్పించడం ప్రారంభించి ఆచార్యుడనిపించుకున్నాడు. పేరాశలు లేనివాడు. కృపిని ద్రోణుడికిచ్చి పెళ్ళిచేసాడు. చివరకు యుద్ధంనుంచి ధృతరాష్ట్రుడి దగ్గరకి వచ్చి వార్తల్ని చెబుతాడు.

#### 4. 1. 1. 1. 10. ద్రోణుడు :-

గంగా ద్వారంలో స్నానంచేసిన సమయంలో భరద్వాజ ఋషికి, ఘృతాచి అనే అప్సరస కనబడుతుంది. ఆమెని చూసి మోహిస్తాడు. ఇతడు తన కోరికని చెబుతాడు. కానీ, ఆమె నిరాకరిస్తుంది. అప్పుడు ఒక కుమ్మరి ఆడపడుచు ద్వారా కోరిక నెరవేర్చుకుంటాడు. ఆమెద్వారా పుట్టినవాడితడు. తల్లి పోలికలున్నవాడు. ఐదేళ్లుమాత్రమే తల్లి దగ్గరున్నాడు. కృపిని పెళ్లి చేసుకున్నాడు. ఆమెద్వారా అశ్వత్థామను పొందాడు. పాండవులంటే అభిమానం. శిష్యుల్లో అర్జునుడు ఇష్టమైనవాడు.

అగ్నివేశుడి దగ్గర శిష్యరికంచేసాడు. ద్రుపదుడికి సహాధ్యాయుడు. ద్రుపదుడిమీద కోపం వల్ల, అతణ్ణి బంధించేలా శిష్యుల్ని తయారుచేసాడు. చివరకు ద్రుపదుడి కొడుకు ధృష్టద్యుమ్నుడు చంపేస్తాడితణ్ణి. ఏకలవ్యుడికి కొంతవరకు విలువిద్య[1] నేర్పిస్తాడు కూడా.

---

[1] ద్రోణుడు, ఏకలవ్యుడి శ్రద్ధ, భక్తి విశ్వాసాలకి మెచ్చాడు. భీష్ముడి సూచన అయిన 'శూద్రులకి విలువిద్య నేర్పొద్దు' అనే అంశాన్ని పక్కకు పెట్టి ఇతడి దగ్గరికి రహస్యంగా పడవమీద అప్పుడప్పుడు వెళ్ళి ఏకలవ్యుడికి విలువిద్య నేర్పించాడు. భీష్ముడికి విషయం తెలిసిపోయి ఇప్పటిదాకా నేర్చుకున్న విద్యనివెనక్కి తీసుకోవాలని చెప్పాడు. అందుకే గురుదక్షిణ మిషతో కుడిచేతి బొటనవ్రేలు కత్తిరించేలాచేసాడు. తర్వాత మూలికలు తెచ్చి, కట్టుకట్టి, నాలుగువేళ్ళతో విద్య నేర్పించాడు. (పుటలు 493-495)

### 4. 1. 1. 1. 11. ధర్మరాజు :-

పాండురాజుకి క్షేత్రజ కుమారుడు.[2] కుంతికి, దేవధర్మాధికారికి నియోగపద్ధతి[3]లో పుట్టినవాడు. దేవధర్మాధికారి అనుగ్రహంచేత పుట్టాడు కాబట్టి 'ధర్మ' అని పాండురాజు పేరుపెట్టాడు. ఇతడు పేలవంగా ఉంటాడు. అందుకే పాండురాజు బలీయమైన కొడుకుని పొందాలనుకున్నాడు. ధర్మరాజు పాండవుల్లో పెద్దవాడు, ధర్మపరుడు, జూదగాడుకూడా.

### 4. 1. 1. 1. 12. భీముడు :-

పాండురాజుకి క్షేత్రజ కుమారుడు. దేగణ సేనాముఖ్యుడిద్వారా కుంతికి పుట్టాడు. బలీయమైన శరీరదారుఢ్యం ఉన్నవాడు. ధైర్యవంతుడు. మల్లయుద్ధం, గదాయుద్ధం బాగా చేయగలవాడు. హిడింబాసురుణ్ణి, బకుణ్ణి, కీచకుణ్ణి చంపినవాడు. సాలకటంకటిని[4] పెళ్ళి చేసుకున్నవాడు. వీరిద్దరికీ ఘటోత్కచుడు పుడతాడు.

### 4. 1. 1. 1. 13. అర్జునుడు :-

దేవలోకాధిపతికి, కుంతికి పుట్టినవాడు. పాండురాజుకి క్షేత్రజ కుమారుడు. ద్రుపదుడు తనని అవమానపరిచాడని ద్రోణుడు గురుదక్షిణగా ద్రుపదుణ్ణి కట్టి, తీసుకురమ్మని అడుగుతాడు. అర్జునుడు అలాగే చేస్తాడు. తద్వారా ఇతడు గురువుకు మరింత దగ్గరి శిష్యుడౌతాడు.

ఏకచక్రపురంనుంచి వచ్చాక, మత్స్యయంత్రం కొట్టి ద్రౌపదిని సాధించాడు. తల్లి సలహాని అనుసరించి పాండవులందరూ ద్రౌపదిని పెళ్లిచేసుకోడానికి ఒప్పుకుంటాడు. తరువాత ఒక ఒప్పందం కుదురుచుకుంటారు. ఒప్పందాన్ని అధిగమించి ఒకసారి అర్జునుడు ద్రౌపదితో కలుస్తాడు. మళ్ళీ ఒకసారి ద్రౌపది ఒప్పదం ఉన్నా అర్జునుడితో కలిశాక మళ్ళి మర్నాడు కలవాలని వెళ్తే ద్రౌపది నిరాకరిస్తుంది. ఎవరికీ చెప్పకుండా ఇతడు వెళ్ళిపోయి, మూడు సంవత్సరాలు పోయాక ఉలూచి, చిత్రాంగదలను పెళ్ళిచేసుకొని, సుభద్రని తీసుకొని వస్తాడు.

---

[2] తండ్రికి సంతానంయోగం లేకపోడంవల్ల ఆయన భార్య వేరేవారిద్వారా సంతానం పొందినట్లయితే ఆ పిల్లలకి తండ్రి పెళ్లిచేసుకున్న పురుషుడే, కాని పిల్లల్ని పుట్టించినవాడు తండ్రి కాదు. ఆ పిల్లలు పెళ్ళిచేసుకున్నతండ్రికి ఆ పిల్లలు క్షేత్రజ పుత్రులు అవుతారు.

[3] పాండురాజుకి నిర్వీర్యుడు అవడంచేత సంతానం కలిగించే అవకాశంలేదు. అప్పుడు ధర్మం ఏమిటి అని అతడి పురోహితుడివల్ల సంతానం పొందొచ్చు అనే ధర్మసూక్ష్మం తెలుసుకున్నాడు. అయినప్పటికి అతడి పురోహితుడు అనారోగ్యానికి గురైపోడంవల్ల దేవలోకం అనే ప్రదేశం నుంచి వచ్చిన ధర్మాధికారిని తన సందేహాన్ని అడిగి సంతానం ఇవ్వమని కోరుతాడు. ఇలా పర పురుషుడితో భార్యని సంతానంకోసం నియమిస్తే దాన్ని నియోగ పద్ధతి అంటారు. కల్మాషపాదుడి భార్య'మదయంతి'కి నియోగపద్ధతిద్వారా వసిష్ఠుడు పుత్రసంతానాన్ని ఇచ్చాడు. అతడే అశ్మకుడు (రాయతో కొట్టుకొనుటచే బయటకి వచ్చినవాడు).

[4] భీముడు హిడింబాసురుణ్ణి చంపినతర్వాత అతడి సోదరికి రచయిత పెట్టినపేరు సాలకటంకటి. వ్యాసభారతంలో హిడింబి. బహుశా చెట్లు ఎక్కడం, చెట్టులా పొడవుగా ఉండడంవల్ల రచయిత ఈ పేరు పెట్టి ఉండొచ్చు.

సుభద్రవిషయంలో కృష్ణుడికి మాటఇచ్చి[5], యాదవుల్ని ఎదిరించి, ఓడించి ఆమెను తెచ్చుకుంటాడు. సుభద్రకు అభిమన్యుడు పుడతాడు. కృష్ణుడు, శ్రవణుడు ఇతడి స్నేహితులు.

### 4. 1. 1. 1. 14. కృష్ణుడు :-

బలరాముడి సోదరుడు. అర్జునుడికి నేస్తం. సుభద్రకు సోదరుడు. పాండవులకు చాలా సహాయం చేస్తాడు. ఖాండవవన దహనంలో, జరాసంధుడి మరణానికి, రాజసూయానికి, పాంచాలి అవమానానికి గురైనప్పుడు (అజ్ఞాతంగా) ఇతడు సహాయం చేసాడు. సుభద్రను అర్జునుడు వివాహం చేసుకోడానికి, ఉత్తర వివాహానికి, రాయబారానికి, యుద్ధానికి మొదలైన విషయాలలో పాండవులకు సహాయాన్ని అందించాడు.

### 4. 1. 1. 1. 15. బలరాముడు :-

మధురకు రాజు. సుభద్రకి, కృష్ణుడి అన్నయ్య. దుర్యోధనుడికి గదా యుద్ధం నేర్పినవాడు. అతడంటే ఇష్టంకూడా. సుభద్రను అర్జునుడు పెళ్ళిచేసుకున్నాక, అర్జునుడంటే అయిష్టత ప్రదర్శించాడు. నీవు కూడా యుద్ధానికి వస్తే ఇద్దరు ఎదురెదురుగా యుద్ధం చేయవలసి వస్తుందని, కృష్ణుడు అనడంవల్ల కురుక్షేత్ర యుద్ధంలో పాల్గోలేదు.

### 4. 1. 1. 1. 16. యుయుధాన సాత్యకి :-

సత్యకుడి కొడుకు. శ్రీకృష్ణుడితో సన్నిహితంగా ఉండే స్నేహితుడు. యుద్ధ సమయంలో పాండవుల పక్షాన పోరాడుతాడు. ధృష్టద్యుమ్నుడికి యుద్ధసమయంలో సాయంగా వెళ్ళి రక్షిస్తుంటాడు. అభిమన్యుడికి విలువిద్య నేర్పిస్తాడు.

### 4. 1. 1. 1. 17. ధృష్టద్యుమ్నుడు :-

ద్రుపదుడి కొడుకు. ద్రౌపదికి అన్న, పాండవపక్షంలో సేనాముఖ్యుడు. యోధుడు. ఉపపాండవుల్ని పెంచే బాధ్యతల్ని తీసుకున్నాడు. వాళ్లకు విలువిద్యల్ని నేర్పుతాడు. యుద్ధంలో ద్రోణుణ్ణి కత్తి పట్టి చంపాడు. యుద్ధంలో చివరివరకూ ఉంటాడు. తండ్రిని అవమానపరిచిన ద్రోణుణ్ణి చంపి తండ్రి పగ తీరుస్తాడు. తన తండ్రిని(ద్రోణుడు) చంపినందుకు అశ్వత్థామ ఇతడు నిద్రలో ఉన్న సమయంలో ఇతణ్ణి, ఉపపాండవుల్ని చంపుతాడు.

### 4. 1. 1. 1. 18. శిఖండి :-

భీష్ముణ్ణి చంపి ప్రతీకారం తీర్చుకోడానికే కాశీరాజు కూతురుగా అంబ అనేది మంటల్లో పడి ప్రాణత్యాగం చేసుకుంది. ఆ తర్వాత ద్రుపదుడి ఇంట శిఖండిగా పుట్టింది.(పుట. 573) భీష్ముణ్ణి యుద్ధంనుంచి తొలగించడానికి బాగా ఉపయోగపడిన పాత్ర.

[5] కృష్ణుడు అర్జునుడితో సుభద్ర నిన్ను వరించకపోతే కష్టం.లేదా స్వయవరంలోనే నిన్ను కర్ణుణ్ణి ద్రౌపది వద్దని చెప్పినట్లు సుభద్ర అనొచ్చు. ఎందుకంటే నీవు నా వయస్సువాడివి. అయిదు మందిభార్యల్ని చేసుకున్న సమష్టి కుటుంబీకుడివి అని మనసులోఉంటే వరించకపోవచ్చు. అప్పుడు తనొక్కడికి మాత్రమేభార్యఅని, ఒట్టువేసి కృష్ణుడికి అర్జునుడు మాట ఇస్తాడు.(పర్వ,పుట.244)

ధృష్టద్యుమ్నుడు శిఖండి వేర్వేరుగా చెప్పారు. మూలంలో [6]ఇలా ఇద్దరుగా లేరు.

### 4. 1. 1. 1. 19. దుర్యోధనుడు :-

ఇతడు ధృతరాష్ట్ర, గాంధారీల ప్రథమ పుత్రుడు. ద్రౌపది స్వయంవరానికి వెళ్లి, మత్స్య యంత్రాన్ని కొట్టలేక, కర్ణుణ్ణి ఆ పనికి పురమాయిస్తాడు. కర్ణుణ్ణి సూతపుత్రుడని ద్రౌపది అభ్యంతరం చెబుతుంది. చివరకు బ్రాహ్మణవేషంలో ఉన్న అర్జునుడు మత్స్య యంత్రాన్ని ఛేదిస్తాడు. అతడిపై అక్కడున్న రాజులు యుద్ధానికి తయారై అభాసు పాలౌతారు. ద్రౌపదిని తీసుకువచ్చి దుశ్శాసనుడిచేత వస్త్రభంగానికి ప్రోత్సహిస్తాడు. తన తొడమీదకు వచ్చి, కూర్చోమని ద్రౌపదిని ఆదేశిస్తాడు. ఇలా అనుచితమైనపనులు చేస్తూ దుర్మార్గుడిగా కనిపిస్తాడు. కర్ణుడికి ఆప్తమిత్రుడుగా అతడిని గౌరవిస్తాడు. పాండవుల్ని అవమానపరచాలని ప్రయత్నాలు చేస్తూ ఉంటాడు.

### 4. 1. 1. 1. 20. ఘటోత్కచుడు :-

సాలకటంకటికి, భీముడికి పుట్టినవాడు. వీరోచితంగా పోరాడే స్వభావం ఉన్నవాడు. తల్లి చెప్పిందని భీముణ్ణి భుజాలమీద ఎక్కించుకొని పరుగులాంటి నడకతో జాగ్రత్తగా ఇంటికి తీసువచ్చే వినయం ఉన్నవాడు. గౌరవవంతుడు. ఇతడి మామ హిడింబాసురుడు. అతడి రాజ్యాన్ని కాపాడుకోగలిగాడు. పాండవపక్షంలో వీరోచితంగా పోరాడాడు. అలాయుధుడితో పోరాడుతున్న సమయంలో వెనుకనుంచి కర్ణుడు కత్తితో ఇతడి పీక(మెడ)ను కోసినప్పుడు మరణించాడు[7]. దూరంనుంచి భీముడు అరుస్తూ చెబుతున్నా, ఆ పిలుపు రణ ఘోషలో ఇతడికి వినబడలేదు.

### 4. 1. 1. 1. 21. సంజయుడు :-

గవల్గణుడి కొడుకు. ధృతరాష్ట్రుడి మెప్పుల్ని పొందెలా కొన్నింటిని కల్పించి యుద్ధభూమినుంచి వార్తలు సేకరించి వినిపిస్తాడు. కొన్ని అవాస్తవాలని, వాస్తవాలుగా చెప్తాడు. విదురుడికి మాత్రం వాస్తవాలు చెబుతాడు. కర్ణుడి ప్రతాపాన్ని విపరీతంగా వర్ణించి ధృతరాష్ట్రుణ్ణి ఆనందింపజేస్తాడు. చివరికి కుంతికొడుకు కర్ణుడని చెప్పేద్దామని పాండవ శిబిరానికి వెళ్ళి దెబ్బలుతింటాడు.

### 4. 1. 1. 1. 22. జరాసంధుడు :-

బృహద్రదుడికి విపులగిరికి ఆవల రణ్యంలో ఉన్న స్త్రీకి పుట్టినవాడు. 'జర'

---

[6] ద్రుపదుడికి కొడుకో, కూతురో తెలియనిస్థితి. అయినప్పటికీ ద్రోణుడే విలువిద్యాదుల్ని నేర్పాడు. దశార్ణవ దేశాధిపతి 'హేమవర్మ' కూతురుతో వివాహం అయింది. ఆమె పురుషుడు కాడని దాసితో చెప్పింది. ఆ రాజుకి తెలిసి ద్రుపదుడి మీదకు యుద్ధానికి వచ్చాడు. ద్రుపదుడు పారిపోయాడు. ఒక యక్షుడిద్వారా మళ్ళీ పుంస్త్వం పొందాడు. అంబ ఇలా పుట్టిందని ఒక కథ ప్రచారంలో ఉంది. ద్రోణుణ్ణి చంపగలిగే కొడుకు కావాలని యజ్ఞంలో పుట్టిన ధృష్టద్యుమ్నుడితడే అని ఉంది.(పూర్వగాథాలహరి, పుటలు.218 మరియు413)

[7] ఈ పాత్ర భాగవతంలోది. దీన్ని రచయిత తీసుకున్నాడు. శ్రీకృష్ణుది విషయాన్ని వివరించే సందర్భంలో ఇతడి ప్రస్తావన వస్తుంది. భాగవతంలో ఇతడి రాజధాని ప్రాగ్జ్యోతిషపురం. ఇతడు పదహారువేల మంది స్త్రీలను చెఱపట్టాడు. సత్యాకృష్ణులు సంహరించారు. ఈ నవలలో ఇతడికి సంబంధించిన చాలా అంశాలు మార్చారు.

అనేపేరుతో ఉన్న రాక్షసి చీరి పారేసినట్లు ఉన్న శరీరాన్ని కలపడంవల్ల ఇతడికి ఈ పేరు పెట్టారు. మధురలో కృష్ణుణ్ణి చంపడానికి దండెత్తి వచ్చినవాడు. శిశుపాలుడికి ఆప్తుడు. తనకూతుర్లు ఇద్దరినీ కంసుడికిచ్చి పెళ్ళిచేసాడు. భీష్మకుడి కుమార్తె రుక్మిణిని శిశుపాలుడికిచ్చి పెళ్ళిచేయాలని అనుకుంటాడు. గిరివ్రజపురానికి రాజవుతాడు. అందుకే విదర్భ స్వయంవర సమయంలో పెద్ద సైన్యం తీసుకొని వెళ్తాడు. కృష్ణుడు, భీముడు, అర్జునుడు కలిసి తంత్రంతో ఇతడిని చంపుతాడు. ఇతడి కొడుకు సహదేవుడు. భీముడితో మల్లయుద్ధానికి ముందే సహదేవుడికి కిరీటం అందిస్తాడు. చాలామంది స్త్రీల్ని, రాణుల్ని చెఱబడతాడు. భీముడి చేతిలో మరణిస్తాడు.

### 4. 1. 1. 1. 23. కంసుడు :-

ఉగ్రసేనుడి భార్యకు, ద్రుమిళుడనే రాక్షసజాతిస్త్రీకి పుట్టినవాడు. ఇతడి కథను చిత్ర అనే దాసి యుయుధాన సాత్యకికి చెబుతున్నట్లు ఈ నవలలో ఉంది. మధుర దగ్గర ఉత్తరభాగంలో గుట్టల ప్రాంతంలో అడవిని నరికి ద్రుమిళుడు రాజ్యాన్ని స్థాపించుకున్నాడు. ఉగ్రసేనుడి భార్య ద్రుమిళుడికి ఎదురుగా వెళ్ళి నిలబడి, "ఒరే పురుషుడా! నువ్వు నా మొగుని వేషంలో ఎందుకు వచ్చావు" అనిఅడిగితే, వాడు బదులు చెప్పకుండా ఉంటాడా? (పుట.292)తరుణీ, నేను వేషధారినికాదు, నిజమైన పురుషుణ్ణి అని చెప్పాడు. అక్కడనుంచి ఎవరికీ అనుమానంలేకుండా అతడితో ఆమె గడిపేది. తద్వారా పుట్టినవాడే కంసుడు. ద్రుమిళుడిరూపంతో పుట్టాడు. విషయంతెలుసుకున్న ఉగ్రసేనుడికి నువ్వేఅలా వచ్చావేమో అని తప్పించుకొని, నమ్మించేలా ఆమె సమాధానం చెప్పేది. ఇతడికి భార్యలు అస్తి, ప్రాప్తి. పినతండ్రి కూతురు దేవకి అంటే ఇతడికి ఇష్టం. చివరకి కృష్ణుడిచేతిలో మరణిస్తాడు.

### 4. 1. 1. 1. 24. నరకాసురుడు :-

చాలామందిఆడవాళ్ల జీవితాన్ని చెఱపట్టిన రాక్షసరాజు. 'ఆనర్తనదేశ'(ద్వారక) జీవన విధానాన్ని నరకంగా మార్చేయడంవల్ల ఇతడికి ఈ పేరు పెట్టారు. నరకాసురుణ్ణి చంపి, నరకుడు చెఱపట్టిన ఆడవాళ్లలో ఇరవైనాలుగు మందిని కృష్ణుడు పెళ్ళి చేసుకొన్నాడు. వాళ్లని 'తామ్రస్థలి' లో అడవులు నరికించి, వ్యవసాయానికి అనువుగా చేసి, ఇల్లు కట్టించి ఇచ్చి, కృష్ణుడక్కడే ఉంచాడు.

### 4. 1. 1. 1. 25. ఉగ్రసేనుడు :-

నూటపదిసంవత్సరాల ముసలివాడు. అయినా రాజపట్టం వదలనివాడు. ఇతడి భార్య మహా ధైర్యవంతురాలు. ఆమె ద్రుమిళుడితో కలిసింది[8]. ఇతడు ఆ విషయంమీద అనుమానం

[8] ఉగ్రసేనుడి భార్య, కొందరు యాదవస్త్రీలతో యమునా నదికి స్నానానికి వెళ్ళింది. అక్కడ ఉగ్రసేనుడి భార్య రజస్వల అయింది. ఆమె మనస్సులో భర్తని తలుచుంకొంది. ఆ వియాన్ని తెలుసుకున్న ద్రుమిళుడనే రాక్షసుడు మాయచేత ఉగ్రసేనుడిలా ఆమెతో కలిసాడు. ఆ విషయాన్ని తెలుసుకున్న ఆమె 'నీవు ఎవడివి' అని అడిగింది. తను గురించి చెప్పి, ఎందరు వ్యభిచారం వల్ల పిల్లల్ని కనరు? పుట్టినవాడు బలాఢ్యుడా కాదా? అన్నది ముఖ్యమని అంటాడు. దాంతో కోపం వచ్చి, నీ దుర్బీజం వల్ల పుట్టినవాడు, హరివంశంలో పుట్టినవాడిచేతిలో మరణిస్తాడని అంటుంది. (పూర్వగాథాలహరి,పుట. 70)

వచ్చి, చిత్ర అనే దాసిని కొట్లో పడేసి, కాళ్లూచేతులూ కట్టేసి, నిజం తెలుసుకున్నాడు. అదే రాత్రి ద్రుమిళుడు రాణి అంతఃపురంలోకి వచ్చాడు. కానీ, ఆమె "నువ్వేనని కూర్చోబెట్టి మాట్లాడుతున్నాను. అంతలో నువ్వేవచ్చేశావు"(పుట. 293)అంటూ సాధించి, ఉగ్రసేనుడి బుద్ధిని భ్రమించేలా చేసింది. పెళ్లయి నాలుగేళ్లు అయిన గర్భం రాలేదు. ద్రుమిళుడితో కలవడం వల్ల గర్భం నిలిచింది. ఈ విషయం ఎవరికీ చెప్పొద్దని, మహారాజే దాసితో అన్నాడు. ఆ తర్వాత కూడా ఆమె ద్రుమిళుడితో రహస్యంగా కలుస్తూనే ఉంది. కానీ, ఆ విషయం మహారాజుకి తెలీదు. తద్వారా న్యగ్రోధ, సునామ, కంక, సుభూమిప, శంకుసుతను, అనాధృష్టి, పుష్టిమాన్ కొడుకులు; కంసా, కంసవతి, సుతనూ, కంకా, రాష్ట్రపాలీలు ఆడపిల్లలూ పుట్టారు.

కంసుణ్ణి చిన్నప్పటినుంచి ఉగ్రసేనుడు ఎప్పుడు ఎత్తుకోలేదు, ముద్దుకూడా పెట్టలేదు. చివరికి ఇతడు దాసీవల్ల కంసుడికి తండ్రి ఉగ్రసేనుడు కాదన్న విషయం తెలుసుకున్నాడు. సభలోకి వెళ్ళి నిలబడి, ఇవాళే రాజ్యపట్టం కట్టమని ఉగ్రసేనుణ్ణి ప్రశ్నించేసరికి, చేసేదిలేక చేతులతో తనే ఇతణ్ణి రాజుగా చేసాడు. ఆ తర్వాత ఇతడు సోదరులు అడ్డులేకుండా, సోదరులు అందరూ నీటిలో మునిగిపోయారని, పులివచ్చి కొందర్ని ఎత్తుకు పోయినట్లు చెప్పించాడు. (పుటలు. 294-296)

### 4. 1. 1. 1. 26. శిశుపాలుడు :-

ధర్మఘోషుడి కొడుకు. యాదవ మూలానికి చెందినస్త్రీ ఇతడితల్లి. జరాసంధుడు పెద్ద సేనను తీసుకొచ్చాడు. (పుట. 336) మధురని నేలమట్టంచేసే పనిని ఇతడే పర్యవేక్షించాడు. మూడు రోజుల్లో ఆ పనిని పూర్తిచేసాడు. దానికి జరాసంధుడు మెచ్చుకొని, సంతోషంతో వెన్నుతట్టి కౌగలించుకున్నాడు. అందుకే శిశుపాలుడు జరాసంధుడు దత్తపుత్రుడని అంటారు. భీష్మకుడి కూతురు, రుక్మిణిని శిశుపాలుడికిచ్చి పెళ్లిచేయిస్తానని జరాసంధుడు శిశుపాలుడికి మాట ఇచ్చాడు. అందుకే పెద్దసైన్యంతో జరాసంధుడు స్వయంవరానికి వచ్చాడు. భీష్మకుణ్ణి దబాయించి అయినా రుక్మిణిని శిశుపాలుడికి ఇప్పించే స్థితిలో జరాసంధుడున్నాడు. అప్పుడే కృష్ణుడు వచ్చి, ఆమెని ఎత్తుకుపోయాడు.(పుట. 313)

### 4. 1. 1. 1. 27. భూరిశ్రవుడు :-

చంద్రవంశంవాడు. ఇతడి సోదరుడు భూరి. దుర్యోధనుడు ఇతడిని ఒకసేనాముఖ్యుడిగా చేసాడు. వజ్ర, అజులకు పరిచయమయ్యాడు. ఇతడికి ప్రత్యేక గూఢచారి వ్యవస్థఉండేది. దానిద్వారా యుద్ధ విషయాలు ముందుగానే తెలుసుకొనేవాడు.

పాండవులే దాడి చేస్తున్నారని తెలుసుకుంటాడు. కాబట్టి త్రోవను చూసుకొని వస్తున్నట్లు చెప్తాడు. ఎక్కడికి వస్తారో తెలీదని, ఉపప్లావ్యంనుంచీ బయలుదేరరని భీముడు సైన్యానికి ముందున్నాడని, అతడి వెనుకే మిగిలినవారు, అస్త్రశస్త్రాలు కావల్సిన సామానులు, వైద్యులు వస్తున్నారని వివరిస్తాడు (పుటలు. 412- 413)

### 4. 1. 1. 1. 28. ఏకలవ్యుడు :-

కురుపాంచాల రాజ్యాల మధ్య అరణ్యాల్లో నివసిస్తున్ననిషాదుల ముఖ్యుడి కొడుకు. ఆర్యుడు కానివాడికి విద్యాభ్యాసం చేయవద్దని భీష్ముడు చెప్పాడు అతడి సూచనను పట్టించు కోకుండా భక్తి శ్రద్ధలున్న ఏకలవ్యుడికోసం నావలో కూర్చొని విలువిద్య నేర్పుతూ వచ్చేవాడు. ఒకరోజు రాజకుమారులందరూ అడవిలోకి వస్తున్న సమయంలో ఒక కుక్క మొరుగుతుంది. దాన్ని బాణంతో కొడితే అది నాలుకలోకి గుచ్చుకుంటుంది. ఇంత నిక్కచ్చిగా శబ్దవేదిని గురిపెట్టిన వాళ్ళెవరో అని వెదుకుతూ ఏకలవ్యుణ్ణి చూస్తారు. ఎవరు నీవు? నీ గురువు ఎవరు?, అని అడిగారు. తరువాత మట్టి విగ్రహంలో ఉన్న ద్రోణుణ్ణి చూసారు. ద్రోణుడు అర్జునుణ్ణి విలువిద్యల్లో మేటి విలుకాడిగా చేస్తానని, అంతకుముందే హామీ ఇచ్చాడు. దాన్ని నిలబెట్టు కోడానికి ద్రోణుడు, ఏకలవ్యుడి కుడిచేతి బొటనవ్రేలిని కత్తిరించి దక్షిణగా తీసుకుంటాడు. తర్వాత నాలుగు వేళ్ళతో ఏకలవ్యుడు అభ్యాసం చేస్తాడు.

కురుక్షేత్ర సమయంలో ద్రోణుణ్ణి ఏకలవ్యుడు దర్శించాడు. అర్జునుడినే ప్రియశిష్యుడిగా భావించి, తన బోటనవ్రేలుని ద్రోణుడు తీసుకున్నాడని భావించాడు. కాని, అర్జునుడికి ప్రత్యర్థిగా ద్రోణుడు యుద్ధం చేయడాన్ని తెలుసుకొని, నిజాన్ని అడిగి తెలుకొన్నాడు. అసలు కుట్ర అంతా భీష్ముడిదే అని తెలుసుకొని, కౌరవ, పాండవులకు ఎవరికీ సాయం చేయకుండా తన రాజ్యానికి వెళ్ళిపోతాడు. (పుటలు 492-495)

### 4. 1. 1. 1. 29. బృహద్రథుడు :-

ఇతడు జరాసంధుడి తండ్రి. 'జర' అనే రాక్షసస్త్రీని ఇతడు వలచి పెళ్ళిచేసుకున్నాడు. వీరిద్దరికి పుట్టినవాడు జరాసంధుడు. ఇతడి భార్యాకులంలోని ప్రతి ఒక్కరిని ఎలుగుల్లాగా వేటాడి చంపి, చర్మం ఒలిపించాడు. రాక్షసకులం, పక్కనున్న రాజ్యాలు వణికి బెదరిపోయేంత మగధీరు డితడు. నరమాంసాన్ని మరిగిన ఒక రాక్షసగుంపును వేటాడి సజీవులైన వారందరి చర్మం ఒలిపించి పదును చేసి, ఎండబెట్టి పెద్దరాగి నగారాలను తయారు చేయించాడు.

చైత్యక శిఖరం మీద పువ్వుల ఆకారంలో దిన్నెలు కట్టించి ఆ నగారాలను పెట్టాడు. ప్రతీరోజూ పొద్దునా, సాయంకాలం, నడిరాత్రిలో మూడుసార్లు ధగ్గ్ ధగ్గ్ ధగ్గ్ అని వాటిని మోగిస్తారు. తద్వారా ప్రజల్లో శరణాగతి భావన పుట్టేది. వాటిని శ్రీకృష్ణుడు పగలు గొట్టిస్తాడు.

### 4. 1. 1. 1. 30. నీలుడు :-

విరాటరాజుకు అంగ రక్షకుడుగా పనిచేస్తాడు. భీముడు వంటవాడిగా ఉన్నప్పుడు, అతడితో పరిచయం పెంచుకుంటాడు. తరుచు ఏదో విధంగా మాట్లాడుతునే ఉంటాడు. భీముడు, బకుణ్ణి, కిమ్మీరుణ్ణి, హిడింబాసురుణ్ణి ఎలా చంపాడో తెలుకోవాలని కుతూహలపడి ఇతడు అడుగుతాడు. సాలకటంకటి దగ్గరికెళ్ళడంకోసం భీముడితో అరణ్య ప్రాంతానికి వెళ్లాడితడు. దారిలో భీముడికి కావల్సిన సదుపాయాలు చేస్తాడు.

### 4. 1. 1. 2. స్త్రీపాత్రలు :-

### 4. 1. 1. 2. 1. ద్రౌపది :-

ద్రుపద రాజకుమార్తె. ఈమెసోదరుడు ధృష్టద్యుమ్నుడు. మత్స్య యంత్రాన్ని కొట్టడానికి వచ్చిన కర్ణుణ్ణి ఉద్దేశించి, 'సూత పుత్రుణ్ణి వరించను' అని ధైర్యంగా చెప్పింది. బ్రాహ్మణవేషంలో ఉన్న అర్జునుణ్ణి వివాహం చేసుకుంది. అర్జునుడు తనని పరిచయం చేసుకోకుండా ముందు ద్రౌపది మనసులోని అర్జునుడి పట్ల ఉన్న అభిప్రాయాన్ని తెలుసు కోవాలనుకున్నాడు.

ఈ సమయంలో అర్జునుడే నీ దగ్గరికి వస్తే, ఏంచేస్తావని బ్రాహ్మణవేషంలో ఉన్న అర్జునుడు ద్రౌపదిని అడుగుతాడు. తను పెళ్ళి చేసుకున్న భర్తకు స్నేహితుడిగా ఉండమని కోరుతానని, అటువంటి వీరుడికి ఇతడితో జోడీ కుదురుతుందని సమాధానం చెబుతుంది. బ్రాహ్మణ రూపంలో ఉన్నవాడిని కూడా అర్జునుడితోనే పోలుస్తుంది. ఈమెకు కృష్ణుడంటే ఇష్టం. కుంతిపట్ల విధేయురాలిగా ఉంటుంది. ధృతరాష్ట్రుడు వరాలు అడిగితే రెండే కోరుకొని, క్షత్రియ స్త్రీగా నిరూపించుకుంటుంది. చాలా సార్లు అవమానాలకి గురౌతుంది. చివరకు ప్రతీకారాలు తీర్చుకున్నపాత్రగా, భీమాదులకు ఆకర్షణీయమైన భార్యగా కనబడుతోంది. అశ్వత్థామలాంటి పాత్రల్లో మరోకోణంలో కనిపిస్తుంది. యుద్ధంలో కొడుకు లందర్ని కోల్పోతుంది.

### 4. 1. 1. 2. 2. భానుమతి :-

దుర్యోధనుడి భార్య. ద్రౌపదిని సభలోకి తీసుకొచ్చినప్పుడు గాంధారి దగ్గరికి పరుగెత్తిన వాళ్ళలో ఈమె ఉంది. ద్రౌపది అంటే అభిమానం. చివరలో కుంతిని చూసినప్పుడు ఏమీ మాట్లాడకుండా ఉంటుంది.

### 4. 1. 1. 2. 3. సుభద్ర :-

బలరామ, కృష్ణులకు సోదరి. అర్జునుడు యతివేషంలో మధురకు వచ్చినప్పుడు సేవలు చేయడానికి ఈమె నియమితురాలౌతుంది. యతి రూపంలోప ఉన్న అర్జునుడికి సేవలుచేస్తూ అర్జునుడి విషయాలు అడుగుతుంది. కృష్ణుడి సహాయంతో, అర్జునుణ్ణి వివాహం చేసుకుంటుంది. ఈమె తర్వాత అర్జునుడు ఇంకెవరనీ పెళ్ళి చేసుకోడు. అభిమన్యుణ్ణి కంటుంది.

### 4. 1. 1. 2. 4. చిత్రాంగద :-

ఈమె చిత్రవాహనరాజు కూతురు. స్పష్టంగా తీసినట్లున్న తెల్లటికన్నులమీద సన్నటి కనుబొమలు, తెలుపు, కెంపులుకలిపి పసుపుపచ్చటిరంగులోకి తిరిగిన మృదువైన రంగు ముఖంతో ఉన్న పాత్ర ఈమె. చిత్రవాహనుడే చిత్రాంగదని పెళ్ళి చేసుకోమని అర్జునుణ్ణి కోరుతాడు. ఆమెకు పుట్టినవాడికే ఉత్తరాధికారిగా, సింహాసనం అధిష్ఠించాలని, చిత్రవాహనుడు అంటాడు. ఈమె బభ్రువాహనుణ్ణి కంటుంది.

**4. 1. 1. 2. 5. ఉలూపి ః-**

ఐరావత కులం లోని నాగజాతి ప్రముఖుడి కూతురు. స్వచ్ఛందంగా అర్జునుడి దగ్గరికి వచ్చి, అతణ్ణి ఇష్టపడి తీసుకెళ్ళింది. డాబూ, దాపరికం, బిడియం, బింకంలేని పాత్ర. ఆరు నెలలు అర్జునుడు ఈమె దగ్గర ఉన్నాడు. ఈమె దగ్గర అర్జునుడు చాలా ఉత్సాహంతో ఉండేవాడు.

**4. 1. 1. 2. 6. దుస్సల ః-**

గాంధారీ, ధృతరాష్ట్రుల పుత్రిక. జయద్రధుడికిచ్చి పెళ్ళి చేస్తారు. పాండవులు తన భర్తని అవమానపరిచారని పాండవులమీద ద్వేషంతో ఉంటుంది. చివరకు అర్జునుడు జయద్రధుణ్ణి చంపుతాడు. చివర్లో పల్లు బిగించి మాట్లాడేపాత్ర.

**4. 1. 1. 2. 7. ఊర్వశి ః-**

దేవలోకంలో ఉండే అప్సరస. ఇంద్రుడు అర్జునుడికి 'విజయుడు' అనే బిరుదునిచ్చి, ఊర్వశినికూడా ప్రదానం చేస్తాడు. అర్జునుడంటే ఈమెకు ఇష్టం. ఈమె కామవాంఛ విషయంలో అర్జునుడు ముడుచుకుపోతాడు. నువ్వు విలుగాడివి, వీరుడివి కావచ్చు, అయినప్పటికీ నపుంసకుడివి అని 'ఫెడేల్' మని కొట్టి వెళ్ళిపోతుంది.(పుట. 264)

**4. 1. 1. 2. 8. మాద్రి ః-**

మద్రరాజకుమార్తె. శల్యుడికి చెల్లెలు. పాండురాజుకి రెండోభార్య. కుంతికి మూడు సంవత్సరాలైనా పిల్లలు పుట్టలేదని భీష్ముడు కన్యాశుల్కంగా చాలా వస్తువులు శల్యుడికిచ్చాడు. తరువాత ఈమెను తీసుకువచ్చి, పాండురాజుతో పెళ్ళి చేసాడు. చిన్నప్పుడే భర్తని ఎలా లొంగదీసుకోవాలో నేర్చుకుంటుంది. దేవవైద్యులవల్ల నియోగ పద్ధతిలో నకుల, సహదేవుళ్ళని కంటుంది. పాండువును కలవవద్దన్నా, ఈమెతో సంగమం చేసి ప్రాణాలు కోల్పోతాడు. అతడితో సహగమనం ఈమె చేస్తుంది. పిల్లల్ని కుంతికి చేతిలో పెడుతుంది.

**4. 1. 1. 2. 9. రుక్మిణి ః-**

రుక్మి చెల్లెలు. కృష్ణుడిభార్య. ప్రద్యుమ్నుడికి తల్లి. పదిమంది మగ పిల్లలు[9], ఒక ఆడపిల్లని కంటుంది. రుక్మిణికి నాల్గవ సంతానం ప్రద్యుమ్నుడు. చాలా సంవత్సరాలవరకూ పుట్టింటికి వెళ్లదు. ఒకసారి కృష్ణుడి అనుమతితో వెళ్ళి, రుక్మి పాదాలమీద కన్నీటితో

[9] శ్రీకృష్ణుడికి రుక్మిణికి పదిమంది మగపిల్లల్నే ఉన్నట్లు భాగవతంలో ఉంది. వారు ప్రద్యుమ్నుడు, చారు, ధేష్ణుడు, చారుభద్రుడు, సుధేష్ణుడు, సుచారుదు, చారుదేహుడు, చారుగుప్తుడు, విచారువు, చారువు.పెద్దవాదిగా ప్రద్యుమ్నుణ్ణి చెప్తె, దాన్ని నాల్గవ కుమారుడిగా నవలలో మార్చారు.(పూర్వగాథాలహరి, పుట. 349) ఆడపిల్లలున్నట్లు చెప్పలేదు. దాన్ని ఇక్కడ రచయిత మార్పుచేసారు. శుభాంగి రుక్మి కూతురు. ఈమెకు స్వయంవరం ఏర్పాటుచేయడం భాగవతంలో ఉంది. అప్పుడు ప్రద్యుమ్నుణ్ణి వరిస్తుంది. కానీ, ఇక్కడ రుక్మిణి అడగడం, అంతకు ముందు కృష్ణుడు రుక్మిణిని స్వయంవరంలోంచి ఎత్తుకెళ్ళి వివాహంచేసుకున్నాడు. ఆ విషయంలో కోపంలేదని నిరూపించడానికి ఈ వివాహం చేస్తున్నట్లు నవలలో మార్పు చేసారు. (పర్వ,పుట.277)

నమస్కరిస్తుంది. అతడి కుమార్తె శుభాంగిని ప్రద్యుమ్నుడికిచ్చి పెళ్ళిచేయమని కోరుతుంది. పెళ్లిసమయంలో బలరాముడికి, రుక్మికి జూదంలో తగాదా వస్తుంది. అదేఅదునుగా బలరాముడు రుక్మిని చంపేస్తాడు. ఈమె దుఃఖిస్తుంది.

### 4. 1. 1. 2. 10. అస్తి, ప్రాప్తి :-

వీళ్ళిద్దరు జరాసంధుడి కూతుర్లు. పెద్దామె పేరు అస్తి, రెండో ఆమె పేరు ప్రాప్తి. వీళ్లు కంసుడికి భార్యలు. ఇద్దరికీ పిల్లలు పుట్టలేదు. శ్రీకృష్ణుడికి వరసకు అత్తలు. శ్రీకృష్ణుడు కంసుణ్ణి చంపేసిన తర్వాత కంసుడింటికి వీరిద్దరూ వచ్చేస్తారు.(పుట. 297)

### 4. 1. 1. 2. 11. రాధ :-

పృథకు ఇష్టమైన సఖి. పృథయొక్క పెంపుడు తల్లికి విశ్వాసపాత్రమైన చెలికత్తె. కర్ణుణ్ణి పెంచిన తల్లి. కుంతి దుర్వాసులవల్ల గర్భంపొందాక, పుట్టిన బిడ్డను ఈమే సాకింది. తర్వాత పాండురాజుతో కుంతికి వివాహం అయింది. నియోగపద్ధతిలో కుంతి పిల్లల్ని కన్నాక, పాండురాజు చనిపోయాడు. మళ్ళీ కుంతిదగ్గరకు ఈమె వస్తుంది. కర్ణుడు తనదగ్గరే ఉన్నాడని, ధనుర్విద్య నేర్చుకోడానికి వేరేదేశం వెళ్ళాడని చెప్పింది. ఇప్పుడు నిజంతెలిస్తే కుంతి మర్యాదపోతుందని, తనబిడ్డగా ఉంచమని, కుంతిదగ్గర మాట తీసుకుంటుంది. తర్వాత చనిపోతుంది. (పుట .390)

### 4. 1. 1. 2. 12. కుంతి :-

పెళ్ళికాకముందే దూర్వాసుల వల్ల గర్భంధరిస్తుంది. పుట్టినవాణ్ణి తెలీకుండా ఒక దాసి (రాధ) తీసుకొని పెంచుతుంది. తర్వాత కుంతికి స్వయంవరం ఏర్పాటుచేస్తాడు. పాండురాజుని సూర్యుడే అనుకొని ఈమె పాండురాజునే వరిస్తుంది.

పాండురాజు షండుడు. రెండోభార్యవచ్చాక నియోగ పద్ధతిలో ధర్ముడు, భీముడు, అర్జునుణ్ణి కంటుంది. మాద్రి సహగమనంతో హస్తినకు పిల్లలందర్నీ తీసుకు వస్తుంది. అప్పటినుంచీ పాండవుల్ని సాకి, ప్రయోజకుల్ని చేయడంలో ఈమె బాధ్యత వహిస్తుంది. కొడుకుల కష్టాల్ని చూసి బాధ పడుతుంది. యుద్ధంలో మనుమల్ని కోల్పోతుంది. పాండవులు విజయం పొందేవరకు విదురుడి ఇంటిలో ఉంటుంది.

### 4. 1. 1. 2. 13. గాంధారి :-

పాండురాజు కుంతి, మాద్రిల్ని పెళ్ళిచేసుకొని, కొంతకాలానికి హిమాలయ ప్రాంతాలకు వెళ్ళి అక్కడే ఉండిపోయాడు. ఎప్పటికీ పాండురాజు రాకపోయేటప్పటికి భీష్ముడు కురువంశమూ, హస్తినాపురాన్ని కాపాడాలని గాంధారదేశానికి రథాలు, గుర్రాలు, సైన్యం, బళ్ళనిండా ఐశ్వర్యం నింపుకొని వెళ్లి, గాంధారిని తెచ్చి ధృతరాష్ట్రుడితో వివాహం చేయించాడు.

పెళ్ళికి ముందు ఈమె అద్దంలో చూసి, తన అందానికి తానే మురిసిపోయేది. గుడ్డిమొగుణ్ణి కట్టబెడుతున్నాడని అలిగి, కళ్ళకు గంతలు కట్టుకుంది. తర్వాత 'సాధ్విగా'

అందరూ అనేసరికి, గంతలు విప్పకుండానే కొనసాగించింది. చివరకు శ్రీకృష్ణుడు గంతలు ఇప్పినా ఆ ఒక్క రోజే చూడగలిగింది. మర్నాడు నిజంగానే కళ్ళు దెబ్బతిని, శాశ్వతంగా గుడ్డిదైపోయింది.

### 4. 1. 2. కల్పిత స్త్రీ పాత్రలు :-

#### 4. 1. 2. 1. హిరణ్యవతి :-

శల్యుడి మనుమరాలు. రుక్మరథుడి కుమార్తె. తాతతో చాలా చనువుగా మాట్లాడే పాత్ర. దేశచారం, కులాచారంఅంటూ ఏవేవోమాట్లాడ్డం ఇష్టముండదు. స్వయంవరం ఈమె కోసం ఏర్పాటు చేయాలని, శల్యుడు, రుక్మరథుడు ప్రయత్నంచేస్తారు. ఈలోగా కౌరవ, పాండవయుద్ధం జరగవచ్చు అని, రాజకుమారులు పెద్దసంఖ్యలో రారని తలిచి విరమిస్తారు. చివరికి ఈమె నాగుల కుర్రాడిని ప్రేమించి, అతడితో అరణ్యాలకి వెళ్ళి పెళ్ళిచేసుకుంటుంది.

#### 4. 1. 2. 2. చిత్ర :-

ఉగ్రసేనుడి భార్యకి చెలికత్తె, ఇష్టసఖికూడా. ఉగ్రసేనుడి భార్య మహాధైర్యవంతురాలు. ఆమె అడవికి వెళ్ళినప్పుడు ముట్టయింది. మధుర దగ్గర ఇంద్రగిరి దగ్గర ద్రుమిళుడు అనే రాక్షసుడు ఉంటాడు. అతడివల్లే కంసుడు పుట్టాడు.(పుట. 292) కంసుడి తండ్రిగా పేర్కొంటున్న ఉగ్రసేనుడు ద్రుమిళుడి గురించి జరిగిన సంగతులు తెలుసుకొంటాడు. కంసుణ్ణి దగ్గరికి తీసుకోడు. ఆ తర్వాత ఉగ్రసేనుడి భార్య చాలామంది పిల్లల్ని కంటుంది. నరకాసురుడి చెఅనుంచి విడిపించిన స్త్రీలు ఇరవైనాలుగుమందిని పెళ్లిచేసుకొని తామ్రస్థలిలోనే కృష్ణుడు ఉంచి, వాళ్ళకు ఇల్లులు కట్టించి ఇచ్చాడు. వారంతా అక్కడ వ్యసాయం చేస్తూ జీవనం చేస్తున్నారు (పుట302)అని చాలా గడిచిపోయిన అంశాల్నిఈమె యుయుధానుడికి చెబుతుంది.

#### 4. 1. 2. 3. జ్యోతిష్మతి :-

ద్రౌపది దగ్గర ఉండే ముప్పై ఏళ్ల వయస్సున్న పరిచారిక. వట్టివేర్ల చాపలకు నీళ్ళు పోస్తుంది. పిల్లలు ఎక్కడున్నారని కృష్ణ ఈమెని అడుగుతుంది. ఇప్పుడు రథంమీద యుద్ధాభ్యాసానికి వెళ్ళినట్లు వివరిస్తుంది. ద్రౌపది విసనకర్ర తీసుకు రమ్మంటే తెచ్చి ఇస్తుంది. (పుట.160) ఈపాత్ర కథను నడిపించడానికి సహాయపడుతుంది. బహుశా ద్రౌపదికి పరిచారికలు ఉంటారని సూచించడానికి మాత్రమే అన్నట్లు ఈ పాత్ర ఉంటుంది.

#### 4. 1. 2. 4. సుస్మిత :-

ధృతరాష్ట్రుడి ఆంతరంగిక దాసి. ధృతరాష్ట్రుడికి నిద్రపట్టకపోతే, ఈమెను పిలుస్తాడు. సంజయుడు చెప్పినవార్తల్ని ఈమెకూడా వింటుంది. భీముడు ఎనిమిది మంది అన్నదమ్ముల్ని చంపాడని సంజయుడు చెప్తాడు. వారిపేర్లు మరిచిపోయి సుస్మితని చెప్పమంటాడు. వారి పేర్లు సునాభ, ఆదిత్యకేతు, బహ్వాశీమ కుండధార, మహోదర, అపరాజిత, పండితక, విశాలాక్ష అని చెప్పింది. (పుట. 582) వాళ్ళతల్లుల్ని ఊరడించాలని ధృతరాష్ట్రుడు అంటే ఈమె నవ్వుకుంది. ధృతరాష్ట్రుడి పేరు చాలామంది వాడుకుంటు

న్నారని చెబుతుంది. ఆడబిడ్డ పుడితే ధృతరాష్ట్రుడి పేరు చెప్పకుండా, మగ బిడ్డపుడితే రాజు పేరు చెప్పడం సాధారణంగా జరుగుతున్నట్లు చెబుతుంది. తన అమ్మ బతికుంటే ధృతరాష్ట్రుడి పేరిట ఉన్న పిల్లల లెక్కలు సరిగ్గా చెప్పేదని ఈ పాత్ర అంటుంది. ధృతరాష్ట్రుడికి వందమంది కొడుకులు ఉన్నారని అనడం ఒప్పుకోక పోవడాన్ని[10] సూచిస్తూ, ఈ పాత్రని రచయిత ప్రవేశపెట్టినట్లు ఉంది.

### 4. 1. 2. 5. చారు :-

ధృతరాష్ట్రుడికి సేవచేసే దాసి. ఈమె చేయి పట్టుకొని కాలకృత్యాలు తీర్చుకుంటాడు. ధృతరాష్ట్రుడు వయస్సు అడిగితే అరవై ఐదు అని మొదట చెప్పింది. మర్నాడు అడిగితే ఇరవై ఐదు అని చెప్పింది. ధృతరాష్ట్రుడి కొడుకులు, మనువులు ఇళ్ళలో సేవచేయవద్దని తన మొగుడే చెప్పినట్లు, ధృతరాష్ట్రుడి అంతఃపురంలో ఆక్షేపణ లేదని వివరించే పాత్ర.

### 4. 1. 2. 6. ధృతి :-

సింధుదేశపు వ్యవసాయదారుడి కూతురు. పెళ్ళయి అత్తవారింటికి వైభవంగా తీసుకు వెళ్తున్నప్పుడు, నరకాసురుడి గుంపు వీరిపై దాడి చేసింది. వాళ్లు ఈమెని ఎత్తుకు పోయి, నరకాసురుడికి చేర్చాడు. నరకాసురుణ్ణి చంపాక కృష్ణుడి ఈమెని విడిపించాడు. ఓ రోజు కృష్ణుడు ఈమె ఇంటికి వెళ్ళాడు. ఒకబిడ్డపుట్టాక వాడి తలని మూకొని వాడికి 'క్రతువు' అనే పేరు పెట్టాడు. ఈ విషయాన్నంతా యుయుధానుడికి ఈమె వివరిస్తుంది. కృష్ణుడు నరకాసురుడిని చంపాక అక్కడున్న వాళ్ళని వారి అభీష్టానుసారంగా తన భార్యలుగా చేసుకున్నాడు అన్నదానికి ఒకసాక్షిగా ఈ పాత్ర కనిపిస్తోంది.

### 4. 1. 2. 7. కామకటంకటి :-

ఘటోత్కచుడి భార్య. భీముడు రెండోసారి సాలకటంకటి[11] దగ్గరికి వెళ్ళినపుడు, భీముడి కాళ్ళమీద తనకొడుకు 'బర్బరకుణ్ణి' పడుకోబెడుతుంది. భీముడు వస్తున్నాడని సాలకటంకటి అన్నప్పుడు, అతడు వచ్చేవరకూ ఈమె జాగరణ చేస్తుంది.(పుట.153)

### 4. 1. 3. కల్పిత పురుష పాత్రలు :-

### 4. 1. 3. 1. తుష్టుడు :-

కేకయదేశంనుంచి మత్స్యదేశానికి వచ్చిన సూతుడితడు. సుభద్రను మధురకు తీసుకెళుతున్న సమయంలో అర్జునుడి రథానికి రథసారథి. విజయుడు అంటే ఎవరు?

---

[10] ధృతరాష్ట్రుడికి పుట్టినవారి పేర్లలో తండ్రి పేరులో ఉన్న మొదటి అక్షరం మరియు దుర్/దుస్/దుశ్ లు కలిగి ఉన్న పేర్లు మాత్రమే ఇతడికి పుట్టినట్లు రచయిత అభిప్రాయం. అలా గమనిస్తే మొత్తం పదమూడు మంది మగ పిల్లలు, ఒక ఆడపిల్ల పుట్టినట్లు తెలుస్తుంది.(పర్వ, పుటలు. 454-455)

[11] అడవిలో ఉన్నస్త్రీ. హిడింబాసురుడికి సోదరి. మూలంలో హిడింబి అని ఉంది. ఈ నవల్లో రచయిత సాలకటంకటి అని పేరుమార్చాడు. ఈమె కోడలిపేరు కామకటంకటిగా చెప్పారు. ఘటోత్కచుడి కొడుకు పేరు బర్బరకుడుగా మార్చారు.

అంటూ ప్రశ్నలు వేసి, అర్జునుడితో సంభాషణలు మొదలు పెడతాడు. అరనిద్రలో ఉన్నప్పుడు అర్జునుడు పిలిచి సోమరసం ఉందా? అని అడిగితే, తాడి చెట్టునుండి తీసిన సోమరసం ఇస్తాడు. అర్జునుడి గురించిన సమాచారం కొంతవరకు ఇవ్వడానికి ఈ పాత్రను రచయిత ప్రవేశపెట్టాడు.

### 4. 1. 3. 2. వృషడు-అనరణ్యుడు :-

కృష్ణద్వైపాయనుడి ఆశ్రమానికి సందేహాలు తీర్చుకోడానికి వచ్చినవారు. శుక్రమహర్షి చనిపోయిన సమయంలో వస్తారు. మంత్రశక్తిని ప్రశ్నిస్తారు. మృత్యు లోకాన్ని చూశారా?..., ఇంచు మించుగా శుకమహర్షిలా ప్రశ్నిస్తారు. చివరకు పులహుడితో ధర్మరాజుని దర్శించి, ఆశ్రమాలు ఏ విధంగానూ రాజు ఆధీనం కాకూడదని, స్వతంత్ర అస్తిత్వం ఉండాలని చెబుతారు.

### 4. 1. 3. 3. శలాకుడు :-

శల్యరాజుకు దాసీవల్ల పుట్టాడు. యుద్ధవిద్యలు నేర్పే(అభ్యాసశాల) శాలకు అధివీక్షకుడు. శల్యరాజు వచ్చినప్పుడు తండ్రీ, యుద్ధానికి వెళ్లడం ఎప్పుడని అడుగుతాడు. ఎందుకంటే యుద్ధం ఎప్పుడో తెలిస్తే మంచిదని, అభ్యాసంచేసిచేసి, అలసిపోవాలా? అని అక్కడున్న వారంతా గొణుగుకుంటున్నారని చెప్తాడు. యుద్ధసూచనకోసం, అనవసరంగా కాలహరణ ఎంతవరకు అని ప్రశ్నించడానికి ఈ పాత్రని ప్రవేశపెట్టారు.

### 4. 1. 3. 4. రాకా :-

సాలకటంకటి రాజ్యంలోఉన్న వాడు. ఇరవై ఏళ్ళకిందట భీముడు వచ్చి ఉన్నప్పుడు ప్రతిరోజూ వేటాడి, కొత్తమాంసం తెచ్చేవాడు. సాలకటంకటి ఎలాగుందని ఇతణ్ణి భీముడు అడుగుతాడు. భీముడు వెళ్లినదగ్గరనించి మాంసం, తిండీ మొదలైనవి వదిలి ఏడుస్తూ. కూర్చుందని చెబుతాడు. బిడ్డఒకడు లేకుంటే చచ్చిపోయేదేమో అని భీముడికి వివరిస్తాడు. సాలకటంకటి విషయాన్ని తెలుపుతూ, భీముడు ఈమెని వదలి వెళ్ళినప్పుడినుంచి జరిగిపోయిన అంశాలు ఈ పాత్రద్వారా రచయిత చెప్పిస్తాడు.(పుట.149)

### 4. 1. 3. 5. ద్రుమిళుడు :-

మధురదగ్గర ఉత్తర భాగంలో గుట్టల ప్రాంతంలో అడవిని నరికి రాజ్యాన్ని స్థాపించుకున్నాడు. మంచి ఎత్తయిన గాత్రానికి తగ్గ లావు, యాదవులలాంటి వేషం. పాతది పట్టుబట్ట కట్టి, తలకి కిరీటం, మెడలో తెల్లపూల హారం, చెవులకు మేరిసే బంగారు కుండలాలు వేసుకున్న ఆకారం ఇతడిది. ఉగ్రసేనుడి భార్య ఇతణ్ణిచూసి మోహించింది. ఏ అనుమానం లేకుండా ఇతడితో గడిపింది. పైగా తన భర్తలాంటి వేషంతో వచ్చావని అడిగింది. వీరిద్దరి కలయికవల్ల 'కంసుడు' పుట్టాడు. ఉగ్రసేనుడి భార్యను తనతో వచ్చేయమని 'చిత్ర' దగ్గర ఇతడు ప్రాధేయపడ్డాడు. అయినా ఆమె ఒప్పుకోలేదు.(పుట. 297) ఉగ్రసేనుణ్ణి ఆమె వదిలి వెళ్లలేదు.

### 4. 1. 3. 6. శ్రవణుడు :-

అర్జునుడికి స్నేహితుడు. అర్జునుడు ద్రౌపదిమీద అలిగి, దేశాటన చేస్తున్నప్పుడు, అతడితో కలసి ఉన్న పాత్ర. 'చిత్రాంగద' దగ్గరికి అర్జునుడు వెళ్ళాడు. చిత్రవాహనుడి రాజ్యమది. చిత్రంగదతో సంగమించి, అర్జునుడు అలిసిసొలసి పోయాడు. 'సుందరాంగా! మీవాళ్లు నిన్నటి నుండి బయట కాచుకొని ఉన్నారు. లోపలికి పంపనా' అనే ప్రశ్నకి సమాధానం చెప్పలేనంత ఆయాసంతో అర్జునుడున్నాడు. అప్పుడు ఈ శ్రవణుడు చెక్క పలకలతో పల్లకీలాటింది కట్టి, అర్జునుణ్ణి అందులో పెట్టి, మోసుకువచ్చి, పర్వతలనుండి కిందికి తీసుకువచ్చాడు.

ఆ తర్వాత ఎనిమిది రోజులు సోమరసం, పాలు, పెరుగు, వెన్న ,తేనె, నెయ్యి, అన్నం పెట్టాడు. ప్రతిరోజూ ఒంటికి, చేతులకి నువ్వులనూనె రుద్దించి, గమ్యమేలేని స్థితినుంచి విశ్రాంతి పొందాక, అర్జునుడు తేరుకున్నాడు. అప్పుడు అర్జునుడికి గతవిషయం అర్థమయ్యింది. అప్పుడు శ్రవణుడు 'మహరాజా! ఇక మీదట ఏ స్త్రీసాంగత్యమూ చేయవద్దు. మీ ఆందమైన శరీరాన్ని ఏ ఆడదయినా పీల్చి పిప్పి చేస్తుంది' (పుట. 239) అని చెప్పిన వాడితడే. ఇతడు ఆ తర్వాతనుంచి నవలలో కనిపించడు. ఇతడి పూర్వచరిత్రను రచయిత చెప్పలేదు. తర్వాత నుంచి అర్జునుడికి కృష్ణుడి స్నేహితుడిగా కనిపిస్తాడు.

### 4. 1. 3. 7. శ్వేతుడు :-

విరాటుడి పెద్దభార్య కొడుకు ఇతడు. యుద్ధంలో చనిపోయిన పాండవ మహారథి ప్రముఖుల్లో ఇతడు ఒకడు. సంజయుడు యుద్ధవార్తల్ని తేవడానికి వెళ్లి వస్తుంటాడు. యుద్ధంలోనే ఇతడు మరణించాడని ధృతరాష్ట్రుడికి సంజయుడు వివరిస్తాడు.(పుట. 548)

### 4. 1. 3. 8. కాలియుడు :-

చిన్నవయస్సులో కృష్ణుడు 'వ్రజస్థలి'లో వ్యవసాయదారుల ఇంట్లో ఉంటాడు. యమునకు అవతలవైపున్న నాగులవచ్చి పంటపొలాల్ని నాశనంచేసేవారు. అప్పుడు కాలియుణ్ణి[12] కృష్ణుడి చంపేస్తాడు. అతడితో పాటు ఇంకా ముగ్గుర్ని చంపామని నందుకుడు యుయుధానుడికి వివరిస్తాడు. (పుట344).

### 4. 1. 3. 9. భగుడు :-

కర్ణుడు విశ్వామిత్రుడి దగ్గర అస్త్ర విద్యనేర్చుకోడానికి వెళ్ళినప్పుడు, విశ్వామిత్రుడి దగ్గర చదువుకొనే విద్యార్థి. కర్ణుడికి స్నేహితుడు. భగుణ్ణి నమ్మి కర్ణుడు తను సూతుడని, ఓసారి అనుకోకుండా చెప్పేసాడు. కానీ, భగుడు తనకేదో రహస్యం[13] దొరికిందనే భావంతో,

---

[12] భాగవతంలో ఉన్న కాలియుణ్ణి ఇక్కడ రచయిత నాగులవ్యక్తిగా పోల్చి వివరించాడు. అతణ్ణి చంపినట్లు చెప్పారు. భాగవతంలో కాలియమర్దనం చేసి తరిమినట్లుంటే, దాన్ని పంటపొలాల్ని పాడుచేసే వ్యక్తిగా మార్చి ముగ్గురుణ్ణి చంపినట్లు ఇక్కడ మార్చారు.

[13] వ్యాసభారతంలో కర్ణుడు తన కులం విషయంలో అబద్ధం చెప్పి, భార్గవుడి దగ్గర విద్య నేర్చుకుంటాడు. ఒకరోజు అడవిలో ఉన్నప్పుడు కర్ణుడి తొడమీద భార్గవులు తల పెట్టినిద్ర పోతున్నప్పుడు ఒక పురుగు వచ్చి రక్తం కారేలా కుడుతుంది. గురువుకి నిద్రాభంగం అవుతుందని భావించి, కర్ణుడు చలించడు. రక్తం తడికి భార్గవుడు లేచి, కర్ణుడికులం

దాన్ని విశ్వామిత్రుడికి చెప్పేస్తాడు. విశ్వామిత్రుడు కర్ణుణ్ణి అడిగాడు. అప్పుడు కర్ణుడు నిజం చేప్పేస్తాడు. తను సూతుణ్ణి అయినా క్షత్రియులకి సేవచేసే వాడవడంచేత విద్యనేర్పడానికి భార్గవుడు తిరస్కరిస్తాడు(పుట. 369).

### 4. 1. 3. 10. సునాముడు :-

దుర్యోధనమహారాజుకి ఆప్త సారథితడు. కర్ణుణ్ణి పిలుచుకొని రమ్మని దుర్యోధనుడు సునాముడితో చెప్తాడు. రథాన్ని ఇచ్చి పంపిస్తాడు. సునాముడు రథాన్ని తీసుకెళ్లి, కర్ణుడికి నమస్కరించి, 'తక్షణం పిలుచుకొని రమ్మని' దుర్యోధనుడు చెప్పినట్లు కర్ణుడికి చెప్తాడు. (పుట.370) రాజసభ కూడా ఉందని, కర్ణుడు బయలుదేరాక, సూతవీధికుండా రథాన్ని రాజ మందిరానికి తీసుకువస్తాడు. కృష్ణుడు రాయబారిగా వచ్చి ఉన్నాడు. యుయుత్సువు ఇంటి దగ్గర భోజనం చేసాడు. అంతకుముందే కర్ణుణ్ణి కలిసినట్లు ఇతడు కర్ణుడికి వివరిస్తాడు. ఇక్కడ పాఠకుడికి ఉత్కంఠ కలగజేయడానికి ఈ పాత్ర ఉపయోగపడుతోంది.

### 4. 1. 3. 11. క్రతువు :-

ధృతికి పుట్టినవాడు. యుయుధానుడు ధృతిని అడిగినప్పుడు, ఇతడి సమాచారం పాఠకుడికి అందుతుంది. నరకాసురుణ్ణి చంపాక, కృష్ణుడీమెను వివాహం చేసుకున్నట్లు చెబుతుంది. క్రతువు అనిపేరును కృష్ణుడే పెట్టినట్లు ధృతి చెబుతుంది.(పుట. 327)

### 4. 1. 3. 12. నందకుడు :-

ఇతడు వైశ్యజాతివాడు[14]. భూమిని దున్ని, పంట పండించడం, పశుపాలనచేయడం, రథాలు, బళ్ళూ , ఇల్లు నిర్మించడం మొదలైన సమస్త వృత్తులు వీళ్ల జాతివాళ్లే చేస్తారు. చూడగానే వీళ్లని గుర్తు పట్టేయవచ్చు. ఎర్రటిరంగు, మంచి ఎత్తు, బిగువైన ఒళ్లు, మొనతేరిన ముక్కు, గడ్డం, ఉండేవారు. చేతిలో పొడువాటి దబ్బకర్ర, పరిగెత్తడంలో వేటకుక్కను కూడా పడేసేలాటిపల్చటి, గట్టిగాఉన్న పొడువాటికాళ్లు వీరికి ఉంటాయి.(పుట.343) యుయుధానుడితో మాట్లాడుతుంటాడు. మళ్లీ ఆభీరులకు(ఒక తెగవారు), యాదవులకు తగువు కృష్ణుడు లేనప్పుడు వచ్చినట్లు ఇతడు యుయుధానుడితో చెప్తాడు.

---

అడుగుతాడు. అప్పుడు కర్ణుడు నిజం చేప్పేస్తాడు. అబద్ధం ఆడినందుకు అవసరమైన సమయంలో నువ్వునేర్చుకున్న అస్త్ర విద్యమంత్రాలు గుర్తుకు రాకుండా పోవుగాక అని శపిస్తాడు. దాన్ని కొద్దిమార్పులతో చెప్పారిక్కడ. శాపం అనే ప్రసక్తిలేదు.

[14] వైశ్యజాతి వారు (పుట. 347)అని, మరోచోట(పుట. 343) ఆభీరజాతి వాళ్ళు, అని చెప్పారు. వైశ్యకులం, ఆభీరజాతి అని అర్థం చేసుకోవాలి. మొదట్లో ఆనర్తదేశం వీరికి చెందిందట. వీళ్లెక్కడా ఒకచోట నికడగా ఉండి వ్యవసాయంచేసేవారు కాదు. కేవలం వ్యవసాయం మాత్రమే కాకుండా ఎద్దులు, ముసలి ఆవులమాంసాలతోనూ కడుపు నింపుకొనేవారు. వీరికి దొరికినంత యాదవుల్ని చంపేసేవాళ్ళు. రాత్రిపూట విజృంభించి, యాదవుల పొలాలూ, ఊళ్లనూ, ఇళ్లను తగలబెట్టే వాళ్లు. వెనకటికి నాగజాతివాళ్లు ఇలా చేసేవాళ్ళు.(పర్వ, పుట. 344)

### 4. 1. 3. 13. శంఖుడు :-

యాదవసైన్యంలో ప్రముఖుడు. జరాసంధుడు మధురమీదకి దండెత్తినప్పుడు ఆ విషయం గూఢచారులద్వారా కృష్ణుడికి తెలుస్తుంది. చాలా పెద్దసైన్యంతో వచ్చిన జరాసంధుణ్ణి ఎదిరించడం సాధ్యంకాదు. కృష్ణుడు, తనూ, బలరాముడు దేశం విడిచి వెళ్ళిపోతున్నట్లు ప్రకటిస్తాడు. మిగత ప్రజలందర్నీ జరాసంధుడికి శరణాగతులై ఉండమని కృష్ణుడు చెబుతాడు. కంసుణ్ణి చంపి, తప్పు చేసావని శంఖుడు కృష్ణడితో అంటాడు. పారిపోడం ఏ వీరుడి లక్షణం కాదని, అలా పారిపోతే ఆర్యావర్తంలో యాదవుల గౌరవం మంట కలిసిపోతుందని ఇతడు కృష్ణుడితో అంటాడు.(పుట.307)

### 4. 1. 3. 14. సత్యకృతుడు :-

యుయుధానుడి చివరి కొడుకు. ఇంద్రప్రస్థలి/ తామ్రస్థలి నుంచి యుయుధానుడు వచ్చి, చాలాసేపు అవుతుంది. ఆలోచనల్లో మునిగిపోయి ఉంటాడు. అప్పుడు తండ్రిని పిలవడానికి వస్తాడు. "నాన్నా!, నీ అగ్ని కార్యమూ కాలేదు. భోజమూ కాలేదు. గుర్రం ఎప్పుడో ఇంటికి వచ్చింది. ఇంత పొద్దయినా మీ నాన్న ఏం చేస్తున్నాడు, పిలుచుకొని రా!" అని తాత కోప్పడుతున్నాడని యుయుధానుడితో చెప్తాడు.(పుట.319) యుయుధానుడి నిత్యకృత్యాల్ని చెప్పడానికి ఈ పాత్రని రచయిత వాడుకొన్నట్లు తెలుస్తుంది.

### 4. 1. 3. 15. సోమరథుడు :-

ఇతడు పాండురాజు పెళ్ళికి ముందు, హస్తినావతి దాసికి పుట్టినవాడు. (పుట. 453) పాండవులంటే ఒకవిధమైన వాత్సల్యం ఉన్నవాడు. పదమూడేళ్ల కిందట దుర్యోధనుడు జూదంలో ధర్మరాజుని ఓడించాడు. అరణ్యాలకు పంపించాడు. ఆ సమయంలో నిండు సభలో యుయుత్సువు లేచి నిలబడి ఆచార్యుల ఎదుట దుర్యోధనుడికి నీతులు చెప్పడమే ఇతడి వాత్సల్యానికి కారణం. సూతుడికింత ధైర్యం రావడం అదే మొదటి సంఘటన. యుద్ధక్షేత్రంలో భీష్ముడిదగ్గర డేరా పాలకుడిగా ఇతడున్నాడు. మీ తండ్రి పాండురాజేకదా కావాలంటే నువ్వు నీ తమ్ముల పక్షంలో చేరొచ్చు అని యుయుధానుడు ఇతడికి సలహా ఇస్తాడు. అప్పుడు నాకు, వాళ్లకు పరిచయమే లేదుఅని, పరాచికాలు ఆడొద్దని యుయుధానుడితో అంటాడు. (పుట. 453)

ఇలా ఆయాపాత్రల పరిచయంలో ఉన్న ఆవశ్యతని దృష్టిలో పెట్టుకొని సంక్షిప్తంగా పరిచయం చేయడం జరిగింది. పాత్రలకు సంబంధించిన మరింత సమాచారం, పాత్రచిత్రణకు సంబంధించిన విషయాల్ని తరువాత అధ్యాయంలో చూడొచ్చు .

## 4. 2. పర్వ నవల - పాత్రచిత్రణ :-

ఈ నవలలో ప్రధానంగా శల్యుడు, భీష్ముడు, భీముడు, కుంతి, ద్రౌపది పాత్రల చిత్రణలో ప్రత్యేకతలు ఉన్నాయి. కన్నడరాష్ట్రంలో భీముణ్ణి ఎక్కువగా అభిమానిస్తారు. అందుకే ఈ నవలలో భీముడి మానసిక చిత్రణ మరింత ప్రత్యేకంగా చెప్పవలిసిన ఆవశ్యత ఉంది. అలాగే మిగతా పాత్రలను చూడొచ్చు.

4. 2. 1. శల్యుడు ః-

ఈ నవలలో మొట్టమొదటి పాత్రే శల్యుడు. పూర్వం మునులు గట్టిగా, ఆరోగ్యంగా ఉండేవాళ్ళు అని చెప్పేతత్త్వం ఉన్నవాడితడు. ఆడపిల్లలకి తొందరిగా పెళ్ళిచేసేయాలని, కన్యాశుల్కం తీసుకోవాలని ఉండేది. "ఇరవై బళ్ళ రాగి, ఇత్తడి, బట్టలు, నగలు వచ్చేవి. అంత లక్షణమైన పిల్లవునువ్వు"(పుట.2) అని తన మనుమరాలు విషయంలో అనుకొన్నట్లు, బయటకి అనేసాడు. మాద్రి విషయంలో బయటపడ్డాడు.

సుమారు ఎనభై నాలుగు సంవత్సరాలు వయస్సువాడు. అయినా ఆరోగ్యంగా ఉన్నవాడు. 'శాకల పట్టణం' మద్ర దేశానికి రాజధాని. అందులోనే ఉండేవాడు. ఆడపిల్లకు పెళ్ళి చేయకుండా ఇంట్లోనే ఉంచితే, ఋతుచక్రం నష్టమవుతుంటే, పాపంగా భావించే వాడు. రుక్మరథుడు స్వయంవరం ప్రకటిస్తానంటే, దానికి ధనం కావాలని, శుల్కం తీసుకుంటే సంపదా వస్తుంది, అమ్మాయి ఋతు నష్ట పాపమూ తప్పిపోతుందని కొడుక్కి చెబుతాడు.

భూమి; స్త్రీ ఒకసారి అనుభవంలోకి వస్తే ఎవరు వదిలి పెడతాడు?(పుట. 8) అందుకే దుర్యోధనుడు పాండవులకు రాజ్యం ఇవ్వలేదని నిర్ధారించాడు. పాండవులు పుట్టుక సరైనదేనని, మొదట భావించినవాడు. "కనిపించిన వాళ్లందర్నీ పిలిపించుకొని వ్యభిచారంతో జన్మనివ్వలేదు. శాస్త్రీ సమ్మతమైన నియోగంతో పాండువు బిడ్డలకు జన్మనిచ్చాడు. వంశాభివృద్ధికోసం నియోగం చేసికొమ్మంటూ పాండువే భార్యల్ని ఆజ్ఞాపించాడు. అతడి ఆజ్ఞను పాటించే అతడిపేరు మీదట వారు ధారణ చేసారు. అతడొట్టి (దుర్యోధనుడు) మోసగాడు. రాజ్యాన్ని ఇవ్వకపోడానికి ఇవన్నీ అధర్మపుమాటలు. మనసైన్యాన్నిపంపు పాండవులదగ్గరికి వెళ్ళి, వాణ్ణి(దురోధనుణ్ణి)చంపి, ధర్మస్థాపన చేద్దాం" (పుట. 9)అలాగైతే దుర్యోధనుడి తండ్రి ధృతరాష్ట్రుడు, పాండువుల తండ్రి పాండువు ఇద్దరూ పుట్టింది నియోగం వల్లనే, అదీ వాళ్లతండ్రుల అనుమతి లేకుండానే. కేవలం అతడిపేరు చెప్పి, భార్యలు స్వీకారం చేసారు. అలాంటప్పుడు దుర్యోధనుడు కూడా కురు వంశానికి చెందినవాడు కాదని చెప్పొచ్చు అని నిలదీసేలా మాట్లాడతాడు. ఇది అతడి పెద్దరికాన్ని, పాండవులమీద మమకారాన్ని సూచిస్తోంది. కానీ, కొంత ధర్మం పట్ల భయస్తుడుకూడా.

దుర్యోధనుడు గూఢచారి వ్యవస్థ ద్వారా శల్యుడు పాండవపక్షంలో చేరతున్నాడని తెలిసిపోతుంది. అయినా శల్యుడికి, అతడి సైన్యానికి కావలసిన వస్తు, సామగ్రి, సదుపాయాలు దారిపొడుగునా సమకూరుస్తాడు. దానికి ఆనందపడి, దాన్ని అజమాయిషీ చేస్తున్న వ్యక్తిని పిలిచి, ఏం కావాలో కోరుకో అని అడుగుతాడు. తన పక్షంలో సైన్యసమేతంగా వచ్చి, చేరమని కోరుతాడు. నిజానికి పాండవులకు ముందే తను పాండవుల పక్షంచేరతానని అంటాడు. అసలు అసత్యమేది? అని ప్రశ్నించుకుంటే, మొదటిచ్చిన మాట తప్పినట్లు అవుతుంది. రెండోసారి మాటని నిలుపుకుంటే మొదటి మాట తప్పినట్లు అవుతుంది. ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని ధర్మరాజునే ధర్మసూక్ష్మం అడుగుతాడు.

బాధపడతాడు. వరాలు ఇవ్వడం దాన్ని నెరవేర్చు కోకపోతే ఏమౌతుందనే దిగులున్న స్వభావం ఇతడిది. మొదట ఇచ్చినమాట తప్పినందుకే, ధర్మరాజు ఇతణ్ణి చంపుతాడని రచయిత సూచిస్తున్నట్లనిపిస్తోంది.

యుద్ధం చివరలో తన రాజ్యానికి వెళ్లిపోవాలని నిశ్చయించుకున్నాడు. ఆ సమయంలో దుర్యోధనుడు వచ్చి, సైన్యాధ్యక్షపదవి ఇచ్చేసరికి, తెగ ఆనందపడి యుద్ధానికి సిద్ధమౌతాడు. ఇలా గమనిస్తే పొగడ్తలకు లొంగిపోయి, విచక్షణ ఉన్నా, అమలు చేయలేని పాత్రగా శల్యుడు కనిపిస్తాడు.

### 4. 2. 2. భీష్ముడు :-

సుమారు వందా ఇరవై ఏళ్ల వయసున్న వ్యక్తి. కురు రాజ్యం సుస్థిరం చేయడానికి శ్రమించినవాడు. పాండురాజుకి పెళ్లిచేసాక కుంతికి వెంటనే పిల్లలు పుట్టలేదు. 'మొదటి ముట్టుకు కస్సు బుస్సు మన్నాడు. రెండో ముట్టుకు కుప్పిగంతులు వేసాడట. మూడోది అయ్యాక తప్పంతా కోడలిమీద వేసి తనవీరాధివీరుడైన కొడుక్కి తగ్గక్షేత్రం దొరకలేదన్నాడట' (పుట. 41) అని భీష్ముడన్నట్లు కుంతి అనుకుంటుంది. ఇక్కడ భీష్ముడు తనమీద ఉండే కురురాజ్య రక్షణ భారంనుంచి ఎప్పుడు తప్పుకుందామా అని చూడడం అతని పెద్దరికానికి, తల్లి సత్యవతికి ఇచ్చినమాట[15]ను నిలుపుకోడానికి పడిన అవస్థగా కనిపిస్తుంది. తన వారిది తప్పుకాదని భావించడం మానవ సహజమైంది. ఈ నేపథ్యం పాండురాజుకి రెండో పెళ్ళికి కారణంగా సూచించడానికి ఉపయోగపడుతోంది.

పాండురాజుకు పెళ్లయి సంవత్సరం గడిచాక, హిమాలయాలకు వెళ్ళి, రాకపోడంతో గాంధార దేశానికి కన్యాశుల్కంగా కానుకలు పంపించి గాంధారిని తీసుకువచ్చి ధృతరాష్ట్రుడికి పెళ్లిచేసాడు. (పుట. 62) కురుక్షేత్ర యుద్ధ సమయంలో మహాసేనాని కావడానికి భీష్ముడు ఒప్పుకున్నాడు. అందరి సమ్ముఖంలో సేనానిగా అభిషేకం జరిగింది. భీష్ముడు మొట్ట మొదటసారి నోరువిప్పి మాట్లాడాడు. తారాస్వరంలోని కంఠం క్షీణమైంది. అయితే అతడి గొంతు వణకడం లేదు. 'శత్రువులను నగరం దగ్గరిదాకా రానిస్తే, నగరం నాశనమవుతుంది. దూరంలోనే ఎదిరించడం మంచిది. ఇవ్వాళే సేనానులందరూ వాళ్లవాళ్ల దళాలతో పాటు ప్రయాణం కావాలి. తోడుగా నేనూ ఉంటాను'(పుటలు. 408-409) అని భీష్ముడు నాలుగు వాక్యాల్లో ముగించడం అతడి అంతరంగంలోని అస్పష్టమైన బాధని సూచిస్తోంది. కంఠం క్షీణించడం ఈ విషయాన్ని మరింత స్పష్టపరుస్తోంది.

భీష్ముడు తమ సొంత పురోహితుణ్ని పిలిపించి, "యుద్ధాన్ని సాధ్యమైనంత ధర్మంగా చెయ్యాలి. దాని నియమాలను ముందే నిశ్చయించడానికి పాండవసేనలోని కొందరు ముఖ్యులు, మేమూ ఎరురెదురుగా కూర్చొని మాట్లాడుకోవాలి. ఎక్కడ, ఎలా

---

[15] సత్యవతికి, శంతనుడికి చిత్రాంగదుడు, విచిత్ర వీర్యుడుపుడతారు. వీరు పెళ్లయ్యాక చనిపోతారు. ఆ సమయంలో సత్యవతి వచ్చి భీష్ముణ్ణి రాజ్య రక్షణ చేయమని కోరుతుంది. భీష్ముడు మాట ఇస్తాడు. అలా రాజ్యరక్షణలో జీవితాంతం ఉండిపోతాడు.

కలిసేదనే విషయం వెళ్లి ధర్మరాజును అడిగిరా! వాళ్లు నేనున్నచోటుకు వస్తే వాళ్లను బంధించకుండా, దెబ్బతీయకుండా క్షేమంగా తిరిగి పంపే బాధ్యత ఈ భీష్ముడిది అని చెప్పు. వాళ్లు రావటానికి ఒప్పుకోకుంటే నేనే వారి శిబిరం వెళ్లడానికి సిద్ధమని కూడా చెప్పు. రథంలో కూర్చొని వెళ్లండి. భీష్ముడి దూత అంటే వాళ్లవైపు కావలివాళ్ళు ధర్మరాజుకు చెప్పి పంపుతారు. తక్షణమే ఈ విషయం నిర్ణయం కావాలని తెలుపు" (పుట. 418) అని చెప్పాడు.

పురోహితుడు ఆ వర్తమానాన్ని పాండవులకు చెప్పి, వస్తున్న సమయంలో దుర్యోధనుడు అడిగి విషయాన్ని తెలుసుకున్నాడు. ఈ విషయాన్ని కూడా పురోహితుడు భీష్ముడికి విన్నవిస్తాడు. ధర్మరాజు సమాధానంగా 'దుర్యోధనుడు ఈ సందర్భాన్ని ఉపయోగించుకొని, మాట్లాడడానికి వస్తున్న మా నలుగురిని చంపితే, లేదా బంధించే తంత్రంచేయకుండా పితామహులు సంరక్షించాలి' అని అభ్యర్థించాడు. (పుట. 419) ఈ చివరి మాట కృష్ణుడన్నాడు. అందుకని భీష్ముడే పాండవులదగ్గరికి వెళ్లడానికి నిశ్చయించుకుంటాడు. దుర్యోధనుడి కుతంత్రాన్ని అదుపుచేయలేని, ఇతడి అశక్తత ఇందులో సూచించినట్లు అనిపిస్తోంది.

'భయపడేవారికి కూడా ఉత్సాహం కలిగించడమే కదా సేనాని కర్తవ్యం' అనే దుర్యోధనుడి మాటలకు 'నాయనా! నా కర్తవ్యమేమిటో నాకు జ్ఞప్తి చేయవద్దు. నేను చేసి గెల్చిన యుద్ధాలు నువ్వు చూడలేదు- అంతరంగ నిష్ఠ ఉండాలని, నిజమైన క్షత్రియుడు యుద్ధం చేసి గెలవాలి నాయనా' అని అతని తలను నిమిరి చెప్పాడు. జూదమాడి దోచుకోరాదు అని లోతైన కళ్ళతో అన్నాడు. అతడి కళ్ళను చూసిన దుర్యోధనుడికి కలవరపాటుగా అనిపించింది. ఇది అతడి వ్యక్తిత్వాన్ని చెప్పే అంశం. పెద్దతరహాని, వాత్సల్యాన్ని, ఒకే సారి చూపించారు. జూదమాడి దోచుకొనేంత సులువుగా పాండవుల్ని గెలవలేవు అని విషయాన్ని ధ్వనించేలా అనిపిస్తోంది. ఇది భీష్ముడి మాటల నైపుణ్యాన్ని తెలుపుతోంది.

అయినా భీష్ముడి మనసులోని ఆందోళన తగ్గలేదు. దొర్లాడాడు. కానీ, నిద్రరాలేదు. ధర్ముడు గురించిన ఆలోచనలపరంపరలు వచ్చాయి. తనకు ధర్మకర్మ సమస్యవచ్చినప్పుడు దారిచూపేవ్యక్తి కృష్ణద్వైపాయనుడు గుర్తుకువచ్చాడు. అక్కడకు బయలుదేరాడు.(పుట. 430) తన తండ్రి విషయం గుర్తుకువచ్చింది. 'తనతల్లి కొండకులం స్త్రీ, గంగ, మాలో ఆడపడుచుకు పుట్టే పిల్లలందరూ ఆమెతల్లి ఇంటికి చెందుతారు' అని చెప్పి, తన కులాన్ని వదిలి ప్రవర్తించలేదు. ఇంతకీ పిల్లలు తండ్రికి చెందుతారా? తల్లికి చెందుతారా? అని భీష్ముడికి మనస్సులో విచారం ప్రారంభమైంది. చివరకు గంగ తన తల్లికి చెందిన దాన్నే అని వెళ్ళిపోయింది. ఎనిమిదో కాన్పు బిడ్డను మాత్రం శంతనుడికి వదిలి తాను ఒక్కతే వెళ్లిపోయింది (పుట. 433) అని ఆలోచనలో మునిగిపోయాడు. ఈ సందర్భంలో భీష్ముడి అంతరంగస్థితిని రచయిత తెలియజేసాడు. తను ఎవరికి చెందుతాడో తెలియని స్థితిని, అయోమయపు ప్రశ్నార్థకానికి సమాధానం చెప్పేవారు కృష్ణద్వైపాయనుడే అని సూచించడం కనిపిస్తోంది. ఇక్కడ పాండవులు పాండురాజు సంతానం కాదని దుర్యోధనుడి

ప్రచారం చేస్తున్నాడు. అది ఎంతవరకు సరైంది అని భీష్ముడి అభిప్రాయాన్ని ప్రశ్నించు కుంటాడు. తన విషయంలో ఆ అభిప్రాయాన్ని సరి చూసుకోడం మానవీయకోణంగా సహజంగా ఉంది.

కృష్ణద్వైపాయనుడికి ఆశ్రమానికి వెళ్లినప్పుడు శుక మహర్షి చనిపోతాడు. దహనాది కార్యక్రమాలు పూర్తవుతాయి. అప్పుడు శుకుడి గురించి సుమంతుడు చెప్పిన విషయాలు వింటాడు. బ్రహ్మచర్యం గురించి శుకుడు 'గార్హస్థ్యమంటే బంధం. నా పెళ్లాం, పిల్లలు అనే కొన్ని బంధాలు పెరిగి, చుట్టుకొన్న తర్వాత ముసలితనంలో అడవికి వెళ్లి విముక్తుణ్ణి అవుతాననడం, కేవలం మాటే తప్ప, సహజంగా సాధ్యంకాదు. అందువల్ల బంధనాల్లో తగులు కోకుండా ఉండడమే వివేకం. అంటే అందరూ బ్రహ్మ చారులుగా ఉండాలని వాదించేవాడు' (పుట. 506) అని అనేవాడు.

తన విషయంలో భీష్ముడు 'భీష్ముడంటే బ్రహ్మచారి, బ్రహ్మచర్య మంటే భీష్ముడనే పేరు ఆర్యావర్త క్షత్రియ సమూహానికి తెలుసు. అనే జ్ఞాపకం వచ్చి శుకుడంటే గౌరవం పెరిగింది. ఇది భీష్ముడి అంతరంగం. తను చేసినవన్నీ త్యాగాలు అని తృప్తి పడే స్థితిని తెలుపుతోంది. బ్రహ్మచర్యంవల్ల సాధించదలుచుకున్నది తండ్రి కోసం ఇచ్చిన మాట. సత్యవతికిచ్చిన రాజ్యరక్షణ బాధ్యత. ఈ రెండింటినీ సక్రమంగా పూర్తిచేయగలిగాడా? అని ధ్వనించేలా ఈ విషయం కనిపిస్తోంది.

దుర్యోధనుడి ఆజ్ఞమేరకు ప్రాంత పాలకుడు వచ్చాడు. కృష్ణద్వైపాయనుడి ఆశ్రమంలో వస్తువులు, ధాన్యాదులు తీసుకెళ్లడానికే వచ్చాడు. ఈ విషయం కృష్ణద్వైపాయనుడికి పులహుడు, ఆశ్రమ కార్య నిర్వాహకుడు, చెప్పాడు. భీష్ముడితో ప్రాంతపాలకుణ్ణి ఆపమని చెప్పమని కోరాడు. అప్పుడు వశిష్ఠమహర్షి - నందినీధేనువు కథ భీష్ముడికి గుర్తుకొచ్చింది. వసిష్ఠుడు మీ ముత్తాతేకదా ప్రాంతాధికారిని ఎదిరించమని భీష్ముడంటాడు. 'వసిష్ఠుడు మొదలైనవాళ్లు వేదఋషులని విన్నాను. వాళ్లు రచించిన కొన్ని మంత్రాలను నేనూ నేర్చుకొన్న జ్ఞాపకం. నువ్వు వేదర్షివా, అంటే మంత్ర ద్రష్టవా?లేక మంత్ర సంగ్రాహకునివా?' అని (పుట. 532) కృష్ణద్వైపాయనుల ఉద్విగ్నత, కష్టం ఏమాత్రం తనకు తెలీనట్లే భీష్ముడడిగాడు. దీన్ని బట్టి భీష్ముడు స్థితి ఇంకా విచిత్రంగానే తోస్తుంది. తను సేనాధ్యక్షుడిగా ఉన్నా, ఏమి తన చేతుల్లో లేని వాడిగా ప్రవర్తించడం, రాబోయే యుద్ధంలోని భీష్ముడి స్థితిని సూచనగా చెప్పొచ్చు.

రథంమీద ఎక్కి కురుక్షేత్రానికి వస్తూండగా చాలా ఆలోచనలు ఇతడికి వస్తాయి. అంబను ఎత్తుకొచ్చాక, ఆమె శాల్వుణ్ణి ప్రేమిస్తున్నానని చెప్పాక, ఆమెని అతడి దగ్గరికి వెళ్లమని పంపాడు. కానీ శాల్వుడు ఆమెను తిరస్కరించాడు. తిరిగి భీష్ముడి దగ్గరికే వచ్చి, తనను వివాహం చేసుకోమని అంబకోరింది. ఆ కోరికని భీష్ముడు తిరస్కరిస్తాడు. భార్గవుణ్ణి అంబ ఆశ్రయించి తనకు న్యాయం చేయమని కోరుతుంది. భార్గవుడు భీష్ముడితో యుద్ధం చేస్తాడు. మధ్యలోనే మునులు వచ్చి యుద్ధాన్ని ఆపేస్తారు. దాంతో నిరాశని తట్టుకోలేక అంబ భీష్ముణ్ణి చంపడానికే మరో జన్మ ఎత్తి వస్తాననిమంటల్లో దూకిందట. ఒక్క క్షణం

భీష్ముడి ఒళ్లు జలధరించింది. అయినా ఇవన్నీ కల్పనలే అని మనసు తేలిక చేసుకొన్నాడు. ద్రుపదుడికి నపుంసకుడు పుట్టాడని, దాన్ని అవమానంగా దాచి ఇలా కల్పించాడు (పుట. 536) అని అనుకొన్నాడు. ఇందంతా భీష్ముడు తర్వాత యుద్ధంలో శిఖండి రాకని అతడి పురుషత్వాన్ని కల్పనగా భావించడం ఇతడి మానసిక ఆందోళనగా కనిపిస్తోంది.

విచిత్రవీర్యుడు, చిత్రాంగదుడు చనిపోయాక అతడి భార్యల్ని పెళ్లిచేసుకోమని సత్యవతి అనుజ్ఞ ఇస్తుంది. కనీసం వారిని నియోగపద్ధతిలో పిల్లల్ని కనమని అడుగుతుంది. 'నేనే చెబుతుండగా బ్రహ్మచర్య ప్రతిజ్ఞ భంగమైనట్లు కాదు' అని అంటుంది (పుట. 539). ఆమె మాటల్ని వినవలసింది అని అనుకుంటాడు. తలను విదుల్చుకుంటు కళ్ళు విప్పుతాడు. ఇందంతా భీష్ముడి మనసులో జరుగుతున్న అలజడి. బ్రహ్మచర్యవల్ల సాధించింది ఏంటి అని అంతర్మథనం ఇందులో కనిపిస్తోంది. తను ఏ రాజ్య రక్షణ కోసమైతే బ్రహ్మచర్యని చేపట్టాడో అది తీరలేదు అని బాధ పడుతున్నట్లు అనిపిస్తుంది.

యుద్ధరంగంలో శిఖండి చేతిలో విల్లంబులు పట్టుకొని 'ఒరేయ్ మదమెక్కిన భీష్మా, అబల, ఆడది, అని నన్ను పట్టి తెచ్చి నన్ను నాశనం చేసినవాడా, ఇప్పుడు నిన్ను అంతం చేయడానికే ఆడతనాన్ని పోగొట్టుకొని మగవాడిగా వచ్చాను. మగతనముంటే విల్లూ బాణం పట్టుకొనో, కత్తి, కటారు పట్టుకొనో, లేదా గదను పట్టుకొనో ఒక్కనివే యుద్ధానికి రా. ద్వంద్వ యుద్ధానికి రా. సవాలు స్వీకరించే ధైర్యం లేకుంటే, నేలను తాకి నమస్కారంచేయి(పుట. 574)అని అరిచాడు. నపుంసకుడి మాటలు ఒకరినుంచి మరొకరికి చేరు, రెండు వైపులవారు గొల్లుమని నవ్వుకున్నారు. యుద్ధం చేయడం ఆపేసారు.

అప్పుడు ఏం జరుగుతుందో అందరికి సంశయమే. అయితే భీష్ముడు సైనికులు నవ్వినందుకే యుద్ధంచేయలేదో, లేకపోతే శిఖండికి భయపడ్డాడో ఏమోకాని యుద్ధం చేయలేదు. ఆ సమయంలో పితామహుల ముఖం గంభీరమైపోయింది. "ఈ భీష్మునికి భయమనేదిలేదు. దీన్ని అందరూ తెలుకోండి. అయితే నపుంసకుడి సవాలు స్వీకరించడం ఈ భీష్ముడి పరాక్రమానికి శోభించదు. నేను సేనాపతి పదవినుండి నివృత్తుణ్ణయ్యాను. సారథీ! నా రథాన్ని వెనక్కు తిప్పు" అని కేక వేసాడు(పుట. 575). అప్పుడు ఎందుకు వెనకడుగువేసాడో కారణం పరాక్రమవంతుడని నిరూపించుకోడానికా! అని సందేహం వస్తుంది. తనవైపు వాళ్లే తనను అవమానకరంగా చూసారని నిష్క్రమించాడా, అని మరో సందేహం రావచ్చు. ఫలితం యుద్ధం లోంచివచ్చి, సేనాపతి పదవివదలేయడం.

ఇక్కడ భీష్ముడు యుద్ధాన్ని ఆపడానికి ఉపయోగించిన చివరి అంశం ఇది. తద్వారా దుర్యోధనుడి ప్రవర్తనలో మార్పు వస్తుందని ఆశించాడు. అందుకే అంతవరకు జరిగిన యుద్ధం అంతా బీభత్సంగా జరగనివ్వలేదు. కానీ అతడు ఆశించినఫలితం దక్కలేదు. కానీ, ఇది అతడి భావనగా కనిపిస్తోంది.

భీష్ముడు యుద్ధరంగానికి దూరగా పోయి శరశయ్యని ఏర్పరుచుకొని పడుకొనే నిర్ణయం తీసుకున్నాడు. దుర్యోధనుడు అక్కడికి వెళ్లాడు. చివరిగా అంతఃపురానికి వెళ్లిపో

అని దుర్యోధనుడు అన్నాడు. ఆ మాటలకి భీష్ముడు అది వినాశనం కాకూడదనే ఇంతవరకూ పెనుగులాడానని ఇది నీకు చివర అవకాశమని దుర్యోధనుడితో అన్నాడు. ఇప్పటికీ మించిపోయింది ఏమీలేదు. నీ మీసాలకు మట్టి అంటకుండా వాళ్లకు అన్యాయం జరగకుండా చెప్పగలిగేవారు ఇంకోదినం బ్రతికి ఉండొచ్చు. అన్నం, నీళ్ళూలేనిదేహానికి ఇంకా తట్టుకొనే శక్తిలేదు. సంధికి ఒప్పుకోమని సైన్యం బలం తగ్గేక నువ్వు ఒప్పుకుంటావని సేనానయ్యానని దుర్యోధనుడికి భీష్ముడు వివరిస్తాడు.

దుర్యోధనుడివైపు 'గెలవకుంటే తమకు జీవితమే లేదన్నంత తెగువఉన్న యోధులు ఒక్కరూలేరని' ఇంకా యుద్ధంచేయడం అనవసరం అని భీష్ముడు హిత బోధచేస్తాడు. భీమాదులకు చావంటే భయంలేదని చెప్తాడు. చివరకి "బ్రతకడంలో అర్థంలేనప్పుడు చావు అనర్థంకాదు. నిరాహారికావటంకంటే ఉత్తమ విధానం నాకు తెలీదు. ఈ బాణాల శయ్యకు మంట పెట్టించు కోవచ్చు. ఆ సరోవరంలో పడవచ్చు. అయితే అదంతా హింసాచార మవుతుంది" (పుట. 593) అని భావించడంలో భీష్ముడి హృదయవేదన, కురు రాజ్యరక్షణ కోసంపడిన తపన, తండ్రికోసం తనుచేసిన త్యాగం, దాన్ని వల్ల ప్రస్తుతం కలిగిన ఆవేదన[16] వ్యక్తమౌతుంది. అయినప్పటికి దుర్యోధనుడి ప్రవర్తనలో మార్పురాదు. ఒంటిమీద ఉన్న ఒక్క వస్త్రమైన కౌపీనాన్ని కూడా విసరేస్తాడు. రాబందులు దగ్గరైనప్పుడు, అక్కడ కాపలా కాస్తున్న భటుడికి భయమేసి ఉండలేక వెళ్ళి పోయాడు. ఇలా భీష్ముడి చరమాంకం పూర్తయింది.

### 4. 2. 3. భీముడు :-

భీముడు యోధుడు. కానీ, కురుక్షేత్రయుద్ధకోసం సైన్యాన్ని సమీకరించవలసి వచ్చింది. రాక్షసరాజ్య సహాయంకోసం ఘటోత్కచుడి రాజ్యానికి బయలుదేరుతాడు. దారిలో ఎవరైనా ఎదిరిస్తారని కురునాడుగుండా వెళ్లవద్దని ధర్మ, అర్జునులు చెప్తారు. అంగరక్షకులు, అశ్వికులు తగిన వంటదినుసులు తీసుకొని బయలుదేరతారు. దారిలో భీముడికి చాలా విషయాలు జ్ఞాపకం వస్తాయి. అవి అతడి మానసిక ప్రవృత్తిని, సంఘర్షణల్ని చూపుతాయి.

అమ్మానాన్నలు ఎంత పొందికైన పేరు పెట్టారు అంటూ చిన్ననాటిజ్ఞాపకాలకి వెళ్లిపోతాడు. "చిన్న బిడ్డప్పుడే అంతపెద్ద శరీరమట. తల్లి నడుమూ, చంకా నిండిపోయేవట. అమ్మంతటి దానికే తనను ఎత్తుకొని నడవాలంటే గసవచ్చేసేదట"(పుట. 106) ఇది అతడి శారీరకదారుఢ్యాన్ని చూపే అంశం. భీముడియోధతత్త్వాన్ని దీన్నిబట్టి రచయిత చూపించదలచు కున్నాడు. ఇదే భావికథకు ఆధారం. లాక్షాగృహంలో భిల్ల పడుచు, ఆమె అయిదుగురు పిల్లలు మంటల్లో చిక్కి ఒక్క నిముషంలో కాలి చనిపోయి ఉండాలి. ఆ కాలిన శవాలనే దుర్యోధనుడు- కుంతి, పాండవులు అని భావించుకొని పాలు, తేనె కలిపిన సోమరసాన్ని తాగి సంతోషం పట్టలేక గంతులు వేశాడట. రెండు సంవత్సరాల తర్వాత కృష్ణను గెలుచుకున్నప్పుడు ఆనవాలు దొరికాక వాడి ముఖం చూడాలి' అని దుర్యోధనుడు ఎలా అనుకున్నాడో భీముడి ద్వారా రచయిత చూపించారు. దీనివల్ల భీముడు

---

[16] భీష్ముడికి శంతనుడు సత్యవతిని తీసుకొనివచ్చినందుకు "ఇచ్ఛామరణం" వరంగా ఇచ్చినట్లు మూలంలో ఉంది.దీన్ని రచయిత మార్చారు.

దుర్యోధనుడి విషయంలో అతడి మానసిక స్థితిని చూసి లోలోపల ఆనందిస్తుంటాడు.

ధర్మరాజును అందరూ కీర్తించారు. యువరాజుగా అందరూ మెచ్చుకున్నారు. అయితే ఆట రాకపోతే ఎందుకు వెళ్ళాడు ధర్ముడు? రాజసూయ యాగకీర్తికి తల తిరిగిందా? అని మథన పడతాడు. పైగా ముసలివాళ్లు మెచ్చుకోవాలని పాదాలమీద పడి, వాళ్లు చెప్పేదంతా మహా ప్రసాదం అని భావించడం అతడో మానసిక దౌర్బల్యం అని ధర్మరాజుకుండే బలహీనతల్ని చూపిస్తాడు. ఈ అంశంలో పెద్దలమీద విపరీతమైన భక్తి ఉండక్కర్లేదని ఇతడి అభిప్రాయం. ఇక్కడ ఇంకో విషయాన్ని గమనించాలి. విదురుడువచ్చి, జూదానికి రాను అని ధర్మరాజుని అనమంటాడు. కానీ, అక్కడ ధర్మరాజు అతడి మాటలు వినడు. పెద్దతండ్రి చెప్పినమాటల ఆధారంగా యుద్ధానికి వెళ్తాడన్నవిషయం ఇక్కడ సూచించారు.

భీముడికి హిడింబవనం గురించిన ఆలోచనలు వస్తాయి. అది హిడింబవనం. దానికి కచ్చితమైన పేరులేకపోవడంచేత భీముడు తప్ప, అందరూ అడవిలో నిద్రపోయారు. ఆ సమయంలో భీముడికే భయం గొలిపేటంత ఎత్తులో వచ్చి సాలకటంకటి బికం, డాంబికం లేకుండా మాట్లాడుతుంది. "తనకు మొగడువు కమ్మని" (పుట.111)తన అభిప్రాయాన్ని చెబుతుంది. ఆ విషయాన్ని గుర్తుకు తెచ్చుకొని భీముడు ఏమి రూపం, ఎత్తయిన గాత్రంతో ఉన్న ఆమెను చూసాక మరే పిల్లనైనా తన కోసం దేవుడికి సృష్టించడం సాధ్యమై ఉండదని భావిస్తాడు. అప్పటికి అతడి వయస్సు ఇరవైఐదు సంవత్సరాలు. అదే ద్రౌపదయితే ఏమీ సూటిగా చెప్పదని అనుకుంటాడు. ఏ విషయాన్నయినా సూటిగ చెప్తే గాని పట్టని వ్యక్తిగా భీముడు కనిపిస్తాడు.

హిడింబుణ్ణి చంపాక, పెద్ద చెట్టు నీడలో భీముడు నిద్రపోయాడు. సంధ్యగడిచేసరికి పృథ భుజంతట్టి లేపింది. అప్పటికే ఏడెనిమిది మంది ముసలి రాక్షసస్త్రీలు వచ్చి మారాజుని చంపిన ఈ వీరుణ్ణి మా రాజకన్య పెళ్లి చేసుకొంటుదని వారంతా పృథని అభ్యర్థించారు. పృథ ఆమోదించింది. తరువాత సాలకటంకటిమీద భీముడికి మోహం పుట్టసాగింది. మోహం అంటే ఎలాంటిదనే నీలుడి ప్రశ్నకు సమాధానం చెప్పకుండా, యోధుడివి నీకెందుకు ఆ విషయాలు అనిచెప్పలేదు. కానీ అంతరంగలో దానికి సంబంధించిన విషయాలు రచయిత పాఠకుడికి తెలియజేస్తారు. "స్త్రీ విషయం, శృంగారం విషయం, అతడెప్పుడూ మరే మగవాడితో మట్లాడాలంటే నాలుక దానంతట అదే తడబడుతుంది" (పుట.118) అని భీముడి మానసిక స్థితిని తెలియజేయడంలో అతడికి స్త్రీపట్ల, శృంగారంపట్లఉండే అభిమతాన్ని తెలుపుతోంది. పైగా అది ఆంతరంగవిషయం. దాన్ని ఇతరులతో చెప్పడం భావ్యంకాదు అనే భీముడి విచక్షణను గుర్తుచేస్తోంది.

ఇన్నేళ్లూ సాలకటంకటితో ఏ సంపర్కమూలేదు. కాని, ఇప్పుడు వెళ్లి 'ఒకసంవత్సరం నీకు మగాడిగా ఉండినవాణ్ని, మీతండ్రిని నేనే అంటూ వాళ్ల ప్రజల ఎదురుగా నిలబడడం హీనమనిపించింది'. దాంతో తిరిగి వెనక్కి పోదామనుకున్నాడు. కానీ, కృష్ణుడికిచ్చిన మాట, రాక్షసులు ప్రతిశక్తిగా తెస్తానని, బయలుదేరాడు. కాసేపటికి తనను నిందిస్తుంది. కానీ,

సాలకంటకటి తిరస్కరించదు అని భీముడి మనసు అతడికి స్పష్టంగా తెలియజేస్తుంది. ఇక్కడ భీముడికి సాలకటంకటి మీద ప్రేమభావాన్ని, కృష్ణుడి కిచ్చినమాటను నిలబెట్టుకోవాలనే స్థితికూడా తెలుస్తోంది.(పుట. 119)

మోహంగురించిన స్పష్టమైన ఆలోచనలురాక ప్రశ్నలపరంపరలు వస్తాయి. 'మోహమంటే ఏమిటి? ఎలాటి చెట్టుకైనా పెకలించి వేసే సాలకటంకటి కడుపు పెరిగి భారమై, నడక నిదానమై రాత్రి తనతో పాటు పడుకొనే చెట్టుగూడు ఎక్కడానికి కూడా అలసిపోయే ఆమెను చూస్తే, వేటకు వెళ్తే పరిగెత్తలేక ఆయాసపడుతూ తనపై ఒరిగి పట్టుకొని ఊపిరి తిప్పుకొనే ఆమెను చూస్తే, అయ్యో అనుకోవడకం మోహమనిపించు కొంటుందా? నన్ను వదిలి పెట్టి పోతావా? మీ అమ్మ కోసం ఏం చేయాలో నువ్వు అయినా చెప్పమ' ని ఏడ్చింది (పుటలు.121-122). ఈ సందర్భంలో మోహానికి, కామానికి లేదా కావాలనుకోడానికి మధ్య తేడా తెలీక సతమతపడిపోతుండడం కనిపిస్తుంది. ఇక్కడ సాలకటంకటి మీద ఉండే ప్రేమను రచయిత చూపించదలుచుకున్నట్లుగా ఉంది. దీనికి మరిన్ని ఉదాహరణలు కూడా అక్కడ సూచించారు. సాలకటంకటి అంటే పృథకు మొదటినుంచి ప్రేమ కలగలేదు. ఆమె పేరు కమలపాలిక అని పృథ పెట్టింది. కమలముఖీ అనో, కమలలోచన అనో ఎందుకు పెట్టలేదు అని భీముడు బాధపడతాడు. ఆడవాళ్లని ఓదార్చడం రాకపోవడంవల్ల భీముడు, తనే వారికంటే ఎక్కువ బాధపడతాడు అనే విషయం సూచనగా ఉంది.

భీముడికి చిన్నప్పటి మరో జ్ఞాపకం- ఉత్తర పర్వతాలవైపు చూస్తూ భీముడు రాతి బండలమీద కూర్చుకొనేవాడు. అక్కడ అందమైన ప్రకృతికి ఆనందించేవాడు. ఒక్కడేవెళ్తే తప్పిపోతాడని పృథ భావించేది. తోడుగా పాండురాజుని రమ్మనేది. పాండురాజుకి పర్వతాలు ఎక్కే శక్తి ఉండేది కాదు. ఒకవేళ వస్తే, ఆయాసం వచ్చేది. దేవలోకమైతే కేవలం తెల్లగా ఉంటుందట. జ్ఞాపకాలు భీముణ్ణి బాధిస్తున్నాయి. అక్కడికి పోవాలని భావించేవాడు. అరణ్యవాస సమయంలో నాలుగు వేసవికాలాలు హిమవత్పర్వతం దిగువున ఉన్న సీమలోనే ఉన్నారు. అది గంధర్వసీమ. దేవసీమకు అదృష్టవంతుడైన అర్జునుడొక్కడే వెళ్లాడు అని తలచుకొంటాడు. ఇక్కడ భీముడికి ప్రకృతిమీద ఉండే ఆరాధనాభావం, దేవలోకం వెళ్లాననే తపన ఉన్న వ్యక్తిగా కనబడతాడు. (పుట.135)

సాలకటంకటి దగ్గరికి భీముడు వెళ్తున్నప్పుడు దారిలో 'యమున'లో స్నానంచేస్తూ, కొంతసేపు అక్కడే గడుపుతాడు. ఎన్నో రోజులు కృష్ణుడు ఈ నదీతీరంలో గడిపాడు. భీముడికి గంగమీద ప్రేమ ఉన్నట్లు, కృష్ణుడికి యమునమీద ప్రేమఉంది. ఒకసారి "భీమా! గంగా తీరాన్ని దుర్యోధనాదులే ఉంచుకోని, యమున తక్కువని భావించవద్దు, కిందికి వెళ్తే నేను పుట్టి పెరిగిన మధుర ఉంది. ఈ ఖాండవవనాన్ని నరికి వ్యవసాయానికి తగినట్లు చదునుచేసి పంటలు పండిద్దాం. చిన్నపల్లె ఉన్న ఈ స్థలంలో ఒకమహానగరాన్నే నిర్మిద్దాం. ఆర్యావర్తంలోనే సుందరం అనిపించేంత కొత్తనగరం..." అన్న కృష్ణుడి మాటల్ని గుర్తుకు తెచ్చుకొని ఉత్సాహమంటే అతడిదే. కొత్తదనాన్ని వెదకడంలో అతడి బుద్ధి, ఉత్సాహాలకు అంతులేదు. ఎలాగైనా యుద్ధం అయ్యాక, ఆ సుందరనగరమైన ద్వారకను చూడాలని

భీముడు భావిస్తాడు. కొత్తదనంమీదఉండేఆకర్షణ, ఉత్సాహవంతుల్ని చూసి ఉత్సాహపడడం భీముడి పాత్రలో ప్రత్యేకత.

అరణ్యవాసంలో భీముడి భారీశరీరం కొంత చిక్కిపోయింది. అజ్ఞాతవాసంలో వంటవాడు కాకపోతే, తన పరిస్థితి ఏమై ఉండేదో అని భీముడు భావించడం ఉంది- 'విరాటనగరంలో వంటవాడు కాకుంటే భీముడు తనకు తానే చచ్చేవాడు. ధర్ముడు యుద్ధం చేసేవాడు కాదు. మళ్ళీ అడవికి వెళ్లిపోయి ఉండేవాడు. అన్నకు భక్తుడు- అర్జునుడు, లక్షణంగా అనుసరించి వెళ్లేవారు. నకుల సహదేవులు సరే సరి. ఇక కృష్ణగతి. వేరే చెప్పనక్కర్లేదు. కృష్ణా! భీముడు బ్రతికి ఉన్నాడు. నాకు నీకూ వేరే ఆశలు లేవు. మళ్లీ పట్టమహిషివి కావాలనే మోహం నీకులేదు. దుర్యోధనుడు వాడి తమ్ములు, కర్ణ శకునుల తలలను నరికి, ఎడమకాలితో తొక్కి, పిండి చేయడానికి నువ్వు బతికి ఉన్నావు. దాన్ని చూపకుండా నేను యముడు వచ్చి పిలిచినా నిన్ను పంపను, నేను చావను' (పుట.141) అని భావించడం భావి కురుక్షేత్ర యుద్ధాన్ని సూచిస్తూ భీముడి స్థిరమైన ప్రతీకారాన్ని సూచించడం కనిపిస్తోంది.

ద్రౌపదిని పాండవులు వివాహం చేసుకున్నాక, ఐదుగురు మగపిల్లలు పుట్టారు. అత్తగారికి ఇష్టమైన కోడలు ద్రౌపది. ఫలవంతమైన గర్భంతో వెంటవెంటనే గర్భం ధరించడం మరింత ఇష్టానికి కారణం. ఆ పిల్లలకు(ఉపపాండవులు) భీముడంటే ఇష్టం. పరుగెత్తుకొని వచ్చి తొడల మీదకు ఎక్కేసేవారు. వీపు భుజాలు తల అన్నింటిమీదా ఎక్కేసేవాళ్ళు. ఆ పిల్లల దృష్టిలో తండ్రి అంటే భీముడే. అయిదుమంది పిల్లల్ని ఒక్కసారిగా ఎత్తుకొని యమునానదిలోకి వెళ్ళి నడుము లోతు నీళ్ళలోకి వెళ్తే... ఆనందం గుర్తుకువచ్చి, భీముడికి నవ్వు వచ్చింది. ఇది పిల్లలపట్ల భీముడికుండే అవ్యాజమైన ప్రేమకు నిదర్శనం. ఈ ప్రేమ ఘటోత్కచుడి విషయంలో కూడా కనబడుతోంది. ఇంకొరకంగా చెప్పాలంటే భీముడి స్థితి చిన్నపిల్లల మనఃస్థితికి దగ్గరిగా కూడా ఉంటుంది. తొందరిగా కోపంరావడం మొదలైనవి ఇతడిలో కనిపిస్తాయి.

సాలకటంకటి బకుణ్ణి, కిమ్మీరుణ్ణి ఎందుకు చంపావు? మాంసం రుచి మరిగి చేసావంటే మనుష్యమాసం తిననివాడివి? కారణం ఏంటనిభీముణ్ణి అడుగుతుంది. "మనుష్య మాంసం రుచి విపరీతంగా మరిగి, బకుడు మొత్తం రాజ్యాన్నే గగ్గోలు పరిచి ప్రజల్ని చంపుతున్నాడు. మాకు అన్నం పెట్టినవాళ్లఋణం తీర్చడానికి అతణ్ణి చంపవలసి వచ్చింది. అతణ్ణి చంపినందుకు పగ తీర్చుకోడానికి అతని తమ్ముడు కిమ్మీరుడు, మేము అడవిలో ఉండగా ప్రతిదినం రాత్రిపూట వచ్చి మమ్మల్ని చంపడానికి ప్రయత్నిస్తుండేవాడు. అలాంటి వాణ్ణిచంపకుండా మేము ప్రాణాలు దక్కించు కోవడమెట్లా"అని భీముడు సాలకటంకటికి వివరించడంలో ప్రాణాలమీదికి వస్తేగాని ఎవరినీ చంపని అతడి మనస్తత్త్వం ఇక్కడ తెలుస్తోంది.

కృష్ణ ఒంటిమీద చెయ్యివేసి, కొంగు పట్టి దుశ్శాసనుడు లాగుతాడు. ద్రౌపది అతణ్ణి బెదిరిస్తుంది. కానీ, వాడు బెదరడు. ఆ సమయంలో భీముడులేచి నిలబడి గర్జిస్తూ "ఒరే

దుశ్శాసనా, నా భార్య ఒంటిని ముట్టుకొన్నావు కదా. నిన్ను అంగాంగాలను విరిచి, నీ రొమ్ము చీల్చి రక్తం తాగకుంటే నేను భీముణ్ణి కాదు. అలా జరగని నాడు నా తండ్రి తాతలకు స్వర్గం చెల్లదు" (పుట. 196) అని అన్నాడు. ఈ మాటల్లో భీముడు, ద్రౌపదిని తన భార్యగా అనుభూతి చెందిన వ్యక్తిగా ఉండడం కనిపిస్తుంది. అతడి కోపతీవ్రత గర్జించడంలో వ్యక్తమైంది. అందుకే ధృతరాష్ట్రుడు సైతం ఉలిక్కి పడతాడు. అయితే తగిన సమయం వరకు ఆ కోపతీవ్రతకు భరించి ఉండడం సాధ్యంకాక, ఇబ్బందిపడతాడు. ద్రౌపదిని భార్యగా ప్రేమించిన వ్యక్తిగా పర్వనవలలో కనబడతాడు.

జూదగాళ్లు, త్రాగుబోతులు, వ్యభిచారులు ఏ దేశంనుంచి పోయినా, చేరుకున్న దేశంలో మూడు ఘడియల్లో సమాన చాపల్యం ఉన్నవాళ్లను గుర్తుపట్టి స్నేహితులైపోతారు. అలాగే ధర్మరాజు జూదంవల్ల విరాటుడికి దగ్గరయ్యాడు. ఆ విషయం గురించి భీముడు 'అజ్ఞాతవాసం గడిచి మళ్లీ రాజ్యం గెలుచుకున్నాక, ధర్మరాజు ఈ జూద చాపల్యం చూపిస్తే, చేతులు విరిచి వేళ్లను కత్తిరిస్తాను. వికలాంగుడికి రాజ్యంమీద కూర్చునే హక్కు లేదు. కాబట్టి ప్రతివింధ్యుడికి పట్టంగడతాను' అని(పుట. 210) అంటాడు. జూదం పట్ల ఉండే భీముడి వైఖరి ఈ మాటల్లో తెలుస్తోంది. తను రాజ్యపాలన చేస్తాను అనకపోడం ఇతడికి రాజ్యవ్యామోహం లేదని సూచించడం కనిపిస్తోంది. సోదరుడైనా ఈ విషయంలో తన నిర్ణయాన్ని మార్చుకోనని కృష్ణతో అనడం ఈ పాత్ర ప్రత్యేకత.

దుర్యోధనుడు, అరణ్యవాసంలో ఉన్న పాండవులదగ్గరికి వెళ్ళి వాళ్లని అవమాన పరచాలని, హిమాలయ పర్వతాలదగ్గర ఉన్న ద్వైతవనానికి వచ్చి విలాసవంతంగా గడుపుతూ ఉంటాడు. ఆ వనం చిత్రసేనుడిది. అతణ్ణి పిలిచి, దుర్యోధనుడు ఈ వనంమీద నీకు హక్కులేదు. నీ హద్దుల్లో ఉండమని హెచ్చరించాడు. దాంతో కోపం వచ్చిన చిత్రసేనుడు గంధర్వ సైన్యంలో దుర్యోధనాదులకు పెడరెక్కలు కట్టి, ఆడవాళ్లకు కూడా వారివారి బట్టలనే విప్పి, కాళ్లు, చేతులు బిగించి ఒకొక్కరిని విపులమీద వేసుకువెళ్లారు.(పుట. 253) కొద్దిమంది దుర్యోధనుడి భటులు ధర్మరాజుకి ఈ విషయాన్ని వివరించారు. వాళ్లందర్నీ విడిపించుకు రమ్మని ధర్ముడి ఆజ్ఞ. గట్టిగా తిరస్కార పూర్వకంగా భీముడు నవ్వి, 'అరణ్యజీవితంలో ఎండా గాలి ఉపవాసాలకు చిక్కిపోయిన నీకు దుర్యోధనుణ్ణి చంపడం సాధ్యమా? అని ధర్మదేవత ఆ గంధర్వుల రూపంలో ఆ పనిచేసి వాళ్లను బంధించింది. వాళ్లనింకా విడిపించుకొని రావాలా? జూదంలో పాచికలు పట్టుకోవడానికే కదా నీ బుద్ధి పనిచేసేది' అంటాడు(పుట.254) ఈ మాటల్లో ధర్మరాజు జూదపు బుద్ధిని శక్తివంతంగా, వ్యంగ్యంగా భీముడు విమర్శించడం కనిపిస్తుంది. పైగా ధర్మదేవత చేసిందని, ధర్మరాజుని నమ్మించే ప్రయత్నం చేస్తూ, అతణ్ణి విమర్శించడం ప్రత్యేకత.

యుద్ధసమయంలో ధృతరాష్ట్ర కుమారులుగా అనిపించుకుంటున్న ముప్పైమందిని భీముడొక్కడే చంపేస్తాడు. తర్వాత రోజు జయద్రధుడు అభిమన్యుణ్ణి చంపేస్తాడు. దానికి కారణం ఎవరని అర్జునుడు అడుగుతాడు. వెంటనే సమాధానంగా భీముడు 'ద్రౌపదిని ఎత్తుకెళ్ళడానికి వచ్చిన జయద్రధుణ్ణి మనచెల్లెలు ముండమోస్తుందని ధర్మరాజు ప్రవచనం

విని, చంపకుండా వదిలేయడం వల్ల అభిమన్యుణ్ణి పోగొట్టుకున్నాం. జయద్రధుడు కొంత శక్తివంతమైన సైనికులతో[17] ఒక కొత్తదళాన్ని కూర్చుకొని శిక్షణ ఇచ్చి ఎదిరించాడు. అప్పుడే జయద్రధుణ్ణి చంపేద్దామని అంటే నా మాట వినలేదు. రేపటి యుద్ధంలో జయద్రధుణ్ణి చంపితే మనకొడుకు చావుకు ప్రతీకారం తీరినట్లే అంటూ అర్జునా ఆ పని నువ్వు చేస్తావా? నన్ను చేయమంటావా? అని భీముడు ఆవేశంతో అంటాడు.(పుట.621)ఈ మాటల్లో జయద్రధుణ్ణి చంపడానికి తగినఆవేశం ఉన్నవాడిగా, అర్జునుణ్ణి వ్యంగ్యంగా అన్నమాటలు పట్టుకొని వాణ్ని వదిలేసావు అని గుర్తు చేయడం గమనించదగింది. తనూ కూడా అర్జునుడి అన్నే కదా. ఇక ఆలస్యం చేయవద్దు. వెంటనే జయద్రధుణ్ణి చంపు అని సూచించినట్లు అనిపిస్తుంది. ఈ మాటల్లో భీముడికి కొంత పరిపక్వతతో పాటు అధికప్రతీకారేచ్ఛలు కనిపిస్తాయి.

యుద్ధంలో కర్ణుడు కత్తి పట్టుకొని వస్తున్నాడు. ఆ సమయంలో భీముడు అలాయుధుడి గొంతు పిసకడంలో నిమగ్నమై, యుద్ధరంగంలో ఉన్నాడు. విశ్రాంతి లేకుండా భీముడు పోరాడడం వల్ల అలాయుధుడి మొదటి దెబ్బకే భీముడు తత్తరించాడు. తలతిరిగినట్లయింది. భీముడు కిందపడి పోయాడు. శత్రువులవైపు నుంచి రాక్షసగుంపును చూసి ఘటోత్కచుడు వెంటనే రంగంలోకి దిగి అలాయుధుణ్ణిపట్టి ఒకరిమీద ఒకరు పడి దొర్లుకుంటూ నాలుగైదు మూరల దూరం పోయారు. పైకి లేచి, అలాయుధుడిమీద పడేంత శక్తిలేక భీముడు ఆయాసపడి కూర్చుండి పోయాడు. వెంటనే ఘటోత్కచుడు వచ్చి అలాయుధుణ్ణి ఎదిరిస్తాడు.

అటువైపే వచ్చిన కర్ణుడు అలాయుధుడితో పోరాడుతున్న ఘటోత్కచుడి గొంతుని కత్తితో కోసి[18] వెనక్కి వెళ్ళిపోయాడు. ఊపిరాడక అలాయుధుడు చనిపోయాడు. కుత్తుకనుంచి రక్తం కారడంవల్ల, ఘటోత్కచుడు వికారంగా అలాయుధుడి శవంమీదే పడి చనిపోయారు. ఆ దృశ్యాన్ని చూసిన భీముడు, ఆ సమయంలో కర్ణుణ్ణి, అలాయుధుణ్ణి ఆపే తనకు శక్తిలేక పోయిందని ద్రౌపది దగ్గర బాధపడతాడు. (పుట.643) ఇది ఘటోత్కచుడిమీద ఉండే వాత్సల్యానికి, తండ్రిగా తన ప్రాణాలొడ్డి అయినా, కాపాడవలసిన సమయంలో ఉన్న అసహాయతని వ్యక్తం చేసుకొని, బాధపడడాన్ని తెలియ జేస్తుంది. ఇక్కడ విరామంలేకుండా పోరాడే యుద్ధవీరుడిగా భీముడు కనిపిస్తాడు. తండ్రిగా ఆవేదన పడతాడు.

దుర్యోధనుడు సరోవరం మధ్యలో ఉన్న ఒక చిన్న తిన్నెమీద ఉన్న మొక్కలు, తుప్పల మధ్య దాక్కొని కూర్చున్నాడు. భీమాదులు అక్కడికి వచ్చి, నానా తిట్లు తిట్టారు. ఆ

---

[17] మూలంలో జయద్రధుడు ఈశ్వరుడి గురించి తపస్సుచేసి, ఒకరోజు అర్జునుణ్ణితప్ప, పాండవుల్ని, ఓడించగలిగే వరాన్ని పొందుతాడు. ఆ వర ప్రభావంతో పద్మవ్యూహం ఏర్పాటుచేస్తారు. అభిమన్యుడికి ప్రవేశం తెలుస్తుంది. తిరిగి రావడం తెలీక, వెనుక వస్తున్న ధర్మరాజాదుల్ని జయద్రధుడు అడ్డగించడంవల్ల అభిమన్యుడు ప్రాణాలు కోల్పోతాడు.

18 ఇంద్రుడిచ్చిన 'శక్తి' అనే ఆయుధాన్ని అర్జునుణ్ణి చంపడానికి కర్ణుడు ఉంచుకుంటాడు. అయితే ఘటోత్కచుడు విపరీతంగా సైన్యాన్ని చంపేస్తుంటాడు. దుర్యోధనుడు వెంటనే శక్తి ఆయుధాన్ని ప్రయోగించమని ఒత్తిడి చేయడంతో, కర్ణుడు ఘటోత్కచుడిమీద దాన్ని ప్రయోగిస్తాడు.

తిట్లకు భరించలేక, దుర్యోధనుడే బయటికి వచ్చేసాడు. తను ఒక్కణ్ణి ఇంతమంది చుట్టిముట్టడానికి సిగ్గులేదా? అని దుర్యోధనుడు అడిగాడు. మాలో ఎవరైనా ఒకర్ని ఎంచుకొని ద్వంద్వ యుద్ధంలో గెలిస్తే, నువ్వు విజయుడివైనట్లు ఒప్పుకుంటాను అని ధర్మరాజు అన్నాడు. అలాగా? ఇదే మాట పందెమా? అని దుర్యోధనుడు జోరుగా అన్నాడు. అప్పుడు కృష్ణుడు అడ్డంవచ్చి, నీతో యుద్ధానికి వస్తే నువ్వు అతణ్ణి ఓడించగలవా, నువ్వు ఓడిపోతే ఇంత యుద్ధం ఎందుకు? జూదబుద్ధి పోలేదా అని ధర్ముడితో అన్నాడు. అంతవరకు నేలమీద కూర్చున్న భీముడులేచి, "కృష్ణా! ఇప్పుడే చెబుతున్నాను వీడు పెద్దవాడని సింహాసనం మీద కూర్చో బెడతాము అంతే. రాజ్యపాలనలో గాని, కోశాధికారం విషయంలో గానీ వీడిదేమీ జరగడాన్ని నేను అనుమతించను. పెద్దన్న తండ్రితో సమానమని అంతా వదిలి పెట్టినందుకు జూదమాడి మమ్మల్ని ఈ గతికి తెచ్చాడు కదా. ఇక ఈ వ్యవహారం కొనసాగదు. ఇప్పుడు వీడు శత్రువుతో మాట్లాడిన మాటకు మేము బద్ధులం కాము" (పుట. 691) అన్నాడు.

కృష్ణుడు భీముడి ప్రతిజ్ఞ ఎలాగూ ఉంది కదా. భీముడితో పోరాడతావా అతడి చేతిలో ఎలాగూ గద ఉందన్నాడు. భీముడు చేతిలోకి గద తీసుకొన్నాడు. ఒక్క దెబ్బకు దుర్యోధనుడి మీదకు కుప్పించి భీముడు దూకాడు. అతణ్ణి నిలువునా భీముడు చూపులతోనే పట్టి చంపుతున్నట్లు ఒక ముహూర్తకాలం చూసాడు. భీముడు చేతిలో గద కిందపడేసి, 'వీడప్పుడే చచ్చి పోయి ఉన్నాడు. వీడి ముఖం చూడు కృష్ణా! ఈ లోకాన్ని వదిలిపెట్టి పోయి ఎన్నో రోజులైనట్లుంది. కళ్లు మృత్యువు చీకటితో నిండిపోయి ఉన్నాయి. ఎలాగూ వీడే నీటి ఒడ్డును చేరుకున్నాడు. కొడుకులు మనుమలు లేక స్వయతర్పణం వదులుకోడానికి. ఇలాంటి వాడిమీద నా అంతటివాడు యుద్ధం చేయడమా? అందరూ పదండి ఇక్కణ్ణుంచి. యుద్ధం నిన్నటికే ముగిసింది (పుట. 692)అని అన్నాడు. ఇక్కడ తన ప్రతిజ్ఞకు అర్థం మిగలలేదని సూచన ఉంది. శత్రువు నిస్సహాయస్థితిలో, నిర్బలంగా ఉన్నాడని వాణ్ణి చంపడం ఇష్టంలేక[19] వెనుదిరగడం ఈ భీముడిపాత్ర గొప్పదనం. ఇక్కడ దుర్యోధనుణ్ణి చూడడంలోనే సగం చచ్చినట్లు రచయిత సూచించిన మరో అంశం. చివరకు కూడా యుద్ధానికి సిద్ధమైన దుర్యోధనుడికి, భీముడి చూపులు మానసిక స్థైర్యాన్ని కోల్పోయేలాచేసాయని భావించవచ్చు.

యుద్ధం ముగిసాక పాండవులు, ద్రౌపది, కృష్ణాదులతో హస్తిన అంతఃపురానికి వెళ్లారు. గాంధారి వాళ్లని గడ్డం పట్టుకొని పాతదంతా మరచిపొమ్మని అడుగుతానని అంటుంది. అప్పుడు భీముడు మాత్రం అంగీకరించడు. ఆ గుడ్డోడి మూలంగానే ఇదంతా జరిగింది. యుద్ధానికి ముందే భీముడు ధృతరాష్ట్ర మహారాజుకి నమస్కరించలేదు. ఇప్పుడు ఎందుకు చేతులు జోడిస్తాడు. కానీ, కుంతి చెప్తే, బయలుదేరి హస్తినకు వస్తాడు. తల్లిపట్ల అతడికి గౌరవం ఉంది అని చెప్పడానికి ఈ మాటలు సరిపోతాయి.

---

[19] భీముడు కురుక్షేత్ర యుద్ధం చివరలో దుర్యోధనుడి తొడల్ని విరగ్గొట్టి చంపాడని మూలంలో ఉంది. దాన్ని రచయిత చూపులతో చంపేసినట్లు సూచించారు.

ధృతరాష్ట్రుడు భీముణ్ణిపట్టుకొని తడిమి కంబడిలోపల కత్తితో పొడవాలని అనుకుంటాడు. ఆ విషయం ముందుగానే కనిపెట్టిన కృష్ణుడు మణికట్టును బిగువుగా పట్టుకొంటాడు. వెనక్కి జరిగి భీముడు "కృష్ణా! ఈ ముసలి పాము యోగ్యత నీకంటే నాకు బాగా తెలుసు. అందుకే నేను రానన్నది" అని బిగ్గరగా(పుట.704)అరిచేస్వరంతో అంటాడు. ఈ మాటలు ధృతరాష్ట్రుడి మీద భీముడికుండే కోపస్వభావాన్ని వివరిస్తుంది. అంతకుముందు గుడ్డిరాజు చేసినపనులన్నీ ఒక్కసారిగా సూచించినట్లు ఉంది. ముసలి పాముగా పోల్చడంవల్ల ఆ పాముకు పుట్టినవారు అలాంటి వారే అని దుర్యోధనాదుల్ని సూచించినట్లు భావించవచ్చు.

చివరికి జోరుగా వర్షం మొదలౌతుంది. అడవిలోకి భీముడొక్కడే సాలకటంకటి గురించి వెళ్తాడు. అక్కడ ఒక యువకుడు భీముణ్ణి గుర్తుపట్టినట్లు దగ్గరకువచ్చి, మోకాళ్లదాకా వంగి, దండం పెడతాడు. తను ఘటోత్కచుడితోపాటు యుద్ధానికివచ్చానని పరిచయం చేసుకుంటాడు. ఘటోత్కచుడు చనిపోయాక వెనక్కి వెళ్ళినట్లు, ఆ అటవీప్రాంతాన్నంతా నాగులు, ఆర్యజనం చుట్టిముట్టి నిప్పంటించారని వివరిస్తూ ఏడుస్తాడు. సాలకటంకటీ! అని ఉరిమే మేఘానికి కూడా వినబడేలాఅరచి గొంతు నరాలు బిగిసిపోయేలా పిలుస్తాడు. పసిబిడ్డ 'బర్బరకుడు' ఏమయ్యాడో!?, అని ఉద్వేగంతో బాధపడతాడు. చివరకు ఏమీ మిగలలేదని రచయిత సూచిస్తాడు. భీముణ్ణి కర్ణాటక ప్రాంతంలో ఇప్పటికీ ఆరాధ్య దైవంగా పూజిస్తారు.[20] దీన్ని దృష్టిలో పెట్టుకొని భీముడి పాత్రని రమణీయంగా, నాయకుడికి తగిన లక్షణాలున్నట్లు అనిపించేలా ఆవిష్కరించారు.

### 4. 2. 4. కుంతి :-

కుంతిభోజుడి పెంపుడు కూతురు ఈమె. పృథు మండపంలో అతిథి, అభ్యాగతులు, మునులు మొదలైన వారికి సేవ చేయడం ఈమె విధి. ఒకరోజు అంతఃపురానికి ఒక ఋషి వస్తాడు. ఆ ఋషి సేవకోసం ఇంట్లో ఆడపిల్ల ఉండడంతో ఆ రోజుల్లో తండ్రికి ఆనందంగా ఉండేది. ఆ ఋషి సేవలకోసం కుంతిభోజుడు కుంతిని నియమించాడు. కుంతిని ఆ ఋషి చూసి మహా వీరులతల్లి అవుతుందని అంటాడు. అక్కణ్ణున్నుంచి కుంతికి పిల్లలు ఎలా పుడతారో తెలుసు కోవాలని కోరిక పుడుతుంది. అప్పటికి కుంతి వయస్సు పదిహేను సంవత్సరాలు.

ఒకరోజు ఆ ఋషినే, 'మునీశ్వరా, పిల్లలు ఎలా పుడతారు' అని అడిగేసింది. పిల్లలంటే ఆశానీకు? అని దుర్వాసుడు అడిగి, చివరకు బిగువుగా కుంతిని కౌగలించు కున్నాడు. "తనకు ఏమైంది? ఉద్రేకం కాదు, సిగ్గు. సిగ్గుకంటే ఒక మెట్టుపైనున్న కుతూహలం. ఒక విధమైన సుఖం. గాబరా. పృథా! పృథా! అని మృదువుగా పలవరించారు.

---

[20] జయపూర్ జిల్లాలోని విరాటనగరం పక్కనే ఉన్న భోటా కురుక్షేత్ర, లేదా, గోగ్రహణ యుద్ధం జరిగిన చోటుకు దగ్గరిలోనే 'భీమగుహ' ఉంది. అక్కడికి కొత్త దంపతులు వెళ్ళి పూజలు ఇప్పటికీ చేస్తున్నారు. (పర్వ-రచయిత ముున్నుడి)

తరువాత ముఖంలోకి చూసి మెత్తగా నవ్వారు''(పుట. 59) అని కుంతి తన పాతజ్ఞాపకాల్ని గుర్తుకు తెచ్చుకుంటుంది. అక్కడనుంచి మళ్లీ అనుభవించాలని ఆశ. చివరకు ఒకరోజు డోకొచ్చింది. నీకు పిల్లలు కావడం నిశ్చయం అది నిదానంగా నీకే తెలుస్తుంది. తనపేరు దుర్వాసుడని కుంతి చెవిలో చెప్పాడు. 'కుంతిభోజా! నీ కొక మనుమడు పుడతాడు. కానీనుడు'[21] అని చెప్పి దుర్వాసుడు వెళ్ళిపోతాడు.

కుంతికి ఇంకా కుతూహలం. ఒక చెలికత్తె ద్వారా వివరంగా తెలుసుకుంది. పొట్టలో వింత కలయిక, ఆశ్చర్యం, సంతోషం. అంతఃపురం దాటి వెళ్లకుండా పృథ తల్లి ఉంచింది. పుట్టిన బిడ్డను చూసి కుంతి కుతూహలం చల్లరింది. అయితే ఆ పిల్లాణ్ణి రాణికి విశ్వాసపాత్రురాలైన చెలికత్తె 'రాధ'కు ఇచ్చేసింది. రాధ తన ఒళ్ళో ఎవరో కని పడేసారని, మగడి ఇంట్లో నమ్మేలా చెప్పి కుంతి కడుపు ఖాళీ చేయించింది. ఇలా యుక్తవయస్కురాలైన కుంతి కేవలం ఉత్సాహంవల్ల బిడ్డను పొందింది. దాని పరిణామాల్ని ఆలోచించేస్థితిలేని వయస్సు, ఆమె పొందాలనుకోవడంలో ఉండే ఆనందం ఆమె అమాయకత్వాన్ని, వెంటనే తెలుసుకోవాలనే కోరికని తెలియజేస్తాయి. తర్వాత కాలంలో ఆమె మరింత పరిణత పొందుతుంది అనే విషయాన్ని సూచించడానికి ముందున్న అంశంగా దీన్ని చెప్పొచ్చు.

పాండురాజుని స్వయంవరంలో పృథవరించింది. హస్తినకు వెళ్ళింది. పిల్లలు కలగలేదు. పాండురాజు దిగ్విజయాత్రలకు వెళ్లివచ్చాడు. కుంతీ విన్నావా ఆరుమాసాలు దిగ్విజయం చేసి వచ్చానని పాండువు కుంతితో అన్నాడు. దానికి బదులుగా "ఆరుసార్లు నాకు ఋతుస్రావమైంది" అని కుంతికి తన ప్రమేయం లేకుండానే మాటలు బయటకు వచ్చేసాయి. కుడిచేయెత్తి ఫెడెల్మని పృథ చెంపమీద బలంగా పాండురాజు కొట్టాడు. అయినా కుంతి ఏమీ మట్లాడలేదు. ఏడ్వలేదు. ఎదురు చెప్పలేదు. అతడి కోపపు చూపుల్ని ఎదుర్కొంది. పాండురాజుకి చెమట పట్టింది. మహారాజా ఉక్కగా ఉందా అంటూ తన చీరకొంగుతో అతడి మెడ, ఎద, వీపుల్ని తుడిచి నిమిరింది. పాండురాజు వెక్కివెక్కిఏడుస్తూ, పిల్లాడిలాబలంగా హత్తుకున్నాడు. అరణ్యాలకు వెళ్లడానికి అనుమతిని ఇమ్మన్నాడు. భర్తలేకుండా ఉండటం కుంతికి అసాధ్యమని అనిపించింది. తపస్సుకు వెళ్తున్న భర్తను అనుసరించాలని అనుకుంది. పాండురాజుపట్ల పృథకుండే ప్రత్యేకమైన అభిప్రాయం ఇది. భర్త పట్ల అనుకువగా, మరింత ఓపికగా, ఓర్పుగా ప్రవర్తించడం భర్తపట్ల కుంతికుండే గౌరవానికి సంకేతాలు.

ఔషధాలు పాండురాజుకి శక్తినివ్వలేదు. ఎన్ని రోజులకీ పిల్లలు పుట్టలేదు. మరేదారీలేదా అని పాండురాజు కుంతిని అడిగినప్పుడు పెళ్లికిముందు పుట్టిన కానీనుడి సంగతి చెప్పింది. పెళ్ళిలోనే కానీనుణ్ణి తీసుకోవాలని, ఇప్పుడు తీసుకుంటే హస్తిన ప్రజలు ఒప్పుకోరని సూచిస్తాడు. (పుట.66) ఎందుకు ఒప్పుకోరని నిలదీయలేదు. పైగా సత్యవతికీ

[21] వివాహంకాకముందు పుట్టిన కొడుకు.

కానీన పుత్రుడున్నాడు[22] నియోగంవల్లే ధృతరాష్ట్ర, పాండురాజాదులు పుట్టారని, తెలిసినా ఏమీ చేయలేని నిస్సహాయస్థితి ఈమెదే.

శాస్త్రవిషయాలు తెలుసుకోడానికి దేవలోక బ్రాహ్మణముఖ్యుడైన నియంత్రుణ్ణి కబురు పెట్టి పాండురాజు రప్పించాడు. అతణ్ణి చూడగానే పృథకు దుర్వాసుడు జ్ఞాపకం వచ్చాడు. అతనిలాగే గడ్డం, అలాంటిదే ముఖం, అయితే ఒళ్ళంతా బరువైన కంబళితో చేసిన నిలువలుంగీ వేసుకున్నాడు. నడిమి వయస్సు నేరుగా ఆకాశానికంతా వినిపించేంత కంఠధ్వని పాండురాజు వండించిన వంటల్ని మెచ్చుకున్నాడు. కుంతిలోపల కోర్కె, ఆత్రుతలు, దుర్వాసుని విషయంలో జ్ఞానమేమీలేని ఒట్టి కుతూహలం ఉండేది. ఇప్పుడు ఆ జ్ఞానం అర్థమయ్యింది. ఆశ ఉంది. గురి తెలుసు. ఇన్ని దినాలు వేదనతో నలిగిన జ్ఞాపకముంది. అయితే ఇప్పుడు పాండురాజు ప్రార్థనతో వచ్చిన యమునిలో ఆ ఆత్రుత ఏదీ కనిపించడం లేదు. అతడు నిత్య తృప్తుడు. కొత్త ఆడదన్న విశేషం కూడా అతనికి లేనట్లుంది. అతని గుణంతో ఎంతమంది స్త్రీలను ఇప్పటివరకు రమించాడో అని కుంతి అనుకుంటూ దుర్వాసులకు యమునికి ఉండే వైవిధ్యంతో చూడడం పృథకు ఉండే పరిపక్వస్థితిని తెలుపుతోంది. మరో సంతానం కనబోతుందనే సూచనకూడా ఉంది.

కుంతి భర్త ఆజ్ఞ మేరకు నియోగానికి అంగీకరించింది. పాండురాజు కుంతిచేత ప్రమాణం చేయించుకున్నాడు. "ఈ పురుషునిమీద నేను మోహం పొందను. అతను సమీపస్థు డౌతున్నపుడు నా మనస్సంతా పతిలో లీనమవుతుంది. సంతానాపేక్షతప్ప, నాలో వేరే కోర్కె ఉండబోదు. గర్భం నిలవడం నిశ్చయమైన తక్షణం నేను ఇతణ్ణి పితృసమానంగా భావించి దూరం అవుతాను" (పుట 68). ఈ ప్రమాణం చేసాక తన అత్తలు అంబాలికా, అంబికలుకూడా నియోగిని పితృ సమానంగా భావించారా?, ఆ భావన కలిగితే నియోగక్రియ అసాధ్యంకాదా? అని తలచింది. ఆ రోజునుంచి దేవధర్మాధికారి(యముడు) పాండురాజు స్థానంలో ఉన్నాడు. అతనికి సేవచేసింది. వేడివేడిగా కాచిన నీళ్ళుపోసి ఒళ్ళురుద్ది, బట్టలు తొడిగించేది. మృష్టాన్నం వండి స్వయంగా చేతులతో తినిపించేది. ఎక్కువ నెయ్యివేసి కలిపేది. చిన్నప్పటినుంచీ సేవలు చేయించుకొనే కుంతి అప్పటివరకూ ఒక్క దుర్వాసుడికి తప్ప ఎవరికీ సేవచేయలేదు. తనకు తానుగా సేవచేసింది దేవధర్మాధికారికే. పాండురాజుకు సేవచేయాలనే కోర్కె ఉండేది. అయితే అతనెప్పుడూ అందుకు అర్హుడు కాలేదు. ఇది కుంతి వైవిధ్యమనస్తత్వానికి, భర్తపట్ల ఉండే జాలికి నిదర్శనం.

దేవధర్మాధికారివల్ల గర్భందాల్చింది కుంతి. డోకు రావడంవల్ల స్థిరపడిందని ధర్మాధికారి అన్నాడు. "అలాగైందని నోరు విప్పి చెప్పొద్దు. సూచన చేస్తేచాలు. నిన్ను

[22] మూలంలో దూర్వాసుడు కుంతి సేవలకుమెచ్చి, ఎవరిని కోరుకుంటేవారువచ్చి, తద్వారా సంతానం పొందుతావు అని వరాన్ని ఇచ్చాడు. ఆ తర్వాత సూర్యుడివల్ల కర్ణుణ్ణి కనినట్లు ఉంది. దూర్వాసుడికి కుంతికి కానీనుడు పుట్టినట్లు ఈ రచయిత మార్చారు

వెనక్కి వెళ్ళి పొమ్మంటాడు మా మహారాజు" (పుట. 70)అని కుంతి ధర్మాధికారి చెవిలో చెప్పింది. ఆమె భర్తగా భావించిన ధర్మాధికారిపట్ల ఉండే ఆకర్షణ, అంతవరకూ తనుకోల్పోయినలోటు కుంతిలో కనబడతాయి. ధర్మాధికారిని పొందాలనే కోరిక కూడా ఆమెలో ఉంటుంది. ఇది చాలా రోజుల తర్వాత పొందుతున్న శృంగారస్థితిని సహజంగా వ్యక్తం చేస్తోంది.

కుంతి పాండురాజు ఒక పక్క, ధర్ముణ్ణి; ఇంకోపక్క మహారాజుని హత్తుకుంటూ కాళ్ళూ, చేతులూ, నడుమూ, శరీరమంతా ఒత్తి పిసికి పిసికి సేవలు చేసింది. ఇకపై సేవలు చేస్తానని అంటుంది. పాండురాజు పట్ల కనికరం, ప్రేమ రెండూకలిగిన స్థితిలో సేవచేయాలని కుంతి అనుకుంటుంది. అంతవరకు భర్తగా అతని సేవలు చేయకుండా ఉన్న స్థితినుంచి సేవ చేయాలి అని అనుకునే స్థితికి చేరడం కుంతిలోని మానసిక పరిపక్వతని సూచిస్తోంది.

దేవలోకంనుంచి దేవజనుల సేనాధిపతి వచ్చాడు. అతడితో కలిసాక, కుంతికి వింత ఆలోచనలు వచ్చాయి. సేనాపతి ఇతర స్త్రీ సంగమాన్నే వర్జిస్తాను. తనతో వచ్చేయమని పృథని అర్థిస్తాడు, పృథ తనను ధన్యురాలుగా భావించుకుంటుంది. ఇతడి పొందుతో, పురుషశక్తి దారిద్ర్యంలేని ఇతడిలాంటి పదిమందిబిడ్డల్ని కడుపు నిండాకని, తృప్తిగా బ్రతకాలనుకుంటుంది. "పాండురాజా! నేను వెళ్తాను. నీ కోసమని కన్న బిడ్డను నీకే దానం చేస్తాను. కావాలంటే మాద్రికి ఎవరితోనైన నియోగం చేయించు" అనేదే కుంతి పరిష్కారంగా తలుస్తుంది. ఇందంతా కుంతిలోని భావాల పరంపర. కానీ, కుంతి సేనాపతితో వెళ్ళదు. కుంతిని రమ్మని చెప్పడం పాండురాజుకు వినబడ్డాయి. కుంతి సమాధానంచెప్పకముందే పాండురాజు, 'నువ్వు చేసిన ప్రమాణం గుర్తుంచుకో. కురువంశానికి ఒకవీరుణ్ణి కనడానికి మాత్రం నువ్వు నా ఆజ్ఞమేరకు...' అనడం కుంతికి బాగాగుర్తుంది. (పుట.78) ఇక్కడకుంతి ఎక్కడమాట ఇచ్చేస్తుందో అని పాండురాజుకి దిగులు కనబడుతుంది. కుంతిమాత్రం వెళ్లకపోడం పాండురాజు మీద గౌరవానికి నిదర్శనం.

దేవలోకంనుంచి ఇంద్రుడు నేరుగా కుంతి దగ్గరికే వచ్చి ధర్మాధికారి, సేనాపతిని నియోగ పద్ధతిలో ఆహ్వానించినట్లే నన్నూ స్వీకరించు అని అభ్యరిస్తాడు. వెంటనే కుంతి అంగీకరించదు. "విధవ అయితే వేరేమాట. భర్తఉండగా, నియోగాన్ని నిర్ణయించవలసిది అతనే. అంతేగాక మాకు ఇప్పటికే ఇద్దరు మగపిల్లలున్నారు. ఇంకా నియోగమంటే లంపటతనం అవుతుంది" అని చెప్పకలిగింది. (పుట. 82) కానీ అతడి ముఖంలోకి చూసి, మాట్లాడేటంత ధైర్యం కుంతిలో కలిగింది. తనవాడు ఇతడు అనే భావన కలగడం ఇందులోని అంశం. ఓడిపోయి కరిగే చూపుల్తో అతణ్ణి చూసింది. ఆ చూపుల్ని పసిగట్టే శక్తివంతుడు ఇంద్రుడు అని సూచించడానికి ఇంద్రుడివి నీలి కళ్ళు అని రచయిత తెలియజేస్తారు. ఈ కళ్లే అర్జునుడికి వచ్చాయని, జరగబోయే అంశాల్ని సూచించడం కనబడుతుంది.

ధర్మానికి కొత్త వ్యాఖ్య దుర్యోధనుడు చేసాడు. అదేమిటంటే "పాండవులు, 'పాండవులు కాదు' కుంతీ పుత్రులట". దాంతో కుంతికి మానసికంగా బాధపడింది. ఈ

కురువంశానికి వీరపుత్రుణ్ణి ఇవ్వడానికి తఅభర్త ఆజ్ఞమేరకు, తనను తాను త్యాగం చేసుకొన్నందుకు ఇలా అంటాడా అని కోపంతో బిగుసుకుంది. తనకు తాను ఏమీ చేయలేని అసహాయ స్థితి ఈ సందర్భంలో సూచించాడు.

ఒకరోజు మాద్రి పరిగెత్తుకుంటూ కుంతిదగ్గరికి వచ్చింది. 'మహారాజు' అంటూ వెక్కి వెక్కి తన గుండెల్లో ముఖందాచుకుంది. ఆమె చేయిపట్టుకొని కుంతి పరుగెత్తి వెళ్ళింది. చాలా దూరం వెళ్లిన తరువాత ఎండకు కాలుతున్న ఓ బండచాటులో, పాండురాజు చనిపోయి ఉన్నాడు. ముఖంలో నలిపేసంతటి బాధ ఇంకా వికారంగా గూడు కట్టుకొని ఉంది. ఎగ ఊర్పు, గస, ఆయాసం, ఊపిరాడకపోడలేదు అంది మాద్రి. ఇంతదూరం ఎందుకు తెచ్చావనేసరికి పర్వతాలకూ వినబడేలా గట్టిగా ఏడ్చింది. మహారాజు ఒళ్లంతా తడిమింది. పాండురాజుకి లోపల బట్టలేదు. వెంటనే మాద్రి వైపు చూసి "భర్తను చంపావుకదే, పాపి నువ్వు. ఇంతదాకా నడిపించుకొని వచ్చావా దీనికోసం?"(పుట. 89) అని మాద్రిని తిట్టి చెంపమీద కొట్టేసింది. ఆ దెబ్బకు మాద్రి స్పృహతప్పి, అక్కడే పడిపోయింది. ఈ సందర్భంలో పాడురాజు స్థితికి మాద్రి కారణం అనుభావించి కోపం రావడం సహజమే. అయితే కేవలం లైంగిక కార్యక్రమానికి ఇంత దూరం తీసుకువచ్చావా అని అడగడం ఈమె పరిణతిని సూచిస్తుంది. మాద్రి దెబ్బతగిలి పడిపోవడం తర్వాత దశలో పాండురాజుతో సహగమనాన్ని ధ్వనిస్తోంది.

పాండవుల్ని తీసుకొని కుంతి హస్తినకు వచ్చింది. చాలా బాధను అనుభవించింది. లాక్షాగృహంనుంచి బయటపడి, పాంచాలరాజ్యానికి వెళ్లి ద్రౌపదిని కోడలిగా పొందింది. మళ్ళీ హస్తినకు వచ్చింది. ఆ రెండింటికి మధ్య ఉన్న తేడా గమనించదగింది. ఒకరోజు కృష్ణుడు కుంతి దగ్గరికి వచ్చి, 'అత్తా, నిజం చెప్పు!, కర్ణుడు నీకొడుకేనని నాకు తెలిసింది. నీ పెళ్ళికి ముందు పుట్టిన కొడుకు అతనేనట' అని అడిగాడు. అప్పుడు నిజం చెప్పకుండా ఉండి ఉంటే బాగుండేది. రాధ తన దగ్గరికి వచ్చి తననుంచి కొడుకును దూరం చేయవద్దని మాట తీసుకొంది. రాధ చనిపోయేవరకూ కుంతి ఆ విషయాన్ని ఎవరికీ చెప్పలేదు. కానీ కృష్ణుడికి విషయం చెప్పింది. అతడి బలవంతానే కర్ణుడి దగ్గరికి వెళ్ళింది. ఇక్కడ ఆమె మానసిక సంఘర్షణ, రాధకు మాట ఇచ్చింది కాబట్టి, నిలుపుకోవాలనే సత్యసంధతలు వ్యక్తమౌతున్నాయి.

కర్ణుడు సూతఘట్టంలో స్నానంచేస్తున్నాడు. అప్పుడు తనను తాను పరిచయం చేసుకుంది. ఎన్నేళ్లు గడిచినా నువ్వు నా కొడుకువే. పాండవులు నీకు తమ్ములే అని కుంతి అంది. దానికిప్రతిగా 'ఆర్యాణీ! దీనికి ద్రౌపది ఒప్పుకుంటుందా? స్వ సంతోషంతో, నీ బలవంతంతో కాదు' అని అంటాడు. కుంతి, కర్ణా! నా ఐదుగురు పిల్లల్లో ఎవరూ, పరస్త్రీ విషయంలో ఇలా నడుచుకోని విధంగా, మాటకూడా జారకుండా జాగ్రత్తగా పెంచాను. నా పాలనలో నువ్వుకూడా పెరిగి ఉంటే తగిన పద్ధతి నేర్పించేదాన్ని. దుర్యోధనాదులతో జతకూడి నీకు హీనసంస్కారం వచ్చింది.' (పుట.386) అని కర్ణుణ్ణి తప్పు పట్టింది. ఇక్కడ తల్లిగా బాధ్యతలు తీసుకోడానికి ముందుకొస్తూనే, పెద్దరికాన్ని ప్రదర్శించడం కనిపిస్తుంది. తను ఏమీ చేయలేని స్థితిని కూడా సూచించడం ఉంది.

'నీ కోడలి మీద కన్ను వేసానని తిట్టావు. నేను అరవై ఏళ్ల ముసలివాణ్ణి. పిల్లలు, మనుమలు, మనుమరాండ్రు కూడా ఉన్నారు. నువ్వు చెప్పావని నీ బిడ్డలు నన్ను అన్నగా ఒప్పుకోవచ్చు. కానీ, పెద్దవాడిగా నేను సింహాసనం మీద కూర్చోవడం, యాజమాన్యాన్ని నెరపడం ఒప్పుకుంటుందా?' (పుట. 386) భీముడుతప్ప అందరూ సనాతనధర్మ సంబంధాలకు విలువనిస్తారు. కర్ణుడి సంబంధం ఇది అని తెలిస్తే, పాండవులు యుద్ధమే వద్దంటారు. అందువల్ల నువ్వు వాళ్ళతో చెప్పవు కదా అని కర్ణుడు కుంతితో అంటాడు. కర్ణుడి మాటలకు కుంతి తలవంచుకొని బదులు చెప్పే శక్తి, లేచి వెళ్ళే శక్తిలేక చైతన్యంలేకుండా అలాగే ఉండిపోయింది. ఎద, గొంతుమీద బాగా చెమట పట్టింది.

రాధ తల్లి పోయాక గాంధారితల్లి ఆదరించిందని చివరకు తగ్గుస్వరంగా 'నిన్ను అమ్మా అనకూడదని మనస్సు గట్టి చేసుకున్నానని ఒక గొప్పసుఖాన్ని అనుభవించానని చెప్పాడు. జన్మ నిచ్చింది తక్కువా అని కుంతి కాళ్ళు పట్టుకున్నాడు. లేస్తున్నప్పుడు కుంతి ఎదకు కర్ణుడి తలకి తగిలింది. ఇక్కడ తల్లిమీద బిడ్డకు ఉండే మమకారంతో పాటు, తల్లికి పిల్లలమీద ఉండే మమకారాన్ని కర్ణుడు, కుంతి పాత్రలద్వారా రచయిత సూచించాడు. ఇక్కడ కర్ణుడి వయస్సు అరవై అయిదు సంవత్సరాలు అని చెప్పాడు. ఇది ఆలోచించదగిన అంశం. అప్పటికి కుంతి వయస్సు ద్రౌపది వయస్సు ఎంత ఉంటాయో గమనించాలి. ఇక్కడ వీళ్ళ మాటల్లో పెద్దతరహా ఉన్నప్పటికీ, కామవాంఛల ప్రస్థావన వచ్చింది. కామం స్థితికి వయస్సుతో సంబంధం లేదని తెలియజేసినప్పటికీ కర్ణుడు అలాంటివాడు కాదు అని సూచిస్తున్నాడు.

దిక్కుతోచక కుంతి ఎవరో మనుషులు వచ్చేస్తున్నారని వెళ్లిపోతూ కర్ణుడివంక చూసింది. అతడి కళ్లు కన్నీటితో నిండి, ఆ నీళ్ళు చంపలవరకు పోయి ఉన్నాయి. కుంతి చెట్లమాటుకు వెళ్లి అక్కడే కూలబడి పోయింది. తనకు ఏమీ తెలియని వయస్సులో కన్న కొడుకును చూసి మనస్సు చలించిపోయింది. సమాధానం చెప్పలేక దైనీయస్థితిలో కుంతి మనస్సు ఉండి నిశ్చేష్టతకు గురైంది.(పుట. 389) చాలాసేపు ఏడ్చింది. నది దగ్గరికి వెళ్ళి చేతులూ, ముఖాన్ని కడుగుకొని దోసెడెత్తి సూర్యుడి వైపు చూస్తూ, తిరిగి కళ్ళు మూసి "రాధా!, నువ్వు చనిపోయినప్పుడు నేను ఈ ఊళ్లోనే ఉన్నాను. ఏం చేయాలో అప్పుడు తెలియలేదు. ఇదిగో నీకు ఈ అర్ఘ్యం" అంటూ కిందికి నీళ్లు విడిచింది. తెలియకుండానే కుంతి పిల్లాణ్ణి, అదీ పేరు పెట్టని పెద్దకొడుకుని కన్నది. అప్పుడేం చేయలేదు. ఇప్పుడు తన కొడుకుగా తీసుకుదామంటే కుదరదు. ఇలా రాధ విషయంలో కూడా బాధ పడడం ఆమె మాతృత్వాన్ని, సత్యసంధానాన్ని చెప్పేందుకు నిదర్శనాలు.

చివరకు కుంతి గాంధారితో కలసి యుద్ధభూమికి వెళ్తుంది. కుంతి గాంధారి చేతుల్ని పట్టుకొంది. ఆమె కళ్ళు కన్నీటినితో నిండిపోయాయి. కుంతి తెచ్చిన మెత్తటి అన్నాన్ని గాంధారికి పెట్టింది. తిరిగి యుద్ధభూమినుంచి వచ్చేస్తారు. ద్రౌపదినుద్దేశించి 'అమ్మాయ్, నువ్వింకా ముట్టు అవుతున్నావా ఇక నువ్వే గర్భందాల్చి ఈ వంశం అంతరించకుండా చూడాల' ని సూచిస్తుంది. ఈ వంశం అంతరిస్తే ఏమౌతుంది అన్న ద్రౌపది మాటలకు

కుంతికి కోపం వస్తుంది. కళ్ళు ఎర్రబారి పోతాయి. నువ్వు ఈ ఇంటి కోడలుగా వచ్చినదానివేగా అని ద్రౌపది కుంతిని ప్రశ్నించడంతో అక్కడికి వాళ్ల సంభాషణ ముగుస్తుంది. ఎంతో కష్టం మీద ఏ వంశాన్ని నిలబెట్టడానికైతే భీష్ముడు పూనుకున్నాడో ఆ వశమే ఇలా చేజారిపోయిందని సూచిస్తూ రచయిత ముగింపును పాఠకులకే వదిలేస్తాడు.

### 4. 2. 5. ద్రౌపది :-

ద్రుపదరాజ కుమార్తె ఈమె. పాండవుల్నివివాహం చేసుకుంది. ఆలోచనలు వచ్చినప్పుడు మాట్లాడడానికి తోడుగా ఈమెకు భీముడు ఉంటాడు. ఈ పాత్ర గతంలోని స్మృతుల్ని తలచుకుంటూ ఉంటుంది. భీముడే తనకు ఎలాంటి కష్టంవచ్చినా ఈమె చెప్పుకుంటుంది. భీముడు ఒకసారి ద్రౌపది దగ్గరికి వచ్చి ఏడిస్తే, "భీమా! మగవాళ్ల కళ్ళ నీళ్లు రాకూడదు. ఒకవేళ ఒకచుక్క వచ్చినా అది గంగానదికి సమానం. ఇన్నాళ్ళ నీ కళ్ళలో ఎంత నీరు తొణికింతో నాకు తెల్సు"(పుట.102) అని భీముడి కన్నీరు తుడిస్తే, ద్రౌపది మనస్సు తేలిక పడ్డట్లు భావిస్తుంది.

ద్రౌపదికి పెళ్లయిన కొత్తలో చాలా రోజులు భీముడు సాలకటంకటితో పోలికలు చెబుతుండేవాడు. పోలిక అంటే బలమైన మయికట్టు. ఈ మల్లునికి ఆడదానిలో కావల్సింది బలం, ఒంటి బిగువులే అయినా తనపై ఏదో అర్థంకాని ఆకర్షణ అట. ఆడవాళ్లతో ఏది మాట్లాడకూడదో తెలియని మొద్దుతనంగలవాడిగా భీముణ్ణి భావిస్తుంది. (పుట.162)

అర్జునుడంటే ద్రౌపదికి చెప్పలేనంత ఇష్టం. అతడి మొనదేలిన ముక్కూ, గడ్డం, లేతనీలంకళ్ళు, స్వచ్ఛమైన తెల్లటిరంగు గలవాడు. దృఢంగా నడుస్తున్నా చప్పుడు వినిపించిన నడక మొదలైనవి ద్రౌపదిని సమ్మోహింపజేసేవి. పైగా ద్రౌపదికి మూడోరాత్రి శయన మందిరానికి వచ్చి, నీదాసుడు కావడానికి అర్జునుడు వచ్చాడు. కటాక్షించవా ద్రుపదరాజ కుమారీ అనేసరికి తనకుతానుగా ద్రౌపది పూర్తిగా దాసోహమైపోయింది.(పుట. 163). ఆడవాళ్లని మురిపించడం నీకు ఓ విద్య అయింది. ఆర్యావర్తనంలో ప్రసిద్ధికెక్కిన విలువిద్యా చతుర అని అర్జునుడికోసమే ఎదురు చూస్తూ గడిపేది. ఈ మాటలు అర్జునుడంటే ద్రౌపదికి (అంతరంగంలో) ఎంత ఇష్టమో తెలుస్తోంది.

ద్రౌపది స్వయంవరం పూర్తయ్యాక, కుమ్మరి ఇంటికి ఆమెను తీసుకువస్తారు. భీమార్జునులు తగువుపడతారు. అందర్నీ బయటకు వెళ్లమని కుంతి చెప్పి ద్రౌపదిదగ్గరికి వచ్చి "బిడ్డా నువ్వు కేవలం సుందరివికావు. రంగుకొద్దిగా తక్కువైనా నీ ముఖమూ, కాళ్ళూ, నోరూ, ముక్కూ, ఒంటి వంపు సొంపుల ఆకర్షణ అద్భుతం, అసాధ్యం, అనన్యం. లేకుంటే నా బిడ్డలు ఇలా ఒకరితో ఒకరు తగవు పడతారా? నిన్ను వెనక్కి నీ తండ్రికి అప్పగిస్తాను. కొడుకులమధ్య కలహాన్ని కోడలి రూపంలో ఎందుకు తెచ్చుకోవాలి నేను" (పుట. 169) అన్నప్పుడు ద్రౌపదికి కోపం వస్తుంది. తరువాత పాండవుల కథంతా చెప్పి, "నాకందరూ మగపిల్లలే నీ వంటి ఆడబిడ్డ కలగలేదు. ఇప్పుడు నువ్వే నా ఆడబిడ్డవయిపో"(పుట.171) అంటూ పెద్దభుజాలతో జరిపోయిన విశాలమైన నిండుగా ఉన్న వెచ్చని ఎద ఒంటరితనాన్ని పోగొట్టి భద్రతా భావాన్ని పుట్టించేలా కౌగిలించుకొంది. ద్రౌపది

తన తల్లి గుర్తుకువచ్చి, ఆమె ఉంటే ఇలానే కౌగలించుకొనేదే కదా అని అనుకుంటుంది. ఈ భావనలో ద్రౌపది మానసిక ఆనందాన్ని పొందింది అనే సూచన ఉంది. అక్కడ నుంచి కుంతి ఎలా చేయమని చెబితే అలా చేస్తుంది అనే భవిష్య విషయాన్ని రచయిత పాఠకులకు అందించాడు.

దాంపత్యసుఖం పొందడం, ఇవ్వడంలో ఆడవాళ్లకు అయిదుమంది మగవాళ్ల శక్తి ఉంటుందని కుంతి ద్రౌపదితో చెప్పింది. అందుకే తనకొడుకులందర్నీ ద్రౌపదిని పెళ్ళి చేసుకోమని సూచించింది. హిమాలయప్రాంతంలో సోదరులందరూ కలిసేపెళ్ళిళ్ళు చేసు కొంటారని ద్రౌపదికి చెప్పి, కుంతి ఆమెను ఒప్పించింది. దాంపత్యంలో ఐదుగురిని భరించే శక్తి ఆడదానికి లేదని, తరువాత అనుభవ పూర్వకంగా తెలుసుకొని ద్రౌపది, తన అత్త తనకు అబద్ధం చెప్పిందని భావిస్తుంది. జ్ఞానంలేని పద్దెనిమిదెళ్ళవయస్సులో ఉత్సాహం రేకెత్తించింది. తన పిల్లల ఐకమత్యం, అభ్యుదయం ఒక్కటే ఆమెకు కావల్సింది. చివరికి ద్రౌపది పాండవులందరిని రోజూ శృంగారంలో సోలిన పశువులాగయి, పిండి రసం తీసిన చెరకుగడ లాగై పోయింది. ఇంకా, భరించలేక  కుంతినే ద్రౌపది అడిగింది. కుంతి ద్రౌపదివిషయంలో షరుతు పెడుతుంది. తమవంతు లేనప్పుడు ఎవరూ భార్యను సమీపించకూడదు. ద్రౌపది ఎవర్నీ చేర్చుకోకూడదు. నిష్ఠుర నిష్పక్షపాతంగా ఉండాలి అని కూడా ద్రౌపది అనుకుంటుంది. పాండవులందరి పట్ల సమానతను ఆచరించి నడుచుకోవడమే వ్రతంగా ద్రౌపదికి కుంతి చెబుతుంది. ఈ మాటల్లో ఎలా ప్రవర్తించాలో నిర్ణయించుకొనే అధికారం లేని ద్రౌపది  వ్యక్తిత్వం కనబడుతుంది.

ఆర్యధర్మంపట్ల సదభిప్రాయం ద్రౌపదికి ఉండదు. వేట, తాగడం, ఆడవాళ్ల సహవాసమే ముఖ్యమని అనుకుంటుంది. కృష్ణుడొక్కడికే ధర్మాలు తెలుసునని అభిప్రాయపడుతుంది. కౌరవ సభలో తనకు జరిగిన అన్యాయానికి నిప్పులు చెరుగుతుంది. కౌరవుల్ని భయపెడుతుంది. పాంచాలురు, కృష్ణుడు కురు రాజ్యాన్ని  నేలమట్టం చేస్తారని అంటుంది.

అర్జునుడు సుభద్రని తెచ్చినప్పుడు ద్రౌపది ఎద శూన్యమైపోయింది. ఇచ్చేవాళ్లు లేని, పుచ్చుకొనే వాళ్ళులేని పాడుబడ్డ గుహలాగయ్యింది. ఆత్మ పతిచేత వదలబడిన దానిలాగ  దుఃఖంలో మునిగిపోయింది. ఆ తరువాత భీముడిమీద నిజమైన ప్రేమను పెంచుకొంది. సౌగంధిక పుష్పాలు తెచ్చాక, భీముడంటే అభిమానం పెరిగి, ఆ పూలను సింగారించుకున్నాక గర్వంగా తలిచింది. పాంచాలి ప్రేమ సమంగా లేదని మిగిలిన నలుగురికి అర్థం అయింది. అంతవరకు అర్జుడంటే ఇష్టపడే ద్రౌపది తన పట్ల ప్రేమను చూపిస్తున్న భీముడిమీద ప్రేమను చూపించాలనుకుంది. రాజ్యం ఇవ్వనీ ఇవ్వకపోనీ కౌరవుల్ని చంపితీరాలనే తన కోరిక భీముడొక్కడిలో ప్రతిజ్ఞారూపంలో భీముడు అన్నాడు. అందువల్ల భీముడిమీద ద్రౌపదికి  సహజమైన ప్రేమ పుట్టింది.(పుట. 205) దానిలో ఆనందాన్ని ద్రౌపది తెలుసుకొంది. ఈ మాటల్లో మనం ప్రేమించేవారికన్నా, మనల్ని ప్రేమించేవారి పట్ల ప్రేమను పెంచుకోమని రచయిత సూచిస్తున్నాడు.

భీముడు తన కోసం చాలా కష్టపడ్డాడు. భుజం మీద ఎక్కించుకొని అడవిలో తిరిగాడు. చివరికి ద్రౌపదిని అవమానించిన కీచకాదుల్ని హతమార్చాడు. ప్రతీకారపు చివరి పద్దు తీర్చడానికే, రాక్షసుల సహకారం అర్థించడానికి భీముడు వెళ్లాడని ద్రౌపది అనుకుంటుంది. ఒకవేళ సాలకటంకటి కూడా వస్తే, అన్న ఆలోచన వచ్చేసరికి అలాంటివాడు కాదు భీముడని తనకు తానే సమాధానం చెప్పుకొంటుంది. ఇక్కడ ద్రౌపదికి సవతిమీద ఉన్న సహజమైన అసూయ కనిపిస్తుంది. భీముడు అలాంటివాడు కాదనుకోడం ఆమెకు భీముడిమీద ఉండే ప్రేమను, నమ్మకాన్ని మరింతస్పష్టం చేస్తోంది.

కురుక్షేత్ర యుద్ధం పూర్తయింది. ఉపపాండవాదులంతా మరణించారు. చివరకు కుంతి, ఈవంశం అంతరించిపోకుండా ద్రౌపదిని గర్భం ధరించమని అడుగుతుంది. దానికి సమాధానంగా ద్రౌపది ఈ వంశం అంతరిస్తే మాత్రం ఏమిటట? అని ఎదురు ప్రశ్నిస్తుంది. నువ్వు ఈ ఇంటి కోడలవు. ఇలా అనొచ్చా? అని కుంతి కళ్లు ఎర్రజేస్తుంది. తన మండుతున్న చూపుల్ని అత్త ఎర్రటి కళ్లలోకి జొనిపి "అమ్మా! ఈ ఇంటి కోడలుగా వచ్చిన నువ్వు ఇలాగనవచ్చా?అని ద్రౌపది ఎదురడుగుతుంది. ఇక్కడ ద్రౌపది మానసిక సంఘర్షణ, కోప స్వభావం, నిర్లిప్తతలు వ్యక్తమౌతాయి. పెద్దదైన కుంతి కోడలి ఇష్టాలు తెలుసుకోకుండా తనవంశం ఎలాగైనా నిలపెట్టాలనుంటుంది. కోడలిస్థితిని గమనించకపోడం కనిపిస్తుంది. ఇలా ఇద్దరూ స్త్రీలే అయినప్పటికీ వారి భిన్న మనస్తత్వాల్ని ఈ పాత్రల ద్వారా రచయిత పాఠకుడికి తెలియజేసాడు. అత్తా ఒకనాటి కోడలే. కోడలైనా రేపటి అత్తే అన్న లోకోక్తిని ఈ పాత్రలద్వారా రచయిత సూచించాడు. మిగతా పాత్రలలో కూడా కొంతవరకు మనస్తత్వచిత్రణ కనిపిస్తుంది. అయితే వాటిలో అంతగా వైవిధ్యంగా లేదు. ఆ చిత్రణ సమన్వయరూపంలోనే ఉంటుంది. ప్రత్యేకంగా పేర్కొనదగినవి కాదు. కాబట్టి వాటిని విశ్లేషించడంలేదు.

## 4. 3. *ఇదా భారతం* పాత్రల పరిచయం

*ఇదా భారతం* నవలలో మాలిని, భీముడు, కీచకుడు, కంకుభట్టు, ఉత్తర, సుధేష్ణ, దేవలకుడు, బృహన్నల, భేతాళుడు, విరాటరాజు, ఉత్తరుడు మొదలైన పాత్రలున్నాయి. కథలో ప్రధాన పాత్రగా మాలిని, కీచకుడు కనిపిస్తారు. ఎక్కువగా మాలిని గతాన్ని గుర్తుకు తెచ్చుకోడం ఉంది. గతాన్ని చెబుతూ, చాలా అంశాలు పాఠకుడికి రచయిత్రి వివరించారు. నాటి అనాగరిక అంశాలను రచయిత్రి ఎత్తిపొడుస్తూనే, ప్రజల్ని చైతన్య వంతులుగా తీర్చే ప్రయత్నం చేసినట్లు అనిపిస్తోంది.

మాలిని పేరుతో ద్రౌపది విరాట రాజు భార్య సుధేష్ణ ఎప్పుడూ యౌవనవతిలా ఉండాలనే కోరుకుంటూ, అలంకారానికి అత్యధిక ప్రాధాన్యమిచ్చే పాత్రగా కనిపిస్తుంది. మాలిని, 'ద్రౌపది దగ్గర అలంకరించే స్త్రీ'నని వచ్చి సుధేష్ణ దగ్గర చేరుతుంది. తనకు ఐదుగురు గంధర్వులు భర్తలుగా ఉన్నారని, విధివశాత్తు ఇలా అయ్యానని, పరుల ఇంటికి పంపడం, ఎగిలిని పెట్టడం వంటివి తన పట్ల చేయవద్దని సుధేష్ణను కోరుకొంటుంది. ఇంత అందమైన దాసి ఇంట ఉంటే రాజు మనసు పడొచ్చని చెబుతుంది. తన భర్తలు బలమైన వారని అలాంటి ఆపదలు రావని, నన్ను తమ దగ్గర ఉంచినట్లయితే తమకు వారి ఆశీర్వాదం

లభించగలదని చెప్పే పాత్ర మాలిని.

ఎన్నో అవమానాలు పొందడం ఈ పాత్ర విషయంలో కనిపిస్తోంది. అయినప్పటికీ ధీరత్వంతో మాట్లాడగలిగే స్వభావం ఈ పాత్రలో ఉంది. కీచకుడి విషయంలో చక్కని పథక రచన చేయగలిగిన వ్యక్తిత్వం, కీచకుడిని ఎదిరించే ధైర్యం ఉన్నట్లు కనిపించటం ఈ పాత్ర ప్రత్యేకత.

### 4. 3. 1. కీచకుడు :-

విరాటరాజుకి బావమరిది. సుధేష్ణకు వరసకు తమ్ముడు. ధైర్యవంతుడు, బలవంతుడు. విరాటరాజ్యానికి సైన్యాధిపతి. చాలా రాజుల్ని జయించి పాదాక్రాంతం చేసుకొన్న విజేత. విరాటరాజు పాండవపక్షపాతి. కానీ పాండవులు అరణ్యవాసం తర్వాత కీచకుడు కౌరవులకు వత్తాసు పలుకుతాడు. పాండవుల్ని ఎలాగైనా పట్టుకొని మళ్ళీ అరణ్య, అజ్ఞాతవాసాలు చేయిస్తూ ద్రౌపదిని మాత్రం తాను పొందాలని భావించే పాత్ర కీచకుడు. అందుకోసమే భేతాళహోమం రెండుసార్లు చేస్తాడు.

భేతాళ హోమం కోసం రాజపుత్రుల్ని బంధించి జైలులో బంధిస్తాడు. 'దేవలుడు' అనేపేరుతో 'అభిమన్యుడు' కీచకుడు అరాచకాలకు అడ్డకట్టవేస్తుంటాడు. ఉత్తరసాయంతో కీచకుడు బంధించిన రాజపుత్రులు విడుదలై దేవలుడి దగ్గరకు వెళ్ళారు. ఉత్తర ఉత్తరుడి వేషంలో రాజముద్రికను చూపించి రాజపుత్రుల్ని విడుదల చేయించి, వారందర్నీ రథాలమీద మళ్ళిస్తుంది. ఈ తతంగం అంతా కీచకుడు ఊర్లో లేనప్పుడు జరుగుతుంది. విషయం తెలుసుకున్న కీచకుడు ఉత్తర, ఉత్తరకుమారుల్ని బంధిస్తాడు.

ఉత్తరకుమారుణ్ణి భీరువుగా తయారుచేసి, రాజుని బలహీనుడిగా చేసి, రాజ్యాధి కారాన్ని తానే చెలాయించే విధంగా కీచకుడు ప్రవర్తిస్తాడు. మాలినిమీద మనసు పడి ఎలాగైనా ఆమెను పొందాలని ప్రయత్నిస్తాడు. కాని, ఉత్తర అంటే అభిమానం కలవాడుగా కనిపిస్తాడు. చివరకు మాలిని మీద ప్రేమ అతడి మరణానికి కారణమవుతుంది. కీచకుణ్ణి భీముడు సంహరిస్తాడు.

### 4. 3. 2. సుధేష్ణ :-

విరాటరాజు భార్య. పట్టపురాణి ఈమె. అలంకారం చేయించుకొని అందంగా కనిపించాలని భావించే పాత్రగా ఈమె కనబడుతుంది. ద్రౌపది అందాన్ని చూసి సేవకావృత్తికి తగిన అందం, వ్యక్తిత్వం నీది కాదని, ఎవరినో చెప్పమని అడిగింది. మహారాజులు సైతం మోహింపజేసే అందంగా ద్రౌపదిని కీర్తించి, అలంకారాలు చేసే సైరంధ్రిగా ఉద్యోగం ఇచ్చింది.

సుధేష్ణ వరసకు తమ్ముడైన కీచకుడంటే అమితమైన ప్రేమలేదు. కానీ, అతడి వల్లే రాజ్యం కాపాడం జరుగుతోందని విశ్వసించి, అతడి కోర్కెలు తీర్చడానికి ప్రయత్నం చేస్తుంటుంది. ఉత్తరుడు కీచకుడివల్ల పిరికిగా తయారయ్యాడని తెలుసుకున్నా, ఏమీ

చేయలేని నిస్సహాయత ఈమెలో ఉంది. మాలిని అంటే ఈమెకు కొంత భయంకూడా లోలోపల ఉంది. ఈమె మాలిని తన కుమారుడిచేత బాణం వేయించడంచూసి ఆనందంతో పొంగిపోతుంది. సుధేష్ణ మద్యం సేవించడం హోదాగా భావిస్తుంది.

కీచకుడు ఉత్తర, ఉత్తరకుమారుల్ని బంధించినప్పుడు, కీచకుడిమీద కోపం వచ్చి, అతడి ప్రాణాలకు కావాలని అనే స్వభావం ఉన్నపాత్ర. కొంతవరకు బేలతనం ఉన్నా, మల్లుడు పులితో యుద్ధం చేస్తున్నప్పుడు చూడాలనే కోరిక ఈమెకుంది. ఏమైనప్పటికీ కథలో మాలిని కీచకుడితో కలపడానికి తోర్పాటు చేసేపాత్రగా కనిపిస్తుంది.

### 4. 3. 3. ఉత్తరుడు :-

హాస్యాన్ని కలిగించే పాత్ర ఇతడు. విరాటరాజ కుమారుడు. కీచకుడు ఇతడికి మామయ్య. కీచకుండంటే భయంతో వణికిపోయేలా ప్రవర్తిస్తాడు. కీచకుడితణ్ణి చాలా రకాలుగా భయపెడతాడు కూడా. విలువిద్యలాంటివి నేర్చుకోకుండా అమాయకంగా ఉండే వ్యక్తిత్వంఉన్న పాత్రగా కనిపిస్తాడు.

### 4. 3. 4. ఉత్తర :-

విరాటరాజ కుమార్తె. చలాకీగా ఉండే పాత్ర. ప్రధానపాత్రలకు సహకారాలు అందిస్తూ ఉంటుంది. అంతఃపురంలో బృహన్నల దగ్గర నాట్యాభినయం నేర్చుకుంటుంది. రాజ్యంలో జరుగుతున్నఅత్యాచారాలుకూడా తెలుసుకుంటుంది. దేవలుడు సామాన్యజనాన్ని రక్షిస్తున్నాడని తెలిసి, అతణ్ణి కలుసుకోడానికి అంతఃపురంనుంచి వేషం మార్చుకొని ధైర్యంగా ఒక్కర్తే వెళ్ళి కలుస్తుంది. కీచకుణ్ణి మట్టు పెట్టడానికి వెనుకాడని స్వభావం ఈమెలో కనిపిస్తుంది.

### 4. 3. 5. కంకుభట్టు :-

విరాటరాజుకి జూదంలో వినోదాన్ని పంచేపాత్రగా ధర్మరాజు కనబడతాడు. విరాటరాజ కొలువులోకి మాలినిని కీచకుడు తరుముతూ వచ్చి, తగువు చెప్పమన్నప్పుడు ఆమెను శాంత పరచాలని అనుకుంటాడు. అజ్ఞాతవాసంలో ఉన్నందువల్ల అది భంగం అవుతుందని భీముడి కోపాన్ని కూడా తగ్గిస్తాడు.

### 4. 3. 6. భేతాళుడు :-

ఇది రచయిత కల్పించినపాత్ర. కీచకుడు భేతాళుణ్ని వశం చేసుకోడం కోసం భేతాళ హోమం చేస్తాడు. భేతాళుడు ప్రత్యక్షమై ఏం కావాలని అడుగుతాడు. భేతాళుడు ఒక భావమే తప్ప కోరినది ఇవ్వగలిగే ఆకారం ఉన్నట్లు కనబడడు.

### 4. 3. 7. దేవలుడు :-

అభిమన్యుడికి మారు పేరుగా దేవలుడు కనబడతాడు. అర్జునుడి కొడుకు. కీచకుడి ఆగడాల్ని ఎదుర్కోడానికి చాలా కష్టాలు పడినవాడు. రాజపుత్రుల్ని కీచకుడు బలి ఇవ్వాలని

అనుకున్నప్పుడు వారందర్నీ ఉత్తర సహాయంతో పథక రచనచేసి రక్షిస్తాడు. చివరకు కీచకుడికి దొరికిపోయి చాలా దెబ్బలు తింటాడు. రాజుగా ప్రజలు ఇతణ్ణి ఎన్నుకుంటారు. కానీ ఇతడు తిరస్కరిస్తాడు.

### 4. 3. 8. వలలుడు :-

విరాటరాజకొలువులో వంటలుచేసేవాడుగా భీముడు ఉంటాడు. అతడిపేరే వలలుడు. అరణ్యవాస సమయంలో అడవి మనుషులతోనూ, క్రూరమృగాలతోనూ, చీకట్లోను యుద్ధం చేయడం తెలుసుకున్నాడు. విరాటరాజు ఆనందం కోసం మల్లులతోనూ, పులులతోనూ యుద్ధం చేస్తుంటాడు. కంకుభట్టు ఎలా చెబితే అలా నడుచుకొనే వాడుగా కనబడతాడు. చివరకు కీచకుణ్ణి పథకం ప్రకారం మట్టి కరిపిస్తాడు.

### 4. 3. 9. బృహన్నల :-

నాట్యాచార్యుడి వేషంలో అర్జునుడే బృహన్నలగా విరాటుడి కొలువులో చేరతాడు. ఉత్తరకు ప్రత్యేక శిక్షణ ఇస్తాడు. ప్రజాశక్తులకు ప్రాధాన్యం ఇవ్వాలని ఉత్తరకు ప్రబోధించడం, ప్రజలకు సహాయపడేవిధంగా ఉత్తరకు బోధ చేయడం ఈ పాత్రలో కనిపిస్తుంది.

### 4. 3. 10. కుంతి :-

కుంతి పాత్ర ప్రత్యేకంగా ఈ నవలలో లేదు. కానీ, ద్రౌపది తలపుల్లో కదిలాడే పాత్రగా కనబడుతుంది. పాండవుల్ని ఐక్యంగా ఉంచడానికి, ధర్మ సంస్థాపన చేయడానికి ద్రౌపదిని వారికి సహకరించడానికి ప్రోత్సహించేదిగా అనిపిస్తుంది. హిడింబితో భీముడికి వివాహం చేసి, రాక్షసబలాన్ని తమకు అనుకూలంగా మార్చగలిగిన పాత్ర అని చెప్పొచ్చు.

### 4. 3. 11. విరాటరాజు :-

మత్స్యదేశానికి రాజు. అధికారం చెలాయించేది మాత్రం కీచకుడు. విరాటుడు పరాక్రమవంతుడే కానీ, కీచకుడి దగ్గర ఏమీచేయలేని పాత్ర. కీచకుడు మాలినిని సభా మధ్యలో కాలితో తన్నినా, తగిన విధంగా సమాధానం చెప్పలేకపోగా, కీచకుడికి తగిన మర్యాద కూడా చేసాడు. జూదం ఆడడం, మల్లయుద్ధం చూడడం లాంటి వాటితో కాలక్షేపం చేస్తుంటాడు.

ఈ విధంగా రచయిత్రి ప్రతిపాత్రలోను ప్రత్యేకతలున్నప్పటికీ ప్రధానంగా భారతాన్ని విశ్లేషించడం ఈమె ఉద్దేశం. అప్పటి భారతంలోని స్త్రీకి జరిగిన అన్యాయాన్ని, అధికారం కోసం పడిన ఆరాటం, అసమర్థరాజరికాన్ని విశ్లేషించడం ఈ నవలలో కనిపిస్తుంది.

## 4. 4. *ఇదా భారతం* -పాత్రల మనస్తత్వం :-

పాత్రల మనస్తత్వాన్ని పరిశీలించాలంటే ప్రధానంగా ఆయా పాత్రల మాటతీరు, ప్రవర్తనాంశాలు, మనోగత విషయాల్ని దృష్టిలో పెట్టుకోవాలి. ఇదా భారతం నవలలో మాలిని ఒక ప్రత్యేక వ్యక్తిత్వం ఉన్న పాత్రలా కనిపిస్తుంది. ఎన్ని కష్టాలు వచ్చినా,

అవమానాలకు గురైనా బిక్కవోని ధైర్యంతో వీరులైన పాండవుల్ని విడిపోకుండా కుంతి పాండవులందర్నీ పెళ్ళి చేసుకోమనగానే 'సరే' అని, తన అనుకూలతను తెలిపిన పాత్ర ఈమె.

మల్లుడైన భీముణ్ణి పులితో యుద్ధం చేస్తున్నప్పుడు ఒకరాణి 'అడవి మనుష్యులు' అని భీముణ్ణి ఉద్దేశించి అంది. అప్పుడు ద్రౌపది బాధపడి గతాన్ని తలుచుకొంటుంది. "భవిష్యత్తులో ఎవరైనా 'అమ్మ' అనే పేరుతో కావ్యం రాస్తే అందులో కుంతి ఉంటుంది. ఒకమహావిప్లవాన్ని సృష్టించాలని నడుం కట్టుకున్న సోదరులందరికీ ఆ తల్లి మనోబలమే పెద్ద అండ! ఎప్పటి కప్పుడు కర్తవ్యాన్ని ప్రబోధిస్తూ, తగిన మార్గంలో నడిపించింది. అందరినీ కలిసికట్టుగా ఉంచడానికి చేయవలసిన ప్రయత్నాలన్నీ చేసింది.(పుటలు:15-16). అని కుంతిపట్ల ఉన్న పెద్దరికాన్ని, కర్తవ్యదీక్షను తల్చుకుంటుంది. ఈనాటి అత్తలు ఎలా ఉండాలో ఈమెకు కుంతిమీద ఉండే గౌరవం తెలుపుతుంది. పెద్దలు బాధ్యత తీసుకోవాలని రచయిత్రి సూచిస్తుంది.

లక్క ఇల్లు తగులు బెట్టాలని పథకం ధృతరాష్ట్రుడు వేసాడు. దానినుంచీ బయట పడ్డాక కుంతి ప్రబోధం ప్రారంభమయింది. "మనం చచ్చిపోయినట్లే భ్రమ కల్పిద్దాం! కొన్నాళ్ళు అజ్ఞాతం గానే ఉందాం! ఈ లోగా మనసిద్ధాంతాలు వ్యాపింపచేద్దాం! మన బలగాన్ని పెంచుకుందాం! మన పార్టీ మిత్రుల్ని ఆహ్వానిద్దాం!"(పుట.16) అంటూ కర్తవ్యాన్ని నిర్దేశిస్తుంది.

బకుణ్ణి చంపి, భీముడు అతడి శవాన్ని ఊరిపోలిమేరవరకూ ఈడ్చుకు వచ్చి పడేసాడు. ఆ ఊర్లో జనమేకాక చుట్టుపక్కల జనం కూడా విరగబడి వచ్చారు ఆ శవాన్ని చూడడానికి!. భీముడు మంత్ర సిద్ధుడని కొందరు అన్నారు. భీముడు తెల్లబోయాడు. బకుడికి మాయలు, లేవని ప్రజల మనసులో ఉన్న భయమే అతడికి బలమని లోకానికి చాటి చెప్పాలనుకుని బకుడి శవాన్ని ఊరి పొలిమేర వరకు ఈడ్చుకొచ్చాడు. కానీ, ఈ ప్రజల మనస్సులో ఉన్న మూఢవిశ్వాసాల్ని ఎవరు పోగొట్టగలరు? పైగా స్వార్థంకోసం వాటిని పెంచి పోషిస్తారని మాలిని మనస్సులో అనుకుంటుంది. దీనిద్వారా మాలిని మూఢ నమ్మకాల్ని నిరసించే ఆలోచన చేస్తుంది. తన మీదకు వచ్చిన నప్పుడు ఆ మూఢ నమ్మకంతోనే కీచకుణ్ణి భయపెడుతుంది- దానికి ఉత్తరను సహాయంగా వాడుకుంటుంది.

ఆడవాళ్ళు ఇక్కడికి రాకూడదు అంటూ కీచకుడు ఉత్తరమీద కోపగించుకుంటాడు. "నీ భవనానికి ఒక విచిత్రమైన స్త్రీవస్తోంటే చూసి, ఎవరో తెల్సుకుందామని వచ్చాను" అది ఆదిశక్తిలా ఉంది. జుట్టు విరబోసుకొని ఉంది. నాలుగుచేతులు- రెండు చేతులితో ఒకదానిలో ఖడ్గం, రెండో దానిలో త్రిశూలం మిగిలిన రెండు చేతులూ ఖాళీగానే ఉన్నాయి. ఎంతో అందంగా ఉంది. ఆ అందం చూస్తుంటే భయం కలుగుతుంది. ముఖంలో చిరునవ్వు ఉంది. ఆ నవ్వు విలాసంగా లేదు, సమస్తలోకాల్ని ధిక్కరిస్తున్నట్లుగా ఉంది(పుట.97) అని ఉత్తర చూసినట్లే భయపడి అది నిజమని నమ్మించింది. అలాగే సూర్యుడు తనకు రక్షణగా రాక్షసుణ్ణి పంపినట్లు కీచకుణ్ణి మాలిని భ్రమించేలా చేసింది.

వలలుడితో బోనులోపోరాటం చేస్తున్నపులి ఊచలు ఊడిన(ఉత్తరతీసేసింది) వైపు నుండి పులి బయటకు వచ్చేసింది. అంతవరకు వినోదం చూస్తున్న రాణివాసం ఘోషా, పాతివ్రత్యం వగైరా నిత్యంవల్లించే అర్థంలేనిమాటలు పూర్తిగామరిచి భటుల్ని వాటేసుకున్న వాళ్ళు, ఏడుస్తున్నవాళ్ళను చూసిన ద్రౌపది 'కృత్రిమ నాగరికత పొరలు తొలగిపోయి, అచ్చమైన అటవిక నృత్యం చేస్తున్న ఆధునిక వర్గపు మరబొమ్మ మహిళలను వినోదంగా చూడ సాగింది మాలిని' అని రచయిత్రి వివరిస్తుంది. ఎదుటివాళ్లను అనేయడం సులువు. మాటలు వాడేయడంకాదు, తనవరకు వస్తే అడవి మనుషులుగానే ప్రవర్తిస్తారని తెలియ జేసారు. సాటి మనిషిని పట్టించుకోకుండా పులితో పోరాటం చేయడం ఎంత అరాచకమో ఈ సన్నివేశంలో రచయిత్రి నిరూపించింది.

మత్స్యయంత్రం నిర్మించడంలో ద్రుపదుడికి ఉండే ప్రత్యేకత గొప్పది. తనకు కాబోయే అల్లుడు ఏ విధంగా ఉండాలో నిశ్చయించే బాధ్యతగల తండ్రిగా ద్రుపదుణ్ణి ద్రౌపది భావిస్తుంది. అలాంటి తపన ఉన్న తండ్రి తనకు దొరకడం అదృష్టంగా తలచు కుంటుంది. అలాగే కుంతి చెప్పేతీరు ద్రౌపదికి ఆకర్షణీయంగా ఉంటుంది. అందుకే ఆమె చెప్పిన కార్యసాధనను వదలకుండా ప్రవర్తిస్తుంది.

రాజసూయయాగంలో సాధారణ రాణుల్లా, పనికి మాలిని కబుర్లు చెప్పుకుంటూ సోమరిలా ద్రౌపది కూర్చోలేదు. అందరి అవసరాలు సమకూరేలా చూస్తూ, భోజనానికి కూర్చునేసరికి అర్థరాత్రి కూడా దాటేది. లేనిపోని సిగ్గులు, సంకోచాలు, ముసిముసి నవ్వులూ, తెరవెనుకకు తప్పుకోటాలు లేని గాంభీర్యమైన వ్యక్తిత్వం ద్రౌపదిది. అందుకే రచయిత్రి ద్రౌపదిని వర్ణించే సందర్భంలో "జీవితాన్ని కాచి వడపోసిన ఆ విప్లవ వీరుడినుండి(కృష్ణుడి) అనేక జీవిత రహస్యాలు తెలుసుకుంది ద్రౌపది. అన్నింటిలోనూ మానవ జీవితంలో మనసుకున్న ప్రాధాన్యాన్ని పదేపదే నొక్కి చెప్పేశాడు" (పుట.40) అనడం గుర్తుంచుకోదగిన అంశం. మనసును బలహీనపరచడం కార్యనాశనంగా భావిస్తుంది. అందుకే దుర్యోధనుడు 'దూరం నుంచి ఆమె సృష్టిలో స్త్రీశక్తి అంతా మూర్తీభవించిన ఆదిశక్తి మానవ ఆకృతిలా ఉంది' అని ద్రౌపదిని వివరిస్తాడు. వాస్తవాన్ని విస్మరించకుండా తన పని తాను చేసుకుపోయే స్వభావం ఈమెలో ఉంది. ఇది మానవాళికి అంత్యంత అవసరమైన అంశం.

నిండు సభలోకి దుశ్శాసనుడి ఆగడాలకు అడ్డకట్టవేయదలచి గాంధారి వెనుక ఒదిగి నిలుచుంది. 'తల్లి సమక్షంలో ఎంతటి దుష్టుడయినా, అత్యాచారానికి తలపడతాడా?' అని భావించింది. ఆమెవల్ల అత్యాచారంఆగదని వెంటనేతెలుసుకొని మనసును ఆధీనలోకి తెచ్చుకొని కృష్ణుణ్ణి ప్రార్థించింది. "మూర్ఖుల్లారా! నా అన్న కృష్ణుడు అండగా ఉన్నాడు నాకు! అతడు భగవంతుడు. సర్వకాల సర్వావస్థల్లోనూ నన్ను కాపాడుతుంటాడు. అతడు" అంది(పుట.42) ఈ మనస్సు అధీనానికి దైవభక్తికి ఈ సన్నివేశం నిదర్శనం.

ధర్మశాస్త్రం ప్రకారం క్షత్రియలు రెండు కన్నా ఎక్కువ వరాలు కోరుకోరాదు. అందుకే- ద్రౌపది ఒకటి 'సోదరులకు(పాండవులకు) దాస్యవిముక్తి కలగాలనీ, రెండు వారి

ఆయుధాలు వారికి ఇచ్చేయ్యాలని మాత్రమే కోరుకుంది'. ధృతరాష్ట్రుడు పాండవుల రాజ్యాన్ని కూడా తిరిగి ఇచ్చేసాడు. అప్పుడు ఆడదానివల్ల రాజ్యం వచ్చిందని తన భర్తలు భావిస్తారేమో అని ద్రౌపది భావించింది. 'ఒకసారి ఆయుధాలు మీ చేతికి వస్తే, మీరు మీ రాజ్యం సంపాదించుకోగలరని గుడ్డిరాజుకి తెల్సు. అంచేతే మీ రాజ్యం మీకు వరంగా ఇచ్చేశాడు' అని ద్రౌపది చెప్పి, పాండవుల్లో రగులుతున్న అవమాన భారాన్ని కొంత శాంతించేలా చేసింది. తద్వారా వారిలో ఆత్మ విశ్వాసాన్ని పెంచేశక్తిలా ద్రౌపది కనబడుతోంది.

భేతాళుణ్ణి వశీకరించుకోడంకోసం కీచకుడు భేతాళహోమం చేస్తాడు. అందుకోసమే రాజపుత్రుల్ని బంధిస్తాడు. కానీ ఉత్తర ఉత్తరుడివేషంలో రాజపుత్రుల్ని విడిపిస్తుంది. ఆ విషయం తెలియని కీచకుడు, ఉత్తరుడే ఆ రాజపుత్రుల్ని విడిపించాడని భావిస్తాడు. అందుకు ప్రతీకారంగా ఉత్తరుడితో ఉన్న విలాసినులందర్నీ నగ్నంగా చేయించి మర్మస్థానాల్లో స్పృహ లేకుండా పడే వరకు కొట్టించాడు. విషయం తెలుసుకున్న మాలిని వాళ్లను చూడడానికి నగరవైద్యశాలకి వెళ్తుంది. అక్కడ వైద్యుడు మగవాడు. అతడు కన్నులపండుగగా విలాసినుల నగ్నసౌందర్యాన్ని చూస్తూ మందువేసే నెపంతో వారి శరీరాల్ని తాకుతున్నాడు. ఎవరూ అతణ్ణి ప్రశ్నించే స్థితిలో లేరు. మాలినికి శరీరంజలదరించింది. 'ఎక్కడ ఆడవాళ్ళు పూజలందు కొంటారో అక్కడ దేవతలు ఆనందిస్తారు' అని కదా. 'నీతి సూత్రాలు వల్లించే భారతదేశంలో, ఆడదానికి గౌరవంఇదా?' అని బాధ పడుతుంది.(పుట.57) ఇక్కడ స్త్రీవేదన, కీచకుడి లాంటివారు, వారికి తోడుబట్టే వైద్యుల్ని రచయిత్రి నిశితంగా విమర్శించారు. ద్రౌపదిలో ఈ సంఘటనలో మానవతా లక్షణాలు కనబడతాయి.

విలాసినులకు సేవలు చేస్తున్నప్పుడు కీచకుడు ఎందుకొచ్చావంటే 'పర్వత ప్రాంతంలో ఉన్నవాళ్ళం అందుకు మూలికావైద్యం తెలుసునని ఆపదలో ఉన్నవాళ్ళకు ఎవరైనా సాయం చేస్తా'రని చెప్తుంది. ఇలాంటి సమయంలో మీరు ఉన్నా మీకు కూడా సేవలు చేస్తానని కీచకుడితో అంటుంది. దానికి కీచకుడు 'ఏయ్! సైరంధ్రీ! వళ్ళు దగ్గిర పెట్టుకొని మాట్లాడు' అంటాడు. నేను పొరపాటు మాట్లాడానా? మీకు ఆపద ఏనాటికీ రానే రాదా? అని కీచకుణ్ణి ప్రశ్నించిన ధీరవనితగా ద్రౌపది కనబడుతుంది. కీచకుడుకి రాబోయె ఆపదను కూడా సూచించడం ప్రత్యేకత.

ఉత్తరుడు పిరికివాడు. అయినప్పటికీ అతడికి ధైర్యంగా ఉండే కథల్ని చెప్పి, గొప్పవాడి వంటూ ప్రోత్సహిస్తుంది ద్రౌపది. ఆ మాటలు ఉత్తరుడికి ప్రేరణని కలిగిస్తాయి. ఆ నేపథ్యంలోనే అతడికి విలువిద్యని ద్రౌపది నేర్పిస్తుంది. ఉత్తరుడితో బాణం వేయిస్తుంది. అది బొమ్మగుండెలో గుచ్చుకోవాలని ద్రౌపది చెబుతుంది. కానీ ఉత్తరుడు వదిలిన బాణం బొమ్మకాళ్లకు తగిలినా 'అద్భుతం' అంటూ ప్రశంసించడం ఉంది. తద్వారా మరింత పట్టుదలగా మళ్ళీ వెయ్యమని ప్రోత్సహిస్తుంది. ఎలిజబెత్ హర్లాక్ చెప్పిన నిందకన్నా, పొగడ్తలు బలాన్ని చేకూరుస్తాయనే తత్వాన్ని రచయిత్రి ఇక్కడ ప్రయోగించారు. క్రమంగా ఉత్తరుడుకి గురి కుదురుతుంది. ఉత్సాహం పెరుగుతోంది. మనస్సులోని భయమూ, బెదురూ మాయం అవుతున్నాయి. అలాంటి సమయంలో సుధేష్ణవచ్చి ద్రౌపదిని కౌగలించు

కొంటుంది. ఇలా అధైర్యవంతుడైన వాడికికూడా ధైర్యాన్నికలిగించే ప్రేరకశక్తిగా ద్రౌపది కనిపిస్తోంది.

సుధేష్ణ తమ్ముడు కీచకుడికిచ్చిన మాటప్రకారం మాలినిని మద్యం తెమ్మనే నెపంతో మాలినిని కీచకుడింటికి పంపాలని ప్రయత్నిస్తుంది. మాలిని మొదట ఒప్పుకోదు. 'ఈ మాత్రం సహాయం చెయ్యకపోతే, నువ్వెందుకిక్కడ?' అని సుధేష్ణ అనేసరికి, మాలినికి గుండె ఝల్లుమంది. అజ్ఞాతవాసం గడువు ఇంకా పది రోజులే ఉంది. భర్తలు కలుసుకొనే సమయం లేదు. కీచకుణ్ణి ఎదుర్కోగలిగే అవకాశమూ లేదని, ఒకవేళ వెళ్ళకపోయినా కీచకుడి గూండాలే వచ్చి బలవంతంగా అతడి ముందుకు తీసుకువెళ్తారని ఆలోచించి సుధేష్ణమాట వినడమే మార్గంగా ఎంచుకొంది. (పుట.95) ఇది ద్రౌపది సమయస్ఫూర్తికి నిదర్శనంగా చెప్పొచ్చు.

కీచకుడు సభలో అవమానపరిచినా, అతడికి ఎదురుచెప్పకపోగా మర్యాదలు చేయడం ద్రౌపదికి మరింత బాధపడేలాచేసింది. కంకుభట్టు, భీముడు ఉన్నా ఏమీ చేయలేదు. పైగా కంకుభట్టు నీతులు వల్లిస్తున్నాడు. అవమానభారంతో అంతఃపురానికి మాలిని వచ్చింది. సుధేష్ణకు విషయం తెలిసింది. అయినా సుధేష్ణ ఏమీ తెలియనిదానిలా, 'మాలినీ!, ఏమిటిది? ఎందుకిలా ఉన్నావు? ముఖం ఎలా వడలిపోయిందో చూడు! ద్రాక్షరసం తెప్పించనా? ఏం జరిగింది చెప్పు' (పుట.106) అని చెయ్యి పట్టుకొని, దగ్గర కూచోబెట్టుకోబోయింది. ఆ చేతిని విదిలించుకొని కోపంతో మాలిని విషయం చెప్పి అక్కడనుంచి వెళ్ళిపోయింది. సుధేష్ణ ఏమీ అనలేదని, అసహాయురాలని ద్రౌపదికి ముందే తెలుసు. అందుకే ఆమె అక్కడ ఉండడానికి కూడా ఇష్టపడలేదు. అవమాన భారాన్ని భరించలేని ఒక ఆదర్శవ్యక్తిత్వం ఉన్నపాత్రలా ఈ సన్నివేశంలో ద్రౌపది కనిపిస్తోంది.

కీచకుణ్ణి చంపడానికి పథకంవేసి బాగా అలంకరించుకొని సుధేష్ణ మందిరానికి ద్రౌపది వెళ్ళింది. అప్పటికే ఉత్తరని, ఉత్తరకుమారుణ్ణి కీచకుడు రాజపుత్రుల్ని విడిచిపెట్టేశారనే నేరంమీద బంధించాడు. ఆ సమయంలో ద్రౌపది వెళ్ళి 'మీ తమ్ముడిగారి మందిరానికి వెళ్తున్నాను. ఏమైనా తెమ్మంటారా?' అని సుధేష్ణను అడుగుతుంది. సుధేష్ణకి తల గిర్రున తిప్పి 'వాడి శవం తీసుకురా' అని చెప్పింది. అలాగే అని ద్రౌపది బయలుదేరి అన్నంత పని చేసింది. ఇలా ప్రతీకారం తీర్చుకున్న సబలగా మాలిని దర్శనమిస్తోంది.

ఉత్తర పాత్ర విషయంలో కొంత విలక్షణత కనిపిస్తుంది. యుక్తవయస్సులో ఉన్నపాత్ర ఈమె. అయితే స్వేచ్ఛ ఎక్కువ. తెలియని అల్లరి చేయడం, చాలా సమయాల్లో ధైర్యంగా కార్యాన్ని పూర్తి చేయగలగడం ఈ పాత్ర ప్రత్యేకత. స్వతంత్రత, సమభావాలున్నపాత్రగా ఈ నవలలో కనిపిస్తోంది.

సభమధ్యలో విశాలమైన రంగస్థలం. ఊచలబోనులో ఒకపులి. దానితో పోటాడడానికి వలలుడు. ఆ పోట్లాట చూడడం రాణివాసవిలాసం. ఆ సమయంలో రాణీవాసపు స్త్రీలు మద్యం త్రాగడం చూసిన ఉత్తర 'ఇలా తాగడం అనాగరిక లక్షణం!. మనం ఎలాగో డబ్బు

సంపాదించి, రాజ్యాధికారం చెలాయిస్తున్నాం. కానీ, మన ఆటవిక లక్షణాలు పోగొట్టుకోలేకపోతున్నాం!. మద్యం తాగకూడదు' అంటూ ఛీదరించుకోడం ఉత్తర స్వతంత్ర, స్వేచ్ఛా భావాలకు నిదర్శనం.

వలలుణ్ణి ఆకలితో ఉన్నపులి బోనులోకి ప్రవేశపెట్టారు. ఆ సమయంలో 'ఇది అన్యాయం! ఆకలితో ఉన్న పులితో, ఒకమనిషి. అదీ ఆయుధాలు లేకుండా పోట్లాడడమేమిటి! ఇదెక్కడి వినోదం? అని కంపరంగాను, భయంగాను అంది.(పుట.15) పైగా 'అది మజాగా అని ఒక రాణి' అనగానే ఎవరికీ తెలియకుండా ఐదారు పులిబోను ఊచల్ని ఆడవాళ్ళు వైపున్నవి లాగేసింది. పులి ఆడవాళ్లవైపు ఉరకగానే అంతమంది రాణివాసానికి భయం కలిగింది. ఇలాంటిదికాదా వలలుడి ప్రాణం అంటూ గుణపాఠం చెప్పింది. ఉత్తర సైనికుడి చేతిలో ఉన్న బల్లెం తీసుకుని వలలుడివైపుకు విసిరింది. అతడు ఒడుపుగా పట్టుకొని పులిని చంపాడు.

కొరడా దెబ్బలు తిన్న సైనికుణ్ణి ఉత్తర స్వయంగా దెబ్బలకు మూలికలతో తయారుచేసిన చూర్ణాలు పూసి, వైద్యసేవచేసింది. అతడు వణుకుతున్నాడు. భయంలేదని, భయపడకు నిన్ను కాపాడి ఇక్కడికి తీసుకొచ్చాం. నీ ప్రాణాలకు హాని జరగదు. అలాగే నీ ఇష్టం లేకుండా నువ్వు ఏ పనీ చేయనక్కర్లేదు అంటూ విషయం తెలుసుకొని 'పిచ్చివాడా! ప్రాణాలకి తెగించి ఆటవికులతో పోట్లాడి వచ్చినందుకు నీకు జరిగిన మర్యాదఏమిటి? దేవుడి దగ్గరకి వెళ్ళు. నీకేం భయంలేదు' అంటూ ఉత్తర సైనికుడికి సామాన్యవేషం వేసి ఆదరంగా పంపిస్తుంది. దీనివల్ల సైనికులంటే ఉత్తరకు ఉండే ప్రత్యేకమైన అభిమానం వ్యక్తమౌతోంది.

నాట్యం నేర్చుకొని ఉత్తర అంతఃపురానికి చేరుకొంది. అప్పటికే సుధేష్ణ తన భారీ శరీరాన్ని అంతఃపురంలో బంగారుమంచంమీద పడేసింది. మాలిని లత్తుక పూసిన పాదాల్ని కిందకి వేళ్ళాడేసి, విశ్రాంతి తీసుకుంటోంది సుధేష్ణ. ఉదయం లేచింది మొదలు, సౌందర్య పోషణ, అలంకరణతప్ప వీళ్ళకు వేరేపని ఉండదా? అని ఉత్తర మనస్సులో ఛీదరించుకొంది. రాణులు తమ సౌందర్యపోషణకోసం ఇలా నానా అవస్థలూ పడుతుంటే, అక్కడ రాజులు ఇతరదేశాలనుంచి తాముదోచుకొచ్చిన విలాసినీజనంతో కులుకుతుంటారు. (పుట.51)రాణుల విలాసాల్ని మనస్సులోనే ఉత్తర అసహ్యించుకొంది. అందుకే చివర్లో దేవలుడితో వెళ్ళిపోడానికి సిద్ధపడింది. 'నాకు రాణి వాసాలక్కర్లేదు. అంత:పురంలో మరబొమ్మలా ఉన్న నన్ను మనిషిని చేసింది దేవలుడు. అతనెక్కడుంటే, నేనూ అక్కడే వుంటాను. అతడి కార్యక్రమాల్లో నేనూ సాయపడతా. అదే నాధ్యేయం'(పుట.114) అని నిష్కర్షగా తన అభిప్రాయం చెప్పింది. ఇక్కడ ఉత్తరలో నేటి స్త్రీ లక్షణాలు స్పష్టంగా రచయిత్రి చూపించారు.

రాజపుత్రుల్ని భేతాళుడి హోమం కోసం బలివ్వడానికి కీచకుడు బంధించాడు. వాళ్లందర్నీ ఉత్తర ఉత్తరుడి వేషంలో వెళ్లి కీచకుడు బంధించిన రాజపుత్రుల్ని విడిపించింది. కీచకుడు మాలినిని లోబరుచుకోవాలనే సమయంలో వికృతమైన స్త్రీని చూసానని కీచకుణ్ణి నమ్మించి, అతడి ధైర్యాన్ని వమ్ముచేసిన స్త్రీ పాత్ర ఉత్తర. కాపల కాస్తున్న సైనికుడి

కళ్ళుగప్పి రోడ్డుమీదకు వచ్చి అక్కడున్న గుంపులో కలిసిపోయింది. అంతలో కీచకుడి గూండా సైన్యం పదిమంది వచ్చి గుంపులు గుంపులుగా ఆడవాళ్ళ మీద పడి బూతులు తిడుతూ, కొరడాలతో కొట్టి రాజుగారితో మీ కష్టాలు చెప్పడానికి వచ్చారా? అని చావబాదారు. ఒక గుండా వచ్చి ఉత్తర మీద చేయి వేయబోతుండగా వేరొక వ్యక్తివచ్చి వాడి తల నరికాడు. అక్కడే మొట్టమొదట బయట ప్రపంచాన్ని అనుభవపూర్వకంగా ఉత్తర చూసింది. మీ నాట్యాచార్యుడు బృహన్నల నడిగి మీ సందేహాలు తీర్చుకోవచ్చు అని ఆ సైనికుడు వెళ్ళిపోయాడు. అప్పటినుంచి చైతన్యవంతంగా కీచకుడికి వ్యతిరేకంగా ప్రజలపక్షం వహించడం ఆమె మానవీయ దృక్పథానికి నిదర్శనంగా చెప్పొచ్చు. ఆ సైనికుణ్ణి చూడడానికి ఒక రైతు వేషంలో ఉత్తర బయలుదేరింది.

చివరకు దేవలుణ్ణి కలిసింది. తనపేరు చెప్పుకొని దేవుడిగా ఇక్కడ అటవికులు పలుకుతారని దేవలుడు చెప్పాడు. రాజకుమారి అతడికి సహాయం చేయాలని భావిస్తుంది. అప్పుడు 'రక్త కాళి' సంకేతంతో ఎవరైనా సహాయం కోరమంటే తప్పక చేయమని కోరాడు. ఒక సైనికుడు ఆ సంకేతం వాడినపుడు ఆశ్చర్యానికి గురైంది. అతడు చెప్పినట్లు చేసింది. అలాగే మాలిని ఆ మాట వాడినప్పుడు ఆమెకు కూడా సహాయం చేసింది. ఇలాంటి అంశాలు పరిశీలిస్తే ఆమెకు సేవ చేయాలనే తపన ఉందని చెప్పొచ్చు. మరీ ముఖ్యంగా న్యాయపక్షపాతిగా వ్యవహరించిన పాత్రగా అనిపిస్తోంది.

సుధేష్ణ పాత్ర విషయంలో ప్రేమతో నిండిన అలంకారప్రియత్వం, కీచకుడంటే ప్రత్యేక భయంతో కూడిన అభిమానం కనబడతాయి. రాణివాసం స్త్రీలు వలలుడు ఆకలితో ఉన్న పులితో బోనులో పోరాడుతున్నప్పుడు మద్యం సేవిస్తూంటే, ఉత్తర వాళ్లను ఛీదరించుకొన్నట్లు మాట్లాడింది. ఆమె మాటలకు సుధేష్ణ 'ఏమిటా మాటలు? నోరు మూసుకో! నీకు ఇష్టం లేకపోతే నువ్వు తాగకు' అని మందలించింది(పుట.14) కానీ పిల్లల్ని ఎలా పెంచాలో తెలుసుకోలేక పోయింది. పిల్లల మనస్తత్వాన్ని ఎలా గుర్తించాలో ఒక తల్లిగా ఆమె అర్థం చేసుకోలేదు.

మాలిని ప్రోత్సాహంతో ఉత్తరుడు బాణాలు వేయడం సాధన చేస్తున్నాడు. మాలిని ప్రోత్సాహం చూసి ఉత్తరుడికి ఉత్సాహం పెరిగింది. మనస్సులో భయమూ, బెదురూ మాయం అవుతున్నాయని భావించాడు. అలాంటి సమయంలో సుధేష్ణవచ్చి మాలిని రెండు చేతులు పట్టుకొని మహారాణి అనుకోకుండా 'మాలినీ! నువ్వు మామూలు పరిచారికవు కావు- ఉత్తర కుమారుణ్ణి ఇలా చూస్తానని అనుకోలేదు. ఇదిగో నీ నా బహుమతి' అని మెడలోని గొలుసు తీసి ఇవ్వబోయింది. మాలిని అడ్డుపడింది తీసుకోలేదు. అయినప్పటికీ మళ్లీ ఉత్తరుణ్ణి ప్రోత్సహించడం కానీ, విలువిద్య నేర్పించడంలో గానీ ప్రత్యేక శ్రద్ధ తీసుకోని పాత్ర సుధేష్ణ.

అంతఃపురంలో సుధేష్ణను సమీపించి కీచకుడు మాలినిని తన భవనానికి పంపమని ఒత్తిడి చేసాడు. 'ఆమెకి అయిదురు భర్తలున్నారు. గంధర్వులు ఆ తెగవాళ్ళదగ్గర గుర్రాలు, రథాలు చాలా వుంటాయి. వాళ్ళకి యుద్ధం చేయడం బాగా వచ్చు, నీకు తెలుసుగా!

చిత్రరథుడనే వాడు అనేక రథాలతో, అంతులేని సేనతో దుర్యోధనుడు, కర్ణుడులాంటి కౌరవవీరుల్ని ఓడిచాడు. వొద్దు! వద్దు! ఆమె జోలికి వెళ్లకు!'(పుటలు 71,72) అని చెప్పింది. హుంకరించి అందరిముందు మాలిని చెయ్యి పట్టుకున్న కీచక తమ్ముణ్ణి ఎలా మందలించాలో తెలియని, చేతగాని సోదరిలా కనబడుతుంది. పైగా సుధేష్ణ ఏకాంత మందిరానికి కూడా వచ్చేసి మాలిని వెళ్ళకు నీకోసమే వచ్చాను అని, తలుపు అడ్డంగా ఉండడం కీచకుడి విపరీతబుద్ధిని సూచిస్తోంది. సుధేష్ణ తత్తరపడుతూ 'తమ్ముడూ! రా! ఇలా వచ్చి కూచో! మాలిని ఎక్కడికీ పోదు. మన అంతఃపురంలోనే ఉంటుంది. మనం మాట్లాడుకుందాం రా! అని కీచకుడి చెయ్యపట్టుకొని మాలిని అప్పటికి మాత్రమే తప్పించింది. తర్వాత రాజ్యకాంక్ష మొదలైన వాటివల్ల ఆమెను కీచకుడి దగ్గరకు పంపే స్థితికి దిగజారిపోయింది.

నువ్వు చేసేది తప్పు అని, నిష్కర్షగా చెప్పే ధైర్యంలేని స్థితి సుధేష్ణ పాత్రలో కనిపిస్తోంది. పైగా, పురుషుడి ముఖంచూడని కన్నెపిల్లల్ని కీచకుడికోసం పంపిస్తాననడం ఈమె స్థితిని తెలుపుతోంది. అదే తన కూతురు విషయంలో మరోలా ప్రవర్తించడం ఈమె స్వార్థాన్ని తెలుపుతోంది. గూండాలు గుంపులు గుంపులుగా ఆడవాళ్ళను హింసించడం వినోదంగా సుధేష్ణ చూసింది. తన కుమార్తె, ఉత్తర ఒంటిమీద చిరిగిన బట్టలతో వచ్చేసరికి 'రాజకుమార్తెని జాగ్రత్తగా తీసుకురండి' అని పరివారాన్ని పంపింది(పుట. 83).

మాలినిని పంపించడం తప్పదని సుధేష్ణ అనుకొని, వెళ్లనన్నా మాలినిని బలవంతం చేసింది. నిన్నేదో కానిపనికి పంపుతున్నట్లు మాట్లాడుతున్నావు. 'నేను మద్యం తేవటానికి మామూలు దాసీలను పంపటం ఇష్టంలేదు. వాళ్ళు మధ్యలో ఎంగిలిచేసి రుచి చూస్తారేమోనని నా అనుమానం! నిన్ను తప్ప ఎవరినీ నమ్మలేక, నీకే ప్రత్యేక గౌరవంతో పంపుతోంటే, వెళ్లనంటావు? ఇంతేనా మనస్నేహం? ఈ మాత్రం సహాయం చేయ్యకపోతే, నువ్వెందు కిక్కడ?' (పుట.95) అని తనపనికోసం ఎంతటి మాటైనా అనడానికి సిద్ధపడేతత్త్వంఉన్న పాత్రగా ఈమె ప్రవర్తిస్తుంది. కానిపని అని తెలిసినా పైకి నటించాలనుకుంటుంది.

కీచకుడిని తిరస్కరించి, అతడితో సభలో తన్నులు తిని, మానసిక వేదనతో తిరిగి అంతఃపురానికి వచ్చిన మాలిని గురించి ముందే సుధేష్ణకు తెలుసు. కానీ ఏమీ తెలియని దానిలా 'మాలినీ! ఏమిటది? ఎందుకిలా వున్నావు? ముఖం ఎలా వడలిపోయిందో చూడు! ద్రాక్షరసం తెప్పించనా? ఏం జరిగిందో చెప్పు. అని చెయ్యి పట్టుకొని దగ్గర కూర్చోబెట్టుకొని ఉపశమనవాక్యాలు పలుకుతుంది.(పుట.106) ఇక్కడ సుధేష్ణ అంతా చేసి ఏమీ ఎరగని మానసిక చిత్రణ కనిపిస్తోంది.

ఇలాంటి స్థితే తన పిల్లల విషయంలో కీచకుడు ఉత్తరకుమారుణ్ణి బంధిస్తే తిండీ తిప్పలూ లేకుండా పడి ఉంది. పైగా కీచకుడి దగ్గరికి మాలిని వెళ్తానని చెప్తే, వాడి శవం తీసుకురా నాకు అని కసిగా అంటుంది(పుట.110) ఇక్కడ పిల్లలకు తల్లిగా, ఉండేబాధ తెలుస్తోంది. సోదరిగా భరించలేని స్థితిలో ఆమెలో కసి, ఆవేదన, బాధ మొదలైన భావాలు

ఒక్కసారిగా వచ్చేసినట్లు కనబడతాయి.

కీచకుడి పాత్ర విషయంలో కిరాతకం, మొండితనం, మూర్ఖత్వం, అధికారం చెలాయించడం, కోరింది పొందాలనుకోడం మొదలైన లక్షణాలు కనిపిస్తాయి. కీచకుడి పాత్ర ప్రవేశం మొట్టమొదటే ఉంది. కీచకుడు భేతాళుణ్ని వశం చేసుకోడానికి దారుణహోమం చేస్తున్నాడు. భేతాళుడు 'ఏం కోరి చేతున్నావు ఈ దారుణ హోమం' అని కీచకుణ్ణి అడిగాడు. నేను ఏం చెప్తే అది నువ్వు చేయ్యాలి అని కీచకుడన్నాడు. వికృతంగా భేతాళుడు నవ్వి 'నేను శక్తిని కాను, భావాన్ని. నేను స్వతంత్రంగా ఏ పనీ చేయ్యలేను. నిన్ను ఆశ్రయించి నువ్వు కోరింది సాధిస్తాను. ఏం కావాలో కోరుకో!' అని భేతాళుడు అంటాడు. వెంటనే కీచకుడు పాండవుల అజ్ఞాతవాసం ముగిసేలోపే వాళ్లని నేను కనుక్కోవాలి అని కోరుకున్నాడు. ద్రౌపదిని పొందడానికి తహతహలాడే స్త్రీలోలుడుగా కీచకుడు కనిపిస్తాడు.

మాలిని గురించి బృహన్నల దగ్గర కీచకుడు ఆరా తీస్తాడు. అతడి సంభాషణలో ద్రౌపది అందగత్తె అని, అద్భుత స్త్రీ అని పొగుడుతుంటాడు. స్వతంత్రభావాలతో వెలిగిపోతూ సోదరుల్ని కార్యోన్ముఖుల్ని చేయగలిగే స్త్రీశక్తి అని అర్జునుడు అంటాడు. ఆ సమయంలో మాలినిని చూసి ద్రౌపదిని మెచ్చుకున్నందుకు అలా అయ్యావా? అని వికృతంగా నవ్వుతాడు. పైగా ఆడవాళ్ళకి ఈర్ష్య ఎక్కువ! నువ్వూ తక్కువదానివా కాబట్టే దాసీలలో నీలాంటి దాన్ని చూడలేదు. ఈ రోజే, ఇప్పుడే నా భవనానికి రా అని దర్పంగా అన్నాడు. ఇదంతా అతడి గర్వానికి, స్త్రీలోలత్వానికి ప్రతీకగా కనబడతాయి. మాలినిని తన భవనానికి రమ్మని చెప్పి కీచకుడు వెళ్తున్నప్పుడు ఉత్తర కావాలనే వీణను నడిచే దారిలో పెట్టింది. కీచకుడు బోర్లా పడ్డాడు. ఉత్తరే ముందుకు వచ్చి అతణ్ని లేవదీసి, 'మా నర్తనశాలలోకి వచ్చినందుకు మంచి నృత్య భంగిమ చూపించావు మావయ్యా!' అని చిరునవ్వుతో అంటుంది(పుట. 65) అప్పుడు ఆమెని ఏమీ అనలేక 'హుం' అనేసి వెళ్ళిపోతాడు. ఇది అతడి స్వభావాన్ని, ఉత్తర మీద ఉండే అభిమానాన్ని తెలియజేస్తాయి. కాబోయే కీచకుడు మరణానికి సూచనగా కనిపిస్తోంది.

కీచకుడు మాలినిని పొందాలనే, అక్క సుధేష్ణను కోరతాడు. ఆమె వారించే ప్రయత్నం చేస్తుంది. ఆమెను ఐదుగురు గంధర్వ భర్తలు కాపాడతారని వివరించినా, టెంపరితనంతో మాలినిని వెతుక్కుంటూ అందరిముందు ఆమె చెయ్యి పట్టుకుంటాడు. చెయ్యి వదులు అని మాలిని శాంతంగా స్థిరంగా అనే సరికి చటుక్కున చెయ్యి వదిలేస్తాడు. అందుకు తన అహంకారం తగ్గకపోగా, ఆమె పట్ల కామాతురను పెంచింది. అందుకే 'మాలినీ! ఈ మూడు లోకాల్లో నేనెవరికీ భయపడను. నన్నెదిరించి నిలవగలిగిన వారూలేరు. అలాంటిది నువ్వు ఆజ్ఞాపించగానే తలఒగ్గాను. ఎందుకో తెలుసా? నీ మీద ప్రేమవల్లే. ఎంతటి పరాక్రమ వంతులనైనా ఎదిరించగల నేను నీమీద ప్రేమముందు ఓడిపోయాను, తక్షణమే నా భవనానికి రా! అని అన్నాడు. (పుట.72) ప్రేమకి కామానికి తేడా తెలుసుకోక కామాన్ని ప్రేమ పేరుతో మాలినిని పొందాలనుకొనేతత్త్వంఉన్నవాడని తెలుస్తోంది. ఉత్తరుడే రాజపుత్రుల్ని విడిపించాడని అనుమానించి, ఉత్తరుణ్ణి ప్రశ్నించి, ఆ సమయంలో ఎక్కడున్నాడని ఆరా తీసి విలాసిను లందర్నీ రప్పించి పూర్తి నగ్నంగా నిలబెట్టి కొరడాలతో

అతి సున్నిత ప్రదేశాలలో కొట్టించడం కీచకుడి దురాగతాలకి పతాకస్థాయిగా చెప్పొచ్చు.

మాలిని మొట్టమొదటగా విలాసినులకు సేవలు చేస్తున్న సమయంలో కీచకుడు చూసి ఎవరునువ్వు? అని ప్రశ్నిస్తాడు. ఏమాత్రమూ బెదరకుండా నువ్వెవరూ అని మాలిని ప్రశ్నించేసరికి నన్నే ఎదురు ప్రశ్నిస్తున్నావా? నీలా ఇంకెవరయినా ఇలా మాట్లాడితే అక్కడిక్కడే ముక్కలుగా నరికి వండేవాణ్ణి అని అధికారం చెలాయించేలా మాట్లాడతాడు. అయినప్పటికీ కీచకుడి మానసిక ప్రవృత్తిని మార్చదలిచి "ముక్కలుగా నరికేయడం జరిగితే, నాకు పెద్దగా బాధలేదు. కానీ, రాణి సుధేష్ణ పాపం, చాలా అవస్థలు పడతారు. ఆమె వయసు మరుగుపడి, యవ్వనంలో ఉన్నట్లు కనిపించేలా అలంకరించటం నా ఒక్కదానికే చేతనవును. అంచేత నన్నావిడ వదులుకోలేదు" (పుట. 58) అని మాలిని చెబుతుంది. ఆపదలో ఉన్నవారికి సాయం చేస్తానని మీరు ఆపదలో ఉన్నా సాయం చేస్తానని మాలిని అంటుంది. 'ఏయ్ సైరంధ్రి! ఒళ్ళుదగ్గర పెట్టుకొని మాట్లాడు' అని అనడం స్త్రీలపట్ల ఎలా ప్రవర్తించాలో తెలియని మొరటు వైఖరిని సూచిస్తున్నట్లు అనిపిస్తోంది.

మాలిని మాటలు మనసులో ఉంచుకొని 'మనం అతి రహస్యంగా నిర్వహిస్తోన్న రాజకీయ వ్యవహారాలు సామాన్య దాసీలకు కూడా తెలిసిపోతున్నాయి. ఎలా బయటకి వస్తున్నాయి ఇవి' అని కోపంగా బలగాన్నంతా సమావేశపరిచి కీచకుడు అడిగాడు. రాజు దగ్గర ఎవరైనా కొత్తగా చేరారా అని ఆరా తీసి 'జూదగాడు' చేరాడనేసరికి అయితే ప్రమాదం లేదని జూదశాలలు, పానశాలలుపెంచి, ఆడవాళ్లకు విలాసినులుగా తయారుచేసి, ఆదాయమార్గాలు పెంచమని చెప్పడం అతడి మానసిక దౌర్బల్యాన్ని, అరాచకత్వాన్ని తెలియజేస్తోంది. ఈ సందర్భంలో రాజకీయ స్థితుల్ని వ్యంగ్యంగా ధ్వనించేలా అనిపిస్తోంది.

కీచకుడు గ్రామంలో పర్యటించాడు. దారిపొడుగునా మనోహరమైన దృశ్యాలు కనబడు తున్నాయి. జూదశాలలో జూదగాళ్ళు, పందేలదగ్గర వివాదాలువచ్చిన వాళ్ళు. ఒకరినొకరు బూతులు తిట్టుకుంటున్నవారు కనబడతారు. వాళ్ళందరి దగ్గర కీచకుడి భట్లు పన్నులు వసూలు చేస్తుంటారు. వాటి అన్నిటిని కీచకుడు చూసి, చాలా వైభవంగా ఉంది మన రాజ్యం అని గర్వంగా పర్యటన ముగిస్తాడు. ప్రజల బాగోగులు పట్టించుకోని నాయకుల్ని విమర్శించేందుకు కీచకుణ్ణి రచయిత్రి ప్రతీకగా వాడినట్లుంది. అందుకే పిచ్చిచావు చచ్చినట్లు కీచకుణ్ణి భీముడు నవ రంధ్రాల్లోంచి నెత్తురు కాలువలు కట్టగా వికృతమైన చావు చచ్చినట్లు చివరకు వివరగా తెలిపింది.

భీముడి పాత్ర పోషణ విషయంలో ప్రత్యేకత ఉంది. వలలుడు పేరుతో భీముడు వంటలు చేసేవాడుగా విరాటరాజు కొలువులో చేరాడు. మల్లులతో కుస్తీలు పట్టడం, ఖాళీ సమయాల్లో పులులతో పోరాటం చేయడం ద్వారా ఆనందాన్నిస్తాడు. పాండవులదగ్గర పని చేసినట్లు చెప్పుకున్నాడు. భీముడి వర్ణన ప్రత్యేకతంగా ఉంది. నడుంచుట్టూ కట్టుకున్న అంగవస్త్రం తప్ప ఒంటిమీద మరోవస్త్రం లేదు. అంగవస్త్రంమీద అక్కడక్కడ పసుపు మరకులూ, పులుసు మరకలు ఉన్నాయి. ముఖంలో అందమూ, వర్చస్సూఉన్నా, చూపు, మాట, నడక అన్నీ అనాగరికంగా మొరటుగా ఉన్నాయి. కీచకుడు భీముణ్ణిరప్పించి

పాండవులగురించి ఆరాతీస్తాడు. బండబ్బాయి లాగ దబ్బుదబ్బున అడుగులు వేసుకుంటూ, వలలుడు కీచకుడికి దగ్గరకు వస్తాడు. ఈ సందర్భంలో అచ్చమైన అనాగరిక పాత్రలా చిత్రించడం పాత్రౌచిత్యంగా కనబడుతోంది.

కీచకుడు కూచోమనగానే చేతిలో ఉన్న గరిటె ఒళ్లో పెట్టుకొని, నేలమీద దబ్బున భీముడు కూర్చున్నాడు. ఇంతగరిటె కావాలా? అని కీచకుడు అడిగితే "ఓర్నాయనో! రోజు రోజూ వేలమందికొండాలి! కొండల్లాంటి గుండిగలు, గదల్లాంటి గరిటెలు, మానుల్లాంటి రోకళ్ళు. అన్నీ అట్టాగే ఉంటయ్యండి! అట్టా ఉంటేనే, నేనొండుతా! థూత్తెరి! ఆడగానిలాగ చిన్న గరిటలట్టుకొంటానేటండీ!"(పుట.75) అని అంటాడు. వంటలో మొగసిరి చూసి కీచకుడికి నచ్చాడు. పాండవులు దొరికితే గుర్తుపడతానని వాళ్ళే రాజులమందిరంలోనో ఉంటారని వెళ్ళటానికి తన లాంటి వాళ్లని లోపలకు రానీయక ప్రాణాలు తీసేస్తారని అంటాడు. చివరకు మీలాంటి మంచోళ్ళు ఉండరండి అని ఒక పొగడ్త వేసాడు. దీంతో కీచకుడి అహం చల్లారి భీముడికి అనుకూలంగా మారతాడు.

కీచకుడు పొగడ్తలకి లొంగాడని తెలుసుకుంటాడు భీముడు. మాటల సందర్భంలో చాలా జాగ్రత్తగా మాట్లాడతాడు. "హమ్మో! మిమ్మ తలవనోళ్ళు ఈ దేశంలో ఉన్నారేంటండీ! ఎవరి నోటిన్నా తమరి ఊసే! ఆ మాటలన్నీ యింటే, తమరి తల తిరిగిపోతాదండి" (పుట. 76) అని చాలా అమాయకంగా అంటాడు. ఈ మాటలకి చాలా ఆనందిస్తాడు కీచకుడు. నిజానికి ఈ మాటల్లో కీచకుడి అరాచకాలను వ్యంగ్యంగా సూచించడం రచయిత్రి ప్రత్యేకత.

కీచకుడు పాండవుల గురించి చాలాసేపటినుంచీ భీముణ్ణి రప్పించి ఆరాతీస్తున్నాడు. భీముణ్ణే పాండవుల్ని వెతకమని పంపించే స్థితికి కీచకుడు చేరిపోయాడు. దాన్ని గ్రహించిన భీముడు చాలా జాగ్రత్తలో తప్పించుకుంటాడు. యమునానదికి అవతలున్న కొండవాళ్ళ దగ్గర మాయలు, మర్మాలు ఉంటాయని అవి తనకు తెలీవని, సైనికులకి వంటలు చెయ్యాలని, 'తమ దయండి' అంటూ కీచకుడి కాళ్ళు పట్టుకొని బావురమని ఏడ్వడం మొదలు పెట్టాడు. దాంతో కీచకుడు వలలుణ్ణి పూర్తిగా నమ్మేసాడు. ఒకవేళ నమ్మించలేక పోతే భీముడి వల్ల అజ్ఞాతవాసం భంగం అవుతుంది అని ఇలా భీముడిచేత రచయిత్రి చేయించారు. ఈ సన్నివేశాన్ని చేయడానికి బలవంతుడైన భీముడు చేయక తప్పలేదు. కేవలం తనవల్లే అజ్ఞాతవాస భంగం కలగకూడదని భీముడు భావించాడు. అందుకే ఇలా చేసాడు అని తెలుస్తోంది.

కీచకుడు ద్రౌపదిని తన్నినపుడు కోపంతో కీచకుణ్ని చంపేసేవాడు. కానీ, ధర్మరాజు భీముడి ఆవేశానికి అడ్డుకట్టవేసాడు. అందుకే అగాడు. ఈ నవలలో భీముడు బండబ్బాయిలా ప్రవర్తించినా ద్రౌపది రక్షణవిషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాడు. అవసరమైన చోట్ల బుద్ధిని కూడా ఉపయోగించాడు. కీచకుడికి ముందు ఏమీ తెలియని అమాయకుడిలా ప్రవర్తించడం కొత్త అంశం.

అభిమన్యుడిపేరు దేవలుడుగా రచయిత్రి చెబుతుంది. కీచకుడి అరాచకాలు ఎక్కువై ప్రజలు చాలా ఇబ్బందులు పడతారు. కీచకుడి అరాచకాల్ని ఎదిరించడానికి యమునానదికి దగ్గర ఉండే అడవిలో కోతులకు ప్రత్యేక శిక్షణ నిప్పించి, అక్కడ దేవలుడు ఉంటాడు. అది శత్రు దుర్భేద్యంగా ఉండేలా చర్యలు తీసుకుంటాడు. ఒకసారి ఉత్తర రైతువేషంలో వచ్చి దేవలుణ్ణి కలుస్తుంది. కీచకుడి అరాచకాలన్ని ఆమెకు చెప్పి, 'రక్తకాళి'పేరుతో ఎవరు ఏ సహాయం అడిగినా చేయమని కోరతాడు. అక్కడనించి దేవలుడంటే ఉత్తరకు ఇష్టం, అభిమానం పెరుగుతాయి.

రాజకుమారి! అని ఉత్తరని పిలిచినప్పుడు నాకురాజ్యం లేదు. ఉన్న రాజ్యం మత్స్య రాజ్యం. అది కీచకుడు మానాన్నకి సంపాదించినది. నేను నీతో చేతులు కలిపి మావయ్యని, అదే కీచకుణ్ణి ఎదిరిస్తున్నాను. గెలిస్తే, నీతోపాటు ఈ రాజ్యం వదిలి వచ్చేస్తాను. ఓడితే నా ప్రాణాలు పోతాయి. ఎలా అయినా నేను రాజకుమారిని కాను అని అంది. ఉత్తరమాటలకు దేవలుడు ఆమె చెవిలో 'నా ప్రేమ రాజ్యానికి' అని చెప్పడం ఉత్తరని ప్రేమిస్తున్నట్లు రచయిత్రి పాఠకుడికి తెలియజేస్తుంది. రాజ్యం మీదే మీ నాయకుణ్ణి మీరే ఎన్నుకోండి అని కంకుభట్టు అన్నప్పుడు అందరూ దేవలుడి పేరు చెప్పినా, దేవలుడు రాజుగా ఒప్పుకోలేదు. నేను రాజుగా ఒక ప్రాంతం లోనే వుండడానికి వీల్లేదు. ఇలాంటి కీచకులు ఎందరో ఉన్నారని చెప్తూ, దేశసంచారం చేయాలని నిర్ణయించుకుంటాడు. ఇలా అరాచకాల్ని ఎదిరించడానికే పుట్టిన వ్యక్తిత్వం ఉన్న పాత్రగా దేవలుడు కనబడతాడు. ఇలా ఉత్తమ ఉద్యమకారుడిగా దర్శనమిస్తాడు.

ఇలా అయా పాత్రచిత్రణలో సామాజికాంశల్ని స్పృశిస్తూనే అక్కడి అరాచకాల్ని ఎదురించగలిగే వ్యక్తులు తయారవ్వాలని రచయిత్రి ఆకాంక్ష. సంయమనం, ఎదిరించే ధైర్యం పథకరచనద్వారా సంపాదించవచ్చు. తద్వారా కీచకుడిలాంటి దుష్టశక్తుల్ని ఎదిరించ వచ్చని సూచించే నవలగా ఇదా భారతం కనిపిస్తోంది.

పైన పేర్కొన్న నవలల్లో కల్పితపాత్రలు ఎక్కువగా ఉన్న నవలగా పర్వ ను చెప్పొచ్చు. రచయిత చాలా ప్రదేశాలు తిరిగి అక్కడ ఉన్న పరిస్థితులను గమనించాడు. కాబట్టే ఆయా అంశాలకు తగినట్లుగా పేర్లు కల్పించి సహజత్వాన్ని ఆపాదించే ప్రయత్నం చేసాడు. ఇదా భారతంలో భారతకథను ఎలా చూడాలో ఓ సూచనగా కనబడుతోంది. ఇప్పటివరకు పేర్కొన్న నవలల్లోని వర్ణనలు ఏ విధంగా ఉన్నాయి ఆయా నవలలోని మార్పులు చేర్పులు గురించి తరువాత అధ్యాయంలో గమనించవచ్చు.

# అధ్యాయం- 5

# అధ్యాయం- 5

5

# 5. నవలల్లో వర్ణనలు- మార్పులు- చేర్పులు

## 5. 1. *ఇదా భారతం?* నవల వర్ణనలు - మార్పులు, చేర్పులు

ద్రౌపదిని సాధారణ స్త్రీలా చిత్రించడం ఈ నవలలో కనబడుతోంది. 'సాధారణ రాణుల్లా అలంకరించుకుంటూ, పనికి మాలిన కబుర్లు చెప్పుకుంటూ, సోంబేరులా అంత:పురంలో కూచో లేదు. అంతా తానే అయి తిరిగింది. అందరిఅవసరాలూ సమకూరేలా చూసింది. అన్ని విషయాలూ స్వయంగా పర్యవేక్షించింది. ఒక్కొకసారి ఆమె భోజనానికి కూచునేసరికి, అర్థరాత్రి దాటేది. లేనిపోని సిగ్గులూ, సంకోచాలూ ముసిముసి నవ్వులూ, తెరవెనుకకు తప్పుకోటాలూ మొదలైనవి ద్రౌపది దగ్గర ఉండేవి కావు' అంటూనే చివరకు మారుతోన్న సాంఘిక ధర్మానికి విరుద్ధంగా సోదరులైదుగురికీ భార్య అయినా, సమాజంలో 'మహాపతివ్రత ద్రౌపది' అనిపించుకుంది. ఈ వర్ణన మూలంలోని ద్రౌపదికి సాధారణత్వాన్ని ఆపాదించి, ఈ కాలంలోని ధనవంతులను వ్యంగ్యంగా విమర్శిస్తున్నట్లు కనబడుతోంది. అన్నీ తానై తిరగడంలో ప్రత్యేకత కూడా గమనించదగింది. ఇక్కడ ద్రౌపది ఒక సామాన్య మైన స్త్రీలా, నిత్య చైతన్యత్వం కూడా కలిగి ఉన్నట్లు కనబడుతోంది.

'దేవుడు' పేరుతో అభిమన్యుడు కీచకుడి అరాచకాలను అరికట్టడానికి ఉంటాడు. ఉత్తర అంత:పురంనుంచి తప్పించుకొని వెళ్ళడం, బయట ఒక కీచకభటుడు మారువేషంలో ఉన్న ఉత్తర వస్త్రాలను లాగడం, వెంటనే ఒక వ్యక్తి (దేవుడు) వేగంగా వచ్చి, ఆ వస్త్రాలు లాగుతున్నవాడి తల ఖండించడం జరుగుతుంది. ఇది మూలంలో లేని విషయం.

కీచక సైనికుల్లో ఒక సైనికుడు దేవుడికి సంబంధించిన విషయాలు సేకరించుకొని రాలేదని వాణ్ణి కోపంతో సైనికాధికారి కొట్టారు. ఒళ్ళంతా గాయాలయిన ఆ సైనికుణ్ణి ఉత్తర రక్షించి స్వయంగా వనమూలికల చూర్ణాలు పూసింది. చివరకు దురంహంకారులైన సైనికాధికారుల చేతిల్లో దుర్భరమైన బ్రతుకుబ్రతికేకన్నా, దేవుడి దగ్గరికి వెళ్ళు!(పుట. 49)నీ సమస్యకు పరిష్కారం దొరుకుతుందని ఉత్తర చెప్పడం. భయం అవసరం లేదని ఆ సైనికుడితో మాట్లాడడం కొత్త అంశం.

రాజకుమారికి ప్రత్యేక భంగిమలు నేర్పాలి అని బృహన్నల చెప్పి అక్కడున్న స్త్రీలను అందరని విశ్రాంతి తీసుకోమని చెప్పాడు. 'తధిగిణతోం!...ఏం జరిగింది?' తళాంగుతకధిణ... సైనికుడిని 'దేవుడు' దగ్గరకు పంపించాను. తయ్యం, తకతై...ప్రజలకోసం రాజు...,రాజుకోసం ప్రజలు కాదు! ఈ విషయం అందరికీ తెలిసేలా, అందరికీ అర్థమయ్యేలా ప్రచారం చెయ్యాలి!. తకిట, తకిట...లాభంలేదు. మనదేశంలో ఎవరూ సొంతంగా ఆలోచించరు. ఏ దేవుడో ఉపదేశం ఇస్తే, లెంపలేసుకుంటారు. కళ్ళు మూసుకుని బ్రతికేస్తారు. తకధిణ! తకధిణ! గణతంత్ర రాజ్యమే భారతదేశానికి ఆదర్శం!...'(పుట.50) అంటూ ఉత్తర బృహన్నలలకు సంభాషణ, నాట్యం రెండూ ఒకేసారి జరగడం ఉంది. ఇది మూలానికి వన్నె తెచ్చిన మార్పు.

ఉత్తర, ఉత్తర కుమారుడివేషంలో కీచకుడు బంధించిన రాజకుమారులను విడిపించింది. ఆ విషయం ఉత్తరుడి ముద్రికను ఉపయోగించి ఉత్తర చేసింది. కీచకుడు లేని సమయంలో ఈ సంఘటన జరిగింది. ఉత్తరుడే రాజపుత్రుల్ని తీసుకురమ్మన్నాడని చెప్పాడని, రాజపుత్రులను వెంటబెట్టుకొని రథంలో తీసుకువెళ్ళాడని జైలు అధికారి వీపుమీద కొట్టించి కీచకుడు రాబట్టాడు. అది అబద్ధం నేనిక్కడే ఉన్నానని, ఎవరితో రాధికతోనా... కాదు కాదు విభావసితో... అంటూ నిలువెల్లా వణికిపోతూ ఉత్తరుడు నోటికొచ్చి నట్లు మాట్లాడుతున్నాడు. ఆ తర్వాత కీచకుడు ఉత్తరుడితో కేళిమందిరంలో ఉండే విలాసినీ జనమందరనీ కీచకుడు రప్పించాడు. పూర్తిగా నగ్నంగా నిలబెట్టి కొరడాలతో అతి సున్నితమైన ప్రదేశాలలో కొట్టి వారిని ప్రశ్నించారు సైనికాధికారులు. ఈ వర్ణన మూలంలో లేదు. ఇది కీచకుడి ఆగడాలను సూచించడానికి రచయిత్రి కల్పించారు.

'రక్తకాళి' అనే పదంతో ఎవరైనా వచ్చి, సహాయం అడిగితే తప్పకుండా చేయాలనే సంకేతాన్ని అభిమన్యుడు ఉత్తరకి చెబుతాడు. తద్వారా వారంతా కష్టాలనుంచి బయట పడడం లేదా సేవలు పొందడం రచయిత్రి చేసిన మరో మార్పు.(పుట. 57)

కీచకుడు భేతాళుణ్ణి ఆవాహనచేసుకోడానికి ప్రయత్నించి సఫలుడౌతాడు. నేను శక్తిని కాను భావాన్ని! నీ మనసులో భయంకానీ, బెదురుకానీ, దైవభీతికాని ప్రవేశించిన మరుక్షణం నేను మాయమౌతాను అని హెచ్చరించాడు. మనస్సులో యమునానదికి అవతలఉన్న అడవులను తలచుకొని స్థలదర్పణంలో చూసాడు. అక్కడ శాఖోపశాఖలుగా పెరిగిన చెట్లు, వాటి మీద భయంకరమైన విషసర్పాలు, చెట్లమీదకు ఎక్కి తలకిందులుగా వేలాడే ఎలుగు బంట్లు, ఘీంకరిస్తున్న ఏనుగుల గుంపు, జుగుప్సావహమైన ముళ్ళపందులు కనిపించాయి. ఆ అరణ్యం మధ్య ఒక చదును ప్రదేశంలో ఎముకల కుప్పలు, మరో చోట పుర్రెలు, బంగారు ఉంగరాల వేళ్ళతో పడిఉన్నచేతులు! నల్లగా గెడ్డకట్టిననెత్తురు మడుగులు! ఝుమ్మని రొద చేసుకుంటూ తిరిగే విషకీటకాలు! కనిపించాయి. (పుట. 66)ఈ వర్ణనలో కీచకుడి జీవితం త్వరలో ముగిస్తుంది అనే సూచన కనిపిస్తోంది. ఈ వర్ణన మూలంలో లేదు.

కీచకుడి అరాచకాలను చెప్పుకోడానికి ప్రజలు విరాటుణ్ణి కలవడానికి రాజ భవనానికి వచ్చారు. ఆ విషయాన్ని పరిచారికలు మాట్లాడుకుంటున్నారు. కీచకుడు అధికారం చెలాయించటం వచ్చాక దేశం మరీ అన్యాయమయిపోయింది. గూండాలు చెలరేగి ఊళ్ళలో ఆడవాళ్లని పీడిస్తున్నారట! మానభంగాలు సామాన్యమయిపోయాయట! గ్రామ పెద్దలు కూడా కీచకుడికి బెదరి న్యాయం జరిపించటం లేదట! అంచేత చిన్నచిన్న గ్రామాల్లో ఆడవాళ్లందరూ ఏకమయి రాజుతో తమ కష్టాలు చెప్పుకోడానికి వస్తున్నారు.' (పుట. 80)ఆ మాటలు విన్న ఉత్తర మానభంగం అంటే ఏమిటని వాళ్ళను అడిగింది. ఆ పరిచారికలు దూరంగా ఉన్న జనంవైపు చూపించారు.

రాజభవనం దాటి, సైనికుల కళ్ళుగప్పి, ఎలాగో రోడ్డుమీదకు ఉత్తర వచ్చేసింది. కుతూహలంతో కూలీలు పాడుతున్న పాటలు వింటోంది. ఆమెకు ఆ పాటలు అంతకు ముందు పరిచయం లేవు. ఆ ప్రజలు పాడుతూ కొందరు చెమ్మగిల్లిన కళ్ళు తుడుచు

కుంటున్నారు. ఈ వర్ణనలలో ఉత్తర అమాయకత్వాన్ని తెలియజేస్తూనే కీచకుడి అరాచకాలను, విరాటుడి అస్వతంత్ర పాలనను రచయిత్రి విమర్శిస్తున్నారు. ఇది అమూలకం.

ఉత్తర ఒక సామాన్య రైతు వేషం వేసుకొని, రాజవీధి వదిలి బయటకు వచ్చేసింది. ఒక గృహిణి కడవలో నీళ్ళు తెచ్చుకుంటోంది. ఆమెను బలవంతంగా ఒక సైనికుడు లాగి, గుర్రం ఎక్కించి, దానిని పరిగెట్టించాడు. గుర్రానికి ఒకసేవకుడు అడ్డంగా వచ్చాడు. అతడి మీదకు గుర్రాన్ని ఉరికించబోయాడు. ఆ సేవకుడు విచిత్రమైన శబ్దం చేసేసరికి, గుర్రం వెంటనే పది అడుగులు వెనక్కి నడిచింది. గుర్రం తనమీద ఉన్న సైనికుణ్ణి పడేసి, ఆ సైనికుడిమీద గిట్టలతో నాట్యం చేసింది. చివరకు వాడు చనిపోయాడు. ఆ సేవకుడు ఎటో వెళ్ళిపోయాడు. ఇందులో కీచకుడి సైనికులు చేస్తున్న అఘాయిత్యాలను వివరించడం, దేవుడి పేరుతో మారువేషంతో అభిమన్యుడు ప్రజలను కాపాడడం కూడా ఈ సన్నివేశంలో వివరించారు. ఇది అభిమన్యుడు సేవకుడి వేషాన్ని వివరించిన వర్ణన. మూలంలో ఉత్తరను కలవడానికి మారువేషాల్లో అభిమన్యుడు వస్తుండేవాడు. ఇది మూలానికి వన్నె తెచ్చిన అంశంగా చెప్పొచ్చు.

కీచకుడు ద్రౌపదిని వశం చేసుకోవాలని భేతాళుణ్ణి కోరాడు. అప్పుడే ఉత్తర కీచకుడి భవనం చేరుకుంది. ఇప్పుడు ఎందుకు వచ్చావని ఉత్తరను గద్దించి కీచకుడు అడుగుతాడు. ఎవరో ఒక విచిత్రమైన స్త్రీవస్తే చూడడానికి వచ్చానని, భయపడుతున్నట్లు అభినయస్తూ చెబుతుంది. ఆ భయానికి తగినట్లుగా గోడమీద పడిన ఒక లతయొక్కనీడను చూపిస్తుంది. అది ఆదిశక్తిగా కీచకుడు భయపడతాడు. వెంటనే కీచకుణ్ణి భేతాళుడు వదిలేస్తాడు. భేతాళుడు ఆవహించినప్పుడు కీచకుడు రౌద్రంగాను, చింతనిప్పు కళ్ళతోను కనబడినట్లు రచయిత్రి వర్ణించారు. ఆ తరువాత భేతాళుడు జరిగిన విషయం చెబుతూ స్థల దర్పణం చూపగలను- కానీ, కాల దర్పణం చూపలేను. మానవ మనో దర్పణం మాత్రం చూపించలేను, నేను చూడలేను. ఇక నిన్ను వదిలి పోతున్నాను అని భేతాళుడు కీచకుడికి చెప్తాడు. ఇది అమూలకం.

కీచకుడు తనను ఉత్తర వంచన చేసిందని తెలుసుకున్నాడు. ఎలాగగైనా మాలినిని పట్టుకోవాలని బయటకు పరుగు తీసాడు. రాజభవనం చేరిన మాలినిని జుత్తుపట్టుకొని లాగి, ఒక్క తన్ను తన్నాడు. ఆమె దబ్బున నేలమీద పడింది. కానీ, కిందపడబోయేముందు, కీచకుణ్ణి కాలితో తన్ని మరీ పడింది. కీచకుడుకూడా మాలినికి దూరంగా దబ్బున నేలమీద పడ్డాడు. సభ నిశ్శబ్దమయింది.

ఈ విషయం మూలంలో సుధేష్ణను మదిరనుకీచకుడి దగ్గరనుంచి తీసుకురమ్మని మాలినికి చెబుతుంది. మాలిని కీచకుడి దగ్గరకు వెళ్తుంది. మదిరను ఇమ్మని కీచకుణ్ణి మాలిని తొందర పెడుతుంది. మరొకరు తీసుకువెళ్తారని కీచకుడు ఆమె ఉత్తరీయాన్ని పట్టుకున్నాడు.

'ప్రగృహ్యమాణాయ మహాజవేన, ముహుర్వ్యిని: శ్వస్యచ రాజపుత్రే
తయా సమాక్షిప్తతను: స పాప:, పపాత శాఖీవ నికృత్త మూల:'

(మహాభారతమ్, 4-16-శ్లో.8)

కీచకుడు ఆ విధంగా పట్టుకుంటుండగా ఆ రాజపుత్రి(మాలిని) నిట్టూర్పువిడుస్తూ, మిక్కిలి వేగంగా విదలించుకొని కొట్టింది. అప్పుడు కీచకుడు మొదలు నరికిన చెట్టులా కూలాడు. ఆ విధంగా పడిన వెంటనే మాలిని  వణికిపోతూ, రక్షించమని రాజభవనానికి వచ్చింది.

'తాం కీచక: ప్రధావన్తీం కేశపాశే పరామృశత్
అథైనాం పశ్యతో రాజ్ఞ: పాతయిత్వా పదాదధీత్'

(మహాభారతమ్, 4-శ్లో.10)

పరుగెత్తుతున్న మాలినిని వెంటాడి కీచకుడు జుత్తుపట్టి, రాజు చూస్తుండగా మాలినిని కిందపడేసి కాలితో తన్నాడు. ఆ తరవాత సూర్యుడు పంపించిన రాక్షసుడు వాయువేగంతో కీచకుణ్ణి దూరంగా  పడేసాడు.

ఈ సందర్భంలో కీచకుడు సభామధ్యలో మాలినిని తన్నినట్లు మూలంలో ఉంది. దాన్ని రచయిత్రి మార్చి, ముందే తన్నినట్లు దానికి ఉపబలకంగా మాలిని భీముడి దగ్గర మల్లయుద్ధపు పట్లు తెలుసుకున్నట్లు తెలిపారు. మూలంలో సూర్యుడు పంపించిన రాక్షసుడుమాత్రమే కీచకుణ్ణి దూరంగానెట్టేసినట్లు ఉంది. దాన్ని రచయిత్రి మార్చారు. ఇది ఆధునిక స్త్రీకోణంనుంచి రచయిత్రి చెప్పినట్లు భావించవచ్చు. ఇంకో అంశం అందర ముందు కీచకుడు మాలినిని తన్నడం అతడిలో అహం ప్రదర్శించి, ఆమె మీదఉన్న కోపాన్ని నెరవేర్చుకున్నట్లు తెలుస్తోంది. ఇది మూలానికి వన్నె తెచ్చిన అంశంగా చెప్పొచ్చు.

విరాటరాజు వినోదంకోసం వలలుణ్ణి పులితో బోనులో యుద్ధానికి ప్రవేశపెడతాడు. ఆ విషయాన్ని చూసిన ఉత్తర చాలా బాధపడుతుంది. బోనులోని ఒకవైపు ఉన్న ఊచలను ఊడదీసేస్తుంది. వలలుడి ధాటికి తట్టుకోలేక పులి ఊచలు ఊడదీసి ఉన్న వైపునుంచీ బయటకు వచ్చి రాణీవాసం మీద పడుతుంది. అప్పుడు చాకచక్యంగా భటుడి దగ్గరఉన్న బల్లేన్ని ఉత్తర తీసుకొని వలలుడి మీదకు విసురుతుంది. దాన్ని నేర్పుగా వలలుడు పట్టుకొని పులిని చంపేస్తాడు.

మూలంలో భీముడు విరాటరాజ కొలువులో జీమూతుడుతో మల్లయుద్ధం చేస్తాడు. అలా చాలామంది మల్లురతో యుద్ధం చేస్తాడు. ఎవరూ లేనిసమయంలో పులలతోను, సింహాలతోనూ, ఏనుగులతోను వలలుడు పోరాడినట్లు ఉంది.

'పునరన్త: పురగత: స్త్రీణాం మధ్యే వృకోదర:
యోధ్యతే స విరాటేన సింహైర్మత్తైర్మహాబలై: '

(మహాభారతం.4-శ్లో. 41)

విరాటుడు అంత:పుర స్త్రీల నడుమ గొప్పబలముతో మదించిఉన్న సింహములతో భీముణ్ణి పోరాడించెను అని ఉంది. దాన్ని రచయిత్రి పై విధంగా మార్చింది. నవలలో భీముడు సాధారణ బలశాలిగా అనిపిస్తాడు. ఉత్తర బల్లెం విసరడం, దాని సహాయంతో

భీముడు పులిని చంపడం ఉంది. మూలంలో భీముడు మహాబలశాలిగా ఉంటాడు. చేతి గుద్దులతోనే సింహాలను చంపుతాడు. ఇది మూలంలో ఉన్న భీముడి శక్తిని తగ్గించిన మార్పు.

మాలిని, ఉత్తర కలిసి నృత్య రూపకాలు రూపొందించి ప్రదర్శిస్తున్నారు. ఉత్తర విలువిద్య నేర్చుకుంది. దానిని అంతఃపురంలోని మిగిలిన ఆడవాళ్ళకు కూడా ఉత్తర నేర్పుతోంది. ఉత్తరుడు అది చూసి, భయపడి, మంచం కింద దూరిపోయాడు. అప్పుడు మాలిని మంచి కథ చెప్తాను రమ్మని అంటుంది. అప్పుడు మాలిని ఒక రాజపుత్రుడి కథను చెబుతుంది. తద్వారా ఉత్తరుణ్ణి చైతన్యవంతుడిగా చేస్తుంది. బాణాలు వేయడం ఉత్తరుడికి నేర్పుతుంది. ఇది మూలానికి వన్నె తెచ్చిన మార్పు.

మాలిని గురించి సుధేష్ణ ఇలా అనుకుంటుంది- మాలిని వచ్చాక, ఏదో నవచైతన్యం జీవితంలోకి వచ్చింది. జీవితం అంటే, ఎలాగో రోజులు గడిపేయడం కాదు. జీవితానికి అర్థం వుంది. అది తెలుసుకోవడం ద్వారా నిజమైన జీవితం ప్రారంభం అవుతుంది. ఇది సుధేష్ణలో ఆమె పట్ల ఉండే భావన. ఇది సార్వజనీన విషయంగా రచయిత్రి తెలుపుతోంది. ఇది అమూలకం. (పుట.71)

బకుడి గురించిన ప్రస్తావనలో- రాజు ఈ ప్రాంతప్రజలను పట్టించుకోడంలేదని ఏకచక్రపురంలోని విషయాన్ని కుంతి తెలుసుకుంది. భీముణ్ణి పంపిస్తానని కుంతి నివాసం ఉంటున్న వారికి మాట ఇచ్చింది. నా కొడుక్కి కనీసం ఈ ఒక్కరోజుకి కడుపునిండా తిండి పెట్టమని చెప్పలేక  చెప్పింది. వారు పెట్టిన భోజనం తిని భీముడు బకుడి దగ్గరకి వెళ్ళాడు. బండి దిగిరా అని భీముణ్ణి బకుడు గర్జించి అన్నాడు. నేను దిగలేను నువ్వు దింపు అని భీముడు అన్నాడు. చెయ్యి పుచ్చుకొని బకుడు భీముణ్ణి లాగబోయాడు. మల్లయుద్ధంలో ఎప్పుడూ శత్రువుకు చెయ్యి అందివ్వకూడదు. వెంటనే చెయ్య అందుకొని భీముడు అతణ్ణి బొక్క బోర్లాపడేలా నేలమీదకి తోసి, అతడి మీదకు దుమికాడు. (పుట. 22)ఇది నవలలోని అంశం. మూలంలో ఉన్న అంశాలకు మరింత వివరణను జోడించి రచయిత్రి వర్ణించారు.

మూలంలో 'వేతకీగృహం' అనే ప్రదేశంలో రాజు ఉంటాడు. మందబుద్ధితో ఉన్న ఆ రాజు ప్రజల కష్టాలను పట్టించుకోడు. దుర్బలుడైన రాజు యొక్క దుష్టరాజ్యం అది. దానిలో నివసించడం తగదు. కానీ మేం దానిలోనే ఉంటున్నాం. అన్నిటికన్నా మొదట మంచి రాజు, తరవాత భార్య, ధనాన్ని సంపాదించాలి. ఈ మూడు పొందిన తర్వాత జ్ఞాతులు, బంధువులు, పుత్రులు బాధలనుంచి రక్షించాలి అని నీతి శాస్త్రం చెబుతోంది. ఇలా విస్తారంగా ఉన్న విషయాన్ని (మహాభారతం, ఆదిపర్వం - బకవధపర్వం) ఈ సందర్భంలో రచయిత్రి సామాన్యంగా చెప్పారు.

## 5. 2. *ఇంద్ర సింహాసనం*- వర్ణనలు- మార్పులు :-

వృషపర్వుడి పురానికి కొంతదూరంలో ఉద్యానవనం ఉంది. ఆ ఉద్యానవనం

రాక్షసరాజ్యానికి, మానవరాజ్యానికి చెందింది కాదు. మానవులూ, రాక్షసులు ఆ ఉద్యానవన సరోవరంలో జలక్రీడలాడటానికి వస్తూ ఉంటారు. నగరానికి దూరంగా ఉన్న ఉద్యాన వనమంటే శర్మిష్ఠకు ఇష్టం. ఆ ఉద్యానవనానికి అవతలివైపు ఏముందో తెలుసుకోవాలని శర్మిష్ఠకుండేది. ఈ ప్రయత్నంలో రచయిత్రి శర్మిష్ఠగురించి కొంత వర్ణన చేసింది- 'శర్మిష్ఠ రాచకులంలో తప్పపుట్టిందా! అని అనిపిస్తుంది. కుమారిగా పుట్టినా, ఆమెకు రాజకుమార్తెకు సహజమైన అహంకారం, దర్పం మొదలైనవి లేకపోగా, ఆర్ద్రమైన హృదయం ఉంది. అలాగని భీరువుకాదు. సమయం వస్తే ఎంత సాహసమైనా చెయ్యగలదు'(పుటలు 9-10) అందుకే ఈ పాత్ర ప్రత్యేక ధైర్యం, సాహసం పర్యాయ పదాలుగా జీవితాన్ని సాగించింది. చెలికత్తెల కళ్ళుగప్పి, ఒంటరిగా కారడవిలోకి ప్రవేశించింది. ప్రతీరాత్రీ రహస్యసొరంగ మార్గంద్వారా ఒంటరిగా ఖడ్గ మాత్ర సాహాయురాలై యయాతికి కలుసుకోడానికి వెళ్ళేది. ఈ వర్ణన ప్రత్యేకంగా మూలంలో లేకపోయినా ఆ కథని అనుసరించి ఆ భావజాలం పాఠకుడికి తెలుస్తుంది. దాన్ని కొంత సహజంగా వివరించడం జరిగింది ఈ నవలలో.

దిక్పాలక పదవిలో ఉన్నకుబేరుడికి అంత సంపద ఎలా పోగుపడిందో ఎవరికీ తెలీదు. ఎవరి ఊహాగానాలు వారివి. అతడు అందరికీ పెట్టుబడి పెడతాడు. ముఖ్యంగా ఇంద్రపదవిలో ఎవరున్నా, అడిగినంత అప్పు ఇస్తాడు. ఎందుకైనా మంచిదని ఘంటాకర్ణుడనే పిశాచాన్ని తనకు అనుచరుడుగా ఉంచుకున్నాడు. దిక్పాలకుడికి- అందున, దేవలోక పాలకుడికి పిశాచాలుండం ఏమిటని అందరూ విడ్డూరంగా వ్యాఖ్యానించినా లక్ష్య పెట్టడు. కుబేరుడి అప్పు ఇచ్చినా వాళ్లు అధికారంలో ఉన్నప్పుడు అప్పుతీర్చమని అడగడు. అధికారం పోగానే అప్పు వసూలు చేయడానికి ఘంటాకర్ణుణ్ణి పంపిస్తాడు. ఘంటాకర్ణుడు ఏం చేసయినా అప్పు వసూలుచేసి తెస్తాడు. ఈ వర్ణనలో ప్రస్తుతరోజుల్లో వడ్డీలకి అప్పులిచ్చే పెత్తదార్లందర్నీ స్ఫురించేవిధంగా వర్ణిచడం కనిపిస్తోంది. కుబేరుడి గొప్పకు ఒక కారణాన్ని సోదాహరణంగా నిరూపించేలా వర్ణించడం ప్రత్యేకత.

కుబేరుడి అనుయాయులంతా భూలోకంలో కుబేరులుగా ఘంటాకర్ణుడి అనుచరులంతా గూండాలుగా భూలోకంలో ఇదే పనులు చేస్తుంటారు. అప్పు తీర్చడానికి అధికారపోడమే అర్హత. వడ్డీలు, చక్రవడ్డీలు వేసి ధనరాశుల్ని వసూలుచేస్తారు. మరికొందరు వర్తక, వ్యాపారాల పేరిట జనాన్ని దోచుకుంటారు. అయితే ఈ హాహాకార్యాలన్నీ సామాన్య జనంలోనే వినిపించడానికి అనేక కారణాలున్నాయి. వీటికి అనేక అవసరాలూ ఉన్నాయి. వాటిని తీర్చు కోడానికి డబ్బు కావాలి. అందుకే ఈ భూలోక కుబేరుల ఇనుప పిడికిళ్ళలో ఇరుక్కుని వారి గూండాలకు ఎర అవుతూ ఉంటారు. అయితే సామాన్య ప్రజలకు నిత్యావసరాలే తీరవు. కాబట్టి, వారి సంగతి ఎలా ఉన్నా, మాన మర్యాదలకు కట్టుబడి గుంభనంగా జీవితాన్ని సాగిస్తున్న మధ్యతరగతి ప్రజలు అడకత్తెరలో పోకచెక్కల్లా నలిగిపోతున్నారు. దేవుళ్ళకూ, నిర్భాగ్యులకూ మధ్య పూజారులు లెక్కలేనంతమంది. ఎక్కడాలేని సదుపాయాలు ఆ పూజారుల దక్షిణలకే చాలకపోడంవల్ల నిరుపేదలకి శూన్యహస్తాలే మిగిలాయి. ఈ సుదీర్ఘ వర్ణనలో భూలోకంలో, దేవలోకంలో జరిగిన ఆర్థిక దోపిడిని పురాణ, ఆధునిక కాలాల్లో జరిగిన దోపిడీ స్ఫురణకు వచ్చేలా వర్ణించారు. పేదవాడిస్థితి, అధికారుల, ధనస్వాముల దోపిడిని వర్ణించడం సామాజికాంశంగా

కనబడుతుంది. ఇదంతా అమూలకం.

ఇంద్రాణి దేవలోకం నుంచి వచ్చి దేవయానిని కలవాలని అనుకుంది. ఆమె భవనానికి వెళ్ళింది. శుక్రుడి కూతురు దేవయాని, శచీదేవికి మనుమరాలు కూడా. శుక్రాచార్యులు దానవులకి గురువు. తపస్సు చేస్తున్నప్పుడు అతడు ప్రత్యేకంగా అరణ్యాలకు పోయి ఆశ్రమంలో ఉంటాడు. కానీ, మిగిలిన సమయాల్లో తన దివ్య భవనంలో ఉంటాడు. ఆ భవనం మయుడు నిర్మించిందే. వృషర్వుడు శుక్రాచార్యుడికి రాజ్యం తనకంటే ఎక్కువ గౌరవభోగాలు కలిగిస్తాడు. అతడి ఆజ్ఞల్ని అనుసరించే వృషపర్వుడు మయుడిచేత అపూర్వభవనాన్ని నిర్మించేలా చేసాడు. ఎటుచూసినా గోడలలో ప్రతిబింబాలు కనిపిస్తూ అదొక అద్భుత ప్రపంచలా ఉంటుంది. క్రీడా సరోవరాలతో క్రీడా శైలాలతో అందమైన ఉద్యానవనం ఉంది. గృహ ప్రాంగణంలో జలధారలు పైకెగజిమ్మే యంత్రాలున్నాయి. పైకెగసే ఆ ధారాల్తో చిత్ర వర్ణాలు ప్రతిఫల్తిస్తు ఎంత చూసినా తనివి తీరని సౌందర్యాన్ని సృష్టిస్తున్నాయి.(పుటలు.82,83)

ఆ శుక్రాచార్యుల భవననిర్మాణంచూసిన ఇంద్రాణికి ఆశ్చర్యాన్ని కలిగించింది. కేవలం ఒక బ్రాహ్మణుడి ఇల్లు ఒక రకంగా ఇంద్ర భవనంలా ఉండడం విచిత్రంగా అనిపించింది. ఇది ఒక రకంగా తన మనుమరాలు, దేవయాని ఉండే ఇల్లు అని లోలోపల ఆనందంకూడా పొందింది. చివరకు బృహస్పతికి మించిన వైభోగాలకోసమే కదా శుక్రుడు రాక్షసుల్ని చేరింది అని అనుకొంది. ఈ వర్ణనలో శుక్రుడి గొప్పదనం, ఇంద్రాణిని ఆశ్చర్యపరచడం ఒక అంశం. ఇంత పెద్ద ఇంట్లో ఉన్న దేవయానికి గర్వం ఉండడం సహజమే అనిపిస్తోంది. ఇంద్రాణి కూతురుతో (జయంతి) వీరిద్దరూ ప్రేమించుకున్నారు. ఆ విషయం ఇంద్రుడికి తెలిసి, ఆ ప్రేమను నిరాకరిస్తాడు. శుక్రుడు తను ప్రేమించిన జయంతి దొరికిందని ఆమెతో కలవడానికి ఉత్సుకత చూపిస్తాడు. దాని ఫలితమే దేవయాని పుడుతుంది. తను ప్రేమించిన కచుడు తనకు దొరకలేదని, తనతండ్రి, విశ్వామిత్రుడుమాత్రం ప్రేమించిన జయంతిని పొందడంవల్ల ఉదాత్తుడుగా దేవయాని భావిస్తుంది. ఇది మూలంలో ఇంత వివరణాత్మకంగా లేదు.

శుక్రాచార్యుల తపస్సును భంగపరచడానికి మేనకని నహుషుడు పంపాడు. ఈ లోగా ఇంద్రాణి హేమద్వారా మయుడికి చెప్పించింది. ఆ విషయం శుక్రాచార్యులకు తెలపమని పంపింది. జనసంచారంలేని మహారణ్యంలో శుక్రుడు తపస్సు చేసుకుంటున్నాడు. మయుడు శుక్రాచార్యుల దగ్గరికి వెళ్ళాడు. శుక్రుడికోసం సాయంత్రం వరకూ వేచి ఉండి, మేనక తపోభంగం చేయడానికి రాబోతుందని చెప్పి వెళ్ళిపోయాడు. అప్పుడ ఆ ప్రాంతాన్ని రచయిత్రి ఇలా వర్ణించింది- 'కికారణ్యంలో చెట్ల ఆకుల సందునుండి వెన్నెల రేఖలు దివినుంచి భువికి జారుతున్న ఉయ్యాలలాగ ఉన్నాయి. సాధు జంతువులు నిశ్చింతగా ఆశ్రమ ప్రాంతాన నిద్రిస్తున్నాయి.

క్రూరజంతువులు ఆశ్రమ ప్రాంతాలకు రాకుండా దూర దూరాన వేటాడుతున్నాయి. ఎక్కడో కొండకొమ్మనుండి కిందకు పడుతోన్న జలధార శబ్దం. ఆ ప్రశాంత నిశీధిలో ఏదో

మధురగానం... అలలు అలలుగా పరిసరాల్ని కమ్ముకుంటూ, తన మాధుర్యంతో ఆ వాతావరణాన్ని ముంచెత్తుతున్న గానం. శుక్రాచార్యులు కళ్ళు తెరిచాడు. పర్ణశాలకు దూరంగా వెన్నెల కిరణలమధ్య చెట్టునానుకొని పాడుతున్న మేనక కనిపించింది. (పుట.91) అందమైన వెన్నెల చక్కటిపాట నిశ్శబ్దపు ప్రాంతంలో ఎలా ఉంటుందో ఇక్కడ వర్ణన చేసి పాఠకుడి హృదయంలో ఆ ప్రశాంత ఏకాంతత మరింత ఆనందాన్ని తెచ్చి పెట్టినట్లు ఉంటుంది.

యయాతి దేవయానిని నూతిలోనుంచి రక్షించి వెళ్ళిపోయాడు. చాలా రోజుల తర్వాత శర్మిష్ఠదాసిగా చేసుకొన్న దేవయాని కనిపించింది. ఆరోజు యయాతి దక్షిణ హస్తంతో దేవయాని వామహస్తం అందుకున్నందువల్ల పెళ్ళయిపోయిందని, దేవయాని యయాతికి చెబుతుంది. ఎలాగైనా శర్మిష్ఠను దేవయాని దాస్యంనుంచి రక్షించాలని అనుకొంటాడు. దేవయాని బ్రాహ్మణ కన్య, యయాతి రాజు పెళ్లి సాధ్యంకాదు. అధర్మమని యయాతి దేవయానిని ప్రశ్నిస్తాడు. దానికి దేవయాని శుక్రచార్యులు ధర్మనిర్ణేతగా అతడి నిర్ణయం చెబితే అంగీకరిస్తానని యయాతి ఒప్పుకుంటాడు. ఆ సందర్భంలో రచయిత్రి ప్రేమశక్తిని, హృదయ సంఘర్షణని చక్కగా వర్ణించారు- 'శుక్రాచార్యుల అమోఘ తపశ్శక్తిని అండగా చేసుకొని. ఉచితానుచితాలు పాటించకుండా తన అహంకారాన్ని ప్రదర్శింస్తుందీమే (దేవయాని). ఇంద్రియనిగ్రహంతో కఠోర దీక్షతో తపస్సుచేసి, ఎంతో ఆత్మశక్తి సంపాదించిన శుక్రాచార్యుడిలో ఈ పుత్రికా వ్యామోహం... ఒకప్పుడు జయంతిమీద (ఇంద్రుడి కూతురు) ప్రేమ! ఆహా! ఈ ప్రేమ ఎంత విచిత్రమైంది. జీవితంలో కష్టసుఖాలన్నిటికీ ఇదేమూలం. మానవుణ్ణి ఉన్నత పథాలకు తీసుకుపోడానికైనా, అథఃపాతాళానికి కృంగదీయడానికైనా ఇదే కారణం. జీవితంలోని ఏ దశలోనైనా మనిషిని వెన్నంటే ఉంటుంది ఈ మహత్తరశక్తి!.

అద్భుత తపస్సంపన్నుడైన శుక్రాచాడ్యుడిలో ఈ వ్యామోహమే లేకపోతే అతడింకా ఎంతటి ఔన్నత్యాన్ని పొందేవాడో! అసాధారణ శక్తితో పాటు, వెన్నంటి వదలని బలహీనతలు మానవ హృదయాన్ని నిరంతర సంఘర్షణతో నలిపివేయబట్టే మనిషి ఎప్పటికీ మనిషిగానే మిగిలి పోతున్నాడు'.(పుట.125) మనిషిమనిషిగా నిలిపేది ప్రేమే. అది బలహీనతగా మారితే అధ:పాతాళానికి వెళ్ళిపోతాడని ఆత్మశక్తికి బలహీనతగా ప్రేమ ఉండకూడదని నిరూపించే పాత్రగా ఈ సందర్భంలో శుక్రాచార్యుడు కనబడతాడు. సాధారణంగా జనజీవన విధానంమీద ప్రేమ స్థాయిని చక్కగా వర్ణించారు. ఇది అమూలకం.

శుక్రాచార్యులదగ్గర శర్మిష్ఠ మొదలైన విద్యార్థులందరూ విద్యాభ్యాసం చేస్తున్న సమయంలో ఒక సహజ వర్ణన శర్మిష్ఠ హృదయాన్ని ఆవిష్కరిస్తుంది. 'ఒకరోజు అందరూ శ్రద్ధగా అధ్యయనంచేస్తున్న సమయంలో వేటగాడి బాణంతో దెబ్బతిన్న లేడి, అక్కడకు పరుగెత్తుకుంటూ వచ్చింది శరణుకోరుకుతున్నట్లు. చదువు ఆగిపోయింది. శర్మిష్ఠ రాకుమారి కాబట్టి ఆమె విలువిద్యతో పాటు గాయపడినవారికి అవసరమైన చికిత్సలు కూడా నేర్చుకుంది. తన చీరంతా రక్తసిక్తమవుతున్నా లేక్కచేయకుండా, అతి నేర్పుగా, ములికి శరీరంలోకి దిగకుండా బాణం లాగింది. చెలికత్తెల్ని పంపి అవసరమైన లేహ్యాలు తెప్పించింది. తాను స్వయంగా గాయం కడిగి, ఆ లేహ్యం పూసి జాగ్రత్తగా కట్టుకట్టింది.

అప్పటికీ కచుడు, మిగిలిన విద్యార్థులూ, మెత్తటి గడ్డిలో, ఆ లేడికి పడక సిద్ధం చేసారు. ఇలా శర్మిష్ఠ ఆ లేడికి  ఉపచారాలు చేసింది. ఇది ఆమె హృదయ సౌందర్యాన్ని ఆర్త త్రాణ పరాయణత్వాన్ని ప్రతిఫలించే వర్ణన. అందువల్ల రాక్షస రాజకుమార్తె అయినప్పటికీ ఆ రాక్షస లక్షణాలు లేవని రూఢిగా చెప్పినట్లయింది. ఇది అమూలకం.

దేవయాని శర్మిష్ఠని బంధించింది. తర్వాత విడుదల పొందింది. ఈ విడుదలయిన విషయాన్ని ఇంద్రాణి గూఢచారిణిద్వారా యయాతి విన్నాడు. వెంటనే వెళ్ళి శర్మిష్ఠని చూడాలని రాజు ఆత్రుతతో ముందుగా వర్తమానం పంపిస్తే, దేవయాని నిర్లక్ష్యం చేస్తుందని అనుకున్నాడు. అందుకే తన రాకని ముందుగా తెలుపలేదు. యయాతి బయల్దేరాడు. 'ముత్యాల తోరణాలు గుమ్మాలకు వేలాడుతున్నాయి. భవనం అంతా చిలకరించిన పన్నీరు. లోపలికి అడుగు పెట్టగానే కమ్మని పరిమళం. బంగారు ఆసనాలన్నీ మెత్తటి దిండ్లు, పై తొడుగులపై చక్కని చేతిపని చూడముచ్చటగా ఉంది. మొత్తంమీద ఆ భవనమంతటా ఏదో అనురాగ పూర్ణమయిన అమృత స్పర్శ కనిపిస్తోంది. ఒక విచిత్రమయిన హాయితో నలువైపులా చూసుకుంటూ దేవయాని అభ్యంతర మందిరంలోకి వచ్చాడు'(పుట.156) ఈ వర్ణనలో  యయాతి శర్మిష్ఠమీద ఉండే అనురాగం, ఆమె వచ్చిందని చెప్పకనే చెబుతున్న భవనంలోని సుగంధం ఏదో విచిత్రహాయిని ఇస్తున్నట్లు వర్ణించడం నూతన సృష్టి. ఇది మూలంలో ఇంత వివరణతో లేదు.

వ్యాసభారతంలో లేని అంశం- అజముఖి పాత్ర.(పూర్వగాథాలహరి, పుట. 13) ఆ పాత్ర సురస కశ్యపులకు కూతురు. శూర, పద్మాసురుల తోబుట్టువు. పురుషుల్ని పట్టుకొని బలత్కారంగా వాళ్లతో రమించేది. దూర్వాసుడి శాపంవల్ల వాతాపి ఇల్వలురు ఈమెకు పుట్టారు.  ఈ విషయం స్కాందపురాణంలో ఉంది. దాన్ని రచయిత్రి ఇంద్ర సింహాసనం కోసం అగ్ని ఆరాటపడడం అగ్ని కుమారుడు మాహిష్మతి నగరానికి వచ్చినప్పుడు అతణ్ణి లోబరుచుకోడానికి రాజ్యాధికారులందర్నీ తన ఆకర్షణతో వశపరుచుకొని అగ్ని అభ్యంతర మందిరంలోని ప్రవేశించింది. అతడికి విలాసంగా నమస్కరించి ఆమె అందంతో ఆకర్షించింది, అగ్ని ఆమెను తాగేస్తున్నట్లు చూసాడు. అజముఖికి విషయం అర్థమయింది. 'మహాదేవా! మా రాజ్యం కరువు కాటకాలతో మునిగి ఉంది ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. తమరొక్కసారి మా రాజ్యానికి దయచేయాలి'(పుట.163) అని కవ్వింపు స్వరంతో వేడుకుంది. అగ్ని అజముఖికి, వారిబంధు వర్గానికి చాలా విలాసాలు సమకూర్చాడు. నారదుడు దుర్వాసుణ్ణి అజముఖి ఇంటికి దేవకార్యం నిమిత్తం వెళ్ళమనడం, అగ్ని దుర్వాసుణ్ణి మంచం మీంచి కిందకి లాగేసాడు. అప్పుడు కోపంతో కుంగిపోతావని దుర్వాసుడు అగ్నిని శపించాడు. ఇలా దుర్వాసుడు దేవకార్యాన్ని చక్కదిద్దాడు.

భార్యాభర్తలు సాధారణంగా గొడవలు పడుతుంటారు. ప్రేమించింది ఒకరిని పెళ్ళి చేసుకున్నది మరొకర్ని. యయాతి శర్మిష్ఠని ప్రేమించింది. దేవయాని కచుణ్ణి ప్రేమించింది. కానీ, యయాతికి దేవయానితో పెళ్ళయింది. యయాతి దేవయానితో యాంత్రికంగా సంసార జీవితం గడిపాడు. కలిగిన సంతానంపట్ల ఏమాత్రం శ్రద్ధ వహించలేదు. అయితే దేవయాని కూడా యయాతిమీద అంతే ఉదాసీనంగా ఉందని తెలుసుకోలేకపోయాడు.

దేవయాని వేరొకర్ని ప్రేమించిందని వినగానే యయాతికి కోపం ఎందుకు వచ్చింది. కేవలం భర్తననే అహంకారంతో ఎంత సంస్కారం ఎన్ని విధాలుగా పొందినా తరతరాలుగా సమాజంలో జీర్ణించుకుపోయిన ఆచారాలు, ఆత్మనుకూడా ఆవరించుకొని, నిశితమైన ఆత్మ విమర్శతో కానీ వదలవు'(పుట.152) అని భావించుకుంటూ దేవయానిదగ్గరకు యయాతి వచ్చాడు. కచుణ్ణి ఇకముందు స్మరించవద్దని ఆజ్ఞాపించాడు. ఇది ఆజ్ఞాపించడానికే వచ్చారా? అని వెటకారంగా, అహంకారం తొణికిసలాడేలా దేవయాని అంది. దేవయాని సాధారణ స్త్రీలా యయాతికి తోచలేదు. ఇంద్రాణి పోలికలు ఈమెలో కనిపించాయి. 'మీ తండ్రి బ్రాహ్మణకన్యలైన నిన్ను క్షత్రియుడనైన నేను(యయాతి) పెళ్ళి చేసుకోడం ధర్మమే అని శాసించాడు. సంఘాన్ని శాసించగలబలం ఆయనకుంది. అలాగే, వివాహితు రాలివయినా భర్తని శాసించలేడా మీ తండ్రి' అన్నాడు యయాతి (పుట.153). దేవయానికి కన్నీరు వచ్చినా ముఖం ప్రక్కకు తిప్పుకుంది. దేవతలు తనని దేవలోకం రానివ్వరు, కచుణ్ణి రాక్షసులు ఇక్కడ ఉండనివ్వరు. తనతండ్రి దేవయానికోసం అన్నీ మార్చగలడు. కానీ, అందర్నీ వెర్రెత్తించే రాజకీయాల్ని మాత్రం మార్చలేరని అనుకుంది. కచుడు ఎలాగూ తనకు దక్కడు మనసు మార్చుకొని యయాతిని ప్రేమించింది. 'ఏం అలా జరగకూడదా? కవులు అమర ప్రేమని గానం చేసుకోవచ్చుగానీ నిజజీవితంలో ప్రేమలు సందర్భాన్ని బట్టి మారిపోడం సహజమే కదూ!' (పుట.154) అని దేవయాని అనుకుంది. ఈ మాటల్లో అంతరార్థం ప్రేమ పెళ్లిళ్లస్థాయి, నిరాశ, నిస్పృహలు, కలహాలకు కారణాలు- అహకారం, సర్దుకుపోలేనితనాన్ని, కుటుంబ జీవనాన్ని చక్కగా చిత్రించారు. ఇది మూలానికి విస్తరణగా చెప్పొచ్చు.

దేవయాని శర్మిష్ఠను చాలా రకాలుగా అవమానపరిచింది. 'కానీ, నిజంగా ఆధిపత్యం సంపాదించగలిగింది. కించపరచగలిగింది- యయాతిని పెళ్ళి చేసుకున్నప్పుడు మాత్రమే' (పుట.178) అని శర్మిష్ఠ యయాతికి చెప్పింది. దేవయాని శర్మిష్ఠను బంధించినప్పుడు దేవకన్యలు వచ్చి దేవయానితో 'నీవు శర్మిష్ఠని భూగృహంలో ఉంచడంవల్ల నువ్వు సాధించిన ఘనత ఏమీలేదు. యయాతి శర్మిష్ఠను చూడాలి. వారిద్దరూ ఒకరికోసం ఒకరు తపిస్తుంటే నువ్వు నీ ఆధిక్యత నిరూపించుకోవాలని' ప్రబోధించారు. ఇది దేవయానికి నచ్చి శర్మిష్ఠని వదిలేసింది. 'నన్ను బాహాటంగా పెళ్ళి చేసుకోండి. మీ రాణిగా లోకానికి ప్రకటించండి. మీ ప్రేమ నాకున్నంతవరకు ఎలాంటి బాధలైనా ఎదుర్కోడానికి నేను సిద్ధమే'(పుట.179)అని శర్మిష్ఠ యయాతితో చెప్పింది. నిజమైన ప్రేమకష్టాల్ని ఎదుర్కో డానికి తగిన శక్తిని కలిగి ఉండాలి. అలాంటప్పుడే అది సఫలమౌతుంది. బాధలు పంచు కున్నప్పుడే మనసుకు ఊరట కలుగుతుంది అని నిరూపించారు. ఇది మూలంలోలేదు. మూలంలో శర్మిష్ఠ తనను బాహాటంగా పెళ్ళి చేసుకోమని కోరలేదు. ఈ నవలలో శర్మిష్ఠ కోరింది. ఇది ఆధునిక జీవనానికి దర్పణం.

దేవయాని స్వర్గానికి వెళ్ళి వచ్చేసరికి శర్మిష్ఠని యయాతి పెళ్ళి చేసుకున్నాడు. శర్మిష్ఠ నాట్యం చేస్తుంటే యయాతి వీణ వాయిస్తున్నాడు. దేవయాని చూసి శర్మిష్ఠ మూహూర్తకాలం ఆగి, యయాతి సైగతో మరింత ఉత్సాహంగా ముందుకు కదిలింది. యయాతి చేతి స్పర్శతో వీణ మనోహరరాగాలు పలుకుతోంది. చైతన్య కళారాగిణిలా ఉంది.

శర్మిష్ఠ సమ్మోహనాకృతి, అసలే అందమైన శర్మిష్ఠ అపూర్వ ఆకర్షణతో వెలిగిపోతోంది. ఇదంతా చూసిన దేవయాని శిలా ప్రతిమలా నిలిచిపోయింది. అంతరంగ మథనం చేసుకుంది. ఇది అమూలకం.

ఇంత కాలం రాక్షసిలా పట్టుదల పట్టి తాను సాధించినదేమిటి? తాను ప్రేమించిన కచుడు దేవయాని సమక్షంలో శర్మిష్ఠను, దేవకన్యలకు మించినదానివి అని అన్నాడు. శర్మిష్ఠను దాసిగా చేసుకుంది. అందరి దృష్టిలో తాను శర్మిష్ఠకంటే ఎంతో హీనురాలై పోయింది. కనీసం శర్మిష్ఠను బాధించానన్న తృప్తికూడా దక్కలేదు. ప్రజల హృదయాల్లో మహోన్నత స్థానం పొందిన శర్మిష్ఠని తన దాసిత్వం ఏనాడూ బాధించలేదు. తన మనసులో ఏమాత్రం ప్రేమలేకపోయినా, తనకులం కాకపోయినా, శర్మిష్ఠపైన విజయం సాధించడానికే యయాతిని పెళ్లి చేసుకుంది. ఆనాడు భరించలేని హృదయ వేదనతో విలవిలలాడుతున్న శర్మిష్ఠ ముఖం చూసినప్పుడు పైశాచికానందం కలిగింది'(పుట.191) కానీ, ఈనాడు? తను ఏలాంటి మాధుర్యాన్ని అనుభవించలేక జీవచ్ఛవంలా ఉంది. శర్మిష్ఠా, యయాతుల్ని చూసిన దేవయానికి ప్రేమానుభవం ఏంటో అర్థమయ్యింది. ఈ వర్ణన అహంకారానికి ప్రతిరూపంగా జీవితాన్ని మార్చుకొన్నామని భావించి, మళ్ళీ తప్పు చేసే వ్యక్తిత్వానికి నిదర్శనంగా కనిపిస్తుంది. ఇది మూలంలో కనిపించదు. అందుకే చివరికి దేవయాని తపస్సు చేయడానికి తండ్రితో పాటు బయలుదేరి, సమాధి అవస్థలో కచుణ్ణి దర్శించింది.

ఇంద్రాణిని నహుషుడు ప్రేమించాడు. ఆమె అతణ్ణి ప్రేమించిందని అనుకున్నాడు. మేధావులైన ఋషులులాగిన రథంమీద వస్తే అప్పుడు తన ముచ్చట తీరుతుందని ఇంద్రాణి చెబుతుంది. నహుషుడు మునుల్ని సమావేశపరిచి మనసులో మాట చెప్పాడు. రథం లాగడానికి మునుల్ని సిద్ధం అవ్వమని చెప్పి వెళ్ళిపోయాడు. అప్పుడు ఎనమండుగురు ఋషులు ఎనిమిదిరకాలుగా అనుకున్నట్లు రచయిత్రి రాసారు-

'ఛీ ఛీ ఏం సిగ్గులేని తనం' అని ఛీదరించుకున్నాడు అగస్త్యుడు. ముల్లోకాలకు అధిపతి అయిన ఇంద్రుడిలా ఉండి, ఇవా ఇతడు చెయ్యివల్సిన పనులు? అని అన్నాడు రామపాదుడు. 'ఏ ఇంద్రుడైనా అంతేగా!ఇలాంటి దరిద్రపుపనులు చేయడానికే ఇంద్రుడు కావాలని కోరుకుంటారేమో!' విసుక్కున్నాడు మాండవ్యుడు. 'ఇప్పుడు మనం ఏం చెయ్యాలో అది నిర్ణయించండి' అన్నాడు అత్రి. కొంతసేపు ఎవరూ మాట్లాడలేదు. 'నహుషుణ్ణి ప్రతిఘటించండి. ఇతడు ఇంద్రపదవిలో ఉండడానికి అర్హుడు కాడు' సింహనాదం చేసాడు శరద్వంతుడు.

'తొందరపడకు లోకాలని శాంతిమయంగా ఉంచవలసిన మనమే ఆందోళనలను ప్రారంభించకూడదు' అన్నాడు వసిష్ఠుడు. 'ఇంద్రాణి వ్యతిరేకిస్తే, ఇది అపచారం అని ప్రతిఘటించవచ్చు. ఆవిడే రమ్మన్నప్పుడు మనమేం చెయ్యగలం? స్వర్గంలో ఇలాంటివి మామూలేగా?' అన్నాడు భరద్వాజుడు. 'ఇప్పటివరకు దేవదానవ సంగ్రామంలో ఎక్కడ చూసినా అశాంతి తాండవిస్తోంది. ఇప్పటికైనా శాంతి, స్థిమితం ఏర్పడేలా చూడండి' అన్నాడు ఉద్దాలకుడు. (పుటలు 222-223) ఈ మునుల భావనలు మూలంలో లేవు.

రచయిత్రి ఆ ఋషులస్వభావాలకు తగినట్లు మాట్లాడించేలా వివరించడం ఈ నవలలో ప్రత్యేకతగా చెప్పొచ్చు.

## 5. 3. *చతురస్రం* నవల వర్ణనలు- మార్పులు, చేర్పులు

ఈ నవలలో వర్ణనలు ఎక్కువగా ప్రకృతికి సంబంధించినవే. ఉదయపు సంధ్యా కాంతులు ఆశ్రమంలో పెరిగిన పొన్నచెట్లపైపడి తెలుపు, ఎరుపుల సమ్మిళితంలో వింత అందాన్ని స్తున్నాయి. గున్నమావిపై వున్నకోయిల తియ్యని గొంతుతో మేలుకొలుపుతోంది ఆశ్రమవాసుల్ని. అశోక వృక్షాలు ఆకాశమంత ఎత్తు ఎదిగి ఆశ్రమ శోభను తిలకిస్తూ ఆనందంగా తలపోస్తున్నాయి. మంకెనలు, మందారాలు విరబూసాయి. చెట్లపై చిలుకలు పండ్లు కొరికి తిని గింజలు నేలకి విసుతుంటే అక్షితల జల్లులా నేల మెరుస్తోంది. ఈ సందర్భంలో శుక్రాచార్యుల ఆశ్రమంలో ఉన్న విద్యార్థులు పాఠాలు నేర్చుకుంటారు. ఈ అంశాలను వివరించడానికి ముందు ఈ వర్ణనలో ప్రకృతియొక్క ఆహ్లాదస్థితిని వర్ణించారు. (పుట.6)చెట్లపై చిలుకలు పండ్లుకొరికి గింజలు నేలమీద పడేయడాన్ని అక్షింతల జల్లుగా వర్ణించడం ప్రత్యేకత. ఈ అక్షింతలు అనే ఆశీస్సులు కచుడికి అందుతాయనే సూచన ఇందులో తెలుస్తోంది. ఇది అమూలకాంశం.

నడకల్లో సొగసులు, పెదాలలో పగడాలు, కళ్ళల్లో కాంతులు, పయ్యెదలో దాగని బిగువైన వక్షోజాలు, పలుకుల్లో మకరందాలు -ఇలా నవ యవ్వనంలో అడుగుపెట్టిన అందాల రాశి దేవయాని ఆనాడు ఉదయసంధ్యలో మందార చెట్టుకింద తిన్నెపై కూర్చొని జుట్టు ఆరబెట్టుకుంటోంది. నల్లగా నిగనిగలాడుతున్న ఆ కేశాలుముందుకు వేసుకోగానే చిలిపిగాలి వాటిని ఆమె ముఖానవిసిరి వయ్యారంగా వెళ్ళిపోయింది. పాదాల మంజీరాలు ఘల్లుమంటుంటే పాదాలకు తగిలిన కుందేలుపిల్ల పక్కకి పరుగెత్తింది. ఉదయసూర్యుని శోభను తిలకిస్తూ కూర్చున్న దేవయాని క్షణం విస్తుపోయి చూసింది అటు. ఆ తరవాత కచుడి వర్ణన ఉంది. ఈ పై వర్ణనలో చిలిపిగాలి వయ్యారంగా వెళ్ళిపోయింది అనడంలో దేవయాని కచుడిపట్ల చిలిపితనంగా ప్రేమలో పడుతుందని, కచుడు నిరాకరించి వెళ్లిపోతాడనే సూచనగా కనిపిస్తోంది. ఇది అమూలకాంశం.

శుక్రాచార్యుల ఆశ్రమంలో శిష్యులు గురువు గొప్పదనాన్ని కీర్తిస్తుంటారని 'అజ్ఞాన నాంధకారస్య...' అంటూ శ్లోకాన్ని రచయిత్రి వివరించింది. తమ పిల్లల గురించి తల్లిదండ్రులు ఏం అనుకుంటారో వివరణ ఉంది. ఇది రచయిత్రి చేసిన మూలానికి వన్నె తెచ్చిన మార్పు(పుట. 6).

దేవయానికి కచుడిపట్ల ఆకర్షణ కలగడానికి చాలా కారణాలున్నాయి. అందులో మొదటిది అతడి అందం. రెండోది చురుకుదనం, మూడోది తెలివితేటలు, నాలుగోది మాటనేర్పు, ఐదోది సున్నితత్త్వం. ఆయా అంశాలు సూచించడానికే ఈ నవలలో కచుడి వర్ణనలున్నాయి. 'అందమైన గుండ్రని ముఖం, విశాలమైన నయనాలు, తీర్చిదిద్దిన నాసిక, పొడమైన కేశపాశం, నూత్నయవ్వనం, ఆ నడకలో రాజసం... ఎవరూ....రాక్షస

రాజకుమారుడో, వేదపండితుడి మనుమడో, గంధర్వుడో, కిన్నెరుడో, లేక ఏ దేవతలు పంపారో... అంటూ, దేవతలు తమకు శత్రువులుకదా! అని ఫక్కున నవ్వుకుంది.'(పుట.7) 'కచుడు మహా చురుకైనవాడు, తెలివైనవాడు, వినయసంపన్నుడు, గుణవంతుడు'(పుట.10). ఇలాంటివాడు కాబట్టే దేవయాని ఇతడి ప్రేమలో పడిపోయింది అనేసూచన ఉంది. ఇవి మూలానుసరణకు దగ్గరిగా ఉన్నాయి.

దేవయాని ఇష్టసఖి మాధవి. ఈమె ఒక హారాన్ని దేవయానితో పందెంలో గెలుచుకుంది. ఈ విషయాన్ని మరో పరిచారికతో చెప్పినట్లు ఈ నవలలో ఉంది- 'కచుడు ఈ రోజు నాకోసం ఏం తెస్తాడో చెప్ప'మని మాధవిని దేవయాని అడిగింది. 'గుమ్మపాలు (నురుగుతో కూడిన పాలు) తెస్తాడ'ని పందెం వేసింది మాధవి. పందెంలో మాధవి గెలిస్తే హారం నీకిస్తానని దేవయాని చెప్పింది. ఒకవేళ ఓడిపోతే కచుడి తల దువ్విస్తానని దేవయాని నవ్వి పందెం వేసింది. కచుడు పూలు తీసుకు వస్తుండగా చూసి, మాధవి పూలు లాక్కొని, గుమ్మపాలు పాత్రను చేతిలో పెట్టింది. పైగా దేవయానికి గుమ్మపాలు కావాలట. మీరే ఇస్తే ఎంతో సంతోషిస్తుంది అనిచెప్పి వెళ్ళిపోయింది. ఆ పాలుతెచ్చి దేవయానికి కచుడు ఇచ్చాడు (పుట. 37). ఇది అమూలకాంశం.

మృగయా వినోదలోలుడైన యయాతి ఆ ప్రాంతమంతా సంచరిస్తున్నాడు. అలా అలా అడవిలో తిరుగుతూంటే ఆ ప్రాంతమంతా వీస్తున్న గాలి యయాతికి ఎన్నెన్నో రహస్యాలు అందించినట్లు అనిపించింది. స్త్రీల వక్షోజాలమీద రాసుకున్న చందనం యొక్క పరిమళాన్ని మోసుకొని యయాతి గుండెను గిలిగింతలు పెట్టిందొక గాలి. జడలో తురుముకున్న పుష్పాల పరిమళాన్ని మోసుకొని యయాతి బుగ్గల్ని తాదిందొక గాలి. కర్పూర తాంబూల సేవనల పరిమళాన్ని మోసుకొచ్చి యయాతి పెదవుల్ని తాకిందొక గాలి. ఇలా ఆ గాలలు యయాతిని పిల్చుకొచ్చి ఆ ఉద్యానవన సమీపానికి తెచ్చాయి. మహావీరుడైన యయాతి ఉద్యానవనంలో ప్రవేశించి ఆ మధురాతి మధురమైన కోమల స్వరాన్ని, చిలుకల ఆహ్వానాన్ని, గలగల నవ్వుల్ని గుర్తిస్తూ ఇసుక తిన్నెల దగ్గర కొచ్చి ఆగాడు.

మూలంలో గాలి రాకను వర్ణించలేదు. ఈ వర్ణన మూలలోని విషయానికి మరింత విశ్లేషణతో తెలియజేస్తూ రాబోయే కథాంశాన్ని సూచిస్తోంది. యయాతి దేవయాని, శర్మిష్ఠల అందానికి ఆకర్షించబడతాడని తెలుపుతోంది.

దేవయానికి యయాతితో మహావైభవంగా వివాహం జరిగింది. శుక్రాచార్యులు ఎంతో సంతృప్తితో కూతుర్ని, అల్లుణ్ణి చూస్తూ ఉన్నప్పుడు వారికి వృషపర్వుడు నమస్కరించాడు. పెళ్ళి కూతురికి ఎన్నెన్నో బుద్ధులు చెప్పడం మరువలేదు శుక్రాచార్యుల భార్య. ఎంతో నేర్పుతో సంసార రథాన్ని లాగుతావో నేను ఇక చూడాలి అని అంటుంది. ఇంకా భర్తే రక్షణ, దేవుడు అనే విషయం గుర్తుంచుకో. పుట్టినింటికి, మెట్టినింటికి కీర్తి తేవాలి. లక్ష్మీనారాయణుల లా, పార్వతీపరమేశ్వరులలా మీ దంపతులు ఆదర్శంగా ఉండాలి. అక్కడున్న

సేవకురాండ్రకు ఆమె పనులు అప్పగించింది. శర్మిష్ఠ చేయవలసిన సేవలేమిటో చెప్పింది. అంతేకాక, శర్మిష్ఠ పుట్టుభోగి. దానికి కావలసిన వన్నీ చూడు అంది దేవయానితో. ఆ మాటలకు చిరునవ్వు నవ్వింది దేవయాని. (పుట. 97). ఇలా ఈ నవలలో ఉంది.

ఈ విషయాలు శుక్రాచార్యులే చెప్పాడు మూలంలో. కానీ రచయిత్రి దేవయాని తల్లి చెప్పినట్లు రచయిత్రి మార్చేసారు. దేవయాని తల్లి ప్రస్తావన చెప్పడం తల్లి హృదయాన్ని ఆవిష్కరించడం కొత్తదనాన్ని తెచ్చిపెట్టింది.

దేవయాని యయాతితో వెళ్ళిపోతున్నప్పుడు ఆమె తల్లి కన్నీరుపెట్టడం, ఎడతెగకుండా ఏడవడం కూడా చేసినట్లు వివరించారు. ఇలా కబురు పెడితే అలా నీ తమ్ముడు, నీ చెల్లెలు మల్లికవస్తారని దేవయానితల్లి చెప్పినట్లు రచయిత్రి చెప్పారు.(పుట.98)ఇదంతా అమూలకాంశం.

దేవయానికి పిల్లలు పుట్టారు. కూతురు కాపురం చూడడానికి జయంతి వచ్చింది. జయంతి రాకతో దేవయాని తన కొడుకుల ముద్దూముచ్చట్లు చెప్తూ, ఆనందంగా ఉంది. శుక్రాచార్యులవారు కూడా కూతురు కాపురం చూసి ముచ్చటపడిపోతున్నాడు.

శుక్రాచార్యులు కూడా అల్లుణ్ణి చూడాలని అనుకున్నా, రాజకార్యాలవల్ల రాలేదు. దేవయాని, జయంతి ఎన్నో కబుర్లు చెప్పుకున్నారు. దేవయాని తల్లి యదువుతో కబుర్లాడుతూ 'నువ్వూ మీ తమ్ముడూ, మీ అమ్మ, నాన్న అంతా మా ఊరు రండి. తాతయ్య చూడాలనుకుంటున్నాడు' అంది. మా నాన్న వస్తే నేనొస్తా అన్నాడు యదువు. నేనూ వస్తానన్నాడు తియ్యగా తుర్వసుడు. తండ్రంత గొప్ప రాజులు, ధర్మ ప్రభువులు, నీతిమంతులు అయితే చాలమ్మ నా మనమలు అని జయంతి పిల్లల బుగ్గలు నిమిరింది. శర్మిష్ఠ గురించి అడుగుదామని అనుకొంది. చివరకు 'అమ్మాయి, నీ భర్త మీతండ్రిగారి ఆజ్ఞను పాటిస్తున్నాడుగా' అంది. దేవయాని తల్లి మాటల ఆంతర్యం కనిపెట్టి ఫక్కున నవ్వింది. 'శర్మిష్ఠ దేముళ్ళు స్వాములు, ఋషీశ్వరులూ' అంటూ... ఏదో అనబోయింది దేవయాని. ఈలోగా యయాతి వస్తున్న అడుగుల శబ్దంరావడంతో ఆపేసింది.(పుట. 143) ఇదంతా మూలంలో లేదు.

## 5. 4. ద్రౌపది (కోడూరు వారి) నవల వర్ణనలు- మార్పులు, చేర్పులు

ఈ నవలికలోని ప్రత్యేకమైన వర్ణనలు లేవు. తెలుగులోని కవిత్రయభారతాన్ని తీసుకొని ద్రౌపదికిసంబంధించినఅంశాలను జోడించి ఈ పుస్తకాన్ని రాసాడు. మార్కండేయ పురాణంలోని కొన్ని అంశాలను జోడించి ద్రౌపది కర్ణుడిమీద మనస్సు పారేసుకుంది అనే లోకుల భావనను తప్పుడు విషయంగా నిరూపిస్తూ సోదాహరణంగా వివరించారు. ఇందులో అంతకు మించిన విశేషాలు లేవు.

## 5. 5. ద్రౌపది (రామలక్ష్మి) నవలలో వర్ణనలు- మార్పులు, చేర్పులు

ఇందులో వర్ణనలు ఏవీలేవు. కొత్తదనాన్ని ఇచ్చే అంశాలు లేవు. మూలవిధేయంగా వచన రూపంలో విషయం ఉంది. చిరు మార్పు మాత్రమే ఉన్నాయి.

మాలిని సుధేష్ణకోసం మదిర తేవడానికి కీచకుడి మందిరానికి వచ్చింది. కీచకుడు మాలినిని చాలామాటలున్నాడు. ఆమెను పట్టుకోబోతాడు. ఆమెను రక్షించడానికి వచ్చిన రాక్షసుడు చేతిని విదిలించాడు. పరుగులాంటి నడకతో తిరుగుముఖం పట్టినా ఆమె వెనువెంట కీచకుడు రాసాగాడు. ఎటు పరుగెత్తాలో తెలియక, కలవరపడుతున్న పాంచాలికి ఆ క్షణంలో కొలువులో ఉన్న విరాటరాజు కనిపించాడు. 'నా అదృష్టం బాగుండి సభాముఖాన నాకు రక్షణ దొరకక పోదు' అని అటు పరిగెత్తింది. మాలినికి వెన్నంటి ఉన్న రాక్షసుడు కీచకుణ్ణి మట్టి కరిపించాడు.(పుటలు: 129-130) ఈ వర్ణనలో కీచకుడు మాలినిని తన్నడం లాంటి మూలంలోని అంశాలు రచయిత్రి వదిలేసారు.

ఉత్తరుడు విజయం సాధించాడు అనే విషయాన్ని గోపాలురులవల్ల విరాటుడు తెలుసు కున్నాడు. మహదానందాన్ని పొందాడు. కంకుభట్టుని చూస్తూ 'ఒక ఆట ఆడుదామా?' అని అడిగాడు. నువ్వు ఆనందోత్సాహాలతో ఉన్నావు. నీతో ఆడి జయించ కూడదు అన్నాడు. అదివిని విరాటరాజు నవ్వి, ఆ చుట్టుపక్కల తిరుగాడుతున్న సైరంధ్రిని చూసి సొరెలు తెమ్మని, పాచికలు ఆడే పలకను ముందుకు లాగాడు. జూదం ఆడడం ప్రారంభిస్తూనే'ఈ జూదంలోనే ధర్మరాజు రాజ్యాన్ని, తమ్ములను, ప్రియసతిని పణంగా పెట్టి ఆడి సర్వం కోల్పోయాడు. దీనిలో అంత అనర్థం ఉంది' అని అన్నాడు కంకుభట్టు. ఇది అమూలకం.

సైన్యాన్ని తీసుకొని పాండవుల పక్షంలో చేరడానికి శల్యుడు వస్తున్నప్పుడు, దారిలో దుర్యోధనుడు అతడికి తగిన విధంగా సేవలు చేస్తాడు. శల్యుడు ఆ సేవలకు మెచ్చి, వరం కోరుకోమంటాడు. దుర్యోధనుడు 'తనకు మంత్రివై, రథ సారథివై ఉంటేచాలు! నేనెంతటి యుద్ధాన్నైనా గెలుస్తాను.'(పుటలు: 159-160) అని ఈ నవలలో అంటాడు.

మూలంలో శల్యుడు పాండవులకు ముందుగానే వారి పక్షం వహిస్తానని మాట ఇస్తాడు. తరువాత దారిలో దుర్యోధనుడికి కూడా మాట ఇస్తాడు. ముందు శల్యుడు పాండవ పక్షంలో చేరతానని అన్న విషయాన్ని రచయిత్రి ఇక్కడ వదిలేసారు.

ద్రౌపదిని మణిపూసగా రచయిత్రి చెప్పదలచారు. దానికి తగినవిధంగా భారతంలోని అంశాలు తీసుకొని ఈ నవలను రాసారు. సామాజిక, రాజకీయ, ఆర్థిక, నైతిక విలువలన్నిటికీ మూలామైనది స్త్రీ అని ద్రౌపది ద్వారా రచయిత్రి చెప్పదల్చుకున్నారు. ఈ విషయం వాచ్యంగా నవల చివరలో వివరించారు.

ఇప్పటికీ ద్రౌపదిని గ్రామీణులు ప్రతీయేటా దక్షిణప్రాంతలో ఆరాధించడం ఉంది. ఇది ద్రౌపది స్త్రీ శక్తికి నిదర్శనంగా రచయిత్రి పేర్కొన్నారు. ఈ అంశాలకు సంబంధించి

మరింత సమాచారానికి అనుబంధం-2 ను చూడండి.

## 5.6. ద్రౌపది(యార్లగడ్డవారి)నవల- వర్ణనలు -మార్పులు - చేర్పులు

యార్లగడ్డలక్ష్మీప్రసాద్ రాసిన ద్రౌపది నవలలో పాత్రలకు సహజత్వాన్ని ఆపాదిస్తూ ద్రౌపది పాత్ర విషయంలో శ్రద్ధ చూపారు. వర్ణనలు సందర్భానుసారంగా ఈ నవలలో ఉన్నాయి. ఈ నవల సూర్యోదయ వర్ణనతో ప్రారంభమౌతుంది. "తూర్పునుంచి ప్రసరిస్తున్న తొలి కిరణం ఆమె నెన్నడుమును తాకేందుకు ఉబలాటపడుతున్నది. వెలుగురేఖలు ఆమెను కౌగలించుకుని వెచ్చదనాన్ని అనుభవించేందుకు ఆతురత పడుతున్నాయి. సూర్యుడి వేగానికి బెదిరిపోతున్న నిశాదేవి ఆమె వెన్నుపై పరుచుకున్న తుమ్మెద రెక్కల్లాంటి శిరోజాలలో చిక్కుకున్నట్లు కనిపిస్తున్నది. నల్లకలువల అందమంతా పోతపోసినట్లు కనబడుతున్న ఆ లావణ్య రాశి సామాన్యమైన స్త్రీ కాదని ఆమెను చూసి నిశ్చేష్టురాలై స్తంభించిన ప్రకృతికి కూడా అర్థమయినట్లుంది" (పుట.17) అంటూ ప్రాతఃకాలపు సంధ్య మున్నెన్నడూ జరగని మారణహోమం జరగబోతోందని సూచించారు. నల్ల కలువల అందం ద్రౌపది అందాన్ని స్ఫురిస్తున్నాయి. అయితే ఆ అందాన్ని ఆశ్వాదించుకోవాలనుకోడం యుద్ధానికి కారణమనే విషయం ఈ వర్ణనవల్ల తెలుస్తోంది. ఇలాంటి వర్ణన మూలంలో లేదు.

దుర్యోధనుడు తొడలు విరిగి మృత్యువును చేరుకోనే సందర్భంలో "మేమెపుడూ (పాండవులంతా) పశ్చాత్తాపపడుతూ జీవించాలని శపించాడట... అతడు శపిస్తున్నప్పుడు అతడి మీద పూలవానలు కురిశాయట. దుందుభులు మోగాయట. మందమారుతం సుగంధ భరితమై వీచిందట. అలా ఎందుకు జరిగిందో... ఆ యుద్ధానికి నేనే కారణమైనందుకు ఇప్పుడు పశ్చాత్తాపం నన్ను ముంచి వేస్తున్నదా..." (పుటలు. 19-20) అని ద్రౌపది అనుకుంటుంది. ఇది ద్రౌపది మానసిక సంఘర్షణ, అలజడులను సూచిస్తోంది. ఈ వర్ణన మూలంలో లేదు.

ఉపపాండవుల పుట్టుక పేర్లు పెట్టడాన్ని వర్ణిస్తూ, "వింధ్య పర్వతం లాగా దృఢంగా ఉంటాడని ధర్మజుడిద్వారా కలిగిన కుమారుడికి బ్రాహ్మణులు 'ప్రతివింధ్యుడ'ని పేరు పెట్టారు. భీముడికి సోమయాగాలు చేసిన తర్వాత అతడిద్వారా పుట్టినవాడికి 'శ్రుతసోముడ'ని నామకరణం చేశాము. ఇంద్రప్రస్థంలోని ఉదయేందుపురంలో సోమలతల మధ్య జన్మించిన శ్రుతసోముడిని చూస్తేనే వేయి వెన్నెలల ప్రకాశాన్ని చూసినట్లుండేది. అర్జునుడు మహాకార్యలు చేసి వచ్చిన తర్వాత కన్న కొడుకుకు 'శ్రుతకీర్తి' అని పేరు పెట్టుకున్నాం. కౌరవకులంలో ప్రఖ్యాతిగాంచిన రాజర్షి 'శతానీకుడి' పేరు నకులుడిద్వారా పుట్టిన కుమారుడికి పెట్టుకున్నాం. కృత్తికా నక్షత్రంలో పుట్టిన సహదేవుడి కుమారుడికి అగ్నిదేవుడికి మరో పేరైన 'శ్రుతసేనుడి' పేరు పెట్టుకున్నాం" (పుట.19) అని ద్రౌపది తలచుకున్నట్లు రచయిత వర్ణించాడు. ఇది పాండవుల కథను తెలియజేస్తూ వారి చరిత్రను సూచించడానికి ఈ పేర్లు సహకరిస్తాయి.

ఉపపాండవుల ఇష్టాల్ని వర్ణిస్తూ "నల్లటి మెడ, తెల్లటి పాలరంగు శరీరంకల గుఱ్ఱాలంటే ప్రతివింధ్యుడికి, మినపపువ్వు రంగు గుఱ్ఱాలంటే శ్రుతసోముడికీ, పాలపిట్టరంగు

గుర్రాలంటే శ్రుతకీర్తికీ, మద్దిపువ్వు రంగు గుర్రాలంటే శతానీకుడికీ, నెమలి కంఠం రంగు గుర్రాలంటే శ్రుతసేనుడికీ ఎంతో ఇష్టం. వారి పితామహుల చిత్రాలున్న ధ్వజాలతో చిరునవ్వులు చిందిస్తూ యుద్ధభూమికి వెళ్ళేవారు. ఏనాడూ వారు గాయాలతో విలవిల లాడడం చూడలేదు''(పుట.21) ఇక్కడ ఉపపాండవుల గుర్రాల్ని వర్ణించడంద్వారా వారి యుద్ధనైపుణ్యాన్ని సూచించడం, గాయాలతో విలవిల లాడని పౌరుషవంతులని తెలియ జేయడానికి ఈ వర్ణన సహకరిస్తోంది. ఇక్కడ మూలంలోని అంశాలను కొంతవిస్తరణ రూపంగా చిత్రించారు.

ధర్మరాజాదులు కురుక్షేత్రంలో విజయం పొందాక హస్తినకు వస్తారు. గాంధారీ మాతను దర్శిస్తారు. ధర్మరాజు తలవంచుకొని తప్పు చేసానని అందరి ప్రాణాలు తీసానని తనే కారణంగా భావించి గాంధారి దగ్గర ఏడుస్తాడు. గాంధారి కోపం కొంత చల్లారింది. 'అయినా తన తీక్షణమైన చూపులతో తన కళ్ళకు కట్టిన వస్త్రం అంచులనుంచి అతడిని చూడడానికి ప్రయత్నించింది. ఆమె చూపులు ధర్మరాజు కాలి గోళ్ళమీద పడి అవి కందిపోయాయి. ఆ ఆగ్రహానలానికి పాండవులు, కృష్ణుడు భయపడి వెనక్కు తగ్గారు'(పుట. 39) అని రచయిత వర్ణించారు. ఇది మూలంలోని గాంధారి చూపుల తీక్షణత్వాన్ని చెప్పాడు. ధర్మరాజు ఏడవడం మొదలైనవి జోడించడం మూలానికి వివరణగా ఉంది.

ద్రౌపదిని ఓదార్చాక, గాంధారికి యుద్ధంలో మరణించిన కౌరవులు, వారి బంధువులు గుర్తుకువచ్చి ఏడుస్తుంది. ఆ సమయంలో 'తన కన్నులపై ఆచ్ఛాదనం తీయకుండానే ఆమె ముందు పద్దెనిమిది రోజుల యుద్ధభూమిని సాక్షాత్కరించింది. సంగరస్థలిలో ఘోరదృశ్యాలను చూసినట్లే ఆమె మాట్లాడుతున్న తీరు గమనించి ద్రౌపది, పాండవులు నిశ్చేష్టులై చూస్తుండి పోయారు. అదే సమయంలో అక్కడకు ప్రవేశించిన శ్రీకృష్ణుడికి ఆమె మనఃస్థితి గోచరం అయింది' (పుట.41) అంటూ యుద్ధభూమిలో చీలికలైన ధ్వజాల దగ్గరనుంచి విరిగిన రథాలవరకు, సైనికుల శరీరాలతో పోగులు పడ్డ గుర్రాలు, ఏనుగుల అవయవాల వరకు అన్ని రకాల విషయలు గాంధారికి కనిపించాయి. ఆ బీభత్సదృశ్యాన్ని చూసి గాంధారి శోకంతో నేలమీద పడి పొర్లసాగిందని రచయిత హృదయ విదారకంగా వర్ణించాడు. మూలంలో గాంధారి సంజయుడిద్వారా యుద్ధ విశేషాలు వింటుంది. ఆ భావనతో ఇలా అయి ఉంటుందని ఈ నవలో రచయిత సహజంగా వర్ణించినట్లు చెప్పాడు.

ద్రౌపదికి స్వయంవరం జరుగుతోంది. అపూర్వమైన తేజస్సుతో విరాజిల్లుతూ, ముగ్ధ మనోహర మందహాసంతో ప్రశాంత వదనంతో విలసిల్లుతున్న శ్రీకృష్ణుడు స్వయంవరంలో ఒక పక్క కూర్చున్నాడు. అతణ్ణి చూడగానే ద్రౌపదికి యుద్ధభూమిలా ఉన్న స్వయంవర సభావేది ఆహ్లాదకరమైన వసంతం ప్రవేశించినట్లుగా అనిపించింది.''తమ మధ్య జన్మజన్మల సంబంధం ఏమైన ఉన్నదా అని ఆమె ఆశ్చర్యపడింది. తననుచూసి ఎంతో పరిచయం ఉన్నట్లు నవ్వుతున్న శ్రీకృష్ణుడుకుడా తనకోసం, తనను వరించేందుకు వచ్చాడా, ఇప్పటికే అతడికున్న సఖీమణులు చాలరా'' అని ద్రౌపది ప్రశ్నించుకుంది. 'అతడెందుకో తనకు సహాయం చేసేందుకు వచ్చాడేమో అని అతడి స్నేహపూర్వక మందహాసం చూస్తే ఆమెకు

అనిపించింది. కానీ, అందరూ తనను చేపట్టే ఉద్దేశంతో వచ్చారని ధృష్టద్యుమ్నుడు చెప్పినప్పుడు తనకు ఆశ్చర్యం కలిగింది'(పుట. 50) అని ద్రౌపది భావించినట్లు రచయిత వివరించాడు. రాబోయే కాలంలో ద్రౌపదికి కృష్ణుడు చాలా సహాయాలు చేస్తాడని ఇందులో ముందుగా సూచించడం మూలంలోనే ప్రత్యేకత.

మూలంలో కృష్ణుడే వచ్చి ద్రౌపదికి స్వయంవరం ప్రకటించమని పాండవులంతటి వీరులు చనిపోయే అవకాశమే ఉండదని, స్వయంవర మత్స్యయంత్రాన్ని రూపకల్పనకోసం సహాయపడినట్లు, ముందే ద్రుపదుడికి కృష్ణుడు తెలిసినట్లు ఉంది. ద్రౌపది నవలలో యార్లగడ్డవారు ద్రౌపది మానసిక భావనను పాఠకుడికి అందించే ప్రయత్నంలో పై విధంగా వివరించారు.

'జీవితం అన్నిసుఖాలను అనుభవించేందుకు, అపారమైన జ్ఞానాన్ని సముపార్జించేందుకు సరిపోకపోతే ఆ జీవితం మనకెందుకని' ద్రౌపది వ్యాసుణ్ణి అడిగింది.(పుట. 88) దానికి బిగ్గరగా వ్యాసుడు నవ్వి, నీ పేరు కృష్ణ అనకుండా తృష్ణ అంటే సరిపోయేదని అంటాడు. అనుభూతుల సారమే ద్రౌపది అని పూర్వజన్మను గురించిన అంశాలపై ద్రౌపది మనఃపటలంపై సుడులు తిరుగుతూ భావించినట్లు రచయిత వర్ణిస్తాడు. ఈ వర్ణనకు సంబంధించిన వివరణ ద్రౌపది నవలలో పుటలు 90-98 వరకు ఉంది. వేదవతిగా, సీతగా, ఇంద్రసేనగా, కాశీరాజకన్య అనామికగా చివరగా ద్రౌపదిగా జన్మించినప్పుడు చాలా అనుభవాల్ని తలచుకుంటుంది.

ద్రౌపదికి పెళ్ళయ్యాక, మొదటిరాత్రి ధర్మరాజుతో శోభనం. ధర్మరాజుని చూడగానే ద్రౌపదిలో కొన్ని ఆలోచనలు కలిగాయి. ద్రౌపదిని చూసి ఆకర్షితుడయ్యే ఈ ధర్మరాజు ధర్మపన్నాలు పన్నాడు అనుకుంది. అప్పుడే తనను ధర్మరాజు పెండ్లాడకపోతే ద్రౌపది పట్టపురాణి అయ్యే అవకాశం లభించేదా అని భావించింది. తర్వాత ధర్మరాజు పాదాలకు నమస్కరించింది. ధర్మరాజుకు రెండో బలహీనతే ద్రౌపది అని అనుకుంది. ధర్మరాజు ఆ రాత్రంతా నిద్రపోలేదు. ఆమెనూ నిద్రపోనివ్వలేదు.

'ఒక పురుషుడి చేతిలో ద్రౌపదికి అది మొదటి అనుభవం... ఆ అనుభవం కోసం ఆమె ఎన్నో ఏళ్ళనుంచో తపించింది... కానీ, ధర్మరాజు స్పర్శలో వెచ్చదనం ఆమెకు తాదాత్మ్యాన్ని కలిగించలేదు... అతడు తన శరీరంలో ప్రత్యణువునూ తన చేతులతో శోధించాడు. ఆకలి గొన్న వాడికి పంచభక్ష్య పరమాన్నాలు దొరికి సౌందర్యాన్ని తన శరీరమంతా కనులు నింపుకుని చూసాడు. ధర్మరాజుకు వేనవేల కనులు, వేనవేల చేతులు, వేనవేల పాదాలు ఉన్నట్లు ద్రౌపదికి అనిపించింది'(పుటలు. 137-138) ఈ వర్ణన రచయిత మానవీయ కోణంనుంచీ పాఠకుడికి వివరించే ప్రయత్నం చేసాడు. ఎన్నో జన్మలనుంచీ ఎదురు చూస్తున్న లేదా చాలా కాలం నుంచీ పొందాలనుకున్నది పొందే సమయం వచ్చినప్పటికీ పూర్తి ఆనందం ద్రౌపదికి లభించదు. కానీ ధర్మరాజు స్థితి అందుకు భిన్నంగా ఉందని తెలుస్తోంది. ఈ వర్ణన, అనుభూతులు మూలంలో ఇంతగా వర్ణించలేదు. ఒకస్త్రీగా ద్రౌపది పరిస్థితిని మానసిక, శారీరక, అశాంతితో, లేక ఆనందమో తెలియకుండా ఉందని

రచయిత సూచించాడు.

వ్యాసభగవానుడు మూలంలో పాండవవులకు విడివిడిగా అయిదు రోజులు వివాహం జరిపించాడు. ద్రౌపది రాత్రి గడిచి తెల్లవారేసరికి కన్యగా నిలిచిందన్నాడు. "క్రమేణ చానేన నరాధిపాత్మజాః వరస్త్రియాస్తే జగృహుస్తదా కరమ్, అహన్యహన్యుత్తమ రూపధారిణో మహారథాః కౌరవ వంశవర్ధనాః. ఇదం చ తత్రాద్భుత రూపముత్తమం జగాద విప్రర్షిరతీత మానుషమ్ మహానుభావా కిల సా సుధ్యమా బభూవ కన్యైవ గతే గతే అహని" (1-190-14) అని తెల్పాడు.

అంతేకాదు వివాహానికి ముందు ద్రౌపదివైపు అయిదుగురూ ఎలా చూశారో వ్యాసుడు దాపరికం లేకుండా చెప్పాడు. "సంప్రమధ్యేంద్రియగ్రామం ప్రాదురాసీత్ మనోభవః (1-182-12) అన్నాడు. ఇది గుర్తించిన ధర్మజుడు "తేషామాకారభావజ్ఞః మిథో భేదభయాత్ సర్వేషాం ద్రౌపదీ భార్యా భవిష్యతి" (1-182-14,15) అన్నాడు. "ఆ లలితాంగియందు హృదయంబులు దృష్టులు నిల్పి పాండుభూపాల తనూజ పంచకము పంచ శరాహతి బొందె" (ఆది-7-213) అని నన్నయగారి తెనిగింపు. అయినా వ్యాసుడి ధర్మరాజుకి శంక వదలలేదు. అర్జునుడు గెలుచుకున్న ద్రౌపదిని తాను చేసుకోవడం చిన్నతనం కాదా అని అతడి శంక. ఈమేరకు అర్జునిడితో జరిపిన సంభాషణను ఈ నవల ఉపయోగించుకుంది (పుట- 94). అదనంగా సమకూర్చినది మనోవిశ్లేషణ, మనస్తత్త్వ చిత్రణ" గా బేతవోలు వారు తమ వ్యాసం నవలగా ద్రౌపది సమీక్ష లో విశ్లేషించారు.

ఈ వర్ణన మూలంకంటే మెరుగైనట్లుగా కనిపిస్తోంది. సమాజంలో స్త్రీకి ఎన్ని అనుభూతులు ఉన్నాయో వాటిన్నిటి ప్రతి రూపమే ద్రౌపది అని రచయిత చెప్పదలచుకున్నాడు. మూలానికి మరింత వివరంగా ఒక్కచోటే అన్ని విషయాలు రచయిత చెప్పి జీవితంలో సుఖదు:ఖాలు ఎప్పుడూ పక్కపక్కనే ఉంటాయని జీవిత రహస్యాలను సూచించాడు.

కృష్ణుడు ద్రౌపదిని సఖిగా భావిస్తాడు. అభిమానంతో ద్రౌపదికి నీలి ముత్యాలహారం ఇచ్చాడు. దాన్ని ఎప్పుడూ మెడలోనే ఉంచమన్నాడు. ఎందుకు ఎప్పుడూ ఉంచాలని ద్రౌపది అడిగితే, ఆ హారం ఉన్నంతసేపూ నేను నీతోపాటు ఉన్నట్టే కదా అని కొంటె నవ్వు నవ్వుతూ కృష్ణుడన్నాడు. ఈ విషయాన్ని అర్జునుడితో ఏకాంత సమయంలో ఈ హారం తీసేయవచ్చుకదా అని అర్జునుడు అడిగితే అతనికి ఈ హారాన్ని కృష్ణుడిచ్చాడని చెబుతుంది. 'మనమధ్య ఆయన ఎప్పుడూ ఉండాల్సిందేకదా' అని నవ్వుతాడు.(పుట. 156) ఈ విషయంలో ద్రౌపది పట్ల కృష్ణుడికి ఉన్న అభిమానం, కృష్ణుడిపై అర్జునుడికున్న స్నేహం రెండింటినీ వ్యక్తం చేసున్నాయి. భవిష్యత్తులో కృష్ణుడు మరణించాక, అతడు లేకపోవడంతో అర్జునుడు అశక్తుడై పోతాడనే సూచన కనిపిస్తోంది.

లోకంలో ఉన్న ధర్మానికి ఎలాంటి విచక్షణ ఉంటుందో రచయిత వివరించే ప్రయత్నం చేసాడు-"చరిత్రపుటల్లో ఎన్నోఅనుభవాలు నిక్షిప్తమవుతాయి. ఏఅనుభవమూ

ఒక కొలమానానికి లొంగదు. లోకం కోసం తాను అని ఒకరు భావిస్తే, లోకంతో పాటు తాను పయనిస్తున్నానని మరొకరు అనుకుంటారు. ధర్మంకూడా అంతే... ఎంతో కాలంలో కొనసాగిస్తున్న ధర్మాన్ని అనుసరిస్తూ తానే నీతి పరుడినని అనుకునేవారు ఒకరైతే, కాలానుగుణంగా ధర్మం మారుతుంది అనుకునేవారు మరికొందరు. తాను అనుకున్నదే ధర్మమనుకునేవారు కూడా చాలామంది ఉంటారు'' (పుట.173) అని లోకంలో ఉన్న ధర్మానుసరణ గురించి వివరిస్తూ ఎవరికి వారే నీతిపరుడు అనుకోడం సహజమని, అయితే అందరూ నిర్ణయించిన సరైన విషయం అంటూ ఏదీ ఉండదని సూచించాడు. ఒకప్పటి ధర్మం కాలానుగుణంగా మార్పు సంభవిస్తూ ఉంటుందని రచయిత వివరణ. అందుకే భారతం అనుభవాలసారంగా చరిత్ర పుటల్లో నిలిచే ఉందని రచయిత సూచించాడు.

ద్రౌపది సత్యభామకు ఉపదేశం చేసే సందర్భంలో మూలంలో మందుమాకులవల్ల భర్తను వశపరుచుకోలేమని వివరిస్తుంది. పైగా కృష్ణుడి అంతటివాడికి ఇలా భార్యగా నీవు మాట్లాడడం తగదని చెబుతుంది. ఒకవేళ మందులు, మాకులు ప్రయోగిస్తే వచ్చే అనారోగాలను వివరిస్తుంది. భర్త పట్ల ఎలా తను ఉంటున్నానో ద్రౌపది వివరించింది. అన్ని విన్న తర్వాత సత్యభామ ద్రౌపదికి నమస్కరించి ప్రదక్షణ చేస్తుంది. తను అవివేకంతో తప్పుగా ప్రశ్నించినందుకు క్షమించమని కోరుతుంది సత్యభామ. కృష్ణుడు చిద్విలాసంగా నవ్వాడు. ఈ సందర్భంలో ప్రదక్షణ చేయడం వదిలి మిగిలిని అంశాలన్నీ ద్రౌపది నవలలో యార్లగడ్డలక్ష్మీప్రసాద్ వివరించారు. ద్రౌపదిచెప్పిన భర్తపట్లప్రవర్తనలను ఒక్కో రహస్యంగా సుదీర్ఘంగా (మూడురహస్యాలుగా) వివరించారు.(పుటలు:229-230)ఈ రహస్యాలుగా చెప్పడం మూలానికి వివరణగా కనిపిస్తోంది.

ద్రౌపది వస్త్రభంగ సమయంలో పెనుగులాడి ఇక ఓపిక లేక చేతులు ఎత్తి ద్రౌపది కన్నులుమూసుకొని అప్రయత్నంగా 'కృష్ణ' అని అంటుంది. ఆమెచీరలాగుతున్న దుశ్శాసనుడు కూడా ద్రౌపదియొక్క నిశ్చలన సత్యాగ్రహంచూసి స్తంభించిపోతాడు. ద్రౌపది మనసంతా ఒక నీలి మేఘంగా పరుచుకున్నట్లు, దూరంనుంచి చక్రంలా తిరుగుతున్న ఒక వెలుగువలయం నుంచి నీలికాంతిపుంజాలు ఆమెపై ప్రసరించి అనంతమైన వస్త్రాల్లా గాలిలో తేలియాడుతున్న ద్రౌపది శరీరాన్ని అణువణువునా కప్పేసినట్లు (పుట.190) వర్ణించాడు. ఇది లేజర్ కిరణకాంతిలా అద్భుతంగాను, ఆశ్చర్యంగానూ ఉంటుంది. ద్రౌపదికి కృష్ణుడి సహాయం అంతర్లీనంగా రచయిత సూచించాడు. మూలంలోని వర్ణనకు మరింత మెరుగులు దిద్దినట్లు ఈ వర్ణన కనిపిస్తోంది.

ఈ నవలలో ఉన్న కొన్ని విశేషాంశాలు కూడా చూడొచ్చు-''ఛాయావాద్ అనే పేరు మనకి కొత్తగానీ ఈ శిల్పం మనకు అతిపురాతనం. మార్మికత దీనికి అప్పగారు. ద్వా సుపర్ణా సయుజా అన్న వేదమంత్రంతో ప్రారంభించి రామాయణాది మహాకావ్యాలలో చాలా సందర్భాలలో కనిపిస్తుంది. పెద్దలు చేసిన సమన్వయాలు ఎన్నో. అయితే ఈ శిల్పంలో సహజాతంగా ఉన్న ఇబ్బంది ఏమిటంటే - మమ్మటుడు చెప్పిన కావ్యజ్ఞుల చేయూత లేనిదే ఇది సాధారణంగా అందదు. అదీకాక ఒక ఘట్టంలోనో ఒక గ్రంథంలోనో శ్రీనుంచి ఇతిశ్రీ వరకూ దీన్ని నిక్షేపిస్తే అందుకోవడం కొంత సులువు. అలాకాక తక్కిన అన్ని రచనా

శిల్పాలతోనూ కలగలిపి అక్కడక్కడా మెరిపిస్తే గుర్తుపట్టడం చాలా కష్టం. అయితే దేన్నిగానీ అర్థం చేసుకోవాలనుకుంటే శ్రమపడాలి. అక్కర్లేదు పోనీ అపార్థమే చేసుకుందామనుకుంటే అందరూ అసహాయ శూరులే. అకృతాస్త్రులూ, ఆక్షేపణశీలురమాట అటుంచండి, అభ్యస్తులకు సైతం అందకపోతే ఈ సాహితీ శిల్పం అది కచ్చితంగా రచయిత పరాజయమే" అంటారు బేతవోలు రామబ్రహ్మంగారు రాసిన 'నవలగా "ద్రౌపది" సమీక్ష' వ్యాసంలో.

ఈ నవలలో కొన్ని అసంబద్ధ వాక్యాలను కూడా గమనించవచ్చు. అయితే అది ఛాయావాదంగా తీసుకోడానికి కూడా ఇబ్బంది అవుతుంది. ' నా చెల్లెలను చూసే నెపంతోనైనా నీవద్దకు నేను తరచుగా రావచ్చు కదా..." అని కొంటెగా కృష్ణుడు ద్రౌపదితో అన్నమాట. (అన్న-మాట)ఈ కొంటెగా అనడం అపార్థాలకు దారితీస్తోంది.

ఇంకో అంశం- సఖీ సంప్రదాయం. ఇది వ్యాసభారతంలో, యాజ్ఞసేని నవలలోనూ కూడా ఉంది. వ్యాసభారతంలో "కథం హి భార్యాం పాండూనాం పార్షతస్య స్వసా సతీ-వాసుదేవస్య చ సఖీ పార్థివానాం సభామిమామ్ (సభా. 62,10); సుతా ద్రుపదరాజస్య వేది మధ్యాత్ సముత్థితా ధృష్టద్యుమ్నస్య భగినీ తమ కృష్ణ! ప్రియా సఖీ!(ఉద్యో. 80అ. 21శ్లో)" కనిపిస్తున్నాయి. ఇది చాలావరకు అపార్థాలకు దారితీసింది. పాఠకులను తప్పుదారి పట్టిస్తోంది.

"భారతీయ విద్యాభవన్ సంస్థాపక మహర్షి శ్రీ కె.ఎమ్.మున్షీగారు కృష్ణావతార పేరుతో ఏడు పుస్తకాలు రాశారు. అవి ఒక్కొక్కటీ ఇప్పటికి ఆరేడు ముద్రణలు పొందాయి. వాటిలో మూడోది - ది ఫైవ్ బ్రదర్స్. ఇందులోనే ద్రౌపదీస్వయంవరం. ద్రుపదుడు ద్రోణుడిమీద ప్రతీకారం తీర్చుకోవాలి. అందుకోసం తాను బలం పెంచుకోవాలి. అందాల రాశి ద్రౌపదిని కృష్ణుడికిచ్చి చేస్తే ఇక తనకి తిరుగు ఉండదు. ద్రౌపదికూడా దీనికి అంగీకరించింది. సాందీపని శ్వేతకేతువుల మధ్యవర్తిత్వం నడిచింది. ద్రౌపదియే స్వయంగా కృష్ణుడితో మాట్లాడింది. కృష్ణుడు కాదంటే జరాసంధుడి మనవణ్ని చేసుకుంటామని ద్రుపదాదులు స్పష్టంగా చెప్పారు. ఇది కృష్ణుడికి బెదిరింపు. కానీ తాను ద్రౌపదిని వివాహం చేసుకోననీ (తాను యాదవుడు కనక) అయినా తనతోసహా తమ యాదవ బలాన్నంతా ద్రుపదుడి పక్షాన నిల్చుతాననీ ద్రౌపదికి స్వయంవరం ప్రకటించమనీ ఉత్తమోత్తమ క్షత్రియ ధానుష్కుడితో వివాహం జరిపిద్దామని చెప్పి, ద్రుపదుణ్ని ఒప్పిస్తాడు. జరాసంధుడివైపు అతడు పోకండా నిలవరిస్తాడు. పూర్తిగా రాజకీయపెళ్ళిగా చిత్రీకరించారు మున్షీ మహోదయులు. ఏ అర్జునుడైతే తనను బంధించి తీసుకువెళ్ళి ద్రోణుడి పాదాలచెంత పడవేశాడో ఆ అర్జునుణ్నే అల్లుడుగా అంగీకరించాడు ద్రుపదుడు. అలా తనవైపు తిప్పు కున్నాడు. కురుపాండవ వైరం కలిసివచ్చింది. ప్రతీకారం తీర్చుకున్నాడు." అని బేతవోలు రామబ్రహ్మంగారు తమ నవలగా ద్రౌపది సమీక్ష వ్యాసంలో వివరించారు.

ఇంకో అంశం- ఈ నీలిముత్యాల హారం. ఇది యాజ్ఞసేని నవలలో రచయిత్రి ద్రౌపదికి కృష్ణుడిచ్చిన నీలి ఉంగరం. ఈ నవలలో దాన్ని హారంగా మార్చాడు. దాన్ని

కృష్ణుడు నిరంతర ధారణచేయమనిఅంటాడు. "ఇది ద్రౌపదీ కృష్ణుల అభిన్నతకు సంకేతం. ఆ హారం ఉన్నంతసేపూ నేను నీతోపాటు ఉన్నట్టే కదా అంటాడు కృష్ణుడు శాక్తేయ మార్గంలో రాముడూ కృష్టుడూ లలితావతారాలే. ద్విభుజ శ్రీకృష్ణుడూ గోలోక విహారిణి రాధాదేవీ త్రిమూర్తులూ వారిదేవేరులూ- అందరూ లలితాపరాభట్టారిక అంశావతారాలే నంటోంది దేవీభాగవతం. రామతాపిని ఉపనిషత్తు సరేసరి.

ఒక రేఖమీద నరనారాయణులుగా కృష్ణార్జునులు అభిన్నులు (పుట- 237). ఇది వ్యాసుడు స్పష్టంగా చెప్పిందే (అరణ్య,13అ.38-40) మరొక రేఖమీద ద్రౌపదీకృష్ణులు అభిన్నులు (పుట 96, 122, 141). సఖ్యభక్తి సారూప్యంతో ఇంకొక రేఖమీద ద్రౌపదీకిరీటులు అభిన్నులు (పుట-54). ఇదొక ఆధ్యాత్మిక త్రిభుజం. దీన్ని విస్తరిస్తే, సాగదీస్తే ఒక సంప్రదాయంలో శ్రీచక్రం, మరొక సంప్రదాయంలో సుదర్శనం. దీనికి వేదికయైన మహేతిహాసం మహాభారతం. అచతుర్వదనో బ్రహ్మ .....! ఒక యుగాంతం జరగాలంటే కొత్త సృష్టికి ఒక విత్తనం మిగల్చాలంటే ఎంతలేసి దివ్యాస్త్రశస్త్రధారుల్ని దిగమింగాలి! అందుకే ఈ త్రిపుటీకరణ. శైవ, వైష్ణవ శాక్తేయాంశల ఏకీకరణ. నామాభిన్నత. రూపాభిన్నత. తత్త్వాభిన్నత. లక్ష్యాభిన్నత. నరుడు క్రియారూపం. యాజ్ఞసేని సంకల్పశక్తి. నడుమ నారాయణుడు వ్యూహమూర్తి. మన మధ్య ఎప్పుడూ ఆయన ఉండాల్సిందే కదా (పుట - 131) అంటాడు కిరీటి ద్రౌపదితో. కథాపరంగా ఈ రహస్యం ఈ ముగ్గురికే తెలుసు. అయితే కథ నడవడం కోసం ఈ ఎరుకనూ పూర్వజన్మ పరిజ్ఞానాన్నీ ద్రుపదుడికీ, అర్జునుడికీ, ద్రౌపదికీ, ధర్మరాజుకూ మరుగుపరిచాడు వ్యాసుడు. ఒక్క కృష్ణావతారం తప్ప తక్కిన అన్ని అవతార గాథలకూ ఇదే శిల్పాన్ని పాటించాడు. ఉపాధి లక్షణాలనే చూపించాడు. అందుకే కృష్ణుడి ముఖారవిందాన చెరగని చిరునవ్వు. సంకల్పాన్ని సంరక్షిస్తూ, ఆచరణని ఆకర్షణలకి దూరంచేస్తూ, దృఢపరుస్తూ, లక్ష్యసాధనవైపు నడిపించిన వ్యూహమూర్తి ఈయన. జ్ఞానస్వరూపిణి ద్రౌపది గ్రహించింది (పుట-139). సుభద్రార్జునుల వివాహాన్ని కూడా ఈమె ఈ దిశలోనే అర్థం చేసుకుంది (పుట-138). శత్రు పక్షంలో నడిచిన ఆచరణ వ్యూహాల గతినీ, అధోగతినీ తిలకిస్తే ఇది మరింత ఉజ్వలంగా స్పష్ట పడుతుంది."అని వివరించారు బేతవోలు వారు వారి 'నవలగా ద్రౌపది సమీక్ష' వ్యాసంలో.

## 5. 7. పర్వ నవల వర్ణనలు- మార్పులు, చేర్పులు

పర్వ నవల ప్రణాళికా బద్ధంగా, సందర్భానికి తగినట్లు మార్పులు చేర్పులు చేసారు. వ్యాసభారతానికి మరింత వ్యాఖ్యానంగాను,హేతుబద్ధంగానూఉన్నట్లు అనిపిస్తోంది. సహజంగా, స్వీయ పరిశీలనతోను, అనుభవంతోను బైరప్పగారు ఈ నవలని పూర్తిచేసారు.

శల్యరాజుకి మనుమరాలు ఉన్నట్లు మూలభారతంలో లేదు. కానీ పర్వనవలలో శల్యరాజుకి మనుమరాలు ఉంది. ఆమే హిరణ్యవతి. ఈ పేరు పెట్టడంలో రచయిత కొన్ని జాగ్రత్తలు తీసుకున్నాడు. శల్యుడి చెల్లెలు మాద్రిని శుల్క రూపంగా వస్తువులు తీసుకొని ఇచ్చేసాడు. హిరణ్యవతి విషయంలో కూడా ఆ విధంగా హిరణ్యం తేవాలని ఆ పేరు పెట్టాడు. కానీ చివరకు ఆమె వేరొకడితో వెళ్ళిపోతుంది హిరణ్యం తేదు అని

వ్యతిరేకవైఖరికూడా ఈ పేరులో ఉందని చివరకు అనిపిస్తోంది. ఇది హిరణ్యవతి విషయంలో కొసమెరుపు.

గాంధార రాజ్యానికి సైన్యాన్ని శుల్కంగా కానుకలు పంపి, గాంధారిని భీష్ముడు ధృతరాష్ట్రుడికోసం తెప్పించాడు. అతణ్ణి ఉద్దేశించి కుంతి "వంశం వృద్ధి చెందాలని జాతరలో మంచి పెయ్యిదూడలను తెచ్చినట్లు కోడళ్ళను తెచ్చాడు. తన అత్తవల్ల తన భర్తనూ, వీడి (దుర్యోధనుడు) తండ్రినీ, పొందినట్లుగా తనవల్ల ఈ పిల్లల్ని పొందారు. ఇప్పుడు పాండవులు కారట" (పుట.39) అనడం కొత్తప్రతిపాదన.

కుంతి స్వయంవరంలో పాండురాజుని వరిస్తుంది. పెళ్లయ్యాక కుంతికి గర్భం పండలేదు. పాండురాజు దిగ్విజయాలు చేసి వచ్చాడు. మాద్రిని తెచ్చి భీష్ముడు పాండురాజుకి రెండో పెళ్లి చేసాడు. దిగ్విజయాలకు వెళ్లి పాండురాజు ఆరు నెలలు అయ్యింది ఈ విషయంకుంతితో అన్నాడు. అప్పుడు కుంతి 'తనకు ఆరుసార్లు ఋతుస్రావమయింది' అనడంతో పాండురాజుకి కోపంవచ్చి, ఆమెను బలంగా చెంపమీద కొట్టాడు. దానికేం కుంతి ఏడవలేదు. పైగా చెమటపట్టిన పాండురాజుకు చెంగుతో తుడుతుస్తుంది. దాంతో చిన్నపిల్లాడిగా పాండురాజు వెక్కి వెక్కి ఏడుస్తాడు. ఇదంతా మూలంలో లేదు. ఇది అశక్త దౌర్జన్యానికి వివరణాత్మక కల్పన.

కుంతికి ధర్మాదులు పుట్టడాన్ని కొంతవివరణాత్మకంగా రచయిత ఈ నవలలో రాసాడు. ధర్మరాజు దేవలోకపు ధర్మాధికారినుంచి, భీముడు దేవలోకపు సేనాధిపతినుండి, అర్జునుడు దేవలోకపు ఇంద్రుణ్ణుంచి నియోగపద్ధతిలో పుట్టారని చెప్పాడు. ముగ్గురుకన్నా ఎక్కువమందిని కంటే వ్యభిచారమని, మాద్రికి అనుమతి ఇప్పించి దేవలోక కవలవైద్యులద్వారా నకుల, సహదేవుల్ని కన్నట్లు రాసాడు. నిజానికి ఒకర్ని కనడానికే కుంతి మాద్రికి అనుమతినిస్తుంది. అయితే ఆ దేవలోకపు కవలవైద్యులు విడిగా ఒక్కొకరు కలవమని అంటారు. వారిద్దరి కలయిక వల్ల ఇద్దరు పుట్టినట్లు ఈ నవలలో వివరణ ఉంది. కుంతి, మాద్రులు నవమాసాలు మోసి కన్నారని రచయిత వివరించాడు. ఇది మానవసహజంగా ఉంటుందని భావించడం. దేవలోకం అనేది హిమాలయాల అవతల ఉండే పర్వతలోకంగాను, అక్కడ ఇప్పటికీ అన్నదమ్ములందరికీ కలిపి ఇద్దరో, ముగ్గురో భార్యలు ఉంటారు. రచయిత ఆ ప్రాంతాల్ని చూసి అక్కడ నివసించే వాళ్ళతో మాట్లాడి చెప్పిన విషయాలివి. వీటిని ఆధారంగా ఇక్కడ విషయాన్ని విశ్లేషించారు. అయితే మూలంలో నియోగపద్ధతి ఉంది. విచిత్రకేతుడి భార్యలతో కృష్ణద్వైపాయణుడు నియోగం చేస్తాడు. కానీ, పాండురాజు భార్యల విషయంలో అలా చెప్పలేదు. దేవతల వరంగా పుట్టినట్లు ఉంది. కుంతికి పెళ్ళికి ముందే సూర్యుడివల్ల కర్ణుడు కన్నట్లు మూలంలో ఉంది. దాన్ని ఈ నవలలో కర్ణుడు దుర్వాసుడు పుత్రుడిగా, రాధ కుంతీ అంతఃపురదాసీగా వివరిస్తాడు. పాండురాజు అరణ్యాలకు వెళ్ళి వీర్యవృద్ధి కోసం మూలికా వైద్యం చేసుకోవడం, దానివల్ల సాఫల్యం పొందుతానో లేదో అని పాండువు భావించాడు. కుంతి దగ్గర మరో మార్గం లేదా పిల్లల్ని కనడానికి అని అడుగుతాడు. అప్పుడ కుంతి పెళ్ళికి ముందు తనకు ఒకపిల్లాడు పుట్టాడని అతణ్ణి రాధ పెంతోందని వెతికి తీసుకొద్దామని

చెప్పింది. అయితే పెళ్ళిలోనే అంతకుముందు పుట్టిన కానీనుడి స్వీకారం జరగాలని పాండురాజు అనడం మూలంలోలేదు. ఇది రచయిత వివరణాత్మక కథాసంవిధానంగా కనిపిస్తోంది.

సాలకటంకటి, భీముడి మొదటి భార్య. ఏ పేరూ తెలీక, ఆ అడవికి హిడింబవనం అని పేరు పెట్టినట్లు భీముడితో రచయిత చెప్పిస్తాడు. అయితే మూలంలో ఈమె పేరు కమలపాలిక. దాన్ని స్ఫురించేలా కుంతే కమలపాలిక అని పేరు పెడుతుంది. కమలముఖి, కమలనయన అని పేరు ఎందుకు పెట్టలేదని భీముడు తనలో తాను అనుకోడం మూలంలో లేదు. ఇది వర్ణనాత్మక మైన అంశంగా చూడొచ్చు.

ద్రౌపదీ స్వయంవరంలో మత్స్యయంత్రాన్ని ఛేదించిన అర్జునుణ్ణి ద్రౌపది వరిస్తుంది. మిగతావాళ్ళు రాజులు బ్రాహ్మణ రూపంలో ఉన్న అర్జునుణ్ణి అడ్డగించి ఎదిరిస్తారు. వారే ద్రౌపదిని తీసుకోవాలని భావిస్తారు. భీముడు అర్జునుడికి సహాయంగా ఉండి ద్రౌపదిని తీసుకు వస్తారు. అర్జునుడు కుంతితో గెలిచి తెచ్చాను చూడమని కుంతికి చూపిస్తాడు. ద్రౌపది అందాన్నిచూసి  కుంతి పొగుడుతుంది. ఈ లోగా భీముడు వచ్చి అర్జునుడు విల్లువంచి గురిపెట్టి కొట్టినా అక్కడున్న రాజులు బలప్రయోగంచేసి తీసుకుపోవాలని చూసారని వాస్తవంగా నేను గెలిచుకొని తెచ్చినవాణ్ణని భీముడు సాక్ష్యంగా "ఈమె ఎడమ భుజంచూడు నేను చేతిని చాచి పట్టుకొని నా వెనక్కు లాక్కుని రక్షించిన వేళ్ళ గుర్తులతో ఇంకా ఎలా ఎర్రబారి ఉందో, అందువల్ల ఈమె నా భార్య కావాలి"(పుట.167) అని చెప్తాడు. అర్జునుడు తిరగబడతాడు. కుంతి కలగజేసుకొని భీమార్జునుల భుజం మీద ఫట్ ఫట్ మని రెండు దెబ్బలు కొడుతుంది. జరిగిన విషయాన్ని చెప్పమని ధర్మువును అడుగుతుంది. "అమ్మా, ఈమె అర్జున, భీములలో ఎవరు పెళ్ళి చేసుకొన్నా, ఒక అధర్మం తలెత్తుతుంది. పెద్దవాడికి పెళ్లికాకనే చిన్నవాళ్ళు చేసుకోడం ఆర్యపద్ధతి అవుతుందా?" అని ధర్ముడు అంటాడు.

నీకు కూడా ఈమెమీద ఆశ పుట్టిందని, ఇంతవరకు న్యాయం మాట్లాడేవాడివని భావించినట్లు, "హిడింబివనంలో నీ జేష్టత్వపు హక్కు ఎందుకు వదలిపెట్టావు? ఆ రాక్షసి ఎడమచేత్తో నీజుత్తుపట్టుకొనిఎత్తి కుక్కుతుందనే భయంవల్లనా?"అని అర్జునుడు మాట్లాడుతాడు. ఇందంతా మూలంలో లేదు. మూలంలో వరప్రభావంవల్ల పుట్టి పాండవులకు భార్య అయినట్లుంది. దాన్ని రచయిత ఇలామార్చాడు.

ధర్మరాజు జూదంలో అన్నింటినీ, తమ్ముళ్ళను, ద్రౌపదిని ఒడ్డి ఓడిపోయాడు. ద్రౌపదిని సభలోకి దుశ్శాసనుడు లాక్కొని వస్తాడు. భీష్ముడి దగ్గరికెళ్ళి, 'ఇలా తనని ఓడడం న్యాయమా?' అని ప్రశ్నిస్తుంది. దానికి సమాధానం భీష్ముడు చెప్పడు. ధర్మరాజునే అడగమంటాడు. కానీ, భీముడు కోపంతో కూర్చున్నచోటునుంచే గర్జిస్తాడు. 'ఒరేయ్ ధర్మా! నీకేం తెలుసురా? సాధారణంగా జూదంకొంపల్లో లంజలుంటారు. లంజలకొంపల్లోనే ఎక్కువగా జూదం నడిచేది. జూదగాడు తన ఒంటిమీద బట్టలు వరకు పణం బెట్టి ఆడతాడు. అయితే ఎక్కడా తన లంజను పణంగా ఒడ్డడు. ఒడ్డితే అదికూడా చేతికి చెప్పిందుకొంటుంది.

అలాంటప్పుడు నువ్వు ధర్మపత్ని, పట్టమహిషిని ఒడ్డి ఆడతావా? నువ్వు ఇప్పుడు పోగొట్టిన రథ, తురంగ ఆభరణాదులన్నీ ఎవరివో తెలుసా?... రాజసూయానికి నేను తూర్పు దేశాలనుండి గెలిచి తెచ్చినవి. ఇంద్రప్రస్థ నగరం మేమంతా చెమటోడ్చి కట్టింది. పెద్దన్న యాజమాన్యానికి ఎదురు చెప్పరాదు అనే ధర్మానికి కట్టుబడి నేను వాటికేమీ నోరు విప్పలేదు. కానీ, నువ్వేలంజకంటే హీనంగా పెళ్ళాన్ని భావించి ఒడ్డి ఆడాక, ఈ నీచులు ఆమెను తొత్తు, దాసీఅని పిలవడం సహజమే. మొదటిశిక్ష నీకు వెయ్యాలి. సహదేవా! లే! వెళ్ళి కాసింత కొరవి తీసుకునిరా. వీడి రెండు చేతులూ, చేతివేళ్ళూ మొత్తం కాలి బూడిదయ్యాక మిగిలినవాళ్ల పని చూస్తాను''(పుట. 194) అంటాడు. మూలంలో కూడా భీముడు ధర్మరాజుని తూలనాడడం ఉంది. దుర్యోధనుణ్ణి, శకునిని నిందిస్తూ ప్రతిజ్ఞ చేసాడు. అటుపైన 'భవద్బాహుదాహం కరిష్యే' అంటాడు. దీన్ని మరింత విస్తరించడం, లంజకొంపలపోలిక తేవడం భైరప్ప చేసిన రసపోషణ.

ద్రౌపదితో పెళ్ళయ్యాక ఆమె దాంపత్యాన్ని కట్టడి చేస్తారు. ఆరునెలలకు ఒకొక్కరి వంతు వస్తుంది. కానీ, అర్జునుడు ధర్మరాజు కొలువు తీరుస్తున్న సమయంలో ద్రౌపది దగ్గరికి వచ్చి ఆమెను అనుభవిస్తాడు. ఆ తర్వాత ధర్మరాజు వచ్చి, అర్జునుడు వచ్చి, వెళ్ళాడా? అని ద్రౌపదిని అడుగుతాడు. దాంతో ద్రౌపది కొంత అవమానంగా అనుకొంటుంది. ఇకముందు అలా జరగనీకుండా జాగ్రత్తపడాలని అనుకుంటుంది. మర్నాడు అర్జునుడు ద్రౌపదిని అనుభవించాలని వచ్చాడు. కానీ, ద్రౌపది అంగీకరించదు. అందుకే అలిగి అర్జునుడు ఆరునెలలు దేశాంతరం వెళ్ళిపోతాడు. ఆ సమయంలో అర్జునుడి మనసులోని భావాల్ని రచయిత వర్ణిస్తాడు- "దాసీల సంపర్కం నీచమైందని వయసు తెలియకముందే తమ అయిదుగురి మనసులోనాటి పెద్దది చేసింది. ఈ విషయంలో తమను మొత్తం ఆర్యరాజుల్లోనే శుద్ధులనుగా చేసింది తమతల్లి. పెళ్లికి ముందు కామం తప్పు. పెళ్ళి తరువాత దాసీలతో ఆటతప్పు. అమ్మది ఖరాఖండి అయిన అభిప్రాయం'' (పుట. 230) అయితే పెళ్ళిళ్ళలో రాచకానుకలని సుందరీ మణుల్ని ఎందుకిస్తారని అర్జునుడు అడిగితే సమాధానం ఇవ్వడానికి బదులు కుంతి ఏడ్చేసింది. ఈ వర్ణన మూలంలో లేదు. అయితే సమాధానం కుంతి ఏం చెప్పినా ఇబ్బందే అవుతుంది. అందుకే రచయిత సమాధానంగా కుంతి ఏడుపుతో ఆ వాదనని అక్కడితో ముగించేసాడు.

ఉగ్రసేనుడు ఒక గంధర్వుడు, ఇతడి తల్లి దండ్రులు 'ముని', 'కశ్యపులు'. (పూర్వగాథాలహరి, పుట. 322) భాగవతంలో దేవకి ఇతడి సోదరుడి కూతురు. కంసుడితడి క్షేత్రజ కుమారుడు అని ఉంది. ఈ భాగవత విషయాన్ని కొంత ఊహను జోడించి పర్వ నవలలో కొత్తగా వివరించాడు భైరప్ప. ఉగ్రసేనుడి భార్య ఒకసారి ఋతుస్రావదినాలు దగ్గరికి వచ్చేసమయంలో దగ్గరిలో ఉన్న సరోవరానికి వెళ్లింది. అక్కడే ముట్టయింది. దాసీలు వద్దనా వినకుండా సరోవరంలో దిగి స్నానం చేసింది. ఆ సమయంలో దుష్టగ్రహాలు, శాపగ్రస్తజీవులు ఆమె గర్భలో ప్రవేశించి రాణి గర్భిణి అయింది అని రాణి సఖి 'చిత్ర' యుయుధానుడితో చెప్పింది. ఆమె ఆ తర్వాత అసలు విషయం ఇలా బయటపెడుతుంది- రాణి ఒకరోజు లేడిని తరుముతూ వెళ్ళగా అడవిలో ఒక పురుషుడు కనిపించాడు. 'ఓరే పురుషుడా! నువ్వు నా మొగుడు వేషంలో ఎందుకు వచ్చావు?' అని

ప్రశ్నించింది. దానికి సమాధానంగా 'తరుణీ! నేను వేషధారిని కాదు. నిజమైన పురుషుణ్ణే' అన్నాడు (పుట. **292**). ఇదంతా విటుడి తెలివితేటలకు గుర్తు. తర్వాత ఆమె ద్రుమిళుడితో రాత్రులు కలుస్తుండేది. పదిహేను రోజులైనా రాణి అడవినుంచి రాకపోవడం వల్ల ఉగ్రసేనుడు బయలుదేరి రాత్రి వేళలో వచ్చాడు. అక్కడ ద్రుమిళుణ్ణి శపించబోతుండగా వాడు రాజుని కొట్టి పారిపోయాడు. రాజు తన భార్యను ప్రశ్నించాడు. నువ్వే వచ్చావని అనుకున్నాను. ఇలా తెలివిగా సమాధానం చెప్పింది. పైగా గట్టిగా మాట్లాడితే నీ మర్యాదే పోతుంది అని రాణి బదులిచ్చింది. రాణికి గర్భం నిలిచింది. రాజు కంసుణ్ణి, తనకు పుట్టిన బిడ్డగా మానసికంగా అంగీకరించలేక పోయాడు. ద్రుమిళుడు రావడం మానలేదు. నిజానికి మిగతా ఎనిమిదిమంది మగ, ఐదుగురు ఆడపిల్లలు కూడా ద్రుమిళుడివల్లే పుట్టారు. కానీ, ఉగ్రసేనుడు తనకే పుట్టారని అనుకున్నారు.

కంసుడికి విద్యాబుద్ధులు నేర్పించలేదు. అయినా జాతక కర్మలరోజు పిల్లాడి తలను ఆఘ్రాణించాడు. ఒకరోజు తనకు పుట్టాడని భావించిన న్యగ్రోధునుడికి పద్దెనిమిది సంవత్సరాలు రాగా యువరాజుగా పట్టాభిషేకం చేయాలని రాజు అనుకుంటాడు. ఏ కారణం లేకుండా కంసుణ్ణి తప్పిస్తావని రాణి గట్టిగా రాజుని అడిగింది. కంసుడు 'ఇళ' అన్న దాసివల్ల విషయం తెలుసుకొని సభామధ్యలో ఉగ్రసేనుణ్ణి నిలదీసి భయంకలిగేలా చేసి యువరాజుగా పట్టం గట్టించుకున్నాడు. ద్రుమిళుడి రూపమే కంసుడికి వచ్చింది అని చిత్ర యుయుధానుడికి చెప్పింది.

న్యగ్రోధుడు కంసుడి సోదరుడుగా, బలరామకృష్ణుడు చారవార ముష్టికులను చంపిన తర్వాత వీడితో పోరాడి బలరాముడు న్యగ్రోధుణ్ణి చంపినట్లు భారతంలో ఉంది (*పూర్వగాథా లహరి*, పుట. **235**) దాన్ని ఈ నవలలో భైరప్ప వదిలి కేవలం ఉగ్రసేనుడు పట్టాభిషేకం చేయాలనుకోడం, రాణి ఎదురుతిరగడం, కంసుడు అసలు విషయం తెలుసుకోడం రాజ్యాన్ని ఆక్రమించడంగా మార్చారు. ఇది మూలభారతంలో లేదు.

జరాసంధుడి పుట్టుక విషయంలో కూడా పర్వ నవలలో మార్పులు చేసారు. జరాసంధుడి తండ్రి బృహద్రధుడు. మగధ కొండగుట్టల్లో ఉన్న అడవిలో రాక్షసజాతి స్త్రీని వలచాడు. ఆమె అరణ్యంలో ఒక్కతే ఉంది. "బాణం సంధించి రాళ్ళు, గుండూ విసిరిందట. చేతిలో ఉన్న కత్తితో నరికి వేయకుండా తండ్రి(బృహద్రధుడు) ఆమెతో ('జర' అనే స్త్రీతో) బాహు యుద్ధానికి ఎందుకు తలబడ్డాడు. ఆమె కూడా ఈయనతో పట్టుదలగా పోరాడింది. చివరకి ఓడిపోయింది తండ్రేనట. ఆయన ఎదురుగ్గా కూర్చొని తనను హత్తుకొని చెబుతూంటే ఆమె ఎద ఎంతగా ఉబ్బిపోయేది. తండ్రి ముఖంలో ఎంత హుషారు" పుట.**333**) అని జరాసంధుడి తండ్రి విషయంలో జ్ఞప్తికి తెచ్చుకొని అనుకున్నట్లుంది. ఆ ప్రేమతోనే ఆమె పేరు చేర్చి జరాసంధుడు అని పేరు పెట్టినట్లు రచయిత వివరించాడు.

మూలంలో జరాసంధుడి తండ్రి బృహద్రధుడు సంతానంలేక 'చండకౌశికుడ' నే ముని దగ్గరికి వెళ్ళి అభ్యర్థించాడు. ఒక ఫలాన్ని ఇచ్చి, నీ భార్యతింటే నీ కోరిక ఫలిస్తుందని చెప్పాడు. ఇద్దరి భార్యలకు కోసి, బృహద్రధుడిచ్చాడు. దానివల్ల శరీరం సగానికి కోసినట్లుగా

ఇద్దరు భార్యలు సగంసగం భాగాలు ఉన్న పిల్లాణ్ణి కన్నారు. ఆ స్థితిని చూసి వాళ్ళు దూరంగా పారేసారు. 'జర' అన్న రాక్షసి మాంసఖండాన్ని తిందామని దగ్గర చేస్తే, మనిషి ఆకారం తయారైంది. భయపడి జయద్రధుడికే ఇచ్చి విషయం చెప్పింది. ఆమెను గౌరవించి ఆమె పేరుమీదే జరాసంధుడికి నామకరణం చేసాడు. ఇది మూలంలోని విషయం.

పర్వలో చేసిన మార్పుకు మరింత బలం చేకూర్చడానికి భైరప్ప జరాసంధుడు తండ్రిలాగే రాక్షసజాతి స్త్రీని పెళ్ళి చేసుకుందామని అనుకుంటే, అప్పటికి ఏ రాక్షసజాతి స్త్రీ లేదని బాధపడి ఆర్యస్త్రీని పెళ్ళి చేసుకున్నాడని వివరించాడు. అందుకే ఆమె కడుపున పుట్టినవాడు బలహీనంగా ఉన్నాడని సహదేవుణ్ణి ఉద్దేశించి అనుకున్నాడు.(పుట. 333)

భీష్ముడి తల్లి గంగ. మారడ(సవతి)తల్లి మత్స్యగంధి విషయంలో పర్వ నవలలో మార్పులు చేసారు. గంగను కొండ జాతి స్త్రీగా చెప్పాడు. తల్లి ఉన్నంతవరకు 'గంగాసుతుడు' పిలిచేవారని, ఇప్పటికీ వరసకు తమ్ముడైన కృష్ణద్వైపాయనుడు అలాగే పిలుస్తాడని భీష్ముడు భావించినట్లు రచయిత వివరించాడు.(పుట.431)షరతులమీదే గంగ శంతనుణ్ణిపెళ్ళి చేసుకుంది. అది వాళ్ల ఆచారంగాను ప్రసవించే ముందు గంగ పుట్టింటి వెళ్ళి, బిడ్డని అక్కడే వదిలేసి, వచ్చేది. ఎనిమిదో కాన్పుకు మాత్రం శంతనుడు అరచి అక్కడకు పంపలేదు. బిడ్డకన్నాక శంతనుడి దగ్గరే వదలి వెళ్ళిపోయింది. తండ్రి వెదికించలేదు. ఆమె రాలేదు.(పుట. 433) షరతు పెట్టింది గంగ తండ్రి. హిమాలయాల దాకా వేటకు వెళ్ళినపుడు శంతనుడికి తన కులాచారం ప్రకారం మా ఆడపడుచుకు పుట్టే పిల్లందరూ ఆమె తల్లి ఇంటికి చెందుతారని, అందుకు ఒప్పుకుంటేనే తన కూతుర్ని ఇస్తానని చెప్పాడు. ఇది మూలంలోని విషయానికి కొంత సహజత్వాన్ని జోడించి చెప్పిన మార్పుగా కనిపిస్తోంది.

శంతనుడికి గంగా తీరంలో కనిపించినట్లు ఆ గంగ రూపాన్ని చూసి శంతనుడు ప్రేమించినట్లు మూలంలో ఉంది. 'రాజా! నేనేం చేసినా నీవు చేయవద్దని, అప్రియాన్ని పలకవద్దని, అప్రియాన్ని పలికితే నిన్ను వదలి వెళ్లిపోతానని షరతు విధిస్తుంది. పుట్టిన పిల్లల్ని గంగానదిలో పడేస్తుంది. ఎనిమిదో కాన్పుకు అలా చేయొద్దన్ని శంతనుడు అనేసరికి ఆ పిల్లాణ్ణి వదిలి గంగ వెళ్ళిపోతుంది. ఈ మూలం పర్వ నవలాకారుడికి అసహజంగా అనిపించి, పై విధంగా మార్పు చేసాడు.

మత్స్యగంధికి పర్వలో పెట్టిన పేరు 'కాళి'. చేపలు పట్టుకొనే వారిపిల్ల ఈమె. వేటకు వెళ్లే ఆమెను చూసి శంతనుడు మోహంలో పడి కాళి తండ్రిని అడిగాడు. నా కూతురికి పుట్టబోయే బిడ్డ నీ తర్వాత రాజ్యాధికారిగా చేసినట్లయితే కాళిని ఇస్తానని షరతు పెట్టాడు. దాంతో చేసేదిలేక శంతనుడు అక్కడనుంచి రాజ్యానికి వచ్చి మంచం పట్టాడు. సారథిద్వారా విషయం తెలుసుకున్న దేవవ్రతుడు (భీష్ముడు) ఆ చేపలు పట్టేవారి దగ్గరికి వెళ్ళి అతడి షరతులు అంగీకరించాడు. తను వివాహం చేసుకోనని ప్రతిజ్ఞచేసి ఆమెను తీసుకు వస్తాడు. ఆ సందర్భంలో కాళి రూపాన్ని వర్ణించాడు- నల్లటి రంగు. ఎండలో ఎండి, నీటిలో తడిసి గట్టిగా బిగదీరి కనిపించే కండరాలు. మోకాలు, కింది తొడ భుజాలు, ఎత్తయిన

ఎద ఉన్న ఈమె కాళి అని సారథి పరిచయం చేసాడు. ప్రతిజ్ఞ చేసిన తర్వాత దేవవ్రతుడు అని శంతనుడు పెట్టిన పేరు పోయి భీష్మగా మారినట్లు రచయిత వివరణ ఇచ్చాడు.

కాళి తండ్రికి తెలియకుండా పరాశర మహర్షితో పడవలోనే కామం చల్లారే వరకు ఆమెను అనుభవిస్తాడు. తద్వారా ఇలా ఎవరైనా అడిగితే తనకు తెలియజేయమని ఆమె తండ్రి గట్టిగా చెబుతాడు. పుట్టినవారు నల్లగా ఉన్నందువల్ల 'కృష్ణ' అనే పేరు పెట్టాడట. పెళ్ళయిన కొంతకాలం అంతఃపురంలోనే ఉండేవాడు. పరాశరుడువచ్చి తనకొడుకే ఇతడని చెప్పాడు. ఇప్పుడెందుకు తీసుకెళ్తున్నారని అడిగితే వీడు నా వేదజ్ఞానపరంపరకు ముందుకు తీసుకెళ్ళడానికి కావాలని అంటాడు. (పుట. 441) అలాగే వేదాన్ని నేర్పుతాడు. కాళికి పెళ్ళి సమయంలో పెట్టినపేరు సత్యవతి. కాళిని వాళ్ళభాషలో మత్స్యగంధి అని మొదట పిలిచేవారని రచయిత సూచించాడు. ఇలా మూలంలోని విషయాన్ని సూచిస్తూ, మత్స్యగంధికి 'కాళి' గా నామకరణం చేయడం మరింత సహజత్వాన్ని ఇచ్చింది.

మూలంలో గాధి కుమార్తె, ఋచీకుడి భార్యగా సత్యవతి ఉండేది. భర్తకు సేవలు చేస్తే అతడు తృప్తి పడి వరాన్ని కోరుకోమంటాడు. తనకొక పుత్రుడు, తన తల్లికొకపుత్రుడు కలిగేలా వరాన్ని కోరుతుంది. ఋచీకుడు సరే అని ఈమెను మేడి మ్రానును, ఆమె తల్లిని రావి మ్రానును కౌగలించుకోమని చెప్తాడు. వీళ్ళు దానికి భిన్నంగా చేస్తారు. తరువాత మంత్రజలం ఇస్తాడు. అది కూడా మార్చేసి త్రాగుతారు. సత్యవతి కడుపున పుట్టినవాడు క్షత్రియ వీరుడౌతాడని అంటాడు. సత్యవతి తన కడుపున కాక తన కుమారుడి కడుపున పుట్టేటట్లు అనుగ్రహించమని కోరుతుంది. సత్యవతి ఋచీకుడివల్ల జమదగ్నిని కంటుంది. అతడు క్షత్రియ పౌరుషాలు గల పరుశురాముణ్ణి కంటాడు. (పూర్వగాథాలహరి, పుట. 438)

మత్స్యగంధి పేరు చూసినట్లయితే యమునా నదిలో ఉపరిచరవసువు వీర్యం వల్ల చేపగర్భంలో పెరుగుతుంది. చేపలవాడు చేపని కోయగా ఈమె బయటకువస్తుంది. దాస రాజుకి కానుకగా ఆ బెస్తవాడు ఇచ్చేస్తాడు. పడవ నడిపేటప్పుడు పరాశరుడు ఈమెను చూసి మోహించాడు. తద్వారా కృష్ణద్వైపాయనుడు పుడతాడు. సత్యవతికి యోజనగంధి, గంధవతి అనే పేర్లు కూడా ఉన్నాయి. తరువాత దాసరాజు షరతుపెట్టి, తనకు తెలీకుండా అలాంటి పనులుచేయవద్దని కట్టడిచేస్తాడు. పూర్వజన్మలో అచ్ఛోదము(కొలను)గా బ్రహ్మాండ పురాణంలో ఉంది. సోమకులవారి మానసపుత్రిక ఈమె. తన తల్లిదండ్రుల్ని చూడాలని అనుకుంటుంది. 'అమావసుడు', అతడి భార్య 'అద్రిక' వెళుతుండగా వాళ్ళే తన తలిదండ్రులని భావించి పైకెగరుతుంది. పైగెరడం వల్ల స్థాన వ్యత్యయాన్ని పొందుతుంది. కాబట్టి కిందపడబోతుంది. అపుడు తలిదండ్రుల్ని ప్రార్థిస్తుంది. 'భూమిపై పడవు. అమావసు అద్రికలకు పుడతావు. మత్స్యయోనిలో పుట్టి పరాశరుడివల్ల, శంతనుడివల్ల కొడుకుల్ని కంటావు' అని సోమకుల దంపతులు అంటారు. ఆమే మత్స్యగంధిగా పుట్టినట్లు బ్రహ్మాండపురాణంలో ఉంది. (పూర్వగాథాలహరి, పుట. 13)

ఇక్కడ పూర్వజన్మ వాసనలున్నాయని తెలుసుకోడానికి బ్రహ్మాండపురాణంలోని ఈ కథ తోర్పడుతుంది. అందువల్లే ఈమె మత్స్యగంధి అయిందని భావించవచ్చు. భాగవతంలో

పావన శీలవతిగా మారిన సత్యవతి కైశకీనదిగా మారి హిమాలయాలకు వెళ్ళినట్లుంది. (పూర్వగాథా లహరి, పుట. 438) కానీ, భారతంలో అదే మత్స్యగంధి తన చేపలకంపు పోగొట్టుకొని పరిమళ భరితమైన 'యోజనగంధి'గా మారుతుంది. అంటే ఆమె పాపవ శీలవతిగా మారడం రెండిటిలోనూ సమానంగా కనిపిస్తోంది.

కృపుడు పుట్టుక గురించి చూస్తే- శరద్వంతడు గౌతముడి పుత్రుడు. మొదటినుంచి ధనుర్వేదాన్ని అభ్యసిస్తాడు. మహానిష్ఠతో తపస్సు చేస్తాడు. ఇంద్రుడితడి తపస్సు భయపడి భంగం చేయడానికి 'జానపది' అనే సుందరాంగిని పంపిస్తాడు. ఆమెను చూసిన శరద్వంతుడికి మోహం కలిగి, రేతఃపతనం అయింది. అక్కడ నుండి మరో ప్రదేశానికి వెళ్ళిపోతాడు. ఆ వీర్యం శరస్తంభంమీద పడి రెండుగా విడిపోయి బాలుడు, బాలికగా మారుతారు. ఆ ప్రాంతానికి వేటాడడానికి వెళ్ళిన శంతనుడు ఆ శిశువుల్ని చూసి, తన ఇంటికి తీసుకుపోయాడు. బాలుడికి 'కృపుడు' అని, బాలికకు 'కృపి' అని పేర్లు పెడతాడు. కొన్నాళ్లకు శరద్వంతుడువచ్చి, వారిద్దరూ తన సంతానమని చెప్పి కృపుడికి విలువిద్యను నేర్పుతాడు. (పూర్వగాథాలహరి, పుట. 408)

మూలంలోని ఈ విషయాన్ని పర్వ నవలలో రచయిత మారుస్తాడు- గౌతమ గోత్రం వాడైన 'శరద్వన్' అనే బ్రాహ్మణుడు విలువిద్య నేర్చుకున్నాడు. 'బాణం కట్టెలు కోసే కొండజాతికి చెందిన అడవిపిల్ల ఒకసారి కురునాడు అరణ్యాల్లో, విల్లంబులు పట్టుకొని పరుగెత్తే పక్షుల్ని వేటాడుతున్నదట. ఆమెను చూసి శరద్వన్ కి కామవాంఛ కలిగి, బలాత్కరిస్తాడు. అందువల్ల ఆమె గర్భవతి అయ్యింది. ఆమెకు మగ, ఆడ పిల్లలు పుట్టారు. తరువాత ఆ స్త్రీ జబ్బుపడి పిల్లల్ని ఎత్తుకొని అంతఃపురానికి వచ్చి, శంతనుడికి అప్పగించింది'. " నీ ప్రజలు, తండ్రిలా సాకవలిసింది నువ్వే" (పుట. 473) అని చెప్పి ఆమె ప్రాణాలువదిలిందట.

ఆయనకు పిల్లలంటే ప్రేమ. శంతనుడి భార్య పర్వతప్రాంతపు స్త్రీ. పుట్టిన బిడ్డలందర్నీ ఆమె పుట్టింటికి పంపి పంపి ఆయనకు దక్కనీయక పోవడంతో ఈ పిల్లలమీద ఆ ప్రేమ కలిగిందేమో అని రచయిత వివరిస్తాడు. తరువాత శరద్వన్ వచ్చి విచారించి, తనకు పుట్టిన పిల్లల్ని తీసుకెళ్ళి కొడుక్కి విలువిద్య నేర్పుతాడు. ఆ బిడ్డకు ఆరేడు సంవత్సరాలు వచ్చాక శరద్వంతుడు చనిపోతాడు. తరువాత ఆ పిల్లలు హస్తినకు వచ్చారు. అప్పటికి వచ్చిన కొద్దిపాటి అస్త్రప్రయోగవిద్యని చూపించి ఆచార్యుడిగా పదవి పొందుతాడు. కాని, మామూలు రథికుడికిచ్చేంత జీతం మాత్రమే పొందుతాడు అని సవివరంగా రచయిత వివరిస్తాడు.

భీష్ముడు బ్రహ్మచర్యం స్వీకరించాక, యుద్ధంచేసి బలవతంగా అంబ, అంబిక, అంబాలికల్ని ఎత్తుకొచ్చి విచిత్రవీర్యుడుకి చేద్దామనుకున్నాడు. వారిలో అంబ తాను సాల్వుణ్ణి ప్రేమించానని చెబుతుంది. కాని, తరువాత సాల్వుడు ఆమెను నిరాకరించడంతో, భీష్మణ్ణి పెళ్ళాడమంటుంది. తరువాత తండ్రి సహాయంతో పరశురాముణ్ణి కలిసింది. పర పురుషుణ్ణి వరించిన ఈమెను తన తమ్ముడు (విచిత్రవీర్యుడు) పరిగ్రహించడని

భీష్ముడంటాడు. ఇరవైనాలుగు రోజులు పరశురాముడు భీష్ముడితో యుద్ధం చేస్తాడు. దేవతలు ఋషులు వచ్చి యుద్ధం ఆపించేస్తారు. చేసేదిలేక పరశురాముడు వెళ్ళిపోతాడు. కౌశికుడి దగ్గరికివెళ్ళి అంబ విన్నవించుకుంటుంది. ఇలా ఎందుకు చేసావని గంగ అడగగా, భీష్ముణ్ణి జయించడానికి అని సమాధానం ఇస్తుంది. నీ కుటిల ప్రచారబుద్ధి వల్ల నీవు ఏరై పారుతావని పలికింది. అయినా అంబ తపస్సు మానలేదు. ఆమె తపస్సుకు మెచ్చి, శివుడు భీష్ముణ్ణి చంపునట్లు వరాన్నిస్తాడు. మరో జన్మలో ద్రుపదరాజుకు శిఖండి అన్న పేరుతో కూతురివై పుట్టి, కుమారుడివై భీష్ముడి మరణానికి కారణమవుతావని చెబుతాడు. వెంటనే భీష్ముడిమీద కోపంకొద్దీ, చితిపేర్చించుకొని శరీరాన్ని దహింప జేసుకొంటుంది. (పూర్వగాథాలహరి, పుట.4)

ఈ విషయాన్ని పర్వ నవలలో రచయిత పూర్తిగా సమర్థించడు. యుద్ధంలో భీష్ముడి చేతిలో భార్గవుడు ఓడిపోయినట్లు, అది తట్టుకోలేక అంబ మంటల్లోకి దూకినట్లు, దూకే సమయంలో భీష్ముణ్ణి చంపడానికే మరోజన్మ ఎత్తి వస్తానని చెప్పినట్లు వివరిస్తాడు. ఇదంతా ద్రుపదుడు తనకు పుట్టిన నపుంసకుణ్ణి ఇలా ప్రచారం చేసుకున్నాడని భీష్ముడు భావించినట్లు భైరప్ప సూచించాడు. యుద్ధంలో శిఖండి సవాలుకు సైనికులంతా నవ్వుతారు. "ఒరేయ్! మదమెక్కిన భీష్మా! అబల ఆడది అని నన్ను పట్టి తెచ్చి నాశనం చేసినవాడా! ఇప్పుడు నిన్ను అంతం చేయడానికే ఆడతనాన్ని పోగొట్టుకొని మగవాడిగా వచ్చా నంటాడు". 'యుద్ధానికి రమ్మనడం, సవాలు స్వీకరించకపోతే నేలనుతాకి నమస్కారం చేయమనడం' (పుట. 574) సైనికుల నవ్వుకు కారణంగా రచయిత పేర్కొంటాడు. అయితే భీష్ముడు అస్త్ర సన్యాసం చేసేముందు 'ఈ భీష్ముడికి భయంలేదని, నపుంసకుడి సవాల్ తన పరాక్రమానికి శోభించదని, సేనాపతి పదవినుంచి నివృత్తి అవుతున్నానని వెనక్కి వెళ్ళిపోతాడు' (పుట. 575).

మూలంలో యుద్ధంలో నేలమీదపడిపోతున్న భీష్ముడిశరీరానికి అర్జునుడు అంపశయ్యని ఏర్పరచాడు. రక్తశుద్ధి అయ్యాక ఏకాదశ ఘడియలవరకు స్వచ్ఛందంగా మరణాన్ని ఆపాడు. ధర్మరాజాదులతో మాట్లాడినట్లు, చివరకు భీష్ముడు దైవత్వాన్ని పొందినట్లు ఉంది.

పర్వనవలలో భీష్ముడే శరశయ్యను ఏర్పరచుకొని నిరాహారిగా స్వచ్ఛంద మరణాన్ని పొందుతూ, తన ఒంటిమీద వస్త్రాలన్నింటినీ తీసేసి, రాబందులకు బలై పోయినట్లు రచయిత మార్చాడు. చనిపోవడానికి ముందు దుర్యోధనుడితో మాట్లాడి సంధి చేసుకోమని సూచించాడే తప్ప, ధర్మరాజాదులతో మాట్లాడినట్లు లేదు.

ధృతరాష్ట్రుడి భార్య గాంధారి గర్భం ధరించాక చాలా రోజులకుగానీ పిల్లలు పుట్టలేదు. ఈ లోగా కుంతికి ధర్మరాజు పుట్టాడని తెలియగానే గాంధారి తన పొట్టమీద కొట్టుకుంటుంది. అందువల్ల పిండం ముక్కలై గర్భస్రావం అవుతుంది. దీన్ని తెలుసుకొని కృష్ణద్వైపాయనుడు ఆ పెద్ద మాంసం ముద్దను నూటొక్క ఖండాలుగా చేసి కుండల్లో ఉంచాడు. అందులోంచి నూటొక్కమంది సంతానం కలుగుతారట ఇది మూలభారతంలోని

అంశం.

పర్వనవలలో గాంధారి పిల్లలకంటే ముందే ధర్మరాజుని కుంతి కన్నదని, వందమంది పిల్లలు గాంధారికి పుట్టలేదని, దాసీలసంతానమంతా కలిపి ధృతరాష్ట్రుడి పేరును తండ్రిగా చెప్పుకున్నారని రచయిత అభిప్రాయం. మొత్తంమీద గాంధారికి పదిహేనుంది పిల్లలు పుట్టారని ఈయన అభిప్రాయం. వారు దుర్యోధన, దుశ్శాసన, దుస్సహ, దుశ్శల, దుర్ధర్ష, దుష్ప్రధర్షణ, దుర్మర్షణ, దుర్ముఖ, దుష్కర్ణ, దుర్మద, దుర్విగ, దుర్విరోచన, దుష్టరాజయ, దురాధర చివరకు కుమార్తె దుస్సల(పుటలు 454-455)గా వివరిస్తాడు. ధృతరాష్ట్రుడి పేరులో 'దు' అక్షరంతో తన పిల్లలకు పేర్లు పెట్టి ఉండవచ్చని బైరప్ప అభిప్రాయంగా చెప్పొచ్చు.

ద్రోణుడే ఏకలవ్యుడికి విలువిద్యనేర్పాడు. కానీ, అర్జునుడికన్నా మేటి అయిపోయాడని పథకం ప్రకారం అలాకాకుండా చూడమని భీష్ములవారే ద్రోణుడికి చెప్పాడు. అందుచేతే ద్రోణుడు కుడిచేతి బొటనవేలు గురుదక్షిణగా ఇవ్వమని అడుగుతాడు. ఏకలవ్యుడు అలాగే చేస్తాడు. తరువాత ద్రోణుడు రహస్యంగా ఏకలవ్యుడికి నాలుగు వేళ్ళతో విలువిద్యను సాధన చేయిస్తాడు. ఈ విషయం ఏకలవ్యుడు కురుక్షేత్ర సమయంలో ద్రోణుడి దగ్గరవిని, యుద్ధంలో పాల్గోకుండా వెళ్ళిపోతాడు. ఇది గురుశిష్యసంబంధాన్ని మెరుగుపరిచే విధంగా ఉంది. మూలంలోని విషయానికి కొంత మార్పుకూడా.

ఘటోత్కచుడు (భీమ, సాలకటంకటిలకు పుట్టినవాడు) కురుక్షేత్రయుద్ధంలో పాండవ పక్షంలో యుద్ధం చేసి జటాసురుడి కొడుకు అలంబసుణ్ణి, అలాయుధుణ్ణి సంహారించి కర్ణుడిమీదకు వెళ్ళాడు. కర్ణుడు ఇతడి బాహు విక్రమానికి సమానంకాక ఇంద్రుడిచ్చిన శక్త్యస్త్రాన్ని ప్రయోగించి సంహరిస్తాడు. ఘటోత్కచుడికి కొడుకు మేఘవర్ణుడు, అంజన పర్వుడు(పూర్వగాథాలహరి, పుట.134) ఇది మూలంలోని విషయం.

బైరప్ప పై విషయాన్ని చాలా సహజంగా ఉండేలా మార్చారు. భీముడు దుశ్శాసనుణ్ణి చంపాక, అలాయుధుడితో యుద్ధం చేస్తూ, అలాయుధుడి దెబ్బకు దిమ్మదిరిగి పోతాడు. ఆ సమయంలో ఘటోత్కచుడువచ్చి, అలాయుధుడితో ద్వంద్వయుద్ధం చేసి వాడిగొంతు పిసికేస్తాడు. అంతకు కొద్ది క్షణాలముందు కర్ణుడు కత్తి పట్టుకొని వచ్చి ఘటోత్కచుడి గొంతు తెగకోస్తాడు. భీముడు 'కర్ణడొస్తున్నాడు వెనుకనుంచీ' అని కేక పెట్టినా, ఘటోత్కచుడికి యుద్ధ ఘోషవల్ల వినిపించదు. అప్పటికే బలం లేక నిస్సహాయస్థితిలో భీముడున్నట్లు రచయిత వివరిస్తాడు. ఘటోత్కచుడి భార్య కామకటంకటి. వీరిద్దరికీ 'బర్బరకుడు' పుట్టినట్లు ఈ నవలలో ఉంది. ఇది మూలానికి చేర్పు.

దుర్యోధనుడి యుద్ధం చివరరోజున సరస్సులో దాక్కుంటాడు. భీముడితో యుద్ధం చేసి చివరకి భీముడు దుర్యోధనుడి తొడలమీద కొట్టి చంపేస్తాడు. ఇది మూలంలోని విషయం. పర్వ నవలలో ధర్మరాజు సరస్సు దగ్గరికి వచ్చాక, భీముడు తిట్టాక, బయటికి వచ్చిన దుర్యోధనుణ్ణి ఉద్దేశించి మాలో ఒకరితో యుద్ధం చేసి గెలిచినట్లయితే నువ్వే

విజయుడిగా ఒప్పుకుంటానని ధర్మరాజు అంటాడు. దానికి కృష్ణుడు నీతో యుద్ధం చేస్తానంటే నువ్వు అతణ్ణి ఓడించగలవా? అంటాడు. ఈలోగా అక్కడే కూర్చొని ఉన్న భీముడు లేచి, "కృష్ణా! ఇప్పుడే చెప్పాను. వీడు పెద్దవాడని సింహాసనం మీద కూర్చో బెడతాము అంతే. రాజ్యపాలనలో కాని, కోశాగార విషయంలో కానీ, వీడిదేమీ జరగడాన్ని నేను అనుమతించను. పెద్దన్న తండ్రితో సమానమని అంతా వదిలి పెట్టినందుకు జూదమాడి మమ్మల్ని ఈ గతికి తెచ్చాడు కదా. ఇక ఈ వ్యవహారం సాగదు. వీడు ఇప్పుడు శత్రువుతో మాట్లాడిన మాటకు మేం బద్ధులంకాము"(పుట. 691) అని అంటాడు. కృష్ణుడు భీముడితో యుద్ధం చేస్తావా అంటూ దుర్యోధనుణ్ణి అడగ్గానే లేచి భీముడి మీదకు వస్తాడు. ఒడిసి పట్టి తీక్షణమైన చూపులతో చూపులు చూసి 'వీడప్పుడే చచ్చిపోయి ఉన్నాడు. వీడి ముఖం ఈ లోకాన్ని వదిలి పెట్టి వెళ్ళిపోయింది. నీటి ఒడ్డునే ఎలాగు చేరుకున్నాడు. ఎవరూలేక స్వయం తర్పణ చేసుకోడానికి. ఇలాంటి వాడితో నా అంతటివాడు యుద్ధం చేయడమా? అంటూ తన ప్రతిజ్ఞకు కూడా విలువలేదని భీముడు వెళ్లిపోతాడని భైరప్ప మార్చారు. ఈ మార్పు భీమ, దుర్యోధనులిద్దరి ఉదాత్తను కాపాడుతోంది.

చివరి ఘట్టంలో పెద్ద ఎత్తున వర్షాలు పడడం సాలకటంకటి రాజ్యం మీదకు శత్రువులు వచ్చి తగులబెట్టడం, భర్తలు కోల్పోయిన స్త్రీలు, యుద్ధంలో సైనికులవల్ల గర్భవతులైన స్త్రీలు మొదలైనవారంతా వచ్చి తమకు పుట్టబోయో పిల్లలకు తండ్రి ఎవరు అని ప్రతిధ్వనించేలా నిలదీస్తారు. వాళ్ల కేం సమాధానం చెప్పకుండా, ధర్మరాజు బయట కురిసే వానను చూస్తూ, కూర్చోడంతో కథ ముగుస్తోంది. ఇది మూలంలో లేదు. ఇలా పర్వ నవలలో భైరప్ప మార్పుల్ని, కొత్తవాటిని కల్పించడం చూడొచ్చు.

## 5. 8. ప్రచ్ఛన్న పాండవము నవల వర్ణనలు - మార్పులు, చేర్పులు

చిలకమర్తివారు ఈ నవలలో ప్రత్యేకమైన మార్పులు ఏమీ చేయలేదు. కథలో మార్పులు చేర్పులు, వర్ణనలో సూచ్యాంశాలు లేవు. భారతంలోని కథను వేగంగా చెప్పదలచినప్పుడు విషయాన్ని ఏకవాక్యంలో కుదించే ప్రయత్నాలు చేసారు. యుధిష్ఠిరుడు యవ్వనవంతుడు అయ్యాడు అంటూ ప్రారంభించి, అతడి గుణగణాలను ఒక వాక్యంలో చెప్పారు. "ధృతరాష్ట్రుఁడు పుట్టి గ్రుడ్డి యగుట మహీపాలనంబు చక్కఁగఁ జేయలేమి కురుపాండవ రాజకుమారులలో విద్యా వినయ వివేక సంపత్తిచేఁ బ్రశంసనీయుఁడగు వానిని యువరాజుం జేయ గాంగేయాది కురువృద్ధులు సంకల్పించి యట్టివాఁడు యుధిష్ఠిరుండె యగుటం జేసి వానిని యువరాజుం చేయఁదలంచిరి." అని చెప్పారు.(పుట.4)

సామెతతో కూడిన మహావాక్యం- "మాయోపాయశోధనుఁడగు దుర్యోధనుఁడు వయసు నందె గాక దుర్గుణంబుల యందుం దనకుఁ దమ్ముఁడగు దుశ్శాసనుని 'శాలకో గృహనాశాయ' యను సామెత సార్థకముగాఁ దన తోఁబుట్టువు కాఁపురమునకు వచ్చినది మొదలు కాలసర్పము గృహంబు సొచ్చిన విధమున ధృతరాష్ట్రుని యింటనే యుండి మేనల్లురకు దుర్బుద్ధులు గఱపుచున్న శకునిని మధ్యమ పాండవునితో స్పర్థ వహించిన సుతనందనుఁడగు రాధేయునిం గూడ గట్టుకొని వారితో నాలోచించి పాండవులను

హస్తిపురమునుండి పాఱఁదోల నిశ్చయించి పాండవులను వారణావతమునకుఁ బంప వలసినదని యా వృద్ధుని బలుతెఱంగుల వేఁడుకొనిన వాని నోడం బఱచి, పాండవులనిమిత్తము వారణావతమున లాక్షాగృహము నిర్మింప జేసి వారి నక్కడ గాఁపుర ముండఁ బంపెను.' (పుటలు: 4-5.)ఇలా కొన్ని వాక్యాలు కనబడుతున్నాయి.

ఈ నవలలో కేవలం పాండవులు అరణ్యవాసం చేసి, అజ్ఞాతవాసం ఎలా పూర్తి చేసారో చెప్పదలచినట్లు కనబడుతోంది. రచన గ్రాంథిక శైలిలో ఉంది. విషయం మూల విధేయంగానే ఉంది.

## 5. 9. మాధవి నవలలో వర్ణనలు-సూచ్యాంశాలు :-

మాధవి నవలని 'ప్రతిష్ఠానపుర' వర్ణనతో ప్రారంభించారు. రాజభవనం, గోపురాలు, మందిరాలు, ఉద్యానవనాలు, అరుణోదయ శోభతో కళకళ లాడుతోంది. దానికి తగినట్లుగా దేవకన్యల్ని సిగ్గులచేసే అందంతో, రతీదేవిని మరిపించే లావణ్యంతో మెరిసిపోతోందా కన్య. అన్ని శుభలక్షణాలుఉన్న ఆ పదహారేళ్ల బాలఛాయ పాలమీగడఛాయతో పోల్చారు. విశాలమైన నుదురు, పొడుగాటి నల్లటి తలకట్టు, విశాలమైన నేత్రాలు, సంపెంగలాంటి ముక్కు, దొండ పండులాంటి పెదవులు వంపులతో కూడిన శరీరం అంటూ మాధవిని వర్ణించారు. పాఠకుడికి చదివించేందుకు ఇచ్చే శక్తిలా ఉంది. తర్వాత ప్రత్యేకమైన జాలి, అభిమానం, అయ్యోపాపం ఇంత అందమైన అమ్మాయికి ఇన్ని కష్టాలు వచ్చాయా అని పాఠకుడికి కన్నీరు పెట్టేలా చేయడానికి సహకరిస్తోంది. మాధవి చారునేత్ర మాటలసందర్భంలో మాధవివరించే రాకుమారుడు ఎలా ఉండాలో చెప్పుకుంటూపోతుంది. 'అందంగా ఉండాలి. సుకుమారంగా ఉండాలి. కాంతిమంతమయిన శరీరం. గాంభీర్యమే మూర్తీభవించిన వ్యక్తి. పెద్దనుదురు. పెద్ద కళ్ళు. విశాలమైనవక్షస్థలం. తలమీదకిరీటం. మెడలో ఆణిముత్యాలపతకం..., ఇలా వర్ణించుకుంటూ కలలోని రాకుమారుడు కళ్ళముందు నిలిచేలా చెబుతుంది. చివరకు వీరుడు, ఉదారుడూ, ధర్మపరుడు, వినయశీలి, ఏకపత్నీవ్రతుడు అయి ఉండాలి అని ముగిస్తుంది. ఈ మాధవి ఆలోచనలు భవిష్యత్తులో జరుగాతాయా అని పాఠకుడిలో ఉత్సుకత కలిగిస్తుంది. అలాంటి వాడు రాకుమారుడు అవ్వాలా? అని మాధవి అనేసరికి చారునేత్ర 'పెళ్ళికి ముందే నా రాకుమారుడ'ని వాదించేస్తున్నావు. తర్వాతేంగతి? అని అంటుంది. ఈ మాటలు చివరకు ఎలాంటిగతిని తీసుకువచ్చాయో తెలియజేస్తోంది. సామాన్యులంతా ఊహల్లో తేలడం, వాటిని పొందలేకపోవడం కనిపిస్తుంది. ఈ విషయం నవల చదవడం పూర్తయ్యాకగానీ తెలీదు.

విశ్వామిత్రుడి ఆశ్రమ వర్ణనలో సరస్వతీనది దానికి కుడివైపు విశ్వామిత్రుడి ఆశ్రమం. నదీ తీరంలోని పెద్దపెద్ద వృక్షాల్ని అల్లుకున్న పూల తీగలు. గాలికి వీచినప్పుడల్లా రాలిన పూలు నదీ ప్రవాహంలో కలిసిపోడం, తడిగా ఉన్న ఇసుకమీద సారస, చక్రవాక పక్షులు ఆడుకోడం, నల్లటిచుక్కలున్న జింక ఒకటి గాలవుడి దగ్గరకి పరిగెత్తడం. ఇవన్నీ రాబోయే కథని సూచించడానికి ఉపకరణాలు. జింకలా అమాయకంగా మాధవి బలి అవ్వడం కథాంశ విషయం.

గాలవుణ్ణి వర్ణించే సందర్భంలో - గాలవుడు పొట్టివాడు. సన్నని మనిషి. నల్లని రంగు. మోకాలు నుండి పైకి కట్టిన నీర్కావి నారపంచ తడికి ఒంటికి అతుక్కుపోయింది. ఒట్టి ఒంటిమీద జందెం. గుండ్రని మొహంలో కుందేలు కళ్ళులాంటి కళ్ళు. గడ్డం, మీసం, వెడల్పాటి పెద్దముక్కు, లావు పెదవులు. తలమీద పిలక(పుట.12). ఈ రూపం ఉన్న వ్యక్తికి అంత అందమైన మాధవిని యయాతి ఎలా ఇవ్వగలిగాడు? కేవలం బ్రాహ్మణుణ్ణి సూచించే పిలకే విశ్వామిత్రుడి శిష్యుడు అవునో కాదో కూడా తెలీదు. ఇది పాఠకుణ్ణి ఆలోచింపజేసే అంశం.

అధ్యయనశాలలో విశ్వామిత్రుడ్ని పాఠకులకు పరిచయం చేసారు. 'పొడుగ్గా వున్న దృఢమైన కాయం, తేజః పూరితమైన కళ్ళు, మోకాలి వరకూ కట్టుకున్న నారపంచ, ముడివేసిన ఉత్తరీయం భుజంమీద, మెడలో రుద్రాక్షమాల రొమ్ముమీద కనిపించే జందెం, దండలు, మణికట్టుల దగ్గర రుద్రాక్ష మాలలు భుజం వరకూ ఉన్న తెల్ల జుత్తు, పైకి ఎత్తి కట్టిన ముడి, గుండెలవరకూ వచ్చి తెల్లటి గెడ్డం... ఎవరినైనా ఆకట్టుకొనే రూపమది. తీర్చిదిద్దినట్లున్న పెదవులనుండి వెలువడుతున్న మాటలు, కంచు లాంటి కంఠధ్వని. బ్రహ్మర్షి అయినవాడు అధికారంతో ఆడుతున్న ఆ మాటలు అందర్నీ ముగ్ధుల్ని చేసేలా ఉన్నాయి. (పుట. 14) ఈ వర్ణనలో ఉపాధ్యాయుడికి ఉండాల్సిన లక్షణాల్ని చెబుతున్నాయి. అతడి వయస్సుని తెలియ జేస్తోంది. చివరకు విద్యార్థికి అడగాల్సిన గురు దక్షిణ ప్రభావానికి బలిఅయిన మాధవిని పోల్చుకున్నప్పుడు ఇతడి దృఢకాయత్వం మొదలైన అంశాల ద్వారా రచయిత్రి సూచించినట్లు కనిపిస్తోంది.

హర్యశ్వుడిని పరిచయంచేసే సందర్భంలో 'అయోధ్యాపతి హర్యశ్వుడు రాజ మందిరంలో మంత్రితో చదరంగం ఆడుతూ కూర్చున్నాడు. రాజు ఎడం చేతివైపున సువర్ణఖచిత పీఠం ఉంది. దానిమీద రజతమద్యపాత్ర ఉంది. అప్పుడప్పుడు మద్యం సేవిస్తూ ఆడుతున్నాడు రాజు. అతడి వయస్సుసుమారు ఏభైసంవత్సరాలు ఉంటుంది. తలవెంట్రుకలు తెల్లగా అవుతున్నాయి. అంత పెద్ద పొడుగు లేకపోయినా, ముఖంలో రాజఠీవి కనబడుతోంది. ఎర్రటి పట్టుపంచ, భుజం మీద ఓ తెల్లటి ఉత్తరీయం, చేతికి కంకణం, దండకడియాలు, తలమీద కిరీటం లేదుకానీ నుదుటమీద బొట్టు పెద్దగా కనిపిస్తోంది. ఆ చిన్నచిన్న కళ్ళను మరింత చిన్నవిగా చేసి హహ్హాహ్హా అని నవ్వడం అతడి స్వభావం' (పుట.41) ఈ వర్ణనంతా అతడి నిర్లక్ష్య ధోరణిని తెలుపుతోంది.

దివోదాసుడు యాగం చేయడానికి తగిన ఏర్పాట్లు చేయించాడు. అక్కడ అతిథులు ఉండే స్థలంలో కొలనులు ఏర్పటు చేశాడు శిల్పి. 'చక్కటి కొలను. స్వచ్ఛమైన నీటితో విచ్చిన తెల్లతామర, పచ్చతామరల పరిమళం కమ్మగా వస్తోంది. కొలనుకున్న మెట్లుకూడా చాలా శుభ్రంగా నున్నగా ఉన్నాయి. కొలనుగట్టుకు కొంచెం దూరంలో వున్న తులసి, మరువంద వనం, మాచపత్రులతోట, ఆ చుట్టూ పక్కల తిరిగే వారికి సువాసనలను పంచి పెడుతోంది. దానిని చూసి దివోదాసు మెప్పుదలతో తలవూపేసరికి శిల్పి, ఇలాంటివి పన్నెండు కొలనులు ఉన్నాయి ప్రభూ అని విన్నవించుకున్నాడు.(పుట. 68) ఒక చక్కటి ప్రణాళికా బద్ధమైన, పరిశుద్ధమైన యాగ విధానాన్ని అవలంభించిన్నట్లు ఈ వర్ణనవల్ల

తెలుస్తోంది.

దివోదాసుడు యాగం చేయడానికి తగిన ఏర్పాట్లు చేయించాడు. వేలాదిమంది ఒక్కసారిగా కూర్చోడానికి తగిన యాగమండపాలు కొంచెం ఎత్తులో ఉన్నాయి. యాగమండపానికి చుట్టూ ఎత్తైన గోడలు, వానా ఎండా లోపలకు రాకుండా బలమైన కప్పు, నాలుగుదిక్కులా నాలుగు పెద్దపెద్ద తలుపులు, గాలి వెల్తురూ యథేచ్ఛగా సంచరించడానికి వీలుగా ఏర్పట్లుచేసిన విశాలమైన కిటికీలున్నాయి. వచ్చినవాళ్లకు అనుకూలంగా ఉండేలా చెయ్యడం, ఈ రాజు ప్రజలను ఎలా చూసుకుంటాడో తెలుపుతోంది.

మెట్లుఎక్కి రాజూ, మంత్రీ, శిల్పితోపాటు యాగమంటపంలోకి వెళ్ళారు. పూర్వాభిముఖంగా ఎత్తుగా వేదిక ఉంది. యాగం చేసేటప్పుడు హోతృ, అధర్యులూ, ఋత్విక్కులూ కూర్చునే చోటు అది. ఇరవైవొక్క విశిష్టులయిన అతిథులు కూర్చునేందుకు ఏర్పాట్లు చేసారు. వెనుకభాగం అంతఃపుర కాంతలకోసం ప్రత్యేకగా ఉంచారు. ఎదురుగా ఉన్నచోటు ప్రజలకోసం ఏర్పాట్లు చేసారు. అక్కడ ఒకదానిపై ఒకటి వరసగా మెట్లున్నాయి. మంటపంలో వందలాది స్తంభాలున్నాయి. ప్రతీ స్తంభానికి రంగురంగుల బట్టలు చుట్టారు. గోడలకు నిలువెత్తు చిత్రాలు ఉన్నాయి. ఋష్యాశ్రమాల దృశ్యం ఓ వైపున ఉంటే మరోవైపు కొండలూ, జలపాతాల అందాన్ని ప్రతిబింబించే దృశ్యం, ఓ దిక్కున మహారాజు దివోదాసు సింహాసనం మీద కూర్చున్నట్లున్న దృశ్యం. ఇంకోవైపు అతడి తండ్రి భీమసేనుడి దేవతార్చన చేస్తున్నట్లున్న దృశ్యం. ఇలా చాలావిభిన్నమైన అంశాలతో ప్రజలకు ఆనందం పొందడానికి తగిన విధంగా ఉంచడం ఈ వర్ణనలో ప్రత్యేకత. ప్రజలందరూ అందమైన ప్రకృతితో పాటు రాజదర్శనం కాలేదు అనిపించుకోకుండా అతడి చిత్రాల్ని చూసి ఆనంద పడడం ఇంకో ప్రయోజనం. ప్రతీవారికి ప్రత్యేకత ఉండేలా తయారుచేయించడం ఇతడి సమదృష్టిని సూచిస్తోంది.

దివోదాసుడిచేత భారద్వాజులు యజ్ఞం చేయిస్తున్నారు. యజ్ఞకుండంనుంచి ఎనలేని కాంతితో పురుషాకృతి ఉద్భవించింది. చూడమని భారద్వాజులు దివోదాసుడితో చెప్పారు. దివోదాసుడికి మంటతప్ప మరేమీ కనిపించలేదు. కానీ, భారద్వాజులు పురుషాకృతిని వర్ణించారు- మహావీర్యంకల ఎరుపూ నలుపూ రంగులతో కూడిన వస్త్రాన్ని ధరించిన ఈ దేవతను చూడు. ముఖం ఎర్రగానూ, కంఠం దుందుభి లాగా, జుట్టు సింహపు జూలులా ఉన్న ఈ దేవతను చూసి ప్రణామం చెయ్యి, శుభలక్షణాలతో ఉన్న దివ్యాభరణాలతో అలంకరించిన ఈ హోమానికి నమస్కారం చెయ్యమని చెప్పాడు.(పుట. 86) ఈ వర్ణనలో యజ్ఞకర్మలమీద పూర్తి విశ్వాసంలేని స్థితిని సూచించడం కనిపిస్తోంది.

దివోదాసుడు రాజసభలో మందారమాల, రాజనర్తకి నాట్యం చేస్తుంది. 'తాళం, మృదంగం, వేణువుల మేళానికి తన బంగారు గజ్జెలు ఘల్లుఘల్లుమనేలా నడిచి వచ్చింది మందార మాల. రూపానికి తోడైన యౌవనం. దానికి ఈడైన సింగారం. వీటితో దేవకన్యలా శోభించింది ఆమె. వసంత ఋతువును ప్రతిబింబిస్తూ నాట్యమాడిందామె. చెట్లు చిగుర్చి పూలు పూసినట్లుగా కోయిలలు కుహుకుహు అన్నట్లుగా, అది చూసి నెమలి

నాట్యమాడినట్లుగా, ప్రకృతి అందచందాలు చూసి ప్రేమికులు ఉన్మాదంతో నృత్యం చేసినట్లుగా నాట్యం చేసింది. నృత్యంలో నూటఎనిమిది కరణాలు, నూట ఎనిమిది భంగిమలు చూపింది. భావము, విభావము, అనుభావము మొదలైన కళలను రేఖలోనే చూపి ప్రేక్షకుల మనస్సులు గెలుచుకుంది. రాజు ముందు కొంగు పట్టుకొని నిల్చునేసరికి, దివోదాసుడు మెచ్చుకొని, తనచేతి నవరత్నకంకణాల్ని తీసి ఇచ్చాడు.'(పుటలు:95- 96) ఇందులో రాజుకుండే నాట్యాభిరుచిని తెలుపుతునే, విలాసచేష్టలు ఉన్న రాజవ్యక్తిత్వాన్ని సూచిస్తోంది.

ఉశీనరుడి ఆకారం వర్ణిస్తూ- పచ్చటి పట్టువస్త్రాన్నీ, కేయూరం, అంగదం, చక్రవాలాన్ని ధరించిన రాజు పొడుగాటి వ్యక్తి. గుండ్రని ముఖం, పెద్దకళ్ళు, విశాలమూ ఉన్నతమూ అయిన మూపులు, శంఖం లాంటి కంఠం, నిండయిన గండస్థలాలు. మోకాళ్ళవరకూ ఉన్న చేతులు, నున్నటి దేహం, ధీర గంభీరమయిన నడక, దేహంలోని ప్రతి అణువులోనూ స్పష్టమయ్యే రాజఠీవి, పైగా యౌవన ప్రాయం. ఇలాంటి ఆకారం ఉన్నందువల్లే చుట్టు పక్కల రాజులంతా తమ ఆడపిల్లల్ని ఇద్దామని అనుకోవచ్చు. అతడి రూపానికి ఉండేశక్తి అలాంటిది.

మాహిష్మతి రాజకుమార్తెను దివోదాసుడికిచ్చాడు. ఆమెపేరు మహిమ. వివాహం అయిన రోజు మహిమను వర్ణించే సందర్భంలో 'వధువు మహిమ అంత పొడుగూ పొట్టికాని శ్యామల వర్ణపు యువతి. కుచ్చిళ్ళు చక్కగా పట్టి కట్టిన దివ్య పితాంబరం, జరీ రవిక, పైకెత్తి కట్టిన ముడి. దానికి మణిమాలల అలంకారం ఒంటినిండా తళతళ మెరిసిపోయే వజ్ర వైఢూర్య ఆభరణాలు. గోరింటాకుతో మెరుస్తున్నగోళ్ళు. ఒంటికంతా జవ్వాదిలేపనం' అంటూ వివరించింది. ఈ పై అలంకారాలు అందాన్ని ఇచ్చాయే కానీ, ఆమె పెద్ద అందగత్తెకాదని మాధవిముందే ఒక చెలికత్తెతో రచయిత్రి చెప్పించింది.

పైన పేర్కొన్న వ్యక్తుల వర్ణనలో ఒక సామ్యం ఉంది. కేవలం అందాన్ని చూసి మురిసి పోకూడదు. అందం అనేది శరీరానికి సంబంధించిందే. కానీ, అది హృదయగతంగా చూడాలని వ్యక్తమౌతోంది. అలాంటి వ్యక్తిత్వం ఉన్నవారిలో శరీరగత, హృదయగత సౌందర్యరాశి మాధవే అనేది స్పష్టం.

## 5. 9. 1. మాధవి నవలలో మార్పులు- చేర్పులు :-

గాలవుడు విద్యాభ్యాసం విశ్వామిత్రుడి దగ్గర చేసాడు. గురుదక్షిణ వద్దని గురువు అన్నాడు. అయినప్పటికీ బలవంతంచేసి నాకు గురుదక్షిణ ఇవ్వగలిగే శక్తినిచ్చారని భావిస్తున్నానని అన్నాడు. దీనికి కోపం వచ్చి విశ్వామిత్రుడు గురుదక్షిణ 'తెచ్చిఇవ్వలేనిది' కోరాడు. గరుత్మంతుడు గాలవుణ్ణి తీసుకొని మూలంలో ఉద్యోగపర్వం 114అధ్యాయంలో యయాతి దగ్గరికి వెళ్ళినట్లు ఉంది. కానీ ఈ నవలలో కేవలం దారి చెప్పి, ఆశీర్వదించి గరుత్మంతుడు వెళ్ళిపోయినట్లు మార్చారు.

మాధవి చిన్నప్పుడే ఆమె తల్లి చనిపోయింది. మాధవిని దాసి సాకింది. గాలవుడు వచ్చి గురుదక్షిణ కోసం సహాయం చేయమని యయాతిని అర్థించాడు. మాధవి కొన్ని రోజుల క్రితం, అంటే యుక్త వయస్సు వచ్చాక ఎవరీ అందగత్తె అని తనకుమార్తెనే చూసి యయాతి అనుకున్నాడు. వెంటనే స్వయంవరం చేయాలని అనుకున్నాడు. కానీ మాధవి ఎలాగూ తనకు బరువే! పుట్టుకతోనే తల్లిని చంపిన అపశకునపు పిల్ల. ఏ రకంగానూ తనకు ప్రయోజనకారిణికాదు. వృద్ధాప్యంలో తనకు ఆదుకునే మగపిల్లలున్నారని విచారించలేదు. కానీ దేవయానిని అడిగితే 'మాధవిని దానం చేస్తే మనం మన ధర్మాన్ని రక్షించుకున్న వాళ్ళం అవుతాం. స్వయంవరంకోసం డబ్బూ దస్కం సమకూర్చుకోనక్కర్లేదు' అని అంటూనే, సవతి తల్లిదానం చేయించిదనే అపవాదు తనమీద పడకూడదని హెచ్చరించింది. ఇదంతా మూలంలో లేదు. యయాతి తనకుతానే నిర్ణయం తీసుకొని దానం ఇచ్చేసాడని ఉంది.

గాలవుడు మాధవిని తీసుకొని బయలుదేరాడు. దారిలో రాత్రి సమయం అయింది. అంతవరకూ బ్రహ్మచారిగాఉన్న గాలవుడు, ఆమెను అనుభవించాలని అతడి మనసు కోరుతుంది. తనకు తానే విధించుకున్న నియమాలనుండి బయటకు రావాలని ప్రయత్నిస్తున్న ఆశ అలాగే కానీ అంది. గాలవుడు లేచి మాధవిని వెన్నెల్లో చూసాడు. ఆమెను కౌగలించుకొని చుంబించకపోతే తాను జీవించలేను అని అనిపించింది ఓ క్షణం. శరీరమంతా వేడెక్కి, ముఖమంతా చెమట పట్టింది. చివరకు తనకు గురుదక్షిణ నిమిత్తం ఇచ్చిన దాన్ని ఇలా చేయకూడదనిపించింది. ఈలోగా అయ్యోపులి, పులి అని మాధవి కేక పెట్టింది. ఎవరూలేరని మాధవికి గాలవుడు ధైర్యం చెప్పాడు. ఇదంతా మూలంలో లేదు.

హర్యశ్వుడి దగ్గరకు గాలవుడు మాధవిని తీసుకొని వెళ్ళి గురుదక్షిణకోసం వచ్చానని, ఈమెను యయాతి తనకు దానం చేసాడని చెప్పాడు. 'మునివర్యా, ఈ కన్యను చూడగానే మోహించాను. కన్యాశుల్కంగా ఎంతధనం కావాలో చెప్పండి. కావాలంటే ఈ రాజ్యాన్ని కూడా ఇచ్చేస్తాను'(పుట.41) అని హర్యశ్వుడు అన్నాడు. మూలంలో సంతానంకోసం చాలా రకాలుగా తలచి మాధవి అందాన్ని పరిశీలిస్తాడు హర్యశ్వుడు. ఈ కన్య ఎత్తుగా, ఉండవలసిన ఆరింట ఎత్తుగా ఉంది. అంటూ ఈమె చక్రవర్తిఅయ్యే కొడుకును కనగలదు అని అంటాడు. బ్రాహ్మణ శ్రేష్ఠా! నా సంపదను చూసి శుల్కాన్ని చెప్పమని కోరతాడు.(4-116-2,3,4,5శ్లోకాలు) అని మూలంలో ఉంది దీన్ని పైవిధంగా మార్పు చేసారు.

హర్యశ్వుడు 'తన దగ్గర గాలవుడు కోరిన ప్రత్యేకమైన గుర్రాలు రెండు వందలే ఉన్నాయి. మిగతావి సాధారణ గుర్రాలు ఇస్తాను. ఈ మాధవినుంచి ఒక్క పుత్రుణ్ణి పొందుతాను. నా కోర్కెను తీర్చమని గాలవుణ్ణి అడుగుతాడు.(4-116, శ్లో-5-9) హర్యశ్వుడి మాటలు విన్న మాధవి 'నాకు నలుగురు కొడుకులు పుడతారు. ఇది నాకు వరం ఇచ్చాడు'38 (4-116, శ్లో.10) ఇలా నలుగురు రాజులనుంచి నీవు ఎనిమిది వందల గుర్రాల్ని సంపాదించ వచ్చు. నాకు నలుగురు కొడుకులు పుడతారు. ఇది నాకు తోచిన పద్ధతి. ఇక నీ ఇష్టమని గాలవుడితో మాధవి చెబుతుంది. (4-116అ. శ్లో.10-13) దానికి

గాలవుడు శుల్కంలో నాల్గవభాగం (రెండువందల గుర్రాలు) ఇచ్చి కన్యను తీసుకొని ఒక కొడుకును పొందమని చెప్పాడు. రాజు ఆమెను తీసుకొని గాలవుణ్ణి పొగిడి కట్టుబాట్లకు లోబడి శుభముహూర్తాన కొడుకును పొందాడు. ఇదంతా మూలంలోని విషయం.

పై విషయాన్ని ఈ నవలలో హర్యశ్వుడు తనకు మాధవిని వదలుకోవాలని లేదని, మాధవివల్ల యధేచ్ఛగా కామసుఖం పొంది, పుత్ర సంతానం తర్వాత ఇచ్చేస్తాను. ఆమెను ఇంకో రాజుకిచ్చి మిగిలిన అశ్వాలు తీసుకోండి. (పుటలు 42-43) అని అన్నాడు. గాలవుడు ఆలోచించి ఒకే రాజు దగ్గర ఇన్ని గుర్రాలు దొరకవు అని నిశ్చయించుకొని మాధవి నుదుటి రాత ఇలాగుంటే ఎవరేం చేస్తారు. సంవత్సరాంతానికి వస్తానని, మాధవిని నాకు అప్పగించండి అని రాజుతో చెప్పి వెళ్ళిపోతాడు.

మాధవికి కొడుకు పుడతాడు. పచ్చి బాలింత అయిన రెండు నెలలకే గాలవుడు మాధవిని తీసుకెళ్ళడానికి వచ్చేస్తాడు. రెండునెలల బాలింతరాలు ఇంత త్వరగా ఈమెను తీసుకు వెళ్ళటమా? మధ్యలో ఏమయినా జబ్బుచేస్తే? అని ఒక వృద్ధ దాసీ ప్రశ్నకు అయితేనేం చస్తాను అంతేనా అంటూ కచ్చితంగా మాధవి తెగేసి చెప్పింది. బయలుదేరిపోయింది. దారిలో సన్నని వర్షంజల్లు కురవడంతో తడిసిపోయింది. చలి పట్టుకుంది. గాలవుడు ఆమె నుదురు తాకి చూస్తే మండిపోతోంది. గడియదూరంలో ఋష్యాశ్రమానికివెళ్ళి ఋషిపత్ని వేదవతి సహాయంతో మాధవి కోలుకుంది.(పుట. 65) ముని వరాలు ఇచ్చినట్లున్న మూలంలోని విషయాన్ని వదిలేసారు. సామాన్యస్త్రీగా మాధవిని తీసుకోడం ఈ నవలలో కనిపిస్తోంది. దివోదాసుడి దగ్గరకు మాధవిని తీసుకువెళ్ళి ఈమె వల్ల కొడుకును కన్నాక తిరిగి ఇచ్చేయమని గాలవుడంటాడు. మాధవి విషయం విని నిట్టూర్చి 'తానూ ఒక వ్యక్తి అని వీరిలో ఎవరికీ అనిపించదా? తాను పుట్టకపోతే ఎంత బాగుండేది. ఇలాంటి బ్రతుకు ఏ ఆడదానికి వద్దు' అని అనుకుంటుంది. (పుట.77) ఇది నవలలోని అంశం.

మూలంలో లేని దివోదాసుడి అశ్వమేధ యాగ సంకల్పం ఈ నవలలో కనిపిస్తుంది. 'పాణిగ్రహణం ఇలాంటి సమయంలో చేయవచ్చా? అని అడిగితే గాలవుడు పాణి గ్రహణం శుభకార్యం కనక, అది చేసేది ప్రజాపతి అయిన రాజు. ఇతరులకు వర్తించే నియమాలు ఈ విషయంలో నీకు వర్తించవని' గాలవుడు అంటాడు.(పుట.77) దివోదాసుడికి అంతకుముందే 'సత్యవతి' అనే ఆమె భార్యగా ఉంటుంది. ఆమెకు తెలీకుండానే మాధవిని పెళ్ళి చేసుకున్నాడు. ఇది అమూలకాంశం.

ఉశీనరుడు మాహిష్మతి రాజ్యాలకు యుద్ధం జరగడం మాహిష్మతి రాజే యుద్ధానికి తలపడ్డాడు. అతణ్ణి ఉశీనరుడు ఓడించాక, మాహిష్మతి రాజు కోరికమేరకు అతడి పుత్రిక 'మహిమ' ను పెళ్ళి చేసుకుంటాడు. మహిమ పెత్తనం చెలాయించేలా ప్రవర్తిస్తుంది. మాధవికొంచెం బాధ పడినా, ఇబ్బందిగా భావించదు. ఇది అమూలకాంశం. సవతుల వైరం సూచించడానికి ఈ పాత్రను కల్పించినట్లు అనిపిస్తోంది. అంతకన్నా ప్రయోజనం ఏమీలేదు.

ఉశీనరుడి తర్వాత ఇంకా రెండువందల గుర్రాలు గాలవుడు గురుదక్షిణకోసం పొందాల్సి ఉంది. కానీ, అవి లభించలేదు. రెండు వందల గుర్రాలకు బదులుగా మాధవినే గురువుగారికి సమర్పిస్తే ఎలా ఉంటుందని ఉశీనరుణ్ణి గాలవుడు అడిగితే 'మంచి ఆలోచన' అని అతడు సమర్థించాడు. ఉశీనరుడి ద్వారా పూర్వపు రాజులకు గుర్రాన్ని పంపించే ఏర్పాట్లు చేయమని గాలవుడు కోరాడు. అంతవరకు తన భవనంలోనే ఉండమని గాలవుణ్ణి అన్నాడు. ఇది నవలలోని అంశం.

మూలంలో గాలవుణ్ణి దారిలో గరుత్మంతుడు చూసి నవ్వి, అదృష్టంవల్ల నీకోరిక నెరవేరింది అనిఅన్నాడు. ఇంకా నాల్గవవంతుమిగిలిందని, గాలవుడు బాధగా అన్నాడు. ఇంకా ప్రయత్నించినా అలాంటి గుర్రాలు దొరికే అవకాశమే లేదని అన్నాడు. దానికి వివరణ- పూర్వం 'కన్యాకుబ్జ' నగరంలో గాధికొడుకు సత్యవతిని ఋచీకుడు భార్యగా ఇమ్మని అడిగాడు. అయ్యా! ఒకవైపు శ్యామ వర్ణం ఉన్న చంద్రుడి రంగున్న వెయ్యి గుర్రాల్ని ఇమ్మని గాధి అడిగాడు. ఋచీకుడు అలాగే అని వరుణుడి భవనంలోకెళ్ళి, అశ్వ తీర్థంలో వెయ్యి గుర్రాలు సంపాదించి గాధిరాజుకిచ్చాడు. ఆ గాధి రాజు పుండరీక యాగం చేసి ఆ గుర్రాల్ని బ్రాహ్మణులకు దానం చేసాడు. వారినుంచి హర్యశ్వ, దివోదాస, ఉశీనర రాజులు రెండేసి వందల చొప్పున కొనుకున్నారు. మిగిలిన నాల్గువందల గుర్రాలు తీసుకొని వస్తున్నప్పుడు దారిలో వితస్తా నదిలో కొట్టుకుపోయాయి. రెండువందలగుర్రాలకు బదులుగా మాధవినే మీ గురువుకు సమర్పించమని గరుత్మంతుడు గాలవుడికి సలహా ఇచ్చాడు. ఈ విషయం అంతా మూలంలో ఉంది.

గాలవుడు గురుదక్షిణ తీరాక మాధవిని యయాతికి అప్పగించాడు. యయాతి మాధవికి స్వయంవరం చేయాలని తలపెట్టాడు. గంగా, యమునానదుల సంగమస్థలంలో ఉన్న ఆశ్రమంలో పూల మాల ధరించిన మాధవిని రథమెక్కించి తీసుకువచ్చారు. ఆశ్రమంలో పూరుడు, యదుడు, సోదరి మాధవికి వరుణ్ణి వెదుకుతూ తిరుగుతున్నారు. నాగులు, యక్షులు, నరులు, గంధర్వులు, మృగాలు, పక్షులు, కొండలు, చెట్లు, కోతులు, అక్కడ సమూహాలుగా ఉన్నాయి. చాలామంది భటులతోను, చాలా మంది ప్రభువులతోనూ, బ్రహ్మముఖం లాంటి ఋషులతోను ఆ ప్రదేశం నిండింది. చక్కగా దేహసౌందర్యంఉన్న మాధవి రథందిగి, బంధువులందరికి నమస్కరించింది. తనకు చూపిస్తున్న వరులందరిన్నీ దాటి వనవాసమే మేలైందని వెళ్ళిపోయింది. పుణ్యప్రదమైన వనం చేరి, తపస్సు చేయసాగింది చాలా రకాల ఉపవాసాలు, దీక్షలు నియమాలతో మనస్సు తేలిక పర్చుకొని మృగంలాగ తిరగసాగింది. యయాతి స్వర్గం చేరాక, పుణ్యక్షయంవల్ల భూలోకానికి పడసాగాడు. అప్పుడు మంచివాళ్ళదగ్గర పడాలని కోరుకున్నాడు. మాధవికి పుట్టిన కొడుకులవల్ల స్వర్గం చేరగలిగినట్లు మూలంలో ఉంది.

పై విషయాన్ని ఈ నవలలో యయాతి దగ్గరకి తిరిగి వచ్చిన మాధవికి స్వయంవరం యయాతి ప్రకటిస్తాడు. వద్దు తండ్రి నాకెందుకు పెళ్ళి అని మాధవి అంటుంది. వద్దు అనకమ్మా. క్షత్రియధర్మ నేను పాటిస్తున్నాను. లేకపోతే నాకు ముక్తి లభించదు.(పుట.186) అని యయాతి మాధవితో అంటాడు. మాధవి మౌనం వహిస్తుంది.

చాలా మంది రాజకుమారులు స్వయం వరానికి వస్తారు. మంగళస్నానం చేసిన మాధవికి సర్వాలంకరణ జరిగింది. రాజకుమారులందరకీ యయాతి స్వాగతం పలికాడు. జయజయ ధ్వానాలు మిన్నుముట్టాయి. మాధవి అడుగుపెట్టేముందు, ఉన్నట్టుండి ఉచ్చైస్వరంతో మాధవి 'నేను ముగ్గురు రాజులతోనూ, ఓ ఋషితోనూ ఉండి వచ్చాను. నన్ను వివాహం చేసుకోడానికి మీకేం అభ్యంతరంలేదా?' అని రాకుమారుల్ని అడిగింది. (పుట.188) యయాతికి కోపం వచ్చింది.

స్వయంవరానికి వచ్చినవాళ్ళు బహుశా ఈ కన్య మూడు రాజ్యల్ని, ఋష్యాశ్రమాన్ని చుట్టి తన అనుభవాన్ని పెంచుకొని వచ్చిందనే నిర్ధారణకు వచ్చి, ఏమీ అభ్యంతరం లేదని సమాధానమిచ్చారు. పైగా మాధవిని చేపట్టడమే 'మహాభాగ్యమ'ని ఏకకంఠంతో అన్నారు. అందరి రాజకుమారుల దగ్గరికి వరమాలతో వెళ్లింది. కానీ ఎవరినీ ఆమె వరించలేదు. తొందరలేదు ఇంకోమారు చూసి రావమ్మ అని యయాతి అన్నాడు. అతడి మాటకు చిరునవ్వు నవ్వి, స్థిరమైన స్వరంతో 'తండ్రీ! ఇంతకు ముందెన్నడూ నాకు నా భవిష్యత్తు నిర్ణయించుకునే అవకాశం రాలేదు. ఇప్పుడు ఆ హక్కు నా కిచ్చారు. నా ఇష్టం వచ్చినట్లు చేయ్యచ్చు కదా? అని అడిగింది. యయాతి అంతా నీ ఇష్టం అన్నాడు. వెంటనే ఈ స్వయంవరం వద్దు. నేనెవర్నీ పతిగా వరించలేను. నా శరీరాన్ని నలుగురు భోగించి సుఖపడ్డారు. పరలోకం బాధ నాకులేదు. నేను ఆత్మోద్ధరణానికి అడవికి వెళ్ళి తపస్సు చేసుకుంటాను. వనమే నా వరుడు!. నన్ను వదిలేయండి.' (పుట.189) అంటూ వరమాలని విసిరేసి, వారందర్నీ తిరస్కరించి, మండపం దాటి అరణ్యం వైపు నడిచింది. చెలికత్తె చారునేత్ర వస్తానన్నా నా కెవరి తోడూ వద్దు. పుట్టినప్పుడు ఒక్కదాన్నే పుట్టాను. ఇకముందూఅంతే. అంటూ ప్రపంచాన్నే ధిక్కరించేంత పెద్దపెద్ద అంగలు వేసుకుంటూ నడిచిన మాధవిని ఎవరూ ఆపలేకపోయారు. ప్రతిమల్లా ఉండిపోయారని రచయిత్రి మార్పు చేసింది. ఈ మార్పును గమనించాక, రచయిత్రి ఆధునిక స్త్రీకోణంనుంచి చూసినట్లు అనిపిస్తోంది.

ఈ విధంగా మూలంలో ఉన్న మాధవి పాత్రను మెరుగులు దిద్ది పాఠకుల హృదయంలో చిరస్థానం సంపాదించుకున్న వ్యక్తిత్వంగా, స్త్రీకి స్వేచ్ఛను ఇచ్చి నిలిపారు. మాధవికోణంలో ఉన్నస్థితి పాఠకులకి కన్నీరుపెట్టిస్తుంది. అంతేకాదు మగతోడు లేకుండా ఆడవాళ్ళు బతకగలరనే ఆత్మస్థైర్యాన్ని ఇచ్చే ఆదర్శపాత్రగా కనిపిస్తోంది.

మాధవి కథకు ఆధారం సంస్కృత మహాభారతంలోని ఉద్యోగపర్వంలో 114, 117-120 అధ్యాయాల్లో ఎక్కువగా ఉంది. మాధవి జీవితంలో వచ్చే ముఖ్యమైన వ్యక్తులు గాలవుడు, విశ్వామిత్రుడు, యయాతి, దివోదాసు, హర్యశ్వుడు, ఉశీనరుడు వీళ్ల గురించి మహాభారతంలో ఉద్యోగపర్వంలోని 106-108, 115; ఆదిపర్వంలోని 69,78,87; సభాపర్వంలోని 8; ద్రోణపర్వంలోని 63; శాంతి పర్వంలోని 28; అనుశాసన పర్వంలోని 271 వ అధ్యాయాల్లో ప్రస్తావన ఉంది. వీటిని కొన్ని వివరణ రూపంలోను, కొన్నిటిని మార్చి కథావేగాన్ని పెంచేటట్లు రచయిత్రి రచనా విధానాన్ని రూపొందించారు. మరింత సమాచారంకోసం అనుబంధం ఒకటి చూడగలరు.

## 5. 10. యయాతి నవలలో వర్ణనలు- మార్పులు, చేర్పులు

యయాతి నవలలో అద్భుతంగా వర్ణనలు చోటు చేసుకున్నాయి. ప్రకృతి వర్ణన, నిద్ర దేవతా వర్ణన, అరణ్యవర్ణన, స్త్రీవర్ణన, విరహం, ప్రేమ, మృత్యువు, అదృష్టం, నిరాశ మొదలైనవి సందర్భోచితంగా, పాఠకుడికి ఆసక్తికి కలిగే విధంగా ఉన్నాయి. యయాతి రాజుగా ఉన్నా, మానవీయ సంఘర్షణలు మరిన్ని ఇతడి పాత్రలో తగిన విధంగా ఉన్నాయి.

యయాతి తన అన్న 'యాతి/యతి'ని దర్శిస్తాడు అనుకోకుండా. అతడితో మాట్లాడుతూ 'నిన్ను చూస్తే అమ్మ చాలా సంతోషిస్తుందని' అంటాడు. దానికి సమాధానంగా యతి "ఈ బ్రహ్మ లోకంలో అన్నిటికీ మించిన ఆనందం ఒకటే ఉంది బ్రహ్మానందం!. శారీరక సుఖం అది స్పర్శ ద్వారా పొందినా, దృష్టి ద్వారా పొందినా వేదనకే దారి తీస్తుంది. శరీరమే అన్నిటికన్నా మనిషికి శత్రువు. దానికి జయించటానికి నిరంతర ప్రయత్నం చేయడమే మనిషికి ఈ ప్రపంచంలో ఏకైక కర్తవ్యం... కోరిక మనిషిని శరీర ఆరాధకుణ్ణి చేస్తుంది. శరీరాన్ని ఆరాధించే వారిలో ఆత్మ చైతన్యం నశించిపోతుంది. ఆత్మను జాగృతం చేసే శక్తి కేవలం విరక్తిలోనే ఉంటుంది. ప్రతి ఇంద్రియం మీద మనిషి విజయం సాధించగలగాలి" అంటూ(పుట.59)విరక్తిని గురించి విశేషంగా వర్ణిస్తాడు. ఇందులో సన్యసించినవారు ఎలా వైరాగ్యం, విరక్తి ప్రదర్శిస్తారో చూడొచ్చు. చివరకుచేదు తినడం, ఏకాంతంలో ఉండడం, ఇవన్నీ తమ ఇంద్రియాలమీద విజయంగా భావించడం యతి లక్షణాల్ని వివరిస్తూ విరక్తి చాటున ఆసక్తి కూడా... అంటూ ఆగిపోతాడు. మనస్సును జయించడం ప్రపంచాన్ని జయించినంత తేలికకాదు అనడం వేదాంత ధోరణిలో పతాక స్థాయిని సూచిస్తోంది. ఆడవాళ్ళమీద సన్యాసిఅయిన 'యతి' కుండే ఆసక్తిని సూచించడం కూడా ఉంది.

యయాతి అంగిరస మహర్షి ఆశ్రమానికి వెళ్ళాడు. అక్కడ సాయం సంధ్యని వర్ణించడం ఉంది -'సాయంకాలం గడిపోయింది. గూళ్ళకు తిరిగి వచ్చే పక్షుల కలకల రవాలు మధురంగా ఉన్నాయి. పశ్చిమాన ఆకాశంలో యజ్ఞగుండం జాజ్వల్యమానంగా మడుతున్నంట్లుంది. ఆ జ్వాలలు మేఘాలకు హారతి పట్టినట్లూ, పక్షులు మంత్రోచ్చారణ చేస్తున్నట్లూ ఉంది'(పుట. 67) ఇక్కడ ఆకాశంలో యజ్ఞగుండం జాహ్వల్యమానంగా మండుతోంది అని చెప్పడం ఆకాశంలో యజ్ఞగుండం చెప్పడం ఆ యజ్ఞానికి సరైన ఫలితం ఇవ్వడం, అందుకే హారతులు పట్టినట్లు చెప్పడం భావికథ కచుడు దేవరాక్షస యుద్ధాన్ని ఆపడం అనే విషయాన్ని సూచిస్తోందని చెప్పొచ్చు.

యయాతి వకుళికతో రాత్రంతా ఆనందంలో తేలియాడుతూ గడిపాడు. మర్నాడు తన తండ్రి అనారోగ్యంతో ఉన్నాడని గుర్తుకువచ్చి, తనమీదతనకేఅసహ్యమేసింది. రాజాంతఃపురం లోకి వెళ్ళాడు. తల్లి సమక్షంలో తను దాసితో ఉన్న విషయం చెప్పేస్తే పాపంపోతుందా అని అనుకుంటే రాజమాత నా దగ్గర ఏదో దాస్తున్నట్లు ఉన్నావని అంటుంది. ఆ సందర్భంలో యయాతి మనసును రచయిత- "అశోకవనంలో రాత్రంతా నీవు మాకోసం బాధపడినట్లున్నావు. నీవు చాలా సున్నితమైన వాడవు. ప్రతిమాట పట్టించు

కుంటావు. పిచ్చివాడా! సమస్యలెవరికి లేవు?"(పుట. 92) అంటూ మానవ మనసును వర్ణించే ప్రయత్నం చేసాడు. ఇదంతా మూలంలో లేదు. సమస్యల్లో ఉన్నవాడికి కొంత ఊరటనిస్తుందీ వర్ణన.

దేవదానవులకు యుద్ధం జరుగుతోంది. రాక్షసులగురువు శుక్రాచార్యుల మృత సంజీవిని విద్యవల్ల చచ్చిన రాక్షసులు బతికించేస్తున్నాడు. దేవతలు ఓటమి అంచుకు చేరారు. యయాతికి కచుడు ఒక ఉత్తరం రాసాడు. అందులో "ఏ యుద్ధాన్నయినా అది ఇద్దరు మనుష్యుల మధ్యయినా, రెండు జాతుల మధ్యల లేదా రెండు శక్తుల మధ్య అయినా మేము హర్షించం"అంటూ(పుట.89) అందమైన ప్రకృతిలో అందరూమనుగడ సాధించలేరా? దేవతలకు కూడా మృతసంజీవిని విద్య లభిస్తే ఓటమిని ఆపగలమని భావించి శుక్రాచార్యుల దగ్గరికెళ్ళి, ఆయనకు సేవలు చేసి విద్యను నేర్చుకోడానికి సాహసిస్తున్నానని ఉత్తరంలో రాసాడు. ఇది కచుడే నిర్ణయం తీసుకున్నట్లు యయాతి నవలలో ఉంది. మూలంలో దేవతలు నిర్ణయించి కచుణ్ణి వెళ్లమని కోరారు. ఇక్కడ ప్రకృతిని నాశనం చేయడం భావ్యంకాదని, విశ్వశ్రేయస్సుని కోరుకొంటున్న రచయిత భావన ప్రస్ఫుటమౌతోంది.

యయాతి స్నేహితుడు మాధవుడు. నహుషుడు అనారోగ్యంగా ఉన్న సమయంలో మాధవుడి దగ్గరకు యయాతి వెళ్లి, ఉండే ఏర్పాట్లు రాజమాత చేయించింది. మహారాజుని ఆమె చూసుకొంటోంది. మాధవుడు ఒక మహా పండితుడి దగ్గరకు తీసుకెళ్ళాడు. పూర్ణిమ, అమావాస్య రోజులలో ఆ పండితుడు తన కుంటుంబ సభ్యులతో కలిసి భోంచేస్తాడు. మిగతా రోజుల్లో ఆయన చదువుకొనే గదిలోకే భోజనం తీసుకువెళ్తారు. అతడికి ఏ వారమూ గుర్తుండదు. హిమాలయ పర్వతాల ఎత్తుతో దొంతర్లుగా ఆయన గదిలో పుస్తకాలుంటాయి. ఆషాఢమాసం అమావాస్యరోజున అర్థరాత్రి అతడింట్లో దొంగలు పడ్డారు. ఈ పండితుడు ఏదో శ్లోకానికి అర్థం వెదుకుతూ చేతిలో దీపం, పెరిగిన గడ్డం, కృశించినశరీరం కనబడేసరికి వచ్చిన దొంగ ఇతణ్ణి చూసి దయ్యమని భయపడి పారిపోయాడని మాధవుడు యయాతికి చెప్పాడు. ఈ కథ మూలంలో లేదు. ఇది కేవలం యయాతికి మానసికోల్లాసాన్ని పెంచడానికి రచయిత కల్పించిన కథగా చెప్పొచ్చు.

దేవయానికి తిరిస్కరించి, శపించి, కచుడు దేవలోకం వెళ్ళిపోయాడు. ఆ విషయాల్ని పడుకున్నప్పుడు దేవయానికి కలగా వచ్చాయి. ఒకరోజు శుక్రుడు దేవయానికి ఏవిధమైన లోటు ఉండకుండా చూడమని వృషపర్వుడితో చెప్పి, తపస్సుకు వెళ్ళి పోయాడు. వృషపర్వుడు దేవలోకానికెళ్ళి కచుణ్ణి బంధించి, దేవయాని ముందుంచి ఏం శిక్షవిధించ మంటారో ఆజ్ఞాపించమని అడుగుతాడు. ప్రేమించిన ప్రియుడికి ఏం శిక్ష విధించగలదు. తనను ముద్దు పెట్టుకుంటే స్వతంత్రుడవు కావచ్చు అని దేవయాని అంటుంది. కచుడు నిరాకరిస్తాడు. పైగా కచుడు దేవయాని శుక్రుడికి పుట్టారని అనేసరికి దేవయాని ఉగ్రురాలైపోయింది. పిల్లలు తల్లి కడుపునుండి పుడతారు. తండ్రి కడుపు నుండికాదు. చివరిగా దేవయాని హృదయాంత రాళాలలో అనురాగ దీపాన్నివెలిగించి హారతిపట్టింది. ఆ హారతిపళ్ళాన్ని లాక్కొని పిచ్చివాడిలా కచుడు విసరివేసినట్లు భావించింది. వెంటనే కచుడి తల నరకండి. అతడి తలని నరికి ఒక పళ్లెంలో పెట్టండి అని

అజ్ఞాపించింది. అలా చేసిన తర్వాత దేవయాని నాట్యం చేసినట్లు భావించింది. అలా ఎంత సేపు నాట్యం చేసిందో ఆమెకు తెలీదు. కచదేవా! మీరు ముద్దివ్వడానికి సిద్ధంగా లేరు, కానీ నేనే ముద్దు తీసుకున్నానని దేవయాని అనుకుంటుంది. ఇది తీరనికోరికలు తీర్చుకొనే స్థితిని తెలియజేసేందుకు రచయిత ఈ కథని కల్పన చేసాడు. (పుటలు.152-154)

దేవయాని, శర్మిష్ఠ ఇద్దరూ జలకేళికోసం అడవికి వెళ్ళారు. అక్కడ ఈత పందెం వేసుకున్నారు. పెనుగాలి రావడంతో శర్మిష్ఠ ఒడ్డుకు వచ్చి, దేవయాని తెచ్చుకున్న చీరని కట్టేసింది. అది దేవయానికి మొట్టమొదటసారి దేవలోకంనుంచి తెచ్చిన చీర. తన చీర కట్టుకోవడంతో శర్మిష్ఠని ఆ చీర విప్పేయమని కోపంతో చెప్పింది. దాంతో శర్మిష్ఠకు కూడా కోపంవచ్చింది. నీ తండ్రి మా తండ్రి దగ్గర బిచ్చగాడని నిందించింది. అది దేవయానికి మరింత కోపాన్ని పెంచింది. దేవయాని అలిగి, వేగంగా పరుగెత్తింది. వెనుక శర్మిష్ఠ ఆగమని కేకలు వేసింది. చాలా దూరం పరిగెత్తాక నూతి ఒడ్డున దేవయాని ఆగింది. తన చీర ఇచ్చేయమని దేవయాని ఒత్తిడి చేసింది. శర్మిష్ఠ సంకోచింది. పది క్షణాలతర్వాత ఏం మాట్లాడిందో, ఏం చేసిందో దేవయానికి గుర్తులేదు. కానీ, అమ్మా అన్న కేక వినిపించింది. శర్మిష్ఠ దేవయాని ప్రాణం తీసేయాలనుకోలేదు. "నేను ఆమెను కొంచెం ఈడ్చుకుంటూ, ఆ నూతి అంచుకు తీసుకుపోయాను. ఆమె మొదట అక్కడికే వెళ్ళి నిలబడింది. మేమిద్దరం పెనుగులాడినప్పుడు ఆమె సరిగా నిలబడలేక నూతిలో పడిపోయింది" (పుట.177)అని శర్మిష్ఠ అనుకోవడం గమనించదగిన అంశం. మూలంలో శర్మిష్ఠే బావిలోకి నెట్టేసింది అని ఉంటే దాన్ని సమంజసంగా లేదని నవలలో రచయిత ఈ మార్పు చేసాడు. ఇది మూలానికి శోభను కూర్చింది.

యయాతి అన్న యాతి. కచుడు ఇతణ్ణి తీసుకొని యయాతి దగ్గరకు వచ్చాడు. అతడే తన అన్న అని సభలోనే యయాతి ప్రకటించాడు. యాతి వచ్చిన రోజునుంచి వర్షం, వరదలు వచ్చాయి. శర్మిష్ఠను భార్యగా చేసుకుంటారా? అనే దేవయాని ప్రశ్నకు ఆమెను యాతి చూసి "యాతి బిగ్గరగా నవ్వుతూ అన్నాడు. భార్యా! కాదు! నేను... ఈమెను మగవాడిగా మార్చేస్తాను!" అనే సరికి సభలో నవ్వు మొదలైంది. శర్మిష్ఠ దగ్గరికి యాతి ఒకరోజు వచ్చాడు. అతడి స్పర్శ తగలగానే శర్మిష్ఠ కేకలు పెట్టింది. వెంటనే కిటికీగుండా దూకి ఎటో పారిపోయాడు. ఆ వర్షంలోనే ఎటో వెళ్ళిపోయాడు.(పుట.256) అని ముసలిదాసిద్వారా దేవయాని తెలుసుకుంటుంది. యాతిని గురించిన ఈ విషయం మూలంలో లేదు. ఇది రచయిత సృష్టి.

యయాతి శర్మిష్ఠను మాధవుడి సాయంతో ఊరిపొలిమేరల్ని దాటించేసాడు. తర్వాత దేవయానితో యయాతికి విరోధం వస్తుంది. శర్మిష్ఠ జ్ఞాపకాలతో అశోకవనంలోనే యయాతి ఉండిపోతాడు. గురుమహరాజ్ పేరుతో ఒకడు (మందారుడు) వచ్చి, ముకుళిక సాయంతో రాజుకు అమ్మాయిల్ని తారుస్తుంటాడు. ఆ భోగ లాసనను వర్ణిస్తూ ఆ సుఖాల్నే స్మరిస్తూ యయాతి ఉంటాడు. "సన్నని అందమైన యువతి! ఆమె కేశాలు ఎంత అందంగా ఉన్నాయి. వాటిని సవరిస్తూ ఉన్నప్పుడూ, ఇవి కేశాలు కావు. ఈమె ముఖకమలంపై నున్న తుమ్మెదల గంపని నా కనిపించింది. నా స్పర్శతో ఈ తుమ్మెదలు తమ సమాధినుండి

మేల్కొని 'ఝుం' అంటూ ధ్వని చేస్తాయి.

ఆ అందమైన శ్యామవర్ణపు చిన్నది, బహుశ కిందటి జన్మలో ద్రాక్షలత కావచ్చు. ఆమె అధరాల స్పర్శతో శరీరమంతా రోమాంచితమై పులకించింది. ఆమె, ఆ సిగ్గులోలికే శ్యామల వర్ణపు సుందరి తలను పైకెత్తి ముద్దిడుతుంటే కలిగిన ఆనందం! ఆకాశం మధ్యలో మబ్బుల నుండి బయటకు వచ్చిన అర్థ చంద్రునిలా ఉంది. ఆమె ప్రసన్నస్వరూపిణి, ఆమె శృంగారంలో నేర్పరి. మదనునికే రతిక్రీడ నేర్పగల జాణ" అంటూ(పుట. 428) స్త్రీ వర్ణన చేసారు. యయాతి ఆనందంకోసం మదిర మదిరాక్షులతో భోగలాలస జీవితాన్ని సాగించడాన్ని తెలియజేయడానికి రచయిత ఈ వర్ణన చేసాడు. మూలంలో బంగారు రంగు వెంటుకల అమ్మాయిని వివరాణాత్మకంగా చెప్పలేదు. ఇది ఈ నవలా రచయిత కల్పన.

ఈ నవలలో ప్రధానమైన వర్ణనలూ చెప్పదగినవి మృత్యువు, ప్రేమ, ఆత్మ, పరమాత్మ, పురుషార్థాలు. ఇవి ఆయా సందర్భాల్లో వివరంగా తెలియజేసారు.

కచుడు శుక్రాచార్యుల ఆశ్రమంలో సంజీవని విద్యనేర్చుకునే సందర్భంలో రాక్షసులు అతణ్ణి మృత్యువుకు ఎరవేసారు. మూడు సార్లు కుట్ర పన్నిచంపారు. కానీ, బ్రతికిన ప్రతీసారి అతడు నవ్వుతూ అనేవాడు- "ఏదైనా వస్తువు దూరంనుంచి చూస్తే భయంకరంగా ఉంటుంది. కానీ, నిజంగా భయంకరం కాదు. మృత్యువుకూడా అటువంటిదే" (పుట.181) అంటూ వర్ణించడంలో ఒక సందేశం ఉంది. చావుకు భయపడుతుంటే అది మరింత భయపెడుతుంది. దాన్నిదగ్గరిగాచూస్తే భయంఉండదు. దాన్నివిజయంగాకూడా అనువర్తించుకోవచ్చు. విజయం కోసం అహర్నిశలు పనిచేయడం అలవాటు అయితే అదిమనల్ని వరిస్తునే ఉంటుందనే సూచన నిస్తోంది ఈ వాక్యం. అందుకే దేవయాని ప్రేమని కచుడు తిరస్కరించ గలిగాడు అని సూచించడం ఇందులో కనిపిస్తోంది.

మాధవుడు శర్మిష్ఠను ఊరిపొలిమేరలో దిగబెట్టి వస్తున్నప్పుడు వర్షంలో తడవడం, తర్వాత జ్వరంవచ్చింది. చాలా రోజులు స్పృహలేకుండా కలవరిస్తూనే ఉన్నాడు. ఒకరోజు గడగడా మాట్లాడేస్తూ మాధవి(మాధవుడు పెళ్ళి చేసుకోవాలనుకొనే అమ్మాయి) చేయిపట్టుకొని మనమిద్దరి పెళ్ళి అయిపోయింది అన్నాడు. అంతకు ముందు తనను ఎలాగైనా బతికించమని, బతికిస్తానని మాట ఇవ్వమని యయాతిని కోరాడు మాధవుడు. "అతని(మాధవుడి) ఆనందం కోసం అతని సంతోషంకోసం అతని చేయి నా చేయి లోకి తీసుకొని మాట ఇచ్చాను"(పుట.357) అని యయాతి అనుకున్నాడు. కానీ, మాధవుడు బతకలేదు. అతడికి అదో రకమైన తృప్తి మిగిలింది. కానీ, యయాతి మనసును మరింత గాయం చేసింది. ఈ మాటల్లో మృత్యువునుంచి తప్పించుకోడం, తప్పించాలనుకోడం సాధ్యంకాని అంశాలని రచయిత ఈ పాత్రద్వారా చెప్పాడు.

మృత్యువు! జీవితయొక్క భయంకర రహస్యం! సముద్రం ఒడ్డున ఎవరైనా చిన్నపిల్లాడు ఇసుకతో కట్టుకున్న గూటిని ఉవ్వెత్తున లేస్తూ వచ్చిన భయంకర కెరటం గుర్తు పట్టలేనంతగా తుడిచి వేస్తుంది. ఈ మానవజీవితంకూడా అంతే. (పుట. 357) ఏ ఆకు

ఎప్పుడు రాలిపోతుందో ఎవరికి తెలుసు అని మృత్యుతత్త్వాన్ని వివరించే ప్రయత్నం చేసాడు.

"మృత్యువు చిన్నప్పటినుండి అడుగడుగునా నన్నుభయపెడుతున్న నా అదృశ్య శత్రువు. ప్రతీసారీ ఏ భయంతో నేను శరీర సుఖాన్ని ఆశ్రయించానో, ఆ అజ్ఞాత - అనామక మృత్యువు ఇప్పుడు నవ్వుతూకౌగలించుకోదా? ముందువెనుక ఆలోచించకుండా దానిని ఆనందంగా కౌగలించుకోనా?(పుట.451)అంటూమృత్యువునుఆనందంగా ఆహ్వానించినరోజు అధైర్యానికి తావు ఉండదు. భయపడుతుంటే అది మరింత భయపెడుతుంది. మృత్యువును కౌగలించు కొనేటట్లు చెప్పడం అనే భావనను పతాకస్థాయిగా తీసుకు వచ్చారని చెప్పచ్చు. ఇది మూలంలో ఇంత వివరణాత్మకంగా లేదు. ఇది యయాతి జీవితానికి మరోకోణం.

యయాతి ప్రేమ గురించిన విషయాలు చాల ఈ నవలలో ఉన్నాయి. "ప్రేమ మనిషికి తన నుండి వేరుగా చూసే శక్తి ఇస్తుంది. ఎవరినైనా ప్రేమిస్తే అది మనిషిని గాని, వస్తువును గాని అయితే అది నిజమైనదిగా ఉండాలి. మనసు అంతరాల నుండి అది రావాలి. అది స్వార్థం, లోభం, కపటంతో కూడి ఉండరాదు. రాజకుమారీ! నిజమైన ప్రేమ ఎప్పుడూ నిస్వార్థంగా ఉంటుంది..."(పుట.182) అంటూ కచుడు వేదాంత ధోరణిలో చెప్తూ, అలాంటి నిస్వార్థమైన ప్రేమ మనిషి మాత్రమే ఇవ్వగలడని అంటాడు. ఇష్టమైన దాన్ని దోషాలతో కూడా అంగీకరించే శక్తి నిజమైన ప్రేమలో ఉంది అని కచుడిద్వారా ప్రేమశక్తిని పాఠకుడికి తెలిజేసాడు. ఇది అమూలకం.

యయాతి దేవయానుల మొదటిరాత్రి జరుగుతోంది. వారి మందిరద్వారం దగ్గర శర్మిష్ఠ ఉండి వాళ్లు ఏం మాట్లాడతారో వినాలని అనుకుంటుంది. కానీ, దేవయాని కోపంతో కూడిన అరుపులు అరుస్తుంది. పాపం మహారాజు అమాయికుడు అనుకుంటూ ప్రేమనిండి ఉంటే ఇలా ఉండదని అనుకొని "ప్రేమ నిండిన మనసులకు మాటలతో పనిలేదు." (పుట.195) అని మొదటి రాత్రి అలా ఏకాంతంగా గడపలేదని లోపల శర్మిష్ఠ అనుకొంటుంది. ఇది రాబోయో యయాతి దేవయానుల అన్యోన్యత ఉండదు అని సూచించడానికి, శర్మిష్ఠ యయాతిని అర్థం చేసుకుంటుంది అని చెప్పడానికి ఈ మాటలు తోర్పడతాయి. ఇది అమూలకం.

శర్మిష్ఠ, దేవయాని గురించి యయాతికి చెబుతూ ప్రణయకలహం లేనిదే ప్రేమ మధురంగా ఉండదని అంటుంది. ఎవరి దగ్గర నేర్చుకున్నావు ప్రేమ గురించి అని యయాతి అడిగాడు. దానికి సమాధానంగా "ఈ ప్రపంచంలో గురువు లేకుండా ఎవరైనా విద్యను ఆర్జించారా? ప్రేమించడమనేది ఈ ప్రపంచంలో సర్వ శ్రేష్ఠమైన విద్య, సంజీవనికంటే కూడా గొప్పదని" (పుట.210) శర్మిష్ఠచేత ప్రేమమీద వ్యాఖ్యానించడం, ప్రేమ పట్ల ఉండే ఉదాత్తని వ్యక్తం చేసోంది. ఇది అమూలకం.

దేవయానిని యయాతి దగ్గరకు తీసుకోని తనివితీరా ముద్దులు పెట్టాడు. అయినా

కోరిక తీరలేదు. ఇక చాల్లెండి? ఇంకా ఎక్కువైతే అజీర్ణం చేస్తుందని దేవయాని అంటుంది. కానీ, మీరు ఒకటే అని అంటారు. కానీ వంద... వంద అని దేవయాని అంటుంది. దానికి యయాతి "మహర్షి ఆశ్రమంలో పెరిగిన కన్యవు నీవు. ఈ ప్రేమ గణితం గురించి తెలుసుకోవడం నీ వశం కాదు. ఈ గణితంలో ఒకటి అంటే అర్థం ఒకవేయి, ఒక లక్ష, ఒక కోటీ కావచ్చు. సందర్భాన్నిబట్టి దీని అర్థం మారుతుంది"(పుట. 215) అని ప్రేమ తత్త్వ గణితాన్ని రచయిత వివరిస్తాడు. ప్రేమలో ఉన్న సోయగం, తనివితీరా అంటే ఎప్పటికో ఎంతకాలమో పాఠకుడి ఊహకే వదిలేసాడు. ఇది యయాతి సరచత్వానికి ఒక ఉదాహరణ. ఆశ్రమంలో పెరిగిన నీకు ఎవరు చెప్పారు ఈ ప్రేమ తత్త్వాన్ని అని అనుమానాన్నివ్యక్తం చేసే సూచన కూడా ఉంది.

నిజమైన ప్రేమ గురించి రచయిత శర్మిష్ఠద్వారా వివరించాడు- "నిజమైన ప్రేమ ఎలా ఉంటుంది? అది తెలుసుకోవాలంటే స్వయంగా ప్రేమించాలి. చంద్రుని చల్లదనం, సూర్యుని ప్రచండత, అమృతం యొక్క సంజీవనీశక్తి, విషం యొక్క ప్రాణహరణశక్తి- వీటన్నిటికలయికే. లేదు! ప్రేమని వర్ణించడం అంత తేలికైన విషయం కాదు!" (పుట.307) అని నిర్వచనం ఇచ్చేస్థితిని పాఠకుడి అనుభవానికే వదిలేయడం, ప్రేమశక్తి అనుభవైకవేద్యం అనే భావనని స్ఫురించేలా సూచిస్తోంది.

శర్మిష్ఠను యయాతి భూగృహంనుంచి తప్పించేసాడు. యయాతి అంతరంగం మరో యయాతిలా మాట్లాడుతోంది. శర్మిష్ఠను నిజంగా ప్రేమిస్తున్నావా? అని, ప్రేమ వల్లే ఆమెను తప్పించానని అంటాడు. "నువ్వు ఆమెతో కూడా అడవికి వెళ్ళిపోయి ఉంటే నీవు చెప్పింది నిజమనిపించేది! నీ గురించి శర్మిష్ఠ ఏం... చేయలేదో? చెప్పు! ఆమె తన సర్వస్వాన్ని నీకర్పించింది. నీ పాద ధూళిని నొసటిన అలంకరించింది! మరి నీవో! ఆమె కొరకు రాజ ప్రసాదాన్ని విడిచి పెట్టడం నీ కర్తవ్యం. ఒక క్షణమో, లేక రెండు క్షణాలో మత్తెక్కించే శారీరక సుఖమే ప్రేమకాదు. ప్రేమంటే అతి శ్రేష్ఠమైన వ్యక్తికోసం ప్రాణాలైనా ఇవ్వడానికి సిద్ధపడుతుంది"(పుట. 346) అని ప్రేమకు విశ్లేషణాత్మక వివరణ నిచ్చారు. ప్రేమ త్యాగం కోరుకుంటుందని నిజమైన ప్రేమ శర్మిష్ఠ సొంతం అని సూచించడానికి ఈ వివరణ సహకరిస్తోంది. ఇది అమూలకం.

ప్రేమ ఎంతవరకు పర్వాలేదు? దాని స్థితిగతులుఎంతటివి? దీన్ని శర్మిష్ఠపాత్రద్వారా రచయిత మరింత స్పష్టంగా సూచించాడు. "ఒక హద్దు మీరి మనిషి ప్రేమించకూడదనేదే జీవితంలో సాంప్రదాయమా? మహారాజు నా ప్రాణాలను కాపాడిన విషయం నిజమే. కాని, తన ప్రియురాలిని ఇలా నిస్సహాయురాలిగా, అనాదిగా, గాలివానలో, అదీ రాత్రి పూట ఎలా వదిలివేయ గలిగారు? ఇందుకు భిన్నంగా ఆయన - శర్మిష్ఠా! నాకు రాజసింహాసనంవద్దు, ఐశ్వర్యం వద్దు, నీవే నాకు కావాలి. పద నేను కూడా నీతో పాటే వస్తాను. రా, మనం ఏ హిమాలయ ప్రాంతానికో పోయి సుఖంగా ఉందాం! అనివుంటే నాకెంత ధైర్యంగా ఉండేదో; ఎంత ఆనందం కలిగేదో!" (పుటలు. 366-367) అని శర్మిష్ఠ యయాతిగురించి తనలో తాను భావించిన తీరు పాఠకుడికి కన్నీరు పెట్టిస్తోంది. ప్రేమలో త్యాగం లేని యయాతిని సూచించడం ఇక్కడ కనిపిస్తోంది.

నహుషుడు మరణావస్థ యయాతికి గుర్తుకు వస్తుంది. ఆ సందర్భంలో "ప్రేమ, వాత్సల్యం, మమత, ఇవన్నీ నిజంకాదు. ఇవన్నీ ప్రపంచపు కృత్రిమ ముఖాలు. మనిషి కేవలం తన సుఖం కొరకే జీవిస్తాడు. తన అహంకారాన్ని తృప్తి పరచడానికే జీవిస్తాడు. అలాకాకపోతే, అమ్మ నన్ను నిజంగా ప్రేమిస్తే, ఆమె అలకను నిర్దాక్షిణ్యంగా ఎందుకు హత్య చేసినట్లు? హత్యతో యయాతికి ఎంత దుఃఖం కలుగుతుందోనని ఆమె క్షణమాత్రం ఆలోచించలేదా?" (పుట. 423) అని యయాతి పాత్ర తన మనసులో ఉన్న ప్రేమ సంఘర్షణ తత్త్వాన్ని రచయిత వెలువరిస్తాడు.

చివరిగా ప్రేమించడం నేర్చుకోవాలనుకుంటున్నావా?అని ప్రశ్నించి, సమాధానంగా "నదిని గురువుగా భావించు, వృక్షాన్ని గురువుగా భావించు, తల్లిని గురువుగా భావించ"మని (పుట. 457) ప్రేమ తత్త్వాన్ని ప్రకృతి నుంచే నేర్చుకోవాలని, అది సహజంగా ఉండాలని, మానవీయ కోణంలో వివరించాడు. దీనివల్ల ప్రేమభావనలో ఆనందం ఉంటుందనే భావనని వ్యక్తీకరించాడు.

యయాతి నవలలో రచయిత వర్ణించిన మరో అంశం ఆత్మ గురించి. కచుడుపాత్ర దీనికి ఆధారంగా కనిపిస్తాడు. ఆత్మఅంటే ఏమిటో అదిఎక్కడ ఉంటుందని యయాతి కచుణ్ణి ప్రశ్నిస్తాడు. ఆత్మ అనేది ఋషులద్వారా చిత్రించబడిన రూపాత్మకమైన స్వరూపంగా జ్ఞాపకముంచుకోవాలి. "మానవ జీవితంలో ఆత్మ రథికుడు, శరీరం రథం, బుద్ధి సారథి, మరియు మనస్సు కళ్ళెం. వివిధములైన ఇంద్రియాలు గుర్రాలు. ఉపభోక్తములైన అన్ని విషయాలు ఆ రథానికి మార్గాలు. ఇంద్రియాలు మనసుతో కలిసిన ఆత్మ ఉపభోక్త"(పుట. 272) అంటూ శరీరాన్ని రథంతో పోలుస్తాడు.

యయాతికి మరో అనుమానం వస్తుంది. ప్రేమలో ఆత్మ ఏమాత్రం ఉంటుందో! నరమాంస భక్షణకు అలవాటు పడిన సింహం, స్త్రీ సౌందర్యంమీద పురుషుడూ ఇరువురూ ఒక్కటే. అలాంటి పురుషుడు, లావణ్యం, తారుణ్యం, శారీరక సుఖం కోరుకుంటాడు. కేవలం అతనికి నషా, కైపు కావాలి (పుట.274) అంటూ ప్రేమలో ఆత్మ ఎలా చూపించాలో ప్రశ్నిస్తాడు. దీనికి సమాధానం కచుడు శర్మిష్ఠల సంభాషణలో వివరిస్తాడు- "శర్మిష్ఠా! తన నాభిలోనే సుగంధ భరితిమైన కస్తూరి వున్నదని, కస్తూరి మృగానికి తెలుసా? నీ పరిస్థితి కూడా అంతే. దాసీత్వం నీ శరీరానికి మాత్రమే. నీ ఆత్మకు కాదు గదా? ఆత్మ ఎవరికీ దాసోహం కాదు; అవదు. అలాగే నీ ఆత్మ కూడా! అది పూర్తిగా స్వతంత్రమయినది. ఉన్ముక్త అవస్థను పొందిన ఆత్మ కలిగినవారే ఈ ప్రపంచంలో భగవంతుని దర్శించగలరు"(పుట. 289) అంటూ ఆత్మయొక్క స్వతంత్రస్థితిని తెలుపుతాడు. ఇక్కడ శర్మిష్ఠ కేవలం శారీరకంగా దేవయానికి దాసి కానీ, ఆంతరంగికంగా మహారాజు యయాతి ప్రేమికగా రచయిత సూచించాడు.

యతి పాత్రద్వారా ఆత్మను అర్థమయ్యేలా విశదీకరించే ప్రయత్నం చేసాడు. యతి కచుడి సాహచర్యం వల్ల మామూలు మనిషిగా మారాడు. వేదాంత విషయాలు తెలుసు

కుంటాడు. 'శరీరం, ఆత్మ ఒకదానికొకటి శత్రువులు కాదు. అవి ఒకే రథానికి ఇరుప్రక్కలా ఉండే రెండు చక్రాలు. ఇందులో ఏ ఒక్క చక్రం విరిగి పడిపోయినా ఆ భారమంతా రెండోచక్రం మీద పడుతుంది. అందువల్ల రథం సమతౌల్యాన్ని కోల్పోతుంది. ఆత్మోన్నతికి దేహాన్ని కష్టపెట్టడంగాని, లేక శరీరాన్ని సుఖపెట్టడానికి ఆత్మ వంచన చేసుకోవడం గాని, రెండూ తప్పే.

పరమాత్మ ద్వారా నిర్మితమైన ప్రకృతిలో వివిధ సుందర వస్తువులు- అపవిత్రం లేదా అస్పృశ్యం ఎలా అవుతాయి? స్త్రీ-పురుషుల సంబంధం- శరీరం- ఆత్మల సంబంధంలాంటిదే! ఒకరినొకరు ద్వేషించుకోకుండా, అమితమైన ప్రేమతో, అంటే తన్ను తాను మరిచిపోగలిగేటంత ప్రేమ-అనురాగంతో మసలుకొని, గృహస్థజీవితంలో స్వర్గ సుఖాల్నిఇరువురూ భార్యాభర్తలు పొందుతారు. అందుకే మనభారతీయ సంప్రదాయంలో భార్య-భర్తలు యజ్ఞనిర్వహణకు అర్హులుగాను, పవిత్రులుగాను భావించబడతారు'(పుట. **382**) అని గృహస్థాశ్రమ విధానాన్ని శరీర- ఆత్మల స్త్రీపురుష సంబంధాల్ని సంస్కృతీ సంబంధం విషయాలతో వివరించాడు. ఇంత వివరణ మూలంలో లేదు.

మరో అంశం పురుషార్థాలు. ధర్మార్థ, కామమోక్షాలు చతుర్విధపురుషార్థాలు. అర్థం ఉండడంవల్ల కామం కలుగుతుంది. అప్పుడు కామానికిస్థాయి ఎక్కువగా ఉంటుందని అర్థం. శుక్రాచార్యులు, కచుడు, యయాతిలాంటి తాపసులు, రాజులు లోకకళ్యాణాన్ని ఆకాంక్షించాలి. గొప్పగొప్ప రాజులు ప్రజల్ని సుఖ పెట్టాలి. గృహస్థుడు కుటుంబాన్ని, స్నేహితుల్ని సుఖపెట్టాలి. అయితే తమ సుఖం ఎవరికీ దు:ఖకారణం కాకుండా చూసుకోవాలి.

వ్యక్తి ధర్మం, గృహస్థ ధర్మం, రాజధర్మం అందరి యోగ్యతా ఒక్కలాంటిదే. ఇందులో తేడా ఏమీలేదు. ఇందులో ఏ ఒక్క ధర్మానికి కూడా జీవితాన్ని అసహ్యించుకొనే అధికారంగాని, మౌలిక సూత్రాల్ని ఉల్లంఘించే అధికారంగాని లేదు. స్వధర్మాన్ని విస్మరించడం పాపం. అందుచేత ప్రతివ్యక్తి, తను నిర్వర్తించ వలసిన ధర్మం ఏమిటో తెలుసుకొని దాన్ని ఆచరించడం ఉత్తమం. కానీ, ఏ వ్యక్తికూడా యతి నుంచి పతి వరకు తన విధిని, తన ధర్మాన్ని నిర్వర్తించేటప్పుడు అన్ని ధర్మాలకు ప్రేమ ఒక్కటే సర్వాధికారి అన్న విషయం గుర్తుంచుకోవాలి.(పుట. **382-383**) అని ధర్మబోధ చేస్తాడు. ఇది గీతా సారంలా అనిపిస్తోంది. ఎవరికి వారు ఆయా స్థాయిల్లో వారివారి ధర్మాల్ని ఆచరించాలని వారిని ఆ ధర్మమే రక్షిస్తుందని సూచన చేసారు.

ప్రేమ, కామం రెండింటికీ తేడా చెప్పడం ఇంకో అంశం. ఘడియ, రెండు ఘడియల శరీర సుఖాన్నే ప్రేమంటారా? క్షణికమైన కామాన్ని సంతృప్తి పరచడం ప్రేమ అవుతుందా? అని ప్రశ్నించి, యయాతి పాత్రద్వారా రచయిత సమాధానం ఇస్తాడు- "ప్రేమ వేరు, కామం వేరు. స్త్రీపురుషుల ప్రేమలో కామం ఉండక తప్పదు. అది యాగాగ్ని లాంటింది. జీవిత ధర్మం యొక్క మర్యాదలను పాటింపజేసేదే అగ్ని". (పుట. **424**) అని అలాంటి పవిత్రమైన అగ్ని రక్షించలేక కామాతురుడనై ఆ దావాగ్నిలో అలక, మాధవి, తారక లాంటి

అమాయకుల్ని బలి తీసుకున్నానని యయాతి అంతరంగంలో బాధపడినట్లు రచయిత వ్యక్తంచేసాడు. ఇలా యయాతి పాత్ర కామాన్ని అదుపుచేయలేకపోతే పడే మానసిక వేదనని అనుభవించక తప్పదని రచయిత పాఠకులకు సూచించాడు.

కామం లేదా కోరిక స్థితిని మరోచోట- "గాలి ప్రపంచానికి ప్రాణం. దాని పిల్ల గాలులు ఎల్లప్పుడూ అందరి మనస్సులను తాకుతుంటాయి. కానీ అవే ప్రచండమయితే అడవంతా దానిని అసహ్యించుకుంటుంది. విశేషమైన కోరికకూడా అలాంటిదే"(పుట. 457) సంసారం చేసే స్త్రీ పురుషులుకూడా తపస్వులే. సంసారంవాళ్ల యజ్ఞంగా, అనురాగం, వాత్సల్య, కరణులు శత్రువు యొక్క స్థానాలుగా చెప్పాడు. కోరికలేని ప్రేమే మంత్రం. (నజాయ కామ:, కామానాం...)సేవ, త్యాగం, భక్తి, సంసార జీవనానికి యజ్ఞాహుతులు. "అనుభవించనంత మాత్రాన కోరిక ఎప్పుడూ తీరదు. ఆహుతులు పొందిన అగ్ని ప్రజ్వరిల్లినట్లు, అనుభవంతో కోరికకూడా పెరుగుతుంది" (పుట.457) అంటూ కామత్వపు అస్థిత్వాన్ని వివరించాడు.

ఇలా యయాతి నవలలో వర్ణనలన్నీ కొత్తవిగా ఆలోచనాత్మకంగా ఉన్నాయి. మూలంలోని అంశాల్ని కొన్నిటిని జోడించి పాఠకుడి హృదయ వేదికమీద రచయిత చిరస్థాయిగా నిలచారని చెప్పొచ్చు. భారతంలో చెప్పిన చతుర్విధ పురుషార్థాల్ని సమన్వయ ధోరణిలో చెప్పడం, యయాతి, దేవయాని, శర్మిష్ఠ మొదలైనపాత్రల్ని ఆధారంగా చూపించడం  ఈ నవలో కనిపిస్తోంది.

## 5. 11. *యాజ్ఞసేని* నవలలో వర్ణనలు-మార్పులు, చేర్పులు

*యాజ్ఞసేని* నవలలో సహజంగా సందర్భానికి తగినట్లు వర్ణనలు కనిపిస్తాయి. పాత్రల వర్ణనలో కృష్ణ, కృష్ణుడు, కర్ణుడు, అర్జునుడు, యుధిష్ఠురుడు మొదలైన పాత్రలున్నాయి. అయితే ప్రధానంగా వర్ణించింది కృష్ణపాత్రనే(ద్రౌపది). సందర్భానుగుణంగా కొన్ని మార్పులు- చేర్పులు కూడా ఉన్నాయి. మూలంలోని కథను కొంతవరకు చేర్చి, కొంత వివరణగాను కూడా ఉంది. *సారళ భారతం* (ఒరియా మహాభారతం)లోని కథాంశాలు కూడా తీసుకొని ఈ నవలని మరింత శోభాయమానంగా తీర్చిదిద్దారనిపిస్తోంది.

ద్రౌపదిని గురించి చెప్పే సందర్భంలో- తన రూపం గురించి ఇతరులు ఎలా అనుకున్నారో, అన్నారో వాటిని దృష్టిలో పెట్టుకొని కృష్ణ తనలో తాను అనుకుంటుంది. "నేను కృష్ణను. నీలోత్పల దళాల్లా  నా శరీరకాంతి. సముద్ర కెరటాల్లాంటి దట్టమైన నా నీలకేశాలు, పద్మాల్లా మెరిసే మనోహరమైన కళ్ళు, ప్రపంచంలోని శ్రేష్ఠమైన శిల్పి తీర్చిదిద్దినట్లున్న మచ్చలేని నా ముఖశోభ, తీర్చిదిద్దినట్లున్న అవయవ సౌష్ఠవం, పొడవైన శరీరం, ఉన్నత గోళాకారంలో ఉన్న వక్షద్వయం, సన్నని నడుము, ధనస్సులా తీర్చిదిద్దిన కనుబొమలు, సంపంగి మొగ్గల్లాంటి వేళ్ళు, రక్త వర్ణంలో ఉన్న రేకుల్లాంటి చేతులు, పాదాలు, ముత్యాలను తలదన్నే పలువరుస, మెరుపుని మరపించే హాసరేఖ, చంద్రుండిలాటి మనోహరమైన గోళ్ళు. నా శరీరంలోంచి వెలువడే పద్మ సుగంధానికి తుమ్మెదలు పుష్పోద్యానం విడిచి నా చుట్టూ ఎగురుతూండేవి. నా కేశ సౌందర్యంలో

బంధించబడి వాయువు స్తంభించిపోయింది. నా సౌందర్యం, సౌష్ఠవం కవుల మతి స్థిమితాన్ని కోల్పోవడం వంటిది (పుట.14) అని ద్రౌపదిని వర్ణిస్తాడు. ఎలా హింసలకు గురిచేసిందా అన్న భావం కథ పూర్తయ్యాక పాఠకుడికి ఈ వర్ణన వల్ల కలుగుతుంది. ఇంతటి అందగత్తెకు ఇన్ని కష్టాలు పెట్టాలా? అని కర్ణుడు ప్రత్యేకంగా బాధపడినట్లు ఈ వర్ణనలో సూచన చేసినట్లు అనిపిస్తోంది.

కృష్ణుణ్ణి వర్ణించే సందర్భంలో కృష్ణ సఖి 'నితంబిని' వర్ణిస్తుంది- కృష్ణుడి రూపం వర్ణిస్తే మూర్ఛిల్లుతావు. తెలివి వచ్చినవెంటనే, కృష్ణుడు లేకుండా జీవితం వ్యర్థం అని అంటావు. కృష్ణుణ్ణి పిలుచురా, లేకపోతే ఈ దేహాన్ని వదిలేస్తాను అని నువ్వంటే నేనేం చేసేది?(పుట17) అని ప్రారంభిస్తుంది. ఆ తర్వాత కృష్ణ ఆ రూపకల్పనలోకి జారిపోతుంది. తనను తాను మరిచి పోతుంది. అయితే తెలివి తప్పదు. ఏదో స్వప్న లోకంలో విహరించినట్లుగా భావిస్తుంది. 'ఎటుచూసినా నీలి వర్ణం... కృష్ణం... ప్రపంచమంతా కృష్ణమయం...ప్రేమమయం... మధుమయం. నేను ఈ విశ్వమయమైన కృష్ణుడిని చూస్తున్నాను. కృష్ణమయమైన విశ్వాన్ని' (పుట.18) అని కృష్ణుడి స్వరూపాన్ని రచయిత్రి వర్ణిస్తుంది. ఇది అరునుడికి కురుక్షేత్రంలో 'భగవద్గీతోపదేశం చేసిన సందర్భంలో విశ్వరూపాన్ని చూపినట్లు అనిపిస్తోంది. ఈ వర్ణన 'సారళమహాభారతం' నుంచి తీసుకుంది.

కృష్ణ ఒక గోరువంకను పెంచుకొంటుంది. దానిపేరు, నీలవేణి. యాదృచ్ఛికంగా పేరు పెట్టినట్లు రచయిత్రి వివరిస్తుంది. ఆ సందర్భంలో నీలమణివైన కృష్ణుడి ప్రవేశం సందర్భాను సారంగా కనిపిస్తోంది. పైగా కృష్ణా! కృష్ణా! అని నీలమణి(గోరువంక) పిలవడం, ఆ పిలుపు విన్న కృష్ణుడు నిద్రాభంగమై లేస్తాడు. అప్పుడే అక్కడున్న నితంబిని (కృష్ణ చెలికత్తె) దాన్ని విని ఎవరూ నన్ను పిలిచింది అని అడుగుతాడు. గొంతు ద్రౌపది గొంతులాగా గోరువంక కృష్ణా అని అంటుంది.

రాత్రి జరిగిన నితంబిని, కృష్ణల సంభాషణలో ఎక్కువసార్లు కృష్ణ అనే పదం వాడడంవల్ల గోరువంక దాన్ని సాధన చేసి, అలాగే అన్నట్లు ఉంది. తరువాత ద్రౌపది గోరువంకను కోమలంగా తాకితే అది కృష్ణా కృష్ణా అని అనడం మొదలు పెతుతుంది. దాన్ని ఆపాలనే ప్రయత్నంలో ద్రౌపది నీలమణీ అంటుంది. ఇలా చాలాసార్లు అనేసరికి వెనుక నుంచి నవ్వు వినిపించింది. అక్కడకు నితంబిని వచ్చింది. నీలమణీకి పేరు పెట్టినదగ్గరనుంచి జరిగిన సంభాషణని వివరిస్తుంది. కృష్ణుడు లేవడం, ఆ స్వరాన్ని కృష్ణ స్వరమని భావించినట్లు చెప్పడం జరిగింది. కృష్ణుడు ఇంకా ఏమనుకున్నాడు అని పదే పదే అడిగేసరికి నితంబిని కృష్ణమనసుని పసిగట్టేసింది. అలాంటి సమయంలో కృష్ణమనసులో ఏదో స్వప్న సదృశమైన మాయ ఆవరించినట్లు అనిపించింది. విచిత్రమైన పులకింపులో ఆమెను ముంచెత్తింది. చివరకు నీలమణి గోరువంకని బయటకు వదిలేసింది. నీలమణి పేరు కృష్ణుణ్ణి ప్రేమతో పిలచేవారు పిలుస్తారని రచయిత్రి వివరణ ఇచ్చింది. ఇక్కడ కృష్ణుడంటే కృష్ణకు ప్రేమ కలిగినట్లు పాఠకుడిని మభ్యపెట్టే అవకాశం కబడుతోంది. ఇది ఒక సస్పెన్సుగా చెప్పొచ్చు. (పుటలు. 22-24) ఇవన్నీ ప్రత్యేకమైన అంశాలు. ఈ అంశాలు మూలంలో లేవు.

కృష్ణ చెలికత్తె నితంబిని అర్జునుడి వీరగాథలు వివరిస్తూ, "ఎనిమిదివేల ఎనిమిదివందల ఇరవై ఎనిమిది మైళ్ళదూరాన ఉన్న పర్వతంపైన ఒక దుర్గం. దుర్గంపైన ఒక బల్లెం ఉంచబడింది. దానిపైన ఒక ధాన్యం గింజ. ధాన్యం గింజపైన మరో గింజ ఉంచబడింది. ఆపైన అతిచిన్న ఆవగింజ. గురువు ఆదేశం (ద్రోణాచార్యులు) ప్రకారం ఆ ఆవగింజను బాణంతో రెండు ముక్కలు చేయాలి" (పుట. 30) అని అంది. అలాంటి కఠినమైన పరీక్షల్లో నెగ్గినట్లు వర్ణించడంవల్ల జరగబోయో దుర్గమమైన మత్స్యయంత్రంలో, కురుక్షేత్రయుద్ధంలోనూ మేటిగా తయారవుతాడని సూచించడానికి ఈ వర్ణన సహకరిస్తోంది. ఇది మూలంలో లేదు. ఏకాగ్రతను సూచించేదిగా మూలంలో చెట్టుమీద పక్షి కన్నుకు గురిపెట్టి కొట్టమనడం ఉంది. దాన్ని పై విధంగా ఈ నవలలో మార్చారు.

కృష్ణ, స్వయంవరమందిరానికి వస్తోంది. రాజకుమారులంతా ఒక్కసారిగా ఆమెను చూస్తున్నారు. అంతమంది పురుషుల మోహపు చూపులు కృష్ణని సిగ్గుపడేలా చేసాయి. మొహాన్ని ముసుగులో దాచుకోవాలని అనిపించింది. అయితే ఆ మనసులోని భావాన్ని తెలుసుకున్నట్లుగా సభాస్థలంలో పూలకుండీలలోంచి తూనీగలు ఒక్కసారిగా ఎగురుతూ కృష్ణ చుట్టూ వచ్చిచేరి ఒక నీలి ఉత్తరీయంలా ఆచ్ఛాదితం చేసాయి. అక్కడున్న రాజాధిరాజుల దృష్టికి అవి అంతరాయం కలిగించడంతో వారు గగ్గోల పెట్టారు. కృష్ణ శరీరంలోంచి వెలువడే పద్మ సుగంధాన్ని అవి ఆస్వాదిస్తున్నాయి. వాటి ఝుమ్మనే నాదం పిల్లగాలిలా అంతటా వ్యాపించింది. (పుట. 41)

ఈ వర్ణనలో పదచిత్రం కనిపిస్తోంది. ఇది కొత్త వర్ణన. తూనీగలు ఆచ్ఛాదనంతో రాజకుమారులకు అంతరాయం కలగడం ద్వారా కథలో అర్జునుడి ద్వారా అంతరాగం కలుగుతుందనే ఒక సూచన కనిపిస్తోంది. వాటి నాదంలా అర్జునుడి బాణ ధ్వని ఝుమ్మనే నాదంతో సూచించడం ప్రత్యేకత. అయితే ఈ వర్ణనలో తూనీగలు అనే కంటే సీతాకోక చిలుకలు అనడం బాగుంటుంది. ఎక్కువ ప్రదేశాన్ని కనిపించకుండా ఆపేస్తాయి. మరోవైపు అందాన్ని సూచిస్తాయి. పూలకుండీల్లో అనడం కంటే అలంకారంగా బయటనుంచి వచ్చాయి అంటే బాగుండేది. వాయిద్యం ఎలాగూ ఉంటుది కాబట్టి ఝుమ్మనే నాదం అవసరంలేదు. అప్పుడు అది వాస్తవికతను దగ్గరగా ఉండేది.

అర్జునుడు మత్స్యయంత్రాన్ని ఛేదించి కృష్ణను పొంది అరణ్యమార్గంగా ఏకచక్ర పురానికి తీసుకువెళ్తున్నారు. మిగిలిన పాండవులు కొంచెం ముందుగా నడుస్తున్నారు. అప్పటికి ద్రౌపదికి వాళ్ళు పాండవులని తెలీదు. అర్జునుడంటే ద్రౌపదికి ఇష్టమో లేదో తెలుసుకోవాలని అర్జునుడు అనుకుంటాడు. తరువాత నడుస్తూ మాటల సందర్భంలో అర్జునుడే నీ దగ్గరకు వస్తే ఏం చేస్తావని బ్రాహ్మణ వేషధారిగా ఉన్న అర్జునుడు అడుగుతాడు. "ఒక సంసార స్త్రీ ఏంచేస్తుందో అదే నేను చేస్తాను. అతని వంటి ఉత్తమ పురుషుడు నా ద్వారం వద్దకు వస్తే ఆతిథ్యం ఇస్తాను. అతిథి నారాయణుడు గదా. అంతేకాదు, అతనిని నా భర్తతోస్నేహం చేయమని కోరుకుంటాను"(పుట.51) అని సమాధానంగా కృష్ణ చెబుతుంది. ఎందువల్ల? అని ఆశ్చర్యంగా బ్రాహ్మణ వేషధారి

అడిగాడు. తన భర్త అర్జునుడు అందువల్ల అతను మరో అర్జునుడు వీరిద్దరికి మిత్రత్వం ఉండడం సహజమని ద్రౌపది చెబుతుంది. నువ్వు కేవలం విద్యావతివేకావు జ్ఞానవతివి కూడా. నీ వద్ద నేను పరాజయాన్ని ఒప్పుకుంటున్నానని అర్జునుడంటాడు. ఈ వర్ణన భార్యా భర్తల సఖ్యతకు నిదర్శనంగా కనిపిస్తోంది. ఈ విశ్లేషణ మూలంలో లేకపోయినా సహజంగాను సందర్భానికి తగినట్లు ఉంది.

పాండవుల్ని రచయిత్రి కృష్ణద్వారా పరిచయం చేస్తూ ఆమెలో కలిగిన భావాలు కూడా వివరణగా ఉంది- అందరికన్నా పెద్దవాడు దేవుడు లాంటి సౌమ్యుడు, శాంతశీలి, నెమ్మదస్తుడు. చూడగానే మనస్సులో భక్తి గౌరవాలు కలుగుతాయి అని ధర్మరాజుని పేర్కొంటాడు. అతడి వెనుకే నడుస్తున్న వాడు రూపశీలి, విశాలకాయుడు, అతడి ఎదుట ఎటువంటి వాడైనా సరే మరుగుజ్జులా కనిపిస్తారు. అతణ్ణి చూడగానే నా మనస్సులో భయం, ఆశంక కలిగాయి అని భీముడి వర్ణన ఉంది. అతడి వెనుక పెద్దమరిది నకులుడు. రూపవంతుడు, చురుకైనవాడు, సంతోషంగా ఉండేవాడు. అతణ్ణి చూడగానే స్నేహం కలపాలనీ, మాట్లాడాలని, ఎప్పటినుంచో ఎరిగున్నవాడిలా ఉన్నట్లు ద్రౌపది అనుకుంటుంది.

ఆఖరిమరిది కోమలఅనుపమ సౌందర్యంగా, స్వాభావికంగా లజ్జాశీలతతో మితభాషిగా ఉంటాడు. అతడిపై వాత్సల్య, మమకారాలు కురిపించాలని సహదేవుడి విషయంలో ద్రౌపది అనుకుంటుంది. ఈ వర్ణనలో ద్రౌపదికి ధర్మరాజుమీద భక్తి భావం, భీముడు పట్ల భయంతో కూడిన ప్రేమ, నకుల సహదేవులపట్ల ఆదరణ, అర్జునుడే తన భర్త అనే భావన ద్రౌపదిలో కలగడం ఉంది.(పుట. 51) ఆ తర్వాత వీరందర్నీ పెళ్ళి చేసుకోవడంలో ధర్మంగా భావిస్తుందనే అంశాల్ని రచయిత్రి సూచన ప్రాయంగా చెబుతోంది. ఈ వర్ణనలో రూపవంతులుగా చెప్పడం, వారి గుణాల్ని ఆకర్షితురాలు కావడానికి తగిన విధంగా ఉంది. ఇలాంటి వర్ణన మూలంలో లేదు.

పాండవుల్ని వివాహంచేసుకున్నాక, కొంతకాలానికి కృష్ణ హస్తినాపురానికి రాజ వధువుగా అందరితో బయలుదేరుతుంది. ముందు బలరామకృష్ణులు తర్వాత కృష్ణ వరుసగా బయలుదేరతారు. కర్ణుడి చేతిలో నీలి గులాబీల గుచ్ఛం ఉంది. కృష్ణ చెలికత్తె 'మాయ' వాటిని కర్ణుడు ద్రౌపదికోసమే తెచ్చాడని అంటుంది. నిజంగా తనకు అత్యంత ప్రాణప్రదమైన నీలి గులాబీలు ఇష్టమని కర్ణుడికి ఎలా తెలుసో ద్రౌపదికి అర్థం కాలేదు. తర్వాత నడుస్తుంటే ద్రౌపది పాదాల్ని ఆ నీలిగులాబీలు తాకాయి. ఆ గుచ్ఛాన్ని చేతిలోకి తీసుకోవాలని అడుగుముందుకు వేసింది. అంతే ఆ పుష్పగుచ్ఛంలోని ముల్లు ద్రౌపది పాదాలకు గుచ్చుకుంది. రక్త బిందువులతో పాదాలు ఎర్ర బడ్డాయి. కర్ణుడు కావాలని ఇలా చేయలేదని, చెప్పమని మాయ చెవులో చెబుతాడు. (పుటలు. 94-95)

ఈ వర్ణనలో కర్ణుడు నీలి గులాబీలు తేవడం అతడు ఈమెను ఇష్టపడతాడనే విషయాన్ని సూచిస్తోంది. ద్రౌపది సహజంగా తీసుకోవాలని అనుకున్నా, అతడి స్వభావం వల్ల ద్రౌపది ఇబ్బంది పడబోతోంది అని సూచించడానికి ముల్లు గుచ్చుకోవడం ద్వారా తెలుస్తోంది. కొత్తగా వస్తున్నప్పుడే రక్తపాదాలతో కౌరవుల రాజ్యంలో ప్రవేశించడంవల్ల

వారంతా అంతం అవుతారని, రక్తం చిందుతుందనే సూచన ఉంది. ఇవి మూలంలో లేవు.

యమునా నదికి 'మాయ', 'పయస్విను'లతో కృష్ణ జలక్రీడకు వెళ్ళింది. అక్కడ పయస్విని తెంచి పడవేసిన పూరెమ్మని తేవాలని పందెం వేస్తుంది. నదీ ప్రవాహం వేగంగా ఉంది. అయినప్పటికీ వాళ్ళు ఆ విషయం గమనించకుండా నదిలో ఈదుతారు. అప్పుడు నది వేగంవల్ల కొట్టుకు పోతారు. సూర్యాస్తమయసమయంలో కర్ణుడు అడవిలో దారితప్పి, నదీస్నానం చేస్తున్న సమయంలో కర్ణుడు ద్రౌపదిని రక్షిస్తాడు. దుశ్శాసనుడు కృష్ణను, పాండవుల్ని చులకనగా మాటలు అంటాడు. భర్తలు ఎవరూ కృష్ణకు సహాయంగా రాలేదు. కృష్ణది ఆత్మహత్యే అని అంటాడు. భర్తలతో భరించలేక ఈ స్థితిని తెచ్చుకున్నట్లు ఊహించి అంటాడు. (పుటలు.149-152) ఈ అంశాలు మూలంలో లేవు. అయితే కర్ణుడిమీద ద్రౌపదికి గౌరవభావం కలగడానికి ఈ సంఘటన సహకరిస్తోంది.

ద్వైతవనంలో పాండవులు కృష్ణతో వనవాసం చేస్తున్న సమయంలో కాలసర్పానికి కర్ణుడు బలి అవుతాడు. శబరయువకులవల్ల కృష్ణవిషయంవిని మహర్షి 'విప్రపాదుల'వారి ఆజ్ఞానుసారంగా ఆ ప్రాంతానికి బయలుదేరుతుందీమె. కర్ణుణ్ణి చూసి మమతామయిగా అతణ్ణి మృత్యువునుంచి రక్షించడానికి కాలసర్పాన్ని మంత్రించి ఆహ్వానించి విషాన్ని తీయిస్తుంది. (పుట. 264) ఈ అంశాన్ని సారళ మహాభారతంనుంచీ రచయిత్రి తీసుకుంది.

కర్ణుణ్ణి రక్షించడం విని అర్జునుడు ద్రౌపదిని మెచ్చుకుంటాడు. నిజానికి అప్పటికే కర్ణుడు పాండవులకు వ్యతిరేకంగా ఉంటాడు. పైగా పాండవుల్ని అవమానపరచడానికి వెనుకాడని వాడుగా ఉన్నాడు. ఎందుకు మెచ్చుకున్నాడో అని పాఠకుడికి తెలుసుకోవాలనే ఉత్సుకత కలుగుతోంది. దానికి సమాధానంగా 'తన ప్రతిజ్ఞని నెరవేర్చే అవకాశం దొరికిదని' అర్జునుడు ఆనందిస్తాడు. కానీ, కర్ణుడు స్త్రీవల్ల(ద్రౌపది) ప్రాణాలు పొందాడని తృచ్ఛంగా భావించాడని సూచనగా తెలుపుతోంది. ఈ నవలలో కర్ణుడు ప్రాణాలతో తేరుకున్నంత వరకు అక్కడే ఉంటుంది. కానీ, కర్ణుడికి ముఖం కనిపించకుండా వెనక్కి తిరిగి ఉండి, అలాగే వచ్చేస్తుంది. ఇది మూలంలో లేని విషయం. కర్ణుడు ద్రౌపదిని అంతకు ముందు రక్షించాడు. మళ్ళీ కర్ణుణ్ణి రక్షించి ద్రౌపది ఋణం తీర్చుకుందని తెలుస్తోంది.

స్వయంవర సభలో మొదలవుతున్నప్పటికీ ఆ సమయంలో పరిసరాల్ని రచయిత్రి చక్కగా వర్ణించారు. 'రాజవీధిలో వరసగా అనేక వృక్షాలు నాటారు. కొత్త ఆకులు, పూలతో, ఫలవృక్షాలతో చక్కగా అలంకరించుకున్న పురస్త్రీలలా పరిపూర్ణంగా, రమణీయంగా కనిపిస్తాయి. చిలుక, గోరింక, కోకిల మొదలైన పక్షులు కూడా పాంచాలదేశంలో జరగబోతున్న స్వయంవర వార్త విన్నట్లున్నాయి. అవి మధురమైన తమ కంఠాలను ఉత్సవ సంగీతారావంతో చేర్చి తమ కర్తవ్యాన్ని నెరవేర్చు కుంటున్నాయి'(పుట.39) పశుపక్ష్యా దులకుకూడా ద్రౌపదీ స్వయంవర విషయం తెలిసినప్పుడు పాండవులకు తెలీకుండా ఉంటుందా?! వాళ్ళు రావడం జరిగే ఉంటుందన్న సూచన ఈ వర్ణనలో కనిపిస్తోంది. అందుకే పంచవిహారం, పాండవులకోసం ఏర్పాటుచేసిన అతిథి గృహంలో కృష్ణుణ్ణి దూరం నించి కృష్ణ చూసి అతడు అర్జునుడా! అని సందేహపడడం పై సూచనకు బలాన్నిస్తోంది.

ద్రౌపది కోరిక మేరకు కామ్యకవనంనుంచి భీముడు స్వర్ణ కమలాలు తేడానికి కుబేరుడు ద్రౌపదికి పదిలక్షలస్వర్ణ కమలాలు బహుమతిగా ఇవ్వదలిచాడు. అయితే చివరకు ఆ కమలాలకు బదులుగా కామ్యకవనం, ద్వైతవనం, నైమిశారణ్యం ఇంకా హిమాలయాల్లోని వివిధ ప్రాంతాల్ని కలుపుతూ హస్తినాపురం వరకు బాటలు వేసి విశ్రాంతి మందిరాలు, బావులు నిర్మించమని  కుబేరుణ్ణి కోరుతుంది. అలా కృష్ణకు అంతకుముందు వచ్చిన స్వప్నాన్ని సాకారం చేసుకున్నట్లు రచయిత్రి వివరించింది. ఇది మూలానికి వివరణగాను, శబరులు పాండవుల పట్ల విధేయులుగా ఉండడానికి తోర్పడింది. పైగా ద్రౌపది కోరిక కుబేరుడు, ధర్మరాజులకు ఆనందాన్ని కలిగించింది. (పుటలు. 241-243)

అభిమన్యుడు సుభద్ర పుత్రుడా? ఈ ప్రశ్నకు కొంత చర్చ ఈ నవలలో ఉంది. అభిమన్యుడికి అక్షరాభ్యాసం అతి వైభవంగా జరిగింది. కృష్ణద్వైపాయనుడు, కృష్ణ వాసుదేవులు వచ్చారు. కృష్ణుడు అభిమన్యుణ్ణి ఆశీర్వదించాడు. వెళ్ళేటప్పుడు చిలిపిగా, "కృష్ణా, సుభద్ర పుత్రుడు ఈ వంశానికి జ్యేష్ఠపుత్రుడిగా జనించాడని నువ్వు దుఃఖించవద్దు. అదే పురువంశ పరంపర గాంధారి మొదటి గర్భవతి అయినా చిన్నతోటికోడలు కుంతీపుత్రుడు యుధిష్ఠిరుడు మొదట జన్మించి బాధ్యతలు స్వీకరించాడు. నీ పుత్రులకు రాజకిరీటం మోసేబాధ్యత తప్పు తుందనిసంతోషించు"(పుట.176)అని అన్నాడు.

చిన్నప్పటినుంచీ తనఒడిలోనే అభిమన్యుడు పెరిగాడని అభిమన్యుణ్ణి బుజ్జగించేపని, ఆడించేపని తనదేనని వివరిస్తుంది. అప్పుడు కృష్ణుణ్ణి అడుగుతుంది- అభిమన్యుడు తన కుమారుడా లేక సుభద్రకా?. కృష్ణుడు నేను చెప్పేదేముంది అభిమన్యుడే ఆ విషయాన్నిచెప్పుకున్నాడు. మొదటిరోజు గురువు పరిచయం అడిగితే 'నా తండ్రి అర్జునుడు. మామ కృష్ణుడు, తల్లి కృష్ణ' అన్నాడు. ఇక్కడ పాపం నా ముద్దులసోదరి సుభద్ర పేరుకూడా వినిపించలేదు అని అనడం మూలంలో లేదు. ఇక్కడ పిల్లల్ని చేరిక చేయడం, ఉమ్మడి కుటుంబ వాతావరణ  అనుభూతుల్ని వివరించారు.

అరణ్యవాసానికి ద్రౌపది, పాండవులతో సహా బయలుదేరుతుండగా ద్రౌపది ఒంటిమీద ఆభరణాల్ని దుశ్శాసనుడు తొలగింపజేస్తాడు. 'రుతుమతి'(కర్ణుడి భార్య) ద్వారా కర్ణుడు ద్రౌపదికి ఆభరణాలు ఇవ్వజూస్తాడు. కానీ, ద్రౌపది స్వీకరించదు. నిరాలంకారంగా ఉన్న ద్రౌపది దు:ఖాన్ని చూసి అర్జునుడు అంతరంగంలో ప్రతిజ్ఞ చేసుకుంటాడు. అది ఇంద్రలోకం నుంచి రత్న ఖచిత ఆభరణాదులు తెచ్చి కృష్ణకు ఇచ్చి నప్పుడు పై విషయాన్ని చెప్తాడు. ఇది అమూలకం. మనసులో అనుకోడంగా రచయిత్రి కల్పన చేసింది. హస్తినకు ఇంద్రప్రస్థం నుంచి ఎలా వెళ్ళామో అలాగే అరణ్యాలనుంచి హస్తినకు వెళ్ళాలని అర్జునుడి పట్టుదల. అక్కడ పడిన అవమాన తీవ్రత, కష్టపడి సంపాదించాలనే ఉద్వేగం అర్జునుడి పాత్రలో ఈ సమయంలో వ్యక్తమౌతాయి.(పుట.244)

ద్రౌపది మహాప్రస్థానానికి వెళ్తూ, చివరగా సఖుడైన కృష్ణుణ్ణి ఐదువరాలు కోరినట్లుంది. ఒకటో వరం-  ఇంకెప్పుడూ తనలా ఐదుగురు భర్తల్ని ఏ స్త్రీకి ఇవ్వోద్దు.

రెండోవరం- ఎవరికీ పుత్రశోకం కలగకుండా చేయడం. మూడోవరం- ఏ స్త్రీకి తనకు కలిగిన యాతన పెట్టకుండడం. స్త్రీని రూపవంతులుగా చేసినా, పురుషుల్ని కాముకులుగా చేయవద్దని కోరింది. నాల్గోవరం- జాతి, ధర్మం, భాష, వర్ణ వైషమ్యాల్ని అడ్డం పెట్టుకొని దేశాలు ముక్కలు కానీయకుండా చెయ్యి. దేశం అఖండత్వాన్ని, ఐకమత్యాన్ని, పవిత్రతని నాశనం కాకుండా చెయ్యి. ఒకవేళ వైషమ్యాలున్న మహాసమరం సంభవించకుండా చెయ్యి. సృష్టి కళ్యాణానికై జాతీయ ఐక్యం, విశ్వమైత్రి, సమర ఆకాంక్షలేని ప్రపంచంగా చెయ్యి. ఐదోవరం- స్వశరీరంతో స్వర్గానికి వెళ్ళడానికి పడే కష్టంకంటే భూలోకాన్ని స్వర్గసమానం చేసి, కృష్ణుడు జన్మించిన పవిత్ర భరతభూమిపై ప్రేమికగా, కృష్ణప్రేమికగా, విశ్వప్రేమికగా జన్మ నివ్వు. (పుటలు. 317-318)

ఈ వర్ణనలు మూలంలో లేవు. ఇది రచయిత్రి భావిస్తున్న విశ్వమానవ కళ్యాణంగా వీటిని చెప్పొచ్చు. ఇంకో అంశం రాజరికపు స్త్రీ రెండు వరాలుకంటే ఎక్కువ వరాలు కోరుకోకూడదని ధృతరాష్ట్రుడు కోరుకోమన్నప్పుడు ద్రౌపది రెండే వరాలు కోరుకుంది. కానీ కృష్ణుడి విషయంలో ఐదువరాలు కోరుకోడంలో ఈ నియమం వర్తించడం లేదు. బహుశ ద్రౌపది ఈ వరాల్లో తనకోసం కోరుకున్న వరం ఐదవవరం ఒక్కటే. మిగతావన్నీ అందరి స్త్రీలకోసం కోరుకుందని గమనించాలి.

## 5. 12. రాజమాత నవలలో వర్ణనలు- మార్పులు, చేర్పులు :-

ఉత్పల సత్యనారాయణాచార్యులవారు రాజమాత నవలలో చాలా కొత్త అంశాలు జోడించారు. ఇది ప్రాగైతిహాసిక నవలగా పేర్కొన్నారు. ద్రుమిళాసురుడు పాత్రలాంటి చాలా పాత్రల్ని సృష్టించారు. ఆయా పాత్రలన్నీ సందర్భానుసారంగా కథతో కలిసినట్లుగా ఉంటాయి.

కుంతిభోజుడికి సంతానం కలగలేదు. అందువల్లే శూరసేనుడు మారిషల పెళ్ళి అయ్యాక తమకు కలిగిన మొదటి సంతానం ఇస్తామని వాగ్దానం చేసారు. కుంతిభోజుడి భార్య సువ్రత. ఈమెనుతీసుకొని సుయామునపర్వతప్రాంతంలో తిరుగుతున్నప్పుడు ద్రుమిళాసురుడు అనే రాక్షసుడి కంట పడ్డారు. వాడికి సువ్రత ఒంటరిగా దొరక్కపోడంవల్ల రథంలోపాటు ఆమెను లోయలోకి తోసేసాడు. ఆ విధంగా నడుంవిరిగిపోయి సంతానవతి కాలేదని ఈ నవలలో వర్ణించారు. ఇది అమూలకాంశం.

ఉగ్రసేనుడి భార్య సువృత్త. ఈమెను తీసుకొని ఉగ్రసేనుడు ద్రుమిళాసుడున్న పర్వత ప్రాంతానికి తీసుకెళ్ళాడు. వాళ్లకి అక్కడ ద్రుమిళాసురుడున్నట్లు తెలీదు. అక్కడ ద్రుమిళాసురుడు మాయా రూపంలో (ఉగ్రసేనుడి వేషంలో) వచ్చి సువృత్తను మోసం చేసినట్లు మూలంలో ఉంది. దాన్ని పారాశవీదేవి పాముకాటుగా మార్చింది. ద్రుమిళుడు కలిసాక గర్భందాల్చింది సువృత్త. పద్దెనిమిది నెలలునిండేక ఒక కొడుకు పుట్టాడు. ద్రుమిళుడితో కలిసిన నుంచీ, 'కస్త్వం, కస్త్వం' అని(నీవెవరవు) చాలాసార్లు అనడంవల్ల ఆ పుట్టినవాడికి కంసుడనే పేరు వచ్చింది. రాక్షస గుణాలు కలయడంవల్ల పెద్దయ్యాక

దుర్మార్గుడయ్యాడు. మూలంలో పాము కరిచినట్లు లేదు.

కుంతిభోజుడు శూరసేనుడి కుమార్తెను దత్తగగా స్వీకరించే మహోత్సవం పృథు మండపంలో జరిగింది. అందువల్ల ఆమెకు పృథ అని పేరుపెట్టినట్లు ఈ నవలలో చెప్పారు. పృథ అంటే విశాలమైనది, లావుగాఉన్నది అనిఅర్థం. మారిష, శూరసేనుడు బహుశ్రుత ముని ఆశ్రమానికి వెళ్ళారు. అక్కడ మంగళాదేవి, బహుశ్రుతముని భార్య పుత్రుణ్ణి కనమని దీవించాడు. వసుదేవుడు పుడుతున్న సమయంలో ఆకాశవాణి మేఘగర్జనలు, ఆనక దుందుభులు ధ్వనిస్తూనే ఉన్నాయి. పర్యవసానం ఎవరికీ తెలీదు. ప్రచండమైన గాలి వీచింది. కిటికీ రెక్కలు తెరుచుకొని బయటనుంచి లోపలకి విరజిమ్మిన పుష్పరాశి లోపల పడింది. అది ఎలా వచ్చిందో తెలీదు. అంతలో మారిష ప్రసవించింది. పుట. 36) శబ్దాలన్నీ ఆగిపోయి, పిల్లవానికేక వినిపించింది. ఆ ధ్వని విని కుంతిభోజుడు ఆదుర్దాగా వచ్చేసాడు. ఇదంతా మూలంలో లేదు. వీడికి కుంతిభోజుడు పెట్టిన పేరు 'ఆనక దుందుభి'. మారిష పెట్టిన పేరు వసుదేవుడు.

సూర్యదేవుడివల్ల గర్భం దాల్చిన కుంతి శూరసేనుడి దగ్గరికి విభావసి కూతురు పునీత వివాహంకోసం వెళ్ళి కొన్నాళ్ళు అక్కడే ఉండి తిరిగి వచ్చింది. అప్పటికే గర్భం దాల్చింది మనిషి లావుగా మారింది. కానీ ఆ విషయం సువ్రత(కుంతిభోజుడి భార్య)గమనించలేదు. గోకులం నీళ్ళు సరిపడక అలా అయిందని అనుకుంది. ప్రసవానంతరం సన్న బడ్డాక, గోకులం నీళ్ళవాతం అంతా తగ్గి సన్నబడిందని అనుకొంది. సువ్రత తన దాసి, విభావసిని అడిగితే ఆమెకూడా సువ్రతమాటనే సమర్థించింది. ఇంతకీ గర్భవతి లక్షణాలు సువ్రతకు తెలియక పోడమే అని రచయిత వివరణ ఇచ్చారు.(పుట.118). అలాగే ఎవరిని చూసినా వారిలో సూర్యుడే కుంతికి కనబడినట్లు అనిపించింది. అందుకే ఆమె సూర్యుడే అనుకొని పాండురాజు మెడలో స్వయంవరమాల వేసినట్లుంది.(పుట.119). ఇది అనుభూతికి సంబంధించిన చిత్తవృత్తిగా, పదేపదే తలచుకోవడంతో ఇలా జరిగిందని పాఠకుడికి ఈ వర్ణనద్వారా సూచించి నట్లయింది.

పాండురాజు దండయాత్రలు చేస్తూ మద్ర దేశాన్ని పాలిస్తున్న శల్యుణ్ణి ఓడించాడు రాజమందిరంలో ప్రవేశించిన పాండురాజు పాదాలముందు శల్యుడు మోకరిల్లాడు. ఆ సమయంలో శల్యుడి చెల్లెలు మాద్రి మేడమెట్టుదిగి ఒయ్యారంగా వచ్చి నిలుచుంది. ఆమె పాండురాజు చూసి అరనవ్వు నవ్విందట. పైట చెంగు సగం చాటుచేసి అందమైన తన ముఖాన్ని సగం కనిపించేలా చేసిందట. పదింటిలో సగం తూపులను తన సగం చూపులతో వదిలిందట. ఆ దెబ్బకు పాండురాజు సగమై పోయాడు. ఆమె లేకపోతే తనకు పరిపూర్ణత లేదనుకున్నాడు. ఆమె మీద వ్యామోహంతో పాండురాజు హస్తినకు చేరుకున్నాడు.(పుట. 121) అప్పటి పాండురాజుయొక్క స్థితిని రచయిత వర్ణించాడు.

మూలంలో దేవవ్రతుడితో కలిసి పాండురాజు దండయాత్రలు చేసాడు. అప్పుడే మద్రరాజు పరిచయం అయ్యాడు. కానీ ఈ నవలలో కేవలం పాండురాజే దండయాత్రలు

చేసిన తర్వాత దేవవ్రతుడు సంబంధం ఖాయం చేసి, పెళ్ళి చేసినట్లు ఉత్పలవారు మార్చారు. కుంతివిషయంలో ఇంకో ప్రత్యేకత - పెళ్ళికి ముందే పరిచయాలున్నట్లు, పాండురాజు పట్ల ప్రత్యేక ఆకర్షణ పృథకు కూడా ఉన్నట్లు రచయిత మార్చారు.

పాండురాజు ఇద్దరు భార్యల్ని పెళ్లి చేసుకొన్న తర్వాత వారితో గడపకుండా, రోజూ వేటకోసం అడవికి వెళ్ళి పోతుండేవాడు. సాయంత్రానికి వచ్చి నిద్రకు ఉపక్రమించేవాడు. వేటకు వెళ్ళడం ఇష్టం లేకపోయినా కుంతి, తన భర్త ఉత్సాహాన్ని భంగపరచకూడదని ఏమీ అనలేదు. ఒక రోజు కిందమముని జింక రూపంలో భార్యను కూడా మృగిగా మార్చి, కామ క్రీడలో ఉన్నారు. ఆ సమయంలో మామూలుజింకగా భావించిన పాండురాజు, వాటిపై బాణాలు వేసాడు. కిందమముని చనిపోతూ 'నీవు కూడా నీ భార్యలతో క్రీడించినప్పుడు ప్రాణాలు విడుస్తావని శపించాడు'(పుట.126).

అక్కడకు చేరుకున్న కుంతి విషయం తెలుసుకుంది. ఆమె మహా తేజస్సుతో, తపస్వినిగా కనిపించింది. ఎంత తేజస్సంటే కిందమ మునినే శపిస్తుందన్నంత. కానీ ఆమె అందరికి నమస్కరించి తన భర్త నిరపరాధి అని విధి విలాసంగా ఇలా జరిగిందని, క్షమించి పతిని రక్షించమని కోరింది. అక్కడున్న వృద్ధముని 'కిందముడికి కౌరవవంశీయులంటే గౌరవమని, ఆ వంశీయులు పాపభాజనులు కాకూడదని శపించాడు. బ్రహ్మహత్య, మునిహత్యా పాతకం మహారాజువంశానికి సంక్రమించ కూడదని ఆ మహాముని సంకల్పమై ఉంటుంది. మీ రేమీ విచారపడవద్దని'(పుట. 127) అన్నాడు. మూలంలో వృద్ధముని వివరించినట్లుగా, కుంతి మహా తపస్వినిగా కనబడినట్లు లేదు. ఇవి ఈ నవలలో మార్పులు.

పాండురాజుకి కుంతి తన దగ్గరున్న మంత్ర ప్రభావంవల్ల పుత్రులు పుడతారని తమరు అనుమతిస్తే దేవతల్ని ఆహ్వానిద్దామని అంటుంది. కుంతి విధి పూర్వకంగా దేవతా మంత్రాల్ని జపించింది. పాండురాజు మానసపూజలో నిమగ్నుడయ్యాడు. మనస్సు, బుద్ధి, శరీరాన్ని, సమస్త ఇంద్రియాల్ని ధర్మదేవతకు వశం చేసాడు. మూడు రోజులు కుంతి, పాండురాజు దంపతులు ధ్యానంలో మునిగిపోయారు. మూడవరోజు తెల్లవారు ఝామున వారి ముందు ఒక తెల్లని విమానం మెల్లగా దిగింది. పాండురాజు కళ్ళు తెరచి చూడలేకపోయాడు. ఆ విమానంలోంచి ధర్మదేవత తేజోరూపం పాండురాజులో లీనమైంది. అప్పుడు నా అంశతో పుత్రుడు జన్మిస్తాడని చెప్పి ధర్మదేవత అదృశ్యమయ్యాడు. (పుట.135). కుంతిని పాండురాజు గాఢంగా కౌగలించాడు. కుంతి గర్భవతి అయింది. ఇంత వర్ణన మూలంలో లేదు. కేవలం దేవతల్ని తలచుకొని కుంతి దుర్వాసులు ఇచ్చిన మంత్రమహిమతో ధర్మాదులు పుట్టినట్లుంది.

సుయోధనుడు పరుగుపందెం పెట్టాడు. చిన్నవాళ్ళందరితో భీముణ్ణికి పరుగు పెట్టించాడు. దాంట్లో అందరినీ భీముడు విజయం పొందేక, సుయోధనుడు తనతో భీముణ్ణి పరుగుపందెంలో గెలవమని సవాల్ చేసేవాడు. అన్ని సార్లు పరుగెత్తినా భీముడిలో అలసిపోడం అనే ప్రశ్నే లేదు. తను గెలుచుకున్న కానుకలు నకుల సహదేవులకు చూపించేవాడు. వాళ్ళుచాలా సంతోషించేవారు. గబాలున వారిద్దర్నీ ఎత్తుకొని ఆనందంతో

భీముడు తిప్పేవాడు. వారిద్దరు మరింత ఆనందించేవాళ్ళు. అలాంటి సమయంలో కుంతికి గోకులంలో శ్రీకృష్ణుడిగా భీముడు కనిపించేవాడు. కొద్దిసేపటికే భీముడు నిద్రపోయేవాడు. అతడి గుండెలమీద చెవియొగ్గి కుంతి వింటే 'హరి ఓం' నాదం విచిత్రంగా వినిపించేది.(పుట.174) ఇక్కడ ఆటలాడడం వరకు మూలంలో ఉంది. ఆ తర్వాత అంశాలు మూలంలో లేవు.

అడవిలో పాండురాజుతో ఉన్నప్పుడు శుకరాజర్షి దగ్గర అర్జునుడు ధనుర్విద్య నేర్చుకున్నాడు. ఆ తర్వాత దేవవ్రతుడి సమక్షంలో కృపాచార్యుడి దగ్గర అర్జునుడు ధనుర్విద్యను ప్రదర్శించాడు. దాన్ని చూసి దేవవ్రతుడు శరలాఘవంలో ఎన్నో మెలకువలు స్వయంగా చూపి, తాతను మించిన వీరుడవు కావాలని దీవించినట్లు కుంతికి అర్జునుడు వివరించాడు.(పుట.175) నకుల సహదేవుల విషయంలో తల్లి దగ్గర అయిపోని చదువు ఉండదనడం, దాంతో కుంతికళ్ళు చెమ్మగిల్లడం, హృదయం ద్రవించడం మొదలైనవి ఈ నవలా రచయిత కల్పనలే. మూలంలో  ఇవి లేవు.

భీమ, హిండింబుల వివాహం జరిగింది. హిడింబి భీముడు పాదాలకు మొక్కింది. అలాంటి సమయంలో పశ్చిమ దిక్కన వెలుగులు విరజిమ్మాయి. శాలిహోత్రుడి ఆశ్రమ పరిసరాలు దేదీప్యంగా వెలుగొందాయి. ఒక మేఘమండలం ఆకాశంనుంచి దిగజారి భూమి మీదకి నిటారుగా నిలిచినట్లయింది. శ్యామల వర్ణుడు, దండ, కమండలధారి ఒక మహాత్ముడు ఇటే నడిచి వస్తున్నాడు. శ్యామల వర్ణంతో ఉండడం వల్ల విష్ణుమూర్తిలా ఉన్నాడు. కానీ, చతుర్భుజాలు లేవు దండ, కమండలధారి అయిన బ్రహ్మలా ఉన్నాడు. కానీ, నాలుగు ముఖాలు లేవు. జటాజూటాలు, జింక చర్మం ధరించాడు. శివుడి  లక్షణాలున్నాయి కానీ, లలాటనేత్రం లేదు. అని వర్ణించాడు (పుట. 225) పాండవాదులు అతనికి నమస్కరించారు. పాండవాదులు తనకు తెలుసునని అన్నాడు. తను  కృష్ణద్వైపాయనుడనని, వ్యాసుడని పరిచయం చేసుకున్నాడు. ఇలా మూలంలో లేదు.

కుంతి వానప్రస్థాశ్రమానికి వెళ్ళినప్పుడు ఏకాంతంగా వ్యాసుడు ఉన్న సమయంలో అతడి దగ్గరికెళ్ళి 'తన మొదట పుత్రుడు కర్ణుడి సంగతి ఎవరికీ తెలియకుండా దాచి పాపం చేశానని బాధపడింది'. దానికి తప్పులేదని అప్పటిలో కౌమారంలో ఉన్న బాలికవని, దేవతలు అణిమాది ఐశ్వర్య సంపన్నులు. వారు ఇతరుల శరీరంలో ప్రవేశింపగలరు. సంకల్పం, వాక్కు, దృష్టి, స్పర్శ, సమాగంతో దేవతలు సంతానాన్ని ప్రసాదించడానికి సమర్థులు. అది దూషితం కాదని మానసిక చింత దూరం చేసుకోమని వ్యాసుడు వివరిస్తాడు. చివరిలో గాంధారి, ధృతరాష్ట్రులు ఉన్న ఆశ్రమం అంతా ఒక్కసారిగా నల్లటిపొగలు కమ్మి మండిపోయింది. దాన్ని ఆర్పడానికి ప్రయత్నిస్తూ కుంతి మంటల్లోకి చొచ్చుకుపోతుంది.  చాలా దూరం మంటల్లోంచి పరుగెత్తుతుంది. చివరకు బృందావనానికి చేరుకుంటుంది. ఈ వర్ణన అంతా మూలంలోలేదు. ఇక్కడ రచయిత కల్పించాడు.

ఈవిధంగా ఉత్పలవారు సరళమైన భావజాలంలో పాఠకుడి దృష్టిని ఆకర్షించేలా మార్పులు చేసారు.  ఈ కథాగమనానికి అడ్డుకలిగేలా లేకుండా ఇప్పుడే ఇక్కడే

జరుగుతున్నట్లు అనిపించేలా ఉండడం ప్రత్యేకతగా చెప్పొచ్చు.

## 5. 13. రాజసూయం నవలలో వర్ణనలు-మార్పులు, చేర్పులు :-

చివుకుల రవిశర్మ రాసిన రాజసూయం నవలలో చాలా రకాలుగా వర్ణనలు చేసారు. ఇవి మూలానికి వన్నె తెస్తూ సందర్భోచితంగాను, హృద్యంగానూ ఉన్నాయి. నవలా ప్రారంభం సాయంకాల వర్ణనతో రచన సాగించారు. "వర్షము విరామమిచ్చినది. కొత్తగా చిగిర్చిన పొన్న చెట్టు గుబురాకులపై కులుకుచు నింద్రధనుస్సులను పుట్టించు చున్నవి. పొన్నచెట్టు క్రింద పంచకోణమై చంద్రకాంత శిలావేదికపై నాసీనుడై యున్న ఆజానుబాహుని మేలిమి బంగారుఛాయ మేనిపై వర్షాంత సమీకరణాంకురములు సోకుచు పోవుచు వింతవింత స్పర్శల గిలిగింతలు పెట్టుచున్నవి. అప్పుడే వేలిసిన వర్షములో దక్షిణాకాశమున మబ్బులు పింజలు పింజలుగా తేలిపోవుచున్నవి. ఉత్తర దిశనుంచి కారుమబ్బులు గాంఢాంధకారము నీలముగా క్రమ్ముచున్నవి.(పుట.1) పొన్నచెట్టు, పంచకోణ, మేనిపై వర్షాంత సమీరణాంకురములు, మబ్బులు పింజలుగా తేలడం వంటి పదాలు జరగబోయే పాండవ కురుక్షేత్ర యుద్ధాన్ని సూచిస్తోంది.

'ఎర్రని పచ్చని, నీలమైన రంగుల చక్కని సమ్మిశ్రముతో చిత్రించిన త్రివర్ణ చిత్రం మీద నల్లని అల్లిక చీకటులావరంచసాగినవి'(పుట. 2) ఈ వర్ణన మధ్యలోనే ఆసీనుడైన ఆజాను బాహుడు వర్ణించడం ద్వారా పాఠకుణ్ణి కథలోకి తీసుకెళ్తూ, ఆలోచించేలా చేస్తున్నాడు. ఆ ఆజానుబాహుడు అర్జునుడు. ఉలూచి, చిత్రాంగద, సుభద్రల్ని పెళ్ళాడినా కూడా నల్లని ద్రౌపదిపట్ల ఆకర్షితుడై ఉంటాడని రచయిత స్ఫురించేలా చేసాడు. ఇది పాఠకుడి ఆలోచనకు గీటురాయి.

కృష్ణద్వీపాన్ని చాలా చక్కగా వర్ణించాడు. ఆకాశంలో ఖేచర దంపతులు కిందకి చూస్తే రెండు నదుల సంగమంలో ఒక తాబేలు తేలుతున్నట్లు కనిపిస్తుంది. వారు కుతూహలంతో కిందకి దిగారు. తాబేలు వీపుడిప్పపై పొలుసులులా కనిపించాయి. చెట్ల గుబుర్లుగా అదొక ద్వీపంగా తెలుసుకున్నారు. ఖేచరుడు దిగొద్దని వారిస్తున్నా ఖేచరి కిందకి ఏటవాలుగా దిగుతుండగా చెట్ల పైభాగంలో ఉన్న ఆకాశంలో వాళ్లు గుద్దుకొని త్రుళ్ళింత పడ్డారు. నీరెండ రంగులో ఆకాశం అగ్నిసెలయేటిలా ప్రవహిస్తోంది. ఆ భయంకరమైన సెగకు తట్టుకోలేక ఆకాశానికి వెళ్ళిపోయారు.(పుటలు 12,13) విచిత్రమైన వాతావరణం ఉండడం ఈ సంగమ ప్రదేశానికి ప్రత్యేకత గా చెప్పకచెప్పినట్లయింది. అలాంటి ఆశ్రమంలో కృష్ణద్వైపాయణుడు ఉన్నాడని రచయిత తెలియజేసాడు.

గ్రీష్మఋతువులో ఎండలు సహజం. అగ్నికి వేగంకూడా ఎక్కువే. సహజంగా వడ గాల్పులు, అగ్నిప్రమాదాల కాలమది. ఆ కాలంలోనే ద్వారక దగ్ధమౌతోంది. దాన్ని కళ్ల ఎదుటే తగులపడిపోతున్నట్లు రచయిత వర్ణించాడు. నౌకాధిపతులు దూరదర్శిని యంత్రంలో దగ్ధమౌతున్న ద్వారకని చూస్తారు. "బహిఃప్రాకారము, అందున్న సౌధములు మాత్రమే మండుచున్నవి, బహిః ప్రాకారమున నున్న చర్మకార వాటికలో వ్రేల వైచిన చర్మముల నీలారుణకాంతులతో మండుట చూడగా వాని కమురు కంపు తమ నాసికలకు సోకినట్లే భ్రమ

కలిగినది నౌకలలోని వారికి. చర్మములు కాలిన వేడికి సముద్రతీర తలమున జలములు ఆవిరులగుటవలన నందలి యాకాశము వడకుచున్నట్లు కనిపించెను... ఇటుకలకు నిప్పుల రెక్కలు వచ్చి ఎగిరి అరచుచున్నవి''(పుటలు.17-19) అని సహజమైన రీతిలో వర్ణించాడు. వెదురుగడలు పేలిన శబ్దాలు, భవనపతాకాలు కాలి పైనుంచి కిందకి పడడం ఇవన్నీ భయంకర దృశ్యాలు. వీటిని పాఠకుడి ఎదుట పెట్టి భయం కలగేలా చేస్తాడు. ఒక రకంగా పాఠకుడు అంత అందమైన నగరం అగ్నికి ఆహుతి అయిపోతుందనే బాధ పడేలా చేస్తోంది.

హస్తినాపుర వర్ణనలో ''హస్తినా పుర రాజప్రసాదము మిగిలిన సౌధముల ప్రభ అలను త్రోసిరాజనుచు సాయంకాలపు ఎండలో వంగపండు రంగులో కనిపించెను. వేసవికాలపు ఎండకు తట్టుకోనుటకై రాజనగరు గవాక్షములు నిత్యము తడుపబడుచున్న వట్టివేళ్ల తడికల్తో మూయబడి యున్నవి. జలశీకర యంత్రాములనుండి హిమాంబు బిందువులు భవన ప్రాంగణవాయువులను శీతలమందమారుతుములుగామార్చుచు దరసౌరభములను గుబాళించు చున్నవి. వట్టివేళ్ళ యాచ్ఛాదనములు కప్పిన కారణమున నంతఃపురములోనికి సహజకాంతి ప్రసారము ముసుగు వారినది. లోపల కుడ్యములందమర్చిన రత్నదీపములు పగలు గూడ ప్రకాశించుచు వెలవెల బారుచుండెను''(పుట. 24) అని వర్ణించాడు. గ్రీష్మతాపానికి వట్టివేర్లచాపలు పూర్వకాలం నుంచీ వాడడం ప్రాచీనతను తెలియజేస్తోంది. రత్నదీపకాంతి వెలవెల బారడం ఈ వర్ణనలోని ప్రత్యేకత.

ధృతరాష్ట్రుడు కౌరవరాజ్యానికి మహారాజు. అభ్యంతర మందిరలో నిర్మానుష్యంగా కూర్చున్నాడు. ''ఒక యమూల్య పర్యంకమున గడ్డములు మీసములు వృద్ధుడొకడు ఆసీనుడై ముందుకువంగి వినుచుండెను. ఆతడాజానుబాహుడు. పండుతమలపాకువంటి దేహచ్ఛాయ పయి సుకుమారమైన ముడుతలు కన్నుల చివళ్ళ చర్మముపై కనుపించుచున్నవి. బంగారు జరీ యుత్తరీయము నెడమ భుజముమీదుగా వల్లెవాటు ధరించి యున్నాడు. భుజములు, జబ్బలు మామిడిపండ్లవంటి కండలు తిరిగి యున్నవి. దేహము సమభక్తాంగము, పొడవైన నాసికకొన లోనికి వంగి నవ్వుచున్నట్లు కనిపించును. కనుబొమలు దట్టములై భయము గొల్పుచుండును'' (పుటలు. 24-25) అని ధృతరాష్ట్రుడి శారీరక స్థితిని వర్ణించాడు. నవ్వుచున్నట్లు కనిపించునాసిక ఉన్నా కనుబొమలు భయాన్ని కలిగిస్తాయనడం ఈ వర్ణనలోని ప్రత్యేకత. నవ్వుతూనే గొంతు కోసే రకం అని సూచన చేయండగా అనిపిస్తోంది.

కర్ణ, సుయోధన, ధృతరాష్ట్రులు మాట్లాడుతున్నప్పుడు భీష్ముడు వస్తాడు. ఆ సమయంలో భీష్ముడి వర్ణన- ''భీష్ముడు ధనుః ప్రమాణ సమున్నత దేహుడు. అతని దేహమునకు వయస్సంటినట్లు లేదు. అరువది యేండ్ల ధృతరాష్ట్రుడెంత దృఢకాయముగా నుండెనో శతాధిక వృద్ధుడైన భీష్ముడు నంతే దృఢముగా నుండెను. వెన్నెలవలె వెలుగు తీగవలే యజ్ఞోపవీతమున్నది. కార్తీకమాసము మబ్బుల కుప్పపై పూర్ణిమ చంద్రుని కిరణములవలే పితామహుని గడ్డము ప్రకాశించుచుండెను. కన్నుల తళుకు సూటిగ చూడరానిది'' (పుట.31) మెరుపు తీగతో యజ్ఞోపవీతాన్ని పోల్చడం ఇతడి నిష్ఠని

తెలుపుతోంది. తళుకు సూటిగా చూడరానిది శరీరం కాబట్టే ఇతడంటే భయం, భక్తి అందరికీ అని సూచన కనిపిస్తోంది. వయసుతో సంబంధంలేని ప్రకాశించే శరీరదారుఢ్యం ఉన్నవాడు. నిండు చంద్రుడివంటి గడ్డము ఇతడి వయసుని, పెద్దరికాన్ని, ప్రశాంతచిత్తాన్ని సూచించడం ప్రత్యేకత.

కర్ణుడు పరశురాముడు దగ్గర బ్రహ్మాస్త్రవిద్య నేర్చుకున్నాడు. ఒకరోజు అడవికి పరశు రాముడు, కర్ణుడు వెళ్ళారు. అక్కడే పరుశురాముడు కర్ణుడి తొడమీద తలపెట్టి నిద్రపోయాడు. ఒక పురుగు కర్ణుడి తొడని కొఱికి రక్తం తాగుతోంది. దాని గమనించిన కర్ణుడు గురువుకు నిద్రాభంగం అవుతుందని భావించి బాధని తట్టుకున్నాడు. రక్తం ధారకట్టి విశ్వామిత్రుడికి తడిగా తగిలి మెలకువ వచ్చేసింది. విషయం తెలుసుకున్న విశ్వామిత్రుడు కర్ణుడి సాహసాన్ని చూసి, ఇంతటి సాహసాన్ని చేసినవాడు బ్రాహ్మణుడు కాడని అనుమానించాడు. గద్దించి కర్ణుణ్ణి, 'ఏ కులస్థుడవ'ని అడిగాడు. రాజుల్ని సేవించే సూత పుత్రుణ్ణి అని కర్ణుడు నిజం చేప్పేసాడు. రాజుల్ని అంతం చేయాలనుకున్న పరుశురాముడికి కర్ణుడు నిజాన్ని దాచడంవల్ల కోపంవచ్చి 'బ్రహ్మాస్త్రం సరైన సమయంలో గుర్తుకు రాకుండునని' శపించాడు. ఇదంతా మూలంలోని విషయం.

పై అంశాన్ని రాజసూయం నవలలో భీష్ముడు కర్ణుడి గురించి చెబుతూ దూకుడుతనం వల్ల కర్ణుడి నష్టాన్ని ఎత్తిపొడుస్తూ మాట్లాడతాడు- 'భారవులే అకృత వ్రణునిచే నాకు కబురంపి లోకహితార్థము యథాశక్తి శ్రమింపుమని హెచ్చరిక చేసి యున్నారు'' (పుట.34) అంటాడు. కర్ణుడు భీష్ముడి మాటలకు సర్దుకొని దుర్యోధనుడితో 'మిత్రమా! ఇది పొరపాటు. ఏదో స్వల్ప దోషమునకు భార్గవులు ఇంచుక కోపించి, చిత్తశుద్ధి లేనిచో బ్రహ్మాస్త్రము స్ఫురింపదు సుమా అని మందలించిరి. అది శాపముకాదు' అన్నాడు(పుట. 34) మందలింపుగా చెప్పడం మూలానికి మార్పు. మిత్రుడికి జరిగిన విషయంలో పొరపాటుగా అనుకుంటున్నారని వాస్తవం ఇది అని చెప్పడంవల్ల కర్ణుడికి దుర్యోధనుడిమీద ఉండే ప్రత్యేకమైన అభిమానాన్ని తెలుపుతోంది.

జరాసంధుడు బైరవుడికి రాజపుత్రుల్ని బలి ఇవ్వడం భారతంలో ఉంది. దాన్ని మరింత స్పష్టంగా చెప్పాడు. ఏడు ప్రాకారాలు దాటిన ఆజానుబాహుడైన జరాసంధుడు భుజం మీద వేలాడుతున్న రక్తపట్టాంశుకంతో బైరవీ ఆలయంలో కెళ్ళాడు అంటూ ప్రారంభించాడు. పురుష సూక్తంలో చెప్పిన 'అబధ్నన్ పురుషం పశుం' వాక్యాన్ని రాజకుమారుల్ని నేతిలో తడపడం, 'కాబాహూ, కావూరూ పాదావుచ్యేత్' అని భుజాలు, తొడలు ఖండించి అగ్నిలో వేస్తాడు. ఇలా శరీరాన్ని హోమాగ్నికి ఆహుతి చేయడం ద్వారా రచయిత జరాసంధుడి విపరీత ధోరణుల్ని తెలిపాడు. ఇది విపరీతవ్యాఖ్యానంగా జరాసంధుడి పతన కారణానికి మూలంగా సూచించడం ప్రత్యేకత.

అర్జునుడు తీర్థయాత్రలు పూర్తి చేసుకుంటూ ద్వారక చేరుకున్నాడు. అక్కడ రైవతకాద్రి మీద యతివేషంలో ఉంటాడు. ఆ సందర్భంలో రైవతకాద్రినిచేరినవాళ్ళని సమయాను కూలంగా రచయిత వర్ణిస్తాడు-''ఉషోదయమునకు ముందుగనే రైవతకాద్రి

కోలాహలము ప్రారంభమయ్యెను. చిత్రవర్ణచిత్రితమైన చీనాంబరములతో, భుజములపై కనుపించుచున్న శంఖ చక్ర చిహ్నములతో మణిమయహారములతో, శిరోవేష్టములతో యాదవ ప్రముఖులు వచ్చుచు పోవుచుండిరి. సరసర సద్దు చేయుచున్న పట్టుచీరెలతో, కిటకిటగా నడుములకు బిగించిన వడ్డాణములతో, మిలమిలలాడు రవ్వల తాటంకములతో, పెటపెటలాడు కంచుకబంధములతో, నొయ్యారపు నడకలతో యాతయాత యాదవ ప్రకరము పరిసరప్రదేశములను కళకళ లాడించుచుండెను''(పుట.74)

ఈ వర్ణనలో యాదవుల వైభవం, సుభద్ర రాకను సూచిస్తున్నాడు. సరసర, కిటకిట, గలగల, మిలమిల ధ్వన్యనుకరణలు. ఎక్కువమందిజనాల్ని సూచించడానికి కిటకిట; ఆడవాళ్ళు అలంకరణతో వచ్చారు అని చెప్పడానికి గలగల పదాన్ని; చూడడానికి ఆకర్షణీయంగా ఉంది అని చెప్పడానికి మిలమిల పదాన్ని వాడినట్లు అనిపిస్తోంది. ఒయ్యారపు నడకలతో ఆ ప్రదేశానికి కళవచ్చించి అని కళ కళ పదంతో చెప్పాడు. ఆ స్థితి సన్యాసికి సైతం హృదయంలో అలజడి వస్తుంది అని సూచన చేయడానికే అని తెలియజేసినట్లుంది.

రాత్రి సమయాల్లో సముద్రయానంతో వచ్చేవాళ్లకి ఇక్కడ ఒక భూప్రదేశం ఉంది. అని తెలుసుకోడానికి ఒక కాంతి దీపాన్ని అమర్చారు. దాన్ని సముద్రంలో వృత్తాకార భవనంలో నిర్మించారు. దాన్ని వర్ణిస్తూ, ''ప్రభాస ద్వీపమునకు క్రోశము దూరమున సముద్ర మధ్యమున నిర్మితమైన వృత్తాకార భవనమునందు నాలుగవ యంతస్థులో అదియొక చంద్రశాల. చలువ రాతినేలపై రత్నకంబళము పరువుబడి యుండును. అందు ఏడు పర్యంకములు వృత్తాకారమున తీర్చబడియున్నవి. నడుమ నల్లనిదారువేదికపై నొకధూపకరండమున్నది. అందుండి వెలువడు చున్న నాలుగుధూమరేఖలు గాలికి వంగిన పూలతీగెలవలే ఇంచుక పశ్చిమ ముఖముగ వంగి, వలయాకృతి దాల్చి చంద్రశాలను సుగంధం చేయుచున్నది. వేదిక చుట్టును చలువరాతిని కప్పిన మృదుకంబళముపై నలువైపుల చిత్రపటము లల్లిక చేయబడి యున్నవి. అవి రాసలీల, గోపికా వస్త్రాపహరణము, కుబ్జా పరిత్రాణము, రుక్మిణి హరణము దృశ్యములు'' (పుట.90). ఈ వర్ణన కృష్ణుడి విలాసాల్ని, అభిరుచుల్ని పాఠకుడికి తెలుపుతోంది. నగర అందాన్ని విశదీకరిస్తోంది. పాఠకుడిమనసుకు ఆహ్లాదాన్నిచ్చి, మరింతఓపికగా చదవడానికి తోర్పడుతోంది.

'తెరచి యున్న ద్వారమునుండి మార్గశిర విభావరీ తారకావితానముతో కూడిన నల్లని యాకాశము కనిపించుచుండెను. గుడారములోపల అద్దకపు నల్లదుప్పటిపై రాశుల, నక్షత్రముల చిత్రములున్నట్లు, మంచు తెర వెనుక గోచరించుచున్న యాకాశపుటంచులకు మంచు ముత్తెముల కుచ్చులు వ్రేలాడుచున్నవి. దాని సన్నని స్పర్శకు భవనము చుట్టునున్న నిశ్చల నీల మహాసముద్రము గగుర్పాటు చెందినట్లు కనిపించుచున్నది. భవనమునకు శిరోరత్నమై కుంభాకారమైన దీపమొకటి ప్రదక్షిణావర్తముగా తిరుగుచు, క్రోశము దూరము వరకును బంధుకవర్ణ విరాజితమగు కాంతి వలయమును సృష్టించెను. దానిని పర్యవేక్షణ చేయుచున్నట్లు తటిల్లతవలె మెరయు శ్వేతకిరణమొకటి చుట్టును

తిరుగుచుండును"(పుటలు.90-91)

ఈ వర్ణనలో సముద్రవ్యాపారంకోసం ఏర్పరచిన కాంతిదీపం, దానివల్ల రాత్రి సమయాల్లో అక్కడ భూప్రదేశం ఉందని నౌకను నడిపేవారు, వ్యాపారులు తెలుసుకుంటారు. రాసలీల, గోపికా వస్త్రాపహరణ సన్నివేశాలు కృష్ణుడి అవతార తత్త్వాన్ని తెలియజేస్తున్నాయి.

అర్జునుడు సుభద్రాపహరణ తర్వాత, కృష్ణార్జునులు ఇద్దరూ ఇంద్రప్రస్థానికి పది ఆమడల దూరంలో దట్టమైన అడవిలో ఒక కొండమీద విహరిస్తున్నారు. ఆ సమయంలో అగ్నిదేవుడి వర్ణన ఉంది- "ఆగ్నేయముగా నించుక దూరమున నేదో మెరపు మెరసిన యలికిడి యయ్యెను. అర్జునుడు వెనుదిరిగి చూడగా కుండలముల కాంతితో నొక వృద్ధ బ్రాహ్మణుడు మందగమనమున సమీపించు చుండెను. అడుగులు తడబడుచున్నవి. కృశత్వముతో ముడుతలు తిరిగిన బంగారువన్నె దేహము ముసలితనమున నెరసిన కేశపాశము, ఏడుపాయలుగా భుజములపై నుండి వక్షమున వ్రేలాడుచుండెను. ముఖమున భ్రూమధ్యమందలి యూర్ధ్వ రేఖలతో పాటు, కనుబొమలు వ్రాలిన కన్నుల చూపులలో నీరసించిన బ్రహ్మవర్చస్సు. అతడు కృష్ణార్జునులను సమీపించి, నర, నారాయణా వతారులకు వెలుగుదారులు శివములగు గాక! అని ఆశీస్సులిచ్చెను" (పుటలు.132-133)

ఈ వర్ణనలో కుండములకాంతి, మందగమనం, కృశత్వం ఇవన్నీ అంతకుముందు జరిగిన యాగఫలితం వల్ల వచ్చినట్లు సూచిస్తున్నాడు. సప్తజిహ్వుడుగా పేరుపొందినవాడు అగ్ని. అతడికి ఏడు పాయలుగా కేశపాశములున్నాయనిఅగ్నిని స్ఫురించడం ప్రత్యేకత. నీరసించిన బ్రహ్మ వర్చస్సు చెప్పడం అతడి తప్పక సహాయం చేయాలి లేకపోతే ప్రమాదం అని చెప్పినట్లనిపిస్తోంది. ఇదంతా మూలంలో లేని వర్ణన. ఇది సందర్భోచితంగా ఉంది. మూలంలో వృద్ధబ్రాహ్మణుడు వచ్చి సహాయం కోరినట్లుంది.

కృష్ణార్జునుల సాయంతో అగ్ని ఖాండవ వనాన్ని దహనం చేస్తున్నాడు. ఆ వర్ణన సుదీర్ఘంగా ఉంది- "అడవిలో కారుచిచ్చు హారతి పట్టినట్లు నలుమూలల వ్యాపించెను. మంటలు పుక్కిలితో నూదుకొని పోవుచున్నట్లు చెట్లు రగుల్కొను చుండెను. స్నేహితుడు చేయిపట్టుకొని లాగుచు పరుగులెత్తుచున్నట్లు హోరుగాలి మంటలను తీగలుగా సాగించి యంటించుచుండెను. గడియ కాలములో అడవిలో గూడిన కొండలోయ మొత్తమొక కర్పూరపు ముద్దవలె మండసాగెను.

అకస్మాత్తుగా ఆకాసము బ్రద్దలైనట్లు శబ్దమయ్యెను. పిడుగులు, మెరపులతో, కారు మేఘము ఒక్క మానుగా దూకెను. కొద్ది క్షణములలో నదులను ఎత్తి బోర్లించుచున్నట్లు వర్షము ఉక్కిరిబిక్కిరి యయ్యెను. సందులేని మంటల నడుమ సందున్నచోటనెల్ల వర్షధారలు ముంచెత్తెను. గాలి రివ్వున వీచెను. చుయ్యిమను శబ్దముతో కొక్కక్షణము అగ్నిజ్వాలలు ఉచ్ఛ్వసింపబడినట్లు మాయమయ్యెను. ఇంతలో కారుమబ్బు చిట్లి పెఠిల్లున బ్రద్దలై పిడుగుతో కొన్ని వందల మెరుపులు వెలిగ్రక్కెను. ఆ మెరుపులే మంటలై అడవియంతయు

నిండిపోయెను. మేఘములతో పుట్టిన వైద్యుతాగ్ని అగ్నిదేవునిలోలీనమై వాని జ్వాలలను ద్విగుణీకృతముగా నిశ్శ్వసింపజేసెను. వర్షధారలు క్షణమాత్రమున నావిరులుగా నదృశ్యమయ్యెను. వాతావరణ మంతయు నుడుకుచున్న కుండకు మూత పెట్టగా లోపలిభాగమువలె నయ్యెను. (పుటలు.140-141)

ఈ వర్ణన మూలానికి దగ్గరగా ఉంది. ఒకవైపు ఇంద్రుడు వరుణుణ్ని మంటల్ని ఆర్పడానికి పంపిస్తాడు. అలా మంటలు ఆరిపోయి అగ్నికి పూర్తిగా ఆరోగ్యం సిద్ధించదు. అందుకే కృష్ణార్జునుల్ని అభ్యర్థిస్తాడు. ఇది మూలంలోని విషయం. మెరుపులు వచ్చి అగ్నిలో లీనమవడం ఒక కొత్తసృష్టిగా చెప్పొచ్చు. వర్షధారలు క్షణమాత్రలో ఆవిరిలవ్వడం మూలంలోని అగ్నికి దహన సమయంలో వరుణుడు ఆపడాన్ని స్ఫురించే విషయాన్ని స్మరణకు తెస్తోంది.

రాజసూయ యాగాన్ని ఏడు రోజులు నిర్వహించారు. ముఖ్యమైన పనులు ధర్మరాజు సుయోధనాదులకు అప్పగించాడు. ఆ యాగం వర్ణన ప్రత్యేకతని సంతరించుకొంది. చైత్రశుద్ధ ప్రతిపత్పుణ్యదినమున ప్రారంభమైంది. "కోకిలకూత యుద్గాతగా, వసంతుడు అధ్యక్షుడిగా, భ్రమరనాదము బ్రహ్మగా, మన్మథుడు హోతగా నారంభమైన సంవత్సర యజ్ఞమున సవితృమూర్తి గాయత్రియై, బ్రాహ్మీమయవేళ అను మంత్రముగా తన వెలుగులను ఉదయాద్రిపై ప్రసరింప జేసెను"(పుట.189) తుంబుర, విశ్వావసువులు అదృశ్యరూపంలో సామగానం వీణని మీటుతూ యజ్ఞాన్ని పూర్తి అయ్యేవరకు గానం చేసారు.

రాజసూయం పరిసమాప్తి అవుతున్నప్పుడు అర్ఘ్యపూజ ఎవరికివ్వాలో ధర్మరాజు భీష్ముణ్ణి అడుగుతాడు. కృష్ణుడిపేరునే భీష్ముడు సూచిస్తాడు. శిశుపాలుడు వ్యతిరేకిస్తాడు. తర్వాత శ్రీకృష్ణుణ్ణి దూషిస్తాడు. దాంతో కోపించిన భీముడు చంపేస్తానని అంటాడు. అతణ్ణి భీష్ముడు వారించడం ఉంది. దానికి కారణం భీష్ముడే భీముడికి వివరించినట్లు ఈ నవలలో వివరణగా చెప్పారు.

## 5. 14. *సౌందర్యతిలక* నవలలో వర్ణనలు- మార్పులు, చేర్పులు :-

ఈ నవల 'దరిద్రో నారాయణో హరిః' అనే అర్యోక్తి చెప్పినట్లు, ముసలి దరిద్రుణ్ణి వర్ణిస్తూ చిలకమర్తి ప్రారంభించారు. 'భగవంతుడగు నారాయణుడు మనుష్య రూపాన్ని ధరించి ప్రత్యక్షంగా ద్వారకానగరంలో ఉండి లోకాల్ని ఏలుతుంటే నా లాంటి ముసలివాడికి ఇన్ని కష్టాలేందుకు?' అని ముసలివాడు బాధపడుతున్నాడు. "ముందు రాఁగల యుగము యొక్క ధర్మములు మందుఁడనగు నాకె కనులకుఁ గట్టినట్లెదుట గనబడుచుండ వేదవ్యాసునంతటి మహాత్మునకుఁ గనబడకుండునా! నేఁడుదయమునుండి నే నెవ్వరి యింటికిఁ జనినను నాకుఁ నొకబళమన్న మయినను దొరకదయ్యె. ఇది యేమి యాకలియొగాని కడుపులోనున్న ప్రేవులను మాంసమును గూడ హరించుచున్నది" (పుట.1) అంటూ ముసలివాడి వర్ణనలో నారాయణుణ్ని, ఆకలిస్థితిని వ్యాసస్మరణతో భగవంత దర్శనాన్ని స్ఫురించేలా చేయడం సహజంగా ఉంది. ఎవరూ ఆ ముసలివాణ్ణి

పట్టించుకోక పోయినా ఆ భగవంతుడుకూడా పట్టించుకోలేదని ఆవేదన ఉంది. ఈ ఆవేదన జీవుడికి కలగాలనే సూచన భగవత్తత్వంగా భావించవచ్చు.

ముసలివారు, ఆ పైన ఆస్తిపాస్తులు లేని పేదరికం, సమాజం వాళ్లనిచూసే స్థితిని రచయిత సహజంగా వర్ణించాడు. వ్యాసుడు కాశిలో భిక్షాటన చేసినప్పుడు ఎవరూ భిక్ష వేయని స్థితిని(కాశీఖండంలో ఉంది) ఈ ముసలి బిచ్చగాడు భావించడం ఒక ప్రత్యేకత.

నాగవల్లి సహాయంతో కాలిమీద పుండును మాన్పించుకొని మళ్ళీ బిచ్చమెత్తుకోడానికి వెళ్లాడు. వాడికి చెవుడు. పెద్దవయస్సువల్ల కళ్ళు కొంత కనిపించవు. రాజభటులువచ్చి, 'అయ్యా, ఈ ముసలివాడు మీరందఱునుకొన్నట్లు ముదుసలికాడు. వీడు శ్రీకృష్ణుడి వేగుల వాండ్రలో నొకడు. గిరివ్రజమునందలి రహస్యములు ద్వారకకు చేరవేస్తున్నాడు. కృష్ణుడి మహిమవల్ల ముసలివాడిలా ఉన్నాడు. వీణ్ణి పట్టుకొని చెఱలో పెట్టమని రాజాజ్ఞ' అని కఠినంగా చెప్పారు. (పుట.204). ఇది జరగబోయే కథని సూచిస్తోంది. నిజంగానే శ్రీకృష్ణుడు ఒక గూఢచారిని గిరివ్రజంలోని విషయాల్ని తెలుసుకోడానికి నియమిస్తాడు. ఇది మూలంలో ఇంత వివరణగా లేదు. ముసలవాడి వర్ణన ఈ నవలలో మాత్రమే ఉంది.

రాజ్యంలో బిచ్చగాడికి, అందులో పనిచేయలేని వాడైన ముసలివాడికి రాజు ఏవిధంగా సాయం చేయకపోగా భటులతో నేరం మోపించి బంధించడం అధికార దుర్వినియోగానికి దారితీసినట్లు కనిపిస్తోంది. జరాసంధుడు చనిపోయాక ఒక భటుడు వచ్చి, 'మహారాజా! తండ్రిగారు కొన్ని నాళ్ళకిందట నిర్హేతుకంగా బిచ్చమెత్తుకొనే ముసలివాణ్ణి వాసుదేవుడి చారులలో ఒకడిగా భావించారు. చెఱశాలలో బంధించారు. అప్పటినుంచి వాడు రోగపీడితుడై ఇప్పుడు చనిపోయాడు. తమరు అనుజ్ఞ ఇస్తే అగ్ని సంస్కారం చేస్తానని' సహదేవుడితో అన్నాడు(పుట.262).

సహదేవుడు వాడి సంస్కారాలు చేయడానికి అనుమతిస్తాడు. ప్రజలంతా బాధపడ్డారు. నాగవల్లి పూలగుత్తుల్ని ఈ ముసలివాడి ఆరోగ్యంకోసమే అమ్మేస్తుంది. కానీ, ముసలివాణ్ణి రాజు, జరాసంధుడు బతికించడు. వాడి ఆరోగ్యస్థితినీ పట్టించుకోక మరణానికి కారణమయ్యాడు. ఇది మానవత్వంకాదని, మానవత్వంలేని జరాసంధుణ్ణి చెప్పడానికి ఈ కారణం ఒక ఉదాహరణగా చెప్పొచ్చు. ఇది అమూలకాంశం.

జయసేనుడి వర్ణన అతడి భావాన్ని, వ్యక్తిత్వాన్ని సూచిస్తుంది. "మిగుల పొడవగు మేనితో మేని పొడవుకుఁ దగిన అంగపుష్టిలేక గడకఱ్ఱలాగున నుండును. మేని కాంతి పసిమికెక్కియు నేమికతముననో యుండవలసిన నవకముతో నుండదయ్యే. మొగము బాల్యమున మిక్కిలి చక్కనిదని పలువురు వర్ణించిరి. కానీ యతఁడు బాల్యమును విడిచి యౌవనమునఁ బ్రవేశించినపుడు మీసకట్లు రామిచే పేడిమూతి యతని లావణ్యమున నొక కళ తగ్గించెను"(పుట. 21) మనిషిని వెంటనే తెలుసుకోదలిచినట్లు చెబుతున్నారని అనిపిస్తోంది.

అంతకుముందు జరిగిన వృత్తాంతం కేతకీదళలేఖను సూచిస్తున్నట్లు స్ఫురింస్తోంది. నిజానికి జయసేనుడి అందగాడు. ఇక్కడ పరోక్షంగా చెప్పడం ఉంది.

నాగవల్లి రణార్ణవుడి దగ్గరనుంచి వచ్చి సౌందర్యతిలకను కలుస్తుంది. తన భయపడిన విధానం చెబుతుంది. ఆ సందర్భంలో రణార్ణవుడి దగ్గరున్న సేవకుడు సర్వవక్రుణ్ణి వర్ణిస్తుంది- "అమవస చీకటి కన్నఁ గారు నలుపువాఁడు. ముందునకెదిగివచ్చిన మిట్ట పండ్లు వాఁడు మీదు మిక్కిలి మతిలేనివాడు. కొకిబికి వేసంబు మిడిగుడ్ల వాఁడు. పగలు చూసిన రాతిరి కలలోనికి వచ్చును. నీ వొక్కసారి వాని మోముగన్న నాఱు మాసములన్నము రోఁతచే ముట్టవు సుమీ!"(పుట.37) పేరుకు తగినట్లు అన్నీ వక్రంగా ఉన్నాయని చెప్పడానికే రచయిత సర్వావక్రుడని పేరు పెట్టి ఉంటాడు. పైగా అతణ్ణి చూసిన వెంటనే నాగవల్లికి భయం కలిగింది. దాంతో మూర్ఛపోయి, లేస్తుంది అని చెప్పడం నాగవల్లి పాత్రలోని సుకుమారత్వాన్ని సూచిస్తోంది. అయినప్పటికీ దాన్ని భరించి రాబోయే ఆపదల్ని నాగవల్లి అధిగమిస్తుందన్న కథాంశాన్ని రచయిత సూచించాడు. ఇది అమూలకాంశం.

భీమ, జరాసంధులు మల్లయుద్ధానికి సిద్ధపడ్డారు. ఆ యుద్ధవర్ణన-"ఇరువురు కేశ పాశములుఁగట్టిరి. ఇరువురును భ్రుకుటీ స్ఫురణంబున దుర్నిరీక్షకులైరి. ఇరుగురు భుజాస్ఫాలనంబున బ్రహ్మాండము ప్రతినాద జేయజేసిరి. ఇరుగురు సింహనాదమున సభ్యులఁగంపింపఁజేసిరి. అప్పుడు మహావీరులగుమాగధ పాండవులు పరస్పర జయాభిలాషులై యొకరినొక రొడిసిపట్టి పంకించి యట్టహాసము గావించి యౌదు కఱచి తొడచఱచి చేతులకొనలు కలిపికొని వలయాకారములుగ భ్రమించి యొండొరలు చిక్కకునికి వీలరయుచు, నెట్టకేలకు శార్దూల ద్వయంబుచందంబున గజేంద్రయుగళముభాతి మృగేంద్రద్వయమట్లు ప్రళయ సమయఘూర్ణ మానసాగరయమళమునోజ రెండుకొండల వడవున దాఁకి భీకర మల్లయుద్ధము నెఱపిరి" (పుట. 252) అని మల్లయుద్ధాన్ని కళ్ళకు కట్టినట్లు వర్ణించారు. ఈ వర్ణనలో ఎవరు నెగ్గుతారో తేలక ఉన్నవారు ఆసక్తితో చూస్తుండడం, రచయిత వర్ణనా విశేషంవల్ల పాఠకుడు తాను సభలో ఉన్నవాడిగా భావించగలుగుతాడు. మూల భారతంలో ఈ మల్లయుద్ధం ఉంది. అయితే మూలానికి దగ్గరగా ఉపమానాలు వాడారు.

సహదేవుడి తండ్రి జరాసంధుడు. జరాసంధుడి ఉత్తరక్రియలు పూర్తిచేసి చెఱలో ఉన్న బంధీలందర్నీ విడిచిపెట్టమని వాసుదేవుడి ఆజ్ఞను పాటించాడు. వారంతా విముక్తులై వాసుదేవుణ్ణి స్తుతించారు. జరాసంధుడు మాయల మారిగా స్త్రీలోలుడిగా వాసుదేవుణ్ణి నిందించాడు. దానికి ప్రతిగా వాసుదేవుణ్ణి వర్ణించడం ప్రత్యేకత.

"నారాయణా! అచ్యుతా! ముకుందా! మహీభారము డీలుపడఁజేయు తలంపున యాదవాన్వయ పయోధి చంద్రుడవై యుదయించిన వైకుంఠ నాయకుండవు. సనకసనందన సనత్కుకుమారాది నిత్యముక్తులకు నెన్నఁదరము కాని నీ మహిమ మేము కొనయాడనేర్తుమే? కరుణారసము వెల్లిగొలుపు క్రీగంటి చూపులు చల్లదన ముట్టిపడు నీ

వదన చంద్రమండలము మా తాపత్రయములఁ బాపె. బంధ మోక్షణము భవబంధమోక్షణము నీ క్షణమ మాకయ్యె. తపములు దానములు యజనములు పుణ్యకర్మములు గావించియు వేయి జన్మములకయిన నెవ్వని నెంత ధన్యులు గాంచఁజాల రట్టి భగవంతుడు నారాయణుఁడు మాకయాచితముగ దర్శనంబిచ్చె"(పుట. 256) ఇది కృష్ణుడిపట్ల రచయితకున్న భక్త్యావేశం. దీన్ని సందర్భాన్నిబట్టి ప్రవేశపెట్టి వాసుదేవుడి అనుగ్రహానికి పాత్రులుగా పాఠకుణ్ణి తయారు చేయాలని రచయిత ఉద్దేశంగా కనిపిస్తోంది.

ఈ నవలలో వర్ణనలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వలేదు. మహాభారతంలోని జరాసంధుడు, భీముడు పరస్పరం చేసిన మల్ల యుద్ధం, ధర్మరాజు రాజసూయయాగ పరిసమాప్తి మాత్రమే మూలంలోని కథ. దాన్ని కల్పించి మరింత సహజంగా ఉండేలా కళానందుడు, సౌందర్యతిలక ప్రేమని జోడించాడని చెప్పొచ్చు.

పై విధంగా ఆయా నవలలోని వర్ణనలద్వారా రచయితలు సూచించిన అంశాలు, మూలభారతానికి నవలలోని విషయాల్లో మార్పులు, చేర్పులు విశ్లేషించడం జరిగింది. ఆయా రచయితలు మహాభారత కథ ఆధారంగా ఎందుకు నవలలు రాసారు? వారి దృక్పథాలు, లక్ష్యాలను తెలుసుకోవలసిన ఉంది. వాటిని తరువాత అధ్యాయంలో వివరించడం జరిగింది.

# అధ్యాయం- 6

# 6

# 6. నవలల దృక్పథాలు - సవిమర్శక పరిశీలన

## 6. 1. ఇదా *భారతం* నవలా లక్ష్యాలు :-

భారతాన్ని ఆధునిక భావజాలంతో చూడొచ్చు అని తెలియజేయడం కోసమే ఈ రచయిత్రి భారతకథను తీసుకున్నట్లనిపిస్తోంది. 'ఏదైతే ప్రపంచంలో ఉందో అది భారతంలో ఉంది. భారతంలో లేనిది ప్రపంచంలో లేదు' అని మరోమారు నిరూపించే ప్రయత్నం ఈ నవలలో జరిగిందని చెప్పొచ్చు.

ఆధునిక స్త్రీ ఏ విధంగా కష్టాలు పడుతోందో, అజ్ఞానంగా ద్రౌపది పడిన వేదన, మానసిక సంఘర్షల ద్వారా చూపించారు. గూండాలురాజ్యాలు ఏలుతున్నప్పటికీ ప్రజల్లో విప్లవం రాదా? రావాలనే ప్రయత్నం చేయించడం తద్వారా ప్రజాస్వామ్యాన్ని సుస్థిరం చెయ్యాలని దేవలుడు పాత్రను ప్రత్యేక శ్రద్ధతో వివరించారు.

ఆడవాళ్ళ సాయం కూడా ప్రజాపాలనలో అవసరం. వారి సాయం చాలా విలువైంది అని చెప్పడానికి ఉత్తర, ద్రౌపది పాత్రలద్వారా సూచించారు. ఉత్తర రాజపుత్రుల్ని ఖైదునుంచి విడిపించడానికి మూరువేషంలో రాజముద్రికను చూపించి రథాలద్వారా పంపించేయడం ఒక ధైర్యవంతమైన పనిగా చెప్పొచ్చు. కీచకుడి బారినుంచి మాలినిని తప్పించడానికి ఆమె ప్రయత్నించిన తీరు మరో విశిష్టమైన అంశం.

సమాజంలో మూఢనమ్మకాలు ప్రబలిపోతున్నాయి. వాటిని సరైనపద్ధతిలో ఆలోచించాలి. భీముడు బకుణ్ణి చంపినపుడు అతణ్ణి మంత్రసిద్ధుడని కొంతమంది అన్నారు. నిజానికి ప్రజల మనసులో ఉన్న భయమే బకుడి బలమని చాటి చెప్పాలనుకున్నాడు భీముడు. అందుకే బకుడి కృతదేహాన్ని ఊరి పొలిమేర వరకూ ఈడ్చుకొచ్చాడు అని భీముడే అన్నాడు. "ఈ ప్రజల మూఢవిశ్వాసాలు పోగొట్టడం ఎవరితరం? అసలు ఏ యుగంలో నయినా, ఎవరైనా, ఇలాంటివి పోగోట్టటానికి ప్రయత్నించారా? లేక తమ స్వార్థంకోసం మరింత పెంచి పోషిస్తూనే ఉంటారా?" (పుట.24) అని మూఢవిశ్వాసాలను ఎండగట్టి, ప్రశ్నలే సమాధానంగా ముగించారు. ఏ యుగంలో నయినా రూపుమాపడం ప్రజల తరమే అని ఈ ప్రశ్నలద్వారా ఆలోచనలు పుట్టించారు.

లోకంలో పుత్రుల్ని వెనకేసుకొస్తూ, యుక్తాయుక్తజ్ఞానంతో ఆలోచించకుండా ఉండే వారికి నిదర్శనంగా ధృతరాష్ట్రుడి ప్రస్తావనలో కనిపిస్తోంది. లక్క ఇల్లును ఏర్పరిచి సజీవంగా పాండవుల్ని దహనం చేయించే ప్రయత్నం ధృతరాష్ట్రుడే చేయిస్తాడు. కానీ, ఏ విధమైన ఆధారాలు లేవు. పైగా 'ధృతరాష్ట్రుడే చేయించాడే అని ఆరోపణ చేస్తే ప్రజల సానుభూతి, గుడ్డిరాజు వైపే తిరిగే ప్రమాదముంది' (పుట. 39) అని కృష్ణుడి మాటలు ఈనాటి రాజకీయ నాయకుల పథకరచనను వివరించేలా సూచించారు.

భారతదేశమంతటా గణతంత్ర పద్ధతిలో ప్రజారాజ్యాన్ని స్థాపించడం, నిరంకుశులను, గూండాలను ముఠాదారులను నిర్మూలించడం ఈ నవలలో ఒక లక్ష్యంగా కనిపిస్తోంది. అందుకే పథకం పన్ని, కీచకుణ్ణి సంహరించడం జరిగింది. కీచకుడి దురాగతాలను మితిమీరినా అవకాశం కోసం ఎదురు చూడడం ఈ నవలలో మరో ప్రత్యేకత.

సమాజంలో స్త్రీల ప్రధాన పాత్రపోషించాలని బలవంతులైన వారికి బుద్ధిబలాన్ని వ్వాలని ద్రౌపది పాత్రద్వారా రచయిత్రి సూచించారు. గుడ్డిరాజు వరాలు కోరుకోమంటే రెండే వరాలు కోరుకుంది ద్రౌపది. ఒకటి సోదరులకు దాస్యవిముక్తి, రెండు వారి ఆయుధాలు వారికిచ్చేయడం. అయినప్పటికీ స్త్రీవల్ల రాజ్యం వచ్చిందని భావిస్తే మగాడి అహం దెబ్బతింటుందేమో. "నేను కోరింది, ఆయుధాలతో సహా మీకు దాస్యవిముక్తి కావాలని మాత్రమే! ఒకసారి ఆయుధాలు మీచేతికి వస్తే మీరు మీ రాజ్యాం సంపాదించుకోగలరని గుడ్డిరాజుకి తెలుసు. అంచేత మీ రాజ్యం మీకు వరంగా ఇచ్చేసాడు"(పుట.43) అని ద్రౌపది అంటుంది. ఇలా పురుషుడిలో ఉత్సాహాన్ని నింపించేశక్తిగా, ఆత్మవిశ్వాన్ని కలిగించే స్త్రీశక్తిగా ద్రౌపది కనిపిస్తోంది.

అత్యవసర స్థితిలో ఎంతటి బలవంతుడైనా ఎదుర్కోడానికి స్త్రీకి మానసిక ధైర్యంతో పాటు, శారీరక బలం కూడా ఉండాలి. కీచకుడు ద్రౌపదిని పట్టుకున్నప్పుడు ఆమె కీచకుణ్ణి ఒక్కతన్ను తన్నడంద్వారా నిరూపించారు. అలాగే పిల్లల పెంపకంలో సుధేష్ణ ఎలా భీరువుగా ఉత్తర కుమారుణ్ణి తయారు చేయించింది. అతడికి తగిన ప్రోత్సాహం లేదు. ద్రౌపదే అతణ్ణి ప్రోత్సహిస్తూ బాణాలు వేయడం నేర్పించింది. పిల్లల్ని భయపెట్టకూడదని, ప్రోత్సాహంతోనే వారిమానసిక స్థితిని బలోపేతం చేయాలని సూచించారు.

హిప్నాటిజంద్వారా ఎంతటి బలవంతుల్ని అయినా మభ్యపెట్టి, ఆత్మ రక్షణ చేసుకోవచ్చని ఉత్తర, ద్రౌపది, కృష్ణుడి పాత్రల ద్వారా నిరూపించారు. కృష్ణుడు కంసుడి విషయంలో జరిగిన అంశాలు ఈ అంశాన్ని బలపరుస్తున్నాయి. 'శ్రీకృష్ణుడు ఎప్పుడూ కంసుణ్ణి చంపేది నేను కాదు అనేవాడని, నేను పుట్టకముందునుంచీ, కృష్ణుడు నిన్ను చంపుతాడు అనే భయం మాత్రమే కంసుణ్ణి చంపిందని' నారదుడు లాంటి వాళ్లు, గోకులం దీనికి బలాన్ని చేకూర్చిందని ద్రౌపది ఉత్తరకు చెబుతుంది. (పుట. 94) అక్కడి ప్రజలు సామాన్యులతో ఉండడంతో మాటమాటికి కృష్ణుడు తనను చంపుతాడని భావించిన కంసుడు సునాయాసంగా కృష్ణుడు చంపగలిగాడని రచయిత్రి వివరించింది.

ఈ విధంగా చెప్పి ఉత్తరని మానసికంగా ఉత్తేజపరిచింది. ఆమె కీచకుడి దగ్గరికి వెళ్ళి విచిత్రమైన స్త్రీ వచ్చినట్లు గోడమీద పడిన తీగనీడని చూపించి భయపడినట్లు నటించి కీచకుడి ద్రౌపది ధైర్యాన్ని దెబ్బతీయించింది. ద్రౌపది మల్లయుద్ధపుపట్లు కొన్ని భీముడి దగ్గర నేర్చుకుంది. అందుకే కీచకుణ్ణు తన చేత్తో వెనక్కు నెట్టగలిగింది. దబ్బున కిందకూలబడ్డాడు కీచకుడు. అందుకే ఉత్తర చూపిన గోడమీద ఆకారం, మాలిని ధైర్యం కీచకుణ్ణి మానసికంగా బలహీనపరిచాయని తద్వారా భేతాళుడుకూడా వెళ్ళిపోయాడని కథాసంధానంతో వివరించారు. స్త్రీలకు కేవలం బుద్ధి బలమే కాకుండా భుజబలం, సమస్యని

ఎదుర్కొనే శక్తి అవసరమని ఈ సందర్భంలో సూచించారు.

సమాజంలో మూఢనమ్మకంగా ప్రబలిపోతున్న దెయ్యాలను భేతాళుడి పాత్రద్వారా వివరించారు. అది అభూత కల్పన అని తేల్చారు. భేతాళుడికోసం ధైర్యవంతుడైన కీచకుడు మూడుసార్లు భేతాళహోమం పేరుతో చాలా రక్తపాతంతో హోమం చేస్తాడు. చివరకు భేతాళుడు వచ్చి "నేను శక్తినికాను, భావాన్ని. నేను స్వతంత్రంగా ఏ పనీ చేయ్యలేను. నిన్నాశ్రయించి నువ్వు కోరినది సాధిస్తాను" (పుట.12) అని స్పష్టంగా వివరించారు.

స్త్రీకి స్వతంత్ర వ్యక్తిత్వం ఉండాలని ద్రౌపది పాత్రద్వారా చూపిస్తోంది. ద్రౌపదిని అర్జునుడు మత్స్యయంత్రం కొట్టిన తర్వాత ఇంటికి తీసుకువచ్చాక, కుంతిమనసులోని మాటలను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమౌతోంది. "భువనత్రయ రాజ్యలక్ష్మిలాగ ఉంది. స్త్రీ జాతిలో ఏ వికాసం రావాలని అమ్మతనం నుంచి, కోరుకుంటూందో, ఆ వికాసం ద్రౌపదిలో సహజంగా ఉంది. ఆ తేజస్సు ఆమె విజ్ఞతనూ, వ్యక్తిత్వాన్నీ ఆవరించుకుని ఉంది. ముల్లోకాధి పతులనూ కడగంటి చూపులతో విదిలించగల ఠీవి ఉంది. ఆమెని చూసీ చూడగానే ఎలాంటి మొగాడికయినా ఇలాంటి స్త్రీని పొందటం కంటే అదృష్టం ఉంటుందా? అనిపిస్తుంది.

అదే సమయంలో ఈ స్త్రీ ఎంతటి మొగవాడికయినా స్వాధీనురాలు అవుతుందా అనిపిస్తుంది. స్వతంత్ర వ్యక్తిత్వంతో సమ్మేళనం చెందిన అసాధారణ సౌందర్యంలోని ఆకర్షణ ఉంది" (పుట. 32) అని వివరించారు. అందుకే కీచకుడు బృహన్నల సంభాషణలో 'స్వతంత్ర వ్యక్తిత్వంతో వెలిగిపోతూ సోదరులను కార్యోన్ముఖులను చెయ్యగలిగే స్త్రీశక్తిని నేనింత వరకు చూడలేదు'(పుట. 65) అని ద్రౌపదిని ఉద్దేశించి కీచకుడితో అర్జునుడు అంటాడు.

ప్రేమకి, కామానికి స్పష్టమైన వివరణనివ్వడం మరో లక్ష్యం. దేవలుడు ఉత్తర మధ్య ఉన్న సంభాషణలు అర్థం చేసుకుంటే ప్రేమతత్త్వం తెలుస్తోంది. కీచకుడు మాలిని విషయంలో కామ ప్రలోభావాన్ని, స్త్రీవాంఛలను తెలుపుతోంది. రెండూ ఒకటి కావని ప్రేమ దేన్నయినా వదులు కోడానికి సిద్ధపడుతుంది. కామంతో ఉన్న వారు యుక్తాయుక్తాల్ని మరిచిపోయి నీచానికి సిద్ధపడతారని, మూర్ఖంగా ప్రవర్తిస్తారని కీచకుడు ద్రౌపదిని బలాత్కరించబోయిన సందర్భంలో రచయిత్రి వివరించారు.

## 6. 2. *ఇంద్రసింహాసనం* నవలా లక్ష్యాలు :-

ఈ నవల పౌరాణిక పాత్రలలాగ వర్ణనాదులు ఉన్నా, ఆధునిక జీవనం ప్రతిబింబిస్తోంది. రాజరికపుదాహం, పదవికాంక్ష, స్త్రీలోలత్వం, ప్రేమకుస్థానంలేకపోడం, మేధావివర్గం అన్యాయంవైపు కొమ్ముకాయడం అవసవరవిషయాలమీద అధికార్లు ధనాన్ని వినియోగించడం, నిరుపేదల్ని ఎవరూ పట్టించుకోకపోడం, స్త్రీ లను అథములుగా చూడడం లాంటి విషయాల దృష్టి నిలిపారు.

నహుషుడు ఇంద్రాణిని కోరుకోడం, ఇంద్రాణి దేవయని సంభాషణలో దేవయానే స్త్రీలను చులకనగా మాట్లాడడం ఉంది. హేమ అనే దేవకాంత మయుణ్ణి పెళ్ళిచేసుకుంటుంది. పిల్లల్ని కన్నాక, అందర్నీ వదిలి దేవలోకానికి రమ్మని నహుషుడు ఆజ్ఞాపిస్తాడు. అతడి కుమారుడు శిక్షించాల్సిన సమయంలో యముణ్ణి సైతం మార్చేస్తాడు. ఇటువంటి విషయాలు నేటి రాజకీయ నాయకుల్ని సూచిస్తున్నట్లు అనిపిస్తోంది.

ఇందులో ప్రధానంగా స్త్రీవిముక్తి, అధికారుల దౌర్జన్యాలు, పీడిత ప్రజలకు మనోధైర్యం, ఆలోచనలు కలిగించడం, చాకచక్యంగా పనుల్ని నిర్వర్తించడం, పెత్తందార్ల ఆట కట్టించడం ఇందులో కనిపిస్తాయి.

### 6. 2. 1. స్త్రీ విముక్తి :-

మేనక అప్సరస. ఆమెను జయంతుడు ప్రేమిస్తాడు. కానీ, ఇంద్రపదవిలోఉన్న నహుషుడు వాళ్ళ ప్రేమను అంగీకరించడు. పైగా శుక్రాచార్యుల దగ్గరకు వెళ్ళమని శాసిస్తాడు. తిరిగి వచ్చిన ఘంటాకర్ణుడికి అమ్మేస్తానని అప్సరసగా ఉండడానికి తగవని కోపోద్రక్తుడవుతాడు. ఇంద్రాణి పాత్ర మేనకను నైచ్యవృత్తి నుంచి తప్పిస్తుంది. ఇలాంటి ఎందరో స్త్రీలు ఆధునిక సమాజంలో ఉన్నారని వాళ్ళని విముక్తులుగా చెయ్యాలని రచయిత్రి సూచించారు. స్త్రీలే ముందుకువచ్చి స్త్రీలను ఆదుకోవాలని, బంధీలుగా ఉన్నవాళ్లని విముక్తుల్ని చేయాలనే రచయిత్రి ఆకాంక్షగా ఇక్కడ కనిపిస్తోంది.

### 6. 2. 2. అధికారుల దౌర్జన్యాల్ని అరికట్టడం :-

భూలోకంలో నైరుతి భాగంలో రక్షక భటులే ప్రజల్ని దోచుకునేలా అధికారులే చేయిస్తున్నారు. దానికి అండదండలు రాజులు, గూండాలూనూ. ఉదాహరణగా నిర్ృతిని చెప్పొచ్చు. అలాగే కుబేరుడు ధనవంతుడు. అందరికీ అప్పులు ఇచ్చి వాళ్ళు అధికారంలో ఉన్నప్పుడు వాడుకుంటారు. వాళ్ళు అప్పు తీర్చలేని సమయంలో ఘంటాకర్ణుడనే పిశాచిని పంపించి వసూలు చేయిస్తారు. సత్యేంద్రుడు నిజం మాట్లాడినందుకు నరకంలో శిక్షకు గురిచేస్తాడు. జయంతుడు మేనకను ప్రేమించి పెళ్ళి చేసుకోడానికి అధికార్లు అధికారంతో అడ్డగిస్తారు.

ఇలాంటి సంఘటనలేన్నో ప్రజల్లో అశాంతి, భయానికి దోహదం చేసే అంశాలుగా తయారౌతాయి. అధికార్లుల దౌర్జన్యాల్ని ఎప్పటికప్పుడు ప్రభువులు తెలుసుకొని పటిష్టమైన గూఢచారి వ్యవస్థను కలిగి ఉండాలి. తద్వారా మంచి పాలన అందించాలని రచయిత్రి భావన. యయాతి నైరుతి దిశలో అధికార్లు దౌర్జన్యాలు చేస్తున్నారని తెలుసుకొని అరికట్టే ప్రయత్నం చేస్తాడు. దీని ద్వారా పరిపాలన ప్రజారంజకంగా ఉండాలని సూచిస్తోంది.

### 6. 2. 3. పీడిత ప్రజలకు మనోధైర్యాన్ని కలిగించడం :-

వరదలతో కొంత ఆస్తితిని కోల్పొగా, మిగిలినవాళ్ళు ఆస్తిని వడ్డీరూపంలో జమ చేస్తారు. దానికి కుబేరదూతలు ఉదాహరణగా రచయిత్రి సూచిస్తోంది. ఒక నిరుపేద కుటుంబం వడ్డీలు కట్టలేక వీధిన పడిపోతుంది. అలాంటి సమయంలో ఇంద్రాణి వెళ్ళి

వాళ్ళను ఆదుకుంటుంది. వాళ్ళకి ధైర్యాన్ని చెప్పి, ఓదారుస్తుంది. ఇలా పీడించడానికి కారణం భూలోక కుబేర్లు ఉండడం వాళ్ళని అండదండగా నహుషుడున్నాడని వివరిస్తుంది. కాబట్టి ప్రజలకు ఏం కావాలో పరిపాలకులు అది అందించలేక పోతున్నారని తెలుపుతునే అందరూ బుద్ధి కుశలత్వంతో ఆలోచించి శాంతి యుతంగా పోరాడాలని సూచించారు. ఈ ఇంద్రాణి పాత్ర పీడిత పక్షానికి, పేదల్ని ఆదుకొనే పాత్రగా కనబడుతోంది.

### 6. 2. 4. చాక చక్యంగా పనులు నిర్వర్తించడం :-

నారదుడి పాత్ర, ఇంద్రాణి పాత్ర ఇందుకు చక్కని ఉదాహరణగా కనిపిస్తాయి. నారదుడు నహుషుణ్ణి ఇంద్రసింహాసనం నుంచీ దింపడానికి తగిన విధంగా ఆలోచనలు చేస్తాడు. ఇంద్రాణి- అగ్ని, వరుణ, వాయువులను ప్రత్యేకంగా ఒకరినొకరికి పిలిపించి శ్రద్ధ చూపేటప్పటికి, వారంతా ఇంద్రాణికి సాయం చేయాలనుకుంటూనే, ఎవరికి వారే ఇంద్ర పదవికోసం ప్రాకులాడడం కనబడుతోంది. చివరకు మొదటి ఇంద్రుణ్ణే పదవిలోకి తీసుకురావడానికి ఇంద్రాణి చాలా చక్కగా కార్యనిర్వహణ చేస్తుంది. స్త్రీలు రాజకీయంలోకి రావాలని, కార్యదక్షత కలిగి ఉండాలని రచయిత్రి ఆకాంక్షను ఈ పాత్రద్వారా సూచించారు.

### 6. 2. 5. పెత్తందార్ల ఆట కట్టించడం :-

కుబేరుడు అధికారంలో ఉన్నవారందరికీ ఆర్థిక సహాయం అందించినట్లే అందించి అధికారాన్ని చెలాయించడం, పేదప్రజల్ని దోచుకుతినడం చేస్తుంటాడు. నిర్మతి తన సేనల్ని పంపించి ప్రజలను దోచుకునే దొంగలకు మద్దతు ఇచ్చేవాడు. నారదుడు ఈ అరాచకాలను యయాతికి సూచిస్తాడు. అక్కడ ఏ రకమైన అరాచకాలు కనిపించవు. నారదుడిమాట వ్యర్థం కాదని గూఢచార్లని పంపించి వాస్తవాన్ని తెలుసుకుంటాడు. మారువేషంలో సుశిక్షితులైన సైనికుల్ని మారువేషాలు వేయించి దొంగల్ని పట్టుకొని రక్షక భటులకు అప్పగిస్తాడు. వాళ్ళు కొద్దిసేపటికే దొంగలను వదిలేయగా ఆ రక్షక భటుల్ని నిలదీస్తాడు. యయాతిదగ్గర వాళ్లు నిర్మతే కారకుడని నిజం చెప్పేస్తారు. వెంటనే నిర్మతికి ఇలాంటివి మళ్ళీ జరగకూడదని హెచ్చరిస్తాడు. ఇలా పెత్తందార్ల ఆట కట్టించాలనే లక్ష్యాన్ని యయాతిద్వారా రచయిత్రి సాధించింది.

## 6. 3. చతురస్రం నవలా లక్ష్యాలు

సురాపానం చేసినవాళ్ళు ఎంతటి గౌరవస్థానంలోఉన్నా పతితులౌతారని నిరూపించడానికి ఈ నవలని రాసారు. శారీరక అందం గర్వానికి ప్రతీక కాదని అది మరింతగా ఆనందాన్ని ఇచ్చేది, పొందేదిగా ఉందా? లేదా ప్రశ్నించుకోవాలని ఈ నవల సూచిస్తోంది.

చతురస్రం లో భారతంలో చెప్పిన ధర్మార్థ కామ మోక్షాలను ఎలా ఉంచుకోవాలో మనిషి బాధ్యతను గుర్తు చేసుకోడానికి ఈ నవలను రాసారు. మనిషిని సంస్కరించేలా చిన్నప్పుడే వారి తల్లిదండ్రులు, అందులో తల్లి ప్రధాన శ్రద్ధ తీసుకోవాలనే లక్ష్యం ఈ నవలలో రచయిత్రి సూచించారు.

ప్రేమ తత్త్వానికి అందరూ ముగ్ధులౌతారు. తద్వారా విశ్వమానవ సౌభ్రాతృత్త్వాన్ని ఆకాంక్షించవచ్చు అని ఈ నవలలో అంతర్లయగా రచయిత్రి పేర్కొన్నారు.

## 6. 4. ద్రౌపది (కోడూరు వారి)నవలా లక్ష్యాలు

మచ్చలేని పాత్రగా ద్రౌపదిని భావించి చిత్రణ చేయడం ఈ రచయిత ప్రధాన లక్ష్యం. ద్రౌపది సౌందర్య, సౌశీల్యాది గుణాలకు నిలయంగా రచయిత భావించాడు. వేదవ్యాసుడు చిత్రించిన అపూర్వ పాత్రను తిక్కన మెరుగులు కూర్చాడు. జానపదులకు, నాగరికులకు నచ్చిన పాత్రే ద్రౌపది అని భావించిన రచయిత ఆ పాత్రను సామాన్య పాఠకులకు పరిచయం చేయాలనే సదుద్దేశంతో ఈ నవలికను రాసాడు.

శ్లో. "అహల్యా ద్రౌపదీ తారా సీతా మండోదరీ తథా,
పంచకన్యా: స్మరేన్నిత్యం మహాపాతక నాశనమ్" అనే శ్లోకాన్ని దృష్టిలో ఉంచుకొని కోడూరువారు ద్రౌపదిని చెప్పదలచుకున్నారు. పంచకన్యలలో ఒకటిగా ఎందుకు కీర్తి పొందింది. ద్రౌపదికి ఉన్న ప్రాధాన్యాన్ని వివరించదలచుకున్నారు. ఈ నవలిక ద్వారా ద్రౌపదిని స్మరించినట్లయితే మహాపాతక నాశనం జరుగుతుందని రచయిత భావన.

మరో ముఖ్యం అంశం - ద్రౌపది ఆరో భర్తగా కర్ణుణ్ణి భావించింది అని చాలా మంది అనుకోవడాన్ని దృష్టిలో ఉంచుకొని దానికి తగిన విధంగా, సందేహాలను తీర్చగలగేలా సమాధానాన్ని అందివ్వాలనే సత్సంకల్పంతో ఈ నవలికను రాసారు.

సత్కథా శ్రవణం, పఠనాదులవల్ల కలి నాశం జరుగుతుందని భావించడం కూడా ఈ నవలలో కనబడుతోంది. ఈ నవలికలో వ్యాస, భీష్మ, విదురాది ఉత్తమ పురుషుల కథనం అక్కడక్కడ ఉంది. తద్వారా రచయిత పాఠకులకు కలిపురుషుడి బారినుంచి తప్పించ దలచుకున్నాడు.

## 6. 5. ద్రౌపది నవల (రామలక్ష్మి) లక్ష్యాలు

ఎప్పుడో జరిగిపోయిన కథను తెలుసుకోవలసిన అవసరం మనం అంతకుముందు విన్న వినికిడిని బలపరుకోడానికి మాత్రమే అని ఈ రచయిత్రి భావన. ఈ ఉద్దేశంతోనే ద్రౌపది పాత్రను తీసుకొని ఈ నవలను రాసారు.

తమిళ సాహిత్యంలో ఉన్న 'ఇలక్కణ', 'విల్లుపాట్టు'లో ఉన్న కథను విని ద్రౌపది పరిణయం, వస్త్రాపహరణ, కురుక్షేత్రంలోని కొన్ని విషయాలను తెలుగు పాఠకులకు అందించాలని ఈ నవలను రాసారు.

ద్రౌపదిలేని భారతం అసలు సాధ్యమా? అని నిరూపించేందుకు ఈ నవలను రాసినట్లు చెప్పొచ్చు. ఒక పరిపూర్ణ వ్యక్తిత్వం ద్రౌపదికి కలదని రచయిత్రి నమ్మకం.

ఎప్పటిదో అయిన పాత్రగా ద్రౌపదిని భావించదలచుకోలేదు. అడుగంటిపోయిన మాతృ, పితృ, బహుభార్యా బహుభర్తా సమాజ రూపాలకు పూర్వకథగా రచయిత్రి భావించలేదు. వాటిల్లో ఉండే అంశాలను శాస్త్రీయదృష్టితో అధ్యయనం చేయవలసిన ఆవశ్యకతను చెప్పడం ఈ నవల లక్ష్యం.

## 6. 6. ద్రౌపది నవల యార్లగడ్డవారి లక్ష్యాలు దృక్పథాలు -సవిమర్శ

యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ ద్రౌపది పాత్ర అసిధారావ్రతంగా ఉన్నప్పటికీ సరళరీతిలో పాఠకుణ్ణి ఆకర్షించి, ఆలోచించేలా రచన చేసారు. ద్రౌపది ఒక పాత్రగా, లేదా ఒక దేవతగానో అతీంద్రియ శక్తులున్నట్లో భావించలేదు. ఆదర్శంగా, ఆత్మీయంగా ఉండే పాత్రగా మలచారు. ద్రౌపదిపాత్రకు ఆధునిక స్త్రీవాద ధోరణిని కొంతవరకు అన్వయించి, ఆదర్శంగా తీర్చిదిద్దే ప్రయత్నం చేసారు. స్త్రీ చైతన్యాన్ని, చరిత్రలో స్త్రీల గురించి అధ్యయనం చేయవలసిన ఆవశ్యకతను తెలపడం కనిపిస్తోంది.

ఇంకాముందుకు వెళ్ళి చెప్పాలనుకుంటే స్త్రీలే చరిత్రను నిర్ధారిస్తారని నిరూపించే ప్రయత్నించారని చెప్పొచ్చు. మహాభారత చరిత్రలో ప్రధాన లేఖకురాలుగా ద్రౌపదిని చేసి, ద్రౌపదికి తెలియకుండానే ప్రధాన భూమిక ఎలా పోషించిందో తెలిపారు. "అంబ, అంబిక, అంబాలికలను భీష్ముడు స్వయంవరం నుంచి ఎత్తుకుపోవడం భారతానికి నాంది జరిగింది. కంసుడు భార్యలకోసం జరాసంధుడు కృష్ణుడిపై దండెత్తాడు. రుక్మిణీకోసం శ్రీకృష్ణుని శిశుపాలుడు ద్వేషించాడు. ఈ వైరం జరాసంధ, శిశుపాలవధతో కానీ పూర్తికాలేదు. రాజసూయయాగంలో చిందిన రక్తం శిశుపాలుడి నెత్తురు నేలలో ఇంకకముందే భారతాన్ని నెత్తుటి ప్రవాహంలో నింపే దారుణమైన ఘటన ఒకటి జరిగింది"(పుట.176) అంటూ అపురూప సౌందర్యవతి అయిన ద్రౌపది స్వయంవరంనుంచీ యుద్ధంవరకు ప్రతి ఒక్కరి హృదయాల్లో అగ్నిజ్వాలల్ని రేపింది. భూమికోసం, స్త్రీలకోసమే యుద్ధాలు జరిగాయి. ఈ రెండూ మహాభారతానికి అన్వయించారు. ఈ అంశాన్ని వివరిస్తూ, 'ఎస్. జైపాల్ రెడ్డి ఈజిప్టుకు చెందిన క్లియోపాత్రతో ద్రౌపదిని పోల్చారు' (పుట.12) ప్రతి పురుషుడి విజయం వెనుకా ఒక స్త్రీ ఉంటుందడం సైద్ధాంతికంగా అంగీకరించిన విషయమే. ఇక్కడ అయిష్టం గానే ద్రౌపది యుద్ధంలో భాగస్వామిఅవడం ప్రత్యేకమైన అంశం అయింది. ఈ నవలలో ద్రౌపది ఆధిపత్యాన్ని పరోక్షంగాను, ప్రత్యక్షంగాను వహించినట్లు రచయిత సూచించాడు.

కర్ణుణ్ని ద్రౌపది ఆరవ భర్తగా స్వీకరిస్తుంది అన్నది కృష్ణ పరమాత్మ కేవలం ఒక రాజకీయ ప్రయోజనంకోసం చేసిన ప్రతిపాదన. కృష్ణుడు ద్రౌపది అనుమతి తీసుకోలేదు. అందుకే ఈ నవలలో ద్రౌపది కృష్ణుణ్ని నిగ్గదీసింది. కర్ణుడు తిరస్కరిస్తాడని తెలిసే చేశాననీ యుద్ధ నివారణ యత్నమనీ అతడిని మానసికంగా క్రుంగదీశాననీ (తేజోవధ) కృష్ణుడు వివరణ ఇచ్చుకున్నాడు. (పుటలు- 55,56). ఇది ద్రౌపదిని ఉదాత్తీకరించిన సన్నివేశకల్పన గా బేతవోలు విశ్లేషించారు.

స్త్రీలకు లైంగిక స్వేచ్ఛ నివ్వాలనడం రచయిత దృక్పథంగా కనిపిస్తోంది. 'మాహిష్మతీ పురంపై దండెత్తినప్పుడు అక్కడ స్త్రీలు విధి నిషేధాలు పట్టించుకోకుండా

యథేచ్ఛగా కామోపభోగాలు ఆస్వాదిస్తున్నారు. మదవతులంతా తమకు నచ్చినవాళ్ళను తీసుకెళ్ళి భర్తముందే యథేచ్ఛగా శృంగారక్రీడలను అనుభవిస్తున్నారు' అని సహదేవుడు ద్రౌపదితో చెప్తాడు. (పుట.174) దానికి ద్రౌపది విరగబడి నవ్వి, స్త్రీలకు కూడా వాంఛలుంటాయని, సుందరులైన స్త్రీలను చూసినప్పుడు పురుషుడి మనసు ఎలా చలిస్తుందో అలాగే మన్మథులైన పురుషుల్ని చూసినప్పుడు స్త్రీలమనస్సుకూడా చలిస్తుందని తెలియజేస్తుంది. స్త్రీ పురుషుల స్వేచ్ఛనుకూడా కొన్ని సామాజిక ప్రమాణాలు, పరిస్థితులు నిర్దేశిస్తాయని రచయిత ద్రౌపది పాత్రద్వారా తన దృక్పథాన్ని తెలిపినట్లు అనిపిస్తోంది. ఇది రచయిత స్త్రీ లైంగిక స్వేచ్ఛను పరిమితులమేరకు నిర్దేశించడాన్ని తెలుపుతోంది.

స్త్రీలపట్ల ఆరాధనా తత్త్వం రచయిత ఈ నవలద్వారా వ్యక్తం చేసాడు. అందం ప్రకృతి ఇచ్చిన వరం. సౌందర్యాన్ని ఆరాధించడం, ఆస్వాదించడం అందరికీ సాధ్యం కాదు అంటూ ద్రౌపదిని అవమానించడం తప్పే అని చాలామంది కురుసభలో అనుకున్నారు. కానీ, ద్రౌపది సౌందర్యాన్ని చూడాలని పుట్టిగుడ్డివాడైన ధృతరాష్ట్రుడు ఆమె సౌందర్యం చూడలేక పోయినందుకు తన అంధత్వాన్ని తిట్టుకున్నాడు. వేదవ్యాసుడు తన తల్లి దగ్గరకు వచ్చినప్పుడు ఎందుకు కళ్ళు మూసుకున్నావని ధృతరాష్ట్రుడు బాధపడతాడు. ఆ తర్వాత తన ఆలోచనకు తాను నిందించు కున్నాడు. స్త్రీపట్ల ఎంత ఆరాధనా ఉన్న ఆచరించలేక అబలగా తయారుచేస్తున్నారని, వారి మనసుకు విలువనివ్వడం పురుషుడికి ఇంకా చేతకావడం లేదని రచయిత పరోక్షంగా సూచిస్తున్నారు (పుట.189).

దాంపత్యసుఖం ఎలాంటిదో, భర్తపట్ల భార్య ఎలా ఉండాలో వివరించి కుటుంబ వ్యవస్థను సరిచేసే ప్రయత్నం మరో దృక్పథంగా కనిపిస్తోంది. సత్యాకృష్ణులు పాండవుల్ని చూడడానికి వచ్చారు. ఐదుగురు భర్తలు ద్రౌపదిమీద చాలా ప్రేమ, అనురాగాలు కలిగి ఉండడం సత్యభామ గమనించింది. తన భర్త కూడా తనమీద అలా ఉండడానికి ఏం (మంత్రం వెయ్యాలో) చేయాలని ద్రౌపది సత్యభామ అడుగుతుంది. దానికి మూలంలో కొంత సమాచారం ఉంది. దాన్ని సవివరంగా ఆచరణ యోగ్యం రచయిత వివరించాడు-

భార్యాభర్తల సంబంధం విశ్వాసాలతో కూడుకున్నది. ఆ విశ్వాసాన్ని ఎప్పుడూ అతిక్రమించ కూడదు. మగవారిని ఎప్పుడూ లేనిపోని కోరికలు కోరకూడదు. మగవారితోపాటు ఆడవారు సుఖాన్ని ఇచ్చి పుచ్చుకోవాలి. గౌరవభావంతో ఉండాలి. ఇది ఒక రహస్యం.

తనభార్యనే తప్ప, పరపురుషుణ్ణి కలలో కూడ స్మరించదనే అభిప్రాయం పురుషులకు ఉంటుంది. అందుకు తగ్గట్టుగానే ఉంటే భార్యకు పోయేదేముంది? ఇందులో ఆత్మ వంచన అని అనుకోకూడదు. ఒకవేళ ఆత్మ వంచన అనుకుంటే నిత్యజీవితంలో నిరంతర సుఖంకోసం ఎవరైనా ఆత్మవంచన చేసుకుంటే తప్పుకాదు. ఇది రెండో రహస్యం.

ఎప్పుడూ చిర్రు బుర్రులాడకుండా ఆదాయ వ్యయాలను అదుపులో పెట్టుకుంటూ సౌందర్యానికి తగ్గ అలంకారంగా మృదువుగా, మాటలతో గాయపరచకుండా ఉండాలి. ఇది మూడో రహస్యం.

చివరగా భర్త కవి అయితే భార్య ఆ కవిత్వానికి ప్రేరణ కావాలి. భర్త సంగీత ప్రియుడయితే భార్య అతడికి ఇష్టమైన రాగం కావాలి అంటూ విడదీయలేని బంధంగా ఉండాలని కోరడం రచయితకు కుటుంబవ్యవస్థమీద ఉండే అభిప్రాయం తెలుస్తోంది. అన్నిటికి మూలంగా భార్యా భర్తల సంబంధాలే మూలస్తంభాలు అని చెప్పడం మరో దృక్పథంగా చెప్పొచ్చు.

సేవకవృత్తిపట్ల గౌరవం పెంచుకోవడం మరో అంశం. వాళ్ళకీ మనసు ఉంటుందని, గ్రహించేలా చేయడం ఈ నవలలో కనిపిస్తోంది. వంటవాడుగా భీముడు భోజనం చేస్తున్న దృశ్యాన్ని చూసి తోటివాళ్ళే పరిహసించేవారు. పాపం రాచకుటుంబీకుల భోజనం ఎప్పుడూ ఈ వలలుడు తినలేదేమో అని అనుకునేవాళ్ళు. అంత:పురంనుంచి బయటకు ద్రౌపది వచ్చినప్పుడు ఆమెను చూసి సేవకులు అసభ్యంగా మాట్లాడడం, తమతో రమ్మని సంకేతాలు పంపడం జరిగేది. సమానస్థాయిలో ఉన్నవారే తమతోటివాళ్ళను హేళనగా చూస్తే పైస్థాయిలో ఉన్నవాళ్ళు ఎలా ఉంటారని రచయిత సూచించాడు. అందుకే సేవకవృత్తిని ఛీదరించుకోకూడదని, గౌరవభావాన్ని కలిగి ఉండాలని సూచించారు. ఇందులో ఉద్యోగినులస్థితి ధ్వనించేలాచేయడం కనిపిస్తోంది.

అతీంద్రియ శక్తులమీద నమ్మకం లేకపోడం ఇంకో అంశం. భారతంలో కృష్ణుడు విశ్వరూపాన్ని చూపినట్లు వర్ణన ఉంది. కానీ, రచయిత దానిలోని వాస్తవికతను గుర్తించి దాన్ని విశ్వరూపం అనకుండా అనుభూతిగా చిత్రించాడు. కృష్ణుడిపేరు తలచుకుంటే, 'ద్రౌపది మనసంతా ఆరాధనా భావంతో నిండిపోతుంది. ద్రౌపదికి శరీరంలోని అణు వణువులోను కృష్ణుడు ప్రవేశించినట్లయింది. నేనే నీలో విలీనమయినట్లు అనిపించింది. అసలు నేను లేను... నేనే నీవై నిన్ను స్మరిస్తున్నట్లుంది. ఒక అనిర్వచనీయమైన భావం, ఒకఅద్భుతమైన అనుభవం అది. ఆ అనుభూతిని వివరించలేను అని ద్రౌపది తన్మయంతో మాట్లాడుతుంటే ఆమెను కృష్ణుడు స్పృశిస్తాడు. కలలోంచి మేలుకున్నట్లు ద్రౌపదికి అనిపించి ఉలిక్కి పడుతుంది'(పుటలు: **257-258**). ఇది రచయితభావనాపరపరగా, అనుభూతుల ఆరాధనగా, మమేకమై ఆరాధించడంగా తెలుస్తోంది. ఇది ఒకపాత్రపట్ల రచయితకుండే ఆరాధనతోపాటు అనుభూతులను తెలుపుతోంది.

"ద్రౌపది జీవితంలో శృంగార రసానుభవానికి అవకాశంఉన్నది ఎంతకాలం? వివాహమై పుట్టింటఉన్న కాసేపు, ఇంద్రప్రస్థంలో మురిసిన కాసేపు. అటుపైని అంతా బీభత్సమే కదా! కరుణరౌద్రభయానకాలే కదా! పాఠకులకి పిచ్చెక్కిపోదూ! అందుకేనేమో ఈ నవలారచయిత పాంచరాత్రకల్పన చేశాడు. శృంగారానికి ఇదిఒకేఒక్కఅవకాశం. శిల్పరీత్యా స్వభావావిష్కరణల రీత్యా ఇది నిస్సందేహంగా గొప్ప కల్పన. అయితే శృంగారం కొంచెం మోతాదు మించింది. పాఠకుల దృష్టి చెదిరి అసలు లక్ష్యం - మనస్తత్వ

చిత్రణ - అందకుండా పోయే ప్రమాదం ఏర్పడింది. వ్యాసుడి దాసీసంగమ ఘట్టంలోనూ ఇంతే. "కామోపభోగేన తు స తస్యాం తుష్టిమగాదృషిః తయా సహోషితో రాత్రిం మహర్షిః ప్రీయమాణయా ఉత్తిష్ఠన్న బ్రవీదేనామ భుజిష్యా భవిష్యసి"(ఆది-100అ.24,25) అన్నదాన్ని దాసి చేసిన ఇష్టోపభోగంబులం దుష్టుండై (1-4-256) అని నన్నయ్యగారు క్లుప్తీకరించాడు. దీన్ని ఈయన దృశ్యీకరించాడు. ఇలాంటి ఘట్టాలలో కొన్ని అవయవ వాచకాల ప్రయోగం, కొన్ని చేష్టల ప్రస్తావన ముదురు పాకంలో పడింది. నాగరకంగా లేదు. దుఃఖాలలో మునిగిపోయిన ద్రౌపది తలుచుకుని మురిసిపోదామంటే జీవిత కాలంలో మిగిలిన మధురానుభూతులు ఇవి. సౌగంధిక పరిమళం మరొకటి. వీటిని ఎంతో నాగరకంగా ఇంకా గాఢంగా ఇంకా గూఢంగా పోషించవచ్చు, చిత్రించవచ్చు. ఎంతో కృషి చేసి, ఎన్నో సంప్రదాయాలను సమన్వయించి, ఎన్నో సాహితీ శిల్పాలను జతపరచి, భర్తలతో భార్యకు పాదాభివందనాలూ, సంవాహనాలూ జరిపించిన నాగరకతను చూపించి, ఇతిహాసంలోని అన్ని అంతరువులనూ స్పృశించి, అర్థంలేని ఆధునికత వైపు పోకుండా నిలబడి - రచించిన ఈ నవలకు ఇదొక దిష్టిచుక్క. దురుద్దేశాలను ఆపాదించి సంకల్పాలను శంకించి పాపం మూటగట్టుకోను. కానీ రాబోయే ముద్రణలోనైనా ఈ ఘట్టాలను నాగరకం చెయ్యమని రచయితను కోరుతున్నాను. మాయాబజార్‌లో చెప్పినట్టు ఇదే వీరికి తక్షణ కర్తవ్యం"గా బేతవోలు వారు తమ వ్యాసం 'నవలగా ద్రౌపది ఒక సమీక్ష' లో సూచించారు.

## 6. 7. పర్వ నవల- దృక్పథాల పరిశీలన :-

పర్వ నవల రాయడానికి రచయిత సంస్కృత భారతాన్ని సమగ్రంగా అధ్యయనం చేసాడు. ద్వారక, ఆరావళీ పర్వతాలు, విరాటనగరం, మధుర, ఢిల్లీ, కురుక్షేత్రం, హస్తినాపురం, బర్నాకా, చక్రనగర్, రాజగీర్ మొదలైన ప్రాంతాలకు వెళ్ళి అక్కడున్న అంశాలన్నిటినీ పరిశీలించారు. ఈ స్థల పరిశీలన ప్రభావం చాలా పాత్రలమీద, కథమీద కనిపిస్తోంది.

జయపూర్ జిల్లాలోని విరాటనగరం పక్కనే ఉన్న ఛోటాకురుక్షేత్ర లేదా గోగ్రహణ యుద్ధం జరిగిన చోటుకు దగ్గరే భీముడి పేరుతో ఒక గుహ ఉంది. దాని దగ్గరికి రచయిత వెళ్ళాడు. అక్కడికి ఒక జంట వచ్చి పూజలు చేస్తున్నారు. ఇక్కడ ఎందుకు పూజలు చేస్తున్నారని రచయితవాళ్ళని అడిగాడు. 'నా భార్యమీద ఎవరైనా కన్నువేస్తే వాణ్ణి చంపి పాతెయ్యడానికి భీముడు శక్తినిస్తాడు' అని అతడు సమాధానం చెప్పాడు(రచయిత మున్నుడి) భార్యమీద పరపురుషుడు చెయ్యి వేస్తే ఎలా స్పందిస్తాడో రచయిత వాస్తవిక కోణంనుంచి భీముడి పాత్రను పరిశీలించి ఈ నవలలో చిత్రించాడు. ఇప్పటికీ కర్ణాటక దేశంలో భీముడే భారతంలో నాయకుడుగా కీర్తి పొందుతున్నాడట. అందుకే భీముడే ద్రౌపది విషయంలో ఎక్కువగా స్పందిస్తాడు. అలాగే ధర్మరాజు జూదగాడిగాఉండి కష్టాలు తేవడాన్ని బహిరంగంగా విమర్శిస్తాడు. మిగతా పాండవులెవరూ ఏమి అనరు.

భైరప్ప ద్వారకకు వెళ్ళారు. డా. థాకర్ పేర్కొన్న కృష్ణుడి ద్వారక నిజమా కాదా అనే సందేహాలు రచయితకు ఉండేవి. అయితే 'రేవు దీపం' (light house)మీద ఎత్తులో

నిల్చుని చూసి 1975 వ సంవత్సరంనుండి ద్వారక యాదవుల కాలానికి వెళ్ళిపోయినట్లు భావనలోకి వెళ్ళారు. అక్కడి ఊరు, సముద్రం, ప్రజాజీవనం, చుట్టుపక్క భౌగోళికాంశాలు మొదలైన వివరాలు అన్నీ రచయిత మనసులోకి వచ్చి, వాస్తవకోణాలను ఆవిష్కరించినట్లు భావించాడు.

కథలో మయుడు ఇంద్రప్రస్థం నిర్మించే విషయంలో కృష్ణుడు ద్వారక నుంచే కొంతమంది శిల్పులను పిలిపించుకున్నాడు. ఒకసంవత్సరకాలంలో నగరనిర్మాణం పూర్తి చేసాడు. "ఇళ్ళన్నీ మేడలే. ప్రతి ఇంటికీ స్నానాగారం వేరు. ఊరి మధ్యలో అక్కడక్కడా స్నానలకు కొలనులు. కొలనుల చుట్టూ చక్కటి నీడానిచ్చే చెట్లూ, వర్షం వెలిసి అరఘడియ కూడా కాకుండానే నీళ్ళన్నీ పక్కలకు పారి, ఊరు తనకు తానే శుభ్రం చేసికొన్నంత స్వచ్ఛగా... ఇంద్రప్రస్థంలో ఎంతో విశాలమైనవీధులు. ఎదురుమదురుగ్గా రెండు పెద్ద బళ్ళు ఏకకాలంలో వెళ్ళినా మధ్యన మళ్ళీ రెండింతలు స్థల ముండేటంత వైశాల్యం. వంక డొంకలు లేకుండా బట్ట పరచినంత తిన్నగా" (పుట.142)అని ఊరిని చూసినట్లు వర్ణించారు. ఇదంతా రచయిత పరిశీలనా దృష్టికి, చారిత్రక అవగాహనకు సంబంధించిన వాస్తవిక కోణంగా తెలుస్తోంది.

భైరప్ప హిమాలయాల్లోని గడవాల్ భాగంలో సంచరిస్తోంటే అక్కడ బహుపతి పద్ధతి ఉన్న చిన్న పల్లెలో నిద్రించే సందర్భం వచ్చింది. ఈ పద్ధతి ద్రౌపదికాలంనుంచీ వస్తోందని చెప్పేజనం సుమారు రెండు తాలూకాల్లోని పల్లెల్లో ఉన్నారు. దీని ఆధారంగానే ద్రౌపదికి బహుపత్నీ పద్ధతి ఉండొచ్చని, కుంతి, మాద్రి హిమాలయాల్లోనే పాండురాజుతో చాలా కాలం గడిపారని రచయిత కథలో వివరించాడు. అక్కడే దేవలోకం అనే ఊరు ఉండి ఉంటుందని భావించాడు. దానికి కారణం అక్కడఉండే మనుషులు బాగా ఎత్తుగా, రూపవంతులుగా ఉండడమే. వారితోనే పాండురాజు నియోగం జరిపించి కొడుకులను పొందాడని రచయిత భావించాడు.

ఈ నవలలో హేతువాద ధోరణి కొన్ని చోట్ల కనబడుతోంది. శాపాలమీద, పూర్వ జన్మలమీద, అతి మానుష కల్పనలమీద, వరాలమీద నవలాకర్తకు నమ్మకం లేదు. అందుకే పాండవులు యముడు, వాయుదేవుడు మొదలగువారిని కుంతి ధ్యానించడం వల్ల పుట్టారు అనే మాటలకు విలువ ఇవ్వలేదు. వారంతా హిమాలయ ప్రాంతంలోఉండే దేవలోకం అనిపిలిచే ప్రదేశం నుంచీ పాండురాజు కోరికమేరకు కుంతితోను, మాద్రితోను సంగమించినట్లు రాసారు. తద్వారా నవమాసాలు నిండాక పిల్లలను కన్నారు అని వివరించాడు. మూలంలో సద్యోగర్భం వచ్చినట్లు చెప్పారు. దాన్ని ఈ నవలాకర్త ప్రమాణంగా భావించలేదు.

ధృతరాష్ట్రుడి కొడుకులు వందమంది అనడాన్ని ఈ నవలాకర్త అంగీకరించలేదు. పదిహేనుమంది ఉండొచ్చని అంగీకరించాడు. ధృతరాష్ట్రుడి పేరులో "దు" అక్షరాన్ని ఆధారంగా చేసుకొని నిర్ధారణ చేసినట్లు తెలుస్తోంది. మిగతావాళ్ళ కౌరవులుగా చెప్పుకున్నారే తప్ప ధృతరాష్ట్రుడికి పుట్టలేదనేది ఇతడి వాదన. కేవలం వాళ్ళంతా

ధృతరాష్ట్రుడి కొలువులో ఉద్యోగం సంపాదించుకోడానికి కౌరవులుగా చెప్పుకొని, లేదా అతడి కొలువులో ఉద్యోగం రావడంవల్ల కౌరవులుగా పేర్కొని ఉండొచ్చని కారణాలుగా భావించాడు.

వేదం ప్రమాణంగా ధర్మరాజు జూదాన్ని, ద్రౌపది వస్త్రాలను లాగడాన్ని ఆధారాలుగా సూచించాడు. "అన్యేజాయాం పరిమృశంత్యస్య యస్యా గృధద్వేదనే వాజ్యక్ష:" ఇతరుల ధనానికి ఆశపడే జూదగాండ్ర భార్యను ఇతరజూదగాడు వస్త్ర కేశాదులను పట్టుకొని లాగుతారు అని దుర్యోధనుడు అంటాడు (పుట.198). "పితా మాతా భ్రాతర ఏనమాహు: నజానిమోనయతా బద్ధమేతత్" జూదంలో అంతా ఓడిపోయినవాణ్ణి గురించి వాడి తల్లిదండ్రులు, అన్నదమ్ములు వీడెవడో మాకు తెలీదు. మీ ఇష్టం వచ్చినట్లు కట్టి లాక్కు వెళ్ళండి అని చెబుతారని సూచిస్తాడు (పుట198).

జూదం ఆడి పాడై మొత్తం కోల్పోయిన వాడు ప్రపంచానికి చెప్పే సందేశాన్ని కృష్ణుడిద్వారా రచయిత సూచిస్తాడు. "అక్షైర్మాదీవ్య: కృషిమిత్ కృషస్య విత్తే రమస్వ బహుమన్య మాన:, తత్ర గావ: కి తవ తత్రజాయా తన్మే విదష్టే సవితాయమర్య:" పాచికలతో జూదం చేయవద్దు. వ్యవసాయం చేయి. వ్యవసాయంలో సంపాదించిన ధనమే గొప్పదిగా భావించి సంతోషించు. దానివల్లే పశువులు, భార్యకూడా లభిస్తారు. దీన్ని ఈశ్వరుడైన సవితృవు చెప్పినట్లు వేదప్రమాణం ఆధారంగా వివరించాడు.

ఆడవాళ్ళు మంత్రాలను అధ్యయనంచేసి ఉండేవారు. ఈ విషయాన్ని సూచించడానికే వాళ్ళకుండే స్వేచ్ఛకు(ఒక కొండవాణ్ణి ప్రేమించి పెళ్ళిచేసుకుంటుంది) ప్రతీకగా హిరణ్యవతి (శల్యుడి మనుమరాలు) పాత్రని సృష్టించాడు. పర్వనవల చివరి ఘట్టంలో వర్షం పడడానికి హిరణ్యవతి పర్జన్యసూక్తం "ఇదం వచ: పర్జన్యాయ స్వరాజే హృదో అస్త్వంతరం తజ్జుజోషత్..."అంటూ గట్టిగా అనడంద్వారా సూచిస్తాడు.

ఆర్యధర్మం విషయంలో రచయిత పెద్ద చర్చే చేసాడు. నిజమైన ఆర్యధర్మం అంటే ఏమిటి? అని ప్రశ్నించుకొంటూ వ్యంగ్యంగా, 'వేట, తాగడం, ఆడవాళ్ళ సహవాసం, జూదం అని నా మనసులో అనిపించింది నవ్వు వచ్చింది'(పుట. 188) అని ద్రౌపదిచేత అనిపించాడు. దాన్ని బలపరచడానికి అరణ్యంలో ఉన్నవాళ్ళకు తినడంకోసం వేటాడ్డం సహజం. అడవిజంతువులు ఎక్కువై ఊళ్ళో బతకడం కష్టమైనప్పుడు భూమి, పశువులు, ఎద్దులు, గుర్రాలకు నష్టం కలుగుతున్నప్పుడు వేటాడడం సహజమే. పొద్దుపోవడానికి నిద్రలేస్తూనే విల్లంబులు, బల్లేలు, బడితెలు పట్టుకొని అడవిపైబడే చాపల్యం ఆర్యులకు మాత్రమే ఉందని ఆటవికుల్లో లేదని రచయిత నిశితంగా విమర్శించాడు.

తాగుడు విషయంలో అడవి మనుషులు కొన్ని మొక్కలను చెక్కి, రసం కారేలాగా వెదురుదో, కర్రదో పాత్రను ఆనించి పెట్టి ఆ రసం తీసుకొని తాగుతారు. దాన్ని తాగితే మత్తురాదు. ఉత్సాహం ఉండి ఆరోగ్యం పెరుగుతుంది. అయితే ఆర్యులు మాత్రం యజ్ఞాలు, పండగలు, సమావేశాలు, యుద్ధాలు అన్నిటిల్లోనూ తాగుడే. బియ్యంతో బెల్లంతో,

సోమలతతో ఎలాటెలాంటి మత్తు పదార్థాలతో చేస్తే ఎంత ఎక్కువ మత్తు వస్తుందోనని ప్రయోగాలు చేసి చివరకు దైవ కార్యాల్లోనూ చేర్చారు. అని మత్తు వదలని వాళ్ళని, మత్తుని సంస్కృతిలోనూ చేర్చడం వల్ల అది మనిషిని పాడు చేస్తోందని విమర్శించాడు.

ఆడదాని విషయంలో పెళ్ళయ్యాక, ఆమెతోపాటు సుందరాంగులైన పదిమంది యుక్త వయస్సు ఉన్న దాసీల్ని పంపాలి. పెద్ద రాజైతే వందమంది కూడా. వారివల్ల సూతకులం పెరగాల్సిందే అంటూ దురాచారంగా విమర్శించాడు.

జూదం విషయాన్ని చెప్పనక్కర్లేదని న్యాయం విషయంలో పేరుపొందిన ధర్మరాజుకూడా జూదంపట్ల చాపల్యం ఉంది. కురువృద్ధులు అందరి సమక్షంలో ధర్మరాజు అన్నిటినీ ఓడిపోతోంటే అంగలార్చారు. తిట్టారు తప్ప జూదం ఆడొద్దని అది అధర్మమని లేచి వెళ్ళమని ఎవరూ అనలేదని రచయిత ద్రౌపదీ ముఖత: చెప్పించాడు. (పుటలు.188-189)

అసలు ధర్మం తెలిసినవాడు కృష్ణుడొక్కడే. పాండవులు అరణ్యాలకు వెళ్ళినప్పుడు ద్వారక నుంచీ కృష్ణుడు పరుగెత్తుకొని వచ్చాడు. అప్పుడు 'యుద్ధానికైనా, జూదానికైనా పిలిస్తే రాననడం ఎలా అధర్మ మవుతుంది? బలవంతమైన పులి యుద్ధానికి రా అన్న తక్షణం జింక వచ్చే తీరాలా? జింక కూడా తగిన ఎత్తూ, సమయ సామర్థ్యాలు చూసుకొని పులిని హతమార్చవచ్చు. బలవంతుడైన జరాసంధుణ్ణి అలాగే ఆపా'నని కృష్ణుడు చెప్తాడు. అయితే 'జూదం విషయంలో రానంటే మీదపడి ఎలా ఆడతాడని ప్రశ్నిస్తాడు. మొత్తం మన జీవితాన్ని, భాగ్యాన్ని గుడ్డి పాచికల దయాధర్మలకు అప్పగించాలా? అంతకంటే హీనమైన వ్యసనం, బుద్ధిలేని పని లేదు. రూఢిలో ఉన్నట్లు నడుచుకోడమే ధర్మం. లోకరూఢిని కంఠపాఠం చేయడమే ధర్మజ్ఞానం' అని రచయిత కృష్ణుడిద్వారా వాస్తవ విషయాలను జోడించి లోకధర్మాన్ని అనుసరించే విధంగా సూచిస్తాడు.

ఏకలవ్యుడి కుడిచేతి బొటనవ్రేలు తీయడానికి కారణం భీష్ముడని దానికి తగిన కారణాన్ని రచయిత సూచించాడు. శబ్దవేదిని ద్రోణుడు నేర్పలేదని జంతువుల సూక్ష్మ శబ్దాన్ని విని దిక్కు తెలుసుకొని కొట్టే ఊహ అది. గురి ఆటవిక జనానికి సహజంగానే వస్తుంది. దానికి పేరు శబ్దవేది. కేవలంపేరు మాత్రమే ద్రోణుడిది. అని ఏకలవ్యుడి చేత చెప్పించడం సహజంగా ఉంది(పుట. 493). ఇది వాస్తవిక కోణాన్ని, పరిశీలనా దృష్టిని తెలుపుతోంది.

## 6. 8. *ప్రచ్ఛన్న పాండవము నవలా లక్ష్యాలు*

ఒక లక్ష్యాన్ని సాధించడానికి సమయమూ, సందర్భమూ అవసరం. అయితే దానికి ప్రణాళికా బద్ధంగా తయారుచేసుకోవాలని సూచిస్తూ ఈ నవల రూపొందిందని చెప్పొచ్చు. గుప్తంగా ఉండి, తమ ధర్మస్థాపన అనే లక్ష్యాన్ని పాండవులు సాధించారో సూచిస్తూ, మానవులంతా తమ తమ లక్ష్యాన్ని సాధించాలి అని తెలుపుతోంది. కష్టాలను ఇష్టాలుగా మలచుకోవలసిన ఆవశ్యకత ఈ నవలలో దర్శనమిస్తోంది.

కష్టాలను భరించడంలో సంయమనం, లక్ష్యాన్ని సాధించాలనే పట్టుదల, ప్రయత్నమే మానవుణ్ణి విజయపథం వైపు నడిపిస్తుందని రచయిత ఈ నవలద్వారా తెలిపాడు. ఈ విషయాన్ని 'పాండునందనులు కొడుకును గొడలం జూచి మేరమీఱిన సంతోషమునొందిరి. రూపమునఁ జందమామయల్లుని గుణములచే జనకుని యల్లుని ధనుఃపాండిత్యమున మంచుగొండయల్లునిఁ బోలిన యల్లుఁడు తనకు దొరకెనని విరటుఁడానందాబ్ధి నోలలాడెను' అని ముగింపులో రచయిత వివరించాడు. ఈ నవల చదివిన వారందరికీ ఆనందం కలగాలని రచయిత శుభంతో ముగించాడు.

## 6. 9. మాధవి నవలా లక్ష్యాలు :-

మాధవి పాత్రను స్త్రీవాద ధోరణితో రచన చేసినట్లు కనబడుతోంది. ముఖ్యగా పీడిత స్త్రీకి చిహ్నంగాను, స్వార్థపరులకు బలైపోయిన స్త్రీగాను, చివరకు స్వేచ్ఛను కోరుకున్న స్త్రీగానూ మాధవి కనిపిస్తోంది.

### 6. 9. 1. పీడిత స్త్రీకి చిహ్నంగా మాధవి :-

మాధవి యయాతికూతురు. ఆమె అందగత్తె. కానీ దురదృష్టం ఈమెను వెంటాడు తున్నట్లు ఉంటుంది. చిన్నప్పుడే పుట్టిన రెండో రోజే తల్లి చనిపోతుంది. తండ్రే 'అపశకున పక్షిగా' ఛీత్కారానికి గురైపోయిన పసిమొగ్గ. తండ్రి ప్రేమ, తల్లి ప్రేమ కూడా నోచుకొని మాధవి కేవలం వృద్ధదాసి దగ్గర కాస్తంత ప్రేమ, నడవడికలు నేర్చుకుంది. ఈమె అందమే దేవయానిని ఈర్ష్యపడేలా చేసింది.

మాధవికి ఎనిమిదేళ్ళ వయస్సులో యయాతి దిగ్విజయాలు చేసి నీలమణుల్ని మాధవికోసం తెచ్చి ఇవ్వబోయాడు. తండ్రి దగ్గరకి వెళ్ళడానికి భయపడింది మాధవి. తండ్రి పేరుకే ఉన్నాడు కానీ తండ్రినుంచి ఎటువంటి లాలన, ఆప్యాయత, ప్రేమల్ని నోచుకోలేదు.

యుక్తవయస్సు వచ్చేసరికి మాధవికి స్వయంవరం ఏర్పాటు చేయాలని యయాతి భావించాడు. మాధవి పాలిట యముడిలా గాలవుడు వచ్చాడు. యయాతి దగ్గర ధనం లేకపోవడంతో స్త్రీ ధనాన్ని ఇచ్చి, గురుదక్షిణ తీర్చుకోమన్నాడు. అక్కడ నుంచి మాధవి జీవితం దుర్భరంగా మారిపోయింది. నలుగురు పిల్లల్ని కన్నది. కానీ వారిమీద ప్రేమను ఉంచకుండా ఒక రకంగా పిల్లల్నిచ్చే యంత్రంలా జీవితం సాగించింది. కామంతో ఉన్న పురుషులకు పిల్లలను ఇచ్చేదిగాను, వారికి ఈమె హృదయంతో పనిలేని, మానసికంగా పీడించబడిన వ్యక్తిగా కనబడుతోంది. కేవలం ఒక గురువు శిష్యుడిమీద కోపంతో కోరిన కోరికకు అక్షరాలా బలైన పాత్రగా మాధవి కనబడుతోందీ నవలలో.

### 6. 9. 2. స్వార్థ పరుల వేషంలో పెద్దమనుషులు :-

సంఘంలో పేరు ప్రఖ్యాతులు పొందినప్పటికీ వారి విషయంలో స్వార్థంలో ఉండే

పెద్దలు ఈ నవలలో హర్యశ్వుడు, దివోదాసు, ఉశీనరుడు, విశ్వామిత్రుడు కనిపిస్తారు. వీళ్ళంతా సమాజంలో ఇప్పటికి కూడా కృత్రిమ వేషాల వెనకే దాక్కుని ఉన్న స్వార్థ పరులుగా చెప్పొచ్చు.

హర్యశ్వుడు అయోధ్యాపతి. సుమారు ఏభై ఏళ్ళుంటాయట. తల వెంట్రుకలు తెల్లగా అవుతున్నాయి. అంతపెద్ద పొడుగులేకపోయినా ముఖంలో రాజఠీవి కనబడుతోంది. సుమారు యయాతి వయసుంటుందతనికి. అలాంటివాడు మాధవిని గురించి విని, "మునివర్యా! ఈ కన్యను చూడగానే మోహించాను. కన్యాశుల్యానికి గాను ఎంత ధనకనకాదులు కావాలో చెప్పండి. కావాలంటే ఈ రాజ్యాన్ని కూడా ఇచ్చేస్తాను.(పుట. 41) అని హర్యశ్వుడు గాలవుడితో అన్నాడు. కన్యను శుల్కంఇచ్చి కొనడంలో వయస్సుతో పనిలేదు. గాలవుడు చెప్పిన మూల్యాన్ని చెల్లించడానికి తనవద్ద ఎనిమిది వందల గుర్రాలు లేవని మరోమార్గం సూచించాడు.

'మాధవివల్ల నేను యథేచ్ఛగా కామసుఖం అనుభవించి పుత్రసంతానం పొందుతాను. ఆ తరువాత నేను మీకామెను వెనక్కి ఇచ్చేస్తాను. అప్పుడు ఇంకో రాజు కర్పించి అశ్వాలు తీసుకోండి. దీనిలో తప్పేముంది' (పుటలు. 42-43) ఒకరాజు అందునా వయస్సులో పెద్దవాడు కన్యను అనుభవించి పుత్రుడు పుట్టాక ఇచ్చేస్తాడా? పైగా తప్పులేదని చెప్పడం చాలా అవమానకరంగా రచయిత్రి సూచించింది. తన స్వార్థంకోసం మాధవిని బలిచేసి వ్యక్తుల్లో ఇతడొకడు.

మరో రాజు దివోదాసు. ఇతడు కాశీరాజు. పుత్రులు ఆయనకు కలగలేదు. అశ్వమేథయాగం చేయాలని భారద్వాజుల సలహామేరకు నిర్ణయించుకున్నాడు. అందులో భాగంగానే పుత్రకామేష్టి చేయదలిచాడు. గాలవుడు తెచ్చిన మాధవిని రాణికి తెలీకుండానే పాణిగ్రహణం చేసాడు. మాధవికి ఒక సంవత్సరం తన దగ్గర పుత్రుడు పుట్టేవరకు ఉంచడానికి ఒప్పందం చేసుకున్నాడు. మాధవికి గర్భం తనవల్లరాదని రాజు భావించాడు. ఎందుకంటే అంతకుముందు భార్య సత్యవతివల్ల పది ఏళ్ళనుంచీ రాని గర్భం మాధవికి మాత్రం వస్తుందా? పిల్లాడు పుట్టాక కదా గాలవుడికిచ్చేది. పిల్లలు పుట్టకపోతే శాశ్వతంగా మాధవి తనవద్దే ఉండిపోతుందని దివోదాసు భావించాడు. (పుట.79) పుత్రకామేష్టి యాగంలో పాయసం మొత్తం సత్యవతే తినేసింది. కానీ ఆమెకు పిల్లలు పుట్టలేదు. మాధవికి కొడుకు పుట్టాడు. కేవలం యాగాలవల్ల పిల్లలు పుట్టరనే విషయాన్ని ఇక్కడ సూచించడం ఉంది. ఇక్కడ కూడా ఇతడు తన స్వార్థంకోసమే మాధవిని వాడుకున్నాడు. పిల్లాడు పుట్టాక మాధవిని గాలవుడికి ఇచ్చేసాడు. తరువాత మరో రాజు ఉశీనరుడు దగ్గరికి మాధవిని తీసుకెళతాడు.

ఉశీనరుడు భోజదేశాధిపతి. బలాఢ్యుడు. ఇద్దర పిల్లలతండ్రి. పెద్దవాడికి ఏడు సంవత్సరాలు. చిన్నదానికి నాలుగేళ్ళు. మాధవిని చూసి "మాధవీ, ఇంతవరకు ఏ ఆడదీ నాకింత తృప్తి నివ్వలేదు. నీకేం కావాలో కోరుకో ఇస్తాను" అని అడిగాడు. గాయపడిన పెదాలతో మాధవి చూస్తూ 'విముక్తి' అంది.(పుట. 124) అయినా ఆమెను ఉశీనరుడు

వదల్లేదు. చంపల్ నది దగ్గర గుట్టలకి వేర్వేరు ప్రాంతాలకి తీసుకెళ్ళి మరీ ఆమెను తనివితీరా అనుభవించాడు. వేరొక పక్క మాహిష్మతిరాజుతో యుద్ధం చేస్తూ అందులో ఉశీనరుడు విజయంపొందే దశకు చేరాడు. మాహిష్మతి రాజు సంధి చేసుకొని తన కూతురు, పదహారేళ్ళున్న ఆమెను ఇచ్చాడు. పిల్లలు కలగకపోయినా, అందం ఉన్నా, లేకపోయినా స్త్రీలు ఎంతమంది అయినా రాజుదగ్గరే ఉండిపోవాలనే తత్త్వం ఈ పాత్రలో ఉంది. వయస్సులో ఉన్న స్త్రీని అనుభవించాలన్న ఆకాంక్ష, స్త్రీని భోగ్యవస్తువుగానే పరిగణించడం ఈ పాత్రలో కనిపిస్తోంది.

విశ్వామిత్రుడు మరో వ్యక్తి. ఇతడు మహర్షి. శిష్యులందరికీ విద్యాబుద్ధులు నేర్పేగురువు. శిష్యుడికి కోరరాని కోరిక కోరి ఇబ్బంది పెట్టినవాడు. శిష్యుడు ఇంకా తేవలసిన రెండువందల గుర్రాలకు బదులుగా మాధవిని స్వీకరించమని కోరాడు. మాధవిని మొదటే తెస్తే, నలుగురు పిల్లల్నినావల్లే కనేది కదా అని అంటూ, మాధవిని స్వీకరిస్తాడు విశ్వామిత్రుడు. మాధవి ఎంత ప్రాధేయపడినా విశ్వామిత్రుడు ఆమెను వదలలేదు. పైగా, "కామాన్ని స్వేచ్ఛగా అనుభవించిన దానివినువ్వు. అందుకే నీకు కోరికలేదు. కానీ, నాకున్న ఆకలి ఎన్నో సంవత్సరాలది. దాన్ని తృప్తి పరచకపోతే నాకు పిచ్చెక్కుతుంది" (పుట.160) అని అంటాడు. ఇక్కడ కామ తీవ్రతకు బలైన స్త్రీగా మాధవి కనబడుతోంది. ఏమీ చేయలేని నిస్సహాయత మాధవిపాత్రలో కనిపిస్తోంది. బలవంతంగా అయినా అనుభవించాలనే తపన విశ్వామిత్రుడు లాంటి ఉన్నత వ్యక్తిలో కనిపించడం ఆనాటి లక్షణాలు. వీటిని రచయిత్రి విమర్శిస్తుండడం గమనించదగిన అంశం.

చివరకు పిల్లాడు పుట్టాక బిడ్డమీద నాకు ఏమీ అధికారంలేదా? అని మాధవి అమాయకంగా అడుగుతుంది. "లేదు. నీవు వట్టి ఉపకరణానివి మాత్రమే. జీవానికి వేరు ముఖ్యం వేరు పెరిగే వరకు మన్ను కావాలి. ఆ తర్వాత ఓ మన్నునుండి మరో మన్నులోకి మార్చినా వేరు బ్రతికే వుంటుంది. నువ్వు వట్టి మన్నువు మాత్రమే. మన్నుకు మొక్కమీద అధికారం లేదు"(పుట177) అని విశ్వామిత్రుడు తేల్చి చేప్పేస్తాడు. ఇక్కడ స్త్రీ పరిస్థితిని విశ్వామిత్రుడు చాలా దిగజార్చాడు అని రచయిత్రి సూచిస్తోంది.

### 6. 9. 3. స్త్రీస్వేచ్ఛ :-

మాధవికి అడుగడుగున స్వేచ్ఛ కావాలనుకుంటుంది. ఎక్కడా ఈ పురుషాధిక్య ప్రపంచం అవకాశం ఇవ్వడంలేదని రచయిత్రి ఆవేదన వ్యక్తం చేసారు. చివరకు మాధవితండ్రి స్వయంవరం ప్రకటిస్తాడు. చాలా మంది రాకుమారులు మాధవిని పెళ్ళాడడానికి సిద్ధపడతారు. అప్పుడు యయాతి పరధ్యానంలో ఉన్నప్పుడు మాధవి తండ్రీ ఇప్పుడు నా ఇష్టం వచ్చినట్లు చేయవచ్చా అని అడుగుతుంది. అంతా నీ ఇష్టం అని యయాతి సమాధానం ఇస్తాడు. దాన్నే అవకాశంగా తీసుకొని మాధవి వరమాలని అక్కడే పారేసి అరణ్యవైపు ఒంటరిగా వెళ్ళిపోతుంది ప్రపంచాన్నే ధిక్కరించేంత అడుగులతో. స్త్రీలకు మనస్సు ఉంటుందని దాన్ని పురుషులు గమనించాలని సూచించారు. స్త్రీకి తగిన స్వేచ్ఛను ఇవ్వాలని, భోగ్యవస్తువుగా చూడడం తగదని విమర్శించారు.

## 6. 10. యయాతి నవలా లక్ష్యాలు - దృక్పథాలు :-

ఈ నవల మనస్తత్త్వాన్ని వ్యక్తీకరించేలా కనబడుతోంది. ఇతిహాసానికి సంబంధించిన పాత్రల్ని నవలా రూపంలో పాఠకులకు చదువుకోడానికి సులువైన విధంగా అందించాలనే లక్ష్యం తోనే ఈ నవలని రాసారు.

దేశకాలాతీత సమాజంలో మానవ జీవన స్వరూపాన్ని వివిధ వైవిధ్యపాత్రలద్వారా చిత్రించి సమాజాన్ని ఆలోచింపచేసి గమ్యాన్ని నిర్దేశించుకోవాలని సూచించారు. అందుకే యయాతి పాత్ర ప్రేమలోతుల్లో కామవాంఛని తీర్చుకోడానికి, చివరకు తను ఎన్ని విధాలుగా పశ్చాత్తాపం చెంది విరక్తి చెందాడో రచయిత ఈ నవలో వివరించాడు.

సమకాలీన దాంపత్య సౌఖ్యం పొందని వ్యక్తి జీవితం నైరాశ్యపు లోతుల్ని అధ్యయనం చేసే దిశగా ఈ నవలను చూడొచ్చు. కామాతురుడైనప్పటికీ, అందాన్ని అనుభవించాలనే తపన ఉన్న పాత్రగా యయాతి కనిపిస్తాడు. ప్రేమకు తగిన ఔన్నత్యం ఉన్న పాత్రగా శరిష్ఠ కనిపిస్తోంది. అయినప్పటికీ ఈమెకు పట్టపురాణి హోదా లాంటివి కావాలకునే స్వభావంలేని త్యాగమూర్తిగా శర్మిష్ఠను చూడొచ్చు. ప్రేమ ఒకరితో, పెళ్ళి మరొకరితో ఉన్న పాత్రగా దేవయాని కనిపిస్తోంది. ఈమె వల్ల సంతృప్తి చెందని యయాతి విఫలుడై వైరాగ్యస్థితి పొందకుండా శర్మిష్ఠ, తారక, మాధవి, ముకుళిక లాంటి అందగత్తెలతో గడిపాడు. దీనికంతటికీ కారణం భార్యా సుఖంలేని భర్తస్థితి, భర్తను ప్రేమించలేని భార్యస్థితి కారణాలుగా ఈ రచయిత వివరించాడు. సంఘం ధర్మ పరంగా ఇచ్చిన కామపు స్వేచ్ఛే వివాహం. అయితే అది సంతృప్తి నిచ్చేలా ఇద్దరూ సుఖం పడాలి అలాలేకపోతే ఇలాంటి స్థితిలో మనిషి కామానికి బానిసగా మారిపోతాడని చెప్పడానికి యయాతి ఆదర్శంగా నిలుస్తాడు.

మత్తుపదార్థాలను సేవించడం ద్వారా మనిషి పతనమౌతాడు. తద్వారా యుక్తాయుక్త విచక్షణ కోల్పోతాడు. దీనికి ఉదాహరణంగా శుక్రాచార్యుడు, యయాతి నిలుస్తారు. శుక్రుడు మద్యం సేవించడానికి అలవాటు పడినందువల్లే రాక్షసులు కచుణ్ణి భస్మంచేసి, ఆ సురలో కలిపేసారు. చివరికి ప్రాణప్రదమైన మృతసంజీవని కూడా కోల్పోయాడు. కచుడు దయగలవాడు కాబట్టే శుక్రుడు తిరిగిప్రాణాలు పొందగలిగాడు. అయినా రాక్షసులు, దేవతలతో సమానమై పోయారు. శుక్రుడు వృషపర్వుడి దగ్గర ఉండే ఆధిపత్యాన్ని కోల్పోయాడు. అలాగే యయాతి మత్తుపదార్థాల్ని సేవించి ప్రాణసఖుడైన మాధవుడికి కాబోయే భార్య మాధవిని సైతం చెఱబట్టాడు. స్నేహితుడి మేనకోడలు 'తారక'ని కూడా ఆ మత్తులోనే అనుభవించి, వాళ్ళమరణానికి కారకుడు అయ్యాడు. అందుకే మత్తుకు బానిసకాకుండా ఉండమని ఈ నవలద్వారా రచయిత తన దృక్పథాన్ని వివరించాడు.

మనిషి జీవితంలో పురుషార్థాలు ప్రధానమైనవి. అందులో ధర్మం, కామం ఎక్కువ ప్రభావాన్ని చూపుతాయి. కామం ధర్మబద్ధమైఉండాలనే లక్ష్యాన్ని ఈ నవలా రచయిత సూచించాడు. వ్యక్తి ధర్మం, రాజధర్మం, గృహస్థ ధర్మాలు పాటించడం మనిషికి మాత్రమే

ఉండేదని వివరిస్తాడు. ఇక్కడ దేవతల వ్యక్తి అయిన కచుణ్ణి సాధారణ మానవుడిగా చెప్పడం ప్రత్యేకత. కచుడు, శుక్రాచార్యులు, యాతి మొదలైనవాళ్ళు మానవకళ్యాణానికే తోడ్పడే వారిగా ఉండాలని ఈ నవలలో ధ్వనిస్తోంది. మిగతావాళ్ళు ఆయా ధర్మాలను ఆచరించి నట్లయితే ఆనందమైన లోకం తయరౌతుందని రచయిత ఆకాంక్షించాడు.

ప్రేమ, కామం రెండూ ఒకేలా కనిపించి మోసపోయో సమాజానికి వాటి తేడాను సున్నితంగా వివరించే దిశగా ఈ నవలను రాసాడు. ప్రేమంటే త్యాగభావన. దీన్ని శర్మిష్ఠ పాత్రలో స్పష్టపరిచాడు. సర్వస్వాన్ని అర్పించి, ఆనందంగా జీవించగలగాలి. కామం ప్రేమలోని ఒక భాగం మాత్రమే. అదే ప్రేమ కాదు. ప్రేమను ప్రకృతినుంచీ తెలుసుకోవాలి. తల్లి నుంచీ, వృక్షాలనుంచీ తెలుసుకోవాలని సూచించాడు.

భయపడడం సహజలక్షణం. అయితే ఆ భయాన్ని దగ్గరనుంచీ చూస్తే అంత భయపడ నక్కర్లేదు. ధైర్యాన్ని అలవరచుకొనే దిశలో ఈ నవల కనిపిస్తోంది. దీనికి ప్రతీకగా 'పురు'; సూచికగా కచుడు కనిపిస్తారు. సాహసవంతంగా యుద్ధం చేసి సోదరుడు 'యయు' ని విడిపించి, హస్తినా పురానికి వస్తాడు. అలాగే యయాతికి తనను తానుగా పరిచయం చేసుకొని యయాతి వృద్ధాప్యాన్ని ఆనందంగా స్వీకరిస్తాడు. ఇది ఇతడి ధైర్యానికి, తండ్రిమీద ఉండే మమకారానికి నిదర్శనంగా కనిపిస్తోంది.

కచుడు దేవయానికి శాపం ఇచ్చి, దేవలోకానికి వెళ్ళి పోయిన తర్వాత ఒకరోజు దేవయానికి ఒక కల వస్తుంది. ఆ కలలో వృషపర్వుడు దేవయానికి కావల్సిన కచుణ్ణి బంధించి తెస్తాడు. దేవయాని తనను ముద్దు పెట్టుకోమంటుంది. లేకపోతే శిక్షిస్తానని బెదిరి స్తుంది. కానీ కచుడు బెదరుడు పైగా మరణాన్ని దగ్గరనుంచీ చూసానని తనకు భయం లేదని చెప్పాడు. ఇది ధైర్యాన్ని సూచించే అంశం. ఇలా మానవులకు అధైర్యం వచ్చి నప్పుడు ధైర్యంతో ఆపదను ఎదుర్కోవచ్చు. ఆశను చిగురించి, ఆనందాన్ని పొందవచ్చని సూచించాడు.

స్నేహ మాధుర్యాన్ని వివరించే దిశగా 'మాధవుడి' పాత్ర కనిపిస్తోంది. యయాతికి ఇష్టమైన శర్మిష్ఠను కాపాడడం కోసం రథాన్ని తీసుకువచ్చి, ఊరి పొలిమేరలు దాటించాడు. ఆమెను దింపి వర్షంలో తడిసాడు. యయాతి శర్మిష్ఠను విడవడాన్ని జీర్ణించుకోలేక పోయాడు. చివరకు అనారోగ్యంతో మంచం పట్టాడు. మథనపడి స్నేహంకోసం ప్రాణాల్ని విడిచినవాడుగా కనిపిస్తాడు.

'లోకంలో ఆనందం అంటే మధిర, మదిరాక్షి, మృగయ(వేట) అని అనుకునే ప్రజలకు అవి సర్వస్వం కావు' అని నిరూపించే ప్రయత్నం చేసే దిశలో కూడా ఈ నవలను చూడొచ్చు. మందారుడు యయాతిదగ్గర ఆంతరంగిక సైనికుడు. వాడు ముకుళిక, అలక విషయాలు రాజమాతకి చెప్పి, యయాతిని వారికి దూరంగా ఉంచడానికి కారకుడయ్యాడు. అర్థాంతరంగా ఉద్యోగం ఊడిపోయింది. చివరకు రాజమాత వానప్రస్థానాని వెళ్ళినప్పుడు, 'గురుమహరాజ్' పేరుతో అవతరించి, మత్తుమందు ఇచ్చి, ఆడవాళ్ళని లోబరుచుకొని

ఆనందించే పాత్రగా, ఆడవాళ్ళని తార్చేవ్యక్తిగానూ కనిపిస్తాడు. డబ్బు ఉన్నా, లేకపోయినా సంస్కారాలు పోకూడదు. సంస్కారం చెడిపోయినవాడిగా మందారుణ్ణి చిత్రించాడు. కామప్రకోపస్థాయిని వివరించడం ద్వారా సంస్కార వంతులుగా ఉండాలని రచయిత ఆశించాడు.

అహంకారం మానవాళికి ప్రమాదకారి. ఇది ఏ స్థాయిలోనైనా తగదు అని చెప్పడానికి ఉద్దేశించిన పాత్ర దేవయాని. తన తండ్రి లోకపూజ్యుడనే గర్వంతో శర్మిష్ఠను దాసిగా చేసింది. తద్వారా రాక్షసానందం పొందింది. ఇది బహుశా రాక్షసుల సహవాసంవల్ల వచ్చిందేమో. యయాతిని పెళ్ళి చేసుకొంది. ప్రేమించిన వాణ్ణి శపించింది. తనను ప్రేమించే తండ్రిని ఇబ్బందులపాలు చేసింది కూడా ఈమెలో ఉన్న అహంకారమే అని చెప్పొచ్చు. చివరకు 'పురు' ప్రేమతో అహంకారాన్ని జయిచింది. ప్రేమతో అన్నిటిని జయించవచ్చు అనే విషయాన్ని కూడా రచయిత సూచించదలచుకొని ఉండొచ్చు.

## 6. 11. యాజ్ఞసేని నవల- లక్ష్యాలు - దృక్పథాలు :-

'యాజ్ఞసేని' కామాంధులైన పురుషులచేత అవమానం పొందిన స్త్రీ. ఇలాంటి అవమనాలు ప్రతీ యుగంలోనూ స్త్రీ పొందుతునే ఉంది. భర్తలపట్ల గౌరవం, ఆదరణ చూపినప్పటికీ వారినుంచి తగినరక్షణ పొందలేని అభాగ్యమానవమాత్రురాలు కృష్ణ. యాజ్ఞసేనికి మరో పేరే కృష్ణ. అలాంటి కృష్ణలకు చైతన్యాన్ని తీసుకువచ్చి వాళ్ళలో ధైర్యం కలిగించడమే ఈ నవల ప్రధాన లక్ష్యంగా చెప్పొచ్చు. ఇది స్త్రీగా తనలోని ఆలోచనలు తార్కిక, న్యాయబద్ధమైన దృష్టితో ఆలోచించి రచయిత్రి వివరించారు.

ఆడ, మగల మధ్య స్నేహ ధర్మాల్ని వక్రంగా ఆలోచించడం తగదన్న విషయాన్ని కృష్ణ, కృష్ణుడు మధ్య సఖ్యబంధంగా ప్రారంభంలో వివరించే ప్రయత్నంచేసారు. ఆపదలో ఆదుకున్న వాడే నిజమైన మిత్రుడు అని నిరూపించేందుకు ఈ రెండు పాత్రలు సహకరిస్తాయి. తన భర్తలతో సమానంగా కృష్ణుడికి కూడా గౌరవమిచ్చింది ద్రౌపది. అతడి పాదాలకు నమస్కరించింది. ఇది అలౌకికంగా కనిపించినా సాధ్యమే ఈ మిత్రత్వం అని నిరూపించడం ఒక లక్ష్యంగా చెప్పొచ్చు.

అధ్యయన ఆవశ్యకతను వివరించే దిశలో వేదవ్యాసుడితో కృష్ణయొక్క శాస్త్ర చర్చ చేస్తున్నప్పటి ప్రశ్న- 'మహాశయా, సృష్టిలోని శాస్త్రాలను, గ్రంథాలను, జ్ఞానాన్ని పొందడానికి ఒక జీవితకాలం చాలదంటే ఏం చేయాలి?'(పుట. 20) ప్రశ్నకి సమాధానంగా జ్ఞానతృష్ణ ఆనందాన్ని ఇస్తుందని, గ్రంథాల అధ్యయనంతో పాటు జీవితాలను అధ్యయనం చేయమనడం కనిపిస్తోంది. (పుట. 21)జీవితాన్ని చదివే వ్యక్తి ఆలోచనలలో పరిపక్వత వస్తుందని, అది అవసరమని నిరూపించే దిశలో ఈ నవలా రచన సాగింది. అందుకే వ్యాసుడు, ద్రౌపదిని ఉద్దేశించి, 'కృష్ణ' అనే పేరు కన్నా, 'జ్ఞానతృష్ణ' అని పేరు పెట్టాలనే భావన కనిపిస్తోంది.

కష్టం, సందిగ్ధం మొదలైనవి కలిగినప్పుడు దైవమే శరణ్యం. అతడే/ఆమె పెన్నిధి

అని రచయిత్రి చాలాసార్లు విశ్లేషణాత్మకంగా సూచించింది. 'కృష్ణ' స్వయంవరానికి ముందే అర్జునుణ్ణి వలచింది. కాని, అర్జునుడు లక్క ఇంట్లో మరణించి ఉంటాడని వార్తలు వచ్చాయి. ఆ తర్వాత తన కోరికను దేవి(దేవత)తో చెప్పుకొంది. 'దేవి విగ్రహం నుంచి పుష్పం రాలింది. పూజారి ఆ పుష్పాన్ని నాకు(కృష్ణ) ఇస్తూ- మనోభిలాష నెరవేరుతుందమ్మా! ఇదే సంకేతం. దేవి ప్రసన్ను రాలైంది. మన: పూర్వకంగా ప్రార్థిస్తే తప్ప దేవి ప్రసన్నురాలు కాదు. దేవి నవ్వితే శుభం జరుగుతుంది. నా మనసు చెప్పింది. అర్జునుడు తప్పక వస్తాడు'(పుట. 38)

ఈ అంశాలలో దైవం మీద భారం వేయడం. మనస్సాక్షికి ప్రాధాన్యం ఇవ్వడం. మనస్సుని అచంచలస్థితికి తీసుకు రావడం మొదలైన విషయాలు ఉన్నాయి. వీటి ద్వారా మనోనిగ్రహాన్ని పాటించినట్లయితే మనస్సు ఇచ్చిన సంకేతాలు నిజమయ్యే అవకాశా లుండొచ్చని సూచించారు.

'ధర్మ రక్షణ కోసమే జన్మించిన యాజ్ఞసేని ఆరో భర్తవైపు మొగ్గు చూపింది' లాంటి పదాలతో తక్కువ చేసి మాట్లాడ్డం తగదు. 'సతి' అన్న పదానికి అర్థం పతి అంటే విశ్వాసాలతో ఉండడమే. ఆ విషయంలో ఆయిదుగురు భర్తలకు విశ్వసనీయగా సంపూర్ణంగా అర్పించుకొంది. దానివల్ల 'అసతి'అయినా దు:ఖంలేదు అని భావించింది.

చివరకు దృఢ నిశ్చయంతో 'పాండవు లందర్నీ నేను భర్తలుగా స్వీకరిస్తాను' అని కృష్ణ చెప్పడంలో ఈ పాత్ర తెగువను చూపినట్లయింది.(పుట.60)ఇది తనకు వచ్చిన అదృష్టం గాను, ధర్మరక్షణగాను కుంతి మాటలకు గౌరవాన్ని ఇచ్చినట్లుగాను చెప్పడం విశేషం. ఇది స్త్రీకి ఇచ్చే నిర్ణయాధికారాన్ని సూచిస్తోంది. ఎప్పుడయిన స్త్రీకి తన నిర్ణయం తీసుకునే తెగువ, ధర్మ పరిరక్షణ, పెద్దలపట్ల గౌరవం ఉండాలని చెప్పడం ఈ నవలా రచయిత్రి దృక్పథంగా అనిపిస్తోంది.

'స్త్రీ ధర్మం' చెప్పడం మరో ప్రధాన లక్ష్యం. రుతుక్రమంలో కేశాలంకరణ నిషిద్ధం. కేటాయించిన స్థలంలో ద్రౌపది ఏకవస్త్ర ధారిణిగా ఉంటుంది. "వివాహితస్త్రీ కేశాలపై కూడా పరపురుషుల లాలసదృష్టిపడడం అవమానం. అందువల్ల కేశాలను ముడుచుకోవడం, మేలి ముసుగు ధరించడం ఆవశ్యకం. తన సౌందర్యాన్ని ప్రదర్శించడం వేశ్యలకుగాని గృహిణులకు తగదు' (పుట.189) అని గృహిణీ ధర్మాల్ని కృష్ణద్వారా సూచించింది.

అనార్య స్త్రీ ఇంటికి వెళ్ళి 'శ్రియ' (కొండజాతి స్త్రీ)కుమారులుగా ఉన్న ఇద్దరిపిల్లలకు కృష్ణ స్తన్యాన్నిచ్చింది. ఇది ఆర్య, అనార్య లాంటి భేదాలు ఉండకూడదని చెప్పడానికి ఈ విషయాన్ని వివరించింది. ఆకలితో ఉన్న పిల్లాడికి అవకాశం బట్టి తగినవిధంగా స్త్రీహృదయం ఉండాలనే ధర్మాన్ని ఆచరణాత్మకంగా వివరించింది.

స్త్రీ దృష్టిలో స్త్రీత్వం ప్రధానం. ఆమె చేయవలసిన పత్నీ ధర్మాలు భర్తపట్ల అనురాగంతో ప్రేమను పొందేలా ఉండాలని తెలియజేయడం మరో అంశం. తను భర్తలతో

ఎలా ప్రవర్తించేది మొదలైన విషయాలు సత్యభామకు కృష్ణ చెప్పింది. ఇవి స్త్రీలకు ఎప్పటికీ ఆదర్శనీయంగా ఉంటాయి. ప్రేమ స్త్రీకి సహజగుణమని, దాన్ని వినియోగించిన సందర్భాలు చాలా ఉంటాయని విశ్లేషణాత్మకమైన వివరణ ఉంది. (వీటిని 'యాజ్ఞసేని' నవల, పుట. 255లో సమగ్రంగా చూడొచ్చు)

మరో ప్రధానలక్ష్యం కృష్ణ తత్త్వం. అదే భగవత్తత్త్వం. అయితే భగవంతుడు భక్తులకు కొంగు బంగారం అన్న నానుడిని ద్రౌపది కృష్ణుడికి రాసిన ప్రేమ లేఖలో రచయిత్రి వివరించింది. (పుట. 252) 'నీకై నేను ఓం కారాన్ని, ఆత్మను స్పృశించే, ఊర్థ్వ గామినై అనంతాలకు ఎగసి నీలి ఆకాశంలో, బ్రహ్మాండంలో, సృష్టి, స్థితి, ప్రళయ స్వరంలో కలిసి పోతాను...'అంటూ చివరగా 'నా ప్రతి బింబాన్ని నేను అని గుర్తించని వారికి నేను దక్కను. నన్ను పొందిన వారిలో నేను ప్రతిబింబిస్తాను' అని కృష్ణతత్త్వాన్ని రచయిత్రి వ్యక్తం చేస్తోంది.

భగవంతుడికి ఈ ప్రపంచంలో స్వ-పర భేదం లేనట్లే స్త్రీ పురుష భేదమూలేదు. స్థావర జంగమ భేదమూ లేదు. అసలు ఏ భేదమూ లేదు. అలాగే భావనా ప్రపంచంలోని సకల ద్వంద్వాలకూ అతీతుడు. పురాణేతిహాసాలలో భగవద్గీతలో సారాంశంగా వ్యాసుడు ప్రతిపాదించిన ఈ భగవత్తత్త్వాన్ని ద్రౌపదీ కృష్ణుల అనుబంధంలో లక్ష్యప్రాయంగా పొందుపరిచింది ఈ రచయిత్రి. ద్రౌపది ఒక స్త్రీగా కాకుండా ఒక జీవిగా చూస్తే ఇది సంశయాలకూ సందేహాలకూ తర్కాలకూ అతీతంగా అర్థమవుతుంది.

భగవంతుడికి సర్వస్వాన్ని సమర్పించుకోడం, భగవంతుడు తనని భక్తులలో చూసుకోడం ఒక స్వానుభూతికి సంబంధించిన అంశం. ఇది అనుభవైకవేద్యం. అందుకే ద్రౌపది కృష్ణుడి విషయంలో తనను తాను మరచిపోయి ఉండేది. ఈ విషయాన్ని చివరకు మోహనవంశీ ధ్వనిలో లీనమైనట్లు రచయిత్రి వివరించింది.

## 6. 12. రాజమాత నవలా లక్ష్యాలు :-

ఉత్పలవారు భారతాన్ని అధ్యయనం చేస్తున్నప్పుడు సేవాభావం, నిష్కామత ఉన్న పాత్రగా కుంతి కనిపించింది. ఆమెనే ప్రధానంగా తీసుకొని ఈ నవలలో రాజమాతగా కీర్తిస్తూనే ప్రారంభించారు. సమకాలీన స్త్రీజీవితం ఎలా ఉండాలో ధ్వనించేలా కుంతి కనిపిస్తోంది. త్యాగశీలి, కుంటుంబాన్ని చక్కదిద్దాలన్న సంకల్పం, ఆదర్శవంతంగా స్త్రీ ఉండగలదని వివరించారు. ఈ ఆదర్శమార్గంలో ఉన్నవారు పృథ, మరోకరు ద్రౌపదిగా చూడొచ్చు. ఇలా ఆదర్శ వ్యక్తిత్వాన్ని దృష్టిలో పెట్టుకొని ఆ లక్ష్యాన్ని చేరే దిశగా పాత్రల్ని తీర్చేందుకు ఈ నవలలో ప్రయత్నించారు.

మహాత్ముల సేవాభావం, ఎదుటివారికి గౌరవించడం, బంధుత్వంమీద మమకారం ఉండాలనే స్థితి ఎప్పటినుండో వస్తోంది. అయితే, బంధుత్వం ఉన్నప్పటికీ, ఆరాధనా భావంతోను, దైవత్వంతోను కొలవగలిగే పాత్రగా శ్రీకృష్ణుణ్ణి వివరించడం కనిపిస్తోంది. ఈ పాత్రద్వారా దైవ సాన్నిధ్యాన్ని, భగవత్ప్రార్థనా విధానాన్ని పాఠకుడికి అందించారు.

సూక్ష్మంలో మోక్షం రావాలనుకునే ప్రజలకు మహాభారతంలాంటి బృహద్గ్రంథాల అధ్యయనం విసుగుపుట్టిస్తుందని, కొందరు అనుకుంటారు. దానిలో ఉన్న ఆధ్యాత్మికతను సమకాలీన స్థితిగతుల్ని ఒక్క తాటిమీద నడిపి దుఃఖాలు వచ్చినప్పుడు ధైర్యాన్ని ఇచ్చే దిశలో ఈ నవల కనిపిస్తోంది. దీనికి ఉదాహరణగా కుంతి, సువ్రత పాత్రలు కనిపిస్తాయి. పాండురాజు మరణించాక కూడా ధైర్యంగా పాండవుల్ని సాకి, వాళ్ళు విజేతలయ్యేవరకు శ్రమించిన కుంతి ఆదర్శస్త్రీగా, తల్లిగా కనిపిస్తోంది. ద్రుమిళాసురుడి బారినపడి నడుంవిరిగినప్పటికీ ధైర్యంగా జీవనం సాగించిన స్త్రీగా సువ్రతపాత్రని రచయిత చిత్రించాడు. ఈ రెండు పాత్రద్వారా స్త్రీ ఎలాంటిస్థితిలో ఉన్నప్పటికీ ధైర్యాన్ని కోల్పోకూడదని సూచించారు.

సర్వకాల సర్వావస్థల్లో భగవంతుడే రక్షకుడు. అతణ్ణి ఎల్లప్పుడూ స్మరిస్తూనే ఉండాలని సూచించడం మరో లక్ష్యంగా చెప్పొచ్చు. కుంతి ప్రతి అంశంలో కృష్ణుణ్ణి కీర్తిస్తూనే ఉంటుంది. పాండవ వనవాసంలో అతణ్ణి మరిచిపోవద్దని ద్రౌపదికి చెబుతుంది. ద్రౌపది వస్త్రాపహరణ సమయంలో హృదయవిదారకంగా కన్నులుమోడ్చి, ఆర్తితో కృష్ణుణ్ణి చేతులెత్తి ద్రౌపది ధ్యానిస్తుంది. భాగవతంలోని గజేంద్రమోక్ష ఘట్టాన్ని ఇక్కడ తలపించేలా ఉంది. 'నీవే తప్ప ఇతఃపరం బెరుగన్...' అంటూ పోతన వర్ణించిన ఘట్టంలా ద్రౌపది వేదన ఉంది కాబట్టే ద్రౌపదికి శరీరంమీద ఏం జరుగుతుందో తెలియలేదు అని అంటాడు. దీనిద్వారా భగవంతుడు భక్తుడికి దగ్గరిగా ఉంటాడనే విశ్వాసాన్ని కలిగింపజేసారని చెప్పొచ్చు.

ఆకతాయితనంవల్ల పడే వేదనతో కూడిన భయాన్ని పృథ మంత్రాన్ని జపించి, సూర్యుణ్ణి ఆహ్వానించిన సందర్భంలో కనిపిస్తోంది. ఈ సందర్భంలో దైవం తలచిన పనిని మానవ మాత్రులం ఆపలేమని సూచిస్తాడు. ఇది తప్పించుకోలేని స్థితిని తెలియజేస్తాడు. ఇలాంటి సంఘటనలనుంచి ధైర్యాన్ని పొందాలనే విషయాన్ని రచయిత బోధిస్తున్నాడు.

నవలా సాహిత్యంలో కళ పేరుతో సంస్కరింపజేసే దిశలో సమాజాన్ని ఆలోచింప చేసే సంయమనం ఉండేలా చేయాలని ఈ నవలని రాసాడు. అందుకే ఈ నవలలో క్రౌర్యం- హింస- ప్రతిహింసలు లేవు. ఉండకుండా ప్రవర్తించాలని రచయిత భావనగా అనిపిస్తోంది.

సమాజంయొక్క ఆదర్శం భోగం కాకూడదు. భోగమే ఆదర్శమైతే పరిణామం విధ్వంసమే అవుతుంది. భోగస్థానంలో ఎప్పుడూ భవంతుణ్ణే నిలుపుకోవాలని, భౌతిక పదార్థాలను విడిచి ఆధ్యాత్మిక దిశగా పయనించాలి. తద్వార సుఖశాంతులు వస్తాయని చెప్పడంకోసమే ఈ నవలను రాసినట్లు భావించవచ్చు.

మనుష్యుల నిష్కామకర్మ ధర్మాచరణకు పురికొల్పుతుంది. దానివల్లే సుఖశాంతులు పొందాలనిపించే శక్తి సంపాదించాలని ఈ నవల సూచిస్తోంది. మహాపురుషులుగా

మారడానికి త్యాగశీలత అవసరమని తెలియజేయడం లక్ష్యంగా కూడా కుంతిసేవలద్వారా సూచిస్తోంది.

ఆకతాయి తనంనుంచి విజేతల్ని అందించే స్థాయిని రూపొందించే వ్యక్తిత్వాన్ని , విలువను పెంచడాన్ని ఈ నవల వివరిస్తోంది. అందుకే ముఖచిత్రం యవ్వనవతి అయిన కుంతి సూర్య భగవానుడితో గల సంబంధాన్ని సూచించేలా రూపొందించారు. రాజమాతగా వైభవంగా వెలగ వలసిన దశలో కుంతి వానప్రస్థాన్ని స్వీకరించింది. మోక్షసాధన దిశగా ప్రయాణాన్ని సాగించాలి. సర్వాన్ని వదిలి పోవాలనే ఆదర్శ వ్యక్తిత్వాన్ని గ్రహించేలాచేయడం మరో లక్ష్యం.

## 6. 13. రాజసూయము నవలా లక్ష్యాలు

ధర్మరాజు జీవితం లౌకిక ప్రవృత్తికి సంపుటీకరణంగా నడుచుట రాజసూయ ఘట్టం నుంచి ప్రారంభమవుతోంది. ఈ విషయాన్ని వివరిస్తూ శ్రీకృష్ణుడి వెలుగులో ధర్మరాజు యొక్క జీవన ప్రయాణాన్ని ఎలా సాగించాడో విశదీకరించడం ఈ నవల లక్ష్యం.

లౌకిక హితంకోసం తన ప్రతిష్ఠను త్యాగం చేయడం ధర్మరాజు ప్రత్యేకత. అందువల్లే భారతానికి నాయకుడు అయ్యాడు. ఈ పరిణామానికి మూలం రాజసూయం గా రచయిత నిరూపించదలచుకున్నాడు. ఆ నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ నవలను రాసారు.

మహాభారతంలోఉన్న బ్రహ్మాండ పిండాండ విజ్ఞానంయొక్క సమన్వయం ఉంది. అయా అంశాలు రాజసూయానికి ఒక ప్రతీక. ఈ యాగం ద్వారా కృష్ణుడు అన్ని స్థాయిల్లో ప్రజ్ఞలను ధర్మరాజులో ప్రచోదనం చేసాడని రచయిత భావన.

## 6. 14. సౌందర్యతిలక నవలా లక్ష్యాలు

రాజ్య రక్షణ కర్తవ్యంగా వ్యక్తి త్యాగాలను చేయవలసిన ఆవశ్యకతను వివరించడం. (ఉదా. కళానందుడు, నాగవల్లి) ప్రేమతత్త్వాన్ని వివరిస్తూనే ఎదుర్కోవలసిన కష్టాలను సూచించడం. (ఉదా. సౌందర్యతిలక, కళానందుడు) యుక్తితో కష్టాలను ఎదుర్కోడానికి ఎవరైనా సంసిద్ధం కావచ్చు. (ఉదా. నాగవల్లి) ఆ సంసిద్ధతకు ఆడ, మగ భేదంలేదని తెలపడం. కేవలం అధికారంతో ప్రజాపాలన ఎక్కువగా సాగదని తెలపడం.(ఉదా. జరాసంధుడు) కుటిల ఉపాయాలతో ఎక్కువగా ప్రజలను నమ్మించడంవల్ల తగిన మూల్యం చెల్లించవలసి వస్తుందని తెలియజేయడం. చివరకు ధర్మాన్ని రక్షించడం ఈ నవలకు లక్ష్యాలుగా కనిపిస్తున్నాయి.

ఈ విధంగా భారతకథ ఆధారంగా వచ్చిన నవలను పరిచయం చేయడం వాటిలోని కథా సంవిధానం, నేపథ్యాలను, పాత్రచిత్రణలను, మార్పులు, చేర్పులు, కొన్నినవలలకి నామ సార్థక్యాలను, ప్రత్యేక అంశాలు పేర్కోవడం జరిగింది.

పై నవలను పరిశీలించన తరువాత ఒక్కో రచయిత ఒక్కో దృక్పథంతో నవల రాసి ఉండొచ్చు అని తెలుస్తోంది. మొత్తం మీద భారతంలోని వివిధ అంశాలను తమ పరిశీలన దృష్టితో నిశితంగా పరిశీలించి నవలా రూపంలోకి తెచ్చారని చెప్పొచ్చు.

## 6. 10. ఉపసంహారం :-

మహాభారత ప్రాశస్త్యాన్ని దృష్టిలో పెట్టుకొని అనేక మంది రచయితలు వారి అభిరుచుల మేరకు ఈ నవలలు రాసారు. పరిశోధనలో లభ్యమైన పధ్నాలుగు నవలలను తీసుకొని ఆరు అధ్యాయాలుగా వింగడించడం జరిగింది.

మొదటి అధ్యాయంలో పధ్నాలుగు నవలలను సంక్షిప్త పరిచయం చేయడమైంది. నవలల రచయితలు, నవల నేపథ్యాలు, కథా సంవిధానం విశ్లేషించడం, విశిష్టాంశాలను వింగడించడం. ఈ అధ్యాయంవల్ల భారతకథా సంబంధి నవలల గురించి ఒక అవగాహన కలిగించమూ జరిగింది.

రెండో అధ్యాయంలో శీర్షిక ఆధారంగా నవలను స్త్రీ పాత్ర ప్రధాన నవలగా కొన్నిటిని తీసుకోవడం జరిగింది. వాటిలో ఉన్న కొత్త పాత్రలు, భారతంలోని పాత్రలు గాను, స్త్రీ, పురుష పాత్రలుగాను విభజించి పరిచయం చేయడమైంది. ఆయా నవలలోని పాత్రల మనస్తత్వ పరిశీలనను విశ్లేషిస్తూ పరిశీలన చేయడం జరిగింది.

మూడో అధ్యాయంలో పురుష పాత్ర ప్రధానంగా నవలను తీసుకోవడమైంది. యయాతి ఒక రాజుగా కాకుండా సామాన్య మానవుడిగా అతడికుండే మానసిక స్థితులను రచయిత ఏ విధంగా వివరించాడో విశ్లేషణ చేయడం, ఆయా నవలలోని పాత్రలను పరిచయం చేయడం జరిగింది. ఇంద్ర సింహాసనం నవలలో ఇంద్రుడికి సింహాసనం మరల అధిష్టించడానికి ఇంద్రాణి పడిన కష్టాలు, వాటి వెనుక ఉన్న రాజకీయ నేపథ్యాలు వివరణాత్మకంగా వింగండించడమైంది.

నాలుగో అధ్యాయంలో శీర్షిక ఆధారంగా కథాసంబంధనవలను తీసుకోవడం జరిగింది. పర్వనవల, ఇదా భారతం నవలలోని పాత్రల పరిచయం చేస్తూ, ఆ పాత్రలలో మనస్తత్వ చిత్రణ ఎలా చేసాడో విశ్లేషణాత్మకంగా పరిశీలించడమైంది. కల్పిత పాత్రలు ఎలా కథను ముందుకు తీసుకుపోడానికి సహకరించాయో సూచించడం జరిగింది. చారిత్రక కోణం నుంచి రచయిత పేర్లు పెట్టడంలో ఉన్న ఔన్నత్యాన్ని వివరించడమైంది.

ఐదో అధ్యాయంలో భారతకథా సంబంధి నవలలోని వర్ణనల ద్వారా రచయితలు చేసిన సూచ్యాంశాలు వివరించడం జరిగింది. మూలంలోని అంశాలు ఎలా మార్పులు చేర్పులు చేసారో వాటికి రచయిత ఏ ఉద్దేశంతో చేసి ఉండొచ్చో విశ్లేషణ చేయడమైంది.

ఆరో అధ్యాయంలో నవలల దృక్పథాలు, లక్ష్యాలను విమర్శనాత్మకంగా పరిశోధించడం జరిగింది. ఒక్కో నవలలోని ఉన్న అంశాలు ఆధారంగా ఆయా నవలలోని

లక్ష్యాలను వివరణాత్మకంగా పేర్కోవడమైంది.

ఈ నవలలమీద పరిశోధన చేయకపోతే ప్రధానంగా భారతం మీద ఇంతవరకు సమాజం ఎలాంటి దృష్టి పెట్టిందో తెలుసుకునే అవకాశం తక్కువగా అనిపించింది. మరో ప్రధాన విషయం భారతంలో చెప్పిన అంశాలను మార్చేసుకొని అసలు మూలభారతంలో ఏం ఉందో తెలుసు కోవాలనే స్థితిని కోల్పోయే ప్రమాదం ఉంది. రచయిత దృష్టి, సమాజంలో ఉండే పరిస్థితుల ప్రభావం రెండింటిని ఆధునికీకరణం చేయడంవల్ల మానవులలో ఉండే నైతిక విలువల స్థాయిని అంచనా వేసుకోడానికి ఎవరికి వారుగా చూసుకునే వీలు ఈ నవలలను అధ్యయనం చేసిన ఈ పరిశోధనవల్ల తెలుస్తుంది.

సాహిత్యంలో హితం ఉండాలి. ఆ హితం ఆచరణాత్మకంగా ఉండవలసిన స్థితి కూడా అవసరం. ఆ అవసరాన్ని మరింత స్పష్టం చేయడానికి ఈ నవల అధ్యయనం అవసరం. ఒక రాజు పతన స్థితిని ఆధారంగా  ఒక సామాన్యుడు కూడా తనలో జరుగుతున్న పరిణామాలను అంచనా వేసుకోడానికి 'యయాతి' లాంటి నవలను ఉపకరిస్తాయి. చివరగా మాధవి కథకు సంబంధించిన చాలా విషయాలను కవిత్రయం వారు వదలివేయడం వల్ల మూలంలో ఉన్న ఆయా అంశాలను అనుబంధం - 1 లో ఇవ్వడం జరిగింది.

# అనుబంధం - 1

## మాధవి గురించిన సమాచారం (వ్యాస భారతంలో) :-

గాలవుడు గురుదక్షిణ కోరుకోమని విశ్వామిత్రుణ్ణి బలవంతం చేసాడు. నూట ఆరో అధ్యాయంలో వ్యాసమహర్షి చెప్పాడు. అనర్థంతో మొండి పట్టుదలగలవాడు, ఇతరుల సొమ్ముమీద ఆశతో మైమరచేవాడు, నీచుల మీద ప్రేమఉన్నవాడు, చావులో నిశ్చయం పొందేవాడు, కులము వారికి దుఃఖం, బంధువులకు శోకాన్ని, మిత్రులకు క్లేశాన్ని కలిగించే వాడు, పగవారికి సాయమందించేవాడు, తప్పుదారి పట్టినవాడు అవుతాడు. బంధువులు అలాంటి వాణ్ణి ఎందుకు వారించరు? వాళ్లపై మక్కువ ఉన్న వ్యాసమహర్షి ప్రేమతో ఎందుకు చక్కదిద్దడు? మొదలైన ప్రశ్నలకు వ్యాసుడు సమాధానం చెప్పవల సిందంతా చెప్పాడు. భీష్ముడు బోధించాడు. నారదుడు ఉపదేశించాడు. అయినా లోకంలో మంచిమాట వినడానికి ఎవరూ దొరకరు. మంచికోరే స్నేహితుడు దొరకడమే కష్టం. గొప్ప ఆపదలలో మిత్రుడున్నట్లు బంధువు ఉండడు. మంచివారి మాట వినడమే మంచిది. మొండిపట్టుదల పట్టకూడదు. దీనికి సంబంధించి గాలవుడి కథ నారదుడు జనమేజయుడికి వైశంపాయనుడు వివరించాడు. ఈ సందర్భంలో దుర్యోధనుడు యుద్ధం పాండవులతో పోరు మంచిదికాదు అని పెద్దలు ఉపదేశం చేసారు. దాన్ని పెడచెవిని పెట్టాడు. అలాంటి వాణ్ణి ఉద్దేశించి గాలవుడి కథను చెప్పసాగాడు.

తపస్సు చేస్తున్న విశ్వామిత్రుడి దీక్ష ఎలాంటిదో పరీక్షించాలని ధర్ముడు వసిష్ఠ భగవానుడి రూపంలో వచ్చాడు. ఆ ధర్ముడు సప్తర్షులలో ఒకడైన వసిష్ఠరూపాన్ని ధరించి ఆకలితో నకనకలాడుతూ విశ్వామిత్రుడి ఆశ్రమానికి వచ్చాడు. విశ్వామిత్రుడు పరమాన్నం వండాలని ముంతను పొయ్యిమీద పెట్టి వంటమొదలు పెట్టాడు. వసిష్ఠుడు పరమాన్నం పూర్తయ్యే వరకూ ఆగలేదు. మిగతా తాపసులకు పెట్టిన అన్నాన్నే వశిష్ఠుడు తిన్నాడు. ఈలోగా పరమాన్నం పూర్తిచేసుకొని విశ్వామిత్రుడు వసిష్ఠుడికి పెడదామని వచ్చాడు. నేను తిన్నాను. నీవు అలాగే ఉండమని వసిష్ఠుడు చెప్పి వెళ్ళిపోయాడు. అప్పటినుంచి విశ్వామిత్రుడు ఊపిరి మాత్రమే తీసుకోంటూ ఇంకే రకమైన కదలిక లేకుండా మొద్దులాగ నిలబడే ఉండిపోయాడు. అలాంటి సమయంలో విశ్వామిత్రుడంటే ఇష్టమూ, గురుభావమూ, గౌరవమూ ఉన్న గాలవుడు అనే పేరుతో ఉన్న ముని విశ్వామిత్రుణ్ణి సేవిస్తూ ఉన్నాడు.

నూరేళ్లు పూర్తయ్యాయి. తర్వాత ధర్ముడు మళ్ళీ వసిష్ఠుడి రూపంలో వచ్చి విశ్వామిత్రుడి దగ్గర భోజనం చేయాలనుకుంటాడు. అప్పటివరకూ విశ్వామిత్రుడు గాలిని మాత్రమే తీసుకొని మోస్తుండడం చూసి మొదటవండిన అన్నం అప్పటివరకూ వేడిగా ఉన్నందువల్ల దాన్ని తిని ప్రీతితో వెళ్ళిపోయాడు. ఆ రకంగా ధర్ముడి మాటవల్ల విశ్వామిత్రుడు క్షత్రియభావం వదిలి బ్రాహ్మణత్వాన్నిపొంది ఆనందించాడు. విశ్వామిత్రుడి శిష్యుడైన గాలవుడు చేసిన సేవకు, భక్తికి ఆనందించి 'నాయనా! నేను అనుమతించాను. నీ ఇష్టంవచ్చిన చోటికి వెళ్ళు' అని విశ్వామిత్రుడు అనుమతిచ్చాడు. బ్రహ్మచర్యవ్రతాన్ని ముగించిన ఈ సందర్భంలో తమకేమి దక్షిణ కావాలో సెలవివ్వాలని, దక్షిణ ఇవ్వకపోతే

ఫలవంతం కాదని గాలవుడు విశ్వామిత్రుడికి విన్నవించాడు. నీ సేవావ్రతమే దక్షిణ. ఇంకేమీ అవసరంలేదు. వెళ్ళవచ్చని విశ్వామిత్రుడు మరోసారి చెప్పాడు. అయినా గురుదక్షిణ కోరుకోమని గాలవుడు చాలా సార్లు కోరాడు. చివరకు విశ్వామిత్రుడికి కోపంవచ్చి 'ఒకవైపు శ్యామవర్ణం చెవులు ఉన్న, చంద్రుడిలాంటి కాంతి ఎనిమిదివందలగుర్రాలు గురుదక్షిణగా కావాలని' కోరాడు.(ఉద్యోగపర్వం. 106 అధ్యాయం)

"ఏకత: శ్యామ కర్ణానాం హయనాం చన్ద్రవర్చసామ్
అష్టౌ శతాని మే దేహి గచ్ఛ గాలవ మా చిరమ్" (4-106 అధ్యా- 27శ్లో.)

గాలవుడు విశ్వామిత్రుడి కోరికవిని, చాలా విచారించాడు. చాలా చలించిపోయాడు. నిద్ర పోకున్నాడు. అన్నం తినడం మానేసాడు. చర్మం, ఎముకలు మిగిలినట్లుగా పాలిపోయి, దు:ఖంతో కుమిలిపోసాగాడు. ఎలాగ ఎనిమిది వందల గుర్రాలు సేకరించాలో తెలియక బాధ పడుతున్నాడు. గురువుగారి కోరిక తీర్చలేని గాలవుడు బతుకెందుకని చావడం మేలు అని అనుకొన్నాడు. గురువువల్ల పబ్బం గడుపుకొని ఆయన కోరిక తీర్చలేకపోతున్నాను. దేవతలు ఏది కోరినా ఇవ్వగలవాడు, ముల్లోకాలకు ప్రభువు అయిన విష్ణుమూర్తిని శరణు పొందాలని నిశ్చయించు కున్నాడు. ధ్యానంలోకి వెళ్ళిపోయాడు.

అలాంటి సమయంలో గాలవుడి మిత్రుడు వినత కొడుకు అయిన గరుడుడు వచ్చి "నీవు నాకు మిక్కిలి ప్రియమిత్రుడవు. మిత్రులందరకు ఇష్టుడైన చెలికాడవు. నీవు కోరెడు కోరిక తీర్చ గలవాడు, తీర్చే సామర్థ్యం ఉన్నవాడు అయిన విష్ణువుతో మాట్లాడాను, అతడు నీ కోర్కెను మన్నించి ఉంటాడు' అని గాలవుడితో అన్నాడు. (ఉద్యోగ. 107 అధ్యాయం)

గరుడుడు గాలవుడికి తూర్పునుంచి మొదలుపెట్టి అన్ని దిక్కులు వర్ణించాడు (108-113అధ్యాయాలు) 113వ అధ్యాయం చివరలో పెద్దగా దు:ఖిస్తున్న గాలవుడు గరుడుడితో గురుదక్షిణ విషయంలో చెప్పాడు. అప్పుడు యయాతి సాయం చేయడానికి తగిన వాడని తలచి మిత్రుణ్ణి తీసుకొని గరుత్మంతుడు తీసుకెళ్ళాడు.(114 అధ్యాయం)

యయాతి గాలవుడికివ్వడానికి అన్ని అశ్వములుగాని, అంతధనంగాని లేవు. అయినా మిత్రుడి పని చేయలేకపోయినా గాలవుడి ఆశను నిరాశ చేయదలచలేదు. దానమివ్వమని వచ్చిన వాడికి లేదని పలికి అతడి ఆశను వమ్ము చేయడం కంటే మరొక ఘోర పాతకములేదని తన కూతురు మాధవి తీసుకోమని యయాతి అన్నాడు. గాలవుడు ఆ కన్యను స్వీకరించాడు. తరువాత గరుడుడు వెళ్ళిపోయాడు. గాలవుడు ఎవరు ఎక్కువ శుల్కాన్ని ఇస్తారని ఆలోచించి ఇక్ష్వాక రాజు హర్యశ్వుడు తగినవాడని అతడి దగ్గరకి మాధవిని తీసుకువెళ్ళాడు.

గాలవుడు హర్యశ్వమహారాజుని దర్శించి 'రాజేంద్రా! ఈమె నా బిడ్డ. కాన్పులతో కులమును వృద్ధి పరుచును. శుల్కముతో నీ భార్యగా స్వీకరించు' అని శుల్కం విషయాన్ని విశదీకరించాడు. (4-115 అధ్యాయం)

"తముపాగమ్య విప్ర: స హర్యశ్వం గాలవో2 బ్రవీత్
కన్యేయం మమ రాజేన్ద్ర ప్రసవై: కులవర్ధనీ
ఇయం శుల్కేన భార్యార్థం హర్యశ్వ ప్రతిగృహ్యతామ్
శుల్కం తే కీర్తి యిష్యామి తచ్ఛ్రుత్వా సంప్రధార్యతామ్"(4-115అ. 20-21శ్లో.)

హర్యశ్వుడు సంతానంకోసం చాలా రకాలుగా భావించాడు. మాధవి అందాన్ని ఇలా పరిశీలిస్తున్నాడు- 'ఈ కన్య ఎత్తుగా ఉండవలసిన ఎత్తు ఉంది. సన్నగా ఉండాల్సిన చోట సన్నగా ఉంది. ఎరుపు రంగు కలిగి ఉంది. పిరుదులు, నుదురు, తొడలు, ముక్కు ఎత్తుగానే ఉన్నాయి. కంఠ స్వరం, దేహపుష్టి, బొడ్డు మొదలైనవి గంభీరముగానే ఉన్నాయి. అరచేతులు, అరకాళ్ళు, కంటి తుదలు, గోళ్లు ఎఱ్రగానే ఉన్నాయి.

చాలామంది దేవతలు, రాక్షసులు ప్రీతితో చూడదగినది. పెక్కు గంధర్వ శాస్త్రాలు అభ్యసించింది. చాలా మంచి లక్షణాలునిండుగా ఉన్నాయి. ఇలాంటి కన్య చాలా మంది పిల్లలకు తల్లి కాగలదు. ఈమె చక్రవర్తి కాగల కొడుకును కనగలదు. బ్రాహ్మణ శ్రేష్ఠా! నా సంపదను పరికించి శుల్కము ఎంతకావాలో చెప్పమని అన్నాడు. (4-116, 2-5శ్లో.)

ఎనిమిది వందల గుఱ్రాలు ఒకవైపు శ్యామ వర్ణం ఉన్నవి ఇచ్చి, ఈమెవల్ల అగ్నులకు ఆరణి లాంటి కొడుకును ఈ శుభాంగి ఇవ్వగలదు అని గాలవుడు అన్నాడు. గాలవుడితో దీనంగా హర్యశ్వుడు 'నీవు చెప్పిన లక్షణములు ఉన్న గుఱ్ఱాలు రెండువందలు మాత్రమే ఉన్నాయి. మిగతా గుఱ్ఱాలు చాలా ఉన్నాయి తీసుకోమని అన్నాడు. గాలవా! ఆ రెండువందల గుఱ్ఱాలను తీసుకొని ఈమెవల్ల ఒక్కకుమారుణ్ణి పొందే కోరికను తీర్చమని అడుగుతాడు.(4-116, 5-9శ్లో.) హర్యశ్వుడి మాటలు విన్న మాధవి 'నాకు వేదవిద్యలో ఆరి తేరిన ఒక ఋషి కామపులైన తర్వాతకూడా నీవు కన్యవే అవుతావని ఒక వరాన్ని ఇచ్చాడు అని చెప్పింది-

'మమ దత్తో వర: కశ్చిత్ కేనచిద్బ్రహ్మ వాదినా
ప్రసూత్యన్తే ప్రసూత్యన్తే కన్యైవ త్వం భవిష్యసి' (4-116, 10శ్లో.)

ఇలా నలుగురు రాజులనుంచీ నీవు ఎనిమిది వందల గుఱ్ఱాలను సంపాదించవచ్చు. నాకు నలుగురు కొడుకులు పుడతారు. ఇది నాకు తోచిన పద్ధతి ఇంక నీ ఇష్టం అని మాధవి చెప్పింది.(4-116,10-13శ్లో.)

అపుడు గాలవుడు శుల్కంలో నాల్గవభాగం(200) గుఱ్ఱాల్ని ఇచ్చి ఈ కన్యను స్వీకరించి, ఒక కొడుకును పొందమని రాజుతో గాలవుడు చెప్పాడు. రాజు ఆమెను స్వీకరించి, గాలవుణ్ణి పొగిడి కట్టుబాట్లకు లోబడి శుభముహూర్తంలో కొడుకును పొందాడు. ఆ కొడుకు పేరు 'వసుమనుడు'. వసువులకన్నా గొప్పధనంకలవాడుగా, సూర్యతేజస్సు కలిగి యజ్ఞ యాగాదులలో గొప్ప ధనాన్ని దక్షిణ ఇచ్చేవాడుగా పేరుపొందాడు. ఒక రోజు గాలవుడు వచ్చి, 'తను భిక్షకోసం మరో రాజు దగ్గరికి వెళ్ళాలని మాధవిని తిరిగి ఇమ్మని అడిగాడు. మాధవిని రాజు ఇచ్చేసాడు. మాధవి మిరుమిట్లు కలిగిన ధనాన్ని, రాజ సంపదను వదిలి తన ఇష్టాన్ని అనుసరించి మళ్ళీ కన్యగా గాలవుడి వెంట నడిచింది. గాలవుడు రాజు దగ్గరే గుఱ్ఱాల్ని ఉంచమన్నాడు. తర్వాత కబురుపెట్టినప్పుడు పంపమని చెప్పాడు.

దివోదాసుడి దగ్గరకి మాధవితో బయలుదేరాడు.

గొప్పశక్తి కలవాడు, భీమసేనుడి కొడుకు, కాశీరాజు, సమర్థుడైనవాడు దివోదాస రాజు. అక్కడికి వెళ్దాం అని మాధవికి గాలవుడు చెప్పాడు. రాజుకు విషయం తెలిసాక, ఒక కొడుకును కనేందుకు సరిపడే సంపద ఉందని గాలవుడికి చెప్పాడు. గాలవుడు మాధవినిచ్చాడు. రాజు శాస్త్ర ప్రకారం మాధవిని భార్యగా స్వీకరించాడు. సూర్యుడూ సంజ్ఞాదేవిలాగ, అగ్ని స్వాహా, ఇంద్ర శచీదేవిలాగ చంద్రుడు రోహిణిలాగ యముడు ధూమోర్ణలాగ, వరుణుడు గౌరిలాగ, కుబేరుడు బుద్ధిలాగ, నారాయణుడు లక్ష్మిలాగ, సముద్రుడు గంగలా, రుద్రుడు పార్వతిలా, చ్యవనుడు సుకన్యతో ఉన్నట్లు, వసిష్ఠుడి కొడుకు శక్తి అదృశ్యన్తిలాగ, వసిష్ఠుడు అక్షమాలతో, పులస్త్యుడు సంధ్యతో విహరించినట్లు, అగస్త్యుడు లోపాముద్రతో, సత్యవంతుడు సావిత్రితో, భృగుడు పులోమతో సశ్యపుడు అదితితో, ఋచీకుడి కొడుకు జమదగ్ని రేణుకతో, విశ్వామిత్రుడు హైమవతితో, బృహస్పతి తారతో, శుక్రుడు శతపర్వతో సుఖపడినట్లు ఆనందాన్ని దివోదాసుడు పొందాడు.

మాధవికి 'ప్రత్యర్థునుడు' కొడుకు దివోదాసుడివల్ల పుట్టాడు. అనుకొన్న సమయంలో గాలవుడు వచ్చి కన్యను తీసుకొని గుఱ్ఱాలను ఉంచమని వెళ్ళిపోయాడు.(4-117 అధ్యాయం).

మాధవి కన్యత్వాన్నిపొంది గాలవుడి వెంట బయలుదేరింది. ఉశీనర(దేశ)రాజు, భోజనగర పరిపాలకుడి దగ్గరకు వెళ్ళి సంగతి గాలవుడు చెప్పి పుత్రుల్ని కనమని ప్రేరేపించాడు. తన దగ్గర రెండువందల గుఱ్ఱాలు మాత్రమే ఉన్నాయని ఒక కొడుకు కనేందుకు మాధవిని ఉశీనరుడు స్వీకరించాడు. మాధవితో ఉశీనరుడు కొండగుహలు, నదులు, సెలయేళ్ళు, వింత అనిపించే తోటలు, అడవుల్లోను, అందమైన మందిరాల్లో, మేడలపై కిటికీలతో ఉండే విమానాలలోను అంతఃపురాల్లోను విహరించాడు. బాలసూర్యుడి కాంతితో శిబి మాధవికి పుట్టాడు. గాలవుడు వచ్చి మాధవిని తీసుకెళుతుండగా గరుత్మంతుడు చూసాడు.(4-118 అధ్యాయం)

గాలవుణ్ణి చూసి గరుడుడు నవ్వి 'అదృష్టంవల్ల నీ కోరిక నెరవేరిందని' అన్నాడు. ఇంకా నాల్గవ వంతు మిగిలి ఉంది. ఇంకా గురుదక్షిణ పూర్తి కాలేదని గాలవుడు చెప్పాడు. ఇంకా ప్రయత్నించిన నీ పని పూర్తికాదని గరుడుడు అన్నాడు. పూర్వం కన్యాకుబ్జదేశంలో గాధికొడుకు సత్యవతిని ఋచీకుడు భార్యగా ఇమ్మని అడిగాడు. అయ్యా! ఒక వైపు శ్యామవర్ణం ఉన్న చంద్రుడి వంటి రంగు ఉన్న వెయ్యి గుఱ్ఱాల్ని ఇవ్వమని గాధి అన్నాడు. ఋచీకుడు అలాగే అని వరుణుడి భవనంలోకి వెళ్ళి అశ్వత్థతీరంలో వెయ్యి గుఱ్ఱాల్ని సంపాదించి గాధిరాజుకు ఇచ్చాడు. ఆ గాధిరాజు పుండరీకయాగం చేసి ఆ గుఱ్ఱాలను బ్రాహ్మణులకు దానం చేసాడు. వాళ్ల నుంచి ఆ రాజులు(హర్యశ్వ, దివోదాస, ఉశీనరులు) రెండేసి వందలు చొప్పున కొన్నారు. మిగిలిన నాలుగువందల గుఱ్ఱాలు తీసుకొని వస్తున్నప్పుడు దారిలో వితస్తానదిలో కొట్టుకొని పోయాయి. ఇప్పుడు దొరికిన ఆరువందల గుఱ్ఱాలతో పాటు, రెండువందల గుఱ్ఱాలకు బదులుగా మాధవిని విశ్వామిత్రుడికే

సమర్పించమని గరుడుడు సలహా ఇచ్చాడు. గాలవుడు సరే అన్నాడు. గరుత్మంతుడు, మాధవి, ఆరువందల గుఱ్ఱాలతో సహా గాలవుడు విశ్వామిత్రుణ్ణి చేరారు. గురువుకు గాలవుడు విషయం చెప్పాడు.

విశ్వామిత్రుడు గాలవుడు తెచ్చిన మాధవిని చూసి 'గాలవా! ఈ కన్యని ముందే ఇచ్చి ఉంటే నలుగురు కొడుకులు నాకే పుట్టేవారు కదా! సరే. ఒక్క కొడుకునే ఈమె వల్ల పొందుతాను. గుఱ్ఱాలు నా ఆశ్రమంలో చేరి తిరుగుతుంటాయని అన్నాడు. విశ్వామిత్రుడి వల్ల మాధవికి 'అష్టకుడు' పుట్టాడు. పుట్టిన వెంటనే ఆ బాలుడికి సంపదలు, గుఱ్ఱాల్ని అప్పగించాడు. రాజధర్మాలు తెలియజేసాడు. ఆ తరువాత గాలవుడికి మాధవిని విశ్వామిత్రుడి ఇచ్చేసాడు. గాలవుడు సుపర్ణుడితో కలసి గురుదక్షిణ చెల్లించుకొని ఆనందంతో మాధవితో 'అమ్మా! నీ కొడుకొకడు దానపతి, మరొకడు శూరుడు, ఇంకొకడు సత్య, ధర్మాల్లో ప్రీతికలవాడు, మరొకడు యజ్ఞయాగాలు చేసేవాడు అవుతారు. చక్కని తల్లీ! రా! నీ తండ్రిని కొడుకులతో గట్టెక్కించావు. నలుగురు కొడుకులు రాజులవుతారు. నన్ను తరింపజేసావు' అన్నాడు గరుత్మంతుడి దగ్గర సెలవు తీసుకొని మాధవిని యయాతికి అప్పజెప్పడానికి అడవిదారిలో వెళ్ళిపోయారు.(4-119 అధ్యాయం)

శక్తులుపోయిన యయాతి, ఉన్నచోటునుంచి ఊగి, ఆసనంలోంచీ జారి వణుకిపోతూ, బెదరి పోతూ, తెలివితప్పి, పట్టుతప్పి, ఆభరణాలు, వస్త్రాలు జారిపోగా వట్టి మనస్సుతో కట్టేలాగ భూమిమీద పడిపోయి ఉన్నాడు. 'ఇదిఏమి? నేను మనస్సులో ధర్మాన్ని పాడుచేసే పాపాన్ని ధ్యానించానా? ఉన్నచోట ఉండలేక పోతున్నానని' విచారించాడు. అందరూ జారి పోతున్న యయాతిని చూసారు. పుణ్యం తగిరిపోయినవారిని కిందకు తోసే వ్యక్తి రాజు ఆజ్ఞ మేరకు అక్కడికి వచ్చి, 'రాజకుమారా! నీవు చాలా పొగరుతో చిన్నా పెద్దా తెలియక ఉన్నావు. అందర్నీ అవమానించావు. అందుకే నీవు స్వర్గం నుంచి జారిపోతున్నావు. పో! పడు. నిన్నెవరూ ఆపరు' అని చెప్పాడు.

కిందకు పడిపోతున్న యయాతి తన స్థితిని చూసి మంచివారి దగ్గర పడాలిగాక అని మూడుమార్లు మనస్సులోనే అనుకున్నాడు. అదే సమయంలో నైమిశారణ్యంలో రాజశ్రేష్ఠుల మధ్యలో పడ్డాడు. ప్రతర్దనుడు, వసుమనుడు, శిబి, అష్టకుడు అక్కడ వాజపేయి యాగంతో దేవేంద్రుణ్ణి తృప్తి పరుస్తున్నారు. వాళ్ల యజ్ఞం నుంచి వస్తున్న పొగ స్వర్గద్వారం వరకు ఉంది. అది భూమికి నదిలాగ ఉంది. యయాతి దాన్ని ఆధారంగానే వాసన చూస్తూ భూమి మీద పడ్డాడు. దివ్య సంపదలతో ఉన్నవారు, యజ్ఞం పూర్తిచేసి అవభృథ స్నానం చేసిన వారు, వారి చుట్టాలు, ఉన్న సమయంలో మధ్యలో యయాతి పడ్డాడు. ఆ నలుగురు యయాతిని ఎవరని ప్రశ్నించారు. యక్షుడవా? దేవుడవా? గంధర్వుడవా? రాక్షసుడివా? మానవుడివి మాత్రం కావు. ఏం కావాలని వచ్చావని అడిగారు.

యయాతి తనని పరిచయం చేసుకొని స్వర్గంలో పుణ్యం తగ్గిపోవడంవల్ల ఇలా జారి పడుతూ మంచి వాళ్లమధ్య పడాలని అనుకోడం ఇక్కడ పడడం జరిగిందని చెప్పాడు. నీ కోరిక సత్యమవ్వాలి. మా యజ్ఞఫలాన్ని స్వీకరించమని ఆ నలుగురు సోదరులు కోరారు.

'నేను బ్రాహ్మణుణ్ణి కాను. క్షత్రియుణ్ణి. ఇతరులధనంతో నాకు పనిలేదు' అని చెప్పాడు. ఈలోగా మృగంలాగ తిరుగుతున్న మాధవి యయాతిని చూసి నమస్కరించి 'నీవు వచ్చిన పని మేం చేయవల్సిన పని చెప్పమని' కోరింది. యయాతికి మాధవి తన కుమారులను పరిచయం చేసింది. యయాతికి మనుమలుగా చెప్పింది. తను యయాతికి కూతురుని అని వివరించింది. మాధవి కూడబెట్టిన ధర్మంలో సగం స్వీకరించమని కోరింది. కుమారులందరూ యయాతి తాతకి నమస్కరించారు. ఆ సమయంలో గాలవుడు వచ్చి, 'నా తపస్సులో ఎనిమిదవ వంతు స్వీకరించ'మని చెప్పాడు. (4-121 అధ్యాయం)

దానపతిగా పేరుపొందిన వసుమనుడు అన్ని వర్ణాల్లో నిందలేని ప్రశంస లోకంలో ఏది పొందాలో అది నీకిస్తాను. ఆ పుణ్యం నీలో కలుపుకోమన్నాడు. దానమివ్వడమే శీలంగా, సహనంగా ఉన్నవాడు ఏ ఫలాన్ని పొందుతాడో అగ్ని నిత్యం పూజించేవాడు ఏ ఫలాన్ని పొందుతాడో అదంతా నీకు చేరుతుందని చెప్పాడు.

క్షత్రియుల్లో శ్రేష్ఠుడైన ప్రతర్థనుడు నిత్యమూ ధర్మమంటే ఇష్టంతో, యుద్ధంలో శ్రద్ధ గల క్షత్రియ వంశంలో పుట్టి పొందిన కీర్తిని, వీరత్వ ఫలాన్ని యయాతికి ఇచ్చాడు. శిబి సత్యత్వాన్ని దానంగా ఇచ్చాడు. అష్టకుడు వందల పుండరీకయాగాలు, గోమేధములు, వాజపేయ యాగాల ఫలాన్ని దానంగా ఇచ్చాడు. ఈ రకంగా జారిపడిన కొద్దికాలంలోనే యయాతి మళ్లీ నాలుగు రాజవంశాల్లో పుట్టిన మనుమలు చేసిన దానఫలంవల్ల శాశ్వత స్వర్గలోకాన్ని పొందాడు.(4-122 అధ్యాయం)

స్వర్గలోకానికి వస్తున్న యయాతిని దేవర్షులు, రాజర్షులు మొదలైన వారంతా సాదరంగా ఆహ్వానించారు. యయాతి బ్రహ్మను ఎందుకు పడ్డానని అడిగాడు. స్వయంకృత అపరాధంవల్ల సంపాదించిన పుణ్యం పాడుచేసుకున్నావని ఇక శాశ్వతమైన పుణ్యం పొందావని ఇక స్వర్గంనుంచి సుఖాల్ని అనుభవించవచ్చని బ్రహ్మ యయాతికి వివరించాడు. నేనింతవాడనన్న అభిమానమే ఛీకొట్టించిందని, దురంహకారులకు ఎప్పటికీ శాంతి ఉండదని, మిసిమిపాటు, బలము, హింస, నమ్మకాన్ని వంచించుట, మోసగించడం వల్ల శాశ్వతంగా స్వర్గలోకం సిద్ధించదని బ్రహ్మ తెలియజేసాడు. (4-123అధ్యాయం)

ఇలా ఉన్న కథను తీసుకొని మాధవి జీవితాన్ని ఆధునిక స్త్రీ జీవితంతో కొంతవరకు మిళితం చేసి నవలాగా అనుపమనిరంజన రాసారు. ఈ మూలకాంశాన్ని తెలుగు భారతంలో లేదు. కాబట్టి అనుబంధంలో ఇవ్వడం జరిగింది.

# అనుబంధం-2

ద్రౌపది గురించి విశేషంగా చర్చలు జరిగాయి. దీనికి కారణం ఆమె వ్యక్తిత్వం, పతివ్రతా లక్షణాలు మొదలైనవి. అయితే ఇప్పటికీ ఆమె ఆదర్శవంతంగా, ఆరాధ్య దేవతగా కీర్తి పొందడం గమనించదగిన విశేషం. జానపదులకు ద్రౌపదీదేవి శక్తి స్వరూపిణి. దుష్టులకు భయంకరమైనది. ఆదిశక్తియే రేణుకాదేవి, సీతాదేవి, ద్రౌపదీదేవి అవతారాలను దాల్చిందని, ముగ్గురు మూర్తులకు మూలమని జానపదుల అభిప్రాయం.(జానపదుల ద్రౌపది(వ్యాసం). రావి ప్రేమలత)

ద్రౌపదికే మరో పేరు కృష్ణ. సింధు సమాజంలోని స్త్రీ ప్రధాన గణమాత నిరృతి. ఈమె కృష్ణవర్ణం కలది. పితృ ప్రధానులైన ఆర్యులు ఈమెను నరక దేవతగా, పేర్కొని, తర్వాత పాతాళలోకవాసినిగా చెప్పారు.(ఋగ్వేదం 8-37, 7; 1-24,9) నిరృతి దేవత కూతురు నైరుతివాక్. ఈమెకు సంబంధించిన వర్ణన అథర్వణ వేదంలోఉంది. ఈమె రాష్ట్రదేవి, స్వామిని, గణము ధనాన్ని రక్షించేదని ఉంది. (అధర్వణవేదం 4- 30) ఋగ్వేదంలో ఆర్యులు, అనార్యులను కృష్ణ వర్ణులుగా, కృష్ణయోనులుగా పేర్కొన్నారు. విశ్వామిత్రుడు, ఆర్యుల శత్రువులైన కృష్ణవర్ణులను సంహరించమని ఇంద్రుణ్ణి స్తుతించాడు. అంగీరస గోత్రుడు ఆర్యుల శత్రువులను కృష్ణయోనులని అన్నాడు. ఓడిన స్త్రీలను, పురుషులను ఆర్యులు దాస, దాసీలుగా చేసుకొని పనులు చేయించు కొనేవారు. (ఋగ్వేదంలో ఆర్యులు- రాహుల్ సాంకృత్యాయన్)

శక్తి స్వరూపిణి అయిన ద్రౌపది వ్యాసభారతంలో యజ్ఞంనుంచి పుట్టింది. జానపదుల దృష్టిలో పంచపాండవులకు పత్నిగా ఉందేకానీ, వారితో దాంపత్య జీవితాన్ని అనుభవించలేదు. కథా గమనం కోసం ద్రౌపదిని భార్యగా గ్రహించినప్పటికీ, స్వసుఖంకోసం సవ్యసాచి సుభద్రను, ఉలూపిని, చిత్రాంగదలను వివాహం చేసుకున్నాడు. భీముడు హిడింబిని, నకులుడు భద్రావతిని, సహదేవుడు ఇంద్రావతిని పెళ్లి చేసుకున్నారు. ధర్మరాజు యోగిస్వరూపుడు కాబట్టి ఇహలోకాల సుఖాలను అతణ్ణి మభ్యపెట్టలేదు. ద్రౌపదికి పుట్టిన ఉపపాండవులు కథ అంతా చదువుకున్నోల్ల కట్టుకథగా కొందరు భావించారు. ఏది ఏమైనప్పటికీ ద్రౌపది, పాండవాదులు ఇప్పటికీ పూజలు అందుకోవడం విశేషం.

ద్రౌపది తిరునాళ్ళు లేదా ధర్మరాజు తిరణాల ఒకటి ఆర్కాడు జిల్లాకు ప్రత్యేకం. రాష్ట్ర విభజన జరిగినప్పుడు ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లాలో దాదాపు ఎనభైకి పైగా గ్రామాల్లో ఈ తిరునాళ్ళు జరుగుతున్నట్లు పరిశోధకులు గుర్తించారు.[1] చిత్తూరు జిల్లా, పచ్చికాపలం లో 2002సం.లో జరిగిన ద్రౌపది తిరునాళ్ల వేడుకలను యథాతథంగా పుస్తక రూపంలో జానపద గిరిజన విజ్ఞానపీఠం ముద్రించింది. నెల్లూరు జిల్లా, ఉత్తర ఆర్కాడు జిల్లాల్లో ఇప్పటికీ ద్రౌపదమ్మ పేరుతో కొన్ని ఆలయాలున్నాయి. ద్రౌపదీ దేవి ఆలయంలో పోతురాజు విగ్రహం ఉండడం, ఉత్సవాలు చేయడం కూడా ఇప్పటికీ ఉంది.

[1] చిత్తూరుజిల్లా వీధినాటకాలు -ఒక పరిశీలన: వి. గోవిందరెడ్డి

# అనుబంధం-2

ద్రౌపది గురించి విశేషంగా చర్చలు జరిగాయి. దీనికి కారణం ఆమె వ్యక్తిత్వం, పతివ్రతా లక్షణాలు మొదలైనవి. అయితే ఇప్పటికీ ఆమె ఆదర్శవంతంగా, ఆరాధ్య దేవతగా కీర్తి పొందడం గమనించదగిన విశేషం. జానపదులకు ద్రౌపదీదేవి శక్తి స్వరూపిణి. దుష్టులకు భయంకరమైనది. ఆదిశక్తియే రేణుకాదేవి, సీతాదేవి, ద్రౌపదీదేవి అవతారాలను దాల్చిందని, ముగ్గురు మూర్తులకు మూలమని జానపదుల అభిప్రాయం.(జానపదుల ద్రౌపది(వ్యాసం). రావి ప్రేమలత)

ద్రౌపదికే మరో పేరు కృష్ణ. సింధు సమాజంలోని స్త్రీ ప్రధాన గణమాత నిరృతి. ఈమె కృష్ణవర్ణం కలది. పితృ ప్రధానులైన ఆర్యులు ఈమెను నరక దేవతగా, పేర్కొని, తర్వాత పాతాళలోకవాసినిగా చెప్పారు.(ఋగ్వేదం 8-37, 7; 1-24,9) నిరృతి దేవత కూతురు నైరుతివాక్. ఈమెకు సంబంధించిన వర్ణన అధర్వణ వేదంలోఉంది. ఈమె రాష్ట్రదేవి, స్వామిని, గణము ధనాన్ని రక్షించేదని ఉంది. (అధర్వణవేదం 4- 30) ఋగ్వేదంలో ఆర్యులు, అనార్యులను కృష్ణ వర్ణులుగా, కృష్ణయోనులుగా పేర్కొన్నారు. విశ్వామిత్రుడు, ఆర్యుల శత్రువులైన కృష్ణవర్ణులను సంహరించమని ఇంద్రుణ్ణి స్తుతించాడు. అంగీరస గోత్రుడు ఆర్యుల శత్రువులను కృష్ణయోనులని అన్నాడు. ఓడిన స్త్రీలను, పురుషులను ఆర్యులు దాస, దాసీలుగా చేసుకొని పనులు చేయించు కొనేవారు. (ఋగ్వేదంలో ఆర్యులు- రాహుల్ సాంకృత్యాయన్)

శక్తి స్వరూపిణి అయిన ద్రౌపది వ్యాసభారతంలో యజ్ఞంనుంచి పుట్టింది. జానపదుల దృష్టిలో పంచపాండవులకు పత్నిగా ఉందేకానీ, వారితో దాంపత్య జీవితాన్ని అనుభవించలేదు. కథా గమనం కోసం ద్రౌపదిని భార్యగా గ్రహించినప్పటికీ, స్వసుఖంకోసం సవ్యసాచి సుభద్రను, ఉలూపిని, చిత్రాంగదలను వివాహం చేసుకున్నాడు. భీముడు హిడింబిని, నకులుడు భద్రావతిని, సహదేవుడు ఇంద్రావతిని పెళ్లి చేసుకున్నారు. ధర్మరాజు యోగిస్వరూపుడు కాబట్టి ఇహలోకాల సుఖాలను అతణ్ణి మభ్యపెట్టలేదు. ద్రౌపదికి పుట్టిన ఉపపాండవులు కథ అంతా చదువుకున్నోల్ల కట్టుకథగా కొందరు భావించారు. ఏది ఏమైనప్పటికీ ద్రౌపది, పాండవాదులు ఇప్పటికీ పూజలు అందుకోవడం విశేషం.

ద్రౌపది తిరునాళ్ళు లేదా ధర్మరాజు తిరణాల ఒకటి ఆర్కాడు జిల్లాకు ప్రత్యేకం. రాష్ట్ర విభజన జరిగినప్పుడు ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లాలో దాదాపు ఎనభైకి పైగా గ్రామాల్లో ఈ తిరునాళ్ళు జరుగుతున్నట్లు పరిశోధకులు గుర్తించారు.[1] చిత్తూరు జిల్లా, పచ్చికాపలంలో 2002సం.లో జరిగిన ద్రౌపది తిరునాళ్ల వేడుకలను యథాతథంగా పుస్తకరూపంలో జానపద గిరిజన విజ్ఞానపీఠం ముద్రించింది. నెల్లూరు జిల్లా, ఉత్తర ఆర్కాడు జిల్లాల్లో ఇప్పటికీ ద్రౌపదమ్మ పేరుతో కొన్ని ఆలయాలున్నాయి. ద్రౌపదీ దేవి ఆలయంలో పోతురాజు విగ్రహం ఉండడం, ఉత్సవాలు చేయడం కూడా ఇప్పటికీ ఉంది.


[1] చిత్తూరుజిల్లా వీధినాటకాలు -ఒక పరిశీలన: వి. గోవిందరెడ్డి




DRAUPADI TEMPLE, MULAPETA, NELLORE TOWN, ANDHRA PREADESH




**DROUPADI TEMPLE VIEW AT MOOLAPETA, NELLORE TOWN**





**DROUPADI AND PANDAVAS** IN THE COVER PAGES OF NOVEL *DROUPADI.*





TITLE PAGES OF ***DROUPADI*** NOVELS





**Droupadi, the cover page of**
***The women of the Mahabharata***




**DROUPADI**, THE COVER PAGE OF
*YAGYNA SENI* NOVEL.




**Droupadi, The cover pages of *Dharmaraja Tirunallu &* Douryodhana's picture**
prepared with clay and colours in Droupadi utsava time.




**Krishna in the cover page of *kridamayudu.***




**Krishna in the cover page of Purushameda**




**Kunthi and god of surya in *raajamatha* novel.**




**Inside page of *Mahabharata vayjanthi***

**This map is taken from the book of Rajasuya rahasyam by Pendyala Subrahmanya Sastry. (1938)**

# అనుబంధం - 3

## మహాభారతకథాభాస నవలలు కొంత సమాచారం

భారత కథ కొంత, భాగవతం కథ కొంత, సృజన కొంత, ఈ మూడూ కలిపికానీ, లేక వేరే విషయాలను జోడించికూడా కొన్ని నవలలు వచ్చాయి. వాటిని ఇక్కడ పరిచయం చేయడం జరుగుతోంది.

*దమయంతీ స్వయంవరము*

ఈ నవలను విశ్వనాథ సత్యనారాయణ రాసారు. దీనిలో శీర్షికా భాగం భారత కథను తలపించేలా అనిపిస్తోంది. కానీ ఇందులోని విషయాన్ని పరికిస్తే, భారతకథాభాస నవలగా తెలుస్తుంది. దమనశ్రీ సి. పురుష్ అనే పాత్రద్వారా దమయంతి గురించి చెబుతాడు. ఈ కథకు భారతంలోని దమయంతికథను పూర్తిగా సంబంధం లేదు. స్వయంవరం అంటే ఏమిటో వివరిస్తూ అపండితులును, వారి దగ్గర ఉండే పండితమన్యులను విమర్శిస్తూ రాసిన నవల అది.

*ఈనాటి శకుంతల*

ఈ నవలను సి. ఆనందారామం రాసారు. శకుంతలకు పెళ్ళికాకముందు పిల్లలు పుట్టిన విషయంలో ఆదర్శంగా తీసుకొని, సమాజాన్ని ఎలా ఎదుర్కోవచ్చో నిరూపించిన నవల ఇది. భారతంలోని శకుంతల పాత్ర మాత్రమే తీసుకొని సాంఘిక పరిస్థితులను జోడించి రాసిన నవల ఇది. కాబట్టి ఇది భారతకథాభాస నవలగా చెప్పొచ్చు.

*గాంధారి*

ఇది మరాఠీభాషలో వచ్చిన నవల. దీన్ని నా.ధో. మనోహర్ రాసారు. తెలుగులో అయాచితుల హనుమచ్ఛాస్త్రి అనువదించారు. మరాఠీలో 1973లో వెలువడింది. తెలుగులో 1995 సం.లో అనువాదం పొందింది. జానపదుల జీవనాన్ని విశ్లేషిస్తూ రచించిన నవల. గాంధారి అనేది ఒక పల్లెకు ఉన్న పేరుగా చెప్పడం ఇందులో ప్రత్యేకత. నిజాం రాజ్యపాలన అస్తమించిన తర్వాత గాంధారి గ్రామంలో వచ్చిన పరివర్తనను ఈ నవలలో చిత్రించారు. నిజాం పాలనలో అనుభవించిన ఉపద్రవాలను ఎదుర్కొంటూ, ఆ తరువాత కాలంలో మంచిరోజులు ఎలా వచ్చాయో రచయిత చూపించాడు. కేవలం శీర్షిక ఆధారంగా ఇది భారతకథను సూచించడం తప్ప, ఇందులో భారతం కథ లేదు. కాబట్టి ఇది భారతకథాభాస నవలగా సూచించవచ్చు.

*సావిత్రి*

ఈ నవలను చివుకుల పురుషోత్తం రాసారు. ఈ నవలలో సావిత్రికథను సుందరరామయ్య సావిత్రి అనే పద్దెనిమిదేళ్ళ అమ్మాయికి సావిత్రికథను చెప్పడం ఉంటుంది. మధ్యలో చాలా సంభాషణలు ఉంటాయి. సావిత్రి సత్యవంతుల కథను వినడంద్వారా పతివ్రతా లక్షణాలు వంట బట్టించుకొనే తత్త్వం ఉన్న పాత్రగా సావిత్రి కనబడుతోంది. సావిత్రికథలో ఉన్న భార్యాభర్తల అనురాగం, పాతివ్రత్యధర్మాలు

స్పృశించడం ఉంది. శీర్షిక పరంగా భారతవిషయంగా అనిపించినా, ఇది భారత కథాభాసనవల. చలం సావిత్రిలో కూడా ఇలాంటి విషయాలను, స్త్రీ స్వేచ్ఛను చూడొచ్చు. అరబిందో సావిత్రి యోగ సావిత్రిగాను, **legend and a symbol** గాను చూపించారు. **free verse** లో రచించారు. ఇలాంటి నవలలు ఇంకా చాలా ఉండొచ్చు. వాటిని సేకరించి ప్రత్యేక పరిశోధనగా చేయవచ్చు.

*మంద్రజాలము-పురుషమేధము*

*మంద్రజాలము, పురాణపురుషుడు, క్రీడామయుడు,* పురుషమేధము ఈ నాలుగు కల్పకములను కులపతి ఎక్కిరాల కృష్ణమాచార్య రాసారు. ఈ నాలుగు నవలలో కృష్ణతత్త్వాన్ని రచయిత చెప్పదలచుకున్నారు.

*మంద్రజాలము*లో కథానాయకుడు కృష్ణుడు. మరో కథానాయకుడుగా జ్వాలా జిహ్వుడు ఆవిర్భావంకూడా ఉంది. శ్రీకృష్ణుడు, మరువు, దేవాపి, జ్వాలాకూలుడు చేసే బోధనలు సాధకుడి బుద్ధిని ప్రచోదనం చేసి యోగమార్గంలో నిలబెట్టే ప్రయత్నంచేస్తాయి. ప్రతీచి, ఋత మొదలైన వారి ప్రశ్నలు సత్సాధకుడి లక్షణాలను అద్దం పట్టేలా ఉన్నాయి.

పురాణపురుషుడు లో భారతాది గ్రంథాలలోని పాత్రల మధ్య ఉన్న చుట్టరికాలు, వారి వంశాలు, కుటుంబాలకు సంబంధించిన విషయాలు భారత, భాగవత, హరివంశ, దేవీ భాగవతాల్లో ఉన్నాయి. దానికి సంబంధించిన వివరణలు కొంత ఈ నవలలో ఉంది. కృష్ణ జననం నుంచి నిర్యాణంవరకు గల అనేక అంశాలు ఇందులో సందర్భానుగుణంగా ఉన్నాయి.

*క్రీడామయుడు* లో సనాతన సిద్ధజీవులైన గోకులవాసులకు నాదమయ లోకంలోని అమృత స్థితిని ప్రసాదించడానికి శ్రీకృష్ణుడు వేణుగానంచేసినట్లు భాగవతంలో వర్ణనఉంది. ఈ దర్శనాన్నే గోపబాలురు ఓంకారంగా సాధన చేసినట్లు ఈ నవలలో ఎక్కిరాలవారు విశదం చేసారు.

పురుషమేధము లో "అభ్యాసమూర్తి' అనే పేరుతో ఒక అపూర్వమైనపాత్రను సృష్టించారు. ఇది భావనతోకూడిన కల్పనగా కనిపిస్తోంది. మానవుడు మృత్యువునుండి రక్షణ, కాలాతీతుడుగా ఎలాఉండాలో యోగసాధన ద్వారా చెప్పడం ఇందులో ఉంది. మహాభారతంలోని మౌసల పర్వం, భాగవతం, హరివంశం, పురాణాల్లోని అంశాలు ఇందులో కనిపిస్తాయి. ఇది ఆధ్యాత్మిక నవలగా పరిగణనలోకి వస్తుంది.

పై నవలకు మూలం భారతం, భాగవతం, హరివంశంలోని కొంత సమాచారం, పురాణాలలోని విషయాలు తీసుకున్నారు. ఈ నవలలు ఆధ్యాత్మిక దృక్పథంతో రాసినవి. కృష్ణ అవతార విషయాలతో పాటు చాలా అంశాలను వివరించారు. కాబట్టి దీన్ని పౌరాణిక నవలగా చెప్పొచ్చు. కాబట్టి ఈ నవలలను భారతాది కథాభాస నవలలుగా పరిగణించవచ్చు.

## ఆధార గ్రంథాలు


1. ఆనందారామం, సి. 1982. *ఇంద్ర సింహాసనం*. విజయవాడ.
2. ఆనందారామం, సి. 1986. *ఇదా భారతం*. సికింద్రాబాదు.
3. ఇందిరాదేవి, కె.యస్. 1981. *ఆంధ్రమహాభారతంలో ద్రౌపది పాత్ర-సమగ్రపరిశీలన* (ఉస్మానియావిశ్వవిద్యాలయం)
4. కళ్యాణి. మాధవి. 1979 (కన్నడమూలం. -అనుపమా నిరంజన)
5. కృష్ణస్వామి, మోపిదేవి. 1984. *భారతం- ధర్మాద్వైతం, వ్యాసుని దర్శనం- తిక్కన సందర్శనం.* అమలా పురం.
6. గోపాల కృష్ణమూర్తి, నందుల. *ఆంధ్రమహాభారతము - ఔపదేశిక ప్రతిపత్తి.*
7. జయరామి రెడ్డి, డి. 1993. *ఆంధ్రమహాభారములో వరాలు, శాపాలు-ఒక పరిశీలన.*
8. జయశ్రీ మోహనరాజ్. 2008. *యాజ్ఞసేని* (ఒరియా మూలం : ప్రతిభా రాయ్)
9. ప్రభాకర రెడ్డి, కోడూరు. 1996. *ద్రౌపది.*
10. భక్తవత్సల రెడ్డి, యన్(సంపాదకులు). 2005. *ద్రౌపది తిరునాళ్ళు*(ధర్మరాజ తిరుణాలు). వరంగల్లు.
11. భారతి, ముక్తేవి. 1986. *చతురస్రం.*
12. బాలచంద్ర ఆప్టే. 1979. *యుగాంతం* (మూలం: మరాఠీ, -ఇరావతి కర్వే).
13. రఘునాథ శర్మ, శలాక. 1979. *భారత ధ్వని దర్శనము.*
14. రఘునాథ శర్మ, శలాక. *శ్రీమన్మహా భారతం- శాంతిపర్వం*(1, 2 భాగాలు వ్యాఖ్యానం).
15. రఘునాథ శర్మ, శలాక. *విరాటపర్వం* (వ్యాఖ్యనం).
16. రవిశర్మ, చివుకుల. 1983. *రాజసూయము.*
17. రామలక్ష్మి, కె. 2005. *ద్రౌపది.*
18. రామకృష్ణయ్య, కోరాడ. 1929. *ఆంధ్ర భారత కవితా విమర్శనము.*
19. రామనాథ శాస్త్రి, ధారా. *ఆంధ్రవాఙ్మయము- కృష్ణకథ.*
20. లక్ష్మణ శాస్త్రి, కప్పగంతుల. 1986. *ఆది, సభా,అరణ్యపర్వాలు* (వ్యాస భారతవ్యాఖ్యానం)
21. లక్ష్మీ నరసింహం, చిలకమర్తి. 1970. *ప్రచ్ఛన్న పాండవము*(పునర్ముద్రణ)
22. లక్ష్మీ నరసింహం, చిలకమర్తి. 1994. *సౌందర్య తిలక.*
23. లక్ష్మీప్రసాద్, యార్లగడ్డ. 2000. *యయాతి* (మరాఠీ మూలం : విష్ణూ సఖారాం ఖాండేకర్)
24. లక్ష్మీప్రసాద్, యార్లగడ్డ. 2006. *ద్రౌపది.*
25. లక్ష్మీనారాయణ, గంగిశెట్టి. 2002. పర్వ ( కన్నడ మూలం : యస్. యల్. భైరప్ప)
26. లక్ష్మీరంజనం, ఖండవల్లి. నన్నయ ప్రసన్న కథ-లోతులు.
27. విద్యేశ్వరి, డి: 1988. *ఆంధ్ర మహాభారతం -ధర్మతత్త్వం.*
29. వీరేశ్వర శాస్త్రి, జన్నాభట్ల.(సంపాదకులు.) మహాభారత వైజయంతి (9 సంపుటాలు).గుంటూరు.
30. వెంకట రమణప్ప, జక్క.1979. మహాభారతము- మహిళ.

31. వెంకట రామకోటి శాస్త్రి, కేతవరపు. 1973. *తిక్కన కావ్య శిల్పము.*
32. వెంకట రామకోటి శాస్త్రి, కేతవరపు. 1976. *మహాభారతం- తత్త్వదర్శనము.*
33. వెంకట సుబ్బయ్య, అప్పజోడు. 1977. *మహాభారతము-మానవస్వభావము.* కర్నూలు.
34. వేంకట సుబ్రహ్మణ్యశాస్త్రి, పెండ్యాల. 1939. *మహాభారత చరిత్రము.*
35. వెంకట శ్రీనివాసాచార్యులు, తిరుమల. 1986.
 *శ్రీ మహాభారత వైజ్ఞానిక సమీక్ష* (ఆదిపర్వం)
36. సత్యనారాయణాచార్య,ఉత్పల. 2004. *రాజమాత.*
37. సత్యనారాయణ, విశ్వనాథ. 1962. *నన్నయగారి ప్రసన్న కథా కలితార్థ యుక్తి.*
38. సూర్యనారాయణ శాస్త్రి, శిష్ట్లా. 1938. *శ్రీమహాభారత రహస్యము.*
39. స్వరూపరాణి, కొలకలూరి. 1985. నన్నయ మహిళ.
40. శివారెడ్డి, ఎల్లూరి:1981. *ఆంధ్రమహాభారతంలో* రసపోషణము (విరాటోద్యోగ పర్వములు) (ఉస్మానియా విశ్వవిద్యాలయం.)
41. శ్రీమన్మహాభారతము- వేదవ్యాస ప్రణీతము.1929. వావిళ్ళరామస్వామిశాస్త్రులు,సన్స్.
42. హనుమచ్ఛాస్త్రి, ఇంద్రగంటి. 1979. సారమతి నన్నయ.

## తెలుగు వ్యాసాలు

1. బాలగంగాధర రావు, యార్లగడ్డ. 2001. *యయాతి చరిత్రము,* (అక్షరగుచ్ఛము)మంగళ గిరి.
2. ప్రేమలత, రావి. 1979. *జానపదుల ద్రౌపది.* వివేచన (పరిశోధన పత్రిక)
3. ప్రేమలత, రావి. 1987. *జానపద మహాభారత కథలు కార్యకారణ సంబంధాలు,* సాధన పత్రిక.
4. రామబ్రహ్మం, బేతవోలు. 2010. *నవలగా ద్రౌపది ఒక సమీక్ష* .

## ఆంగ్ల వ్యాసాలు

1. Benarji, S.C:1931. *The Inadian Society in tha Mahabharata*
2. Bharatiya Vdya Bhavan: 1988. *The History and Culture of India*, ( vol.1&2) (5th edition)
3. Dowson, John: 1961. *A Classical Dictionary of Hindu Mythology Religion, Geography, History and Literature.* Landon.
4. Hopkins, E.W: 1969. *The Great Epic of India*, Culcutta.
5. Romila Thapar: 1978. *Ethics, Religion, and Social Protest inathe First Millennium B.C. in Northern India,*(eassy) Ancient Indian Social History some Interpretations, New Delhi.
6. Robert Scholes: 1977. *Forms and Themes* (eassy), science Fiction, Oxford university Press.
7. Srinivasa sarma, v:1981.*Bhrmanical Myth and Legend Poetry in the Mahabharata:A History of Indian Literature*, Delhi.
8. Vidya Nivas Misra:1992. *Mahabharata:The Epic of Epics* (eassy),Agra. (U.P)